ఆంధ్రపత్రిక

విరోధికృత్ సంవత్సరాది సంచిక

[అరువది ఒకటవ సంచిక]

[1971 - 72]

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

వెల రూ. 3

ఆంధ్రపత్రికా కార్యాలయమున ముద్రితము.

Supplement to Andhra Patrika Issue Dated 27-3-1971 Regd No. M 1118

సంచిక 61

విరోధికృత్ సంవత్సరాది సంచిక

సంవత్సరము 1971—72

విషయానుక్రమణిక

***

వర్ణ చిత్రాలు:

ఓమ్

ప్రస్తావన

ఒక సంవత్సరం ఇంకో సంవత్సరాన్ని అనుక్రమిస్తూ వుంటుంది. గత సంవత్సరం వర్తమాన సంవత్సరాన్ని అనుక్రమిస్తే, రాబోయే సంవత్సరం వర్తమాన సంవత్సరంలో బీజావాపం పొంది వుంటుంది. సౌమ్యసంవత్సరం గడచినంతకాలమూ సౌమ్యంగా లేదు. దేశంలో అనేక అవాంతరాలు సంభవించాయి. ప్రకృతి విపరీతమై భాసించింది. ఆ వైపరీత్యం విచిత్రమై జనజీవితంలో, జనజీవిత సంబంధి రాజకీయ ప్రపంచంలో, జనమేధా సంబంధి ఆలోచనా ప్రపంచంలో తన బలిమిని చూపించింది. కాంగ్రెస్ చీలింది. అన్ని రాజకీయ పక్షాలూ చీలాయి. ఈ చీలికయొక్క ప్రభావం, ఈ ప్రకృతి వైపరీత్యప్రభావం సాధారణలో చొచ్చుకొని, అసాధారణమైన సంవత్సరంగా పరిణమించేట్టుచేశాయి.

ఆ పరిణామం ఫలితాలను మనం చూస్తూనే వున్నాము; చూచేవున్నాము. ఆ పరిణామాలు ఎంత వికారంగా భావప్రపంచంలో అవభాసించాయి అంటే జనజీవితంలో నీతులు పడలి, ఆలోచనలు విడిలి, ఆశయాలు, ఆకాంక్షలు బడలి ఒక విచిత్రమయిన, నిస్సారమయిన నీరస పరిస్థితి ఏర్పడిపోయింది. ప్రజాస్వామ్య ధర్మవిరుద్ధాలయిన భావాలు ముక్కటమయాయి. ప్రజల అభ్యున్నతికి ఇవే సోపానాలు అన్నంత ధోరణి ప్రబలిపోయింది.

ఈ భావముద్రతో సాధారణ సంవత్సరం గడచిపోయింది. ఈ విపరీత స్థితిని జనజీవితాన్ని దిద్దవలసిన, చక్కనొత్తడానికి సమర్థులయిన మేధావులు పెద్దగా పట్టించుకోలేదు. వారు కూడా రాజకీయవేత్తలకు వందులో, మాగధులో అయిపోయారు. స్వోపజ్ఞము, ప్రతిభాసమున్మిషితము అయిన భావప్రపంచాన్ని సృష్టించలేకపోయారు.

ఈ స్థితికి మేధావివర్గంలో ప్రబలిన ఔదాసీన్యం కారణం అనిపిస్తుంది. ఈ మేధావి వర్గం భయపడిపోయిందా? ఉపజ్ఞ లేక ఉద్భ్రాంతి చెందిందా? అర్థం కాదు. కళ్ల ఎదుట కనబడుతున్న పరిస్థితులను విశ్లేషించి, కార్యక్రమసూత్రకల్పనా సామర్థ్యం వారియందు పొడములేదో, పొడమినా ఔదాసీన్య ప్రాగల్భ్య కారణమైందో తెలియదు.

ఈ పరిస్థితిలో దేశంలో ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికలు భావ ప్రభంజనమై ప్రచారం పొందవలసిన స్థానం. జనాన్ని మేల్కొలిపినవారు లేరు. పరిస్థితులను ప్రజలకు వివరించి చెప్పబడిన ధోరణులు వస్తునిష్ఠములు గాక, ఆత్మనిష్ఠములై ఏకైక నాయకత్వ భావభజనములై ప్రవర్తిల్లాయి. ఫలితం కనిపిస్తూంది.

ఇది సాధారణ—విరోధికృత్ సంధికాలంలో పరిస్థితి. ఈ సంధిలో అభ్యుదయమూ, ప్రగతి, మార్పు—ఈ మాటలు ఎక్కువగా వినవస్తున్నాయి మాత్రం. ప్రగతి, అభ్యుదయం అంతా కోరుతూనేవున్నారు. కాని, ఆ అభ్యుదయం ఫలానా పద్ధతిలోనే వస్తుంది అనటం ఎంతవరకు ప్రజాస్వామ్య ధర్మవిహితమూ అన్నది ఆలోచించుకోవలసిన స్థితివున్నది. ప్రజాస్వామ్యమంటే బహుభావాల పరస్పర సంఘర్షణం. ఏ భావమూ ఏ భావాన్ని గాని దండించరాదు. దానికి స్వాతంత్ర్య కల్పన చేయడం - ప్రజాస్వామ్యధర్మ ప్రపంచంలో ప్రాణభూతమయిన విషయం. రాజ్యాలు లాగానే, సిద్ధాంతాలూ నిలవవు. ఒకప్పుడు అభ్యుదయకర సిద్ధాంతం అనుకొన్నది అనతికాలంలోనే అభివృద్ధికి ప్రతిబంధకమై, భావస్వేచ్ఛకు నిర్బంధకమై వ్యక్తి యొక్క ఆలోచనా స్వాతంత్ర్యానికి అవరోధకం అవుతూవుంటుంది. అందుచేతనే భారతీయులయిన కొందరు తాత్త్వికులు 'ప్రవాహినీ విద్యా' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఏకైక సిద్ధాంతజడులు, జడబుద్ధులు అభినివిష్టతాత్త్వికులై, ఈ ప్రవాహినీ పద్ధతిని గ్రహించనివారై అభ్యుదయానికి, అభివృద్ధికి, ప్రగతికీ వారధులు నిర్మిస్తున్నారు మనుష్యులను విభాగిస్తున్నారు; మనస్సులను క్షోభ పెడుతున్నారు. ఇది దేశంలో ఏర్పడిన శీలసంక్షోభంయొక్క లక్షణమా? ఒకటి చెబుతూ ఒకటిచేసే అధ్యారోప అపవాద లక్షణమా? వాగ్విడంబనమూ, కార్యాచరణమూ ఏకవాక్యత లేక పృథక్కరణం చెందినప్పుడు, వ్యక్తికీ, వ్యక్తి వ్యక్తిత్వానికీ ప్రత్యాఖ్యానం సంభవించినప్పుడు, శీలసంక్షోభం, ఆలో

చనా వైక్లబ్యం సంభవించి రజ్జుసర్పభ్రాంతివలె సత్యం అసత్యంవలె, అసత్యం సత్యంవలె అవభాసించే స్థితి ఏర్పడుతుంది. ఆత్మశ్రేయమే జనశ్రేయమై, స్వార్థమే పరార్థమై, వ్యవహారమే పరమార్థమై ఆలోచనలు, రాజకీయాలు, సిద్ధాంతాలు అన్నీ శీర్షాసనం వేస్తాయి.

రాజకీయవేత్తలు ఎట్లో, తక్కినవేత్తలుగూడా అట్లుగానే వున్నారు. ఏకత్వమంటూ విభజనలకు ప్రోది చేసేవారు కనిపిస్తున్నారు. మతం వద్దంటూ ప్రత్యేక ప్రత్యేక మతాలను వుపయోగించుకొని, సెక్యులరిజమును స్థాపిస్తామనే వారు కనిపిస్తున్నారు. మనుష్యుల్నే కుడి అని, ఎడమ అని విభాగిస్తూన్నారు. వీరి పరిస్థితి చూడగా, గొగోల్ కథలలోని ఒక మనిషి జ్ఞాపకం వస్తుంది. దానికి కుడి ఎడమలు తెలియవు. కుడి దిక్కు ఏదనగా, దానికి తెలియక చేతితో ఎడమదిక్కును చూపిస్తుంది. మన రాజకీయవేత్త స్థితి ఏవంవిధంగా వుంది.

దేశంయొక్క ఈ స్థితికి మేధావివర్గం కారణమనాలి. రాజకీయవేత్తలు అధికారభావదూషితులు కావడంచేత, వారిలో ఏ మాత్రం మేధ వున్నప్పటికీ, అది అధికారవాంఛామేఘాలచే ఆక్రాంతమై మేధను బయటికి రానీయదు; వస్తుస్థితిని గోచరించనీయదు. నినాదవర్షాలను కురిపిస్తుంది. ఉద్రేకపు పిడుగులను రాలుస్తుంది. వాగ్దానపు మెరుపులను మెరిపిస్తుంది. వస్తుస్థితి నిష్ఠుడయిన మేధావి భూతకాల, వర్తమానకాల, భవిష్యత్కాల సమన్వయ ధీప్రచోదితుడై జనస్థితిలో సమరస స్థితిసాధనకు కృషిచేస్తాడు. అట్టి మేధావులు ఋషులు; ఋషితుల్యులు. వారు జనశ్రేయస్కారులు, సంఘశ్రేయస్కారులు. ఆపదలలో కూడా అధర్మాన్ని ఎదిరిస్తారు; ధర్మాన్ని చెబుతారు. కవులు, శాస్త్రవేత్తలు, వైజ్ఞానికులు, ఇంకను ఇటువంటి వారు తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారా? అనిపిస్తుంది. కవులు వున్నారంటే, వారిని అనెక్‌నాలెడ్జ్‌డ్ లెజిస్లేటర్లు అని షెల్లీ అన్నాడు. మరి మన కవులు ఇది దృష్టిలో పెట్టుకుని తమ్ము తాము ఏమో చూచుకుంటే, వారి స్థితి వారికి తెలుస్తుంది. ఎక్కాల పుస్తకాలకు. కవిత్వపు పుస్తకాలకు ఇప్పుడు తేడా ఏమీ కనిపించడం లేదు. పిండికొట్టబడిన సిద్ధాంతపు ప్రవచనమే కాని, విశ్లేషణము, వింగడింపు, సృష్టియొక్క లోతులను చూడడము, పైకి కనిపించే దృశ్యజాతాన్ని పరిహరించి, ఆ దృశ్యజాతంచేత ఆచ్ఛాదింపబడివున్న ధర్మసంగతి విజిజ్ఞాస చేసే లక్షణం వీరిలో పోయింది. అందుచేతనే వీరు సిద్ధాంతపు భట్టులు, రాజకీయపు భట్టులుగా పరిణమిస్తున్నారు. ఎన్నికలకు వందరత్నాలు. పదాలు, పాటలు వ్రాస్తున్నారు. ఇంతకంటే, దిగజారిపోయిన స్థితి వుంటుందా? ఆలోచనాధార కొడిగట్టడముచేత, విజిజ్ఞాస అన్నది నశించడముచేత, శాస్త్రీయమయిన దృక్పథం అలవడకపోవడంచేత, అభినివిష్టబుద్ధిచేత, ఆత్మకు వికాసం కల్గకపోవడంచేత ఈ స్థితి ఏర్పడిందా అనిపిస్తుంది. 'క్రియేటివ్ మైండ్' అనే ఒక వ్యాసంలో జె. బ్రొనోవ్‌స్కీ అనే శాస్త్రవేత్త ఇట్లా వ్రాశాడు:

"The scientist looks for order in the appearances of nature by exploring such likenesses. For order does not display itself of itself; if it can be said to be there at all, it is not there for the mere looking. There is no way of pointing a finger or a camera at it; order must be discovered and, in a deep sense, it must be created. What we see as we see it, is mere disorder."

ఈ మాట ఒక్క శాస్త్రవేత్తలేకాక ఆలోచన అన్నది చేయగల ప్రతిప్రాణిమాత్రునికి కావలసిన సంగతి. ఇట్టి దృష్టిని అలవరచుకొన్నప్పుడు జాతికి నిజమయిన అభ్యుదయం, ఆలోచనలో నిజమయిన ప్రగతి, సాహిత్యంలో నిజమయిన ఉపదేశం, రాజకీయాలలో నిజమయిన సేవాధర్మం ప్రబలి, సర్వజనక్షేమంకరమయిన కల్యాణమార్గం గోచరిస్తుంది.

ప్రతిసంవత్సరం లాగానే ఈ సంవత్సరంకూడా కోరగానే రచయితలు తమ అమూల్యరచనలు పంపి మాకు తోడ్పడినందుకు సంతోషిస్తున్నాము. అయితే సమాజంలో ఉన్న బహువిధవైవిధ్యం రచనలరూపంలో రాకపోతున్నందుకు విచారిస్తున్నాము. రచన అనగానే సాహిత్య విషయం తప్ప ఇంకేమీ లేదన్న స్థితి ఒకటి గోచరిస్తున్నది. మనం పెరగలేదనడానికి ఇది ఒక్కటే ఉదాహరణ. వచ్చిన కొన్ని రచనలు చిన్న గ్రంథాలంత వున్నందున, అవ్యవధిగా వచ్చినందున ప్రకటించలేక పోయాము.

సర్వే జనా స్సుఖినో భవన్తు

శ్రీ శనగన నరసింహ స్వామి

గీ॥ త్రామరనుతతుల దా
రిత్ర విశేషా! విరోధికృన్నామ! లసత్
చైత్రావతార చిత్రిత
ధాత్రికిఁ జనుదెమ్ము! స్వాగతము! నూత్నసమా!

వరతుహిమన్ జరాభరము వాసి వయోరుచి గాంచినట్లు—దు
ర్భరరుజ పీడలన్ గడచి ప్రాగ్జవసత్త్వము లందినట్లు—దు
స్తర విపదబ్ధిదాటి సుఖసాగరతీరము చేరినట్లు—బం
ధురతుహినావగుంఠన విదూరములై సుఖియించె లోకముల్.

బాలగోపాలు వంశీరవంబు సోకి
క్రేవెలందుల డెందము విరిసినట్లు—
కోకిల కుహూస్వనంబుల గుండె కరగి
భువనవనమెల్ల హర్షప్రఫుల్లమయ్యె.

వీథివీథికి సాగి విపిన వాటికయందు
పరిచితస్థలముల బాగెఱింగి—
చెట్టుచెట్టున కేగి చిల్కపిండుల క్షేమ
వార్తావిశేషము లైన నడిగి—
పొదపొదకును దాటి కోదమ తేటుల దాటు
సంగీత సాధనోత్సవమును గని—
మావిమావికిఁ దారి మవ్వంపుఁ జివురుమొ
త్తంబుల రుచుల భేదములు దెలిసి—

పూర్వవత్సరవాల్లభ్యమునకు భరత
వాక్యమును బాడి — నేడు భవత్ప్రవేశ
గాన మొనరించునదె కలకంఠ మామ్ర
శాఖపై నిల్చి సందమన్స్వరవిభూతి.

నీ దరస్మిత చంద్రికానిచయ మగునో
జగతి నొకసారి సుమసహస్రములు విరిసె-
నీ సుగంధిల మృదులనిశ్శ్వాసమగునో
మెల్ల మెల్లగ మలయసమీర మొలసె.

అకులురాల నానగాని యానతమైన లతామహీరుహా
నీకము మేన క్రొంజివురు నిగ్గులచీరలు గప్పినట్టి పు
ణ్యాకృతి మాధవుండు నిజహస్తములన్ నవరించుచున్న పు
ష్పైక మనోజ్ఞసౌరభ శుభాధ్వమునన్ దయసేయు నుర్వికిన్!

పూవులరోజులందు-వలపుల్ విరజిమ్మెడి పూలతేరుపై-
పూవుల వింటివాడు విరిపూవుల తూపులతోడ వెంటరా-
పూవుల బాట వెంట-పువుబోడులు పూవుల పూజసేయగా!
పూవులవోని డెందమున బొంగుచు రమ్మ! వినూత్నవత్సరా!

గడచిన వత్సరత్రితయకాలము దుర్విధి కాళ్ళక్రింద బ
ట్టడగి మడంగి యిప్పటికి నొదలలేవక మూల్గుచున్న యీ
పుడమివడంతికిన్ భవదపూర్వకటాక్ష విలోకనప్రభల్
బడసినగాని కల్గవిక బంధవిముక్తియు భోగయుక్తియున్-

ధారుణికంపమో-జలధితాండవమో-జననష్టమో-అనా
ధారణదారుణాపదలు దాడి యొనర్చెను-పైరులెల్ల నా
ధారణరీతిఁబండె-మతిధారణ యాకసమంటమండె నా
ధారణవర్షమం దభయదాతవు త్రాతవు నీవ సుమ్మికన్.

తనవారలెల్ల నాశనముగా మిగిలిన
జీవి యావేదన జెప్పదరమె-
సమసిన లక్షల జనులె ధన్యులు బ్రతి
కినవారె నిర్భాగ్యు లనగనయ్యె-
పశుపక్షి మృగజాతి బలమెంత మిత్తికిఁ
జిక్కెనో యింతకు లెక్కలేదు-
ఝంఝా ప్రభంజన చంక్రమణం బేమి
ఘోరివారాన్నిధి పొంగు టేమి?

లుట్టి విలయము ఘటియించి యొట్టు మొగము
చూపబోయెనో ప్రభవాది సోదరులకు
అక్కటక్కట! సాధారణాసురుండు
కులము చెఱుపంగ జాలడె క్రూరుడొకడు

ఊరక నీకుఁ బెద్ద లిటు లుద్ధతనామ మొసంగిరంచు నే
మూరడవచ్చునే-మధుమహోత్సవ మంజులవేళనెందు నీ
పేరును విన్న మాత్రమున భీతి జనించెను-సఖ్యసౌఖ్యసం
భారము నీదు చిత్తమిక మాదగు భాగ్యము నూత్న హాయనా!

బలితంపు వానలఁ దలదాచుకొనుటకు
నిరుపేదవానికి నెలవొసంగి-
మారాకుఁ దొడుగు శ్యామలసస్యవనులకు
సర్వాంగములను మాంసలత గూర్చి-
కనుకకరేల మంచున నూర్చు కర్షక
వ్రజ కిబ్బడిగ రాలుబడి ఘటించి-
పులివోలె పైబడు చలివాగగా పసి
సకునకు మూరెడు బట్టనిచ్చి-
చేదుకంటెఁ దీపి చిక్కగా నమకూర్చి-
మండుటెండ నీడయండ నొసగి-
ఆఱు ఋతువులందు ననుకూలభంగిమై
ఏలుకోగదయ్య ఈ ధరిత్రి!

కూడును గుడ్డయున్ దగిన కొంపయుఁ గొందఱ కబ్బినంతనే
వేడుక కాదు-సర్వపృథివీజనమున్ సుఖియించు టొక్కటే
పాడియటంచు మానివరపాళి యుగాదిని ముక్తకంఠతన్
పాడిన ప్రేమగీతము భవత్ప్రభుతన్ ఫలియించుగావుతన్

ఒకనాడు కష్టింపకుండిన పస్తుండ
వలసిన దుర్దశ తొలగవలదె
యౌషధంబును గొన నర్థంబు లేక వి
క్కటి దచ్చులేవడి యరుగవలదె

కులము కారణముగాఁ గొలువారి మేధావి
యణగారిపోవుట న్యాయమగునె
పురుషుని కౌటిల్యమునకు నిత్యము బలి
యౌచు సాధ్వీమణు లడలఁదగునె
సహజవల్లభు లెవ్వరు సహజభృత్యు
లెవరు? నీ పాలనంబునం దీ వికృతులు
మాయమై - సేతుశీతాద్రి మధ్యధరణి
రాజ్యమెల్లను శ్రీరామరాజ్యమౌత!

ప్రణయగాథల కన్నెపట్టం సాహితి
ప్రజలవృత్తంబును బాడుగాక!
స్వార్థంబు పరమలక్ష్యంబైన రాజకీ
యములు జగద్ధితం బరయుగాక!
ఆత్మరక్షణమున కనువైన పౌరుష
రేఖ యెల్లరను వరించుగాక!
అభ్యుదయావాప్తి కాటంకమైన వి
ద్యావిహీనత్వము తొలగుగాక!
విశ్వవసుధా కుటుంబకా విమలబుద్ధి
అఖిలదేశంబులకు నీతి యౌనుగాక!
యెన్ని భోగభాగ్యంబు లాసన్నమైన
సత్యమే భూషణంబౌత జనులకెల్ల!!!

వత్సరాది - వాల్లభ్యం

"గౌతమి"

చిగురు క్రొమ్మావి కెమ్మావి చిగురుతేన
లాను కలకంఠ కలకంఠ మాలపించు
మధుర మధుమాస గీతికా మధుర రవమె
స్వాగత సుగీతి నీకు వత్సర విభుండ!

చేర్చి తియ్యగా వుల్లగా చేదురసము
ఉలుకొనర్చి క్రుంగిన తెలుగుబిడ్డ

తుడిచికొంచు చెక్కిళ్ళ సంతోష మెసగ
స్వాగతం బిచ్చు నవయుగస్వామి! నీకు

చైత్ర రథ పథమందు నీ చైత్రయాత్ర
సాగనిమ్మాయి! వాసంతిస్వామి నేడు
నవ హరిత చేల మల్లాడ యువతి ప్రకృతి
రాగ మధువ నీ కిచ్చు నీరాజనమ్ము.

త్యాగయ్య రాగాల వోగాడి వే పుల
కించు తెలుంగు సంగీత లహరి
కృష్ణరాయ కృపా ప్రకీర్ణ దృక్కుల చివు
రించు తెలుంగు సాహిత్య లహరి
బొబ్బిలి జబ్బులి బొబ్బలో దెసలందు
సాగు తెలుంగుల శౌర్య లహరి
ఎల్లోరలో బొండుమల్లెల జల్లులై
చెన్నొసంగు తెలుంగు శిల్ప లహరి
మరల నొక మారుగా పొంగి పొరలి పొంలి
నింగి ముట్టుత మనదు తెలుంగు కీర్తి
నవ్య మధుమాస యామినీ నాట్య మహము
తెలుగు గుండెల వెన్నెల వెలుగు లిడుత!

నవ ఉగాది

శ్రీ గంధం జోయెల్

మళ్ళీ ఒక నవ ఉగాది
నన్ను వెదుకుతూ వచ్చింది!
నవ్వుతూ; ఏడుస్తూ
పసిపిల్లవాడిలా పడుతూ,
లేస్తూ బ్రతుకు నడక
సాగించే నన్ను ఒక్కమారు
ప్రేమతో పలకరించాలని,
నా మనసులో మమతలు

మల్లెపూలై పూయాలని
సుఖం, శాంతి నాకు
బాసటగా నిలవాలని,
కోరుకున్న ఉగాది వచ్చింది.

ప్రతి వసంతం
నాకొక క్రొత్త ఉగాది!
ప్రతి ఊహ
నా ఆలోచనకు పునాది
తిరువుల శాఖలు
చిగుళ్ళు తొడగి,
శోభిల్లెడు వేళ,
విశ్వమే ఒక నందన
వనంగా కనుపించాలి!
మనసే అందమైన
బృందావనంగా తోచాలి!
కోకిలమ్మ గళమెత్తి
మధురగీతం పాడే
ఈ శుభోదయ వేళ
నిరుటి నిరాశల వీణెల తీగలు
క్రొత్త సంగీతం వినిపించాలని
నేటి ఉద్యానవనం పొదులో
రేపటి గులాబీలు పూయాలని
మళ్ళీ ఒక నూతన ఉగాది
నా కోసం తరలి వచ్చింది.

ఉగాది ఏమిటంటున్నది?

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

చిగురాత పల్లవముల మెసవి
కషాయంపు కంఠమెత్తి
పంచమ స్వరమున పాడి
కోయిల యేమంటున్నది?

గడచిన వత్సరము తోడ
చెడు తలపుల గెంటివేసి
మంచిని హృదయమున నింపి
మేలుకొనుమం డంటున్నది.

ఘుమ ఘుమ పరిమళములతో
తెల్లని సుమ రేకులతో
కనుల విందుగా విరిసిన
మల్లియ యేమంటున్నది?

పరుల సుఖానందంబుల
కొరకు సర్వ మర్పించుచు
నిర్మలమగు మనసుతోడ
నిదుర వీడు మంటున్నది.

పరిమళముల ప్రణయ లేఖ
తరుణ పవను డందజేయ
మురిసిపోయి తేనె గ్రోలి
తుమ్మెద యేమంటున్నది?

అందము నానంద మిచ్చి
అన్నము నారోగ్యమిచ్చి
సాకుచుండు భగవంతుని
కీర్తింపుం డంటున్నది.

క్రొత్త చింతపండు తోడ
వేపపూవు చేదుతోడ
మామిడితో మన తెలుగు ఉ
గాది యేమిటంటున్నది?

ఇబ్బందుల నెన్నియైన
నైకమత్య సంపదచే
ఎదురుకొని పురోభివృద్ధి
సాధింపుం డంటున్నది.

ఆకాంక్ష

శ్రీ మధిర భానుమూర్తి

అణుశక్తితో మారణాయుధమ్ములఁ జేసి
మానవాళిని చంపఁ బూను మేధ

అణుశక్తినే మానవాళి శ్రేయస్సుకై
అద్భుతమ్ముగ వాడునట్టి మేధ
చంద్రుని దరిఁజేరి సర్వ రహస్యముల్
కనుగొన్న యట్టి యా ఘనుల మేధ
సృష్టికే ప్రతి సృష్టి చేయఁగ గల్గడు రీతి
విజ్ఞాన శాస్త్రాలఁ బెంచు మేధ

కలిసి యెల్లర విజ్ఞాన ఖనులఁ జేసి
శాంతి కాముకతను పెంచి సర్వ మాన
వాళి అభ్యుదయముఁ గోరి పాటు పడగ
చేయు గాక 'ఉగాది' సుశ్రీల నిడుచు!

మానవులు మానవుల వలె మనుట నేర్చి
మానవులలోన దాగిన దానవులను
తరుముము 'విరోధికృతి' నీవు త్వరిత గతిని
తిరిగి రానట్టి దూరంపు తీరములకు!

సృష్టిలో తీయనిది ఒక్క స్నేహ మనెడు
సత్య మందఱ కెఱుకయే, నిత్య మిదట
స్నేహ సౌహార్ద్రములఁ బెంచి చిత్తములకు
స్వాస్థ్యమును గూర్చు మెల్లరు సంతసింప!

"ఆమని ఆమెత"

"హేమగాత్రి"

ఇది ఆమని ఆమెత
కాముని కిది అమిక

అరుణారుణ కుసుమాలను
సిగ ముడిచిన పుడమి నెలతి
కిసలయపు వల్లెవాటు
మలయవీచి కదలించగ

విరహముతో వేగిపోవు
మధుమాసపు పుష్పలతిక
సురపొన్నను చుట్టినపుడు
కోయిలమ్మ గొంతెత్తగ

సరసముతో పడతులవలె
కులుకుచున్న గుల్మాలను
చూలాలౌ మాతి మివుడు
చూసి శిరము వంచుకొనగ

సరసు వింటి పూవుకోల
ఎదను తాకి మదవతిలో
మధురోహాలు మరులు గొల్పు
తలుపు చెంత నిలుచుండగ

ఇది కాముని ఆమెత
ఆమని కిది ఆమెత

ఉగాది శుభాకాంక్ష

శ్రీ జోస్యము జనార్దనశాస్త్రి

పేరున మంచిచెడ్డ లగుపించుట నిక్కమయేని, సౌమ్యసా
ధారణ లేమివార్త కెటు దాలిచె? గాన మె మున్న నిన్న. యీ
ష్కారణ మాత్మలందు మెలగన్ కలకం దిగద్రావుచున్ జయో
చ్చారణతో విరోధికృతు! స్వాగతమున్ పచియింతు మెంతయున్.

ఏకకంఠత 'కిహ' ల సూత్రించునట్టి
పాణిని మహర్షి వాక్శుద్ధివలన నైన
భుంతి పందద శాతుకీ క్రమ సహాను
గ ప్రభావాను భావ సంకలన నైన.

లోక కల్యాణకర సమాలోచనంపు
పదయ హృదయాన నూత్నవత్సర మహీశ!
హిత! విరోధికృత్తు! విరోధి హృత్తు వగుము.
అవని సందర జోతల నందుకొనుము.

రవి యుండన్ గ్రహరాజు: వ్యక్తిగత వైరం బార నీ తండ్రికే
యువమానంబుగ నిక్కి యొక్కడుగు ముందై కుంటుచున్ గెంటుచున్
భువికిన్ రాజనిపించుకొన్న సరియా? ముమ్మందు సాంద్యంబు కం
డువ నేలన్ శనివాదువో? యశని వాదో సందియం బయ్యెడిన్.

రసవత్కవి కబ్బె! నీ
రసనాథత లగ్గె! ప్రెగ్గడకుఁ బేరుసవుం
బస తగ్గె; సైన్యమేఘా
ర్ఘ నుపాలనమున్ కుజుండు కడు మొనగాఁడే!

ప్రకృతిరంజక ధర్మ సంరక్షణముల
శాంతిభద్రతలకు సర్వ సౌఖ్యములకు
మూలసూత్రము లను వాక్యముల స్మరించి
మాత్మనాయకులార! గనుండు యశము.



మత్స్య విపణి :   శ్రీ ఎం. కృష్ణన్—మద్రాసు.


M.KRISHNAN
70

భోజుడు - రాజరాజ నరేంద్రుడు

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి

కవితకు కాళిదాసు, కవిత్వపోషణకు భోజరాజు, సంస్కృత వాఙ్మయమందేకాదు ప్రపంచ వాఙ్మయమందే ఉపమానస్థానమును పొందియున్నారు. కవిత చెప్పి అలరించినవాడు కాళిదాసు; చూపు మాత్రముననే కవితాశక్తి కలిగించినవాడు భోజరాజు. కాళిదాసను పేరును ఎట్లు బిరుదుగా తర్వాతి కవులు తాల్చిరో భోజుడను పేరుకూడ బిరుదైపోయినది. ఇతనిని గురించి ఎంతకు వచ్చిన దనగా దేశమందు లెక్కలేని కథలు అల్లుకొనిపోయి అసలు చరిత్ర మఱుగుపడినది. ప్రాచీనుడైన కాళిదాసే ఇతని ఆస్థానకవియని కథలును, చాటువులును, సమస్యాపూరణములును తండోపతండములు బయలుదేరినవి. విక్రమార్కుని తర్వాత అంతటివాడనియు, అతని సింహాసనము ఇతనికే దొరకుట, అందలి ముప్పదిరెండు సాల భంజికలు అతని దాతృత్వసాహసములను చెప్పగా తనకు అంతటి శక్తిలేదని ఇతడా సింహాసన మెక్కలేదని గొప్పగ్రంథమే తయారైనది. దానపరాక్రమములకు విక్రమార్కుడు, విద్యలకు భోజుడు అని నానుడి యేర్పడినది. అసలు సింహాసనద్వాత్రింశత్సాలభంజిక కథలుకాక భోజప్రబంధమునునది, పై కాళిదాసాదుల కథలు గలది, కాళిదాసుమొదలు మల్లినాథసూరివఱకు అందఱును భోజుని యాస్థానకవులేయను చమత్కార విద్యార్థి సాహ్యగ్రంథము, భోజునికి ముంజరాజు పినతండ్రియనియు, అన్న సింధురాజు చిన్నబాలుని భోజుని తన యొడిలోఉంచి చనిపోగా తాను చంపబయత్నించి, తర్వాత విరక్తుడై రాజ్యమాతని కిచ్చి వానప్రస్థ మంగీకరించెనను కథ గలది ప్రసిద్ధముగానున్నది. ఈ భోజప్రబంధము బల్లాలకవి విరచితము. మేరుతుంగాచార్యుడు (14 వ శతాబ్ది) తన ప్రబంధకోశమందు భోజప్రబంధమును కొంతభిన్నముగా వ్రాసియున్నాడు. వీరుగాక రాజవల్లభవత్సరాజ శుభశీల రాజశేఖర పద్మగుప్తాదులు వ్రాసియున్నారు. ఎవడో భోజప్రబంధసారమును, వేదాంతవాగీశభట్టాచార్యులు ఏకాంకికగా భోజరాజాంకమనియు, సుందరవీరరాఘవ పండితుడు నాటికగాను ముంజుని ద్రోహబుద్ధి కథను వ్రాసియున్నారు. రేవణారాధ్యుడను శైవాచార్యుడు కవిసమయవిలాసమను గ్రంథమున భోజుని ఆస్థానకవుం వినోదవృత్తములను వ్రాసియున్నాడు. భోజరాజతరంగిణియును గ్రంథము భోజుని గురించి ఆచార్య కవీంద్రుడు సంపాదించిన విషయములు. పరిమళ కాళిదాస బిరుదాంకితుడు పద్మగుప్తుడు, భోజునితండ్రి సింధురాజును గురించి వ్రాసినదానిలో ముంజుని భోజుని పెదతండ్రియనెను. ఇట్లివన్నియునుండగా, తెలుగులో జక్కన విక్రమార్క చరిత్రమును, కొఱవిగోపరాజు సింహాసనద్వాత్రింశత్సాలభంజికా కథలను వ్రాయగా, ఎందులోను కానరాని కథలను సంపాదించి అనంతామాత్యుడను ఆంధ్రకవి, పదునైదవ శతాబ్దమువాడు భోజరాజీయమను కావ్యమును వ్రాసెను. ఒక్కప్రభువును గురించియే ఇన్ని వ్యత్యాసములా?

భోజుడు నివసించి పాలించి గతించినదేశము ఆర్యావర్తము, అనగా నేటి హిందూస్థానము, వింధ్యపర్వతములకు ఉత్తరభాగము. అందులోను మాళవరాజ్యము. కాని అతతనిగురించి ఆంధ్రులకే ఎక్కువగా తెలిసియున్నది, కాదా అతనినిగురించి ఆంధ్రులే ఎక్కువ అక్కఱ చూపియున్నారు, చూపుచున్నారు. నన్నయలో లేదుగాని (ఏలన సమకాలికుడు), తిక్కనను కేతన 'ఆర్యభోజుండ'ని పేర్కొన్నాడు. శ్రీ కృష్ణదేవరాయడు అపర భోజుడని ఆతని పట్టాభిషేక శాసనమే చెప్పుచున్నది. పైగా మనకవులు పూర్వకవి స్తుతిలో సంస్కృత కవులైన వ్యాసవాల్మీకి కాళిదాసాదులతో ప్రారంభించి వ్రాయుచుండిరిగాని తెనుగు కవులతో మాత్రమే ప్రారంభింపలేదు. అనగా ఆంధ్రులు తాము ఒక ప్రత్యేకమైన తెగవారుకారనియు, తమ పరంపర వ్యాసవాల్మీక్యాదులతోనే ప్రారంభమగుచున్నదనియు, దేశ భాష తెలుగుకాన రచన తెలుగైనదనియు భావించినట్లు తెలియుచున్నది. ఇంతేల ఆంధ్రులు తాము భారతీయులమనియే భావించిరి. సంస్కృత కావ్య నాటకాలంకార రచనల నన్నింటిని ఆంధ్రులు తెనుగులోనికి అనువదించుకొనుటయేగాక సంస్కృతమందు మొన్న మొన్నటివరకును రచనల ననేకములను చేసియేయున్నారు.

కాని ఆంధ్రులకు భోజుని గురించిన, యీ యభిమానమునకును, ఇతరత్ర కానరాని భోజ—సర్పటికథ ఇక్కడ ఉండుటకును ఏదో కారణముండవలయును. ఇటీవల (1969 లో) భోజరాజీయమును ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారికి ముద్రించుచు సంపాదకులు శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులుగారు తమ సమీక్షలో ఇట్లు వ్రాసినారు: 'జనసామాన్యమున ప్రచారమందున్న ఆయా కథలను ఆధారముగా చేసికొని పురాణ కథల పోకడలను పోహళించుకొని స్వప్రతిభావశమున సంవిధానముల నేర్పఱచుకొని స్వతంత్రముగా రచించినట్టిదే ఈ భోజరాజీయము. ఇందు మాత్ర కథ భోజరాజ చరిత్రమని కవి చెప్పినాడుగాని ఆ భోజరాజ చరిత్ర మీ కావ్యమున కొంతవరకైనను వివరింపబడలేదు. భోజ కాళిదాస కథంలో చెప్పుకొనబడు పుక్కిటి పురాణములు భోజ చరిత్రాంశములు కావు. భోజుడు ధారానగరమునుండి మాళవదేశమును పాలించిన సుప్రసిద్ధ రాజకవి; 11 వ శతాబ్దిని జీవించిన ఒక మహాకళా పోషకుడగు భూపాలుడు; తాను స్వయముగా సరస్వతీ కంఠాభరణము, చారుచర్య, రామాయణ చంపువు మున్నగు సంస్కృత గ్రంథములను వ్రాసిన కవి దిగ్గజము. తన ఆస్థాన శిల్పాచార్యుడగు సమరాంగణ సూత్రధారునిచేత సమరాంగణ సూత్ర

ధారమను ప్రమాణభూత శిల్పవాస్త్ర గ్రంథమును వ్రాయించుటకు తోడ్పడిన మహనీయుడు. పలువురు కవులను, పండితులను, కళా నిర్మాతలను పోషించి భారత సంస్కృతిని ప్రోదిచేసిన కళాతపస్వి. భోజరాజునకు సంబంధించిన ఇట్టి చారిత్రక సత్యము లేనియు ఈ భోజ చరిత్రములో ప్రస్తావింపబడలేదు.'

వీరి యీ రచనలో 'జనసామాన్యమున ప్రచారమందున్న ఆయా కథలను ఆధారముగా చేసికొని' అని వ్రాసినది చాల విలువైనది. ఏ జన సామాన్యము, ఆంధ్రదేశముదా, భారతదేశముదా? ఉత్తరదేశమందలి కథలలో ఇట్టివి కానరానందున ప్రస్తుతము ఆంధ్రదేశముదనియే తలంపవలెను. మఱి ఆంధ్రులకి వెక్కడివి? ఎక్కడనైనను ఒక చిన్నసన్నగిరవంటి ఆధారముకూడ కానరాదు గదా! కాని కొంత అన్వేషించుటకు మార్గము కనబడుచున్నది. నేటి కాలమున చారిత్రక జ్ఞానము కలిగి సమకాలిక కావ్యశాసన వాఙ్మయమునంతటిని సంపాదించి పోల్చిచూచి పెక్కు నూతనాంశములను చరిత్రకారులు వెలికి లాగియున్నారు. సత్యములు బైటపడగా అసత్యములను గుర్తించి అన్వేషణ సాగించుచున్నారు. ఈ భోజరాజు మన రాజరాజనరేంద్రునికి సమకాలికుడనియు, ఆతనికిని అతని బంధువులైన చోళరాజులకును మిత్రుడుగా నుండి యుద్ధములలో సాయపడెననియు తెలియుచున్నది. గత (సాధారణ) సంవత్సరాంధ్రపత్రిక ఉగాది సంచికలో 'సామంతకాకతీయులు—కల్యాణీ చాళుక్యులు'అను వ్యాసమున నేను కొంత సూచించియున్నాను. రాజరాజనరేంద్రునియొక్క రాజ్యకాలము నలువదియేండ్లకు మించియుండినను మూడునాలుగు పర్యాయములు రాజ్యము పోగొట్టుకొని, కాందిశీకుడై, ముప్పది సంవత్సరముల కాలము యుద్ధములలో గడపి, చివరి పదేండ్లు కొంత విశ్రాంతి నందెననియు, ఈ యుద్ధములలో నీతనికి భోజుని సాయము అపారమనియు, ఆ సాయము ఎంత గొప్పదనగా, ఇతనిని (భోజుని) కూల్చినగాని తమకు శ్రేయస్సు లేదని రాజరాజనరేంద్రుని శత్రువులు తలంచి, నూటముప్పదియార్గురు రాజులు గుమిగూడి ఒక్కుమ్మడిగా భోజుని తాకి ఆతని దేశమును సర్వనాశము చేయునంతటి పగను ఎసకొల్పినట్టిదనియు, లఘువుగా వ్రాసియుంటిని. అంతటి బలాఢ్యుడు, అంతటి వాఙ్మయపోషకుడు, మన కెట్లు మిత్రుడై ఉపకరించెనో, ఆతని వాస్తవచరిత్రయేమో మనము తప్పక తెలిసికొనవలసినదే గదా. ముంజమహీపతి భోజునికి పినతండ్రి కాడనియు, ద్రోహి అంతకన్నను కాడనియు, పెదతండ్రి, ఉపకారి, మహాయోధుడు, ఇంకను ఎక్కుడుగా భాషారాధకుడు కళాపోషకుడునని తెలిసినప్పుడు మన కాతనిపై గౌరవమెక్కుడగుటయేకాదు ఆశ్చర్యమును జిజ్ఞాసయు కలుగుచున్నది.

పరమారవంశపు రాజుల యభ్యుదయము

భోజునితండ్రి సింధులుడు, అతని అన్న ముంజుడు. వీరి తండ్రి సీయకహర్షుడు. ఇతడే పరమారరాజ్యమును స్థాపించినవాడు. ఇతనితో ప్రారంభించి చెప్పిననేగాని భోజుని వాస్తవచరిత్ర బోధపడదు, కలగాపులగపు భోజప్రబంధ మెంత అసత్యమో తెలియదు. సీయకహర్షుడు మొదట స్వతంత్రప్రభువు కాడు. రాష్ట్రకూటులకు సామంతుడు,

క్రీ. శ. 973 వ సంవత్సరము (శ్రీముఖ) దక్షిణభారతదేశమున గొప్పసంభవములు జరిగినకాలమని వ్రాసియుంటిని. ఆ సంవత్సరమే వేంగియందు దానార్ణవుడు, విమలాదిత్యుని తండ్రి, రాజరాజనరేంద్రుని తాత, జటాచోడభీముడనువానిచే చంపబడెను. అదిమొదలు వేంగి ఇరువదియైదు సంవత్సరములు చాళుక్యులకు లేకపోయినది. 973 వ సంవత్సరమే కర్ణాటకదేశమందు విప్లవమేర్పడి బ్రహ్మాండమైన రాష్ట్రకూటసామ్రాజ్యము పడిపోయి, మరల పశ్చిమచాళుక్యులు, తైలపచక్రవర్తి నాయకత్వమున సామ్రాజ్యాధినాయకులైరి. తర్వాతి సంభవములచేత దానార్ణవుని చంపిన జటాచోడభీముడును, (ఇతడు తెలుగుచోళుడు) కర్ణాటక తైలపుడును స్నేహితులుగా నుండినట్లును తైలపుని సాయమువలననే భీమునికి ఇంత పరాక్రమమనియు, తైలపుని మొదట కొట్టినగాని వేంగికిపోవుటకు మార్గములేదనియు క్రీ. శ. 985 లో రాజ్యమునకు వచ్చి విమలాదిత్యునికి సాయపడిన రాజరాజచోళుడు గ్రహించినట్లు తెలిపియున్నాను. రాజరాజచోళుడు వేంగిచాళుక్యులతో పూర్వ సంబంధబాంధవ్యములు గలవాడు. ఇప్పుడు విమలాదిత్యుని తనకు అల్లునిగా చేసికొన్నవాడు. ఈ సందర్భమున కర్ణాటకులు జటాచోడ భీముని మనుమని, రాజరాజనరేంద్రుని సవతి తమ్ముని విజయాదిత్యుని వేంగియందు ప్రతిష్ఠింపజూచిన లనంతర పరిత్రము గుర్తింపబడినది. రాజరాజచోళుడు కొంతకాలము పోరాడి, అతని కుమారుడు రాజేంద్రచోళుడు (గంగైకొండ చోళన్) కొంతకాలము పోరాడి, అతని కుమారులును పోరాడి, వేంగి తమ బంధువులకు దక్కునట్లు ప్రయత్నింపగా, కర్ణాటక చక్రవర్తులు ఆ వేంగినే రాజరాజనరేంద్రుని దాయాదికి చేర్చుటకు పోరాడిరి. వీరి యీ పోరాటములు క్రీ. శ. 973 నుండి 1070 వఱకు ఒక్క శతాబ్దకాలము జరిగినవి. ఇందు ఒక విశేషము. దూరమందుండిన ఒక రిద్దరు తప్ప యావద్భారత దేశపు రాజులును తమ తమ కనుకూలమైన పక్షముల నవలంబించి పోరాడియున్నారు. ఉత్తరమునుండి చేది బంగాళ కన్యాకుబ్జ మాళవ ఘూర్జరులును, తూర్పునుండి అంగ వంగ కళింగ చక్రకూట కోసలులును, దక్షిణమునుండి కేరళ పాండ్య సింహళీయులును, పశ్చిమమునుండి కొంకణ కదంబ రట్ట పిందరాజులును పాల్గొనియున్నారు. ముఖ్యముగా ముంజభోజులు తమిళ చోళరాజులకు మిత్రులై వీరు వేంగిమీదికి దండయాత్ర వెడలినప్పుడంతయు తామును ఉత్తరమునుండి దక్షిణాపథమునకు వచ్చి చోళశత్రువులను కర్ణాటకులను వెనుకవైపు తాకి బాధించుచుండిరి. ఇది చోళులకు ఉపకారముగా నుండెను. ఇందులకు ప్రతిగా కర్ణాటకులు చోళుల శత్రువులైన సింహళ పాండ్యులను ఆయా కాలములలో రెచ్చగొట్టుచుండిరి.

దీనికి ప్రారంభకాలము క్రీ. శ. 968 సంవత్సరము. ఆ సంవత్సరము ఆర్యావర్తమున గొప్పమార్పు వచ్చినది. అంతవరకు బలవంతులకు లొంగి సామంతులుగానుండిన పరమారరాజులు బలవంతులై దక్షిణాపథముమీదికి దండయాత్ర సాగించిరి. రాష్ట్రకూట రాజ్యము బలహీనమాయెను. మూడవ కృష్ణరాజు క్రీ. శ. 968 లో మరణించిన తర్వాత అంతటి బలవంతుడు

లేకపోయెను. శిథిలమైపోవుచున్న రాష్ట్రకూట సామ్రాజ్యమును నిలుపుటకు రాష్ట్రకూట సామంతుడు, మంత్రి, సేనాపతి, సహాయుడు, రాజబంధువునైన గంగరాజు మారసింహుడు చాల గట్టి ప్రయత్నములు చేయుచుండెను. ఇతడు మహాయోధుడు. ఇతడును రాష్ట్రకూట కృష్ణరాజును వేంగిదానార్ణవునికి మిత్రులు. అతని శత్రువును 956 (క్రీ. శ.) లో తరిమి అతనికి వేంగిని ఇప్పించినవారు. కాన దానార్ణవుడును ఆ వెనువెంటనే రాజ్యభ్రష్టుడై క్రీ. శ. 970 లో మరల వేంగిని సంపాదించెను. అటువెనుక క్రీ. శ. 971 లో దొరకిన యొక శాసనమున, దానార్ణవుని కుమార్తెత అబ్బరసి యను నామె గంగరాజు మారసింహుని రాణిగా కనబడుచున్నది. ఇది క్రొత్త విషయము. ధ్రువపడునేని దానార్ణవునికి శక్తివర్మ విమలాదిత్యులను కుమారులును అబ్బరసియను కుమార్తెయు నుండినట్లు ఏర్పడుచున్నది. ఈ సంబంధముచేత మారసింహుడు ఇతనికి పెట్టనికోట. దానార్ణవుడు మూడేండ్లుకూడ ఆ తర్వాత పాలింపలేదు. ఇంతలో మారసింహుడును పరమారులను దండింపుటకు మాళవమునకు పోయెను. మారసింహుని సేనాపతులు 'ఉజ్జయినీభుజంగ' బిరుదమును ధరించినారు. సీయకహర్షుడు బదులుకు రాష్ట్రకూటులమీదికి దండయాత్ర వచ్చి ఖొట్టిగుడను రాష్ట్రకూట చక్రవర్తిని కడతేర్చి రాజధానిని కొల్లగొట్టెను. ('శ్రీహర్షదేవఇతి ఖొట్టిగదేవలక్ష్మీం జగ్రాహ యో యుధి నగాత్ అసమప్రభావః'.) ఇతని కుమారుడు ముంజరాజు కూడ మాన్యఖేటనగరమును, రాష్ట్రకూటరాజధానిని కొల్లగొట్టెను. ఖొట్టిగుని చివరి తారీఖు 973. ముంజుని మొదటిది 974. క్రీ. శ. 973 లో తైలపుడు ఖొట్టిగుని తర్వాతి రాజును, కక్కలుని చంపి రాష్ట్రకూటరాజ్యమునే హరించెను. 973 లోనే మారసింహుడు తైలపుని తఱిమి ఇంద్రరాజునకు అచ్చట పట్టాభిషేకము చేసెనుగాని ('నిజభుజపరిపాలిత మాన్యఖేటప్రవేశిత చక్రవర్తి కటకస్య')రాజ్యము నిలువలేదు. తైలపుడు తన రాజ్యకాలమును 973 నుండియే లెక్కించుకొనెను. 976 నుండి పృథ్వీవల్లభ మహారాజాధిరాజ బిరుదములను ధరించెను. మాన్యఖేటమును క్రీ. శ. 974 అనంతరము (మారసింహుడు గతింపగా) గ్రహించెను. ఈ కాలమందే క్రీ. శ. 972—973 లోనే ముంజుడు తండ్రితో కలసియే మాన్యఖేటమును తాకియుండవలయును. 974 లో ముంజుడు, తన మొదటి శాసనమందే 'అమోఘవర్షదేవాపరాభిధాన వాక్పతిరాజదేవ పృథివీవల్లభ శ్రీ వల్లభనరేంద్రదేవః' అని చెప్పుకొన్నాడు. ఇది స్పష్టముగా రాష్ట్రకూటులమీది విజయసూచకమే. మఱియేల మాన్యఖేటమందు నెలకొనలేదో తెలియదు. అంతటి సన్నాహముండియుండదు. తమ యూరు చాలదూరము. తమది వట్టిజైత్రయాత్ర. పైగా తైలపుడు ప్రబలశత్రువు. అతడును పృథివీవల్లభ బిరుదధారి. ఇరువురను ఏకకాలమున నీ బిరుదు ధరించుట సాభిప్రాయము—ఇరువురును రాష్ట్రకూటరాజ్యమునకు పోటీదారులు.

ముంజమహారాజు

మఱి—ఇంతదూరమునందుండిన యీ పరమారులకు మన వేంగిదేశమునకును ఈ కాలమునగల సంబంధమును వివరింపవలెను. భోజుడు విమలాదిత్య రాజరాజనరేంద్రుల సమకాలికుడు. అతని తండ్రి సింధురాజు శక్తివర్మకు సమకాలికుడో కొంత పూర్వుడో. ముంజుడు దానార్ణవ జటాచోడభీములకు సమకాలికుడు. కర్ణాటక తైలపునికి సహజశత్రువైనందున అతని శత్రువు చోళరాజరాజు ఇతనికి మిత్రుడాయెను. రాజరాజచోళుడు క్రీ. శ. 985 లో రాజ్యమునకు వచ్చెను. ఇతడు దానార్ణవుని బంధువు. చోళరాజ కుటుంబ కలహములచే కొంతకాలము ప్రవాసియైయుండి, రాజ్యమునకు రాగానే తన కుమార్తెను కుందవ్వను విమలాదిత్యునికిచ్చి పెండ్లిచేసి, వేంగిని సాధింప నారంభించెను గదా. ఇప్పుడు పరాక్రమముకన్న ఉపాయము ముఖ్యమైనది. వేంగియందు భీముడు బలవంతుడు. దండెత్తిపోయి వెంటనే అతని కొట్టుట అసాధ్యము. తైలపుడు అతనికి సహాయుడు. తైలపుని మొదట కొట్టిగాని భీముని కొట్టుటకు కుదురదు. అప్పటికే పలుమార్లు తైలపుని తాకియున్న ముంజుడు తనకు సహజమిత్రుడుకాగా, వెనుకనుండి ముంజుడును ముందుండి తానును తైలపునిరాజ్యమును తాక నారంభించిరి. క్రీ. శ. 982 నాటికే ముంజుడు తైలపునిచే బంధింపబడి తప్పించుకొనిపోయియున్నాడు.

> 'హూణప్రాణహరః, ప్రతాపదహనః
> యాత్రా ప్రతసన్మారవః........
> చైద్య వే ద్యభిలషమా జయ నయ
> వ్యుత్పన్నధీ రుత్పలః
> కారాగారనిషేవితః కవివృషా
> యం వర్ణయన్ ఘూర్ణతే'

అని చాళుక్య నీలగుండ శాసనము. అట్టి ముంజుడు మరల నెత్తిరాగా యాదవరాజు భిల్లముడు, చాళుక్య సామంతుడు, రణరంగమున నాతనిచంపినట్లు శాసనము కలదు. ముంజుని చివరి తారీఖు 994. ఈ లోపల చోళులును కర్ణాటక రాజ్యములో ప్రవేశించి 993 నాటికి మైసూరు కోలారు బళ్లారి అనంతపూరు జిల్లాలలోని భాగములలో ప్రవేశించి కొంతదేశము నాక్రమించిరి. పరమారులతోడి ఈ స్నేహము తమిళ రాజులకు దాదాపొక శతాబ్దకాలము జరిగెను. ఈ పరమారులును చోళులవలె శైవులు. కర్ణాటకులు 1033 వఱకు జైనులు.

రాజరాజ చోళుడు వేంగిని సాధించుట

చోళ కర్ణాటక రాజ్యముల గడి ప్రదేశములను పట్టుకొని తొండమనాడు, పాకనాడు, మలకనాడులుకూడ (మదరాసు చుట్టుపట్టులు, చిత్తూరు, నెల్లూరు కడపజిల్లాలు) సాధించి తుంగభద్రవరకు తనదారిని భద్రపఱచుకొనినగాని వేంగీ ప్రదేశము సాధ్యముకాదు. పైగా కాంచీనగరము శత్రువుల కభేద్యమైనగాని ప్రయత్నములు కొనసాగవు. జటాచోడ భీముని రాజ్యము కర్నూలు జిల్లాలోని పెదకల్లు. తుంగభద్రను దాటి, కృష్ణను దాటి వేంగికి పోవలెనుగాని గుంటూరువైపునుండి నాడు దారిలేదు. కాకపోయిన సముద్రమార్గమున పోవలెను. అది రాజకుటుంబములకు కొద్దిమందికి సరియేగాని మహాసైన్యములకు భూమార్గమే సాధ్యము. తైలప చక్రవర్తి వేంగిని కూడ తాకి ఒక ఆంధ్రుని పట్టినట్లు

('వెంగి వెరగాని'—'ధారియొళంధ్రధనం పిడిదపెం') అది క్రీ. శ. 973 కు ముందుగానో లేక 997 కు కొంతముందుగా జటాచోడ భీమునికి సాయము వచ్చియో యుండవలెను. ఏలన తెలుగు చోళులందఱును పశ్చిమ చాళుక్యులకాశ్రితులు. ముంజునిమరణానంతరమే యుండును, 994 కు తర్వాత. రాజరాజచోళునితో శక్తివర్మ విమలాదిత్యులును కలసియే రణములలో పాల్గొనియుందురుగదా.

తైలపుడు 997 లోను ముంజుడు 994లోను గతించిరి గాని వీరి కలహమువలన రాజరాజ చోళునికి చాలవఱకు అనుకూలమాయెను. కర్ణాటకమందు సత్యాశ్రయుడు చక్రవర్తి. మాళవమందు సింధురాజు ప్రభువు. వీరిరువురుని సర్దుకొని సత్యాశ్రయుడు యుద్ధములలో పాల్గొను లోపల రాజరాజచోళుడు కార్యమును (వేంగిని) సాధింపవలసియుండెను. దక్షిణమున సింహళ కేరళ పాండ్యరాజ్యములను అదుపులోనికి తెచ్చుకొని వేంగిమీదికి దృష్టి మరలించెను. 999—1000 ప్రాంతము, భీముడు కళింగములో యుద్ధము చేయుచుండగా, వేంగియందు ప్రవేశించి శక్తివర్మకు పట్టాభిషేకము జరిపెను. భీముడు హుటాహుటిగ వచ్చి చోళులను తరిమి కంచివరకు వచ్చి 1002 లో కాంచీ నగరమును ముట్టడించెను. ఘోర యుద్ధమాయెను. రాజరాజ చోళుడు భీముని యుద్ధమున కూల్చెను. శక్తివర్మ వేంగియందు కుదురుకొనెను. విమలాదిత్యుడు, తాము జయించిన భీముని కుమార్తెను, మేళమదేవిని పెండ్లాడెను. ఈమె కుమారుడే తర్వాత విష్ణువర్ధన విజయాదిత్యుడు. నాటికి రాజరాజనరేంద్రుడు పుట్టి పదేండ్లయుండును.

సత్యాశ్రయుడు ఈ సందర్భమున భీమునికి సాయపడెనో లేదో తెలియదుగాని ఆతనిని రానీయక రాజరాజచోళుడు ఆపినది నిజము. 1003 నాటికే చోళుల సైన్యములు కన్నడ రాజ్యము మీదికి పోయియుండినవి. వేంగికివచ్చు మార్గములలో తమిళసేనలుండినవి. ఆ తమిళులతో పోరియే తర్వాత సత్యాశ్రయుడు 'తిగుళరమారి' (తమిళులకు మారి) యను బిరుదుము ధరించెను. సింధురాజు కూడ కొంత చోళులకు సాయపడెను. గోదావరిని దాటి ఒకానొక నాగరాజును జయించెను. అపరాజితుడను విద్యాధరు నొకనిని సాధించెను. గోదావరిని దాటుటు యనగా కర్ణాటక సామ్రాజ్యములో ప్రవేశించుటయే. నాగరాజు బస్తరుపై పు రాజు, తూర్పు. విద్యాధరులు కొంకణ పాలకులు పడమవెట్టివు. ఇందుచేతనే సత్యాశ్రయుడు తూర్పున భీముని ఆదుకొనలేకపోయెను. ఇన్నాళ్ళకు ఇంత ప్రయత్నము చేయగా వేంగి శక్తివర్మకు దక్కినది.

ముంజరాజు వాస్తవ చరిత్రము

ఈ విధముగా కర్ణాటకులను చిక్కులపెట్టిన ముంజరాజు భోజుని పినతండ్రి కాడని తెలిసినది. అతని వాస్తవ చరిత్రయు తెలిసినది. జీవితమంతయు యుద్ధములలో గడిపినవాడు. ఎప్పుడు సముద్రకొనెడువాడో! ఎప్పుడు గ్రంథరచనలు చేసెడివాడో! శాసనము లాతను కర్ణాటలాట కేరళ చోళ చేది రాజులను జయించినట్లు చెప్పుచున్నవి. అట్టివాడు సంస్కృత వాఙ్మయ రంగమందును ఉన్నవాడును కాడు. ఇతనికి వాక్పతిరాజు, ఉత్పలరాజు అని నామాంతరములును 'పృథివీవల్లభ శ్రీవల్లభ అమోఘవర్ష' యను బిరుదులును గలవు గదా. ఇతని స్తుతించినవారు శంభు హలాయుధ కవిరాజాదులు. దశరూపకాది నాట్యశాస్త్ర రచయితలు, అలంకారికులు ధనిక ధనంజయులు ఇతని యాశ్రితులు. పరిమళ కాళిదాస బిరుదాంకితుడు నవసాహసాంక చరిత (సింధురాజ విజయము) రచయిత పద్మగుప్తకవి ఈతని కడనే యుండి భోజునివఱకు వర్ధిల్లెను. ఈ కాళిదాసునే ప్రాచీన కాళిదాసునకు మనవారు ముడిపెట్టినారు. పైగా భోజరాజనునది ఈ భోజునికి పేరు మాత్రమే. విదర్భ రాజులకు భోజరాజనునది బిరుదము గదా. (రుక్మిణీదేవి భోజకన్య గదా). కాళిదాసు చంద్రగుప్తవిక్రమాదిత్యుని కాలమున విదర్భయందుండెను. ఆ భోజుని మరచిపోయి ఈ భోజునికి కాళిదాసుని తగిలించినారు. ఇది యొక గందరగోళము. ముంజరాజునకు సాహసాంక సింధురాజనామము లుండిననియు, నతని తర్వాత భోజుడే రాజ్యమునకు వచ్చెననియు శ్రీకృష్ణమాచార్యులు (సంస్కృత వాఙ్మయ చరిత్ర, ఇంగ్లీషు పు. 163—164) వ్రాసినది పొరపాటు. సాహసాంక, నవసాహసాంక బిరుదములు ముంజుని తమ్ముడు సింధురాజువి. పద్మగుప్తుని నవసాహసాంక చరిత్రమందు ఇట్లున్నది. 'అస్మత్పూర్వజస్య వాక్పతిరాజాపరనామ్నో ముంజదేవస్య' (ఇత్యాది. సర్గ 1— శ్లో 6.7, సర్గ 11- శ్లో 92, 101). ఈ పద్మగుప్తుడు 18 సర్గలలో కాళిదాసు శైలిని అనుకరించుచు సింధురాజు శశిప్రభ యను నాగకుమారిని పెండ్లాడిన చరిత్రను వ్రాసెను. ఈ పద్మగుప్తుని తండ్రి మృగాంకగుప్తుడు.

ముంజునిగూర్చి మేరుతుంగుని కథ

మేరుతుంగాచార్యుడు పదునాల్గవ శతాబ్దివాడు, ప్రబంధ చింతామణి యను పూర్వరాజ చరిత్రగ్రంథమందు ముంజుడు ఆఱు పర్యాయములు తైలపుని మీదికి ఎత్తిపోయెనని వ్రాయగా శాసనములు పదునాఱు పర్యాయములని చెప్పుచున్నవి. ఏది సత్యమోకాని పెక్కు దండయాత్రలనియు, ముంజుని సామ్రాజ్య కాంక్ష ఎంతటి దైనదియు వ్యక్తమగుచున్నది. ముంజుడు అయిదు దండయాత్రలు తైలపునిమీదనరిపిన తర్వాత ఆఱవ దండయాత్ర బయలుదేరగానే అపశకునము లైనవట. మంత్రి రుద్రాదిత్యుడు నివారించెనట. లక్ష్యపెట్టక ముంజుడు బయలుదేరగా రుద్రాదిత్యుడు గోదావరినైనను దాటవలదని ప్రార్థించెనట. అది వినక రాజు బయలువెడలిపోగా మంత్రి ఆత్మహత్య చేసికొనెనట. ముంజుడు గోదావరినిదాటి కర్ణాటక రాజ్యమందు ప్రవేశించి తైలపునికి పట్టుపడెను. అంతట తైలపుడాతని చెఱసాల యందుంచి చాలవిధముల బాధపెట్టుచుండెనట. ఇట్లుండ తైలపుని చెల్లెలు వితంతువు మృణాలవతి యనునది తైలపుని ప్రయోగముచేత ముంజుని ప్రేమించిన ట్లభినయించి తప్పించుకొను ప్రయత్నములో తైలపునికి ముంజుని పట్టియిచ్చెను. ఆటుపెనుక తైలపుడు ముంజుని అవమానపరచి చంపించెనని కథ. (దీనిని ఇటీవల కొందఱు ఉత్తర దేశమున నవలగా రచించి సినిమా చిత్రముకూడ తీసినారు—పృథ్వీవల్లభ్ అని).

పూర్తిగా అసత్యము. పట్టి కట్టుకథ. తైలపునికి ఆ పేరి చెల్లెలుండినట్లు వంశవృక్షాదికములలో కానరాదు.

వాక్పతి దేవుడను భిల్లమ దేవాదవునిచేత రణనిహతు డనియు, తైలపునిచేతను రణనిహతుడనియు శాసనములు కలవు. రన్న మహాకవి సత్యాశ్రయుని కాలమున రచించిన గదాయుద్ధమందు ముంజుని పేరు చెప్పలేదుగాని మహార్ధ్వరులను తైలప సత్యాశ్రయులు జయించిరని చెప్పియున్నాడు. అత్తిమబ్బె యనునామె వేయించిన శాసనములో తైలపుని సకల ఘూర్జరదిగ్విజయము ప్రస్తావింప బడినది. ఆ ఘూర్జరరాజు ఉత్పలసరనామక ముంజుడనునది తర్వాతి రాజాధిరాజుయొక్క చోళ శాసనములతో ప్రస్తావింపబడి యున్నది. 'తైలపునిచేత నిహతుడైన ఘూర్జరరాజు ఉత్పలుని వజ్రాల కిరీటమును కర్నాటకులు తమ రణభేరికి కట్టి తమ మహావిజయ సూచకముగా ఆడంబరముతో పెద్ద బండిలో పెట్టి నెట్టుకొని పోయెడివారు. ఆ యుత్పలుని సంతతి వారు తన్ను ఆశ్రయింపగా శరణ మిచ్చి, అండజేర్చుకొని వారికి, రణరంగమున ఆ బండిని పట్టుకొని ఆ కిరీటమును గ్రహించి తాను చేర్చెను' అని ముంజుడు గోదావరిని తైలపుడు నర్మదను దాటి యుద్ధములు చేయుచుండినవారే.

ఇట్లు ముంజ మహీపతి గతించెను. తమ్ముడు సింధులుడు రాజ్యమునకు వచ్చెను. ఇతనికి కుమారనారాయణయని కూడా బిరుదు. ఈతని రాజ్య మెప్పుడు ముగిసెనో గాని ఇతని తర్వాతి రాజు భోజుడు. క్రీ. శ. 1015 ప్రాంతమునుండి 1050 తర్వాత కొంతవఱకు ఈతని ప్రస్తావము ఉండుటచేతను ఏబదియైదేండ్లు పాలించెనను ప్రథ యుండుటచేతను క్రీ. శ. 1000 కి ముందే రాజై యుండును ('పంచాశత్ పంచవర్షాణి సప్తమాసా దినత్రయం, భోజరాజేన భోక్తవ్యం సగౌడ దక్షిణాపథః').

మరల వేంగిలో కల్లోలములు

క్రీ. శ. 1008 లో సత్యాశ్రయుడు గతించెను. అతనికి కుమారులు లేరు. అతని తమ్ముడు దశవర్మకుమారుడు విక్రమార్కుడు 1009 లో రాజాయెను. ఇతని పరిపాలనము నాలుగైదు సంవత్సరములకాలమేయైనను చాల గందరగోళముగా నుండినది. ఈతడు రాజ్యమునకు కల్లోలముల నడుమనే వచ్చినట్లున్నాడు. క్రీ. శ. 1003 లో చోళసైన్యములు కర్నాటము మీదికి పోయినందులకు ప్రతిగా చాళుక్యులు 1006 లో వేంగిమీదికి దండెత్తి ధరణికోట యనమదల యనుకోటలను కాల్చి, దేశమందు విధ్వంసనకాండను సాగించిరి. మరల రాజరాజచోళుడు 1007 లో తన కుమారుని రాజేంద్రచోళుని తొమ్మిది లక్షల సైన్యముతో కర్నాటకములోనికి బిజాపూరు వఱకు సర్వవిధ్వంసక దండయాత్ర పంపెను. కన్నడసైన్యములు వేంగిని వదలినవి. ఈ సందర్భముననే 1008 లో సత్యాశ్రయుడు గతించుట విక్రమార్కుడు రాజగుట.

క్రీ. శ. 1011 మేనెల 10 వ తేది శక్తివర్మ గతించి విమలాదిత్యుడు వేంగి ప్రభువాయెను. కాని అతడు అప్పటు రాజ్యమేలిన జాడలేదు. 1014 లో తంజావూరులో తిరువయ్యారులో మామగారియింట నున్నాడు. ఈ నడుమ విక్రమాదిత్యుడు వేంగి మీద దాడి సలిపినట్లున్నాడు. రాజరాజచోళుడు గతించి 1014 నాటికి రాజేంద్రచోళుడు చక్రవర్తి. పరాక్రమశాలి. తండ్రియుండగానే విజృంభించి కర్నాటకదేశమును, 'ఇడైతురైనాడు, వనవాసి, కొల్లిప్పాక్కై, మణ్ణైక్కడక్కం' మొదలైన ప్రదేశములను సాధించినాడు. ఇతనికి సాయముగా ఉత్తరమున మాళవమునుండి భోజుడు, చేది (నేటి జబ్బల్పూర్ప్రాంతము)నుండి గాంగేయదేవుడు, వారికి క్రిందివైపునుండి కోసలులు వచ్చి కర్నాటకులను తాకిరి. కన్యాకుబ్జపురాజులుకూడ ఇందు పాల్గొన్నట్లున్నారు. ఇట్టి తరుణమున విక్రమాదిత్యుడు గతించెను. అతని తమ్ముడు రాజ్యమునకు వచ్చి కొద్దిదినములలోనే గతించెను. ఇంకొక తమ్ముడు జయసింహుడు. ఈతనిని సామంతమాండలికులు చాల శ్రమపడి రాజును చేసి కన్నడరాజ్యమును కాపాడిరి.

పరిస్థితులు మారినవి. రాజేంద్రచోళ జగదేకమల్లు లిరువురును సామ్రాజ్య విస్తరణకాంక్షగల పరాక్రమవంతులు. వేంగియందు తాత్కాలికముగ విమలాదిత్యుడు ప్రతిష్ఠితుడైనను ఎప్పటికిని కర్నాటకులవలని బాధ తప్పదని గ్రహించి, తండ్రివలెనే దూరదృష్టిగలవాడై సహాయకవర్గమును సంపాదింప నారంభించెను. జయసింహుడును మరల వేంగియందు తన అభిమానపాత్రుని రాజు చేయుదలంచియుండెను. తుంగభద్రాతీరమువఱకు ఆక్రమించెను. క్రీ. శ. 1018 లో విమలాదిత్యుడు మరణించెను. అతని పెద్దకుమారుడు రాజరాజనరేంద్రుని రాజ్యమునకు రానీయక చిన్నకుమారుడు విజయాదిత్యుడు జయసింహుని సాయముతో వేంగిని పట్టుకొనెను. మరల రాజరాజనరేంద్రుడు వేంగియందు కాలుపెట్టుటకు నాలుగేండ్లు పట్టినది. రాజరాజనరేంద్రుని పట్టాభిషేకము క్రీ. శ. 1022 లో జరిగినది. కాని రాజేంద్రచోళుని యావద్భారత విస్తృత బృహద్రాజ్యతంత్రమువలన జరిగినది. సాధారణవిషయము కాదు. ఈ కాలమందే రాజేంద్రచోళుడు తన మిత్రరాజన్యులను కలసికొనుటకు గంగాతీరమువఱకుపోయి గంగైకొండచోళన్అని పేరుపొందినాడు.

ఇది గొప్పఊపు. నాటి రాజకీయముల నరయవలయును. క్రీ. శ. 1017 నుండి రాజేంద్రచోళుడు సింహళముతో పోరాడు చుండెను. ఇతడు రాజరాజనరేంద్రుని మేనమామయు పిల్లనిచ్చిన మామయు. సింహళులు కర్నాటకుల మిత్రులు. అట్టి తరుణమున విమలాదిత్యుడు గతించెను. రాజేంద్రుడు వెంటనే వేంగికి రాలేకపోయెను. జయసింహునికి అవకాశము దొరికినది. ఐనను విజయాదిత్యునికి పట్టాభిషేకము చేయలేకపోయెను. అది పదేండ్లతర్వాత 1031 లో జరిగినది. సింహళమును పూర్తిగా లొంగదీసి రాజేంద్రుడు వేంగికి వచ్చెను. సరిగా నీకాలముననే తన మిత్రులను పరమారాదులను చాళుక్యులమీకి ఎసకొల్పెను. భోజుడును చేదిపతులును ఎత్తివచ్చి కర్నాటకులను తాకిరి. కర్నాటకుల సేనాపతి కుందమరసు అను నతడు భోజుని, కన్యాకుబ్జాధిపుని, కోసల కొంకణరాజులను సలుపురను తాను జయించినట్లు చెప్పుకొని యున్నాడు.

ఆర్యావర్తపు రాజులను అటు చేసి రాజేంద్రచోళుడు మహాసన్నాహముతో వచ్చి కర్నాటకులను తాకెను. ముసంగి యను చోట,

కృష్ణా తుంగభద్రల నడిమి రాజ్యమున, 1021 కి ముందే, జయసింహుని ఓడించి వేంగికి రాసీయక అడ్డెను. కాని వేంగియందు తఱుమవలసిన శత్రువులుండిరి. రాజేంద్రుని సేనాపతులు తెలుంగు, ఓడ్ర, కళింగ రాజులతో పోరాడవలసివచ్చినదనియు, కొంత సైన్యమును ఇచటనుండి రాజేంద్రుడు గోదావరి మహానదిని దాటి గంగ వఱకు పోగా నడుమ ఎందరో రాజులు లొంగగా వంగదేశపాలకుడు గోవిందచంద్రుడు పారిపోయెను! అటనుండి మరల వచ్చుచు గోదావరీ తీరమున తన సేనాపతిని కలిసికొని క్రీ. శ. 1022 ఆగష్టు 22 లో రాజరాజనరేంద్రునికి పట్టాభిషేకము చేయించెను. తాను దగ్గరనుండుటయే గాక తన గురువును తంజావూరు బృహదీశ్వరాలయము యొక్క గురుక్కళునైన సర్వసిద్ధి పండితునిచేత రాజరాజనరేంద్రునికిని తన కుమార్తె అమ్మంగాదేవికిని వేంగీపురమందు పట్టాభిషేకమును వైభవముగా జరిపించెను. తన పేరిట గంగైకొండ చోళపురమును(తంజావూరుజిల్లా) నిర్మించిరాజధానిని అచటికి మార్చుకొనెను.

కాని కర్ణాటకులు వదలలేదు. గంగవాడి నొళంబనాడి, మైసూరు అనంతపూరు బళ్ళారి జిల్లాల భాగములను, హోయసలరాజ్య భాగములను స్వాధీనము చేసికొని భోజునిమీదికి కొంకణము మీదికిని పోయిరి. 1024 నాటికి కొల్హాపురమును, 1028 భోజ గాంగేయ దేవులను జయించిరట. ఈ గాంగేయ దేవుడే 1014కు ముందు చాళుక్య (ఐదవ) విక్రమాదిత్యుని జయించితినని చెప్పుకొన్నవాడు. ఈ సందర్భములలో రాజరాజనరేంద్రునికి 1030 వరకు ఎట్టిబాధయు కలిగినట్లు కానరాదు. క్రీ. శ. 1031 లో విజయాదిత్యుడు వేంగిని ఆక్రమించి అన్నవలె తానును విష్ణువర్ధన విజయాదిత్యుడని 'విష్ణువర్ధన' బిరుదమును ధరించి పర్థివముతో పట్టాభిషేకము చేసికొనెను. రాజరాజనరేంద్రునికి సాయముగా వెంటనే అతని మామ సైన్యమును పంపెను. బెజవాడకు సమీపమున కలిదిండియనుచోట ఘోరయుద్ధము జరిగి ఆ సేనాపతులు మరణించి, చాల కష్టముమీద రాజరాజనరేంద్రుడు మరల వేంగిని పొందెను.

కాని ఏమి ప్రయోజనము? కర్ణాటకులు పెద్దఎత్తుగడతో నుండిరి. జయసింహుడు తనపెద్ద కుమారునికి దాదాపు నలువది యేండ్లవానికి రాజ్యభార మప్పగించి తాను తన రాణులతో పొట్ట్ల కెరె (నేటి హైద్రాబాదుసమీపములోని పాటన్ చెఱువు) కడనుండి, క్రమముగా రాణుల ప్రోద్బలమున జైనమతమును వదలి శైవమతమును స్వీకరించెను. శత్రువుల బాధలుపడలేక రాజేంద్రచోళుడు దిగ్విజయము సాకున రాజధానిని గంగైకొండ చోళపురమునకు మార్చుకొనగా తానును మాన్యఖేటముకూడ శత్రువుల దగ్గరయని కల్యాణ కటకమును(నేటి బసవ కళ్యాణి, గుల్బర్గా జిల్లా, మైసూరురాష్ట్రము) నిర్మించుకొనెను. దీని నిర్మాణము ఇతని పనియేయని బిల్హణుడు విక్రమాంక దేవ చరిత్రమున వ్రాసియున్నాడు. ఇది 1033 లో శాసనములలో కనబడుటచే సోమేశ్వరుడు యువరాజుగానుండు కాలముననే దీనిని నిర్మించుకొని యుండవలయును. 1033 లోనే జయసింహుని మతము మార్పుకూడ. 1035 లోని యొక శాసన మితని 'చోళభండనాపేక్షి' యనుచున్నది. కాని చివరివఱకు (1042) 'పొట్ట్లకెరె' యందే యుండినాడు. సోమేశ్వరుడు విజృంభించి కొంకణము, గోవా, కొల్హాపురము, సౌందత్తి, బనవాసి, కరహాటముల రాజులను లొంగదీసి, సేవుణ యాదవులను ఔరంగాబాదు (దేవగిరి) జిల్లా ప్రాంతమువారిని జయించి వేంగి మీదికి సైన్యమంపెను బెజవాడ కోటను 1037 లో ముట్టడించెను. 1039 లో రాజరాజనరేంద్రుడు ద్రాక్షారామమున నున్నాడు. అటు తర్వాత వేంగిలో లేడు. జయసింహుని సేనాపతులలో నొకడగు మాచిరాజునకు చంద్రరాజను కవి తన మదనతిలకమను కావ్యమును కృతియిచ్చుచు అతడు మలయ, ఆంధ్ర, అర్బుద, (రాజపుత్ర స్థానమందలి అబూ పర్వతము) ద్రావిడ, వేంగి, వంగ నేపాల. కేరళ, పాంచాల, కళింగ, కొంకణ, సౌరాష్ట్ర ఆభీర, కాశ్మీర, కోసల, లంపాక, తురుష్క, గౌళ, ఖస. కాసూ క్షేంద్ర, కాంభోజ, సింహళరాజులకు భయంకరుడని వ్రాసెను; ఇది ఎంతవరకు నిజమోకాని భారతదేశమందలి రాజులందరు చోళ కర్ణాటక యుద్ధములలో ఏదోయొకపక్షము చేరి యుద్ధ మొనరించినది మాత్రము నిజము. దీనినిబట్టి చూచిన రాజేంద్రచోళుడు గంగాతీరమువరకు పట్టపుణ్యమునకు పోయినవాడుకాని తెలియుచున్నది.

క్రీ. శ. 1042 లో కర్ణాటక జయసింహుడు గతించెను. 1044 లో రాజేంద్ర చోళుడును గతించెను. వారి కుమారులు, బలవంతులు వీరావేశముతో యుద్ధములు ప్రారంభించిరి. జయసింహుని కుమారుడు సోమేశ్వరుడు రాజ్యమునకు వచ్చునాటికే అతనికి పెద్దపెరిగి యుద్ధములు చేయగలిగిన ముగ్గురు కుమారులున్నారు. చోళ రాజేంద్రునికి ముగ్గురు కుమారులు రాజాధిరాజు, (రెండవ) రాజేంద్రుడు, వీరరాజేంద్రుడునని. వీరిలో రాజాధిరాజు చక్రవర్తియాయెను. (1044). క్రీ. శ. 1039—40 నాటికే వేంగి చాళుక్యుల స్వాధీనమై యుండెను. తర్వాత 1044 లో చాళుక్య దండనాయకుడొకడు 'వేంగి పురవరేశ్వర' యను బిరుదముతో అచ్చట పాలించుచుండెను. మరల మునుపు 1018—1020 లో నున్నట్లే 1039—40 ప్రాంతములలో రాజరాజనరేంద్రుడు మరల తిరువయ్యారుకు పోవుటయు, చోళరాజులు దక్షిణమందలి రాజులను దండింప బోవుటయు జరిగనది. వెంటనే సాయపడు వారులేక రాజరాజ నరేంద్రుడు ప్రవాసిగా పోయియుండెను.

1044 కు గాని చోళులు వచ్చి రాలేకపోయిరి. వేంగియందు ప్రవేశింప లేకపోయిరి. కర్ణాటక దేశముమీదికి తరలిరి. ఇదిమొదలు రాజకీయరంగము విస్తృతమై తెలంగాణాలోకూడ చాల ప్రదేశములు రణరంగములాయెను. చోళులు కొల్లిపాక మున్నగు ప్రదేశములను కాల్చిరి. రాజరాజనరేంద్రుని తమ్ముడు విష్ణువర్ధన విజయాదిత్యుడును, సోమేశ్వరుని కుమారులు విక్రమాదిత్య జయసింహులును ఈ దండయాత్రలలో ప్రాధాన్యము వహించి చోళులను వేంగిలోనికి రానీయలేదు.

ఇంతలో దక్షిణమున సింహళరాజు విక్రమపాండ్యుడు ఎదురు తిరిగినందువలన చోళులు దక్షిణమునకు వచ్చిరి. మరల 1047లో వేంగిమీదికి తిరిగిరి. ఈవూరుకూడ వేంగియందు ప్రవేశింపలేక తుంగభద్రా తీరమున కంపిలి నగరమును కాల్చిరి. లెక్కలేని దండనాథులు, మహాయోధులు ఇరువైపుల మడిసిరి. కాని ఎట్లో వేంగి దక్కినది. రాజరాజనరేంద్రుడు 1048 లో ద్రాక్షారామమున నున్నాడు. ఈ దిగ్విజయానంతరము చోళరాజాధిరాజు అశ్వమేధ యాగము చేసెను. ఇప్పటికి రాజరాజనరేంద్రుడు రాజ్యభ్రష్టుడై మరల రాజ్యము సంపాదించుటకు ఇది మూడవ పర్యాయము. చాళుక్య సైన్యములు ఎత్తివచ్చి, కర్నూలు, గద్వాలు, పూండూరు మున్నగు ప్రదేశములలో యుద్ధములై, తెలుగుచోళు లెందరో విజయాదిత్యునికి సాయపడి, మరల వేంగి కర్ణాటకులకు హస్తగతమాయెను. సోమేశ్వరుని పెద్దకుమారుడు రెండవ సోమేశ్వరుడు ఈవూరు వేంగియందు 'వేంగీ పురవరేశ్వర'బిరుదముతో నెలకొనెను. 1049 లో రాజరాజనరేంద్రుడు మరల తిరువయ్యారు దారి బట్టెను. చోళసైన్యములు వేంగిపోయినను నొళంబపాడిని సాధించి కొంకణమువఱకు దేశమును విధ్వంసన మొనర్చిరి.

ఇది ఇక్కడ తన సేనాపతులచేతను కుమాళ్లచేతను జరుగుచుండగా సోమేశ్వర చక్రవర్తి ఉత్తరపశ్చిమదిక్కులనుండి చోళులకును రాజరాజనరేంద్రునికి సాయపడినవారిని దండించుటకు పెద్ద సన్నాహముతో బయలుదేరెను. (దీని వివరములు సాధారణ ఉగాది సంచికలో వివరించియుచ్నాను). చోళులకు బలము తగ్గినదను ధైర్యమే ఇందులకు కారణము.

భోజుడు ధారానగరమున చేరుట

భోజుడు క్రీ. శ. 1000 కో, అంతకు కొంతముందో రాజ్యమునకు వచ్చినవాడు చాల పెద్దవాడైనాడు. పెదతండ్రి యంతటి యోధుడగునోకాడో ఆధారములు దొరకలేదేగాని చాల పరాక్రమశాలి యనుటకు ఇతనిని కూల్చుటకు మూటముప్పదియాఱు మంది రాజులు కలసిరావలసివచ్చినదనుటయే చాలును. ఇతనిని పూర్తిగా అణగద్రొక్కినగాని తన సామ్రాజ్యమునకు భద్రత లేదని తలంచినాడు సోమేశ్వరుడు. చివరి దినములలో చిక్కులపాలైనాడు ఈ గీర్వాణవాఙ్మయ కళాపోషకుడు. ఇతని పెద్దల పరంపరాగతరాజధాని ఉజ్జయిని. అట్లే ఉజ్జయిన్యాం విక్రమార్క ముంజ భోజ నరేశ్వరాః'అని నాడుక యేర్పడినది. అబుల్‌ఫజల్ అనునతడు వ్రాసిన 'ఆయినా—ఇ—అక్బరీ' అను గ్రంథమున భోజుడు రాజధానిని ధారానగరమునకు మార్చెనని వ్రాసియున్నాడు. ఈతడు హిందూరాజులతో మాత్రమేగాక నాడు ఎత్తివచ్చిన గజినీ మహమ్మదుతో పోరాడవలసియుండెను. ఇందులకు చక్కని దుర్గము అవసరమని ధారను శత్రువుల కభేద్యముగా నిర్మించుకొనెను. భోపాలుకు ఆగ్నేయముగా భోజపురమును దానికడ బ్రహ్మాండమైన 350 చదురపుమైళ్ల తటాకమును నిర్మించెను. తాను పోషించు కళలకును విద్యలకును నిలయముగా ధారానగరములో నొక కళాశాలను నెలకొల్పెను. కవులు మాత్రమేగాక సకలశాస్త్రములు నెఱింగిన పండితులును వేదాంతులును వైద్యులును ఆ మహాభవనమున విద్యావ్యాసంగము చేయనారంభించిరి. నిరంతరము విద్యార్థులును పండితులును ఆరాధించుటకు అందు చక్కని సరస్వతీమందిరమునుకట్టి దేవీవిగ్రహమును ప్రతిష్ఠించెను. శత్రువుల బాధల నెదురుచూచియే జాగ్రత వహించినాడు రాజకవి. నేడితని తటాకము వట్టిబయలు, ఈతని సంస్కృత విద్యాభవనము మహమ్మదీయుల మసీదు. సరస్వతీ విగ్రహము పురావస్తుశాఖవారు ప్రదర్శనశాలకు చేర్చిరి. ఈ రాజధాని మార్పు చేయుటకు ఇతడు మూడవవాడు. గంగైకొండ చోళుడు మొదట, సోమేశ్వరుడు తర్వాత, ఇప్పుడు ఇతడు. ఇకముందు రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రవరమును నిర్మింపనున్నాడు.

భోజ ప్రబంధమును వ్రాసిన బల్లాలకవికి ఈచరిత్ర తెలియనందువలన ముంజుడు పినతండ్రియని యొక యపభ్రంశవార్త వినియుండి ధారానగరముయొక్క ప్రతిష్ఠనే యెరిగియుండినందువలన—'స్వస్తి శ్రీ ధారారాజ్యే సింధుల సంజ్ఞో రాజా చిరం ప్రజాః పర్యపాలయత్' అనియు కాళిదాస కృత భోజ చరమ శ్లోకమున

అద్య ధారా నిరాధారా నిరాలంబా సరస్వతీ

అని కాళిదాసనగా మారువేషమున నుండిన భోజుడు మరణింపగా మరల—అద్య ధారా సదాధారా సదాలంబా సరస్వతీ—అని మార్చి చెప్పెననియు వ్రాసియున్నాడు. ఈ చమత్కారము పరవాలేదుకాని సింధులుడు ధారానగరముననుండినవాడు కాడు.

భోజుని కడపటి దినములు

భోజుని చివరి కాలమును గురించి సంస్కృత వాఙ్మయమందలి చారిత్రక గ్రంథములు భిన్నరీతుల పలుకుచున్నవి. మేరుతుంగుడు ప్రబంధ చింతామణిలో నిట్లు వ్రాసెను:— అణహిల్ల నగరమును పాలించుచుండిన చాళుక్య భీముడు భోజుని కొట్టలేక

సమయముకొరకు కాచియుండెనట. ఇట్లుండగా దాహళపాలకుడైన చేదిరాజు కర్ణునికిని భోజునికిని బెడిసినది. వెంటనే భీముడు కర్ణునితో చేరెను. కర్ణునికి నూటముప్పదియాఱుగురు రాజులు సహాయపడిరి. కర్ణుడు భీముడును భోజుని సొత్తును సమముగా పంచుకొనునట్లు ఏర్పాటు. మాళవమును జయించిన తర్వాత వీరిలో వీరికి అభిప్రాయభేదము లేర్పడినవట. కర్ణుడు కొల్లగొట్టిన సొత్తును పూర్తిగా తానే అపహరించెనట. అంతట భీముని మంత్రి ఉపాయశాలి, కర్ణుడు నిద్రపోవుచుండగా నాతని బంధించి, అతని కడనుండి బంగారపు వెల పొడుగు దేవాలయ ప్రతిమను, శివుని ప్రతిమను సంపాదించెనట. ఈ రాజులచే ముట్టడింపబడి భోజుడు, మంత్రమునకు కట్టువడిన ఘోరసర్పము, కోఱలు తీసివేయగా, ఆశలుడిగి, బలహీనమై పోవునట్లు కాంతిహీనుడు కాగా, ఇంతలో నొక తీరని వ్యాధి పట్టుకొనగా ముట్టడి జరుగుచుండగానే గతించెను—అని.

తర్వాతి కాలపు అణహిలపాలకుడు చౌళుక్య కుమారపాలుడు 'తనకు పూర్వుడైన భీముని గుఱ్ఱములు పంచధారలలో (గుఱ్ఱపు నడకలలో) నేర్పుగలవి క్షణములో ధారానగరమును, మాళవరాజధానిని చేరినవి' అని తన వడనగర ప్రశస్తియందు వ్రాసికొనియున్నాడు. కీర్తి కౌముదియను ప్రశస్తి కావ్యము భీముడు భోజుని జయించెను గాని ప్రాణములతో వదలెననుచున్నది. సుకృత సంకీర్తనము కావ్యము భోజుడు భీముని జయించెననుచున్నది. కుమారపాల చరితమను ప్రాకృత కావ్యము భీముని తేజముముందు భోజుడు నిస్తేజుడాయె ననుచున్నది. హేమచంద్రుడు భీమ భోజుల యుద్ధ ప్రస్తావమేమియు చేయడుగాని కర్ణుడు భోజుని నోడించెననియు, తర్వాత భీముని మంత్రి దామోదరుని ఒత్తిడివలన భీమునికి మండపికను (ప్రదేశమా? పై బంగారు మంటపమా?) ఇచ్చెననియు వ్రాసినాడు.

వీటియన్నిటికన్న పశ్చిమచాళుక్యుల శాసనములలోను కావ్యములలోను ఎక్కువ విషయమున్నది. భోజుని తుదముట్టించినవాడు చాళుక్య సోమేశ్వడుగా కనబడుచున్నాడు. విక్రమాంకదేవ చరిత్రమున బిల్హణుడు, సోమేశ్వరుడు ధారను 'భోజక్ష్మాపాల విముక్తధార'నుగా చేసెననియు, 'ధారాం కబళీ చకార'యనియు చెప్పియున్నాడు. చాళుక్యుల సామంతులైన హొయసలుల శాసనములలో కొన్నివివరములు కనబడుచున్నవి. హొయసలరాజు ఎరెయంగడు (ఎరెగంగడనియు) మాళవమునకు సోమేశ్వరుని యనుసరించి పోయియుండెను. చాళుక్యు లెంత ప్రయత్నించినను మాళవపతియొక్క కోట లొంగకపోగా, తన చక్రవర్తి చూపులో తాము సైన్యము నడిపి, పరాక్రమముచూపి సాధించెనట. మఱియొక శాసనములో ఇతడే, ధారా పూర్వకముగా, అగ్నిసాక్షిగా మాళవవిజయశ్రీని పెండ్లాడెనట. అనగా **ధారానగరమును జయించి తగులబెట్టెను.**

బేలూరులో దొరకిన యొక తర్వాతి శాసనమిట్లున్నది. 'సుప్రసిద్ధమైన ధారానగరము పరాక్రమవంతులైన మాళవరాజుల కాశ్రయము. ఎల్లరాజులను జయించిన భోజమహారాజుచేత విస్తరింపబడినట్టిది. ఉత్తరదిగ్విజయకాలమున, సకలశత్రువులను కబళించుచుండిన ఎరెయంగనికి మొదటి ఆపోశనమాయెను. ఇతని పరాక్రమమును ఏమని వర్ణింపగలము. ఎల్లవారి దృష్టులను నిరోధించుచు, దిక్కుంజరముల దంతములనుకూడ నల్లగా కనబడునట్లు చేయుచు, భూనభోంతరాళమును పూర్తిగా పొగచే మేఘాచ్ఛన్నమువలె కనబడచేయుచు ఈతని ప్రతాపాగ్ని భోజుని నగరమును క్షణములో దహించివేసినది. తన ప్రభువైన సోమేశ్వర చక్రవర్తియొక్క విజయస్తంభమోయనునట్లు భూమ్యాకాశములకు ఒక్కటే పొగస్తంభమును లేవనెత్తి, భోజుని వినాశకసూచకమైన తన ప్రభుభక్తిరాగమో యనునట్లు అగ్నిజ్వాలలు లేచుచుండ, శత్రువులను చంపుచు, ఊళ్లను తగులబెట్టుచు, దిక్పర్వతములను కనబడనీయక తెరగట్టినట్లు దుమారమును రేపుచు సైన్యము నడిపిన ఇతనికన్న పరాక్రమవంతుడెవడు.'—అని. మఱియొక శాసనమందు నిట్లున్నది:— 'ఇతని నిరర్గళమైన ప్రతాపాగ్ని ఖండవమును పూర్తిగా కబళించినది, వింధ్యసానువుల యందలి మండవమును తగులబెట్టినది. ఉదపురమును పట్టుకొన్నది.'—అని. ఇందులో మండవము (మండపికయగునా?) ధారానగరమునకు పదునాలుగుమైళ్ల దూరమందలి నేటి మాండు; పరమారులనాటి గొప్పకోట. ఖండవమేదో మాళవమందలి యొక కోటగానే యుండవలయును. ఏఱయన భారతకథకు ఇచట ఎట్టి ఉపమానముగాని, ధ్వనిగాని నిబంధింపబడినట్లు కానరాదు. ఉదపురము నిస్సందేహముగా రాజపుత్రస్థానమందలి ఉదైపూరే.

ఈ ఎరెగంగ హొయసలుడుగాక సోమేశ్వరుని ఇతర దండనాయకులను సామంతులును తాము భోజుని కొట్టినట్లు చెప్పుకొనియున్నారు. గుండమయ్యయను దండనాయకుడు తాను నర్మదానదముయొక్క ఉభయపార్శ్వములయందు విహరించిన రాజహంసయనియు, మాళవజన వినాశ ధూమకేతువనియు, మండవమను దుర్గమునుపట్టి ధారానగరమందు చాలగౌరవము నందెననియు చెప్పుకొనియున్నాడు. కాకతీయ రెండవ బేతరాజు ఖాజీపేట శాసనములో తాను 'చోళమాళవమదేభవ్యాఘ్ర' యన్నాడు. కాళిదాస దండనాథుని రెండవ కుమారుడు జాచరసు, మాళవమును ఇతర ప్రదేశములను జయించెనని నాగాయి శాసనములో కలదు. ఇతని సోదరుడు మధుసూదనుడు ధారానగరమును జయించి భోజుని వెడలద్రోలెనట. మహాసామంతాధిపతి మహాప్రచండ దండ నాయకుడు వాగదేవుడనువాడు 'చోళకాలాన్తక

భోజభుజంగాహి ద్విష, ఘూర్జరమదమర్దన' అని కీర్తింపబడెను. జేమదసను నతడు 'భోజవినాశ'కాగ్నియట.

ఇదంతయు చాళుక్య సోమేశ్వరుని దండయాత్రలోనే జరిగియుండవలెను. భోజుని చివరి తారీఖు దొరకినంతవఱకు 1047 (తిలక్‌వాడా తామ్రశాసనము)అతని తర్వాత రాజా క్రీ. శ.1055లో రాజ్యమునకు వచ్చిన పరమార జయసింహుడు. ఇతడు భోజుని కుమారుడో లేక జ్ఞాతియో తెలియదు. భోజుని 'పాదానుధ్యాత' యని చెప్పుకొనుటచేత గౌరవము కలవాడు. కాని తాతతండ్రి కుమారుల పరంపరలు చెప్పుకొను నాచారము కొందరిలోవలె పరమారులలో కానరాదు. అందరును ఒకని వెనుక నొకరు 'పాదానుధ్యాత' యనియే చెప్పుకొన్నారు. 1047—1055 నడుమ కల్లోలములు స్పష్టమేగదా. ఆహవమల్ల సోమేశ్వరుడు 1047లో చోళులతో పోరాడుచుండినవాడు 1049 కి కరహాట కొంకణములకు వచ్చినాడు. 1047 నుండియు ఈతని బలగము ఇచ్చట ఆయత్త పడుచునేయున్నది. చోళుల దోపిడీలవలన పాడైన దేశమును వ్యవస్థలను చక్కదిద్దుకొనుచున్నామని అప్పటి శాసనములలో కనబడుచునే యున్నది. కొంకణమునందు శిలాహారరాజు ముంముణియను నతడు బలవంతుడు. ఠాణానగరమీతని రాజధాని. సోమేశ్వరుని సేనాపతి పులకేశి ఈ సందర్భమున ఠాణామీదికి పోయినదియు, మండపమును జయించిన బలములలో సోమేశ్వరుడు చోళులనడీకొనుటకు వచ్చినదియు సుప్రసిద్ధములేగదా. కొంకణమును పులకేశియు, రట్టరాజు కార్తవీర్యుడును సాధించుచుండ కర్ణాటకులును మిగిలిన రాజ సమూహమును మాళవమును కూల్చనారంభించిరి. భోజుడు లొంగలేదు. శత్రువులు గట్టిప్రయత్నములే చేయవలసియుండెను. ఈ సమయమున 1051 తారీఖులుగల చోళశాసనములలో రాజాధిరాజుకడకు ఆతడు ఏతగిరి ప్రాంతములందుండుగా పరమార ఉప్పలుని సంతతివారుపోయి ఆశ్రయించి ఉప్పలుని కిరీటమును, పూర్వము తైలపుడు జయించి తన విజయదుందుభికి కట్టియుంచిన దానిని మరల తమకు సంపాదించి పెట్టుడని కోరగా జయించి యిచ్చెనని యున్నది. ఇది భోజుని మరణానంతరమో లేక ఆతడు పంపిన రాయబారమో తెలియలేదు.

చాలవరకు క్రీ. శ. 1050 నాటికి భోజుడు గతించినట్లు తెలియుచున్నది. భోజుడే పంపియుండిన యెడల ఆ మాట స్పష్టముగానే ఉండియుండును. ఉప్పలుని వంశీకులని యున్నది. ఒకడని లేక బహువచనమున్నది. భోజునికి సంతానమున్నట్లు ఆధారములు దొరకనందున ఈ రాయబారము మాళవ సింహాసనముకొరకు దాయాదుల ప్రయత్నములలో నొక భాగము. చోళులు కిరీటమును సాధించి యిచ్చినట్లున్నారు గాని మాళవమునకు పోయిన జాడ లేదు. ఇచ్చట వారికి చేతినిండుగ పని యున్నది. వేంగిపోయినది. కర్ణాటకులు ఒక పాయ మాళవమున, ఒకపాయ కొంకణమున, ఒక పాయ వేంగియందుగా తమ సైన్యములను విడదీసియున్నారు. అంతేగాదు. ఈ రాయబారము శాసనస్థమగు నాటికి చాల జరిగియున్నది. చోళులు కర్ణాటక రాజ్యమందు మధ్యస్థలములకు వచ్చియున్నారు. మాళవమునకు తాము పోలేక పోయినను కర్ణాటకులు వడివడిగా వెనుదిరిగినట్టి పరిస్థితితెచ్చి పెట్టినారు. కంపిలి, ఏతగిరి కొల్లిపాకల కడనుండి వారు కదలినట్లు లేదు. వీరిని వెనుకకు రప్పించుట పులకేశికి కర్తవ్యమాయెను. ఆతడు వెంటనే కాంచీనగరము మీదికి దండు నడిపి ఆ నగరమును కాల్చెను. ఈ ఆకస్మిక సంభవమునకు సంభ్రాంతుడై రాజాధిరాజు ఇదుబు దెబ్బగా ఇదే సమయమని కల్యాణకటకమునే కాల్చి పక్కని శిల్పకళాఖండములను తమిళదేశమునకు కొనిపోయెను. ఈ విషయములు విన్న సోమేశ్వరుడు ఒక్క క్షణమైనను ఆగక కళ్యాణకటకమునకు వచ్చెను. ఇది మొదలు 1054 లో కొప్పం సంగ్రామమున రాజాధిరాజు మరణించువఱకును ఎడతెగని పోరాటములే. మరల 1055 వెనువెంటనే కర్ణాటకులు మాళవమునకు పోయి కొరవ కార్యమును పూర్తి చేసికొనివచ్చి యున్నారు. అది భోజుని కూల్చుట గాదు. అతని స్థానమందు తమవాని నుంచుట, క్రీ. శ. 1055 లో పరమార జయసింహుడు ధారాధిపతి. ఇతనిని కర్ణాటకులే ప్రతిష్ఠించి రనుటకు, ఇతని తర్వాత మాళవపతియైన వాని సాక్ష్యమే కలదు. 1059 లో జయసింహుని జయించిన పరమార ఉదయాదిత్యుడు తన నాగపుర ప్రశస్తిలో నిట్లు చెప్పుకొన్నాడు. 'ఆతడు (భోజుడు) ఇంద్రునికి సహవాసికాగా, దేశము కల్లోలములపాలై దాని పాలకుడు అందు మునిగిపోగా, ఆతని బంధువు ఉదయాదిత్యుడు కర్ణాటకులతో చేరిన కర్ణప్రభువును సముద్రమునంటి వానిని జయించి, ఆదివరాహము భూమి నుద్ధరించినట్లు దేశము నుద్ధరించెను'—అని. అయిన్‌-ఇ—అక్బరీ గ్రంథము భోజుని కుమారుడు జయచంద్రుడని తెలుపుచున్నది. అట్టివాడు కానరాడు. జయసింహుడే జయచంద్రుడైన యెడల కర్ణాటకులకు లొంగియుండవలయును. కాని ఆతడు దాని పాలకుడు 'మునిగి' గదా పోయెను. ఆతని బంధువు జయసింహుని ఏల జయించును? కాబట్టి జయచంద్రుడు వేరు. భోజుడు గతించిన గందరగోళములోనే గతించెనేమో. ఉదయాదిత్యుని భోజుని అనంతర పాలకునిగా తర్వాతి (ఏడవ తరము) అర్జునవర్మ శాసనము చెప్పుచున్నది. 'పరమారకులోత్తంసః కంసజిన్మహిమా నృపః, శ్రీ భోజదేవ

ఇత్యాసీ న్నృపరాక్రాన్త భూతలః'...'తతోభూ దుదయాదిత్యో...' ఇదియు సందేహమే. వీరిరువురును దాయాదులు దీని వివరము ముందు. జయసింహుడు కర్ణాటకుల యాశ్రితుడు. ఉదయాదిత్యుడు 1051 లో చోళుల నాశ్రయించి అప్పుడు కుదురక ఇప్పుడు రాజ్యము గ్రహించియుండవలెను. ఇదంతయు చూడగా క్రీ. శ. 1050 నాటికే భోజుడు గతించెను. రణరంగమందు కాదు, మంచాన, వ్యాధివలన, వృద్ధాప్యమువలన. అటువెనుక చాళుక్యులు పోయి చోళులతో పోరాడి ఒకవిధముగా ఇంటిని చక్క బెట్టుకొని వచ్చునప్పటికి (1055) వీరిలో వీరికి స్పర్ధలేర్పడి మొదట భీముడును కర్ణుడును విడిపోయిరి. తర్వాత కర్ణుడును సోమేశ్వరుడును వివాదించుకొనిరి. దీనినే 'ఆహవ మల్లునిచే ధారాపురీలలామ విశీర్ణ కర్ణమై ఇంకను కీర్తి కర్ణాభరణములను దాల్పలేకున్న'దని విక్రమాంక దేవచరిత్రమున బిల్హణుడు వ్రాసెను.

భోజుడు 1050 లో గతించి, రాజాధిరాజ (1054) గతించులోపల ఎదురుచూడని ఆశ్చర్యకరమైన సంభవ మొకటి జరిగినది. అది రాజరాజ నరేంద్రుని రాజనీతి. తెలుగురాజు కర్ణాటకుల బలాధిక్యమును చోళుల బలహీనతను గుర్తించినాడు. భోజుడు కూడ పోయినాడు. ఈమారు వేంగిప్రవేశము చాల దుర్ఘటముగా నుండెను. నన్నయభట్టు సాయమున, అతని సహాధ్యాయిని, అతని బంధువులను చాళుక్యుల మంత్రులను వశీకరించుకొని, కర్ణాటకులకే మిత్రుడై, గౌరవముతోడి సంధి కుదుర్చుకొని వేంగిని సంపాదించి, రాజధానిని గోదావరికి తూర్పున రాజమహేంద్రవరమునకు మార్చి మునలితనములో పదేండ్లకాలము విశ్రాంతి నందెను. ఆంధ్ర మహాభారత రచనకు ప్రారంభింపజేసెను. రాజరాజ నరేంద్రుని తమ్ముని విజయాదిత్యుని కర్ణాటకులే తమ రాజ్యమందు నొళంబవాడికి ప్రభువుగా చేసిరి.

ఇది దొరికినంతవరకు భోజమహారాజునకును అతని పూర్వులకు ఆంధ్రులతోడి సంబంధపు చరిత్ర. రాజరాజనరేంద్రుని సమకాలికుడైనను పదేండ్లైనను పెద్దవాడుగా నుండియుండును. ఇతని వలెనే శైవుడు. అట్లే చేదిరాజులును. భోజప్రబంధరచయిత బల్లాలుడు వీరి మతము నెఱుగడు కాబట్టియే భోజుని వైష్ణవుడని వ్రాసియున్నాడు. 'తతోముంజే తపోవనం యాతే...స్వరాజ్యం బుభుజే భోజభూపతిః...కదాచిద్రాజ్ఞా...విప్రో లక్షితః...విప్ర ఆహ 'దేవ, త్వం వైష్ణవోఽసి, విప్రాణాం నోపద్రవం కరిష్యసి'...' ఇత్యాది.

భోజుడు మహాపండితుడును యోధుడును మాత్రమేగాక భర్తృహరివంటి వేదాంతిగాకూడ కనబడుచున్నాడు. తల్లిదండ్రుల పూర్వలోకహిత్య మపేక్షించి దానముచేయుచు ఇట్లు వ్రాసియున్నాడు. కాని ఈ శ్లోకము ఈతని పెదతండ్రి ముంజరాజు శాసనమందును కనబడుటచేత ఇది ఈ పరమారులకే ప్రధాన భావముగా కనబడుచున్నది.

'......శ్రీమద్ధారాయా మవస్థితై రస్మాభిః స్నాత్వా చరాచరగురుం భగవన్తం భవానీపతిం సమభ్యర్చ్య సంసారస్యా సారతాం దృష్ట్వా

వాతాభ్ర విభ్రమ మిదం వసుధాధిపత్య
మాపాతమాత్రమధురో విషయోపభోగః
ప్రాణాః తృణాగ్రజలబిన్దుసమాన నాణాం
ధర్మః సఖా పర మహో పరలోకయానే ॥
భ్రమత్సంసార చక్రాగ్ర ధారాధారా మిమాం శ్రియమ్
ప్రాప్య యేన దదు స్తేషాం పశ్చాత్తాపః పరం ఫలమ్ ॥
ఇతిజగతో వినశ్వరం స్వరూప మాకలయ్య...'

ఇతనికి ముంజుడు పెదతండ్రియన్నది ఇతడిచ్చిన వంశానుక్రమమున కలదు. కుమారుడనియో తమ్ముడనియో చెప్పుకొనక ఒకరికొకరు ఉత్తరోత్తరము పాదానుధ్యాతయని చెప్పుకొనియున్నారు. ఇదివరలో జయసింహునివలె 'పరమభట్టారక మహారాజాధిరాజ పరమేశ్వర శ్రీ సీయకదేవ పాదానుధ్యాత, పరమభట్టారక మహారాజాధిరాజ పరమేశ్వర శ్రీ వాక్పతిరాజదేవ పాదానుధ్యాత, పరమభట్టారక మహారాజాధిరాజ పరమేశ్వర శ్రీ సిన్ధుదేవ పాదానుధ్యాత పరమభట్టారక మహారాజాధిరాజ పరమేశ్వర శ్రీ భోజదేవః కుశలీ...'

ముంజరాజుకూడ పై శ్లోకములనే వ్రాసినాడు. అతడిచ్చిన భూదానము దశరూపావలోకనకర్తయైన ధనికపండితుని కుమారునికి. 'అహిచ్ఛత్ర వినిర్గతాయ ధామదక్షిణ ప్రవన్నాయ జ్ఞాన విజ్ఞాన సంపన్నాయ శ్రీమద్వసన్తాచార్యాయ శ్రీ ధనికపండిత సూనవే...' ముంజుడు తన పెద్దలను సీయకహర్షుని తండ్రి తాతలను పేర్కొన్నాడు. 'పరమభట్టారక మహారాజాధిరాజ పరమేశ్వర శ్రీకృష్ణరాజదేవ పాదానుధ్యాత, పరమ...ర శ్రీ వైరిసింహదేవ పాదానుధ్యాత, పరమ...ర శ్రీ సీయకదేవ పాదానుధ్యాత.' దీనినిబట్టిచూడగా సమకాలిక దక్షిణాపథ శాసనరచనా విధానము వీరి కింకను పట్టుపడలేదు, మనము తద్దినములలో పేర్కొనునట్లు తనకు పైన మూడు తరములను మాత్రము పేర్కొనుచుండిరని తెలియుచున్నది. అట్లే భోజుడు తండ్రిని, పెదతండ్రిని తాతను ముగ్గురిని మాత్రము పేర్కొనెను.

ఆంధ్రదేశమందు భోజుని గురించిన కథలు ఎట్లు వచ్చినవో తెలిసికొనవలసియున్నది. చాళుక్యులతో చేరినవారును చోళు

ంతో చేరినవారుమగా చీలిన ఈ జ్ఞాతులలో ఉదయాదిత్యుని పరంపర మాళవమందే నెలకొన్నట్లు అర్జునవర్మ శాసనముచేత తెలియుచున్నది. మఱియొకశాఖ చాళుక్యుల నాశ్రయించినది. క్రీ. శ. 1067 లో చోళరాజు వీరరాజేంద్రుడు మరల వేంగిపై దండయాత్రలు ప్రారంభించి బెజవాడకడచేసిన యొక యుద్ధముతో, చాళుక్య సోమేశ్వరుని సేనాపతులలో నొకడైన, ధారాపతి జననాథుని తమ్ముని జయించెనట. ఈ జననాథు డెవడో తెలియదు. అటుతర్వాత చాళుక్య ఆఱవ విక్రమాదిత్యుని కాలమునను అతని కుమారుడు మూడవ సోమేశ్వరుని కాలమునను ఒక పరమార జగద్దేవుడు కొల్లిపాక 7000 నాటిని పాలించుచుండెను. ఈ జగద్దేవుడు కాకతిప్రోలరాజుయొక్క రాజ్యప్రారంభదశలో క్రీ. శ. 1117 కు కొంత తర్వాత అనుమకొండను ముట్టడించి కాకతి ప్రోలరాజుచే తరుమగొట్టబడెను. ఈ జగద్దేవుడు కొల్లిపాకలో తాను వేయించిన యొక శాసనము (క్రీ. శ. 1104) తన్ను చక్రేశ్వరుడు (విక్రమాదిత్యుడు) పిలిపించి కుమారునివలె చూచుచుండెనని చెప్పుకొన్నాడు. క్రీ. శ. 1109 లో ఈ జగద్దేవుడే వేములవాడలో ప్రభువుగానున్నాడు. ఇతడు నిర్మించినదే వేములవాడలోని జగద్దేవనారాయణ దేవాలయము. గత సంవత్సర సంచిక (సాధారణ)లో ఇతనిని గుఱించి నా వ్యాసము (సామంతకాకతీయులు—కల్యాణీ చాళుక్యులు) అనుదానిలో వివరించియున్నాను. సబ్బిసాయిరము మొదట విక్రమాదిత్యుడు రెండవ బేతరాజునకు క్రీ. శ. 1090 ప్రాంతమున నిచ్చియుండి తర్వాత ఎందులకో మార్చి మఱియొకరి కిచ్చినాడు. జగద్దేవునికో లేక మఱియొకరికో తెలియదు. జగద్దేవునికై యుండదు. ఆతడు చాల చిన్నవాడు. విక్రమాదిత్యునే తండ్రివలె యెంచుచున్నాడుగాన ప్రోలరాజు సమవయస్కుడై యుండును. విక్రమాదిత్య రాజ్యకాలమున నడుమనున్నాడు. తన కొలనుపాక శాసనమందు (1104) తన వంశావళి నిట్లు చెప్పుకొన్నాడు. భోజుని తర్వాత అతని పినతండ్రి గొండలరాజు రాజాయెను. ఈ గొండలుడు ఇతరత్ర కానరాడు. అతని కుమారుడు ఉదయాదిత్యుడు. ఆతని కుమారుడు తాను జగద్దేవుడు. ఈ శాసనముచేత పై నిర్ణయము, భోజునికి సంతులేదనియు నాతని జ్ఞాతి సంతానమే జయసింహ ఉదయాదిత్యులనియు స్థిరపడుచున్నది. అర్జునవర్మ శాసనము ఉదయాదిత్యుని కుమారుడు నరవర్మ యనుచున్నది. నరవర్మ జగద్దేవులు సోదరులుగా నుండురా?

జగద్దేవుడు విక్రమాదిత్యునికి ఆశ్రితుడై తెలంగాణమందే నెలకొనెను. కాకతీయులతో సమానముగా విజృంభించెనుగాని ప్రోలరాజతని నణచెను. తమ పెద్దల సబ్బిసాయిరను ఇతనికి విక్రమాదిత్యు డిచ్చెను గదా యన్న ద్వేషముండును. అదియే 1117 లో ప్రస్తావింపబడినది. తర్వాత విక్రమాదిత్యుని యనంతరము జగద్దేవుడు అనుమకొండను ముట్టడించి యుండును. నడుమనెప్పుడో జగద్దేవునికి సబ్బిసాయిరము పోయినది. 1149 లో ప్రోలరాజు చాళుక్య జగదేకమల్లుని సామంతుడుగా సబ్బిసాయిరము నందున్నట్లు శనిగరం శాసనము. ఆ తర్వాత రుద్రదేవుని కాలమున 1159 లో మేడరాజు జగద్దేవుల విజయమును చెప్పు శాసనము నగునూరు (కరీంనగరుజిల్లా) లో దొరకినది. ఇది దొమ్మరాజాది చాళుక్య విక్రమ కాలమని (పొరపాటుగా) వ్రాయుటచే వీరు చాళుక్య సేనాపతులుగా కనబడుచున్నారు. దొమ్మరాజు మేడరాజులు ప్రోలరాజు శత్రువులు. కాకతీయులు పశ్చిమ చాళుక్యులకు ఎదురు తిరిగిన కాలముగాన ఈ జగద్దేవుడు పరమారుడుగా నుండునా? ఉండినయెడల చాలవృద్ధుడుగా నుండును. బసవ పురాణము ననుసరించి బసవేశ్వరుని యాజ్ఞచే నొక జగద్దేవుడు బిజ్జలుని చంపెనని యున్నది. సత్యాసత్యము లెట్లున్నను బిజ్జల కాలచుర్యుడు 1157 కల్యాణీరాజ్య మపహరించెను. పదేండ్లు 1167 వఱకు పాలించినట్లున్నాడు. 1159 లో కనబడు నీ జగద్దేవుడే ఈ పని యొనర్చెనో యేమో తెలియదు. ఏదియు నిర్ణయింపలేము గాని ఆంధ్రదేశమందు పరమారుల వంశస్థుల కుటుంబ మొకటి స్థిరపడిపోయినది మాత్రము నిజము. జగద్దేవుని సేనాపతి బ్రాహ్మణుడు మహాసాంధివిగ్రహికుడు మహాప్రచండ దండనాయకుడు సోమలదేవుడు కొల్లిపాకలో జగద్దేవనారాయణపురమని తన ప్రభువు పేర దేవాలయమును నిర్మించి శాసనమును 1104 లో వేసినందువలన మనకింత చరిత్ర తెలిసినది. అట్లు వచ్చినవారి పరంపర దేశమందు వ్యాపించి క్రమముగా భోజుని గుఱించిన కథలను చిత్ర విచిత్రములుగా అల్లుకొనుటకు కారణములైనవి.

బిల్హణుడు తన విక్రమాంక దేవచరిత్రమున తన చరిత్రమును వ్రాయుచు తాను భోజరాజు గతించిన యనంతరము ధారానగరమునకు పోయెనట. అచ్చట పాడైపోయి పూర్వవైభమును తెలుపు మందిరములలోను భవనములలోను ఉండి గుబాళించు పావురముల శబ్దములు అతనిని చూచి 'కవీంద్రుడా, ఇప్పుడు వచ్చితివే, భోజుడు జీవించియుండగా రాకపోయితివి గదయ్యా! ఆతడు నిన్ను ఎంత సన్మానించి యుండునో గదా?' అని. ఈ బిల్హణుడును చాళుక్య విక్రమాదిత్యుని యాస్థానమున నెలకొనెను.

ఇంకొక విశేషము గీర్వాణ భాషా కవులను గురించియు వారి పోషకులను గుఱించియు ఆంధ్రులకే ఎక్కువగా తెలిసి

యున్నది. ఇతరత్ర తెలియని విషయములు ఇచ్చట తెలియుచున్నవి. ఇటీవల బయలుపడి ప్రాచీనులు మరచిపోయియుండిన భాసుని శ్రీనాథు డెఱుగును. 'భాస సౌమిల్లిక ప్రతిభా సమున్మేష హేలా విశేషంబు నివ్వగించి' (శృం. నై. 1—7) శ్రీహర్షుడు (నైషధ కర్త) కాశ్మీరమందు జనించిన వాడని ఇతరులు చెప్పనిది శ్రీనాథుడు చెప్పినాడు. (కలియుగంబునయందు కాశ్మీర భూమిలో పవిత్రమున ధరామరుడు పుట్టి...' ఇత్యాది) కాళిదాసునకు ప్రతిస్పర్థియొక దిఙ్నాగుడని మల్లినాథునికి తెలిసినది చూడగా నిందులకు కారణము సంస్కృత విద్యా కేంద్రములు, కాశీ నవ ద్వీపములు, ఉజ్జయినీ కన్యాకుబ్జములనుండి క్రమముగా ఆంధ్ర కర్ణాటక దేశములకు దిగినవి. ఇంకను ఉత్తరదేశమున దొరకని అపూర్వ ప్రాచీన గ్రంథముల ప్రతులు దక్షిణ దేశమున దొరకుచున్నవి. పరమారులు పోగా సంస్కృతవిద్య కల్యాణీ చాళుక్యుల రాజా స్థానము నాక్రమించినది. సర్వజ్ఞ సోమేశ్వరుడు భాషనే గాక కళలను గూడ ఆదరించినాడు. స్వయము ఆడి చూపెడివాడట. తర్వాత ఓరుగల్లు సంస్కృతము నాదరించి విద్యానాథాదులను పోషించినది. తరువాత విజయనగరము వారును రెడ్డిరాజులును వెలమ ప్రభువులును ఆదరించినందున ఆంధ్రులకు ఆధిక్యము గలిగినది. ఇట్లు అనంతామాత్యుని కాలమునకు ఎంతో మారిపోయి క్రొత్త కథలే ఏర్పడినవి. ఇవన్నియు చక్కగా పరిశీలించి వాఙ్మయమందు కథలును భావములును వృత్తాంతములును ఎట్లెట్లు వ్యాపించినవో తెలిసికొనుట ఎంతయు మేలు. ఆంధ్రుల సంస్కృతి చక్కగా బోధపడును.

జీవన చైత్రం

శ్రీ పరిగి రాధాకృష్ణ

ఈ రోజు
ప్రశ్న వేసుకుందాం
జవాబు చెప్పుకుందాం
ఈ దృశ్యాన్ని మననం చేసుకుందాం.
నేటి విజ్ఞాన్ని మళ్ళీ నెమరేసుకుందాం
ఈ ఒడిదుడుకుల ఊబిలో
దిగబడి పోకుండా చూసుకుందాం.
కాని
ప్రశ్నకు జవాబు సరిగా రాదా
దృశ్యం కంటి కింపుగా లేదా
విజ్ఞాన్ని నెమరేస్తే చేదా
అయితే సరే
వెతుకుదాం కారణాలు
ఉగాది కవే తోరణాలు.
శూన్య శిశిరంలోకి ఎంతకాలం చూసేది.
చైతన్య చైత్రంలో అడుగు పెడదాం
ప్రతిబంధకాలు పుట్టెడున్నా
ప్రయాణాన్ని మానుకోలేం!

ఆ ప్రతిబంధకా లేవి?
నిస్పృహాయుత మంచుముద్దను
కరిగించడానికి కురిసే మొంటి కన్నీళ్ళు
గూడు కట్టిన దుఃఖాన్ని
చితగ్గొడితే సౌఖ్యం వస్తుందని
ఘోషించే గూడుపుఠాణీ మాటలు.
ఆకలీ నిద్రా వగ్గై రాలే బ్రతుక్కై
పట్టపగలే అవలక్షణాలు.
నడి సంద్రంలో నావ మునుగుతుంటే
నీటిమీద నడుస్తామనే నినాదాలు
స్వప్రయోజనానికై సాగిలబడినా

తప్పు లేదని సరిపెట్టుకునే తత్వాలు
అందమైన బొమ్మ విరిగి ముక్కలవుతుంటే
ఆనంద పారవశ్యంలో అరుపులూ ఒళ్ళు విరుపులూ.

పొందిన వరాన్ని నిలుపుకోలేని భస్మాసురు డొకడు
అందించిన చేతిని నిప్పులతో నింపేవా డొకడు
మభ్యపెట్టి మణికిరీటాన్ని నిలుపుకోవాలని మరొకడు
దీనుల ఆర్తిని దూది కింద లెక్క గట్టి
దిక్కులన్నీ తానే అయి వెలిగిపోవాల నింకొకడు.
చైత్ర రథానికి చేసిన అలంకరణ చూసి
ఓర్వలేక రథాన్ని మంటలపాలు చెయ్యాలని మరొకడు
వీళ్ళంతా
ఈ మట్టిని నమ్ముకుని మొలుస్తున్న
విత్తనాల్ని మరచిపోయారు.
తాముగా నీళ్ళు పోయటం మానేశారు
ఈ చెట్టు చిగిరిస్తే చూడలేరు
ఈ పచ్చదనాన్ని భరించలేరు.
అందుకే
దావానలా న్నాహ్వానిస్తున్నారు
ప్రభంజనాన్ని పురికొల్పుతున్నారు
ధ్వంసాధ్వంలో పయనిస్తున్నారు.
చైతన్య తరంగాల కంకితమైన ఈ సముద్రాన్ని
చెక్కు చెదరని విశ్వాసానికి ప్రతీకైన హిమనగాన్ని
ఆశల అరుణ కిరణాలలో మేల్కొనే జీవితాన్ని
విస్మరించారు
విర్రవీగుతున్నారు !

విత్తు వృక్షానికి మూలమౌతూనే వుంది.
చావుని పుట్టుక పరిహసిస్తూనే వుంది.
దుఃఖాన్ని చిరునవ్వు ఊరడిస్తూంది.
దిక్కుల్ని మానవత ముడేస్తూనే వుంది.
ఎందరు వేటగాళ్ళు తరిమినా
ఈ జింక ఇంకా ప్రాణాలతో వుంది.
ఎంత స్వార్థం వరదలై పారినా

త్యాగాల ఈ మొలక ఇంకా నిలిచే వుంది
కొడుకెంత భ్రష్టుడైనా
కన్నతల్లి కడుపు తీపి మిగిలే వుంది.
ఎన్ని కాళ్ళు తమని తొక్కుతున్నా
జనంలో నిబ్బరమింకా నిలిచే వుంది.
ఇంత అనలాన్ని దాచుకునీ
ఇంకా భూమి తిరుగుతూంది!

పీడకల లెన్ని పట్టి కుదిపినా
పట్టుదల వీడని వ్యక్తిత్వం
నియంతల్ని మట్టుబెట్టి
ధరిత్రిను సమ్మానించిన స్వేచ్ఛా ప్రియత
కొండంత రాక్షసత్వాన్ని
కొన గోటితో త్రుంచగల నైతిక సాహసం
సవాలక్ష సమస్యల తొక్కిడిలోనూ
ఆగకుండా వినిపిస్తున్న జీవన సంగీతం
కొనసాగింతకాలం
రాజ్య కాంక్షలు రాళ్ళ కుప్ప లవుతాయి.
అధికార గర్జనలు అడవులు పట్టి పోతాయి.
అసూయా ద్వేషాలు దూది పింజ లవుతాయి.
వందనా శిల్పాలు తల వంచుకుంటాయి.
కుట్రలు కుప్పగా కూలి కృశించి నశిస్తాయి.
ఈ యుగాల పాఠాన్ని నెమరేస్తే
మానవతా సూత్రాల సంపుటాన్ని తిరగేస్తే
ఆశ చిగురిస్తుంది
అనంత చైత్రం స్ఫురిస్తుంది!

చరిత్ర నేర్పుతున్న పాఠాలు

శ్రీ కల్లూరి బసవేశ్వరరావు

"History is not merely a warning reminder of man's follies and crimes, but also an encouraging remembrance of generative souls .... a spacious country of the mind, wherein a thousand saints, statesmen, inventors, scientists, poets, artists musicians, lovers, and philosophers still live and speak, teach and carve and sing......." WILL AND ARIEL DURANT.

1

క్రమ పద్ధతిలో ఏర్పాటుచేయబడిన జ్ఞానాన్ని శాస్త్రమంటారు. ఈ దృష్టితో చూచినప్పుడు చరిత్ర కూడ ఒక శాస్త్రమే. చరిత్ర జడ జగత్తును గురించి గాని, జీవ జగత్తును గురించి గాని పరిశోధన చేయదు. మానవ నిర్మితమైన సాంఘిక జగత్తు చరిత్రకు పరిశోధనా మందిరం. కాగా చరిత్ర ఒక సాంఘిక శాస్త్రం.

సాంఘిక జగత్తు బహుముఖమైనది. సాంఘిక ప్రపంచ సర్వస్వాన్ని చరిత్ర ఒక్కటే పరిశోధించి, పరిశీలింపలేదు. అందు చేత రాజ్యవ్యవస్థను అధ్యయనం చేయటానికి రాజనీతి, ఆర్థిక వ్యవస్థను అధ్యయనం చేయటానికి అర్థికశాస్త్రం వంటి పెక్కు సాంఘిక శాస్త్రాలు ఆవిర్భవించినాయి. చరిత్ర కూడ వాని వలె ఒక సాంఘికశాస్త్రం.

మానవులందరు ఒకే కుటుంబానికి చెందినవారనే నమ్మకం ఉన్నప్పటికీ, చరిత్రజ్ఞుడు దేశకాలభేదాలను పాటింపక తప్పదు. ప్రపంచమానవులు వివిధదేశాల్లో నివసిస్తూ 'మేము భారతీయులం' 'మేము అమెరికా వాసులం' అనే జాతీయభావాన్ని కలిగివుండటమే అందుకు కారణం. పైగా ఆయాదేశాల భౌగోళిక పరిస్థితులు, అక్కడ అభివృద్ధిచెందిన రాజకీయ, సాంఘిక, ఆర్థికవ్యవస్థలు ఆ దేశప్రజల సంస్కృతి స్వరూప స్వభావాల పరిణామాన్ని తీర్చి దిద్దుటకూడ మరొక కారణం. కాగా చరిత్రవేత్త వివిధదేశాలను ప్రత్యేక భూఖండాలుగా అంగీకరించి, ఆయాదేశాల ప్రజల చరిత్రను అధ్యయనం చేస్తున్నాడు. అయితే యేదేశమూ మరొక దేశంతో సంబంధాలు లేకుండా తనకు తానుగా మనజాలదు. అభివృద్ధి చెందలేదు. కనుక చరిత్రజ్ఞుడు ఒకదేశ నాగరికతా పరిణామానికి అన్యదేశాల నాగరికత ఎంతవరకు తోడ్పడిందనే అంశాన్నికూడ అజలోకి తీసుకొనక తప్పదు.

జాతీయరాజ్యాలయొక్క, ఖండాలయొక్క చరిత్రను వివరించే గ్రంథాలు ఎక్కువగా వస్తున్నప్పటికీ, ప్రపంచాన్నంతా ఏకఖండంగా భావించి, మానవజాతి నాగరికతా పరిణామాన్ని వివరించే చరిత్రగ్రంథాలుకూడ కొందరు పండితులు వ్రాశారు. హెచ్. జీ. వెల్సు రచించిన 'ప్రపంచచరిత్ర' విల్ డ్యురంట్ రచించిన 'నాగరికతయొక్క కథ' (10 భాగాలు) 'యునెస్కో' వారు తయారు చేస్తున్న 'మానవజాతి చరిత్ర' ఈ కోవలోకి వస్తాయి.

చరిత్రను 'మానవనాగరికతా పరిణామాన్ని విశదీకరించే సాంఘికశాస్త్రం' అని నిర్వచింపవచ్చును. అయితే నాగరికత అంటే యేమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కొందరు నాగరికత వేరు, సంస్కృతి వేరు, అని భావిస్తారు. మానవులు ఉపయోగించే సాధనాలూ, వస్తువులూ నాగరికతను సూచిస్తాయనీ—వారి ఆలోచనలు, సాహిత్యం, వేదాంతం, మతం సంస్కృతిని ప్రతిబింబిస్తాయనీ వారు వ్యాఖ్యానిస్తారు. నాగరికత బాహ్యమైనదనీ, సంస్కృతి అంతరమైనదనీ ఈ వ్యాఖ్యాన సారాంశం. ఈ విధంగా నాగరికతనూ — సంస్కృతినీ విడదీసేకంటె— వానిని కలిపి చూడటం యుక్తం. అవి రెండూ ఒకే నాణెమునకున్న రెండు ముఖాలవంటివి. శాస్త్రాలూ—కళలూ—సాధనాలూ—వస్తువులూ—లని సౌలభ్యం కోసం విభజించినా అవన్నీ మానవుల కృషి ఫలితాలే.

సంస్కృతి వికాసానికి తోడ్పడే సాంఘిక పద్ధతియే నాగరికత. సంస్కృతి వికాసానికి ఆలవాలమైన ఆలోచనలను, వైజ్ఞానిక సంపత్తిని, తాత్త్విక చింతనాన్ని, మతాలనూ, సాంఘిక, ఆర్థిక రాజకీయ వ్యవస్థలనూ, సాహిత్యాన్నీ, లలిత కళలనూ నాగరికతగా భావింపవచ్చు. నాగరికతకు విల్ డ్యురంట్ ఇచ్చిన నిర్వచనం స్పష్టంగానూ, సమగ్రంగానూ ఉన్నది.

"Civilisation is a social order promoting cultural creation. It is political order secured through custom. morals and law; and economic order secured through a continuity of production and exchange; it is cultural creation through freedom and facilities for the origination, expression, testing and fruition of ideas, letters, manners and arts. It is an intricate and precarious web of human relationships, laboriously built and readily destroyed."

చరిత్ర నేర్పుతున్న పాఠాలను పరిశీలించేముందు చరిత్ర తత్త్వాన్ని గురించి రేఖామాత్రంగా వివరిస్తాను. మానవుని పరిసరాలను పరిశీలించి విశదీకరించటం శాస్త్రాల లక్ష్యం. అటు వంటి విశదీకరణవల్ల మనిషి పరిసరాలను అర్థంచేసుకొనటమే గాక, వానిపై అదుపునూ, వానిని మార్చగల సమర్థతనూ సంపాదించుకొంటాడు. ఈ లక్ష్యానికి చరిత్ర అపవాదం కాదు. 'నాగరికతా పరిణామాన్ని విశదీకరించే సాంఘికశాస్త్రం చరిత్ర అని

చెప్పితిని. గనుక చరిత్రవేత్త వర్తమాన నాగరికతా ధోరణులను విశదీకరించటానికి యత్నిస్తాడు. అతని కృషివలన సామాజికులకు తమ నాగరికతయొక్క గుణాగుణాలు తెలుస్తాయి. తదభివృద్ధికై వారు నిర్వహింపవలసిన నిర్మాణాత్మకమైన పాత్రకూడ అవగత మవుతుంది. ఈ కృషి సాఫల్యం చెందాలంటే చరిత్రవేత్త గతాన్ని పరిశోధించాలి, పరిశీలించాలి. వర్తమానానికి గతం పునాది. గత నాగరికత నుంచే వర్తమాన నాగరికత ఆవిర్భవించినది. కాగా చరిత్ర గతానికీ వర్తమానానికీ మధ్య డైలాగ్‌వంటిది. ఈ డైలాగ్‌ను నడిపేవాడు చరిత్రజ్ఞుడు. చరిత్ర ఒక సాంఘిక ప్రవంతి (A Social Process). ఈ ప్రవంతిలో గతాన్ని వర్తమానం సహాయంతోను, గతంయొక్క తోడ్పాటుతోనూ అర్థం చేసుకోవటం జరుగుతుంది. గత సమాజాన్ని అర్థం చేసుకొనే సమర్థతను మనిషికి కల్గించడమేగాక, వర్తమాన సమాజంపై వాని అదుపును పెంచటానికికూడ చరిత్ర ఉపయోగపడుతున్నది.

[“To enable man to undertsand the society of the past and to increase his mastery over the societyof the present is the dual function of history”

— by E. H. Carr]

'ధ్రువీకరింసబడిన చారిత్రకాంశాల కూడలియే' చరిత్ర అని కొందరంటారు. ఈ నిర్వచనం ఎంతవరకు యదార్థం? చరిత్రాంశాలు లేకుండా చరిత్రవేత్త పరిశీలింప గలిగినదేమీ లేదు. చరిత్రాంశాలు వానికి ముడి సరుకువంటివి. అయితే చరిత్రాంశాలు ఒక చోట పోగుపడి వుండవు. పురాతన వస్తుతత్త్వశాస్త్రంవల్ల శాసనాల పరిష్కరణవల్ల, నాణెముల పరిశీలనవల్ల, గ్రంథపరిశోధనవల్ల చరిత్రాంశాలు లభిస్తాయి. ఇటువంటి మూలాధారాల పరిశోధనకు ప్రత్యేక నైపుణ్యం కావాలి. అలాంటి ప్రత్యేక నైపుణ్యం ఉన్న పండితు లందరూ చరిత్రవేత్తలు కాకపోవచ్చు. ఎందుకంటే వారు ధ్రువీకరించిన అంశాల నన్నింటినీ సంకలనంచేసి ఒక దండగా ఏర్పాటుచేస్తే అది చరిత్ర అవ్వుతుందా? అటువంటి సంకలనంవల్ల నాగరికతా పరిణామం తెలుస్తుందా ?

మూలాధారాలవల్ల లభిస్తున్న బహుళ సమాచారంలో ఏవి చరిత్రాంశాలో నిర్ణయించవలసినది చరిత్రజ్ఞుడు. వాని సాయంతో నాగరికతా ప్రవంతిని హేతుబద్ధంగా విశదీకరింపవలసినది కూడ చరిత్ర వేత్తయే. అవసరమైనపట్ల అతడు ఇతర శాస్త్రాల సాయాన్ని తీసుకొంటాడు. జీవ భౌతిక శాస్త్రాల పరిశోధనలూ, మానవ వికాసశాస్త్రంవల్ల లభించే జ్ఞానమూ, అతనికి తోడ్పడతాయి. అనేక సాంఘిక శాస్త్రాలు అందించే విజ్ఞానాన్ని అతడు తప్పక ఆజలోకి తీసుకొంటాడు. కనుక ధ్రువీకరింపబడిన అంశాలను దండగా కూర్చితే చరిత్ర అవుతుందనుకోవటం సరియైన అభిప్రాయం కాదు. అంశాలను విశదీకరించటం (To explain the facts) చరిత్రజ్ఞుని మౌలికమైన కృషి.

ఒక దృక్పథం లేకుండా చరిత్రవేత్త చరిత్రాంశాలను విశదీకరింపలేడు. ఇది నిర్వివాదమైన విషయమే. కాని ఏ దృక్పథాన్ని అతడు అనుసరించటం యుక్తమో నిర్ధారింపవలసిన విషయం. ఎందుకంటే సరియైన దృక్పథంలేని చరిత్రకారుడు వ్రాసిన చరిత్ర గ్రంథాలవల్ల సంపూర్ణ జ్ఞానం కలుగకపోగా, అనర్థాలు కూడ సంప్రాప్తమౌతాయి.

చరిత్ర రచనలో గోచరిస్తున్న విభిన్న దృక్పథాలు తెలిసికోవటం ఆసక్తికరంగా వుంటుంది. ఒక జాతిని (Race) ప్రధానంగా భావించి, ఆ జాతి దృక్పథంతో చరిత్రను వివరింపవచ్చు. విభిన్న మానవ జాతులలో ఆర్యజాతి శక్తిసామర్థ్యాలు ఉన్నతాలని భావించి, మానవ నాగరికతలోని మహత్తర విజయాలను ఆర్యజాతియే సాధించిందని కొందరు భావింపకపోలేదు. జాతి దృక్పథంతో చరిత్రను పరిశీలించటం శాస్త్ర విరుద్ధం. జాతి పవిత్రతా సిద్ధాంతాన్ని జీవశాస్త్రం గాని, మానవ వికాసశాస్త్రం గాని ధ్రువీకరించటం లేదు.

మత దృక్పథంతో చరిత్రను పరిశీలింపవచ్చు. చరిత్రకారుడు తాను మెచ్చిన, తనకు నచ్చిన మతానికి కిరీటం పెట్టి, ఆ మత ప్రభావంవల్లనే నాగరికత పరిఢవిల్లినదనీ, దాని పతనమే నాగరికత క్షీణతకు కారణమైనదనీ భావింపవచ్చు. భారతదేశ చరిత్రలో గుప్తయుగం హైందవ స్వర్ణయుగమని భావించటం మతదృక్పథానికి మచ్చుతునక. ఔరంగజేబు పాలనకాలం ఇస్లాంయుగస్వర్ణయుగ మనుటయూ మత పరమైన వ్యాఖ్యానమే. ఇక సంఘంలో వున్న అవినీతికీ, అధర్మానికీ కారణం మత విశ్వాసాలు సడలిపోవటమేగాక నాస్తికత్వం ప్రబలట మనేవారున్నారు. అయితే మత విశ్వాసాలు తగ్గిపోవటానికి కారణ మేమిటి? మతంలోని లోపాలా? సంఘంలో వస్తున్న మార్పులా? మతమూ, మతసంస్థలూ మానవనిర్మిత బృహత్తర సామాజిక వ్యవస్థలో ఒకభాగమైనప్పుడు మొత్తం నాగరికతా పరిణామాన్నే మతానికి ముడిపెట్టి వ్యాఖ్యానించటం దోషమే గదా? మతవిశ్వాసాలూ, మతసంస్థలూ మానవజీవితాన్ని శాసించిన మధ్యయుగాల చరిత్రలో వాని ప్రాబల్యం హెచ్చుగా కనపడుతున్నది గాని, నవీన యుగంలో సెక్యులర్ భావాలు వ్యాప్తి చెందుతున్నవి.

రాజవంశాలను కేంద్రంగా చేసి వ్రాయబడిన చరిత్ర గ్రంథాలు మనకు చిరపరిచితాలు. మన కళాశాల విద్యార్థులకొరకు వ్రాయబడిన 'భారతదేశ చరిత్ర' పాఠ్యగ్రంథాలు 'రాజవంశాల' చరిత్రతో నిండివుండటం సర్వవిదితం. 'డైనాస్టిక్ దృక్పథం'వల్ల చరిత్ర ఒక సాంఘిక వాహిని (Social process) అనే విషయం మరుగున పడుతున్నది. ప్రజల జీవనపద్ధతుల్లో, సాంఘిక, ఆర్థిక వ్యవస్థల్లో, లలిత కళల్లో వచ్చిన మార్పులు ప్రస్ఫుటంగా వుండవు. చరిత్ర ప్రజల చరిత్రకాక, వారి నాగరికతా పరిణామాన్ని వివరింపక—రాజవంశ కథావళిగా దిగజారిపోతున్నది.

'మహాపురుషుల జీవిత చరిత్రలే మానవ చరిత్ర' అనే సిద్ధాంతాన్ని ఆంగ్ల రచయిత కార్లైల్ ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతాన్ని బలపరిచే ఉదాహరణలు చరిత్రలో చాల ఉన్నాయి. బుద్ధుడు, ఏసుక్రీస్తు, అశోకుడు, నెపోలియన్, లింకన్, లెనిన్, గాంధి, మావో—ఈ విధంగా అనేక మహాపురుషులను ఏకరువు పెట్టవచ్చు. నెపోలియన్, బిస్మార్కు, లెనిన్‌ల జీవితచరిత్రలే నవీనయుగ యిరోపా చరిత్ర అని ఒక చరిత్రజ్ఞుని భావన. బాల

గంగాధరతిలక్, గాంధి, నెహ్రూల జీవితాలే 20 వ శతాబ్దపు భారతదేశ చరిత్ర అని ఈ సిద్ధాంత ప్రేమికులు ప్రతిపాదింపవచ్చు. అయితే 'మహాపురుషుల సిద్ధాంతం'లో ఒక ప్రమాదం వుంది. మహాపురుషులు అవతార పురుషులని భ్రమపడటానికి ఆస్కారం వుంది. వారిలో దైవాంశ ఉందనియూ, వారు అతీత మానవులనియూ భావించటానికి వీలున్నది. 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని భగవద్గీతలో చెప్పబడినది గదా!

మహాపురుషులు దైవాంశ సంభూతులు కారు. అలా అనుకొంటే చరిత్ర వివరణలో సంఘంయొక్క ప్రాధాన్యం ఎగిరిపోతుంది. మహాపురుషులూ—మహానాయకులూ దేశకాలాలకు బద్ధులే. తాము పుట్టి పెరిగిన సమాజ ప్రభావానికి లోనైనవారే. వారిపైన సమాజపు ముద్ర వుంటుంది. వారు సమాజాన్ని సంస్కరిస్తారు; నడిపిస్తారు. వ్యక్తికీ—సంఘానికీమధ్య ఉన్న అవినాభావ సంబంధమే మహాపురుషులకూ—సంఘానికీ మధ్య ఉన్నది. బిస్మార్క్ 18 వ శతాబ్దిలో జన్మించివుంటే జర్మనీ ఐక్యం వంద సంవత్సరాలు ముందుగానే సాధింపబడి వుండేదని కొందరంటారు. కాని బిస్మార్క్ 18 వ శతాబ్దిలో ఎలా జన్మిస్తాడు? ఆయన 19 వ శతాబ్దిలో జన్మించాడు గనుకనే జర్మనీ ఐక్యతను సాధింపగలిగాడు. మహాత్మాగాంధి 1970 లో వుండి వుంటే భారతదేశ చరిత్ర మరొక రకంగా వుంటుందన్నారనుకోండి. నేటి పరిస్థితుల్లో గాంధీ అప్రతిహతమైన నాయకుడుగా చెల్లివుండేవాడా? గాంధి నాయకత్వాన్ని మలచిన అంశాల్లో ఆయనలోని విశిష్టగుణాలేకాక, నాటి సాంఘిక పరిస్థితుల ప్రాబల్యంకూడ వున్నాయి. మహావ్యక్తుల పాత్రను అంచనావేసేటప్పుడు, వారిని తమ పరిసరాలనుండి వెలుపలకు లాగటం సమంజసంకాదు. వారు తమ సమకాలీన సాంఘిక శక్తులకు ప్రతినిధులు. కొందరుమహావ్యక్తులునాటి సాంఘికశక్తులకు నాయకత్వం వహిస్తారు. మరికొందరు — లెనిన్‌వంటివారు — నూతన సాంఘిక శక్తులను సృష్టించి, చరిత్ర పరిణామానికి దోహదం చేస్తారు. ఇంకా కొందరు—కారల్‌మార్క్స్‌వంటివారు — సమకాలముకంటె భవిష్యత్తులో ఎక్కువ ప్రభావాన్ని కల్గిస్తారు.

మరియొక విషయం. మహాపురుషుల నాయకత్వాన్ని అంగీకరించి వారివెంటనున్న జనబాహుళ్యాన్ని తక్కువగా అంచనా వేయకూడదు. ఒక్కొక్కప్పుడు మహాపురుషులు సైతము సమకాలిక పరిస్థితులకు తలవొగ్గి, తమ వ్యక్తిగత అభిప్రాయాలకు తిలోదకాలివ్వ తప్పదు. మహాత్మాగాంధి భారతదేశ విభజనకు వ్యతిరేకి. అయినా ఆయన తన అనుయాయుల నిర్ణయాన్ని ఆమోదింపలేదా? మహానాయకులను సాంఘిక పరిస్థితులకు అతీతముగావున్న 'అతీతమానవులు'గా భావిస్తే, దానివల్ల ప్రమాదం కూడ వుంది. హిట్లర్ అతీతమానవుడనుకోవటంవల్ల, స్టాలిన్‌చుట్టూ వ్యక్తిఆరాధనాతత్వం పెరగటంవల్ల మానవాళికి నష్టం జరిగినట్లు చరిత్ర చెప్తున్నది.

మహాపురుషులను యాదృచ్ఛికవ్యక్తులుగా కొట్టివేయుట నా తలంపు గాదు. వారి చారిత్రకపాత్రను సాంఘికపరిస్థితులనుండి వేరుచేసి మదింపు చేయరాదనియే నా భావన. వారు సమకాలీన సంఘంలో చైతన్యాన్ని సృష్టిస్తారు. సంఘంయొక్క సమష్టి సంకల్పానికి ఒక రూపాన్నీ, జవాన్నీ కలిగిస్తారు. ఆ సంకల్పసిద్ధికి తోడ్పడతారు. ఈ సందర్భంలో కార్ మహాశయుని మాటలు ఉటంకిస్తాను :—

"What seems to me essential is to recognise in the great man an outstanding individual who is at once a product and an agent of the historical process, at once the representative and the creator of social forces which change the shape of the world and the thoughts of men."

'చరిత్ర పరిణామంలో ఒక గతి, క్రమమూ లేవు. యాదృచ్ఛిక సంఘటనల ప్రభావమే ఎక్కువ' అనే మరియొక దృక్పథం వుంది. ఐరోపాఖండ చరిత్రను రచించిన ప్రసిద్ధ విద్వాంసుడు ఫిషర్ ఈ వాదాన్ని బలపరిచాడు. అనుకోని సంఘటనలకు (Chances) ప్రాముఖ్యాన్ని కల్పించుట ఈ వాదంలోని సారాంశం. 'క్లియోపాత్రా అతిలోక సౌందర్యవతి కాకపోతే మార్క్ ఆంటొనీ పతనం కాడు.' 'లెనిన్ అకాలంగా మరణించకుండా వుంటే రష్యా చరిత్ర మరియొక తీరుగా వుండేది.'—ఇలాంటి ఉదాహరణలను 'యాదృచ్ఛిక వాదులు' పేర్కొంటారు. ఈ వాదాన్ని భారతదేశ చరిత్రకు అన్వయిస్తే, 'లాల్‌బహదూర్ శాస్త్రి హఠాత్తుగా మరణించకపోతే, కాంగ్రెసుపార్టీలో చీలిక సంభవించేది కాదు.' అని ప్రతిపాదించవచ్చు. ఇటువంటి ప్రతిపాదనలవల్ల చరిత్ర పరిణామం, తీరు తెన్నులు అవగాహన కావు. స్వల్ప విషయాలకు ప్రాధాన్యం వచ్చి, ప్రధానమైన కారణాలు మరుగున పడిపోతాయి. లెనిన్ మరణానంతరం రష్యాలో వచ్చిన మార్పులకు కారణం ఏమిటి? శాస్త్రి మరణానంతరం కాంగ్రెసుపార్టీ ఎందుకు చీలిపోయింది ? అనే ప్రశ్నలకు యాదృచ్ఛిక వాదంలో సంతృప్తికరమైన సమాధానాలు కనపడవు.

జాతీయ దృక్పథంతో చరిత్ర పరిణామాలను వివరించే పద్ధతి మరియొకటి వున్నది. జాతీయ దృక్పథంలో దేశభక్తి ప్రధాన స్థానాన్ని ఆక్రమించుకొంటుంది. అన్యదేశాలపట్ల దురభిమానాన్ని ప్రకటించటానికి అవకాశం వుండటంవల్ల జాతీయ దృక్పథం (నేషనల్ అప్రోచ్) నిర్దుష్టము కాదు.

19—వ శతాబ్దిలో కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్సులను యిరువురు మేధావులు గతి తార్కిక భౌతిక వాదమనే నూతన దర్శనాన్ని వెలయించారు. ఆ దార్శనిక సిద్ధాంతాలను వారు సంఘ పరిణామానికి అన్వయించి ఆర్థిక నియతి సూత్రాన్ని ప్రతిపాదించారు. ఆర్థిక నియతి సూత్రం ప్రకారం ఉత్పత్తి విధానం, ఆర్థిక స్థితిగతులు చరిత్ర పరిణామాన్ని నిర్ణయిస్తాయి. దాని మూలంగా సమాజంలో ప్రధానంగా రెండు వర్గాలు యేర్పడతాయి. ఉత్పత్తి సాధ

వాలు స్వాధీనమందున్న వర్గ మెప్పుడూ పాలకవర్గ మవౌతుంది. అట్లు లేని వర్గం పాలితులు. పాలకవర్గం పాలితులను దోచుకుంటుంది. ఈ రెండు వర్గాలమధ్య సంఘర్షణ అనివార్యం. ఈ సూత్రాన్ని పురస్కరించుకొనే సమాజ పరిణామాన్ని అర్థంచేసుకోవలసి వుంటుంది. సమాజ చరిత్రయొక్క తొలిదశలో మానవుని జీవితం సాక్షాత్తు ప్రకృతిమీద ఆధారపడివుంది. అప్పుడు సొంత ఆస్తిలేదు. ప్రాకృతిక వస్తువులను సంఘం ఉమ్మడిగా అనుభవిస్తూ వుండేది. తర్వాత సొంత ఆస్తి యేర్పడి బానిసయుగం ప్రారంభమైంది. బానిసయుగంలో బానిస యజమానులకూ— బానిసలకూ మధ్య వర్గపోరాటం జరిగింది. తర్వాత భూస్వామికయుగం వచ్చింది. ఈ యుగంలో పాలకవర్గంగా ఉండిన భూస్వాములకూ— దళితవర్గంగా ఉండిన రైతులకూ, పరిశ్రమలను అభివృద్ధి చేస్తూవున్న బూర్జువాలకూ మధ్య పోరాటం జరిగి పెట్టుబడిదారీయుగం ప్రారంభమైంది. ఇక పెట్టుబడిదారీయుగంలో ప్రధాన ఉత్పత్తి సాధనం యంత్రం. యంత్రాధిపతులు అనగా పెట్టుబడిదారులు అధికారం స్వాయత్తం చేసికొంటారు. లాభంకోసం ఉత్పత్తిదారులు పెట్టుబడి సాగిస్తారు. వారు కార్మికులకు కేవలం బ్రతకటానికి కావలసినంతమాత్రమే యిస్తూ అదనపు విలువను అపహరిస్తారు. దీని వలన పెట్టుబడిదారులకూ—శ్రామికవర్గానికీ మధ్య పోరాటం తప్పదనీ, విప్లవం రాకతప్పదనీ, శ్రామికవర్గం జయించి తీరుతుందనీ, ముందుగా శ్రామిక నియంతృత్వం నెలకొల్పబడుతుందనీ, తర్వాత వర్గాలు అంతరించి, దోపిడీ రహితమైన సోషలిజం యేర్పడుతుందనీ మార్క్సిస్టు సిద్ధాంతం ఉద్ఘాటిస్తున్నది.

పైన పేర్కొన్న మార్క్సీయ చారిత్రకవాదం పాక్షికమైన సత్యమే. నాగరికతా పరిణామంలో వర్గాలకూ—వర్గసంఘర్షణలకూ వున్న ప్రాధాన్యాన్ని తిరస్కరింపనక్కరలేదు. అయితే సమాజ పరిణామానికి ఒక్కఉత్పత్తి విధానమే మూలకారణమా? రాజకీయ విప్లవాలు, శాస్త్రపరిజ్ఞానం, వ్యక్తుల ప్రాబల్యం, భావాల ప్రభావంకూడా ముఖ్యకారణాలే. ఆర్థికస్థితిలోని మార్పే మానవ చరిత్రలోని ఇతర పరివర్తనలన్నింటికీ పరమకారణం అయితే ఆర్థికస్థితిలో వస్తున్నమార్పు దేనివల్ల కలుగుతున్నది? ఉత్పత్తి విధానం సర్వం నిర్ణయిస్తుందనేవాదం శాస్త్రకారులయొక్క— మహాపురుషులయొక్క ప్రాముఖ్యాన్నీ— భావాల ప్రాధాన్యాన్నీ వివరింపలేదు. ఒకహేతుకమైన గతితర్కాన్ని సమాజపరిణామానికి సంధించి, వర్గపోరాటమనే ఏకగతిని చరిత్రకు కల్పించి, యీ వాదం చరిత్రను ఒక కర్మసిద్ధాంతంగా, ఒక జోస్యంచెప్పే విధంగా చిత్రిస్తున్నది. సెబైన్ మహాశయుడు యీ వాదంపై యిచ్చిన తీర్పు గమనింపతగినది.

"The notion that society advances with iron necessity toward an inevitable goal belongs to the realm of religion or fate rather than to that of science or history."

చరిత్రతత్త్వ విచారణలో కనపడుతున్న పై దృక్పథాలు పాక్షికాలు. అందుచేత యేవొక్క దృక్పథమూ నాగరికతయొక్క సమగ్రస్వరూపాన్ని వివరింపలేకపోతున్నది. చరిత్ర ఒక 'సోషల్ ప్రాసెస్' అయినప్పుడు సంఘాన్ని పాక్షికంగాగాక మొత్తంగా చూడవలసిన అగత్యమున్నది. అందుకు సాంఘికదృక్పథం అవసరం. చరిత్రను ఒక సాంఘిక స్రవంతిగా పరిగణించి, ఈ దృక్పథం నాగరికతా పరిణామానికి దోహదం చేసిన సాంఘిక శక్తులను విశదీకరిస్తుంది. సాంఘిక శక్తులను పరిగణించటంవల్ల యీ దృక్పథం సమగ్రమవుతున్నది.

పై వివరణవల్ల నాగరికతా పరిణామాన్ని నిర్ణయించిన సాంఘిక శక్తులను విశదీకరించే శాస్త్రమే చరిత్ర అని తేలుతున్నది. (1) కారణాలను విశదీకరించటం (2) సామాన్య సూత్రాలను (**generalisations**) రూపొందించటం.

కార్యకారణ నియమం అన్నిశాస్త్రాలకు మూలం. ఈ నియమాన్ని కాదంటే జీవితం అర్థరహితమవుతుంది. శాస్త్రాలు నిరర్థకాలు అవుతాయి. చరిత్ర కార్యాచరణ నియమాన్ని అంగీకరించి, జరిగిన—జరుగుతున్న సంఘర్షణలకు కారణాలను అన్వేషిస్తుంది. సంఘటనలు యాదృచ్ఛికాలనో, ఈశ్వరుని లీలలనో చరిత్రవేత్త సరిపెట్టుకోడు. సంఘటనల వెనుకనున్న సాంఘిక వాతావరణాన్ని విశ్లేషణ చేసి, యే సాంఘిక శక్తులవల్ల చారిత్రక సంఘటనలు జరుగుతున్నవో చరిత్ర వివరిస్తున్నది. ఒకే సంఘటనకు అనేక కారణాలు వుంటాయి. వానిలో యేవి ముఖ్యమైనవో, యేవి లేకపోతే సంఘటనలు జరుగవో వానిని చరిత్ర ప్రధానంగా పేర్కొంటుంది. ఉదాహరణకు 1917 లో జరిగిన రష్యా విప్లవాన్ని తీసికోండి. రష్యా పొందిన మిలటరీ అపజయాలు, ఆర్థిక వ్యవస్థ పతనం, వ్యవసాయ సమస్యలను జార్ ప్రభుత్వం పరిష్కరింపలేకపోవటం, శ్రామికుల అసంతృప్తి, బోల్షివిక్ పార్టీ ప్రచారం, లెనిన్ నాయకత్వం—ఇవి రష్యా విప్లవానికి తోడ్పడిన కారణాలు.

తమకు లభిస్తున్న జ్ఞానాన్ని క్రమబద్ధంగా యేర్పాటు చేయుటయేగాక, కొన్ని సామాన్య సూత్రాలను (**generalisations**) ప్రతిపాదించటం శాస్త్రజ్ఞుల కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని చరిత్ర వేత్త కూడా నెరవేరుస్తున్నాడు. నాగరికతా పరిణామాన్ని 'వివిధయుగాలు'గా విభజించటం—అందులో ఒకటి. గత అనుభవాన్ని ఆధారం చేసుకొని కొన్ని సామాన్య సూత్రాలను రూపొందించటం రెండవ కర్తవ్యం. (కొన్ని ఉదాహరణలు :— (1.) విప్లవాలు పెడత్రోవను పడితే మిలటరీ నియంతృత్వం వస్తుంది. (2.) ఆంతరంగిక దౌర్బల్యాల వల్ల నాగరికతలు క్షీణిస్తున్నాయి. (3.) అధికారం అవినీతిని పెంచుతుంది. అవధులులేని అధికారం అంతులేని అవినీతిని పెంచుతుంది.) తాను ప్రతిపాదిస్తున్న సామాన్య సూత్రాలు త్రికాలాబాధితాలని చరిత్రవేత్త చెప్పడు. మానవ సంకల్పబలాన్ని ఆతడొక శక్తిగా గుర్తిస్తాడు. చరిత్రవేత్త చెప్పే సామాన్య సూత్రాలు సత్యాన్ని పరిశోధించటానికి తోడ్పడే ఆలోచనాసాధనలు. వాని సాయంతో కొత్త సత్యాలను తెలిసికొనవచ్చు. అంతేగాక వానివల్ల నాగరికతా పరిణామాన్ని, వర్తమాన స్థితిగతులనూ అర్థం చేసికొనవచ్చు. ఆ విధంగా చరిత్ర నేర్పుతున్న పాఠాలను గ్రహించి, ప్రజలు తమ కర్తవ్యాన్ని గుర్తింపవచ్చును.

చరిత్రవేత్త సూచించే సామాన్య సూత్రాల స్వభావాన్ని గురించి డేనియల్స్ చేస్తున్న హెచ్చరికను మరువరాదు.

"In the actual historical situation there are so many complex and variable factors, so much of the unpredictable human element that it is impossible to use the ordinary scientific notion of "law". There are no identical situations, only parallels; there are no laws, only tendencies; there is no inevitability, only likelihood."

2

విశ్వరూపాన్ని గురించి, పరిణామాన్ని గురించి యీనాడు మనకున్న పరిజ్ఞానం ప్రకారం ఈ అనంత విశ్వంలో మన భూగోళం ఒక నలుసు మాత్రమే. భూగోళంలో జీవరాశి పుట్టి కొన్నికోట్ల సంవత్సరాలయింది. జీవ పరిణామక్రమంలో మానవుడు జన్మించి ఎన్ని లక్షల సంవత్సరాలయిందో ఇతమిత్థంగా చెప్పటం కష్టం. ఆదిమమానవుడు అనాగరికుడుగా, ఆటవికజీవిగా నివశించాడు. నాటి ఆటవిక మానవుడు నాగరికమానవుడైంది ఆరేడువేల సంవత్సరాలనాడే. విశ్వచరిత్రతో పోల్చినప్పుడు ఆరేడువేల సంవత్సరాలు మహాసముద్రంలో నీటిబిందువు మాత్రమే. ఇక రాతి పనిముట్లను వాడుతూ — శిలాయుగంలో—పశుప్రవృత్తితో—మానవుడు వెళ్ళబుచ్చిన లక్షల సంవత్సరాలలో నాగరికతాచరిత్ర శతాంశమైనా కాదు. మనకు తెలియని—తెలుసుకొనడానికి వీలులేని విషయాలజోలికి చరిత్ర పోదు. మనకు తెలిసిన ఆరేడువేల సంవత్సరాల నాగరికతా పరిణామాన్నే చరిత్ర పరిశీలిస్తున్నది. ఈ పరిశీలనవల్ల చరిత్ర మనకు నేర్పుతున్న పాఠాలేమిటి? మానవుడు పురోగమిస్తున్నాడా? తిరోగమిస్తున్నాడా? నాగరికతాపరిణామానికి దోహదంచేసే కారణాలు ఏమిటి? నాగరికతలు ఎందుకు క్షీణిస్తున్నాయి? మానవ నాగరికతయొక్క భవిష్యత్తు అంధకారబంధురమా? ఆశాపూరితమా?

మానవ నాగరికతకు సృష్టికర్త మానవుడే. ప్రకృతి నియతిబద్ధం. మానవుడు ప్రకృతిలో ఒక భాగం. ప్రకృతిలోని నియమశీలం క్రమంగా వికాసంచెంది మానవునిలో హేతుశీలంగా ప్రస్ఫుటమైనది. హేతుత్వం మానవుని విశిష్ట లక్షణం. అది మనిషిని ఇతర జంతువులనుండి వేరుచేస్తున్నది.

మానవుని ధర్మాలలో ప్రధానమైనది భావవిచారం. విచారశీలినుక మానవుడు భాషలను, సాధనసంపత్తినీ, సాంఘికసంస్థలనూ నిర్మించుకొంటున్నాడు. సంప్రదాయాన్ని సంచితం చేసుకొంటున్నాడు. నాగరికతానిర్మాణానికి తోడ్పడిన ప్రేరణలలో ముఖ్యమైనది స్వేచ్ఛాపిపాస. స్వేచ్ఛాపిపాస అంటే మానవుడు తన మనుగడకు చేసే పోరాటాన్ని ఉత్తమస్థాయిలో—అనగా బుద్ధికుశలతతో కూడిన స్థాయిలో కొనసాగించుట. వ్యష్టిగాగాని, సమష్టిగాగాని మానవుడు చేస్తున్న హేతుబద్ధమైన ప్రతి ప్రయత్నంయొక్క ప్రయోజనం స్వేచ్ఛను సంపాదించుటయే. స్వేచ్ఛ కొరకు మానవుడు జరుపుతున్న పోరాటఫలితమే నాగరికత.

నాగరికతాపరిణామంపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం కొంతవరకు ఉంటుంది. శీతోష్ణపరిస్థితులు ప్రజల ఆహార విహారాలనూ, వేషధారణనూ నిర్ణయించవచ్చు. కాని మానవులు భౌగోళిక పరిస్థితులకు బానిసలు కారు. తమ విజ్ఞానంద్వారా, సాధనసంపత్తిద్వారా వారు భౌగోళిక పరిస్థితులను ఆర్థికవికాసానికి అనుగుణంగా మార్చుకోగలుగుతున్నారు. భౌగోళికమైన వనరులను ఉపయోగించుకోగలిగిన శక్తిసామర్థ్యాలు లేనప్పుడు నాగరికతాభివృద్ధి కుంటుపడుతుంది.

జీవరాసులలో బ్రతుకుతెరువుకొరకు పోరాటం ఉందనీ, ఈ పోరాటంలో అర్హతమమైన జీవులు నెగ్గుతాయనీ, అసమర్థజీవులు నశిస్తాయనీ జీవశాస్త్రం బోధిస్తున్నది. మానవ నాగరికతా పరిణామంపై ఈ జీవన సంగ్రామసూత్రంయొక్క ప్రభావం ఉన్నది. మానవసమూహాల (Groups) మధ్య సంఘర్షణలు, పోరాటాలు, యుద్ధాలు జరుగుతున్నాయి. అయితే సంఘర్షణతోపాటు సహకారం కూడా మానవసమూహాలలో కనపడుతున్నది. సహకారం కేవలం ఒక వర్గానికో, సమూహానికో, జాతికో పరిమితమై ఉన్నప్పుడు సంఘర్షణలు తీవ్రమౌతున్నాయి. సంఘర్షణలవల్ల సామాజికవ్యవస్థ సంక్షుభితమై నాగరికతావికాసం దెబ్బతింటున్నది. కనుక వివిధ సమూహాలమధ్య, రాజ్యాలమధ్య సహకారాన్ని ఇతోధికంగా పెంపొందించటం అవసరం.

అధికశక్తిసంపన్నులైన వ్యక్తులు జీవనపోరాటంలో ఇతరులకంటె తేలికగా నెగ్గుకురాగలుగుతున్నారు. శక్తియుక్తులలో వ్యక్తుల మధ్య కనపడుతున్న అసమానత్వం కొంతవరకు ప్రకృతిసిద్ధం. కాగా మనుష్యులందరిమధ్య పరిపూర్ణమైన స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ సాధించాలనే ఆదర్శం ఆచరణలో ఫలించదు. శక్తియుక్తులు ఎక్కువగావున్న వ్యక్తులు స్వేచ్ఛకు ప్రాధాన్యం యిస్తే, మిగిలినవారు సమానత్వానికి ప్రాధాన్యం యిస్తారు. ఇరువర్గాల మధ్య సమన్వయాన్ని సాధించటంలో వ్యక్తుల సృజనాత్మక శక్తులు నాశనంకాకుండా చూడటం అవసరం. సమానత్వంపేరుతో వ్యక్తుల క్రియాస్వేచ్ఛను నిరోధిస్తే సామాజికాభివృద్ధి మందగిస్తుంది.

["Nature smiles at the union of freedom and equality in our utopias. For freedom and equality are sworn and everlasting enemies, and when one prevails the other dies. Leave men free, and their natural inequalities will multiply almost geometrically, as in England and America in the nineteenth century under laissez-faire. To check the growth of inequality, liberty must be sacrificed, as in Russia after 1917. Even when repressed, inequality grows; only the man who is below the average in economic abitity desires equality; those who are conscious of superior ability desire freedom; and in the end superior ability has its way. Utopias of equality are biologically doomed, and the best that the amiable philosopher can hope for is an approximate equality of legal justice and educational opportunity',

— WILL DURANT]

నేడు ప్రపంచ జనసంఖ్యలో శ్వేతజాతీయులకంటె ఇతర జాతులవారే ఎక్కువ. శరీరనిర్మాణం, వర్ణంవంటి బాహ్య విషయాల్లోనేగాక, మానసిక శక్తుల్లో, గుణశీలాల్లో కూడ జాతుల మధ్య మౌలికమైన భేదాలున్నవనీ, అందువేత శ్వేత జాతీయులు—ముఖ్యంగా ఆర్యులు లేక నార్డిక్ జాతివారు—మానసిక శక్తుల్లో, గుణశీలాల్లో ఇతరులకంటె మిన్నలనీ, వారే ఉత్తమ నాగరికతా సృష్టికర్తలనీ కొందరు ఒక వింత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

గుణశీలాల్లో, శక్తి యుక్తుల్లో ఒకజాతి మరియొక జాతికంటె సహజంగా భిన్న అనే సిద్ధాంతం అశాస్త్రీయం. చరిత్ర విరుద్ధం. భారతీయ నాగరికత వివిధ జాతుల సమ్మేళనంవల్ల ఏర్పడినది. ప్రాచీనయుగంలో ఉత్తమ నాగరికతను రూపొందించిన చైనీయులు ఆర్యులు కారు గదా? ఈజిప్టు, గ్రీకు, రోమ్ నాగరికతలు ఆర్యుల ఆధిక్యతవల్ల ఏర్పడినట్టివి కావు గదా? నవీన యుగంలో నీగ్రోలు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందటంలేదా? ఆర్యజాతి ఆధిక్య సిద్ధాంతం హిట్లరువంటి యుద్ధోన్మాదులనూ, మానవహక్కుల వినాశకులనూ సృష్టించింది. నాగరికతా వికాసానికి అన్ని జాతులవారు దోహదం చేసినట్లు చరిత్ర బోధిస్తున్నది.

విద్యావికాసానికీ, దీనజనోద్ధరణకూ మతసంస్థలు తోడ్పడినట్లు మానవ చరిత్ర చెప్తోంది. అయితే మతసంస్థలు ఆముష్మిక చింతనానికీ, మానవసేవకు మాత్రమే కట్టుబడి వుండలేదు. సాంఘిక, రాజకీయ, వైజ్ఞానికరంగాల్లో మానవుడు కొనసాగిస్తున్న కృషిని తమ అదుపులో వుంచుకోటానికీ, శాసించటానికీ మతసంస్థలు తీవ్రమైన ప్రయత్నం చేశాయి. అటువంటి ప్రయత్నాల ఫలితంగా మతోన్మాదం తలెత్తింది. "సర్వమతాలూ ఆధ్యాత్మిక జగత్తును గురించీ, మోక్షసాధనను గురించీ బోధిస్తున్నాయి. అందువల్ల అన్నిమతాలూ సమాదరణీయాలే" అన్న సూక్తిని మతోన్మాదం నిరసించింది. అందువల్ల మత సహనం లోపించి, మత సంఘర్షణలు జరిగినాయి. క్రైస్తవులకూ—యూదులకూ మధ్య; హిందువులకూ మహమ్మదీయులకూ మధ్య జరిగిన సంఘర్షణలన్నీ మతోన్మాదంవల్ల జరిగిన దారుణ హింసాకాండను ఉద్ఘోషిస్తున్నాయి.

స్వేచ్ఛాపిపాసితుడైన మానవుడు మతోన్మాదపు నిర్బంధాల వెదుల్లోని—దానికి విరుగుడుగా లౌకికతత్వ సిద్ధాంతాన్ని (సెక్యులరిజం) రూపొందించాడు. లౌకికతత్వం మానవులకు సంపూర్ణమైన ఆలోచనా స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తుంది. లౌకిక సమాజంలో ప్రతివ్యక్తికీ మతస్వాతంత్ర్యం వుంటుంది, ప్రతివ్యక్తికీ సమానమైన హక్కులనూ, అవకాశాలనూ కల్పిస్తుంది. లౌకికత్వం మతోన్మాదానికి బద్ధశత్రువు. ఎందుకంటే మతోన్మాదం మానవుల స్వాతంత్ర్యేచ్ఛనూ, సత్యాన్వేషణనూ తిరస్కరిస్తుంది; సంఘర్షణలకూ, అశాంతికీ దారితీస్తుంది. ఈనాడు శాస్త్రవిజ్ఞానం వసుధైక కుటుంబ నిర్మాణానికవసరమైన సాధన సదుపాయాలను సమకూరుస్తుంది. ఈ పరిస్థితుల్లో స్వేచ్ఛాపూరితమైన లౌకిక తత్వమే మానవ నాగరికతా వికాసానికి అవసరమని నిష్కర్షగా చెప్పవచ్చు.

సాంఘిక భద్రత, వికాసాలకొరకు వ్యక్తులూ, సంస్థలూ అనుసరించవలసిన సూత్రాలను నైతిక నియమాలు అని నిర్వచింపవచ్చు. నైతిక నియమాలు లేకుండా సాంఘిక వ్యవస్థ మనజాలదు. అయితే నైతిక నియమావళి స్థిరంగా ఉండదు. సాంఘిక పరిస్థితుల్లో వస్తున్న మార్పులనుబట్టి నైతిక సూత్రాలూ, విలువలూ మారుతూ ఉంటాయి.

ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులనుబట్టి సమాజ పరిణామాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. అటవికదశ—వ్యవసాయదశ—పారిశ్రామికదశ అనునవియే ఆ మూడు దశలు. ఈ దశలను పరిశీలిస్తే ఒక దశలోవున్న నైతిక సూత్రాలు మరొక దశలో మారిపోతున్నట్లు కనపడుతుంది. అటవిక దశలో వేట ప్రధానమైన వృత్తి. ఆ దశలో వేటాడగలశక్తి—అనగా—చంపగలశక్తి—ప్రధానమైన విలువ. ఒకపురుషుడు అనేకమంది స్త్రీలను పెండ్లాడి, వారికి సంతాన భిక్షపెట్టటం వాటి సంఘం ఆమోదించేది. నాడున్న జీవన పోరాటంలో క్రౌర్యం, సాహసం, స్వార్థం, కామశక్తి లేని పురుషునకు విజయం లభించేదిగాదు.

వ్యావసాయిక దశలో సాంఘిక పరిస్థితులు మారినవి. కాగా నైతిక నియమావలికూడ మారింది. కష్టపడి పనిచేయటం, పొదుపుచేయటం, శాంతియుతంగా జీవితం కొనసాగించటం ఆ దశలో ప్రధానమైన నైతిక విలువలుగా భావింపబడినవి. బహుభార్యాత్వం నిరసింపబడింది. ఏకపత్నీకవ్యవస్థ అనుసరింపబడింది. తల్లిదండ్రులు బిడ్డలను ఆస్తిగా భావించారు. సంతానం లేకపోవటం పాపంగా పరిగణించారు. గొడ్రాలును సంఘం గౌరవించేదిగాదు. పితృ ప్రధానమైన కుటుంబ వ్యవస్థ అధిక ప్రాధాన్యాన్ని పొందినది. స్త్రీలకు శీలరక్షణ ముఖ్యకర్తవ్యం. అవివాహితలైన స్త్రీలు సంతానవంతులైనచో సంఘం హీనంగా చూచేది. విడాకులు ఇచ్చుకోవటం తప్పుగా భావింపబడింది. మతసంస్థలూ, మతాధిపతులూ గౌరవింపబడినారు. షుమారు రెండు—మూడువేల సంవత్సరాలు వ్యావసాయికదశకు ఆలంబనమైన నైతిక సూత్రాలు సంఘంలో కట్టుబాటును చెదరకుండా కాపాడినవి.

క్రమంగా వ్యావసాయిక దశనుండి సంఘం పారిశ్రామిక దశలోనికి పరివర్తన చెందినది. వ్యావసాయికదశలోని అవిభక్త కుటుంబ వ్యవస్థ, దానిచుట్టూ వున్న జీవితపు విలువలు అస్తమించినవి. తల్లిదండ్రుల అదుపు తగ్గినది. స్త్రీలకుకూడ ఆర్థిక స్వాతంత్ర్యం లభించింది. విడాకులచట్టం అవసరమయింది. పరిమిత కుటుంబం ఆదర్శమైనది. శాస్త్రవిజ్ఞానం పెరిగింది. మతసంస్థల ప్రాబల్యం తగ్గినది. సెక్యులర్ భావాలు పెరిగినవి. స్వేచ్ఛ—సమానత్వం, సాంఘిక—ఆర్థికన్యాయం సంఘంయొక్క లక్ష్యాలుగా రూపొందినాయి. మధ్యయుగంలోని రాచరికం—జమీందారీ విధానం భగ్నములైనవి. ప్రజాస్వామ్యం అమలులోనికి వచ్చినది. మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని—నూతన నైతిక నియమావళిని రూపొందించుకోవలసిన అవసరమేర్పడింది. లేనిచో నైతిక శైథిల్యం యేర్పడి, సాంఘిక జీవనం అవ్యవస్థకు లోనవుతుంది.

చరిత్ర పునరావృత్తమౌతుంది - History repeats itself అనే సిద్ధాంతం ఒకటి వున్నది. హిందువుల విశ్వాసం ప్రకారం ఇది కలి యుగం. దీనిలో ధర్మం ఒక పాదంపైనే నడుస్తుంది. ఈ కలియుగం మహాప్రళయంతో అంతంకాగా, తిరిగి కృతయుగం ప్రారంభమౌతుంది. ఇది కేవలం హిందువులకు పరిమితమైన విశ్వాసం కాదు. రోమన్ కవి వర్జిల్ మొత్తం విశ్వమే సృష్టిస్థితి లయాల వలయాన్ని తిరిగి తిరిగి చుట్టుతూ వుంటుందని భావించాడు. జర్మన్ తత్వవేత్త నీచే వర్జిల్ సిద్ధాంతంపట్ల అధిక విశ్వాసాన్ని ప్రకటించాడు. నాగరికత చక్రనేమి

క్రమంలో పునరావృత్తమౌతూ వుంటుందని రుజువు చెయ్యటానికి చరిత్రలో ఆధారాలు కనపడవు, స్థూలంగా చూచినప్పుడు గతంలో అనేక నాగరికతలు పెరిగి విరిగినాయి. యుద్ధాలు, తిరుగుబాట్లు, విప్లవాలు జరిగినాయి. అయితే నాగరికతా పరిణామక్రమంలో ప్రతియుద్ధమూ, ప్రతివిప్లవమూ, ప్రతిసంఘటనా దేనికదే ప్రత్యేకమైనదే. భవిష్యత్తు గతకాలం వలెనే ఉంటుందనుకోవటం మానవుల సృజనాత్మక క్రియాశక్తులకు తిలోదకాలివ్వటమేఅవుతుంది.

సహజంగా స్వేచ్ఛాప్రియులైన మానవులు తమ నెదుర్కొంటున్న అనేక సవాళ్ళను సృజనాత్మకంగా పరిష్కరించుకొంటున్నందువల్లనే నాగరికత అభివృద్ధిచెందుతూ వుంది. ఉదాహరణకు: 1947 కి పూర్వం ఆంగ్లేయ సామ్రాజ్యవాదం భారతజాతి నెదుర్కొన్న సవాల్. ఆ సవాలు నెదుర్కొని పారతంత్ర్య విముక్తికై పోరాడినందువల్లనే భారతజాతి చరిత్ర పురోగమించినది.

సాధారణంగా ఆర్థికస్థితిగతులు, భావాల ప్రభావం, ఉత్తమ నాయకత్వం నాగరికతాపరిణామాన్ని నిర్ణయించే ప్రధాన కారణాలు. ఉదాహరణకు: ఆర్థికవ్యత్యాసాలు, వర్గసంఘర్షణమేగాక, సోషలిస్టు భావాల ప్రభావం, లెనిన్ నాయకత్వం రష్యాలో 1917 లో జరిగిన బోల్షివిక్ విప్లవానికి తోడ్పడిన ముఖ్య కారణాలు. అయితే జాతిని నడిపించే నాయకులు అవతారపురుషు లనుకోవటంవల్ల వ్యక్తి ఆరాధనాతత్వం పెరిగి ప్రజల్లోని క్రియాశీలం క్షీణిస్తుంది. వ్యక్తి ఆరాధనాతత్వం భావస్వేచ్ఛను అరికట్టి, నియంతృత్వానికి దారితీస్తుందని చరిత్ర హెచ్చరిస్తున్నది.

ఆర్థికవ్యవస్థయొక్క పటిష్ఠతకు మూలం సంపద పెరగటం అని గత చరిత్ర చెప్తున్నది. సిద్ధాంతాలవల్ల, బలప్రయోగంవల్ల సంపద పెరగదు. మనుష్యుల శక్తిసామర్థ్యాలు అందుకు అవసరం. శక్తియుక్తులు అందరి మనుష్యులలో సమాన స్థాయిలో ఉండవు. కొందరిలో ఎక్కువ స్థాయిలో ఉండటం సహజం. ఆ కారణాన సంపద వారివద్ద కేంద్రీకృత మవుతూ వుంటుంది. తత్ఫలితంగా ఆర్థిక అసమానత్వం యేర్పడుతుంది. ఆర్థిక వ్యత్యాసాలవల్ల సంఘంలో సమస్థితి పోతుంది. సంఘర్షణ పెరుగుతుంది. క్రీ. పూ. 6 వ శతాబ్దిలో ఏథెన్సులో సంపన్నులకూ—పేదలకూ మధ్య అంతరం ఎక్కువకాగా, అసంతృప్తి, సంఘర్షణ చెలరేగినవి. రోమన్ సామ్రాజ్యకాలంలో ఇటలీలో ఆర్థిక కేంద్రీకరణమూలంగా షుమారు వందసంవత్సరాలు వర్గ పోరాటాలు, అంతర్యుద్ధాలు జరిగాయి. సంపద కేంద్రీకరణకు విరుగుడుగా ప్రభుత్వాలు శాసనాలు చేసి, పన్నులువేసి సంపదను పంపిణీచేస్తున్నాయి. ఇటువంటి ప్రభుత్వపరమైన ప్రయోగాలు క్రీస్తుపూర్వమే సుమేరియాలో, ఈజిప్టులో, చైనాలో జరిగినాయి. నవీనయుగంలో పారిశ్రామికవిప్లవం తర్వాత సోషలిస్టు భావాలు వ్యాప్తిచెంది 'సంక్షేమరాజ్యం' అనేభావం బలపడి ప్రభుత్వాలు ప్రజలకు వసతి, విద్య, ఆరోగ్యంవంటి సౌకర్యాలు కలుగచేస్తున్నాయి. ఇందువల్ల జాతి ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల ప్రమేయం పెరుగుతూవుంది. ప్రభుత్వాల జోక్యంవల్ల వ్యక్తిస్వేచ్ఛ దెబ్బతినకుండానూ, సంపదఉత్పత్తి తగ్గకుండానూచూడటం అవసరం.

ఒకనాడు మహోచ్ఛస్థితిలోవున్న సుమేరియన్, బాబిలోనియన్, ఈజిప్టు, గ్రీకు, రోమన్ నాగరికతలు క్రమక్రమంగా క్షీణించి, అంతరించిపోయినాయి. భారతదేశంలో ఉన్నతస్థితిని అనుభవించిన మౌర్య, గుప్త, మొగల్ సామ్రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయినవి. నాగరికతల పతనానికి ప్రధాన కారణం అంతరంగిక దుర్బలత్వమని చరిత్ర ఉద్ఘాటిస్తున్నది. చరిత్రగతిలో వస్తున్న మార్పులను అర్థంచేసుకొని, ప్రజలను పీడిస్తున్న సమస్యలనూ, సవాళ్ళనూ పరిష్కరింపగల రాజకీయ, వైజ్ఞానిక నాయకత్వం లోపించినప్పుడు అంతరంగిక దుర్బలత్వం ప్రవేశిస్తుంది. అటువంటి బలహీనతవల్ల ప్రజల్లోని సంఘటితశక్తి అంతరిస్తుంది. నైతికవిలువలు లుప్తములై అవినీతి పెరుగుతుంది. విచ్ఛిన్నకరధోరణులూ, సంఘర్షణలూ ప్రబలమౌతాయి. ఆ పరిస్థితుల్లో విదేశస్థుల దండయాత్రలవల్లా, యుద్ధాల్లో పరాజయాన్ని పొందటంవల్లా—సామ్రాజ్యాలూ, నాగరికతలూ పతనమైపోయినాయి.

మనకు తెలిసిన మానవచరిత్రను సింహావలోకనం చేస్తే—మధ్యమధ్య దారితప్పుతున్నా—మొత్తంమీద మానవజాతి పురోగమిస్తున్నదనే తీర్మానానికి రావచ్చు. ధర్మయుగాలూ, స్వర్ణయుగాలూ ఎప్పుడో గతించినట్లు భావించి నిరాశా నిస్పృహలకు లోనుకావలసిన అవసరం లేదు. పూర్వంకంటె యీనాడు మానవజాతి అనేకక్లిష్టసమస్యలను ఎదుర్కొంటున్నమాట వాస్తవమే. అధికార కేంద్రీకరణవల్ల మానవుల స్వేచ్ఛకు అంతరాయం కలుగుతున్నది. సంపద కేంద్రీకరణవల్ల—కొరతవల్ల — సంఘర్షణలు పెరుగుతున్నాయి. జాతివైషమ్యాలు తాండవం చేస్తున్నాయి. మతవిద్వేషాలు బుసలు కొడుతున్నాయి. అంతులేని మారణహోమాన్ని సృష్టిస్తున్న యుద్ధాలు కొనసాగుతున్నాయి. వైజ్ఞానిక స్థాయికి తగిన మట్టంలో మనుష్యుల నైతికస్థాయి పెరగటంలేదు. అయితే ఇటువంటి సమస్యలనూ, సవాళ్ళనూ ధైర్యంతో, వివేకంతో ఎదుర్కొనగలిగిన శక్తి ఆధునిక మానవులకు వున్నది. పైగా ఆరువేల సంవత్సరాల నాగరికతా వారసత్వం వారికి ఉన్నది. నాగరికతవల్ల లభించిన అనుభవం, చింతన, దర్శనాలు, సాహిత్యం, కళలు, వైజ్ఞానిక శాస్త్రాలు, సాంకేతిక విజయాలు వారికి వున్నాయి. ఈ వారసత్వం దృష్టినుంచి చూచినప్పుడు రఘుచక్రవర్తికంటె, సీజరుకంటె, అశోకునికంటె, అక్బరుకంటె నేటి మానవులు సంపన్నులు. కాని నాగరికత ఒకతీరంనుండి మరియొక తీరానికి వంశ పారంపర్యంగారాదు. విద్యద్వారా, అనుష్ఠానంద్వారా నాగరికతను స్వీకరించి, తమ సమస్యలను పరిష్కరించుకొంటూ, దానిని అభివృద్ధిచేసి ముందుతరాలవారికి అప్పగించటం నేటితరం యొక్క కర్తవ్యం. ఇదే చరిత్ర నేర్పుతున్న గుణపాఠం. వేస్తున్న ఉద్బోధ. దీన్ని నిర్లక్ష్యం చేయనంతవరకు మానవజాతి భవిష్యత్తు పదిలంగానే వుంటుంది.

"తద్విజిజ్ఞాసస్వ"

చరిత్రతత్త్వాన్ని, ప్రాముఖ్యాన్నివివరించే కొన్ని ఆంగ్లగ్రంథాలు:—

1. "An Introduction to Philosophy of History W. H. Walsh. 2. "The Idea of History"—Collingwood. 3. "The Materialist Conception of History"—Karl Federn. 4. "Philosophy of History"—Alan Dongan. 5. "What is History?"—E. H. Carr 6 "The Critical Historian"—Kitson Clark7. "Studying History How and Why"—R. Daniels 8. "Lessons of History"—Will and Ariel Durant

బదిలీ

శ్రీమతి ఆర్. వసుంధర

నాకు ప్రపంచం లేదు. బదిలీ అయిపోయింది. నాలోకి బదిలీ అయిపోయింది. ఇప్పుడు నేనే ప్రపంచాన్ని.

వాళ్ళందరూ నాకు పిచ్చి అంటున్నారు. మతి పోయిందంటున్నారు. 'ఈ ప్రపంచంలో లేదు' అంటున్నారు.

నా మతి...మతి...ఎక్కడకు పోయింది? నాకు వాళ్ళు పిచ్చివాళ్ళుగా కనబడుతున్నారు. వాళ్ళు అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారు. నాకు ఒకటేగా నవ్వొస్తుంది వాళ్ళను చూస్తుంటే, వాళ్ళ మాటలు వింటూంటె. ఈ 'పిచ్చి' నా'మతి' కాదూ? నేను ఇప్పుడు పూర్తిగా నా ప్రపంచంలోనే, నా పిచ్చిలోనే ఉంటున్నాను.

నామీద నాకు ఒకటే జాలేస్తోంది. ఆ ప్రపంచం పోయింది కదూ, అందుకని. పోయింది తిరిగిరాదు. నేను ఎప్పుడూ ఈ ప్రపంచంలోనే, నా ప్రపంచంలోనే, నా మతిలోనే ఉండిపోవాలి యిహ. నాకు విముక్తిలేదు...నేను పిచ్చిదాన్నని రామూ, కిట్టూ దగ్గరకు రావటం లేదు. ఆయనా దగ్గరికి రావటం లేదు. అలటే యోగక్షేమాలు కనుక్కుంటున్నారుగాని సంభాషించడం లేదు. నేను పిచ్చిదాన్ని కదూ, ఈ ప్రపంచంలో లేను కదూ, మతిలేదు కదూ, అందుకని. అదంతా నాకు అర్థంకాదని. అదీ నిజమే. అర్థం చేసుకో గలిగితే పిచ్చి అనరు కదా...కాని నా ఆనంద ఉంటే ఇట్లా చేసేవాడా? ఎప్పటికీ చెయ్యడు! పిచ్చి అమ్మనీ 'అమ్మా' అని కావిలించుకునేవాడు. పిచ్చి, తెలివి, అర్థం—యిట్లాంటివన్నీ వాడి కక్కర్లేదు. వాడు యిప్పుడెక్కడున్నాడు?...వాడు చచ్చిపోయాడు, లేడు అంటున్నారు. వాడు నిజంగా లేడూ? లేడూ?...నిజం... నిజమంటే ఏమిటి? నిజమూ అబద్ధమూ ఒకటే అయ్యుండాలి. ఎందుకంటే వాడు నాకు కనిపిస్తున్నాడు. బంగారపు బొమ్మలాగా ఒళ్ళు మెరిసిపోతుంటే, పెద్దబొజ్జతో, దిసమొలతో, కళ్ళల్లో నవ్వు తుళ్ళిపడుతుంటే, మొహం వెలిగిపోతుంటే, చిలిపి కృష్ణుడిలాగా నాకు స్పష్టంగా ప్రత్యక్షంగా అందరూ కనిపిస్తున్నట్లు కనిపిస్తుంటేనూ!...మరి వాళ్ళు లేడంటున్నారే!! వాళ్ళ ప్రపంచంలోనుండీ నా ప్రపంచంలోనికి, వాళ్ళమతిలోనుండీ నామతిలోనికి నడిచి వచ్చేశాడా?...అంతే అయ్యుండాలి!

...అబ్బ! నా మనసు కలగిపోతున్నది. అందులోనికి భరించ లానివేదన ఒచ్చేస్తున్నది. అమృతంకోసం దేవదానవులు మందర పర్వతంతో మధిస్తున్నప్పటి పాలసముద్రంలాగ అయిపోతున్నది...అయిపోతున్నది...ఈ బాధ నే భరించలేనే...అయ్యో!...

...సేవూ ఏడ్చిన ఏడుపులోనుంచీ నవ్వు పైకొస్తున్నది; చిలికిన మజ్జిగలోంచీ తేలిగ్గా వెన్నముద్ద పైకొచ్చినట్లు. ఏడుపు, నవ్వు, నవ్వు, ఏడుపు...అవి రెండూ వేరువేరా ? ఒకటేనా ?

నాలో ఏదో తెలివి పుట్టుకొస్తున్నది. నా నవ్వూ ఏడుపూ నాకు కనిపిస్తున్నది. అవతలివాళ్ళను బోల్తా కొట్టిస్తున్నానన్న ఆనందంతో పిచ్చివాడు చాటునుంచీ తొంగి చూస్తున్నట్లు—అవును, సరిగ్గా అలానే—నా మనసులోనికి తొంగి చూస్తున్నాను...

...నేనూ నా మనసూ ఒకటే అయితే ఆ తొంగిచూస్తున్న దెవరు ?

అమ్మో ! నేను 'అది' కానందుకు సంతోషం. ఆ నిరాశా సముద్రాన్ని నే నీదలేను. ఆ నిస్పృహా పర్వతాల్ని నే నెక్కలేను. నేను వేరుగానే ఉంటాను...'అది' ఏమిటి ? మనసంటే ఏమిటి ? ఆశలూ అనుభవాలూ అంటూ దాన్ని పోగేసి ఎంతకొండను కట్టాను ! ఎంత సముద్రాన్ని సృష్టించాను !... అంతా బూడిదై పోయింది. ఆశలు కాలిపోయిన బూడిద...దాన్ని భరించలేను !

...దీనికంతటికీ మూలకారణం ఏమిటని ఆలోచించాను. ఆశ లేకుంటే నిరాశ రాదు. నిరాశనుండీ పుట్టేది నిస్పృహ. కావాలన్నది దొరకనప్పుడు దొరికినదాన్ని చూడలేము. ఆశ—అంటే ఎదురుచూడటం—అన్ని అనర్థాలకీ మూలకారణంగా ఉన్నది... అరె ! ఇంత గొప్ప ముఖ్యమైన విషయం నిజానికి ఎంత చిన్నదిగా ఉన్నది !...ఇదే విషయం ఇదివరలో ఎవరో గొప్పవాళ్ళు చెప్పినట్లూ విన్నట్లూ ఉన్నదే !... ఈ విషయం చెయ్యిజారి పోగూడదు. రామూని పిలిచాను. ఇంకా ఆ జ్వరం వాడిని పీడిస్తున్నట్లున్నది. సన్నగా అయిపోయాడు. 'దేనికోసమూ ఎదురు చూడకూడదు. ఇది చాల ముఖ్యమైన జీవిత సత్యం...జ్ఞాపకం పెట్టుకో. మంచిది' అని చెప్పాను. వాడు పారిపోయాడు.

ఆనంద అయితే పారిపోయి వుండేవాడు కాదు...ఇంత గొప్ప జీవితసత్యాన్ని కనుక్కున్నాను గదా, ఇంకా వాడు బ్రతికిరాలేదే ;

అన్నట్టు ఆనందను గురించి మీకు తెలియదు కదూ. ఎట్లా తెలుస్తుంది ! వాడిని చూపిస్తే కనుక్కుంటారేమో కాని చూపించడానికి వాడు ఈ ప్రపంచంలో లేడు. నా నిరాశలో నిస్పృహలో మునిగి మాయమైపోయాడు. పోనీ వాడినిగురించి చెప్దామంటే, చెప్తే వినబడేవి మాటలే కదా. వాడు కాదే. ఎటూ ఈ సమస్యను తీర్చేది ?!...ఆ, వాడిని చూసినా వాడిని తెలుసుకునే తెలివి మీకున్నదన్న నమ్మకం నాకు లేదు...వాడు నా ఆత్మ, నా ప్రాణానికి మూలం అంటే తెలుస్తుందా ? తెలియదు...నా ఆనందం అంటే తెలుస్తుందా ? సంతోషం కాదు, ఆనందం. ప్రపంచానుభవాల్తో

సంబంధం లేనిది. వాటిమీద ఆధారపడనిది. వాటన్నిటినీ సంతోషంగా తేలిగ్గా తీసుకోనిచ్చేది. తెలిసిందా? తెలియలేదు...ఎప్పుడూ నవ్వుతూ, కడిగిన ముత్యంలాగా మెరిసిపోతూవుంటాడు. వాడిని చూస్తే గుండె నిండిపోతుంది. ఇప్పుడు తెలిసిందా?...కొంచెం తెలిసినట్లుంది. వాడే నా ఆనంద! నా కొడుకు! నేను!

* *

ఇవాళ నా మనసు తేటగా వున్నది. కన్నీటిముత్యాలమంచులో తడిసిపోయిన ఆ ప్రపంచం స్పష్టంగా కనిపిస్తున్నది. జరిగిందంతా గుర్తుకొస్తున్నది. ఆనంద లేకుండా పోయి రెండు నెలలు దాటిపోయింది. ఇంకా మాకు బదిలీ రాలేదు.

ఈ చింతలూరికి రాకపూర్వం మేము బాగానే వుండేవాళ్లం. కష్టం సుఖం కలిసివొచ్చినా, సుఖం కూడా వుండేది. మనుషుల్లో, నిజాయితీ, ప్రపంచంలో స్థిరత్వం ఉన్నట్లు కనబడేది. లోకంపోకడ అర్థం అవుతున్నట్లుండేది. మనుష్యులకు కొన్ని విలువలుండేవి. ఏదో ఒక అధికారానికి లోబడినా స్థిరత్వం కనిపించేది. ఈ ప్రపంచం నాకు సంబంధించినదిగా, మేమూ అందులోనివాళ్లంగా తోచేది. మనిషిని తికమకపరచి క్రుంగదీసి నిర్జీవంచేసే పరిస్థితులు అప్పటికి ఎదురవలేదు.

ఈ ఊళ్లో సుఖదేవ్—అబ్బ, ఏం పేరో! — ఉండేవారు. ఇక్కడ నాలుగునెల లుండేసరికి అతనికి వెళ్లిపోవాలని అనిపించిందట. హైదరాబాదుకు వెళ్లి ఎట్లాగో ఈ మార్పు చేయించాడు. తత్ఫలితంగా మేము చింతలూరికి రావలసివచ్చింది. అనారోగ్యానికి పేరుగాంచిన చిన్న వూరు ఇది. ఆర్డరుకాగితం చూడగానే ఆయన నిరుత్సాహంతో నీరుగారిపోయారు. తల పట్టుకొని 'ఆ ఊరా? అక్కడికి వెళ్తే మనం తిరిగి బయటపడటం జరగదు' అన్నారు. ఆయన అవతారం చూస్తే నాకు నవ్వొచ్చింది. ఆయన చిన్నతనంలో చాలా బలహీనంగా ఉండేవారట. ఇంటిల్లిపాదీ ఆయన ఆరోగ్యం గురించి అహర్నిశలూ శ్రద్ధతీసుకుని పాటుపడుతూ ఉండేవారట. అదే అలవాటుమీద ఇప్పటికీ ఆయన తనొక పింగాణీ బొమ్మననీ, చాలా జాగ్రత్తగా ఉండకపోతే ఏ నిముషాన్నో బద్దలై పోవచ్చుననీ అనుకుంటున్నట్లుంటారు. 'బయటపడక ఏమైపోతాం?' అన్నాను పెద్దగా నవ్వుతూ...అప్పుడు ఆనంద నా ఒళ్లో పడుకున్నట్లు నాకు బాగా గుర్తు... 'ఆ ఊరికి వెళ్లాలని ఎవరికీ ఇష్టం ఉండదు. మనం అక్కడే చిక్కుబడి పోతాం' అన్నారు. 'మీ స్నేహితులు సుఖదేవ్‌గారు వెళ్లలేదూ? మనం అట్లాగే వెళ్లొచ్చును లెండి...కొత్త ప్రాంతం చూడొచ్చును. అన్నిటికీ అంతగా దిగజారిపోతే ఎట్లాగ?' అన్నాను వోదార్చాలనే సదుద్దేశ్యంతో. అప్పుడు నాలో ఏవిధమైన జంకుగాని అధైర్యంగాని లేవు. రాబోయేదాన్ని, మంచిగాగాని చెడ్డగాగాని, ముందుగా ఊహించుకోవడం నాకు అలవాటు లేదు. దేనికోసమైనా ఎదురుచూడటం నా తత్వానికే విరుద్ధం. నా ఆలోచనలూ ఆవేశాలూ పనులూ అన్నీ ఆ క్షణంలోనుండీ పుట్టుకొచ్చేవే. ఆయన అట్లాగ కాదు. పైకి కనిపించే సౌమ్యత బలహీనతలవెనుక చాలా గట్టిదనం, మొండితనం ఉన్నాయని నాకు అనుభవమే. ఆయన ఏదైనా అనుకున్నారంటే మార్చటం నాకు తరంకాదు. ఈ విషయంలోనూ అంతే అయ్యింది.

ఆ ప్రయాణం నాకు బాగా గుర్తున్నది. స్టేషనునుంచీ తూర్పుగా పదిమైళ్లదూరంలో ఉన్నది చింతలూరు...టాక్సీ మెల్లగా పోతున్నది. మధ్యలో ఊళ్లుకూడా తగలటంలేదు. ఉదయం నుండీ రైల్లో ప్రయాణంతో విసిగిపోయిఉన్నాం—అలసటతో దుమ్ముతో. రోడ్డు అంతులేనట్లుగా ఒంపులు తిరిగిపోతూ సంధ్య చీకట్లలోనికి సాగిపోతున్నది. రెండువైపులా ఏపుగా ఎదిగిన పైర్లు ఈ ప్రక్కా ఆ ప్రక్కా దడికట్టేసినట్లున్నై. ఎక్కడో గుహలో అనంతమైన ప్రయాణంలాగా ఉన్నది. ఆ గుహలోనికి పోయిపోయి ఎక్కడో మాయమైపోతాము, ఇహ తిరిగిరాకుండా! అనిపించింది. చెప్పలేని భయం తామరాకు మీద నీటి బొట్టులా వాలినట్లు గుండెనిండా ఏదో బరువు, దిగులు.

టాక్సీ ఆగిపోయింది. పెట్రోలు అయిపోయింది. డ్రైవరు వెనక్కి నడిచి వెళ్లాడు పెట్రోలు తేవడానికి...చీకటీ, ఎరగని చోటూ, అక్కణ్నుంచి కదల్లేకుండా చిక్కుకొనిపోయిన మేము... మాతృగర్భంలాంటి మహాశూన్యంలో ఉక్కిరి బిక్కిరవుతూ. బయటి ప్రపంచంతో సంబంధంలేకుండా ఎక్కడో విసిరేసినట్లుగా ఉన్న ఆ ఊరిలో మా కేమి సంబంధం? అక్కడికి ఎందుకు వెళ్లాలి? ఈ చీకాకులోనుంచీ తప్పించుకొని వెనక్కి వెళ్లగలిగితే ఎంత బాగుంటుంది! జీవితమే ఒక చెర అనిపించింది.

ఏడేళ్ల రామూ ఆరేళ్ల కిట్టూ వాళ్ల నాన్నగారితో మాట్లాడుతూ కూర్చున్నారు. నా ఒళ్లో పడుకున్న ఆనంద లేచాడు. కారు నిలిచి పోయినందున ఉక్కకు చెమటపట్టి ఏడుపు ప్రారంభించాడు. ప్రయాణంతో విసిగిపోయిన నేను వాడికి ఒక్కటి అంటించాను. ఇంకా పెద్దగా ఏడిచాడు. నా విసుగూ నా కారణాలూ వాడికి అక్కర్లేదు. వాడిది నిజంగా ఏడుపుకూడా కాదు... కేకలు...బోద్దుగా లేతగా నవనవలాడుతూ ఒళ్లో పడుకుని కేకలేస్తున్నాడు. నాకు విసుగంతా ఎగిరిపోయి నవ్వొచ్చింది. రెణ్ణెళ్ల పిల్లవాడు. వాడిని చూచినప్పుడు వీడు నిజంగా నా కడుపులో నుంచీ పుట్టాడా? అనుకుంటాను. ఆనందం కలుగుతుంది. వాడింకా నా కడుపులోనే ఉన్నట్లూ, వాడూ నేనూ ఒకటే అయినట్లూ అనిపిస్తుంది...కొంచెంసేపు విసిరేసరికి ఏడుపు మానేశాడు. పాలు తాగుతూ, ఉన్నట్లుండి మధ్యలో త్రాగటం మరచిపోయి నన్ను పరిశీలించడం ప్రారంభించాడు. తెల్లటి వెడల్పాటి ముఖంలోనుంచీ కుంకుడు గింజల్లాంటి గుడ్లతో కొత్తగా వింతగా పరిశీలనగా వాడు నన్ను చూస్తుంటే నవ్వొచ్చింది...వాడు పుట్టాలని ఇంట్లో ఎవరూ కోరుకోలేదు. ఇద్దరు కొడుకులు చాలన్నారు ఆయన. విషయం తెలియగానే 'నీ కింకా పిల్లలెందుకూ?' అన్నది అత్తగారు దోషిని చూసినట్లు చూస్తూ. చేతులతో కాకుండా కళ్లతో మొట్టికాయ వెయ్యటం మీకు తెలుసా? ఆవిడ నన్ను మొట్టింది. నాకు ఆడపిల్ల పుడుతుందేమో ననుకున్నాను. 'ఆనందమయి' అన్న పేరు ఏర్పాటు చేసుకున్నాను. వాడికి 'ఆనందకృష్ణ' అన్న పేరు పెట్టుకున్నాను...రామూ కిట్టూ అంటే నాకు ప్రేమ ఉన్నది. కాని ఆనందతోడి బంధం వేరు. అది అనిర్వచనీయమైనది.

టాక్సీ ఒక వాకిటిముందు ఆగింది. ఎత్తయిన గోడలూ, గోడంత ఎత్తునా రేకు తలుపులు. అంచులో మూసుకు పోయి

లోపల ఎక్కడో కొద్దిగా కనిపిస్తున్నది మేడ. ఇరవై అడుగుల పొడవున ఇనప గ్రిల్లిన్‌తో రెండతస్తుల ఎత్తున ఘనంగా ఉన్నది. 'ఈ ఇంట్లో పైనా, క్రిందనా, ఎడం వైపునా, కుడివైపునా— ఎక్కడ మనం ఉండబోయేది?' అనడిగాను. 'అంతటా్నూ' అన్నారు. ఆ ఇల్లు చాలా విచిత్రమైన మనసు కల మనుష్యులు కట్టించినట్లుంది. సత్రంలో విడిగా అద్దెకిచ్చే గదుల్లాగా క్రింది వరుసలో మూడూ పై వరుసలో మూడూ గదులు వరుసగా ఉన్నై. అంతే ఇల్లు. అవే వంటకు, స్నానానికి, భోజనానికి, పడుకోడానికి—ఏ వరుసలో ఎట్లాగైనా ఉపయోగించుకోవచ్చును! ఇల్లంతా చూసి ముందర ఖాళీ చోటులోకి వచ్చి నిలుచున్నాను. మనసంతా ఏదో తెలియని గుబులు ఆవరించుకున్నది. చుట్టూ ఎత్తయిన గోడలతో మనుషుల్ని మింగే భూతంలాగా ఉన్నది ఇల్లు. మనుష్యులు నివసించే ఇంటిలాగా అనిపించలేదు. అదంటే నాకు అయిష్టతా భయమూ కలిగాయి...ఇంత అయిష్టత వెనకాలా ఏదో అస్పష్టమైన జ్ఞాపకం లీలగా మెదుల్తున్నది మనసుతో... ఈ ఇంటిని ఇదివరలో ఎక్కడో చూశానా? ఊహలోనా? కలలోనా? మరో జన్మలోనా??...

ఇరుగు పొరుగులూ పనివాళ్ళూ యీ యింటి గురించిన వివరాలు తెలిపారు. ఇంటివారికి పిల్లలు లేరు. వాళ్ళు చాలా ఘరానాగా ఉండేవాళ్ళు. పై అంతస్థు కట్టించాక జబ్బులపాలై, ఇల్లు అచ్చిరాలేదని, ఊరు ఒదిలి ప్రక్కనే ఉన్న పట్టణానికి వెళ్ళి పోయారు. తరువాత ఇద్దరు ముగ్గురు ఆ ఇంట్లో చేరి జబ్బులు చేసి, భయపడి వెళ్ళిపోయారట. ఇప్పుడు మేము చేరాము...ఈ ఇంట్లో ఉండే దయ్యం గురించి రెండు మూడు రకాలుగా చెప్పారు. ఆస్తికోసం ఇంటివారి పూర్వులు చంపిన ముసలమ్మ తాలూకు దయ్యం అని అంటారు కొందరు. కాదు, ప్రక్కరోడ్డులో కరెంటు షాక్ తగిలి చచ్చిపోయిన అమ్మాయిది అంటారు కొందరు. దాన్ని చూశామంటున్న వాళ్ళందరూ అది తెల్లచీర కట్టుకుని ముసుగు కప్పుకుంటుందని ఒప్పుకుంటున్నారు. కాని దాని వయసు విషయంలో భేదాభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. మొత్తానికి ఆడ దయ్యం. ఇంట్లో వాళ్లకు జబ్బులు కల్పించి పీడిస్తుంది. అంత వరకు ఖచ్చితంగా చెబుతున్నారు. దయ్యాలని మేము ఎప్పుడూ చూడలేదు. అవి ఉన్నవనుకోడానికి ఆధారం కనపడలేదు. అందు వలన నిశ్చింతగానే ఉన్నాం.

నెల రోజులకి ఆయనకి ఏమిటో జ్వరం ఒచ్చింది. టాన్సిలైటిస్ అనీ ఫ్లూ అనీ టైఫాయిడ్ గావచ్చునవీ, ఎందుకైనా పనికొస్తుందని క్లోరోమైసిటిన్ ఇచ్చారు. దానితో ఆ జ్వరం తగ్గింది గాని అప్పట్నుంచీ నడుం నొప్పనీ కాలునొప్పనీ జలుబనీ నీరసమనీ ఆకలి లేదనీ అజీర్ణమనీ రోజూ ఏదో ఒకటి చెప్తున్నారు. మందిచ్చిన డాక్టరుగారు జబ్బేమీ లేదని చెప్పి టానిక్కు ఒకటి యిచ్చారు. 'అయ్యగారు చాలా తీసిపోతున్నారు' అని అందరూ అంటున్నారు. 'ఈ ఊరు రావడం యిష్టంలేక కలిగిన మానసిక రుగ్మత. జబ్బేమీలేదని డాక్టరుగారు చెప్పలేదా' అనుకున్నాను. చేజేతులా జబ్బులు కోరి తెచ్చుకుంటున్నందుకు కోపమూ విసుగూ కలిగాయి.

కిట్టూకి జ్వరం వచ్చి తగ్గి కాలు వాచింది. బోదకాలు యిక్కడ జాస్తి అట. భయపడిపోయి వాడికి మందులిప్పించడం కాలికి గట్టిగా కట్టుకట్టడాల్లో మునిగిపోయాం. అంతలో రాముకి రుమాటిక్ జ్వరమట, అది ఒచ్చింది. డాక్టరుకోసం పట్నం చుట్టూ తిరగటం పెద్దపనైపోయింది.

ఒకసారి డాక్టరుగారింటి కెళ్ళినప్పుడు యాదాలాపంగా తూకం చూసుకున్నాం. నేనూ ఆపందా బరువు ఎక్కాం. రాముా, కిట్టూ కొంచెం తగ్గారు. ఆయన చూసుకుని 'ఈ ఆరునెలల్లో ఇరవై అయిదు పౌనులు తగ్గాను' అన్నారు నీరసంగా. ఆ మాట వినగానే నాకు ఒళ్ళు ఝల్లుమన్నది. ఆయన్ని పరిశీలనగా చూచాను. రోజూ చూస్తుండటంవలన నేను గమనించలేక పోయాను గాని ఆయన ఒళ్ళంతా కరగిపోయి చాలా బలహీనం అయిపోయారు! ఎన్నో భయాలు చెప్పలేని అనుమానాలు ఒక్క సారిగా ముసురుకొచ్చాయి. ఏమిటో చేసెయ్యాలన్న ఆత్రం, తపన పుట్టుకొచ్చాయి నాలో. ఆయన ఆరోగ్యం చెడిపోవటం అన్నది నేను ఎప్పుడూ ఊహించని విషయం.

బరువు తగ్గటం విషయం చెప్పాక డాక్టరుగారు శ్రద్ధగా నడుం నొప్పి విషయం పరీక్షచేసి కొద్దిగా ఆర్థ్రైటిస్ తప్ప వేరేమీలేదని మందిచ్చారు. మనసుండబట్టక ఇంకో డాక్టరుగారిని సంప్రదిస్తే వేరే పరీక్షలు చేసి ఎమీబయాసిస్ అంటూ కడుపులో క్రిములున్నాయని మందు లిచ్చారు. మరో డాక్టరుగారు టాన్సిలైటిస్ అంటూ ఇచ్చారు. కడుపులో అల్సర్ రాబోతున్నదంటూ జాగ్రత్తలూ చెప్పారు. అన్నిమందులూ తీసుకునే సరికి నీరసం కొద్దిగా తగ్గిందికాని నొప్పులన్నీ అట్లాగే మిగిలిపోయాయి. ఎవరూ చెప్పని మరో జబ్బేదో లోపల మిగిలిపోయిందేమో నన్పట్లున్నారు.

ఏ చీకూ చింతాలేకుండా ఉన్న వాళ్లకు ఒక్కసారిగామీద పిడుగుల వర్షం కురిసినట్లుగా అయింది. ఈ చింతలూరిమీదా ఈ ఇంటిమీదా, ఇందులోఉన్న దయ్యంమీదా చాలా అనుమానాలు కలిగాయి. 'ఈ ఊరు ఒచ్చాకనే యీ జబ్బులన్నీ ఒచ్చాయి ఇక్కడి నుండీ వెళ్ళిపోతే అన్నీ సర్దుకుపోయి బాగుంటామేమో' అన్న ఉద్దేశ్యం గట్టిగా ఏర్పడింది నాలో. ఆయనా అలాగే అంటున్నారు.

అప్పుడు యీ ఊరినుంచీ బదిలీకోసం ప్రయత్నం ప్రారంభించాము. ఆయన హైద్రాబాద్‌కు వెళ్ళి పై అధికారితో మా పరిస్థితి చెప్పారు. మా సొంత ఖర్చుమీదనైనా ఏదో ఒక ఊరికి వెళ్తామనికూడా చెప్పారు. 'జబ్బులు ఏ ఊళ్ళో ఉన్నా ఒస్తాయి. మందులు వేసుకుంటే పోతాయి. ఇంకో ఊళ్ళో ఉంటే రావని ఎట్లా చెప్పగలరు? అది కాకుండా సంవత్సరం మధ్యలో ట్రాన్స్‌ఫర్లు యివ్వాలంటే చదువుకొంటున్న పిల్లలుండే వాళ్లకు కష్టం. మీరు ఇంతదూరం రానఖ్ఖర్లేదు. మీకు ఏ ఊరు కావాలో వ్రాసి రిక్వెస్టు పెట్టుకోండి. జూన్‌లో చూస్తాం' అని చెప్పిపంపారు. సరే, ఈ నాలుగునెలలూ గడిపితే బయటపడవచ్చును గదా, అని ధైర్యం తెచ్చుకున్నాం. ఇది ప్రమోషన్ కాదు. ఇందులో ఒకరు మనకు ప్రత్యేకంగా చూపించవలసిన మన్నన ఏమీ లేదు. ఎందరికో ఇవ్వబడే చిన్నబదిలీనే కదా, రాకపోతుందా! అనుకున్నాం. అంతలోగా ఈ యింట్లోంచి మారిపోతే బాగుంటుందనుకున్నాను. దయ్యాలున్నవా

లేదా ? ఇల్లు అచ్చిరావడం, రాకపోవడం అన్నది నిజమా, కాదా? ఇటువంటి చర్చలతో నాకు పనిలేదు. ఈ పరిస్థితుల్లోంచి బయటపడాలి అన్న ఆరాటంలో ఆలోచనకు తావులేదు. కాని ఇంత చిన్న ఊళ్ళో మరో యిల్లు దొరకదు అని తెలిసింది. 'బదులు' అనేది లేదు—జీవితంలో లాగానే. మనుష్యులు కొన్ని పరిస్థితుల్లో చిక్కబడి ఉండవలసిందే...

జబ్బుల్తో అధైర్యంతో బదిలీకోసం ఎదురుచూడ్డంలో మరో ఏడాది గడిచిపోయింది. ఏ ఊళ్ళో ఖాళీపడిందని తెలిస్తే అక్కడికి మమ్మల్ని వెయ్యమని అప్లికేషన్లు పెడుతూనే ఉన్నారు. వేరేవాళ్ళను వేసేస్తున్నారు. మాకుమాత్రం చలనం రావటంలేదు. బలంగా పెరగాల్సిన పిల్లలు క్షీణిస్తున్నారు. ఇంట్లో ఉన్నంత సేపూ పిల్లలతో కులాసాగా కాలంగడిపే ఆయన నీరసంగా పడుకుని ఉంటున్నారు. ఏమిటీ అన్యాయం? ఏదో ఒకటి చెయ్యకపోతే ఎట్లాగ ? అని అడుగుతున్నందుకు ఆయనకు నామీద విసుగొచ్చింది. 'నీవు బాగానే ఉన్నావుగా' అన్నారు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది, 'అవునే. నేను ఎట్లా బాగున్నాను? ఎందుకు?' అనుకున్నాను. ఇన్నాళ్ళా నాకేదో పెద్దజబ్బులు చేసినట్లు బాధపడి పోతున్నాను. నిజానికి నాకు ఒక్క మామూలు జ్వరం కూడా రాలేదు ! నే: అనంతా బాగుండిపోయాం ఎట్లాగో...వాడొక మొద్దువెధవ. ఎప్పుడూ నవ్వుకుంటూ తిరగటం తప్ప మరోపని లేదు. వాడివి మాసి పొంగిపోవటం—ఇన్ని చికాకుల్లో కూడా— నాకో అలవాటై పోయింది. అందరూ జబ్బుపడుతుంటే మేము బాగుండటం చాలా తప్పుగా తోచింది నాకు...

బలాబలాలు కులాలు ప్రాంతాలు అంటూ ఎన్నోవిషయాలు ఆధారంగా మంత్రులు నియమించ బడుతున్నారు. క్రొత్తగా మంత్రిగా నియమింపబడిన నాగప్పగారు ఈ శాఖ ఆధ్వర్యం పుచ్చుకున్నారు. ఆయన రాజకీయాల్లో తక్కామొక్కీలు తిన్నవారు. లోకంపోకడ జీర్ణించుకున్నవారు. తెలుగు ఎక్కువతప్పులు లేకుండా మాట్లాడుతూ ధారాళమైన ఉపన్యాసాలు ఇవ్వగలరు. వారి జీవితానుభవంనుంచీ కొన్ని స్థిరమైన అభిప్రాయాలు ఏర్పరచుకొన్నారు. ఈ ప్రపంచమంతా రాజకీయాలు, డబ్బు అన్న ప్రాతిపదికలమీద నిలబడి నడుస్తున్నదనీ, అవి రెండూ అర్థం చేసుకున్నవాడు ఏ శాఖనైనా అవలీలగా పరిపాలించగలడనీ విశ్వసించుకున్నారు. ఈ మంత్రిపదవి అనేది నిలకడలేనిది. పోయిన ఎలక్షన్లలో ఖర్చుపెట్టిన డబ్బూ, రాబోయే ఎలక్షనుకు ఖర్చుపెట్టవలసిన డబ్బూ, తనకు సుఖంగా మనుగడ జరిగిపోవడానికి కావలసినడబ్బూ అన్నీ ఈ కొద్దికాలంలోనే సంపాదించవలసిన అగత్యం ఉన్నది. అందువలన ఏ మంత్రిగారు లేక ఏ యం.యల్.ఏ. గారు ఈపని చెయ్యమంటున్నారు, ఇందులో మనకు ఎంత డబ్బు ముడుతుంది ? అన్న రెండు—ముఖ్యంగా రెండోది- ప్రస్తుతాంశాలుగా భావించి, వారి శాఖలోని ఉద్యోగులతో ప్రమేయం లేకుండానే మంత్రిత్వం నిర్వహించడం ప్రారంభించారు. ఆయన పద్ధతివలన వారి శాఖ తల్లక్రిందులు కాలేదు. ఉద్యోగులలో కొంతకాల-పాటు అసంతృప్తి ప్రబలింది. కాని రానురాను పరిస్థితుల్ని అర్థంచేసుకుని దానికే అలవాటుపడిపోయారు. ట్రాన్స్‌ఫర్ కావాలంటే ఫలానావాళ్ళకు ఫలానావాళ్ళద్వారా ఫలానామొత్తం యివ్వాలి; ప్రమోషన్ కావాలంటే ఇంత మొత్తం; ఉద్యోగానికైతే ఇంతమొత్తం—ఇటువంటి విషయాలన్నీ స్థిరపడిపోయాక అందరికీ కొంతవరకు ప్రశాంతి లభించింది. 'వాళ్ళని వీళ్ళనీ ప్రాధేయపడి కాలం వృధా చేసుకోకుండా ఇదే బాగానే వున్నది' అనుకున్నవాళ్ళూ ఉన్నారు. ఏది కావలసినవాళ్ళు దానికి తగిన పని చేస్తే కోరినపని జరుగుతుందని తెలుసుకొని అలాగా చేసుకుంటూపోవటం ఆరంభించారు.

'గవర్నమెంటువారికి వినతిపత్రం సమర్పించుకొని కూర్చుంటే పని జరగదు సుమండీ. ఎక్కడెక్కడ చమురు వెయ్యాలో అక్కడ వేస్తుంటే కదా యంత్రం సవ్యంగా పనిచేసేది! లోకంతీరు గమనించండి. ఒంట్లో ఆరోగ్యంలేక బాధపడుతూ సంవత్సరంన్నర నుండీ అక్కడే ఉండిపోయారు, పాపం. నేను నాలుగునెల్లు కూడా ఉండలేకపోయాను!...ఇప్పుడు వరంగల్లులో ఖాళీ ఉన్నది కదా. నేను అక్కడకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలనుకున్నాను. అది పెద్దవూరు గనుక అక్కడ ఉంటే హోదాగా ఉంటుందని అనుకున్నాను' అంటూ చెప్పారుట సుఖదేవ్‌గారు ఏదో మీటింగులో కనబడి.

వరంగల్లులో ఏడాదిన్నరగా ఖాళీ ఉన్నది. మమ్మల్ని అక్కడికి వేస్తే సొంతఖర్చులతో వెళ్తామని ఏడాదిక్రితంనుండీ అడుగుతున్నా రీయన. సుఖదేవ్‌గారు ఇలా చెప్పిన పదిహేను రోజులకు గవర్నమెంటు ఖర్చుతో అతన్ని వరంగల్లు పంపారు! ఇలా ఎదురు చూడటంతో మనసు విసిగిపోయింది. బదిలీ అనేది ఒట్టి అవివేకపు మాట. ఈ ప్రపంచంలో బదిలీ బదులు అనేవి లేవు. 'అయితే' అనేది వ్యర్థమైన ఊహాగానం. 'ఉండేది' వున్నది. 'అయితే', 'అయివుంటే' అనేవి లేవు. లేనివాటి గురించి ఆలోచించడం ఆశించడం అవివేకం. పరిస్థితులతో రాజీపడుతూ పోవటమే జీవితం అంటే...

ఇటువంటి నిస్పృహలో వుండగా మరో ఆశాకిరణం కనిపించింది. నల్గొండలో వుండే అధికారి మరో వూరు బదిలీ చేయించుకోబోతున్నట్లు తెలిసింది. పోనీ ఈ సందర్భంలోనైనా మమ్మల్ని కదిలిస్తారేమోనన్న ఆశతో, మమ్మల్ని నల్గొండకు మార్చమని యింకో రిక్వెస్టు పెట్టుకున్నారు. తరువాత చాలా రోజులవరకూ దానికోసం ఎదురుచూస్తూ ఉండిపోయాం.

ఏపనిమీదనో హైదరాబాదుకు వెళ్లివచ్చినవాళ్ళు అక్కడి వార్తలు తెస్తున్నారు, 'మిమ్మల్ని నల్గొండ వేస్తున్నారుట' అంటూ. అయితే నెలలు గడిచిపోతున్నా ఆ ఆర్డరు మాత్రం రాలేదు. ఆ ఫైలు మంత్రిగారి దగ్గరకు పోయిందట. అన్ని విషయాలూ వారే స్వయంగా పరిశీలిస్తున్నారట.

అమ్మయ్య! అని దీర్ఘనిశ్వాసం తీసుకున్నాము. ఎలాగూ ఎండాకాలం సెలవు లొస్తున్నాయి. రాముని ఏకంగా నల్గొండ హైస్కూల్లో చేర్పించవచ్చును. అక్కడ మంచిస్కూలు ఉన్నదట. కిట్టూని ఇప్పటికైనా కాస్త షుమారుపాటి ఎలిమెంటరీస్కూల్లో చేర్పించవచ్చును. నీళ్ళు మారితే, ఊరు మారితే ఈ వింతజబ్బులు తగ్గకపోతాయా! మళ్ళీ ఇదివరకట్లాగా సుఖంగా ఉండకపోతామా! అనుకున్నాం ధైర్యం కూడదీసుకుంటూ.

జూన్‌లో స్కూళ్ళు తెరిచారు. ట్రాన్స్‌ఫర్‌ఫైలు మంత్రిగారి దగ్గర్నుండి ఎందుకో క్రిందికి వచ్చిందట. అంతా పూర్తయే

వరికి మరో రెణ్ణెల్లు పట్టవచ్చును అన్నారు. రెండువెలలే కదా, ఎలాగో దాటలేకపోతామా! అనుకున్నాం. ఇంతలో రామూకి క్రొత్త రకంజ్వరం పట్టుకున్నది. రోజూ మధ్యాహ్నం జ్వరం వచ్చి సాయంకాలానికి తగ్గిపోతున్నది. పిల్లవాడు దినదినానికి క్షీణించడం ప్రారంభించాడు. పట్నం తీసుకెళ్ళి ఒకరితర్వాత ఒకరుగా ముగ్గురు డాక్టర్లకు చూపించాం. వాళ్ళు రక్తమూ మలమూత్రాలూ, ఎక్స్‌రే వగైరాలన్నీ పరీక్షించి జబ్బేమీలేదు, అదే తగ్గిపోతుందన్నారు. ఆఖరుకి ఒక డాక్టరుగారు వాడికి బ్లడ్ కాన్సర్ కోసం పరీక్షించాలన్నారు. అసలు మేము ప్రాణాలతో ఈ ఊరినుండి బయటపడతామా ! అన్న నిస్పృహ కలిగింది. ఎల్లాగూ ఇంకో రెండునెల్లలో నల్గొండకు ట్రాన్స్‌ఫర్ వస్తుంది. అందాకా పిల్లల్ని తీసుకుని మా ఊరికి వెళ్ళి తాత్కాలికంగానైనా యీ బాధ తప్పించుకోవాలనిపించింది. ఆయనకు భోజనం విషయంలో చాలా ఇబ్బందౌతుంది. అయినా సరే, ఈ నాలుగురోజులూ నెట్టే... నేను అనుకుంటూ ఉండగానే నల్గొండకు వేరే ఎవర్నో వేశారనీ, యిప్పట్లో మాకు మార్పు రాదనీ తెలిసింది.

తరువాత రెణ్ణెల్లలోనూ మూడుసార్లు ముసురుపట్టింది. పదిరోజులు ఒకటేవరుసన వానపడింది. ఆకాశం మురికిరంగు పులుముకొని వానమబ్బుల్తో మూసుకుపోయి వుంటున్నది. చిక్కగా, పట్టుకుంటే దొరికేట్లున్న ఆ వాతావరణం ఎన్నో విధాలుగా పీడించబోయే అనారోగ్యాల్ని సూచిస్తున్నట్లుంది. పంచభూతాలూ కలిసి ప్రపంచాన్ని నాశనంచెయ్యాలని నిర్ణయించుకున్నాయా? అనిపిస్తున్నది. ఈ లోకాన్ని నలిపివెయ్యడానికి ముసురుపట్టిన ఆకాశం క్రిందికి, యింకా క్రిందికి, యీ భూమిమీదకు దిగివచ్చేస్తున్నది. ఇది ఒక శ్మశానం! ఒక సమాధి!

ఈ రెండు నెల్లలోనూ ఊళ్ళోంచి మూడుశవాలు వెళ్ళినై. జంగంవాని శంఖారావం నిత్యం వినబడుతున్నట్టే ఉన్నది. రాత్రిళ్ళు కుక్కలు ఒకటే ఏడుపు.

ఈ వాతావరణం నా గుండెను పిండేస్తున్నది. ఏమిటో భయం. మా ఊళ్ళో కొండలూ, చెట్లూ, తేలిగ్గా పరుగెత్తే గాలీ, నిర్మలమైన ఆకాశమూ, వెలుగు నింపుకున్న విశాలమైన ప్రపంచమూ ఉన్నై. అక్కడికి వెళ్ళిపోవాలి ... తొందరగా ... వెంటనే...అందరూ బాగుండగానే...ఏ విధంగానైనా సరే!...

వరంగల్లు ట్రాన్స్‌ఫర్ కోసం సుఖదేవ్‌గారు నాగప్పగారికి రెండువేల రూపాయలు బహుమాన మిచ్చారట. అది 'పై' 'సంపాదన' బాగా దొరికే వూరుగనుక సుఖదేవ్‌గారు ఖర్చుపెట్టిన దానికి ఈ ఏడాదిలోనే ముబ్బడిగా సంపాదించగలనన్న నమ్మకంతో ఉన్నారుట...మాకు అల్లాంటి సంపాదన అక్కర్లేకపోతే మానె కాని ఈ మహాశ్మశానంనుంచీ బయట పడటానికి యివ్వవలసిన వాళ్ళకు వెయ్యో రెండువేలో యిస్తేనేం? అనుకున్నాను. మంచిగా నీతిగా ఉన్నందువలన రవంతైనా మంచి జరగలేదు సరిగదా, మూడేళ్ళబట్టీ ఈ ఊళ్ళో ఘోరమైన అశాంతిలో చిక్కుబడిపోయాము! 'మంచి'గా ఉండకపోతే ఎప్పుడో బయటపడే ఉందుము! ఇప్పటికైనా ఆ విషయం తెలుసుకున్నాం గనుక యిక్కణ్ణుంచి బయటపడొచ్చు. మనిషైనందుకు, ఆలోచించగల మనసున్నందుకూ మంచీ చెడ్డా ఆలోచించుకుని ముందడుగు నిర్ణయించుకోవాలి.

కాని ఈ విషయంలో ఆయన ఉద్దేశ్యాలు వేరుగా ఉన్నవి. 'ఇట్లాగ లంచా లిచ్చి పనులు చేయించుకునే వ్యవహారం సరైనదికాదు. ఒకపని మంచిది కాదు అనుకున్నాక ఆపని నేను చెయ్యను. అది నా స్వభావానికి విరుద్ధం' అన్నారు.

ఏమిటీ స్వభావం? అది మనిషిని అంతగా బంధించేస్తుందా? లోకం తీరుతో సంబంధం లేకుండా, మనిషి కష్టసుఖాలతో సంబంధం లేకుండా, చెయ్యవలసిన పనులను నిర్ణయించే ఆ 'స్వభావం' ఎక్కడనుంచీ వచ్చింది? అసలు బ్రతికి ఉంటే గదా స్వభావం ప్రసక్తి రావాలి! పుట్టెడు జబ్బులో మునిగి ఉన్న వాళ్ళకి స్వభావం ఏమిటి! బ్రతుకుకంటే స్వభావం ఉంటుందా!

"నీతి న్యాయం అనేవి దేశ కాల ప్రాంతాలతో మారుతూ ఉండేవి. వాటికి అంతకంటే ఎక్కువ విలువ ఎందు కివ్వాలి? లంచం యివ్వడం పుచ్చుకోడం అనేది ఈ కాలంలో సర్వసాధారణం అయిపోయింది. ఇంతమందికి లేని తప్పు మనకిమాత్రం ఎక్కణ్ణుంచి వచ్చిందండీ? మీరనే తప్పుచేస్తున్నవాళ్ళు కోరుకున్నచోట కోరుకున్నట్లు సుఖంగా ఉంటున్నారు. మనమేమో ఎక్కడ పడవేస్తే అక్కడఉండే గొంగళిలాగా యిక్కడే ఉంటూ నానాటికీ దిగజారుతున్న ఆరోగ్యాలతో చచ్చిపోతున్నాం ... ఆ రాముా మొఖం చూచి సిద్ధాంతాలు మాట్లాడండి. మీ విషయంలో మీరు ఎల్లాంటి నిర్ణయమైనా తీసుకోవచ్చును. కాని పిల్లల్ని మార్గాంతరం ఉండీ, యిక్కడే పెట్టడం న్యాయమేనా?...ఏదో ఒకటి ఈ ఒక్కసారికి నలుగురితోపాటు నడిచి యిక్కణ్ణుంచి బయటపడ్డాక మీ యిష్టం వచ్చినంత మంచిగా ఉందురుగాని..."

ఎన్ని విధాలుగా చెప్పినా ఆయన మొండితనం విడువలేదు. నా బాధ ఆయన కర్థంకాదు. ఆయనస్తబ్ధత, చేతగానితనం మా అందరికీ గుదిబండయై అందర్నీ నేల కీడుస్తున్నది. మాకు ఈ నరకంలోనుంచీ విమోచనం లేకుండా చేస్తున్నారు చేజేతులా!

'ఏక్షణానికాక్షణం ఏది మంచిదని తోస్తే అట్లా చేసుకుపోవచ్చునని నీవనుకుంటున్నావు. ఈ క్షణంలో కలిగే కష్టసుఖాల్ని, లోకం తీరునిబట్టి మంచీ చెడ్డా నిర్ణయించుకోవా లంటున్నావు. అవన్నీ పైకి కనిపించేవి మాత్రమే...తప్పూ ఒప్పూ అనేవి ఆ మనిషి మనసుకూ స్వభావానికీ సంబంధించినవి. నీచేతికి ఒక కత్తి యిస్తే ఆదోవన పోయేవాడిని పొడవగలవా? ఒకడు కారణం లేకుండానే పొడవగలడు. ఒకడు ఆత్మరక్షణకోసమైతే పొడవగలడు. మరొకడు ఆత్మరక్షణకోసరం కూడా పొడవలేక పోవచ్చును. స్వభావం అనేది మనిషిని నియమిస్తున్నది కదా. దాన్నిబట్టే మనిషి మనసు తప్పొప్పుల్ని నిర్ణయిస్తుంది...ఇహ స్వభావం అనేది మనిషిని ఎంతవరకు నియమించగలదు? తప్పు అనుకున్నపనిని మనిషి చెయ్యలేడా? అన్నప్రశ్న రావచ్చును. ఆలోచన, తర్కం ఆధారంగా చేసుకుని, ఈ క్షణంలో కన్పించిన కష్టం దాటడానికని, స్వభావ విరుద్ధమైన పనులు, తప్పు అని తెలిసే మనసుని ఎట్లాగో సమాధాన పరచుకుని, చేస్తారు. ఇదిగో, ఇప్పుడు నీవు

చెప్పడంలా, అట్లాగే! కాని నిజాయితీ ఉండేమనిషి అట్లా చేసినప్పుడు మానసికంగా సంఘర్షణకు గురైపోయి అశాంతి పాలౌతాడు...'

అక్కణ్ణుంచి లేచి వెళ్లిపోయాను. ఈ సిద్ధాంతాల్లో నాకు ఆసక్తి లేదు; అవి నాకు అర్థమూ కావు. ఈ ఊళ్లోంచీ బ్రతికుండగానే బయటపడే మార్గం ఏమిటా అని సతమతమై పోతుంటే, స్వభావం కత్తులు అంటూ ఉపన్యాసం యిచ్చేమనిషిని ఏమనాలి! ఇట్లాగ సిద్ధాంతాలమీద ఆధారపడి జీవితాన్ని నడుపుకునేవాళ్లు కష్టాల్ని చేజేతులా కొని తెచ్చుకునేవాళ్లు నిజంగా ఉంటారని...నాకు అవన్నీ ఎందుకు? అక్కర్లేదు! అక్కర్లేదు! నేనూ నా వాళ్లూ బ్రతికి బాగుండాలని నా ఆశ. అంతే.

...ఆ రోజున జరిగిన సంఘటనలన్నీ నా మనసులో ముద్ర వేసినట్లు నిలిచిపోయాయి. ఆనాటి ప్రతిమాటా చేతా రోజుకి అనేకమార్లు నాలో పునరావృతం అయ్యాయి. నేను ఆ రోజులోనే నిలిచిపోయాను. బయటపడాలన్న కోరిక ఏ మాత్రమూ లేదు నాలో.

ప్రతి శనివారం సాయంత్రంపూట ఒక గంటసేపు ప్రశాంతంగా తబలా తాళాలు వాయిస్తూ భజన చేసుకోవడం మాకు అలవాటు. ఆరోజున ఆయనతో బాగా ఘర్షణపడి చాలా నిస్పృహలో ఉన్నాను, భజనకు వెళ్ళకుండా రాత్రికి పూరీలు చెయ్యడానికి వెళ్ళాను...కాల్చిన పూరీ గరిటెతో పైకెత్తి పట్టుకున్నది తిరిగి నూనెలోకి ఎట్లా పడ్డదో నేను గమనించలేదు... సెగలుకక్కే నూనెచినుకులు నా చేతినిండా, మొహంమీదా చింది పోయినై. నూనెపడినచోట్లు భగభగా మండుతున్నవి. స్టౌ ఆర్పేసి బయటికి వచ్చి కూర్చున్నాను. మృత్యుదేవత నన్ను మింగి వెయ్యాలని మీదికొస్తున్నట్లు భయం. ఒళ్లు స్వాధీనంలో లేకుండా వణికిపోతున్నది. అందర్నీ కేకలేసి పిలిచి నాకు జరిగిపోయిన ఈ ప్రమాదాన్ని గురించి చెప్పెయ్యాలనిపించింది. అంతలోనే ఎవరి మీదో ఏమిటో కసి, 'ఎవ్వరితో చెప్పకూడదు. వాళ్ళు చూసి అడిగినప్పుడే చెప్పొచ్చునులే' అనుకున్నాను.

ఈ స్థితిలో మనసునిండా ఒకటే ప్రశ్న. 'ఎందుకు నాకు యిట్లా జరిగింది?' అన్న ప్రశ్న. 'పూరీ నూనెలో పడి నూనె చిందింది' అన్నది దానికి సమాధానం కానేకాదు. దానికి సమాధానం చావుపుట్టుకలను సమన్వయించేసే యింకో స్థాయిలోనుండే రావాలి.

ఎందుకు? ఎందుకు అట్లా జరిగింది?

ఇది జీవన్మరణ సమస్య. ఏమిటో, ఎందుకో, ఎక్కడో భయం. అర్థంకాని భయం.

ఆనంద వచ్చాడు. నవ్వుతూ 'అమ్మా, దా' అన్నాడు.

ఎక్కడికి? ఎందుకు? అసలు ఆ నవ్వెందుకు వాడి మొహాన? నాలో కోపం ఉవ్వెత్తుగా లేచింది. వాడి వీపుమీద ఫెళ్ళున వేశాను దెబ్బ.

'పో రా, పో. ఎందుకొచ్చావు? ఎప్పుడూ నన్ను పీడిస్తావెందుకు రా! కాసేపు నా పాటికి నన్ను బ్రతక నివ్వవే...శని వెధవ...చావనన్నా చావవు...' తిడుతున్న కొద్దీ కోపం రేగి పోయింది.

కాసేపు నిల్చుని చూసి వెళ్లిపోయాడు.

నిదానంగా ఒంటిమీది మంటలు తగ్గాయి. అర్థంలేని ఆ భయమూ శాంతించింది. పూజ గదిలోనుంచీ పాటలూ వాద్యాలూ వినబడుతున్నాయి. నాకు జరిగిన ప్రమాదం గురించి ఎవరికీ చెప్పకూడదు అనుకున్నాను ఉదారంగా. పూరీలపని పూర్తి చేసుకున్నాను. రామూ తీర్థం, ప్రసాదం తెచ్చియిచ్చాడు.

గంటసేపు గడిచాక అందరూ భోజనాలకు వచ్చినప్పుడు ఆనంద లేడని తెలిసింది. మర్నాడు ఇంటివెనుక చెరువులో దొరికాడు—నా ఆనంద—నా...

ఆ చివరి దృశ్యాన్ని ఎన్నో వందలసార్లు పునఃసృష్టి చేసుకున్నాను. బాగా పరిశీలించి చూశాను. వాడు ఎందుకు అట్లా వెళ్లిపోయాడు! నేను చావమంటే చచ్చిపోయాడా!...ఒకటి మాత్రం నాకు రూఢిగా తెలుసు. నేను కొట్టినందుకు వాడికి కోపంగాని ఏడుపుగాని లేదు. వాడు ఎందుకు చచ్చిపోయాడు? ఎందుకు వెళ్లిపోయాడు?

'అయ్యో, దేవుడిపూజ జరుగుతున్నప్పుడు పసివాణ్ణి పాడుమాట ఎందుకన్నావు?' అత్తగారు అదేమాట ఎన్నోసార్లు అన్నది. పూజ జరిగేటప్పుడు పాడుమాట అనకూడదా? అంటే జరుగుతుందా? ఇప్పుడు జరిగిందే! దేవునికీ మాటకీ సంబంధం వచ్చిందే! ఎక్కణ్ణుంచీ వచ్చింది? సరిగ్గా అటువంటి సమయంలో ఆ మాట వాణ్ణి నేను ఎందుకన్నాను??

స్వభావం అనేది మనిషికి ఉండటం నిజమైతే, నా స్వభావం ఆనందకు తల్లిగా ఉండటం. నేను ఆ క్షణంలో బ్రతికేదాన్ని. ఆనందకు తల్లిని. అంతకుమించి నేను ఎవర్నీకాను!

ఒక్కోసారి నేనూ వాడితోపాటే చచ్చిపోయాననుకుంటాను. ఇంకోసారి వాడూ నాతోపాటే బ్రతికున్నాడనుకుంటాను. నిజం ఏమిటో సరిగ్గా తెలియదు నాకు.

ఈ చింతలూరికి వచ్చి నాలుగేళ్లయింది. నాలుగేళ్లు! అంతకాలం నా బిడ్డను లాలిస్తూ దండిస్తూ కోపిస్తూ విసుక్కుంటూ తిట్టుకుంటూ—ఎంత ఆనందం అనుభవించాను! కాని అది ఆనందం అని అప్పుడు నాకు తెలియలేదు. అన్నీ వేరువేరుగా దండనగా కోపంగా విసుగ్గా కనిపించాయి. వాటిల్లో—ఆక్షణంలో—మునిగిపోయాను.

అకస్మాత్తుగా ఆ శనివారంతో అన్నీ క్షణికమైపోయాయి. అన్నీ నిత్యమైపోయాయి!

ఇప్పుడు ఆ బదిలీ వచ్చినా రాకపోయినా ఒకటే. ప్రపంచమే నాలోకి బదిలీ అయిపోయింది. ఇప్పుడు నేనే ప్రపంచాన్ని...

వీణ - వైణికులు

• శ్రీ మంచాళ జగన్నాథరావు

వీణా వేణు మృదంగాలు అనాదినించి మధురమైన సంగీత వాద్యాలుగా మన దేశంలో పరిగణింపబడుతూ వస్తున్నాయి. మన సంస్కృతిని ఈ మూడు వాద్యాలు ఎంతవరకూ హత్తుకు పోయాయంటే, ఏ శాస్త్ర గ్రంథమయినా ఎక్కడో అక్కడ ఈ సంగీత వాద్యాలను గురించిన ప్రసక్తి లేకుండా వుండదు. ముఖ్యంగా తెలుగుదేశంలో వీణ ఎంతో ముఖ్యమయిన వాద్యంగా జనాదరణ పొందుతూ వచ్చింది. వీణ మానవ కంఠస్వరానికి అతి దగ్గర పోలికతో వుంటుంది. అంతే కాకుండా 'వీణావాదన తత్త్వజ్ఞః శ్రుతిశాస్త్ర విశారదః' అని వైణికుడు కానివారికి వేద విజ్ఞానం అలవడదని ఏవో రక రకాల అభిప్రాయాలు మనవాళ్ళలో ఉండడం వలన కానీయండి, లేదా ఆ వాద్యంలో వున్న మాధుర్యం వలన కానీయండి ఆంధ్రదేశంలో దీనికి ఎంతో ఎక్కువగా ఆదరణ లభించింది.

సంగీత శాస్త్ర గ్రంథాలు సంగీత రచనలు సంస్కృతం లోను తెలుగులోను ఎంతో చక్కటి సంప్రదాయాలు కట్టుబాట్లు నెలకొల్పినవారు నూటికి తొంభై తొమ్మండుగురు తెలుగువారే! అంతే కాదు. ఆంధ్రుల సంస్కృత భాషా పాండిత్య ప్రకర్ష జగ ద్విదితము. ఆ, ఈ కారణాలవల్ల ఆంధ్రదేశంలో వైణికులు, వీణను గురించి ఎక్కువగా వ్రాసినవారు వున్నారేమో అని అనుకోవచ్చు.

వీణ సరే! దీనిని యోగశాస్త్రంలో శరీరానికి ఉదాహరణగా చెప్పారు. కావ్యాలలో శృంగార నాయికలు వీణావాదన చతురలు కానివారే లేరు. కవులు తమ జీవితకాలంలో తాము చూసిన, విన్న, తెలుసుకున్న మంచివి అందమైనవి ఉన్నతమయినవి అయిన విశేషాలు, భావాలు తమ కావ్యాలలో పొందు పరచుకోవడం మామూలు విషయమే కదా !

శ్రీకృష్ణదేవరాయల కాలంనాటికి వీణలు రెండు సొరకాయ తుంబలపై చక్కటి నగిషీలు చెక్కిన అందమయిన దండి వుండి దానిపై ఏ రాగాన్ని పలికించాలంటే ఆ రాగానికి కావలసిన స్వరాలను శ్రుతి చేసుకునే పద్ధతిలో వుండేవి. వాట రాగానికి మేళవించిన వీణ దేశాక్షి రాగాన్ని పలికించడానికి వీలులేదు. అంటే శ్రుతులు (లేక స్వరాలు) అన్నింటికి ఒక్కొక్క తంత్రి చొప్పున వుండేవని అనుకోవలసి వస్తోంది. ఇంతే కాదు; ఇంచు మించు 1500—1600 శతాబ్దము దాటేవరకూ వీణలో ఎక్కువ వికాసము వచ్చినట్లు కనబడదు.

ఈనాడు కూడా ప్రాచీన వీణా స్వరూపం అక్కడక్కడ కనబడుతూనే వుంది. ఐరోపాఖండములో అక్కడక్కడ కనబడే హార్ప్, భారతదేశపు సరిహద్దులలో కనబడే సంతూర్, స్వరమండలి అనేవి వీణ యొక్క మొదటి స్వరూప అవశేషాలే. తరువాత మేండలిను, స్పేనిష్ గిటార్ మొదలయిన రూపాలు కూడా వీణలో వచ్చిన పరిణామాల తాలూకు ఆనవాళ్లే. మనదేశంలో పర్షియా వారు, మహమ్మదీయులు, గ్రీకులు మొదలయిన జాతులవారి దండ యాత్రలు, ఒత్తిడులు వీటి వలన కొంత మన సంస్కృతిని వారు, వారి సంస్కృతిని మనం ఇచ్చి పుచ్చుకోవడాలు జరగడంమంచి సప్త తంత్రి వీణ సెహ్‌తార్ కావడం ఆ తరువాత సితార్ కావడం దానికి 1 2 3 4 క్రమంలో శ్రుతి చేసుకోవడానికి వీలుగా వుండవలసిన తంత్రుల క్రమం 4 3 2 1 గా మార్పు చెందడం జరిగింది. తరువాత మెట్లు లేకుండా వున్న వీణ యొక్క పరిణామం మహానాటక వీణ, దానినే బీన్ అని కూడా ఉత్తరాదిని అంటారు. దక్షిణాదిని గోటువాద్యం అంటారు. హవాయెన్ గిటార్, సరోద్, రబాబ్, గంబూజ్ అనబడే రక రకాల వాద్యాలు దేశ విదేశాలలో ఇంకా వాడుకలో ఉన్నాయి.

ఆంధ్రుడయిన సోమేశ్వర పండితుడు ఒక్కొక్క తీగమ, ఒక్కొక్క శ్రుతికి మేళవించుకోవడం చాలా ఇబ్బందిగా వుందని నాలుగు తీగలువేసి వాటి క్రిందుగా సారికలు (మెట్లు) మైనంలో బిగించి శ్రుతులు లేక స్వరాలు పలికించడం చాలా సులువయిన పద్ధతి అని 'రాగ విబోధము' అనే తన గ్రంథంలో వ్రాశారు. అంటే ఇతడు చాలా కష్టసాధ్యమయిన పరిశ్రమచేసి క్రొత్తని ఎంతమాత్రం ఒప్పుకోని సమకాలికులను ఒప్పించి వీణలో అత్యద్భుత మయిన మార్పులు చేశారన్నమాట. ఇతని తరువాత వీణలో దశవిధ గమకాలు పలికించడం, రక రకాల మీటుజాతులు, ధాతు మాతువుల ప్రత్యేకతలు తెలిసే విధంగా ఎడమ, కుడి వ్రేళ్ళ ఉపయోగ పద్ధతులు ఇవన్నీ రూపు రేఖలు దిద్దుకొని తరువాతి గ్రంథకర్తలు తమ గ్రంథాలలో వీణా వాదన ప్రక్రియ అంతా విపులంగా చర్చించారు. ముఖ్యంగా గాత్రంలో కూడా అంత నిర్దుష్టంగా అప్పటివరకూ ఏర్పడని ఒక గంభీరమయిన శైలి దక్షిణ భారతీయ సంగీతానికి ఏర్పడింది. మొత్తం భారతీయ

సంగీతానికే ఈ మార్పు వచ్చి వుండవలసింది. కాని ఉత్తర భారతంలో రాజకీయ పరిస్థితులు అతి త్వరితగతిని మార్పు చెందడం, ఒక ప్రభువు తాన్‌సేన్ వంటి మహా గాయకుడిని పోషిస్తే, మరొక ప్రభువు సంగీతాన్ని ఎన్నటికీ బయటికి రాలేనంత లోతుగా గొయ్యి తీసి పాతివేయమని శాసించడం వంటి విచిత్రాలు జరుగుతూవుండడంనుంచి అక్కడి సంగీతం కాలాను గుణంగా మార్పు పొందక తప్పలేదు. దక్షిణాదిని వాద్యాలు కొంచెం ఇంచుమించు స్థిరత్వం సంపాదించుకోవడంవల్ల, మత సంబంధ మయిన ప్రాముఖ్యం సంగీతానికి వుండడంవల్ల, ఇక్కడ వెనుకటి నాలుగయిదు శతాబ్దాలనించీ సంగీతం తన స్వరూప సౌందర్య సౌరభ్య సౌభాగ్యాలను క్రమంగా పెంపొందించుకుంటూనే వుంది. సంక్షిప్త రూపంలో ఒక రకంగా ఇదీ చరిత్ర.

ఇక దక్షిణదేశంలో సంస్థానాధీశ్వరులు, తగుమాత్రపు వసతులు గల జమీందారులు, ఒకరో ఇద్దరో సంగీత విద్వాంసులకు ఎంతో కొంత జీతం ఇచ్చి పోషిస్తూ వచ్చారు. ఈ రకమయిన కోవకు చెందినవే వెంకటగిరి, బొబ్బిలి, విజయనగరం, మైసూరు, తిరువాన్‌కూరు, కొచ్చిను, ఎట్టియాపురం మొదలయిన సంస్థానాలు; ఉర్లాం, కసింకోట మొదలయిన కొన్ని చిన్న జమిందారీలు ఇటువంటివే. ముఖ్యంగా ఆంధ్రదేశంలో కొన్ని వంశాలలో పారంపర్యంగా వీణను అభ్యసించి ప్రభువులచేత కళాపిపాసువులచేత మన్ననలు పొందినవారు కొంతమంది ఉన్నారు. విజయనగరం బొబ్బిలి ఒకప్పుడు సరస్వతీ నిలయములై వెలుగొందాయి. ఒకరికన్న ఒకరు గొప్ప విద్వాంసులను తమ కొలువులో నిలుపుకోవాలనే స్పర్ధతో ప్రభువులు విద్వాంసులను ప్రత్యేకంగా పిలిపించి గౌరవించి ఆదరించేవారు. ఏ విద్యకయినా ఆ రోజులలో ప్రజాదరణ అంతంతగానే వుండేది. అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ కూడా ధనార్జనకి పనికివచ్చే విద్యే అందరికీ కావలసినది. అందుకే సంగీత పాఠకులు నిజంగా గొప్ప విద్వాంసులయితే వారి విద్యాపటిమకి గీటురాళ్లవంటి రాజాస్థానాలకు చేరుకునేవారు ఆ రోజులలో. లేనివారు తమ వూళ్లో వున్న భాగ్యవంతుల ఇళ్ళని ఆశ్రయించుకునో, విద్యలను జీవనోపాధికి ఒక ముఖ్యాధారంగా చేసుకుని బ్రతికే రూపాజీవికలకు పాఠాలు చెప్పుకొని కాలక్షేపం చేసుకుంటూనో వుండేవారు.

ఒకప్పుడు భాగ్యవంతులు తమ బిడ్డలకు అన్ని విద్యలతో పాటు సంగీతం నృత్యం కూడా నేర్పించేవారు. కాని ఎప్పటినించి వచ్చిందో తెలియదు కాని 'నట విట గాయకులు పంక్తి బాహ్యులు' అనే నానుడి పుట్టిన తరువాతే కావచ్చును, పరువుగల కుటుంబాల వారు సంగీతం నాట్యం వీటి జోలికి పోవడం మానేశారు. అయితే ఈ రెండు కళలలోనూ ఉన్న ఆకర్షణ తక్కువదేమీ కాదు కదా! అందుచేత రూపాజీవికలు ఈ విద్యలు తమ వృత్తి వ్యాపారాలకు ముఖ్యమైన సాధనాలుగా ఉపయోగించడం మొదలుపెట్టేరు. 1900 శతాబ్దపు చివరి రోజులలో మళ్లీ ఈ కళలు అన్ని జాతులవారు ఆదరించి అందుకోవడం ఆరంభించారు. అందుకే 30, 40, సంవత్సరాల క్రిందటినించి పరిశీలించి చూస్తే విద్వాంసులయిన బ్రాహ్మణులు విదుషీమణులయిన వేశ్యలు మనకు కనబడుతారు.

ఇంక చరిత్ర సంగతిని అలా వుంచి నేను తెలుసుకున్న కొందరు విద్వాంసులను గురించి చెప్తాను. అంటే నేను చెప్పే దంతా నా వినికిడి మీద ఆధారపడినదే కాని మరొకటి కాదు. కనుక నాకు తెలిసిన వాటికన్న, నేను వ్రాసినవారిని గురించి ఎక్కువ తెలిసినవారు ఇంకా ఎందరో ఉండవచ్చు. ఇలాగే వారికి తెలిసినవారిని గురించి వాళ్లకు తెలిసిన విషయాలు వ్రాస్తే ఎంతయినా లోకోపకార మవుతుంది.

గంజాంజిల్లా ప్రాంతాలలో పొడుగు రామ్మూర్తిగారని ఒక వైణికులుండేవారు. వారి ప్రజ్ఞా పాటవాన్ని గురించి ఈనాటికీ కథలు గాథలు చెప్పుకుంటూ ఉంటారు ఆ జిల్లాలలో. దూర్వాసుల వారి కుటుంబాలలో కూడా చాల గొప్ప వైణిక విద్వాంసులుండే వారు. ఈనాటికి అంటే ఈ తరానికి వెనుకటి తరంవారు కొద్దో గొప్పో వీణ వాయించేవారు.

విజయనగర సంస్థాన ప్రభువులు విద్యాపోషకులు. వారి సంస్థానములో గురాచార్యుల రవణయ్యగారని ప్రసిద్ధ వైణికులుండేవారు. వీరిని గురించి రక రకాల కథలున్నాయి. వీరినే వీణ రవణయ్యగారని అనేవారు. మైసూరు మహారాజావారు ఒకసారి విజయనగర ప్రభువుల అనుమతి మీద వీరిని మైసూరు రప్పించుకొని వీణ విని ఆనందించారని, అప్పట్లో వీరికి అక్కడి విద్వాంసులు బ్రహ్మరథం పట్టారని అనుకుంటారు. వీరు వీణలో ఆరు కాలాలు వాయించగల పాటవం వున్నవారు. వీరి శిష్యులు ఎవర్ని గురించీ వినలేదు.

వీరి తరువాత మొత్తం దక్షిణాపథం అంతా ఎరిగిన వైణికులు తుమ్మరాళ సంగమేశ్వర శాస్త్రిగారు. సంగమేశ్వరశాస్త్రి గారిని ఎంతో సన్నిహితంగా ఎరిగినవారు, వారి విద్యా విశేషాలు ప్రత్యేకతలు, పరీక్షగా విని ఆనందించినవారు ఇంకా చాలామంది మన దేశంలో ఉన్నారు. వారు 'సంగీత విద్య పూర్వజన్మ సుకృతం వున్నవారికి వింటేనే వస్తుంది. అలా రానివాడు చెప్పి ప్రయోజనం ఏమీ లేదు' అనేవారుట. ఆ కారణంచేతనే వారి కుమారునికి కూడా ఏమీ చెప్పలేదని అంటారు. అయితే మండ సోదరులు అనేవారు మాత్రం ఏదో కొద్దిగా నేర్చుకొని తరువాత స్వయం కృషితో పాఠాలు చెప్పుకునేవారట.

సంగమేశ్వరశాస్త్రిగారిని ఒకసారి రవీంద్రనాథ్ టాగూర్‌వారు శాంతినికేతన్ తీసుకు వెళ్లి తమవద్ద ఎంతో గౌరవంగా ఒక ఆరు నెలలపాటు అట్టే పెట్టుకొని వీరి వీణా వాద్యం విని ఆనందించే వారుట. పాశ్చాత్య దేశాలలో కూడా శాస్త్రిగారిచేత వీణ వాయింపించి గౌరవింప చెయ్యాలని టాగూర్‌వారు ఎంతో ప్రయత్నించారుట. శాస్త్రిగారు ఎన్నడూ దేశం వదలి వెళ్లినవారు కాదు. ఆ శాంతినికేతన్‌లో ఆరు నెలలు వుండడమే బ్రహ్మప్రళయం అయి

పోయిందిట. అప్పట్లో గ్రామఫోను కంపెనీవారు వీరి వీణ రికార్డు వెయ్యడానికి ఎంతో ప్రయత్నించారుట. సరిగా ఉపయోగించడం చేతకానివారి చేతులలో ఆ గ్రామఫోనులలోనించి దుఃఖపూరితము అయిన ఆర్తనాదాలు వినవస్తూ ఉండేవి. తమ రికార్డు కూడా ఇటువంటి దుర్దశకే వస్తుందేమో అన్న భయంచేత శాస్త్రిగారు ససేమిరా రికార్డు ఇవ్వనన్నారుట.

వీరి బావగారు శాస్త్రిగారివద్దనే కొంతవరకూ సంగీతాభ్యాసము చేశారు. తరువాత 'అక్షర లక్షల సాధకం చెయ్యాలోయ్' అని వారు ఇతరులకు చెప్పే మాట స్వయంగా సార్థకం చేసుకున్నారు. కనుకనే ఆఖరివరకూ వారిచేతిలో సంగీత సరస్వతి అలా నాట్యం చేసింది.

అసలు శాస్త్రిగారు కసింకోట సంస్థానములో ఉండేవారు. అక్కడినించి పిఠాపురం రాజావారు వీరిని రప్పించుకున్నారు. కసింకోటలో ఉన్నప్పుడే ద్వారం వెంకటస్వామి నాయుడుగారి అన్నగారు అక్కడ రైల్వే సిగ్నలర్‌గా వుంటూ శాస్త్రిగారివద్ద కొన్ని విద్యా విశేషాలు అవగాహనం చేసుకొన్నారు. తరువాత శాస్త్రిగారు పిఠాపురం వచ్చేక కూడా అప్పుడప్పుడు ద్వారం వెంకటకృష్ణయ్యగారు, ద్వారం వెంకటస్వామి నాయుడుగారు పిఠాపురం వస్తూ పోతూ ఉండేవారని, వచ్చినప్పుడు శాస్త్రిగారింట ఎక్కువ కాలం గడుపుతూ వుండేవారని అనుకుంటారు.

మైసూరు విద్వాంసులయిన వీణ శేషన్నగారు కాకినాడ వచ్చినప్పుడు పిఠాపురం రాజావారు తాము వినడానికి పిఠాపురం పిలిపించేవారుట. అప్పుడు ఒకసారి శేషన్నగారికి సంగమేశ్వర శాస్త్రిగారి వీణ కూడా వినిపించడం జరిగింది. విని శేషన్నగారు పిఠాపురం రాజావారితోటి 'మీ దగ్గర ఇటువంటి వైణికులుండగా మేము వచ్చి ఇక్కడ వీణ వాయించడం సాహసమే అవుతుంది' అని అన్నారుట.

ఇంకోసారి రాజావారు తమ సన్నిహిత బంధువులయిన మరొక జమిందారుల ఇంట్లో శాస్త్రిగారిని వెళ్లి వీణ వాయించి రమ్మన్నారుట. శాస్త్రిగారు అక్కడనించి తిరిగి వచ్చిన తరువాత 'ఏమండీ మా వాళ్లు మీ వాద్యాలు చక్కగా విని ఆనందించారా? మీరు అక్కడ ఎలా వాయించారు?' అని అడిగేరుట. దానికి శాస్త్రిగారు 'ఆలయంలో వాయించినంత భక్తి శ్రద్ధలతో వాయించాను. వారు కూడా స్వామివారిలాగే విని ఆనందించారు' అని అన్నారుట. అంటే 'కదలికలేని శిలా ప్రతిమలా విన్నారని' శాస్త్రిగారి అభిప్రాయం అని గ్రహించిన తరువాత శాస్త్రిగారి చమత్కారానికి అందరూ నవ్వుకున్నారు.

ద్రాక్షారంలో ఈమని అచ్యుతరామశాస్త్రిగారు వుండేవారు. వీరు కూడా చాలా గొప్ప వైణికులు. విశాఖపట్టణంలో నా చిన్నతనంలో వీరిని గురించి 'ద్రాక్షారపు పండితు'లని చెప్పుకునేవారు. నాలుగేసి గంటలు వీరి కచ్చేరీలు ఎన్నో నేను విన్నాను. మంచి ఘనమయిన వాద్యం వీరిది. మొదటిసారి వీరితో మాట్లాడిన వారికి వారి ధోరణి కొంచెం కటువుగా వున్నా తరువాత వీరి అమృతహృదయం బోధపడుతుంది. వీరి పుత్రులే ఈమని శంకర శాస్త్రిగారు, కుమార్తె సరస్వతి.

పేరి రామ్మూర్తి శాస్త్రిగారు విజయనగరంలో వుండేవారు. వీరు కూడా మహా విద్వాంసులలో ఒకరు. వీరు తరచుగా శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారితో సంచారం చేస్తూ హరికథలలో వాయిస్తూ వుండేవారు. ప్రత్యేకంగా కచ్చేరీలు కూడా కొన్ని వాయించేరని వినికిడి. నారాయణదాసుగారి గాత్రాన్ని గురించి సంగీత ఫణుతులను గురించి వేరే చెప్పనక్కరలేదు కదా! ఏ కారణం చేతనో గాని దాసుగారు మృదంగం, వీణ తప్పించి ప్రక్క వాద్యాలుగా ఇంక దేన్ని ఉపయోగించేవారు కాదు. నారాయణదాసుగారి కాలంనాటికి అంటే సుమారు 40, 50 ఏళ్ల క్రిందట హార్మోనియమ్ బాగా వాడుకలో ఉన్నది. ఫిడేలు కూడ మంచి ప్రచారంలోకి వచ్చింది. కాని దాసుగారి దృష్టిలో ఇవి రెండుకూడా క్షుద్ర వాద్యాలుగానే వుండేవి. అటువంటి దాసుగారితో ఆయన లయ విన్యాసాలకు విసురులకు తట్టుకుంటూ వీణతో ప్రక్క వాద్యం వాయించగల సమర్థులు గనుకనే దాసుగారు ఛలోక్తిగా ఎక్కడో అన్నారుట: 'భగవంతుడి దశావతారములలోను, రామావతారం మూడు మాట్లు వచ్చింది. అదే విధంగా ఆంధ్రులకు కూడా చెప్పుకోదగ్గ రామ నామధేయులు ముగ్గురే వున్నారు. పొడుగు రామ్మూర్తి—కోడి రామ్మూర్తి—పేరి రామ్మూర్తి' అని.

శ్రీ పేరి రామ్మూర్తిగారికి శిష్యులు చాలమంది వుండేవారు. వారిలో శ్రీ ఆదిరాజు నరసింహమూర్తిగారు ఒకరు. వీరే మా గురువులు. సాహిత్యములో కూడా మంచి కృషి చేసినవారు. రామ్మూర్తిగారు రచించిన ప్రహ్లాద గర్వభంగం మొదలయిన కొన్ని ప్రబంధాలు వుండాలి. అవి ఏమయినవో తెలియదు. వీరికి సంతతి కూడా లేదు.

ఇలా చెప్పుకుంటూ వెళితే ఎంతయినా వుంది. ఇంకా వాసావారు, శిష్ట్లవారు వారణాసివారు మొదలయిన విద్వత్ కుటుంబాలను గురించి, విద్వాంసులను గురించి మరొకసారి ప్రస్తావించుకుందాం.

వైతరణి కిటూ, అటూ

శ్రీ వాకాటి పాండురంగారావ్

"ఇది పూర్తిచేసి ఇవ్వండి" అంటూ నర్సు వెంకట్రావు చేతికి ఏదో ఫారాల నిచ్చింది.

పూర్తిచేసి ఇచ్చాడు.

వార్డ్‌బాయ్ కాబోలు, మేడమీదినుండి దిగి వచ్చాడు. వాడిని నర్సడిగింది. 'ఒకటో నెంబరు బెడ్ ఖాళీ అయిందా?'

వాడు నవ్వాడు. 'భోజనం అయ్యాక కాని వెళ్లరట!'

నర్సుకు కోపం వచ్చింది; కాని బయటికి కనపడ నివ్వలేదు.

వెంకట్రావ్‌కు ఏదో చెప్పబోయింది; ఇంతలో సెక్షన్ డాక్టరు ఒకతడువచ్చి ఏదోచెప్పసాగాడు. పేషంటు ఎవడికో మందులూ మాకులూ చెప్పాడు. అవన్నీ చార్టులో రాసుకుంది నర్సు.

ప్రక్కనేవున్న వార్డులోంచి ఒక పేషంటు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి—'బెల్ ఎన్నిసార్లు నొక్కినా వార్డ్‌బాయ్ రాడేమిటమ్మా' అని విసుక్కున్నాడు.

'ఇప్పుడే పంపిస్తాను. మీరు పదండి' అని వెంకట్రావు వైపు తిరిగింది ఆమె.

'ఒంటిగంట దాటాకకాని మీకు బెడ్ ఖాళీ కాదు.'

'ఫరవాలేదు లెండి.'

'మీకు బ్లడ్, యూరిన్ పరీక్షలన్నీ—'

'అయిపోయాయి. నేను సాయంత్రం అయిదు గంటలకు వస్తే సరిపోతుందా?'

నర్సుమొహంలో పెద్ద రిలీఫ్: 'ఓ ఎస్, ఆ పాటికి బెడ్ సిద్ధంగా వుంటుంది.'

ఆస్పత్రినుండి బయటపడ్డాడు వెంకట్రావు; అతడితో పాటు లక్ష్మి.

వీధిలో ఎండ...అరె......ఆస్పత్రి లోపల వుండగా ఎండను కూడా గమనించలేదు...

కళ్లుపొడిచే జులై నెల ఎండ...బుర్రు బుర్రుమంటూ కార్లూ, టాక్సీలూ ఆటోరిక్షాలు వెళ్తున్నాయి. మిట్టమధ్యాహ్నం వేళకూడా జనానికి ఇంత అర్జెంటు పనులేమిటి వుంటాయో? ఆ ప్రక్కనే వాడెవడో ఒక బండిమీద పెట్టుకుని రొట్టెలు, గుగ్గిళ్లు, అన్నము—అమ్ముతున్నాడు. సెనగల గుగ్గిళ్లు, దాన్ని 'ఛోలే'—అంటారీ ఢిల్లీలో. నల్లటి గుగ్గిళ్ళ శరీరంమీద పగల్లాగ ఎర్రటి టొమేటో ముక్కల్ని పచ్చటి పచ్చిమిరపకాయలను అలంకరించాడు. చూస్తుంటే నోరూరేటట్లుంది...కాని వాడు ఎడమ చేత్తో ముట్టుకోవడం...

ఎడమచేయి అనగానే భోజరాజు తన సింహాసనంమీద భవభూతిని ఎడమవైపు, కాళిదాసును కుడివైపు కూర్చోపెట్టుకోవడం గుర్తుకొస్తుంది. ఆ తర్వాత వాళ్ళిద్దరూ కలిసి పూర్తి చేసిన శ్లోకం గుర్తుకొస్తుంది. పాపం భవభూతి ఎప్పుడూ లెఫ్టే! కాళిదాసు ఎంతయినా 'కల' వాడే...

ఇంతకూ ఏం చేయడం—ఇంకా మూడు గంటలసేపుంది. రేపు ఆపరేషను! అంతా గమ్మత్తుగా వుంది. 'ఈ నడిబజారులో నేడు నిటారుగా నడిచి వెళ్తున్న తాను రేపు అడ్డంగా ఆపరేషను టేబిలు మీద...!

అలా దారిన వెళ్తున్నవాడి నెవరినయినా ఆపి—'మేష్టారూ! మీకు తెలుసూ—నాకు రేపు ఆపరేషన్ జరగబోతుందని—' అని చెబితే వాడేమనుకుంటాడు? ఎవడో పిచ్చివాడు అనుకుంటాడా? ఏ పావలా డబ్బులకోసమో ఎత్తులు వేస్తున్నాడు అనుకుంటాడా?

వెంకట్రావు ప్రక్కనే లక్ష్మి నడుస్తోంది. ఎప్పుడూ గలగల మని మాట్లాడుతుండేది, చాలా మౌనంగా నడుస్తోంది.

సాధారణ పరిస్థితులలో కాకుల్లా వాగేవారికి అసాధారణ పరిస్థితుల్లో నోరు మూతపడిపోతుంది. ఎంచేత,...భయం?

భయం!

ఎందుకు భయం? ఏమవుతుందో...ఎట్లా అవుతుందో... 'నూతిలో చిలకేదిరా అన్నా' అన్నట్లు అయిపోతుందేమోనని భయం...

భయం ఎందుకుండాలి, బాధ వుండాలి గాని...

మిత్రుడు కావచ్చు, తల్లి కావచ్చు, మొగుడు కావచ్చు— ఈ జీవితపు రైలుబండిలో ఎన్నో పెట్టెలుండగా ఒకే పెట్టెలో పక్క పక్కన కూచుని, ఒకరి కొకరు సన్నిహితమై ఇన్నాళ్లు ఇన్నేళ్లు పయనించామే, ఇంత దగ్గరయ్యామే—అలాటిది ఇప్పుడు విడిపోయామే అన్న బాధ వుండాలి. ఈ సాన్నిహిత్యం, ఈ స్మృతి పుంజం, ఈ మాధుర్యం ఇవన్నీ అబద్ధాలేనా — ఇక ముందెన్నడయినా కలిసేమా, మళ్లీ కలిసి పయనించేమా — అన్న బాధ వుంటుంది కాని...భయం ఎందుకు—

అవును మరి భయమే... చేతిలో వున్నది, వున్నది

అనుకొన్నది, తనది అనుకున్నది జారిపోతుంది అనగానే భయమే... అందుకనే కాబోలు—'ఏదీ నాది కాదు' అన్న భావాన్ని అలవర్చుకో మంటుంది మన మతం. బుద్ధుడు చెప్పింది అదే కదా...ఆశయే దుఃఖానికి కారణం.

ఎవరెన్ని చెప్పినా భర్తకు రేపు కడుపులో ఆపరేషనంటే ఇవాళ దిగులుగా వుండని భార్య ఎవరు...

'ఏం లక్ష్మీ! దేనికయినా సినిమాకు వెళ్దామా...'

చిత్తరపోయి చూచింది లక్ష్మి.

'ఇంగ్లీషుదయితే అయిదున్నరకెల్లా అయిపోతుంది—' కొత్తగా, వింతగా, ఏమిటో బాబూ మీ ధోరణి నా కర్థం కాదు— అన్నట్లు నవ్వింది.

ఆటోరిక్షా ఎక్కి 'రివోలి' చేరారు.

సినిమా పేరు 'ట్రో అవే' అందమైన సినిమా. ఒక పోట్ గ్రాడర్ జీవితంలోకి వచ్చిపడిన అపరాధ పరిశోధన—విశాల మయిన వచ్చటి బయళ్ళు — వేగంగా పరుగెత్తే కార్లు — అడుగడుక్కి కుర్రాడివే కథానంవిధానం.

ఇంటర్వెల్‌లో అయిస్‌క్రీము తిన్నారు. లక్ష్మి మౌనం అల్లాగే ఖులాసాగా వుంది. అసలు, సినిమానయినా చూచిందో లేక ఏ వెంకటేశ్వరుడికో ప్రార్థనలు చెప్పుకుంటూందో—

అయిదున్నరకు ఆస్పత్రి చేరారు.

నర్సుల గదిలో—

ఆ తెల్లటి యూనిఫారాల్లో నవ్వుతూ వుండే నర్సులందరూ ఒక్కలాగే కన్పిస్తారు...కాని మధ్యాహ్నం మాట్లాడిన ఆమె లేదు. వెంకట్రావ్ బెడ్‌సంగతి అడగ్గానే పెద్దనర్సు కాబోలు చెప్పింది—'రెండింటినుండి మీకోసం వెతుకుతున్నాము—'

మేడమీదకు వార్డుబాయ్ తీసుకువెళ్ళాడు.

స్పెషల్ వార్డు.

ఉన్న అయిదు మంచాల్లో ఒకదానిని చూపించాడు. దాని మీద ఎవరో, అవతలిమంచంమీది రోగులకోసం వచ్చిన విజిటర్స్ కూర్చునివున్నారు. లేచారు.

గదిలో అంతమందీ ఇటు తిరిగిచూశారు. కొద్దిగా ఇబ్బంది—అన్పించింది. వెళ్ళి కూచున్నాడు వెంకట్రావ్. లక్ష్మి మంచం చివర కూర్చుంది. లక్ష్మి పాలిటికి ఇది యమధర్మరాజు ఇంటర్వ్యూ గదిలా వుంది కాబోలు...ఆమె వదనాకాశంలో కారుమేఘాలు తిరగ సాగాయి.

ఆ ఇబ్బెట్టుతనాన్ని బద్దలు గొడదామని బలవంతంగా ఏదో మాట్లాడాడు లక్ష్మితో—మిగతావారి భాష వేరు గనక కొంత రక్షణ.

కాస్సేపటికి ఆ గదితో తానూ ఒకడిని అనిపించినాక వెంకట్రావు అటూ యిటూ పరికించాడు.

కిటికీ నానుకుని, ప్రక్కమంచంమీద గళ్ళపైజమా శాల్తీ, పెళ్ళాం అందిస్తున్న ఆపిల్‌ముక్కల్ని తింటున్నాడు. నవ్వుతుంటు న్నారు వాళ్ళిద్దరూ తమ్ము చూచేనా?

తన కాళ్ళవైపు గది మధ్యగా మొహం కనబడలేదు. ముక్కు లోకి పెట్టిన రబ్బరుగొట్టం కదులుతున్న మనిషి...అతడికోసం ఎంత పరివారం! ఆమూల ఎడమవైపు కర్టెన్ల దాస్తున్న వ్యక్తికి ఏమి జబ్బో?

ఆటే కుడివైపుగా ఏటవాలుగా పడుకునివున్న మనిషి బాగానే వున్నట్లున్నాడు. భార్యతో మాట్లాడుతున్నాడు.

గది మధ్యనున్న పేషెంటు తాలూకు డజనున్నర శాల్తీ లలో ఒక వెడల్పాటి హిడింబి ఇహ వుండబట్టలేకపోయింది; అడిగింది.

'ఏమిటి మీ జబ్బు—'

గదంతా వెంకట్రావు జవాబుకోసం ఎదురుచూస్తూంది!

అతడికి ఒళ్ళు మండింది. 'ఏదో లెండి...'

హిడింబి వూరుకోలేదు. 'అంటే?'

'రేపు ఆపరేషన్!'

వెంటనే అటుతిరిగి లబోదిబో అంటూ వంజాబీలో తన వాళ్ళకు అనువదించి చెప్పింది—పాపం, అదా, మాకు అందరికీ పెద్ద సమస్య తీరిపోయినట్లయింది. మామూలు గందరగోళంలోకి వచ్చారు.

వాళ్ళంటికి తాము క్రొత్త అన్న ఫీలింగ్ పోతేగాని బాగుండదు.

గంట మ్రోగింది; విజిటర్లు వెళ్ళిపోవాలి.

దిగులు లక్ష్మి కళ్ళల్లోకి ద్రవించింది. కన్నీటి వాపుకోవడానికి ప్రయత్నిస్తూంది.

'వెళ్ళిరానా'

'వెళ్ళిరా'

'జాగ్రత్త'

'ఏమీ ఫరవాలేదు—డాక్టరు చెప్పాడు కదా—రేపీపాటికి ఆప రేషనయిపోయి హాయిగా వుంటుంది—'

లక్ష్మిపాలిటికి ఈ ఇరవైనాలుగ్గంటలూ ఇరవైనాలుగు యుగాలు.

వార్డుబాయ్ అరుస్తున్నాడు...'వెళ్ళండి—వెళ్ళండి.'

వెళ్ళలేక, వెళ్ళలేక—

వెళ్ళింది లక్ష్మి.

విజిటర్లు తగ్గారు...మధ్య మంచమాయన బావతువాళ్ళు నలుగురుండిపోయారు. ప్రక్క మంచం మీద గళ్ళ పైజమావాడి భార్య ఖులాసాగా సెలవు తీసుకుంది. కుడిప్రక్క ఆ మూల పేషెంటు భార్య ఎపుడో వెళ్ళిపోయింది; వాడేమో సిగరెట్లు ఊది పారేస్తున్నాడు. ఆ మూల ఎడమప్రక్క కర్టెను వెనక మనిషికి విజిటర్స్ లేరా?

ఈ గదిలో తన సహచరుల పూర్వాపరాలు తెలుసుకోవాలి... వెధవ కుతూహలం.

దీపాలు వెలిగాయి. కిటికీలోంచి బయటకు చూస్తే చీకటి. బయటి ప్రపంచమంతటా రోగంలాంటి, భయంలాటి చీకటి... ఆస్పత్రిలోపల దేవుడి గుడిలో వలె వెలుతురు...అది వేరు ప్రపంచం, ఇది వేరు ప్రపంచం. అక్కడ మనిషి మీద ఎన్నో పొరలు, తెరలు, హోదాలు, గోడలు పేరుకుని వుంటాయి. ఇక్కడ ఆ ఉల్లిపొరలన్నీ లేచిపోగా మనిషి పునాదులు కనపడతాయి.

ఇందాక విజిటర్లు, ఆ గోల, ఆ వాతావరణం వేరు. ఇప్పుడీ వాతావరణం వేరు. పాటకూ పాటకూ మధ్య నిశ్శబ్దంవలె ఎంత ప్రశాంతంగా వుంది! ఆ మధ్య మంచం వాడి మనుషులు ఇంతమంది వుండకపోతే ఇంకా ఎంత బాగుండును—

నర్సు వచ్చింది. నోరు తెరవమంది. తెరిచాడు వెంకట్రావు. థర్మామీటర్ పెట్టింది. నిముషం తర్వాత తీసింది, చూచింది. మళ్ళీ నోరు తెరవమంది. ఔన్సుగ్లాసుతో ఏదో మిక్చర్ గొంతులో పోసింది...అయింది ప్రారంభం! ఇష్టా యిష్టాలున్న వ్యక్తిలా కాక, ఆదేశాలు పాటించవలసిన చిన్న బిడ్డలా జీవితం మొదలయింది. మార్పు తమాషాగా వుంది.

నర్సు చెప్పింది 'మీకే పూట ఉత్త 'సూప్' ఇస్తారు. తాగండి. రేప్పొద్దున ఆపరేషన్...తెలుసుగా ?'

వెంకట్రావు గంగిరెద్దయ్యాడు.

'పొద్దున్నే 'ఎనిమా' ఇస్తారు. మంచినీళ్ళు కూడా తాగడానికి వీలులేదు.'

మళ్ళీ గంగిరెద్దు.

అవతలి మంచం దగ్గరకు వెళ్ళింది నర్సు.

కాస్సేపటికి వార్డ్ బాయ్ వచ్చాడు. 'ఆపరేషన్‌కు తయారుచేయాలి మిమ్మల్ని' అన్నాడు. మంచం చుట్టూ తెరలు పెట్టాడు. పది నిముషాల తర్వాత వాడు వెళ్ళిపోయాడు.

సూప్ వచ్చింది. బాగాలేదనిపించింది. ఇంటి దగ్గర హాయిగా లక్ష్మితో పాపలతో కబుర్లాడుతూ కూర్చుని పప్పు, కూరా, ఆవకాయ, పెరుగు వేసుకుని అన్నం తిన్నట్లుగా వుంటుందా ...అయినా రేపల్లా మాడాలి కదా... గడ గడ తాగేశాడు సూప్‌ని.

చదువుకుందామని తెచ్చిన 'పార్కిన్సన్' తీశాడు. పది పేజీల తర్వాత మూసేశాడు. ఈ వాతావరణానికీ పార్కిన్సన్ వ్యంగ్యానికీ పొత్తు కుదరడం లేదు.

పైజమా వాడి నడిగాడు—'మీకు ఏదన్నా ఆపరేషనయిందా?' పైల్సట...ఆపరేషనయి పది రోజులయిందట...రేపో ఎల్లుండో ఇంటికి వెళ్ళిపోతున్నాడట. ఆ మాట డాక్టర్ ఇవాళ సాయంకాలమే చెప్పాడట. అందుకనే కాబోలు ఇందాక ఈ దంపతులు హాయిగా నవ్వుకుంటున్నారు...వాడి పేరు గాంధీట...చావ్‌డీ బజార్‌లో ప్రింటింగ్ ప్రెస్సుందిట. వెంకట్రావ్ నెమ్మదిగా వివరాలు సేకరించాడు.

కాళ్ళదగ్గర గది మధ్యగా వున్న ముసలాయనకు తీవ్ర మయిన గుండెపోటుట.

ఆ మూల ఎడమవైపు కర్టెన్లవతలాయనకు ప్రోస్టేట్ కాక వావారకాల బాధలూ...

అటు కుడివైపు వేంచేసియున్న ముఖర్జీగారికి గుండెపోటు.

రెండు గుండెపోట్లు, ఒక నానాజాతి సమితి, ఒక మాజీ పైల్సు ఒక కడుపుపోటు—ఇదీ ఆ వార్డు కంపోజిషన్...ఎవరి నయినా ఆధునిక చిత్రకారుడికి ఈ వార్డుని వివరించి చెప్పి నైరూప్యచిత్రం ఒకటి రచించమని చెపితే, పికాసో 'గుయెర్నికా' కాకపోయినా ఆ కోవకు చెందినది ఒకటిపుట్టునా?

ఏవేవో, దోమల్లాంటి ఆలోచనలు...దీపం వుంటే నిద్ర పట్టదు...కాని ఇక్కడ దీపాలార్పమని ఎట్లా అడగడం...అసలే కోడి గడుతున్న వత్తుల్లాంటి ప్రాణాలున్న చోటు...

మధ్య ముసలాయన బంధువులు ఏవో రొట్టెలూ అవీ నంజుళ్ళతోసహా హాయిగా తింటున్నారు. ఆ హిడింబి, పాపం, ఆయన భార్యట...పేరు మాధ్వాలి...అయినా ఆయనకంత జబ్బుగా వుంటే వీళ్ళిలాగ షడ్రసోపేతంగా తాపీగా భోజనం చేస్తున్నారే! సయిస్తుందా?

ఇంటిదగ్గర లక్ష్మి భోజనంచేసి వుంటుందా...వుండదు... పిల్లలు అడుగుతారు 'నాన్న ఏరీ'...ఏం చెబుతుంది లక్ష్మి...

డాక్టర్ గుప్తా వచ్చాడు. తిన్నగా వెంకట్రావు మంచం వద్దకే వచ్చాడు.

'ఎట్లా వున్నారు?' పొట్టనొక్కి చూశాడు.

'ఏమీ ఫరవాలేదు. రేప్పొద్దున్న అన్నీ సరిపోతాయి' అన్నాడు. ఆయన నవ్వుతూ మాట్లాడుతుండడం చూస్తుంటేనే చాలు, సగం వ్యాధి పోతుంది.

అడపా దడపా ఏదో వస్తుండేదికాని అసలొక్కసారే వచ్చింది అంత తీవ్రమయిన కడుపునొప్పి. గుప్తాయే చూచాడు. పరీక్షలన్నీ చేయించాడు. ఎక్స్‌రే తీయించాడు. 'డ్యుయోడినంలో వ్రణం కొద్దిగా ఒక మూల వుంది, అది తీయించేస్తే మీకే గొడవా వుండదు. ఏమంటారు.'

'సరే'

సర్జరీవార్డ్‌లో ఖాళీలులేక రెండు వారాల తర్వాత రమ్మ న్నాడు...ఆ నాటినుండి డా॥ గుప్తా అంటే అభిమానం. ఆ విషయం ఆయనకు తెలుసా, లేక ఎందరో రోగులలో తానొక్కడా— పైజమాగాంధీ పలకరించాడు 'ఇంటికి వెళ్ళడం గురించి ఆలోచిస్తు న్నారా ఏమిటి?'—అని నవ్వాడు...అదృష్టవంతుడు!

ఆ మాటనుకోగానే తనకే ఆశ్చర్యం వేసింది.

నవ్వగల్గడం అదృష్టమా, రేపో ఎల్లుండో ఇంటికి వెళ్ళి పోవడం అదృష్టమా...అయినా ఇట్లాంటివాటన్నిటికీ అతీతుడు అనుకుంటున్న తనకట్లా అన్పించడం ఏమిటి? మనసు మెట్లు దిగుతున్నదా ఏమిటి? గుండెలో తన తత్వం కానిదానికి చోటు లభిస్తున్నదా ఏమిటి?

'గుడ్‌నైట్' అన్నాడు గుప్తా.

గుడ్! నైట్! హహ్హా!!

డాక్టర్ బూట్ల చప్పుడు క్రమంగా నిశ్శబ్దంలోకి వెళ్ళింది.

రేపు ఆపరేషను...అనెస్తీషియా— దేహంమీద కత్తిగీత— కారకు డెవడు కుజుడా, గురుడా — రేపీపాటికీ దేహం ఎట్లా వుంటుంది?...నిద్రకాదుకాని అట్లాంటిది...మసకమసక వెలుగు... మగతమగత జాగృతి—ఎక్కడో బయట ప్రపంచంలో ఆరోగ్యంగా వున్న కుక్క అరుపులు—మత్తు—నిద్రలాటిది—

పెద్దగా కేక—

ఉలిక్కిపడ్డాడు.

నిశ్శబ్దపు గాజుమేడమీదకు నిర్దాక్షిణ్యంగా విసురుతున్న కేకల రాళ్ళు—ఏమయిందేమయింది?

'సర్దార్జీ—నన్ను చంపకు సర్దార్జీ—నన్ను చచ్చిపోనివ్వు సర్దార్జీ—నేను ముసలివాడినండీ బాబూ—నన్నిట్లా బాధపెట్టకండయ్యా—అయ్యో, తండ్రీ—ఊర్కోండి నాయనా — నేను మీకేమి అపకారం చేశానండీ—నన్ను వదిలిపెట్టండీ...'

కళ్ళు తెరిచాడు వెంకట్రావు. గదిలో దీపాలు. మంచాలు. మనుష్యులు అలాగే వున్నారు.

ఆమూల మంచంమీద కర్తెనవతలనుండి అరుపులు—

పరుగెత్తుకొచ్చింది ఒక నర్సు.

అతడరుస్తూనే వున్నాడు.

ఎవ డతడు—ఏ మతని బాధ— దానికి మందేమిటి—అతడు బతిమాలే సర్దారెవడు—

సిస్టర్ నెమ్మదిగా—పిల్లవాడిని తల్లి బుజ్జగించినట్లు లాలింపుతో—

మల్హోత్రా, మిస్టర్ మల్హోత్రా — ఊరుకోండి...పడుకోండి...నిద్రపోండి మల్హోత్రా నిద్రపోండి—నే చెబుతాలెండి సర్దార్జీకి—మీరు నిద్రపోండి...

పెద్దతుఫానువంటి అతడి కేకల ఎదుట ఆమె గొంతు గడ్డిపరకలా వుంది...అసలతడికి ఆమె మాటలు విన్పిస్తున్నాయా?—గదంతా గమనిస్తూంది.

ఆమె అదే అదే మాటలను పదేపదే పాడుతూంది—లాలి లాలి...హాయిహాయి—బజ్జో నా చిట్టితండ్రీ—ఆమె, లలితో, మేరియో, జెబున్నిస్సావో — ఆమె గొంతులోని వాగస్వరానికి మల్హోత్రాలోని సర్పం తల ఊచనారంభించింది.

'ఏమిటే—' అన్నాడు మల్హోత్రా

'ఏమీ లేదు...పడుకోండి...నిద్రపోండి...'

'నిద్ర...ఎట్లాపోను...అయ్యో—బాధ—పూనాప్—నొప్పి—సర్దార్జీ—' మల్హోత్రకు స్పృహ సరిగా లేదు.

'నిద్రపోండి—నిద్రపోండి—నిద్రపోండి' — నర్సు వాగస్వరం

'అయ్యో—అయ్యయ్యో—!

'మీరట్లా కేకలు పెడితే మిగతా రోగులు నిద్రపోవాలి కదా—'

అంత బాధలోను, అంతస్పృహలేమిలోను, ఆ మల్హోత్రా అన్న మనిషి మనసులోని పొరల దిగువ, అ బాధారణ్యపు చీకటి పొదలమాటున—ఎక్కడో దాగి వున్న ఆ మానవత్వం తటాలున మేలుకొంది—

'ఐ యామ్ షారీ షిస్టర్—షారీ—' అన్నాడు. ముసలి వాడికి పళ్ళులేవు కాబోలు.

'పడుకోండి...నిద్రపోండి...నిద్రపోండి...పడుకోండి...'నెమ్మదిగా అతడితల దువ్వింది నర్సు. దుప్పటి సరిచేసింది. ఆ మూల దీపం ఆర్పివేసింది. అ తల్లి చల్లని చేతులలో ఆ రోగి తన బాధను మరిచాడు...

మరిచాడా? మరిచినట్లే—

ఎవడీ మల్హోత్రా...ఎక్కడివాడు—ఈ మరియమ్మ ఎవతె—ఇతగాడికి ఎవరూ లేరా—నా వారనే భార్య—నా నాన్న అనుకునే బిడ్డలు—లేరా—

ఈ ప్రశ్నలకు జవాబులు తెలియడానికి, తెంద్రోజులు పట్టింది.

ఈలోగా—

మరుసటిరోజు—ఉదయం

వార్డులో అందరికీ బెడ్ 'టీ'లు ఇచ్చారు. మల్హోత్రా మగతలో సుండే వద్దన్నాడు. వెంకట్రావుకు ఇవ్వలేదు.

మేల్‌నర్సు వచ్చి వెంకట్రావుకు ఎనీమా ఇచ్చి వెళ్ళాడు.

ఏడయింది.

రొప్పుతూ, రోజుతూ వచ్చింది లక్ష్మి.

ఎట్లావుంది? నిద్రపోయారా? డాక్టరు వచ్చారా? ఏమన్నాడు?

ఆమెకు అన్నీ ప్రశ్నలే! ప్రశ్నలన్నిటిలో పెద్ద ప్రశ్న...?

జవాబులు చెప్పాడు వెంకట్రావు.

ప్రక్కనే కూచుంది. మాట్లాడాలని వుంది. మాట రావడంలేదు.

ఏదేదో చెప్పాలని వుంది. చెప్పలేదు. వెంకట్రావు ఆమె చేతిని నిమిరాడు.

ఏడున్నరయింది. బ్రెక్‌ఫాస్ట్ వచ్చింది.

నర్సు ఒకరవుండ్ వచ్చి వెళ్ళింది.

వెంకట్రావును చూచి నవ్వింది. 'ఆపరేషన్‌కు రెడీయా?'

వెంకట్రావు తల ఊచాడు. లక్ష్మికి వణుకు.

ఎనిమిది.

వార్డుబాయ్ వచ్చాడు. స్ట్రెచ్చర్ బండి తెసుకువచ్చాడు.

మైసూరు రాష్ట్రం లాటరీ
టిక్కెట్టు కొని అత్యధిక ఫలం పొందండి

ఉగాది పండుగ సందర్భమున


మొదటి గొప్ప బహుమానం
రు.10 లక్షలు
(అన్ని సీరిస్‌కు కలిపి)
ఎక్కడాలేని కన్సొలేషన్ బహుమతులు

రెండవ గొప్ప బహుమానం
రు. 5 లక్షలు
(అన్ని సీరిస్‌కు కలిపి)
వేలాది ఇతర బహుమతులు


1 మొదటి బహుమానం	రు.	1,00,000 లు	ప్రతి ఒక్క సీరిస్‌కు
1 ద్వితీయ బహుమానం	రు.	50,000 లు	ప్రతి ఒక్క సీరిస్‌కు
2 తృతీయ బహుమతులు	రు.	10,000 లు	ప్రతి ఒక్క సీరిస్‌కు
4 చతుర్థ బహుమతులు	రు.	5,000 లు	ప్రతి ఒక్క సీరిస్‌కు
20 పంచమ బహుమతులు	రు.	1,000 లు	ప్రతి ఒక్క సీరిస్‌కు
50 ఆరవ బహుమతులు	రు.	500 లు	ప్రతి ఒక్క సీరిస్‌కు
500 సప్తమ బహుమతులు	రు.	100 లు	ప్రతి ఒక్క సీరిస్‌కు

కన్సొలేషన్ బహుమతులు
రెండు గొప్ప బహుమతులు పొందిన టిక్కెట్లకు. ప్రతి ఒక్క సీరిస్‌లోను మొదటి ఆరు బహుమతులు పొందిన టిక్కెట్లకు ముందూ, వెనుకాగల టిక్కెట్లకుకూడా కన్సొలేషన్ బహుమతులు లభించగలవు.


డ్రా తేది 18, ఏప్రిల్ 1971
ఒక టిక్కెట్టు ఖరీదు 1 రూపాయి




జావా
మోటార్ సైకిల్



ఆల్విన్ రెఫ్రిజిరేటర్ లేక
ఎస్ డి మోటార్ సైకిల్



రెమ్‌కో
రేడియోలు.



తోషిబా
రెమ్‌కో ట్రాన్సిస్టర్లు



సోల్ సెల్లింగ్ ఏజంట్లు:
మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమి.,
(లాటరీ డివిజన్)
'హరినివాస్' 36, కన్నింగ్‌హామ్ రోడ్, [illegible] ఫోను: [illegible]
బ్రాంచిలు:
బొంబాయి: అరుణ్ ఛేంబర్స్, [illegible] రోడ్, [illegible]
టెలిఫోన్: 375204.
న్యూ ఢిల్లీ: 403, గోవింద్ మాన్షన్, "[illegible]" బ్లాక్, కన్నాట్ [illegible]
న్యూ ఢిల్లీ-1. టెలిఫోన్: 44585
మద్రాసు: 36/37, తంబుచెట్టి వీధి, మద్రాసు [illegible] టెలిఫోన్: [illegible]

maa-b-msi-104 TEL

'అయ్యా, చొక్కా తివ్వండి—'

లక్ష్మికి బాధ...తన దేవుడిని తనకు దూరం చేస్తున్నారే అని బాధ...అతడిని వధ్య శిల మీదకు కొనిపోతున్నట్లుగా వుంది ఆమెకు...భగవాన్...భగవాన్...

బనియన్‌తో స్ట్రెచ్చర్ మీద పడుకున్నాడు వెంకట్రావు. పైన చూరు తెల్లగా నిర్మలంగా వుంది. మనసంతా కూడా నిర్మలంగా కాకపోయినా ఖాళీగా వుంది.

స్ట్రెచ్చర్ తల వైపు లక్ష్మి.

వార్డుబాయ్ వెంకట్రావు రొమ్ము వరకు బెడ్‌షీట్ కప్పాడు.

క్రొత్త నర్సు వచ్చింది. ఏదో చార్టు కాళ్ళ దగ్గర పడేసింది.

ఇంజక్షనిచ్చింది.

బండి కదలింది.

లక్ష్మి మనసు కలుక్కుమంది—'కొనిపోవుచున్నారే నా నాధుని'

బండి కదిలింది.

కదలి కదలి—

గుడిలోని గర్భగుడిలోకి—

ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్తోంది.

లక్ష్మి—గాంధి—మల్హోత్ర—ముఖర్జీ అంతా వెనక వుండి పోయారు.

పెద్ద తలుపులు తెరుచుకున్నాయి.

చిన్నప్పుడు, పార్థసారధి కోవెలలో వైకుంఠ ఏకాదశినాడు పొద్దున్నే 'స్వర్గ వాకిలి' తెరవగానే వెళ్ళేవాడు తాను.

బండి లోపలికి—

తలుపులు మూసుకున్నాయి.

పొడుగాటి కారిడార్.

కారిడార్ పొడవునా స్ట్రెచ్చర్ బళ్ళు.

స్ట్రెచ్చర్ల మీద ఆపరేషన్ కేసులు.

కుడివైపున వరసగా ఆపరేషన్ థియేటర్లు—కారిడార్‌లో మసక మసకగా దీపాల వెలుగు—గాజ్ మాస్కుల వెనక డాక్టర్ల, నర్సుల మొహాలు—వాళ్ల రాకపోకలు—సంభాషణలు — ఎలుకలు పిల్లులు—ప్రాణ సంకటాలు, చెలగాటాలు—మాటలు- నవ్వులు—

'అప్పెండిసైటిస్ అయిందా?'

'హెర్నియా ఎక్కడ ?'

'థియేటర్ త్రీలో డా. బోస్ రాలేదా—'

'నర్స్ నర్స్—'

'ఎస్ ఎస్—'

సరసాలు—కిల కిలారవాలు — క్లోరోఫాం వాసనలు— మెత్త మెత్తగా బూట్ల చప్పుళ్ళ—

ఎవరో వచ్చి—వెంకట్రావు నడిగారు. 'డ్యుయోడినల్ అల్సర్ మీదేనా ?'

'అవును.'

కదిలింది రథం.

వెంకట్రావు రథం.

హఠాత్తుగా వెలుతురు...గది నిండా వెలుతురు—గాజులతో గోడ—ఆ గోడ మీద సూర్యుడి వెలుతురు—వెలుతురునిండిన గది—సృష్టి రహస్యాన్ని ఛేదించే గది—అనాటమీలు తెరిచే గది—ట్యూబెక్టమీలు చేసే గది—

'ఈ టేబిల్‌మీద, ఇదిగో, ఇక్కడ—ఆ చేయి ఇలా చాచండి—'

'ఇఫ్ యు డోన్ట్ మైండ్ జస్ట్ వన్ స్మాల్ ప్రిక్—'

నర్సో, డాక్టరో, ఇంకెవరివో డైలాగ్స్—'యువర్స్ మోస్ట్ ఒబీడియంట్లీ'గా వెంకట్రావు—

సూది కొసను చీమ కుట్టింది...'బంగారు పుట్టలో వేలు పెడితే మరి—'

మరి

చేపా చేపా—ఎందుకు ఎండలేదు

ఏమయింది చేప—?

ఏమయి—??

ఏ ???

• • •

కళ్ళు తెరిచాడు వెంకట్రావు.

ఒళ్లిమీద గూడ్సుబండి పరుగెత్తి వెళ్లినట్లుంది.

వోహ్—ఇదేమిటి—కడుపు బరువుగా—ఇరుకుగా—ఏదోగా—మంటగా—బాధగా—నొప్పిగా—గా—గా—గా

ఆపరేషనయి పోయిందేమిటి ? చూశాడు. తను వున్నది ఏ చోటు?

ఆస్పత్రే—కాని ఇది వేరే వార్డు—

నర్సు వచ్చింది—ఎలా వున్నారు ?

జవాబు చెప్పాడు. చెప్పేవుండాలి.

ఆ మగతలోనే లక్ష్మి కనపడింది. కనపడ్డం కాదు; వచ్చింది. చూపులో వేయి మాటలు చెప్పింది. వెళ్లిపోయింది.

డాక్టర్ గుప్తా వచ్చాడు. 'వెల్' మిస్టర్ రావ్—యు ఆర్ నా రిడ్ ఆఫ్ ది ట్రబుల్'

కాస్సేపటికి, ఇంకో అరగంటకీ, గంటకీ అన్పించింది—దాహంగా వుందని—మంచినీళ్లు తాగాలని.

నర్సు వచ్చింది. అడిగాడు. నవ్వింది, తల అడ్డంగాఊపింది.

కడుపుమీద కాల్చిన గరిటలు పెట్టి పెట్టి తీస్తున్నట్లున్నది.

అంతకన్న మిన్నగా దాహం—దాహం—తృష్ణ—ప్యాస్—

నర్స్ నీళ్ళు కావాలి—

వాలుక ఎండి పోతూంది.

'ఇప్పుడు మీకు నీళ్లిస్తే దోకు వస్తుంది—దోకు వస్తే కుట్లు ఊడగలవు—'

అయ్యబాబోయ్—ఆ మాట ఈ పాడు నాలుకకు తెలియ వద్దా—మై డియర్ దేహమా—మరి కొంతసేపు తాళుమా—ఇదంతా నీ కోసమే సుమా—

'ఉహూ—నా కిప్పుడే కూడాదు నీళ్ళు కావాలి' నాలుకగోల—

నర్స్—మరీచిక

సిస్టర్—మళ్లీ రిక్వెస్టు—

వచ్చింది. నీళ్లల్లో తడిపిన దూదితో పెదాలను తడిసింది.

ఆహ్, అమృతం! పోహో ప్రాణం.

మరొకట్టు బొట్టు ప్లీజ—ఇంకొక్క డ్రాప్—జస్ట్ ఒక చుక్క—

'నో నో నర్స్—నిర్దయి.

నిర్దయ దాహం—

ఇది సహారా—ఇది ఎడారి—మరి ఒయాసిస్సులేవి—పోనీ లేకే—ఎడారి ఓడలు ఒంటెలు—నీళ్లు లేకనే మండలం వుండ గలవు—ఒంటెలకు అపరేషనయితే బాధలేదు—

ఒంటెకు ఇంకొక పేరేమిట్రా—హైస్కూల్లో తెలుగు పండితులు శేషాద్రిశాస్త్రి ప్రశ్న—

లొట్టిపిట్ట—

దానికి నామాంతరాలు తెలుసుకోయ్—

లొటిపిట—లొట్టిపిట—లొటిపిట్ట—

పిటపిట—తకతక—తహతహ — నీటికై తహతహ—నీటి బొట్టుకై విలవిల—దాహపువల—వలలోచేప— నీరుబాసినచేప—కమల ములు నీటబాసెను - అంపశయ్యపై గాంగేయుడు—గంగను పిలిచే విజయుడో —

నిదుర—మగత

డాక్టర్—నర్స్—వచ్చారు.

టెంపరేచర్ చూశారు.

ఆఫీసునుండి ఎవరు—రాజశేఖరం కాబోలు —వచ్చి వెళ్ళాడా? లక్ష్మి ఇంకోసారి వచ్చినట్లుంది.

మెలకువ వచ్చినట్లయింది.

వేకువ అయినట్లుంది.

'సిస్టర్'—

వచ్చింది.

'టైమెంత?'

'ఆరయింది.'

'మై గాడ్!' పొద్దున్న ఏనిమిదింటికి ఆపరేషన్ థియే టర్లోకి తీసుకెళ్ళారు...ఇప్పుడు ఆరయిందిట—పదిగంటలసేపు తానెక్కడ వున్నాడు—ఆపరేషన్ థియేటర్లో వేదిమీద చిను కుట్టింది—ఆ తర్వాత ఏమయింది?

తానెక్కడ వున్నాడు? తన జీవు డెక్కడున్నాడు? ఆత్మ అనే పక్షి ఏ ఏ లోకాలు తిరిగింది? ఈ పదిగంటల కిటూ అటూ బ్రాకెట్లు తగిలించారు—బ్రాకెట్ల మధ్య ఆల్జీబ్రా అంకెమిటి— అనలోగ్ కంప్యూటర్ చెబుతుందా ఏమిటి?

ఇద్దరు వార్డుబాయ్‌లు—ఇద్దరు నర్సులు వచ్చారు... నెమ్మదిగా తన్ను స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టారు—స్ట్రెచ్చర్ బండి బయలుదేరింది—ఇది రికవరీ వార్డట—తను రికవర్ అయిపోయాడన్నమాట—తాను ఇక్కడనుండి తన 'లిన్' వున్న సర్జరీ స్పెషల్ వార్డు బెడ్ నెంబర్ వన్—మీదకు వెళ్తున్నాడు— అత్తారింటినుండి ట్రెంటికొస్తున్న ఆడకూతురిలా...వెళ్ళి వెళ్ళి గూడు చేరింది బండి—వాళ్లు సాయంపట్టారు—తనూ సాయం వేసుకున్నాడు తనకూ—అమ్మమ్మమ్మ—ఈ మాత్రం దానికి ఇంత అయాసమా—

'అంతా సవ్యంగా జరిగిందా?' అన్నట్లుగా చేయి చూచాడు గాంధి. కళ్లతో జవాబిచ్చాడు.

లక్ష్మి కూడుంది ప్రక్కగా—ఆఫీసు వాళ్లెవరో వచ్చారు, వెళ్ళారు.

గంటసేపయింది. డాక్టరు వచ్చాడు.

'దాహం—'

'కొద్దిగా, ఒకటి రెండు చెంచాలు తాగండి—ఇంకో గంట తర్వాత మళ్ళీ త్రాగండి—క్రమంగా పెంచ్చించండి—'

ఆరాత్రి—

లక్ష్మి అక్కడే పడుకుంది. బాధ—వ్రణం—పుండు—పచ్చి పుండు—కొరిమిలిత్తి—వాతలు—పోట్లు—సూదిపోట్లు—అలసట— ఆకలి అని తెలియని నీరసం—కొద్దికొద్దిగా నీరు త్రాగడం— మగత—నిద్ర—

లక్ష్మి అక్కడే ప్రక్కనే కుర్చీలో కునుకు తీసింది. తాను కదిలినప్పుడల్లా ఉలిక్కిపడేది.

ఆరాత్రి మల్స్ట్రా అరవలేదు.

ముఖర్జీ ఇంటికి వెళ్ళిపోయాట్ట. లక్ష్మి చెప్పింది.

తెల్లవారింది. నర్స్ వచ్చింది. 'టీ తాగండి'.

'టీ కాదు, కాఫీ కావాలి—'

'సరే కాఫీయే పంపమంటాను. కొద్ది కొద్దిగా త్రాగండి. లేపు సెమి-సాలిడ్స్!— సరేనా?'

'సరే-'

36 గంటల ఉపవాసం తర్వాత కాఫీ – చల్లటి కాఫీ — పానకంలాంటి కాఫీ—కాఫీపొడి మడ్డి కలసిన కాఫీ — గొంతులో నుండి క్రిందికి దిగుతుంది. ఆహా! ఏమి ఈ లగ్జరీ అనిపించింది.

న రుచి ర్నపశ్యప్—'

ఈమాత్రం కాఫీకే ఇంద్రుడింట్లో ఉన్నట్లు అన్నంత ఆనందనం ...

ఆరోజల్లా కాఫీ—పాలు—గంజి—నీరు—పాలు—గంజి—కాఫీ—

మధ్యాహ్నం ఒక కునుకు తీసి లేచాడు.

నర్స్ వచ్చి లక్ష్మిని, గదిలో ఇతరులను, బయటకు పొమ్మంది. వార్డ్‌బాయ్ మందులు, బ్యాండేజి వగయిరా నిండిన ట్రే వున్న బండిని తీసుకొచ్చాడు. మల్హోత్రా మంచందగ్గర ఆపాడు. ఆ మంచం చుట్టూ తెరలు పెట్టారు. డాక్టర్—ఆసిస్టెంట్ డాక్టర్ వచ్చాడు.

'వద్దు బాజోయ్—' అని గీపెట్టాడు మల్హోత్రా.

నిద్రపోతున్న నాగుపాముని లేపినట్లయింది.

'సర్దార్జీ నీకు దండం—నన్ను బాధపెట్టకండి నాయనా—ముసలివాణ్ణి—అయ్య బాబోయ్. నేను చచ్చిపోతాను—నన్ను వదలి వేయండి—నేనే చచ్చిపోతాను.'

అరుపులు—గొంతు ఆరిగిపోయేలా అరుపులు—గుండె ఆగిపోయేలా—అరుపులు—

కత్తెరతో బాండేజి చింపడం—బేసిన్‌లో టకటకమని ఏదో పడుతుండడం మధ్య మధ్య వినపడుతున్నాయి.

గదంతా భయంకరమైన దుర్గంధం వ్యాపించింది.

అందుకనే నర్స్ అందరినీ బయటికి పంపింది—

అరుపులమధ్య, కేకలమధ్య డాక్టర్, నర్స్ తమ విధిని నిర్వర్తించారు.

అరుపులు తగ్గాయి. డాక్టర్ నర్స్ వెళ్లిపోయారు.

వార్డ్‌బాయ్ పౌడర్ ఏదో ఆ మూలంతా చల్లాడు.

శరీరవ్రణ దుర్గంధం వెర్సస్ శాండల్‌వుడ్ టాల్కం పౌరభం!

ఆ రాత్రి నిద్రపట్టింది. కాని పొర్లడానికి వీలులేదు.

ఎప్పుడో పదిగంటలప్పుడు మెలకువ వస్తే, భూషణ్—ఆ మధ్యనున్న ముసలాయన నాల్గో కొడుకు వచ్చి మంచంమీద కూచున్నాడు—'రావ్‌సాబ్? ఎట్లావుంది?'

రెండ్రోజుల్లో వాళ్లూ తనూ—ఒకే ఇంటిలో కాపురం వుంటున్నంత చనువేర్పడింది. మొదటిరోజు ఒకరినొకరు చూసినప్పటి కొత్తదనం—సందేహం—అయిష్టత ఏమయ్యాయో—

భూషణ్ బొద్దుగా, చామనచాయగా వుంటాడు. బి. ఎ. చదువుతున్నాట్ట. వాళ్లనాన్న మెహ్రాకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళూనట. ఆయన ఉద్యోగంనుండి రిటైరయి రెండేళ్లయిందట...పెద్దకొడుకు అంటే భూషణ్ పెద్దన్నయ్యకు పెళ్ళయింది. సివిల్ ఇంజనీర్‌గా వుండేవాడట—అతడికి అమెరికాలో ఏదో ఉద్యోగం వస్తే, తండ్రికి చెప్పలేదుట. చెబుతే ఆయన వద్దంటాడట. ఇంట్లో ఎవ్వరూకూడా మెహ్రామాటను జరదాటరట. అంచేత — పెద్దకొడుకు ఉద్యోగం రాగానే ఎవరికీ చెప్పకుండా, ఆగ్రాదాకా వెళ్తున్నానని చెప్పి భార్యతోబాటు అమెరికాకు వెళ్ళిపోయాట్ట. రెండురోజుల తర్వాత ఆ విషయం తెలిసిన మరుక్షణం మెహ్రాకు తీవ్రమయిన గుండెపోటు వచ్చిందట... ఆస్పత్రిలో చేర్చి మూడువారాలు దాటిందట...ఒక వారంనుండి యూరినరీ కాంప్లికేషన్స్ మొదలయ్యాయట—

ఆ మూల మల్హోత్రా రిటైరయిన మేజిస్ట్రేటట. ఆయన పెళ్ళానికి జబ్బుగా వుంటే ఇదే ఆస్పత్రిలో చేర్చారట. ఆరు నెలలపాటు ఈ ముసలాయన రోజూ ఆమెకోసం మూడుపూటలా—చాయ్, భోజనం, పళ్ళు వగైరా తీసుకొచ్చి ఇస్తూ పోతూ వుండేవాడట. ఆమె జబ్బు నయమవలేదు సరికదా ముదరసాగింది. స్పృహలో కూడా వుండేది కాదట. అయినా మల్హోత్రా ఆరుమైళ్ళ దూరంలో వుండే కీర్తినగర్ నుండి రోజూ మూడుసార్లు వచ్చి వెళ్లేవాడట. అయిదారు వారాల క్రింద ఒకనాడు సాయంకాలం ఆస్పత్రినుండి ఇంటికి బస్సెక్కుతూండగా బస్సు కదిలింది. ఆయన క్రింద పడ్డాడు. కుడి ముంజేతి ఎముక విరిగింది. వెన్నుపూసలు నాలుగు తొలగాయి. ఎడమ మోకాలిక్రింద ఎముక చీలింది. ఈ మల్టిపుల్ ఇంజరీస్‌లో ఈయన్ని ఇక్కడ చేర్చారు. ప్లాస్టర్ వేస్తే వాచిపోయిందిట దేహం. తీసేశారు. పుండ్లయ్యాయి. పుండ్లు సెప్టిక్ అయ్యాయి. రోజు రోజుకూ ఈయన పరిస్థితి దిగజారుతూంది. మత్తుగా పడివుంటాడు. డ్రస్సింగ్ అప్పుడు ఆ నొప్పి తాళలేక అరుస్తుంటాడు. ఈయన భార్య ఇరవైరోజుల క్రింద చనిపోయింది. ఆ విషయం ఇంకా ఈయనకు తెలియదు. ఈయనకీ కొడుకూ, కూతురూ వున్నారు. కొడుకు రక్షణ శాఖలో జాయింట్ సెక్రటరీ—ఎప్పుడన్నా వచ్చి చూచిపోతుంటాడు. కూతురేమో సుప్రసిద్ధ రంగస్థల నటి. ఆవిడా అపుడపుడూ వచ్చిపోతుంటుంది. కొడుకు, కూతురు వేర్వేరు కాపురాలు పెట్టారు. మల్హోత్రా, ఆయన భార్య కీర్తినగర్‌లో వుంటున్నారు.

భూషణ్ ఈ వివరాలన్నీ చెబుతుంటే గాంధి నవ్వాడు.

'రావ్‌సాబ్‌కు పాత్రల పరిచయం చేస్తున్నట్లుందే—'

భూషణ్‌ని వాళ్లన్నయ్య పిలిచాడు. వాళ్లిద్దరూ, గాంధి వార్డుబాయితో కలిసి వరండాలో పేకాట మొదలుపెట్టారు.

లక్ష్మికి మనసు కుదుటబడిందేమో...నిన్న మొన్న ఎట్లెట్లా వుండిందీ వివరంగా చెబుతూంది. మొన్నరాత్రెల్లా నిద్రలేదట. నిన్న పొద్దున తన్ను ఆపరేషన్ థియేటర్లోకి తీసుకు వెళ్లిపోయాక, తాను బయటికి వెళ్లి చెట్టుక్రింద కూచుందిట. కాని కూచోలేక పోయిందిట. మాటమాటకి వార్డ్‌బాయ్‌ని ఆపరేషన్ అయిందా లేదా, అని అడిగి తెలుసుకునేదిట. తీరా థియేటర్‌నుండి రికవరీవార్డులోకి తీసుకువెళ్తుంటే చూచిందిట.

'మీ నోటిలో ఏదో బిరడా లాటిది వుంది...భయంవేసింది. మిమ్మల్ని పలకరించాలనిపించింది...'

లక్ష్మి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు వెంకట్రావు.

మరు రోజు కొద్దిగా బ్రెడ్, బిస్కెట్లు, పండ్లు లోపలికి వెళ్లేసరికి కొద్దిగా బలం వచ్చింది.

ఆ తర్వాత రోజు డాక్టరు గుప్తా స్వయంగా వచ్చి లేపి కూచో పెట్టాడు. నాలుగు రోజుల తర్వాత కూచోవడం! వెన్నుపూస వెన్నుపూసలా వుంది. ఆ మాత్రం కూచోవడానికి ఎంత

ప్రేయానే...ఒకప్పటి కాలేజి స్ప్రింటింగ్ ఛాంపియన్ డి. వెంకట్రావు ఈ నాడు కూచోవడానికి......!!

మధ్యాహ్నం పన్నెండింటికి లక్ష్మి తెచ్చిన అన్నం అదీ నెమ్మదిగా తింటుండగా—

మల్హోత్రా కూతురు వచ్చింది.

నల్లగా పొడుగ్గా వుంది. మోచేతులదాక చేతులున్న రవిక ధరించింది. ముఖంలో క్రూరమయిన హుందాతనం వుంది.

నాన్న దగ్గరకు వెళ్లింది, ఒంగి చూచింది. 'నాన్నా' అని పిలిచింది. మల్హోత్రా పలకలేదు, పరిశీలించి చూచింది. మల్హోత్రా ఒంటిమీద గాయాలమీదకు చీమలు బారులు బారులుగా పాకుతున్నాయి.

నర్సును పిలిచింది. నర్సు వచ్చి చూచివెళ్లింది. వార్డ్‌బాయ్ వచ్చి డి.డి.టి. చల్లి, చీమలను దులిపాడు. నర్సు పడక దుప్పటి మార్చింది. అంతసేపూ నాటక దర్శకురాలిలా నిలబడింది మల్హోత్రా కూతురు.

చూస్తున్నాడు వెంకట్రావు.

దాని పేరేమిటోగాని దొంగముండ—తండ్రి అన్నవాడిట్లా పడివుంటే ఎక్కడ ఏ హీరోగాడితోనో కులుకుతుంది కాబోలు పెళ్లిసెటాకూ లేకుండా — ఆ కొడుకు ముండాకొడుకు పొద్దున వచ్చి వెళ్ళినట్టున్నాడు — వెధవ మీసాలు వాడూను— పెద్ద ఆఫీసరట—రెండువేలు జీతంట—ఇటాలియన్ పెళ్లాంట...ఎందుకొచ్చిన బిడ్డలు — బిడ్డలా వీళ్ళు తలిదండ్రుల కడుపున చెడబుట్టిన గడ్డలు...వెంకట్రావుకు వొళ్లు మండింది. ఎక్కడో పాశ్చాత్య దేశాల్లో బిడ్డలు పెరిగి పెద్దవారవగానే ఎవరి మానాన వారు వేరువేరుగా జీవించడం మొదలు పెడతారనీ — ముసలి తల్లిదండ్రులు ఏ అనాధశరణాలయంలాటి దానిలోనో వారి తిప్పలు వారు పడుతుంటారనీ—వారిని చూడడానికి కొడుకులు కూతుళ్ళు చుట్టపుచూపుగా వస్తుంటారనీ విన్నాడు. తల్లిదండ్రులకు వారి జీవనసంధ్యావేళ ఆశ్రయం ఇవ్వలేని ఆ వ్యవస్థ చంద్రుడిమీదికి మనిషిని పంపితే పంపునుగాక—అది రాక్షస వ్యవస్థ...ఆ వ్యవస్థకు ప్రతినిధుల్లాటివా రీ మల్హోత్రా కూతురూ, కొడుకూ...

ఆలోచిస్తూండగా నిద్రపట్టింది.

తటాలున మెలకువ వచ్చి చూస్తే గదిలో హడావిడిగా వుంది. మెహ్రా మంచం చుట్టూ గొట్టాలు, స్టాండులు ఎక్కువయ్యాయి. భూషణ్, వాళ్లన్నయ్యా, వదిన, చెల్లెలు, నర్సు నిల్చుని వున్నారు. హవుస్ సర్జన్ బ్లడ్ ప్రెషర్ చూస్తున్నాడు. శ్రీమతి మెహ్రా ఒకమూల చతికిలబడి కీచుగా ఏడుస్తూంది ... మధ్యమధ్య 'హాయ్ రామ్, హాయ్ రామ్' అంటూంది...

తెలుగు 'హాయ్'కీ హిందీ 'హాయ్'కీ ఎంతదూరమో చూచావా అంటున్నాడు వెంకట్రావు లోపలి లింగ్విస్టు.

ఇరవై నిముషాల తర్వాత పరిస్థితి కాస్త మెరుగనిపించింది కాబోలు డాక్టర్ వెళ్లిపోయాడు.

మెహ్రాభార్య ఆయన దగ్గరకు వెళ్లి మొహంలోకి మొహం పెట్టి పలకరించింది. 'ఇటుచూడండి'

"వినబడుతూందా?,'

'చాయ్ కావాలా?'

'అబ్బాయి వచ్చాడు—'

ఆ వెడల్పాటి, బస్తాలాటి మనిషి మొహం మీద ఆశ, ఆప్యాయత, అనురాగం చూస్తుంటే అయ్యో పాపం అనిపించింది. కాని మెహ్రా ఈ లోకంలో లేడు.

అయినా, అమ్మాయి చెంచాతో తేనీరు పడితే మింగుతున్నాడు. ఆ అమ్మాయి ఒకసారి తేనీటి చెంచాను మెహ్రా పెదాలకానించి 'నాన్నా! నాన్నా! ఏదీ నోరుతెరు—' అంది గోముగా.

ముసలాడు నోరు తెరిచాడు. అమ్మాయికి పరమానందమయింది. తేనీరు ఆ నోట్లోకి పోస్తూ విజయగర్వంతో అరిచింది—'అమ్మా—అన్నయ్యా—వదినా—నాన్న నోరు తెరిచాడే! నేను చెప్పినమాట వినబడిందే అమ్మా!'

మెహ్రాపెళ్లాం లక్ష్మితో చెప్పింది—'అమ్మాయిపప్పీఅంటే ఆయనకు ప్రాణం -'అని, పమిటచెంగుతో ముక్కు తుడుచుకుంది. భూషణ్ అండ్ కో వరండాలో చేరి బిస్కెట్లతోసహా చాయ్ సేవిస్తున్నారు.

అంతకుముందు క్షణం గాభరా...ఇప్పుడదంతా గడిచిపోయి నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు...మనుష్యులు !

సాయంకాలం గుప్తావచ్చి గాంధీని డిశ్చార్జ్ చేశాడు. గాంధీ గాంధీ పెళ్లాల మొహంమీద సంతోషం వెన్నెలగా వెలిగింది.

ఆ రోజు మన కెప్పుడో అంది లక్ష్మి.

'ఇంకో వారమున్నా వుండాలి'అంది కస్తూరిబా...ఆమె పేదది కాకపోవచ్చు...

వాళ్లు మూటాముల్లె సర్దుకుంటుండగా, అతిభయభక్తులతో ఒదిగిఒదిగి నిల్చుని వారికన్నీ అందిస్తున్నాడు దక్షిణాదియైన వార్డుబాయ్.

ఈలోగా ఆ ప్రక్క కుడిమూలమంచంమీదకు ఒకాయన వచ్చిచేరాడు. ఆయన రావడమే వివిధస్వరాలలో 'అ...అ... ఊ...ఊ'అని పురిటినొప్పులు పడుతూ వచ్చి చేరాడు. అతడితో పాటు ఒక పటాలం వుంది. అంతా బెంగాలీ దళమే...ఆ బెడ్ హార్ట్ స్పెషలిస్టు డాక్టర్ సేన్‌వర్మదిట...అందుకే కాబోలు దానిమీదకు సాధారణంగా సోనార్‌బాంగ్లావాళ్లే వచ్చి చేరుతుంటారు. మొన్న వెళ్లినవాడు ముఖర్జీ అయితే వీ డే ఛటర్జీయో అయివుంటాడు.

వాడి జనభాఅంతా క్రమంగా వెళ్లిపోయారు, పెళ్లామూ స్నేహితుడు కాబోలు ఇంకో అతడూ వుండిపోయారు. ఒకసారి వెంకట్రావు లేచికూర్చున్నప్పుడు ఆ ఛటర్జీకూడా లేచి మంచం మధ్యగా కూచొని, తీరికగా నొప్పులు పడుతున్నాడు...'అ...కూ...' అని అరుస్తున్నాడు. వాడిమొహం చూస్తే నక్కలా వున్నాడు; నల్లగా వున్నాడు; జూలియస్ సీజర్ కంటికి కేషియస్‌లా వున్నాడు.

అరగంటకోసారి డాక్టరునీ, నర్సునీ పిలిపించి, 'అమ్మమ్మ' 'అయ్యయ్యో' అని నసుగుతూ, నొప్పులు వల్లిస్తూ మాత్రలు మింగుతున్నాడు. 'నేనే డాక్టరయివుంటేనా అరనిమిషం పేనా బార్బిటోన్‌మాత్ర లిచ్చేద్దును...వెధవ గొడవా వాడూనూ' అనుకున్నాడు పేషెంటు వెంకట్రావు.

ఆ సాయంకాలం వెంకట్రావును చూడడానికి వాళ్ళాఫీసు వాళ్ళు వచ్చారు. పండ్లూ అవీ తెచ్చారు.

వీళ్ళందరూ నిజంగా ప్రేమతోనే వచ్చారా, లేక— అయ్యో— రాకపోతే బాగుండదే అని వచ్చారా—ఆఫీసునుండి తిన్నగా కొంపలు చేరడానికి బస్సులు దొరికేచావని వెధవ ప్యూల్లో మధ్యలో ఈ ఆసుపత్రికివచ్చి పోవడం అంటే పెద్దయజ్ఞం చేసినంత పనాయె...

పిల్లలు వాణి, శంకరులను పక్కింటాయన తీసుకొచ్చారు. వాళ్ళు నాన్ను నేనేవో ప్రశ్నలడిగారు. ఆ ముసలాయన ముక్కులో గొట్టాలేమిటి అని అడిగారు. నాలుగేళ్ళ శంకరయితే 'నాన్నా! మీరు ఇంటికి వచ్చాక నా కట్లాంటి పెబ్బరు గొట్టం కొని పెడతారా' అని అడిగి హామీ పుచ్చుకున్నాడు.

వెంకట్రావు, రాత్రి లక్ష్మిని ఇంటికి వెళ్ళమన్నాడు. ఇవాళ ఆరవరోజు. తను కొద్దిగా కదలగల్గుతున్నాడు. పొర్లుతున్నాడు, తనంతట తానే కూచుని, పడుకో గల్గుతున్నాడు. గుప్తా అయితే...రేపటినుండి నెమ్మదిగా లేచి కొద్దిగా తిరగండి— అన్నాడు...వో యబ్బో...తిరగడమే...ఎవరెస్టు ఎక్కమన్నట్లుగా వుంది.

ఆ రాత్రి ఏడు గంటలవేళ—

మల్హోత్రా వున్నట్లుండి అరవసాగాడు.

'డాక్టరూ—నన్నొదిలేయి—నేను ముసలాణ్ణి. తండ్రీ నన్ను చంపకు—వదలి పెట్టండయ్యా వదలిపెట్టండి...నన్ను చంపకండి—నన్నే చచ్చిపోనివ్వండి—బాబోయ్ నా వల్లకాదు...నాయనోయ్... నే చచ్చిపోతా—చచ్చిపోతా—'

ఆ అరుపులు, ఆ దీనారవాలు, మరణానికి ఆ ఆహ్వానాలు, ఆ ఆక్రందనాలు ఆ గదిని నరకంగా మార్చాయి. ఏమి బాధో... ఎంత బాధో...అయ్యో పాపం—

నర్సు వచ్చింది: 'వూరుకోండి మిస్టర్ మల్హోత్రా! పడుకోండి...నిద్రపోండి...అరవకండి మల్హోత్రాజీ, నిద్రపోండి—'

కాని మల్హోత్రా అరుపులు తగ్గలేదు.

వెంకట్రావు వయివు టెంపరేచర్ తీసుకోవడానికని ఇంకో నర్సు వచ్చినప్పుడు వెంకట్రావు అడిగాడు. 'మల్హోత్రాకు సెడేటివ్ ఇవ్వరాదా ?'

'ఆయన కండిషన్‌లో సెడేటివ్ ఇవ్వరాదండి...'

అరుస్తున్నాడు మల్హోత్రా...గావుకేకలు పెడుతున్నాడు. నిముషానికోసారి చచ్చిపోతాననంటున్నాడు. నోరారా చావును రమ్మని పిలుస్తున్నాడు. మగతను చీల్చుకుని బాధ— అరిచిన ఆ అరుపులు మరణానికి మేలుకొలుపులులాగా వున్నాయి.

ఆ గదిలోకి ఒక లావుపాటి ఆయన వచ్చాడు.

తెల్ల చొక్కా, తెల్ల పంట్లామూ — నెరిసిన జుత్తూ... నిండుగా వున్నాడు. నిదానంగా మల్హోత్రా మంచం దగ్గరకు వెళ్ళాడు.

'మల్హోత్రా !' అని పిలిచాడు. ఆ పేరుగలాయన కేకలు పెడుతున్నాడు.

'మల్హోత్రా !' అన్నాడు మళ్లీ. అరిచాడు.

అయిదాడుపొడ్డు, దృఢమైన స్వరంతో, అధికారంతో పిలిచాడు స్నేహితుడు. హఠాత్తుగా—ఎన్నో చీకటి లోకాలకవతల, మగత తెరల కవతల వున్న మల్హోత్రాకు ఆ మిత్రుడి కంఠం వినిపించింది......ఆ కంఠం వినిపించిందంతే...కన్ను లేదు. చెవి లేదు. జ్ఞాపకం లేదు. సంబంధం లేదు.

'మల్హోత్రాజీ! నేను సోంధిని...'

'అయ్య నాయనోయ్—నా కొద్దు—డాక్టరుగారూ, నన్ను విడిచిపెట్టండి—నే చచ్చిపోతా—నే చచ్చిపోతా—'

'అట్లా అనకు మల్హోత్రా, అట్లా అనకు—'

'ఆ...'

'ఏదీ—అను—అను, రామ్ రామ్—'

'అయ్యో—అయ్యయ్యో—'

'కాదు కాదు, రామ్ రామ్—హరే రామ్—'

మల్హోత్రా నిశ్శబ్దం...సోంధిమట్టుకు 'రామ్ రామ్' 'హరే రామ్' అని నిదానంగా మృదువుగా అంటున్నాడు.

మల్హోత్రా ముసలిగొంతులోంచి, జీరగొంతులోంచి చీల్చుకుని వణుకుతూ వచ్చింది – 'రామ్ !'

సోంధి గొంతులో ఉత్సాహం వచ్చింది.

'రామ్...హరే రామ్...శ్రీ రామ్...'

మల్హోత్రా కూడా అంటున్నాడు. 'రామ్—హరే రామ్— శ్రీ రామ్.'

రెండు మూడు నిముషాలు...

సోంధి అన్నాడు—'రామ్—'

మల్హోత్రా అన్నాడు. "రామ్ !"

సోంధి—"రామా! నన్నీ బాధనుండి—"

మల్హోత్రా—"రామా ! నన్నీ బాధనుండి—"

"తప్పించు రామా—"

"తప్పించు రామా—"

ఇటు ఈ గొంతు...గట్టిగొంతు...నమ్మినగొంతు

అటు ఆ గొంతు ... పలచగొంతు ... నమ్మకం వినిపించిన గొంతు—

"రామా...నాకీ బాధ..."

"అత్తరి...రామా లేదు...ఏమీ లేదు..." అని అరిచింది మల్హోత్రా గొంతు...తిరగబడింది చీకటి—

సోంధి భయపడలేదు ... నిరుత్సాహ పడలేదు... ప్రయత్నం మానలేదు...మళ్ళీ అన్నాడు.

"రామా, నాకీ బాధ—"

"రామా, నాకీ బాధ—"

"వద్దు తండ్రీ..."

"వద్దు తండ్రీ..."

మందరంలో ఒకటి, రిషభంలో ఒకటి వినపడుతున్నాయి గొంతులు.

"రామా రామా..."

"రామా రామా..."

"హరే రామా..."

"హరే రామా..."

"శ్రీ రామా—"

"శ్రీ రామా—"

అదొక మంత్రమై, జపమై, గీతమై, సంగీతమై సాగుతూంది.

క్రమంగా, మల్హోత్రా గొంతు సన్నగిల్లింది. మళ్ళీ ఆ జీవుడు ఎక్కడో తెరవెనుక అణిగిపోయాడు. మళ్ళీ ఏ ఎముకో, కండరమో పిచ్చికుక్కవలె పీకితే, కుయ్యోమని మొరపెడుతుంది దేహం...అప్పుడు స్నేహితుడు కావాలి...సెడెటివ్ కావాలి ... నర్సు కావాలి ... నవనీతంలాటి లాలింపు కావాలి ... ఆ బాధకు అమృతం పూయాలి...ఆ నొప్పికి లేపనం పూయాలి. గాయపడిన దేహానికి— అంతకన్న ఎక్కువ గాయపడిన ఆత్మకు మందు కావాలి.

క్రమంగా మల్హోత్రా నిద్రవంటి మగతలోకి జారిపోవడం గమనించి, దగ్గరగా వెళ్ళి వంగి చూచాడు సోంధీ.

నిట్టూర్చాడు. రుమాలుతో మొహం తుడుచుకున్నాడు. ప్రక్కమంచం మీదున్న బెంగాలీ వాడిని— "ఇవాళ వీరి అమ్మాయి, అబ్బాయి ఎవరూ రాలేదా?" అన్నాడు

వాడు ముక్కుతూ, మూలుగుతూ— "హయ్యి...హమ్మయ్యి హబ్బాయో—హమ్మాయో...హామి...హాలేదు..." హన్నాడు.

అప్పుడు భూషన్ చెప్పాడు. "రాలేదు..."

తల వంచుకు వెళిపోయాడా నేస్తం...

నువ్వయ్యా...స్నేహితుడివిఅంటే...అనుకున్నాడువెంకట్రావు.

మరునటిరోజు పొద్దున లేచిచూస్తే, ఆ మూల బెంగాలీ వాడు లేడు. ఏమిటయ్యాడు అని వార్డుబాయ్ నడిగాడు వెంకట్రావు.

'మల్హోత్రాగారి అరుపులకు భయపడ్డాడుట ... ఆయన బ్లడ్ప్రెషర్ హెచ్చిపోయిందిట...అందుకని ఆయన్ను వేరే గది లోకి మార్చారు—'

నోహో గుండెకాయా...అనుకున్నాడు వెంకట్రావు.

మధ్యాహ్నం లక్ష్మి వచ్చింది అన్నమూ అదీ తీసుకుని. నెమ్మదిగా నాలుగుముద్దలు తిని వక్కపొడి వేసుకుని పడుకున్నాడు.

'ఎట్లా వున్నారు—' అంటూ వచ్చాడు డాక్టర్ గుప్త...పరీక్ష చేశాడు.

'వూండ్ బాగా హీల్ అవుతూంది...గుడ్...లేచి నడుస్తున్నారా?'

'లేదు.'

'ఫరవాలేదు—'

'కొద్దికొద్దిగా నడవండి...'

'ఇంటికి ఎప్పుడు వెళ్లవచ్చునండీ...'అని అడిగింది లక్ష్మి.

'భలేవారే...మొన్నటిదాక భయపడిపోయారు......అప్పుడే ఇంటికి వెళ్లడంగురించి అడుగుతున్నారే...'అని నవ్వి—'ఇంకో వారం వుండాలి...' అన్నాడు డాక్టరు.

అమ్మో—అనుకుంది లక్ష్మి మనసు—

—నిద్రపోయాడు వెంకట్రావు.

లేచేసరికి పక్కన గాంధీ ఖాళీచేసిన మంచంమీద ఒక తెల్లటి బొద్దుమనిషి కూర్చునివున్నాడు. కళ్ళకు కాటుకా అదీ పెట్టుకుని కథకళి నృత్యానికి తయారవుతున్నవాడిలా వున్నాడు. ఆయన భార్యామణి—అసలు మెడే లేదు – కమలాపండ్లు ఒలిచి తొనలు ఇస్తుంటే తాపీగా తింటున్నాడు.

చూస్తే ఏజబ్బూ వున్నట్లు లేదు. కేవలం కమలాపండ్లు తినడానికని ఆస్పత్రి స్పెషల్‌వార్డులో చేరినట్లుగా వుంది వాలకం.

వారినిగురించి ఊహాగానం చేశారు వెంకట్రావు దంపతులు.

ఆ సాయంకాలం వెంకట్రావును చూడ్డానికి ఇంకొందరు ఆఫీసుమిత్రులూ, దూరపుబంధువులూ వచ్చారు.

మల్హోత్రా కూతురూ, దానితోబాటే దాని మొగుడో మరెవడో ఒక గళ్లచొక్కావాడు వచ్చారు.

మెహ్రాను చూడడానికి వో పాతికమంది వచ్చారు. అతడికి ముక్కులో గొట్టం, చేతిరక్తనాళాల్లోకి గొట్టం, మూత్రానికి గొట్టం, మనిషిపొట్ట పైకి లేచి కిందపడడంతప్ప ఇంకేమీ చలనం లేదు.

కాటుకకళ్లవాడింకా రోగిష్టిలా సవ్యంగా మంచంమీద పడుకోనన్నా పడుకోలేదు, వాడికీ విజిటర్స్ వచ్చారు.

అయిదోమంచం ఖాళీగా వుంది.

విజిటింగ్ సమయం అవగానే అందరూ వెళ్లిపోయారు. లక్ష్మికూడా వెళ్లిపోయింది.

............వెంకట్రావు పరికించాడు.........

మెహ్రాదగ్గర అతడి కూతురు నిల్చునివుంది. పాపం అమ్మాయిగారికి తీరికదొరికింది కాబోలు...

పడకదుప్పటి సరిచేసింది. నర్సుని పిలిచి ఏదో అడిగింది.

నాన్నా, నాన్నా—అని పిలిచింది. చలనంలేదు. కాస్సేపటికి సోంధీ వచ్చాడు. అమ్మాయిని పలకరించాడు. మల్హోత్రా దగ్గరకు వెళ్లాడు.

'మల్హోత్రా! మల్హోత్రా!' అని అదే పనిగా అయిదారు సార్లు పిలిస్తే—గుహలోపలినుండి ముసలి పులి గర్జించినట్లు—'ఊ' అన్నాడు మల్హోత్రా...

'మల్హోత్రా! చాయ్ తాగావా?'

'వద్దు...చాయ్ వద్దు...చావు రావాలి...చావు...'

'అట్లా అనకు...అట్లా అనకు...'

'అది వచ్చిందా...' దొంగ కుంక...'

'సోంధీ ఇరకాటంలో పడ్డాడు...ఆమె తలొంచుకు నిల్చింది అపరాధినిలా...

'వచ్చింది...పూనమ్ ఇక్కడే వుంది'...'

'ఆ వెధవ?' కొడుకు కాబోలు—

'రాజేష్ మధ్యాహ్నం వచ్చి వెళ్లాట్ట'...అసత్యమేగాని ప్రేయస్ బ్రూయాత్...

'ఊ!'

'డాక్టర్ వచ్చాడా?' సోంధి అడిగాడు. జవాబు లేదు. ఇంకా రెండు మూడు ప్రశ్నలు అడిగాడు. జవాబు లేదు. మల్హోత్రా లోని ప్రాణాన్ని తనకు కొడుకూ కూతురూ దూరమయిన బాధ తప్ప ఇంకే విజయమూ స్పృశించడం లేదన్నమాట—మిగతా వేమీ కన పడవు...వినపడవు...అదోవిధమైన సమాధి—

అరగంట అట్లాగే నిలబడి నిలబడి పూనమూ, సోంధీ కూడా వెళ్లిపోయారు.

రాత్రి తొమ్మిది దాటింది.

అప్పుడు ప్రక్కమంచం ఆయన వెంకట్రావును పలక రించాడు. పేరు ఆహూజాట. సింధీలట...దేశం చీలినాక పాకిస్తాన్ నుండి వచ్చేశారట...ఛీఫ్ ఇంజనీర్గా రిటైరయినాడట—మూత్ర కోశంలో ఏదో గొడవ...పరీక్షలకని ఆస్పత్రిలో చేరమన్నారట... ఒకే ఒక కొడుకట...వాడు ఎలక్ట్రికల్ ఇంజనీరట...సాయంత్రం వచ్చాడట...ఇవన్నీ చెబుతూ వచ్చి హఠాత్తుగా 'ఏమండీ రావుగారూ మీకు దేవుడిమీద నమ్మకం వుందా?' అనడిగాడు.

'ఏమిటి అలా అడిగేస్తున్నాడు...'

'నాకు మాత్రం మొదట వుండేది కాదు...తర్వాత ఒక సంఘటనతో ఏర్పడింది...' అంటూ చెప్పడం మొదలెట్టాడు.

తాను అసిస్టెంట్ ఛీఫ్ ఇంజనీర్గా సింధ్‌లో పనిచేస్తున్న రోజులలో క్యాంప్ వెళ్లేవాడట. తనతోబాటు ఒక మనిషి వుండే వాడు—వాడే వంటవాడూ, బంట్రోతూను...ఒకసారి ఒక కొండ ప్రాంతం వూరికి వెళ్లి ఒక నెల వుండాల్సి వచ్చిందట...అక్కడ బంగళా ఇచ్చారుట. తోటలోవున్న అవుటవుస్‌తో ఆఫీసుపెట్టు కున్నాడు. రోజూ అందమైన తోటమధ్య ఆ అవుటవుస్‌లో కూచుని పొద్దున్నుండి మధ్యాహ్నందాక కాగితాలు చూచుకునేవాడు...చలినివారణ కోసం గది మూలలో పెద్ద కుంపటి వుండేది. హాయిగా వెచ్చగా తదేకంగా పని చేసుకునేవాడట...బొద్దుగావుండే నల్లపిల్లి ఒకటి రోజూ వచ్చి మేజా క్రింద తన పాదాల దగ్గర, వెచ్చదనానికోసం, పడుకునేది. నాలుగయిదు గంటలపాటు తన పని చూసుకుంటుంటే అది అట్లాగే పడుకుని వుండేది. తాను లేవగానే అదీ లేచేదిట. కొన్నాళ్ళకు ఆ పిల్లి తన పాదాల సందున పడుకోవడం అన్నది బాగా అలవాటయిపోయి దానిని గమనించడం మానివేశాడట.

రెండు మూడు వారాల తర్వాత ఒకనాడు పొద్దున్నే వెళ్ళి కూచుని పని మొదలెట్టాడట...మధ్యాహ్నం పని ముగిశాక లేవ బోతూ ఎందుకో కాళ్ళ దగ్గర చూశాడట—

తన పాదాల నడుమ చుట్టగా చుట్టుకుని ఒక త్రాచుపాము పడుకుని వున్నదిట!

పై ప్రాణాలు పైనే ఎగిరిపోగా...నెమ్మదిగా దేవుడి పేరు చెప్పుకుంటూ ... తీసేలోగా పాదాల మీద కాటేస్తుందేమో—దేవ దేవా...కావరావా...అనుకుంటూ పాదాలు తీశాడు...అప్పుడు ఆ పాము జర జర పాకి తోటలోకి వెళ్లిపోయింది...

నౌకరుని పిలిచి అడిగాడు—

'ఆ నల్లపిల్లి ఏమయింది—'

'అది వారం క్రింద ఒకనాడుదయం తోటలో చచ్చి పడి వుందండి...తీసి పారేయించాను...' అని చెప్పాడు వాడు...

అయితే—

అయితే—ఈ వారం రోజులనుండీ

వారం రోజులనుండీ—

తన పాదాల దగ్గర పడుకున్నది—

పడుకున్నది—

పాము!

పామే? బాబోయ్...ఈ వారంలో ఎన్నిసార్లు పాదాలు కదిలించాడు తాను...ఎన్నిసార్లు పాదం దానికి తగిలిందో కాని ఆ విష సర్పం తన్ను కాటేయలేదు...

"'భగవాన్! నువ్వున్నావు సుమీ...వుండడమే కాదు...ఈ మూర్ఖుడిని రక్షించావు...వీడు నిన్ను మరిచినా నువ్వు వీడిని మరవలేదు' అనుకున్నాను సునుండీ...రావ్‌జీ! ఆనాటినుంచి ఐ ఏమ్ ఏ గాడ్స్ మేన్!'' అన్నాడు ఆహూజా.

వెంకట్రావుకు నవ్వొచ్చింది. పాము కూడా దేవుడి ఏజెంటన్న మాట...తకామని అవిశ్వాసాన్ని విశ్వాసంగా మార్చివేసింది...

శివుడి ఆజ్ఞ లేనిదే అన్నారు కదా...వాట్?

అవీ ఇవీ కబుర్లు చెబుతూ రాత్రి నిద్రపోయాడు.

మరునాటి రోజుదయం లేచి వార్డ్‌బాయ్ సాయంతో పది గజాలు నడిచాడు వెంకట్రావు. ఆయాసం! నెమ్మదిగా ఒక బెంచీ మీద కూలబడ్డాడు...పాయిఖానాలోకి వెళ్లి వచ్చేసరికి అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఈది వచ్చినట్లుంది...గుండె టక టక మని తలుపులు కొట్టినట్లు కొట్టుకుంటూంది.

ఉన్నట్టుండి మెహ్రా మంచం దగ్గర హడావిడి మొదలయింది.

ఇద్దరు డాక్టర్లు పరుగెత్తుకొచ్చారు. నర్సులు ఇటూ అటూ 'ట్రే' లు పట్టుకొని పరుగెడుతున్నారు. మెహ్రా మంచం చుట్టూ తెరలుపెట్టారు. ఇంజక్షన్ కాటోలు యిచ్చారు. ముక్కులోకి ఇంకోగొట్టం పెట్టారు. గొంతులోని కఫాన్ని బయటికి తీశారు. గుండెదగ్గిర మర్దన చేస్తున్నారు. మెహ్రాభార్య 'హాయ్ హాయ్' అంటూ సన్నగా ఏడుస్తూ తలపట్టుకొని చతికిలపడింది.

'ఆక్సిజన్! ఆక్సిజన్'

పరుగెత్తారు. సిలిండర్ తెచ్చారు.

ఈ నాటక సన్నివేశపు ఆయుస్సు పదిహేను నిమిషాలు.

పదహారవ నిముషం—

మెహ్రాప్రాణం దేహంనుండి సెలవు తీసుకుంది.

గొల్లుమన్నారు.

డాక్టర్లు నర్సులు రణరంగంలో ఓడిపోయిన సైనికుల్లా తలవంచుకుని వెళ్ళిపోయారు.

ట్యూబులు, ట్రేలు, గొట్టాలు, పరికరాలు — యుద్ధరంగంలో ఆయుధాలవలె చెల్లాచెదరుగా పడివున్నాయి.

అయ్యో — ఏమండీ

అయ్యయ్యో — నా తండ్రీ

నాన్నగారూ — ఏమండీ — బాబూజీ — హాయ్ రామ్ — అయ్యో...మీకింతలోగా—అయ్యయ్యో...పాడుచావు నాకు రాకూడదా..

వికారంగా వికృతంగా, అసహ్యంగా ఏడుపులు ... ఏడిస్తే వెనక్కొచ్చిన ప్రాణం ఒక్కటుందా...అయినా ఏడుపే...ఏడుపునొక ప్రదర్శనగా చేస్తారెందుకు— అంత గొడవ చేస్తారెందుకు — మృత్యువన్న మహాసత్యం ఎదుట హుందాగా నిలబడరెందుకు —

నీకేమిటోయ్ వెంకట్రావ్...మెట్ట వేదాంతిలా కల్లిబొల్లి కబుర్లు ఎన్నయినా చెప్పగలవు...

నర్సు వచ్చింది ... 'మీరు కావాలంటే పక్కగదిలో వో మంచం ఖాళీగా వుంది...అక్కడ వెళ్ళి పడుకోండి...' అంది.

'అబ్బే ఫరవాలేదు' అన్నాడు వెంకట్రావు. చావంటే భయం లేదు. చావుకోసం ఏడిచే ఏడుపులు వినడం రోతగా వుంటుంది. అది కాఠిన్యమా — క్రౌర్యమా — ఏమో —

ఏడుపు లయ్యాయి. క్రొత్తవా రొచ్చారు. కొడుకు లొచ్చారు. కోడళ్లొచ్చారు. కూతుళ్లళ్ళొచ్చారు. కావలసినవా ళ్లొచ్చారు. తలో ఏడుపూ ఏడిచారు. కళ్లు తుడుచుకొన్నారు. ముక్కు చీదుకున్నారు. తలలు ఒంచుకున్నారు. వరాండాలోకి వెళ్లారు. అక్కడ కూచుని మళ్ళీ ఏడిచారు.

మధ్యలో స్ట్రెచ్చర్ వచ్చి ఆహూజాని తీసు కెళ్లింది.

బ్రెక్‌ఫాస్టు వస్తే వద్దు పొమ్మన్నాడు వెంకట్రావు.

ఇంకో స్ట్రెచ్చర్ వచ్చింది.

మెహ్రా దేహాన్ని పడుకోబెట్టి తెల్లగుడ్డ కప్పారు.

తెల్లజెండా! ప్రాణానికి మృత్యువుకూ జరిగిన పోరాటంలో శాంతిబావుటా.

స్ట్రెచ్చర్ చరచర వెళ్ళిపోయింది. వరుసగా బంధుమిత్రులు దానివెంట నడిచారు. భూషణ్ అల్మారాలో వున్న గుడ్డల్ని, డబ్బాల్ని, వస్తువుల్ని బుట్టల్లోకి, సంచుల్లోకి సర్దుతున్నాడు. అయిపోయింది. తాను వచ్చిన పని అయిపోయింది. ముక్కు చీదుకుంటూ అన్నీ సర్దాడు.

'నమస్తే రావ్‌సాబ్!' అంటూ భోరున ఏడిచేశాడు.

అతడి జబ్బను నిమిరాడు రావు.

భూషణ్ బరువుగా నడిచాడు బయటకు.

బయటనుండి శ్రీమతి మెహ్రా లోపలికి వచ్చింది. 'హాయ్ రామ్! నేనేమి చేయ్యనా భగవంతుడా!' అని అంగలార్చుతూనే ముక్కు కళ్లు తుడుచుకుంటూనే అల్మారా తలుపులు తెరిచింది. పైనుండి క్రిందదాక పరిశీలించి చూచింది. మంచంకింద చూచింది. ఇటూ అటూ చూచింది. తమది ఏ చెంచావో ఇక్కడ వుండిపోతుందేమో...అన్నీ చూచాక, ఏమీ వుండిపోలేదని తెలిశాక— 'అయ్యో రామా! అయ్యను తీసుకు వెళ్లిపోతివే!—నా తండ్రీ—ఇక నేను ఎందుకుండడం రా తండ్రీ—'అంటూ బయటికి నడిచింది.

'చెంచాలు వెతికేందుకు'—అనుకున్నాడు వెంకట్రావు.

అమెరికాలో మెహ్రా పెద్దకొడుకు ఏంచేస్తుంటాడు—మేన్ హాటన్‌లో షాపింగ్ చేస్తుంటాడా? న్యూయార్క్ నైట్‌క్లబ్‌లో న్యూడ్ నృత్యం చూస్తుంటాడా? ఎవరికి ఎవరు...ఏది ముఖ్యం... అనుబంధమా...అమెరికాలో వుద్యోగమా—మొగుడిప్రాణమా, స్టెయిన్లెస్‌స్టీలు చెంచానా...

ఆలోచనల్లోనుండి బయటపడేసరికి పన్నెండు దాటింది.

లక్ష్మి వచ్చింది.

ఆ మంచం ఖాళీగా వుంది. విషయం గ్రహించి వణికిపోయింది. వార్డుబాయ్ వచ్చాడు. 'దొంగవెధవలు నెల రోజులకు పైగా రాత్రింబవళ్లూ చాకిరీ చేయించుకున్నారండీ...రూపాయి డబ్బులన్నా ఇవ్వకుండా చెక్కేశారు...దుర్మార్గులు—' అంటూ గది తుడవసాగాడు.

'లక్ష్మీ! నీతి ఏమిటి—?' అన్నాడు వెంకట్రావు.

'మనం వెళ్లేప్పుడు ఇద్దాము లెండి—'

రెండింటికి ఆహూజాని మళ్లీ మంచంమీదకు చేర్చారు.

కాస్త అలసినట్లున్నాడంతే...తలగడా కానుకుని కూర్చునే విమర్శ మొదలెట్టాడు ఆహూజా.

ఈ డాక్టర్లంతా పసికుంకలండీ...ఏమి చెయాలో ఎవడికీ తెలీదు—మన దేహం ప్రతివాడికీ ప్రయోగశాలన్నమాట – అడ్డమైన నాలుగో సంవత్సరం వాడూ రావడం...ఒకడు సూదితో పొడవడం —ఇంకోడు రక్తం తీసుకోవడం – అటు పొడవడం—ఇటు పీకడం—నాలుక జాపమనడం– కళ్లెగరవేయ మనడం... ఛీఛీఛీ......డిస్గస్టి

లేదు, పాడూ లేదు - ఈ ఆస్పత్రిలో మనుష్యులు చచ్చిపోక బ్రతుకుతారుటండీ...ఎవడన్నా బతికితే అది ఆ పరమాత్ముడి చలవ —అంతే గాని ఈ అజ్ఞానుల వైద్యం వల్లకాదు...

అన్నీ విన్నాడు వెంకట్రావు.

—సాయంకాలం దీపాలు పెట్టేదాక వుండి వెళ్ళిపోయింది లక్ష్మి.

ఆహూజా కూడా డాక్టర్‌తో పోరాడి డిశ్చార్జి చేయించుకుని కొడుకుతోబాటు వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ, వెళ్ళిపోతూ వెంకట్రావుతో అన్నాడు - 'రాప్ సాట్—నేను రాజేంద్రనగర్—డి—191 లో వుంటున్నాను. ఇంట్లో టెలివిషన్ కూడా వుంది. యు కెన్ ఎంజాయ్ ఇట్...రండి...'

తల వూపాడు వెంకట్రావు. లోలోపల నవ్వుకున్నాడు.

ఆ రాత్రి మల్హోత్రా కూతురూ, కొడుకూ వచ్చి కాసేపుండి వెళ్ళిపోయారు. సోంధి రాలేదు.

ఆ మర్నాడుదయం టెనర్జీ, ఛటర్జీల మంచం మీదకు ఇంకో ఘోషాల్ మోషాయ్ వచ్చి రావడం—

రావడం రావడం తుఫానులా వచ్చాడు. పెళ్ళాంతోబాటు వచ్చాడు. మంచం మీద పద్మాసనం వేసుక్కూచున్నాడు. బెల్ నొక్కాడు. వార్డ్‌బాయ్ వచ్చాడు.

'బాయ్! నర్సుని పిలు—'

నర్స్ వచ్చింది.

'సిస్టర్!...నాకు మధ్యాహ్నం నాన్ వెజిటేరియన్ మీల్సు రెండు పంపండి...ప్రూట్సు కూడా పంపండి—' అని హుకుం జారీ చేశాడు. పెళ్ళావిడ అద్దం ముందు పెట్టుకుని తల దువ్వుకోసాగింది. ఆయనేమో సిగరెట్టు తాగుతూ వారపత్రిక కేదో తిరగవేయసాగాడు. మధ్య మధ్య 'తోక్నే చలో రే' అని రాగం అలాపిస్తున్నాడు.

వార్డ్‌బాయ్ చెప్పాడు వెంకట్రావుతో—ఆయన హార్ట్ పేషెంటుట. చెకప్‌కోసం వచ్చాడట. ఆరోగ్య మంత్రిత్వశాఖలో అసిస్టెంట్ సెక్రటరీట...

అదీ కథ—అనుకున్నాడు వెంకట్రావు.

ఆ రోజు గడిచింది. మరుసటిరోజు మధ్యాహ్నం డాక్టర్ గుప్తా వచ్చి చూశాడు—ఇంకో రెండు రోజులలో మీరు వెళ్ళిపోవచ్చు—అన్నాడు. లక్ష్మి గంటలు లెక్కపెట్టుకోసాగింది.

ఘోషాల్ వెళ్ళిపోయాడు.

గదిలో ఐదింట మూడు మంచాలు ఖాళీ...వెంకట్రావూ మల్హోత్రా వున్నారు.

సాయంకాలం, కాళ్ళదగ్గర గది మధ్య మంచంమీద పాత పరుపుమీదే కొత్తదుప్పటి పరిచాడు వార్డ్‌బాయ్. తలగడాకు గలేబు మార్చాడు. ఆ వెనకాలే దంపతులు వచ్చారు. ఆవిడ అవగుంఠనమూ అదీ చూస్తుంటే ఉత్తరప్రదేశ్ వాళ్ళలా వున్నారు. అతడు సంపన్న రైతు కుటుంబపు బిడ్డలా వున్నాడు. ఆ మంచాన్ని ఆక్రమించే ముందుగా ఎందుకయినా మంచిదని—వార్డ్‌బాయ్‌ని అడిగాడు'—ఈ మంచంమీద ఎవ్వరయినా...?'

అది మెహ్రా మంచం.

'అబ్బే—అదేమీ లేదు...ఈ మంచం చాల మంచిది' అని హామీ ఇచ్చాడు వార్డ్‌బాయ్.

నిశ్చింతగా మంచం ఎక్కి పడుకున్నాడు రైతురాజు. కిర్రు కిర్రుమన్నాయి మంచం స్ప్రింగులు.

ఆహా! మంచం నవ్వుకుంటూంది అనుకున్నాడు వెంకట్రావ్.

రాత్రి ఎప్పుడో మెలకువ వచ్చి చూస్తే రైతుబిడ్డ నిద్రపోతున్నాడు. అతడి కాళ్ళ దగ్గర తలపెట్టుకుని నిద్రపోతోంది అతడి పెళ్ళాం.

ఆ మరునాడు డ్రెస్సింగప్పుడు మల్హోత్రా అరవలేదు. ఆయన కొడుకు వచ్చి వెళ్ళాడు. సోంధి వచ్చి వో గంట ఆ మంచం ప్రక్కనే కుర్చీలో కూర్చుని వెళ్ళిపోయాడు.

రెండు రోజులయ్యాయి.

రైతుకు ముక్కులోకి, చేతికి రబ్బరు గొట్టాలు తగిలించారు. హైపర్ టెన్షన్‌ట...అవన్నీ చూచి భయపడి శ్రీమతి రైతు సన్నగా ఏడుపు మొదలెట్టింది. అతడి మిత్రులు ఎంతో సముదాయించారు కాని అవన్నీ శుభ సూచనలు కావని ఆమె గట్టి నమ్మకం. ఏదో రానున్న అపాయానికి ఇవి ప్రతినిధులని ఆమె భయం. హుక్కా పీల్చవచ్చునా అని రైతురాజు సంశయం.

ఆ మర్నాడు మధ్యాహ్నం వెంకట్రావు భోజనం ముగిశాక వో గంటకు డాక్టర్ గుప్తా వచ్చాడు. 'నేడు పన్నెండవరోజు కదా కుట్లు విప్పుతాను—' అన్నాడు. విప్పాడు.

బాధను పెదాలక్రింద అణిచిపెట్టుకున్నాడు వెంకట్రావు. లక్ష్మి వరండాలో నిల్చుంది. బ్యాండేజి కడుతుంటే తన బాధను మరిచిపోవాలని, డాక్టరు నడిగాడు వెంకట్రావు.

'లోపల ఏ కత్తెరనీ మరచిపోలేదు కదా—'

గుప్తా నవ్వాడు — 'కత్తెరలు అంత చవకనుకున్నారా ఏమిటి ?'

ఇద్దరూ నవ్వారు.

వీళ్ళిట్లా నవ్వడం ఆ రైతు పెళ్ళానికి బొత్తిగా నచ్చలేదు. తన భర్తకు ఇంత 'సీరియస్‌గా' వుంటే—ఆ పరిసరాల్లో ఎవరికయినా నవ్వెట్లా వస్తుందో —

సాయంకాలం డిశ్చార్జి చీటీ వస్తుంది — వెళ్ళిపోవచ్చు — ఓ నెలదాకా విశ్రాంతిగా వుండాలి — తేలిక ఆహారం తీసుకోండి — వెలయ్యాక ఓసారి వచ్చి కనుపించండి —అన్నాడు గుప్తా.

'థాంక్యూ డాక్టర్ —'

గుప్తా వెళ్లాడు.

లక్ష్మి — హనీమూన్ ప్రయాణానికివలె సంతోషంగా కబుర్లు చెబుతోంది.

నాలుగ్గంటలిట్టే గడిచాయి. లక్ష్మి వస్తువులన్నిటినీ సర్దసాగింది. డిశ్చార్జి చీటీ వచ్చింది.

ఆమె భయాన్ని ఎగతాళి చేశాడు వెంకట్రావు. 'ఆ రోజే నే చెప్పలేదూ...''

ఆమె మనసులో భయం తొలగిపోయింది. పెద్ద ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీనిండా సంతోషం, సిగ్గు, ఆశ, ఆనందం, భవిష్యత్తును గురించిన ఊహలు — ఏవేవో కుక్కుకుంటున్నది ఆవిడ. వస్తువులన్నీ సంచిలోకి, బుట్టలోకి కుక్కుతూంది.

హఠాత్తుగా మల్హోత్రా మంచం వైపు చూశాడు వెంకట్రావు.

అయ్యో! ఆదెప్పుడు?

శివరీక్షణాన ఎవ్వరూ లేరా —

లక్ష్మి చూస్తే భయపడుతుంది. నెమ్మదిగా లేచాడు వెంకట్రావు.

రైతూ రైతుపెళ్ళామూ — 'ఇంటికి వెళ్లిపోదామా? ఎట్లా వెళ్ళిపోవడం—' అని చర్చించుకుంటున్నారు.

లక్ష్మి ఆసరాగా నెమ్మదిగా మంచం దిగాడు వెంకట్రావు.

పూనమ్ వెక్కిళ్ళతో ప్రవేశించింది.

'పితాజీ!' అని బావురుమంది.

లక్ష్మి తిరిగి చూచింది...'పదండి...వెళ్లిపోదాం—'

లక్ష్మి వానుకుని వెంకట్రావు వరండాలోకి నడిచాడు.

సిస్టర్ ఎదురయింది—'ఇంటికి వెళ్లిపోతున్నారా?'

తల వూచి నమస్కారం చేశాడు వెంకట్రావు.

సౌంధి హడావిడిగా వస్తున్నాడు.

వెంకట్రావు, లక్ష్మి లిఫ్ట్‌ని చేరారు.

వెనక, ఆ గదిలోనుండి పూనమ్ రోదన వినిపిస్తూంది.

లిఫ్ట్ కిందకు దిగింది. నడుస్తున్నాడు వెంకట్రావు.

మల్హోత్రా కొడుకు కళ్ళొత్తుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు.

లక్ష్మి టాక్సీకోసం వెళ్ళింది. వెంకట్రావు వరండాలో బెంచీ మీద కూర్చున్నాడు.

స్ట్రెచ్చర్ తోసుకుని వస్తున్నాడు వార్డ్‌బాయ్—దాని మీద పడుకోబెట్టిన మనిషి మీద కప్పిన దుప్పటినిండా తడి తడిగా నెత్తురు మరకలు.

స్ట్రెచ్చర్ ఆపి అడిగాడు వార్డ్‌బాయ్—'సార్! వెళ్లిపోతున్నారా?' ప్రక్కనే వున్న బుట్టలోంచి లక్ష్మి పర్సు తీసి, దాని లోంచి రెండు రూపాయలు తీసి వాడి కిచ్చాడు వెంకట్రావు.

'ఆత్మహత్యకేస్ సార్—' అని చిరునవ్వుతో వార్త సందించి స్ట్రెచ్చర్ తోసుకుంటూ వెళ్లిపోయాడు వార్డ్‌బాయ్.

లక్ష్మి వచ్చింది—'టాక్సీ వచ్చింది—'

నడిచి ఆస్పత్రి బయటికి వచ్చారు దంపతులు.

నైట్‌డ్యూటీ నర్సులు మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ వస్తున్నారు.

టాక్సీలో ఎక్కి కూచున్నాడు వెంకట్రావు.

లక్ష్మి ఎక్కింది. తలుపు వేశాడు డ్రైవర్.

చుట్టూ చూశాడు వెంకట్రావు.

టాక్సీలు, కార్లు, సైకిళ్లు, ఆటోరిక్షాలు, సంజె వెలుతురు, ట్రాఫిక్ కానిస్టేబిల్, చెట్లు, రోడ్లు, భవనాలు, ఆఫీసు నుండి ఇళ్లకు వెళ్తున్న ఉద్యోగులు, వీధిదీపాలు...మెహ్రాలు మల్హోత్రాలు—ఆహోజాలూ గాంధీలు—బెనర్జీలూ ఛటర్జీలు—పూనమ్‌లు సౌంధీలు—గుప్తాలు సర్దార్జీలు — వెళ్తున్నారు. వెళ్లుతున్నారు. వెళ్ళుతూవున్నారు.

— జీవితం కళకళలాడుతూ, గలగలలాడుతూ వుంది.

విందుగా వుంది; క్రొత్తగా వుంది.

పెద్దగా నిట్టూర్చాడు వెంకట్రావు.

టాక్సీ కదిలింది.

ఆంధ్రసాహిత్యంలో శ్రీ తిరుపతి వేంకటకవుల యుగం

శ్రీ నిడుదవోలు వేంకటరావు

[1949 సెప్టెంబరు 17 తేదీని విజయవాడలో శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారికి—ప్రథమాంధ్రాస్థాన కవి బిరుదప్రదానోత్సవము జరిగినది. శాస్త్రిగారు వయోవృద్ధులగుటచేత, మదరాసు ప్రభుత్వము వారీ సభను విజయవాడయందే యేర్పాటు చేసిరి. ఆ సందర్భమునను తెలుగున మదరాసు ప్రభుత్వమువారు జాతీయ బహుమతిని నా కొసగిరి. అది శ్రీ చెళ్ళపిళ్ళవారు తమ స్వహస్తముతో నా కందజేసి, నన్నాశీర్వదించినారు. తెలుగు ప్రథమ జాతీయ బహుమతి, తెలుగున ప్రథమాంధ్రాస్థాన కవులైన చెళ్ళపిళ్ళ వారి ద్వారమున లభించుట నా సాహిత్య జీవితములో చిరస్మరణీయమైన ఘట్టము. ఆ సందర్భమున నేను వ్రాసిన వ్యాసమును ఈ సంచికకు ఆముఖముగా సమర్పించుచున్నాను.]

ఆ ము ఖ ము

శ్రీ తిరుపతి వెంకటకవుల కవితాపీఠ మధునాతన కవికులమున కాచార్య పీఠము. అవధాన విద్యకు నాది పీఠము. అఖిలాంధ్ర విద్వన్మహాజనుల కర్ణనా పీఠము. తిరుపతి వేంకటకవులు తెలుగు వా రామమాలాగ్రముగా నెరిగిన దివ్య కవితా సంపన్నులు. కుకవీంద్ర ఘటా పంచాననులు. కీర్తికాంతా స్వయంవరులు. బాల కళానిధులు. బాల సరస్వతులు. వారిలో ద్వితీయులు నవ్యాంధ్ర సాహిత్య ప్రపంచమున నద్వితీయులునగు శ్రీ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు స్వతంత్ర భారత పర్వమున జాతీయ ప్రభుత్వము వారిచే ప్రథమముగా తెనుగు భాష కాస్థానకవిగా నెన్నుకొనబడుట ఆంధ్ర మహాజనుల మహా భాగ్య విశేషముగా నభినందింపదగినది. విశాలాంధ్ర దేశమునకు కేంద్రస్థానమైన విజయవాడలో వెంకట శాస్త్రిగా రాస్థాన కవిపీఠ మలంకరించుటచే చారిత్రక ప్రసిద్ధిగల యా వాటిక సారస్వత క్షేత్ర పరిపాటిని వహించి మేటి యశస్సు నందినది.

కామేశ్వరీ పాద సేవకుడు, కళాప్రపూర్ణుడు, కవి పరమేష్ఠియైన వెంకటశాస్త్రిగారద్యత నాంధ్ర వాఙ్మయ నిర్మాతయై, అనంత శిష్య ప్రశిష్య కుల కల్ప మహీరుహుడై, శతాధిక గ్రంథకర్తయై, సరస కవితా సామ్రాజ్య ధురంధరుడై, "శతావధాని వెంకటశాస్త్రి" యను పేరితో విలసిల్లుచున్నను, నీ యేకైక వ్యక్తి "తిరుపతి వేంకటకవుల" యుద్దరి మూర్తి

వంతము. సంస్కృతము తెలుగువలె, సంగీతము సాహిత్యము రీతిని, సహజ ప్రతిభా వ్యుత్పత్తుల భాతిని, పదము భావము పోలిక శాస్త్రిద్వయమున కవినాభావ సంబంధము.

నవీనాంధ్ర వాఙ్మయమున తిరుపతి వెంకటకవుల యుగమొక ప్రత్యేక విశిష్టత గలది. అది యొక రసవత్ ఘట్టము. ప్రశస్తాధ్యాయము.

పట్టినదెల్ల బంగారమైనట్లుగా, ముట్టినదెల్లను మూర్తి వంతమైనట్లుగా, చెప్పినదెల్ల పద్యమై యుట్టిపడును చెళ్ళపిళ్ళ వారికి. పుట్టిన వంశము కవి వంశము. మెట్టిన ప్రదేశములు మేటి కవితాక్షేత్రములు. చేపట్టిన కలము కవిత్వపు వెలము. వృత్తి కవితావృత్తి.

"గోచి పెట్టిననాడె కోమల కవిత చెప్పిన చెళ్ళపిళ్ళ కవికి కొమ్ము లేనుగులవంటి కవులు శిష్యులు. కవితలో తాను తన్మయత్వమునొంది, ఇతరులను తన్మయత్వము నొందించి, 'అంతా రామమయం ఈ జగమంతా రామమయం' అనునట్లుగా, 'అంతా కవనమయం ఈ జగమంతా కవనమయం' అని కవితామయముగా నవ్య సృష్టి గావించిన చెళ్ళపిళ్ళకవికి జే! జే!

అటు నన్నయ కాలమునుండి నిన్నటివరకు నవిచ్ఛిన్నముగా ప్రవహించుచున్న ప్రాచీన కవితా స్రవంతికి, ఇటు నవ నవోన్మేషమై నానాటికి నిండుకొనుచున్న నవ్య కవితా స్రోతస్సుకు నాడెమైన వంతెనను నిర్మించినవారు తిరుపతి వెంకటకవులు. ఇండ్లలోను వాకిండ్లలోను నింగ్లీషు భాషయే ప్రధానమైన దినములలో ఆంగ్లేయ వేష భాషా వ్యామోహమున నందరును తలమున్కలైన రోజులలో, ఆంగ్ల సాహితీ విమర్శన పథక మాదర్శప్రాయమైన పరిస్థితులలో జాతీయమైన తెలుగునాడి నుజ్జీవింపజేసి, తెనుగు కవితా సంప్రదాయములను తేటపరచి, తెనుగు సంస్కృతిని దిద్ది తీర్చినవారు తిరుపతి వెంకటకవులు.

"కవనార్థమ్ముదయించిన" చెళ్ళపిళ్ళ కవి గద్య పద్య రచనలు రెండింటను సిద్ధహస్తుడు. గద్యయుగమని చెప్పదగిన నవ్య కాలమున పంచదార పానకమువలె, పరిమిత ప్రయోజనముగల గ్రాంథిక భాషను వీడి, తేట నీటివలె, బహుళ ప్రయోజనముగల శిష్ట సమ్మతమగు వ్యావహారిక భాష నావాదించి

గద్య రచన కావించుచున్న వెంకటశాస్త్రివర్యుని వివిధ విషయ సంభరిత వ్యాసముల సాంధ్రులు నేటివరకు చవి జూచుచున్న వారేగదా. ఆ గద్య రచనలో తెనుగుదనము తెనుగు పలుకుబళ్లు నానుళ్లు తొణికిసలాడుచుండును. విద్యార్థి మొదలు విద్వాంసుని వరకు పామరుడు మొదలుకొని పండితునివరకు సమస్త ప్రజానీకము చదువుకొని యానందింపదగిన రచనా విశేషము నిండారుచుండును.

ఈనాడు ప్రపంచ విజ్ఞానమును ప్రచారము చేయుటకు తేటయగు తెనుగు వాడుక భాష సమర్థమన్న గిడుగు పంతులుగారి వ్యావహారిక భాషా సూత్రములకు భాష్యకారుడైనాడు వెళ్ల పిళ్ల. పలుకు పలుకునను జాతి వార్తా చమత్కారములతో సరసమృదుల హాస్య ధోరణితో తెనుగుదన మొలికించుచు, తేనియ లొలికించుచు వినువారి యొడళ్లు పులకరించునట్లు చేయగల వశ్య వాక్కు, రస వాక్కు వేంకటశాస్త్రిగారు.

తిరుపతి వేంకటకవుల రచనలు క్రొత్త పాతలమేరి కలియికల క్రొమ్మెరుంగులతో నవ్య సాహిత్య వీథులలో నానా ముఖములుగా భాసించినవి. నానా రాజ సందర్శనమున శ్రవణానందమైన వీరి యవధాన విద్య—పురాణ ప్రబంధ రచనము—ప్రాచీన సంప్రదాయకములు—రసవత్ ఖండ కావ్య రచన—నాటక రచన—స్వీయ చరిత్ర రచన, స్వానుభవ వివరణములు దేశకాల పాత్రానుగుణ్యమైన నవీన సంప్రదాయికములు. రాజులచే మర్యాదలందుట ప్రాచీన లక్షణము. ప్రజానీకముచే పూజలందుట నవీనతాద్యోతకము. కవితా విమానము నెక్కి వియద్వీథిలో విహరించు వెంకటశాస్త్రి గారికి గజారోహణమేమి లెక్క? అఖిలాంధ్ర ప్రజా మానస క్షేత్రముల కవితామృతమయము గాపించి అఖండ శిష్య సంపదతో తులతూగుచున్న శాస్త్రిగారి కైహిక సంపద యేపాటిది? ప్రాచీన కవిత్వమునకు భరత వాక్యము, నవీన కవిత్వమునకు నాందియునగు తెనుగు కవితా పద్ధతిని వెలకొల్పి వేటూరి, వేలూరి, విశ్వనాథ, పింగళి, కాటూరివంటి విద్వత్కవులు శిష్యులుగా వెలయుచున్న వెంకటశాస్త్రిగారి విద్యావంశము సకలాంధ్ర సాహితీకల్పమై ఆచంద్రార్కము వర్ధిల్లుగావుత. ప్రాక్తన నవీన సంస్కార సమన్వయ సంప్రతిపన్నమైన వీరి కవిగోత్రము శాఖోపశాఖలుగా వర్ధిల్లుగాత!

ఇది ఆముఖమైనను తిరుపతి వెంకటకవుల సాహితీ సమీక్షను లేఖామాత్రముగా సూచించునది. ఇకనుండి వాఙ్మయ చరిత్ర—.

తిరుపతి వెంకటకవుల వాఙ్మయ చరిత్ర

ఆధునికాంధ్ర సాహిత్య జగత్తులో తిరుపతి వేంకట కవుల దొక ప్రత్యేక విశిష్ట స్థానము. అయినను, ఇంతవరకు వారినిగూర్చిగాని, వారి గ్రంథములను గూర్చిగాని, సమగ్రము, సప్రమాణకము సాధికారమునైన సమీక్షా గ్రంథము వెలువడనే లేదు. ఈనాడు తెలుగు విశ్వ విద్యాలయములలో ఆధునిక కవుల గూర్చి పరిశోధన జరుగుచున్నది గాని—తిరుపతి వేంకటకవులను గూర్చి నేటివరకు నే విశ్వవిద్యాలయమునందును పరిశ్రమగాని, పరిశోధనగాని జరుగలేదు. నవ్యాంధ్ర సాహిత్య చరిత్రలో వారికి గల సమున్నత స్థానము సోపపత్తికముగా నిరూపితము కాలేదు.

ఇప్పటికి నాల్గేండ్ల క్రిందట. "తిరుపతి కవుల సాహిత్య సమీక్ష" అను గ్రంథము వెలువడినది. అది ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారివలన బహుమతి పొందినది. అది యెంత అసమగ్రము, అసంబద్ధముగా నున్నదో ఆ గ్రంథముపై నా విమర్శ మూలమున తెలియగలదు.[1]

నా సమీక్షలో తిరుపతి వేంకటకవులు నవీన యుగమున కొన్ని ప్రాచీన సాహిత్య ప్రక్రియల నెట్లు ప్రచారములోనికి తెచ్చినదియు సంగ్రహముగా వివరించియున్నాను. ఈ వ్యాసమున సందు తడవని వానిని మాత్రమే వివరించుచున్నాను.

శతావధానము

క్రీ. శ. 1500 నాటికి, శతావధాన ప్రక్రియ వ్యాప్తిలో నున్నట్లుగా చరిగొండ ధర్మన చిత్ర భారతమున గల యీ క్రింది పద్యమువలన తెలుస్తున్నది.

> శత లేఖి న్యవధాన పద్య రచనా సంధా సురత్రాణ వి
> ఖ్యాత నామా! చరిగొండ ధర్మ సుకవీ నీ వాగ్విలాసంబులా
> శితి కంఠోజ్జ్వల జూట కోటర కుటీ శీతాంశురేఖాసుధా
> న్విత గంగా కనకాబ్జ నిర్భర రసా విర్భూత మాధుర్యముల్
> (1—24)

పై పద్యమున శతలేఖినీ విద్యయే శతావధానము. తిరుపతి వేంకటకవులు తమ బుద్ధ చరిత్రములో నిట్లు చెప్పినారు:

> మ. శతలేఖి వ్యవధాన పద్య రచనా సంజాత భావ్యద్యశో
> వితతా శేషవరాంధ్ర భూపతి సభా విఖ్యాత నామాస్పదు
> స్మృతికిం గారణమైన దేవి, ఘన వీణాపాణి యవ్వాణి సం
> తతము వ్వేంకట కృష్ణరాయ విభు వాగ్ధామంబు కామించు
> తన్ (1—86)

ధర్మన కృతి వారెఱుగుదురు. అందుచేతనే యనుకరించినారు. తమకుముందు శతావధానము చేసిన వారిని పేర్కొనుచు చరిగొండ ధర్మనను ప్రశంసించియున్నారు.

అభినవ పండితరాయ మాడభూషి వేంకటాచార్యులు

తిరుపతి వేంకటకవులు పేర్కొనిన రెండవవారు మాడభూషి వెంకటాచార్యులు. మహా ప్రతిభాశాలురగు వారు నూజివీటిలో రాజాస్థానమున తే. 21—2—1872 లో నొక శతావధానమును చేసియున్నారు. ఈ శతావధానమును నేను సంపాదించి లోకమునకు వెల్లడించినాను.[2]

---

1. తిరుపతి కవుల సాహిత్య సమీక్ష —గ్రంథ విమర్శనము భారతి సెప్టెంబరు—అక్టోబరు—1966—28 పుటలు.
2. అభినవ పండితరాయల అవధాన ప్రతిభ. భారతి—ఫిబ్రవరి 1960—40—48 పుటలు.

దేవులపల్లి సోదరులు

క్రీ. శ. 1879 లో పిఠాపురమున గంగాధర రామారావుగారి యాస్థానమున వెంకటాచార్యులుగారు శతావధానము నొనర్చినారు. రాజాగారు "ఇట్టి శతావధానము చేయువారు మన సంస్థానమున గలరా" అని ప్రశ్నించారు. సభలో ముఖ్యులు లేచి, "చంద్రమపాలెమున దేవులపల్లి సుబ్బరాయశాస్త్రులుగారు తమ్మన శాస్త్రులుగారు[3]—అను నిరువురు సోదరులు కలరు. వారి ప్రక్రియలో సమర్థులు" అని విన్నవించారు. రాజాగారు వారిని పిలిపించి అవధానము చేయించి, ఆస్థాన కవులుగా నియమించినారు. కాని వీరి యవధాన పద్యములు లభింపలేదు.[4]

శతావధాన సాహిత్య చరిత్రలో తిరుపతి వేంకటకవుల యవధానము ప్రక్రియ "స్వర్ణయుగము." ఇరవై రెండేండ్లు వారి శతావధాన కవితా సామ్రాజ్యాన్ని యేలినారు. వేలూరి శివరామ శాస్త్రిగారు గుంటూరి కాలేజీలో సంపూర్ణ శతావధానము ప్రప్రథమముగా చేసిన శతావధానానంతరము తిరుపతి శాస్త్రిగా రిట్లు చెప్పారు:

> "జగతీనాథులు పెక్కుమంది ముదితస్వాంతంబులం గొన్కలం
> పగ పొంగించు సలక్షణంబుగ శరద్ద్వావింశతిం జేర్చి మే
> మ్పగ మా యేలిన యీ యవధాన కవితా సామ్రాజ్య భారంబు మీ
> యుగబూనంగదవయ్య తండ్రి శివరామయ్యా! చిరంజీవివై.

వెంకటశాస్త్రిగారు 'శతావధాని వెంకటశాస్త్రి' అని జీవితాంతమువరకు వ్యవహరించి యీ ప్రక్రియ కొక శాశ్వతత్వము గడించినారు. ఈనాడు మనము సాహిత్యములో ప్రబంధ ప్రక్రియనే పరిగణించి దానికే పట్టము గట్టుదుము. కాని ఇతర సాహిత్యశాఖలను పూర్తిగా విస్మరిస్తున్నాము. అట్టి వానిలో శతావధానశాఖ యొకటి. ఇది చతుర్విధ కవితలో ఆశు కవితకు సంబంధించినది.[5] కాని ఆశు కవితను గూర్చి పరిశ్రమ ప్రారంభము కాలేదు.

తిరుపతి వేంకటకవులు తమ యవధానములు తమ కాలములో ముద్రితములైనను, వానిని సేకరించినట్లు లేదు. 'శతావధానసారము' అను తమ గ్రంథమున కొన్ని పద్యములు మాత్రమే మచ్చునకు చూపారు. అందువల్ల వారి అవధాన ప్రతిభా విశేషాలు అవగతం కావడానికి అవకాశము లేకుండా పోయింది. శతావధానాన్ని గూర్చి పరిశ్రమ చేసేవారి కుపయుక్తంగా తిరుపతి వెంకటకవులు 25—10—1891 తేదిని కాకినాడలో చేసిన ప్రథమ సంపూర్ణ శతావధానమును ఇందుతో ప్రకటిస్తున్నాను. ఇది ఇంతవరకు విద్వల్లోకాని కపరిచితము.[6]

అవధాన సన్నివేశాలు

"ఏనుగు నెక్కినాము ధరణీశులు మ్రొక్కగ నెక్కినాము" అని తిరుపతి వేంకటకవులు సగర్వంగా ప్రకటించుకొన్నమాట వాస్తవమేగాని అది సర్వే సర్వత్ర యావదాంధ్ర దేశానికి వర్తింపదు. సాహిత్య వాఙ్మయ చరిత్రకారు లెప్పుడును సత్యముగా ప్రవర్తిల్లిన సంగతులకే ప్రామాణ్యము నిత్తురు. అందుచే ఈ సందర్భమున కొంత వివరింపవలసిన ఆవశ్యకత యున్నది.

వారి "నానా రాజ సందర్శనము" చూచినవారికి తిరుపతి వేంకటకవు లాంధ్రదేశమున సందర్శింపని సంస్థానములేదని, వారిని గౌరవింపని ప్రభువు లేడని తెలియకపోదు. అయినను తెలుగు దేశాని కుత్తరమునున్న విశాఖ మండలము, తూర్పు గోదావరీ మండలములనున్న సంస్థానములలో, తక్కిన సంస్థానములలో జరిగినంత గౌరవము, సత్కారము జరుగలేదు. ఈ విషయ మెఱుగుటకుముందు ఆ ప్రాంతమందలి సంస్థానములను గూర్చి తెలుసుకొనుట యవసరము. అవి: (1) విజయనగరము (2) బొబ్బిలి (3) విశాఖపట్టణము గోడేవారి సంస్థానము (4) పిఠాపురము.

విజయనగరము

తిరుపతి వేంకటకవులు విజయనగర సంస్థానం దర్శించే నాటికి విద్యత్ప్రభువైన ఆనందగజపతి మహారాజు పరిపాలిస్తూ ఉండేవాడు—ఆ మహారా జెట్టివాడో, పండితుల కా సంస్థానమున నెంత గౌరవ ముండెడిదో చెళ్ళపిళ్ళవారి వాక్యాలతోనే వర్ణిస్తాను.

"విజయ నగర పద్ధతి అలాటిది కాదు. ప్రతిదినము పండిత గోష్ఠి కంటూ కొంత కాలము రిజర్వు చేసి వుంచి ఆ కాలముకు రాజుగారి యితర తొందరపను లేవేనా ఉన్నట్లయితే ఆ పండితుల సభకు వచ్చి నమస్కారాది సంభావనలు జరిపి, ఆశీర్వచనాన్ని పొంది అవలి రాచకార్యాలకు వెళ్ళడం ఆచారం. ఈ ఆచారం ఇప్పుడేమేనా

---

3. దేవులపల్లి సోదరులలో తమ్మన్న శాస్త్రిగారి పుత్రులే ఆధునిక కవిలోకమున ప్రసిద్ధులైన దేవులపల్లి కృష్ణ శాస్త్రిగారు.

4. మహేంద్ర విజయపత్రిక. పుట. 6.

5. ఆశు కవిత్వంబన్న "ఏకపాద, త్రిపాద, కరిస్రాస, విషమ సమస్యాపూర్తులు, వ్యస్తాక్షరీ సంఘటిత పద్యంబులును, ఇష్టార్థ దేవతావర ప్రతిపాదిత నిషేధాక్షర రచనా చమత్కృతియు, అష్టావధానంబులు, "ఘటికా శత గ్రంథ కల్పనయు" ఆకాశ పురాణంబులు తత్కాలోచితాతి త్వరితగతిని రచియింపబడునవి"—ఉదాహరణ వాఙ్మయ చరిత్ర—పుట 26.

6. ఇట్లే తిరుపతి వేంకటకవుల తరువాత, శతావధాన ప్రక్రియను పునః ప్రతిష్ఠితము చేసిన వేలూరి శివరామశాస్త్రిగారి శతావధానములు సేకరించినాను. వారి ప్రథమ శతావధానము గుంటూరి కాలేజీ శతావధానము (క్రీ. శ. 1911). నేను సేకరించి ప్రతివ్రాసి వారి శిష్యులగు శ్రీ అంబటిపూడి వెంకటరత్నశర్మగారి కిచ్చినాను. అది త్వరలో ముద్రణ భాగ్యము నందబోవుచున్నది. తక్కిన వేలూరివారి అవధానములు ముద్రించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి.

మారిందేమోకాని, ఆనందగజపతి మహారాజావారి ప్రభుత్వకాలంలో లేశమూ మారలేదని యెరుగుదును. సంస్థాన గౌరవంగాని, పండిత గౌరవంగాని మన ఆంధ్రదేశంలో ఆనందగజపతితో అంతరించిందంటే అంగీకరించని వారుంటారని నేను అనుకోను.[7]"

అట్టి ఆనందగజపతి ఆస్థానంలో ముడుంబై నరసింహాచార్యస్వామిగారు, పేరి కాశీనాథశాస్త్రి మొదలైన ఉద్దండ సంస్కృత పండిత కవులుండేవారు. విశేషమేమంటే, ఆనందగజపతి సభాపండితులు సంస్కృత భాషలో ఎంత మహా విద్వాంసులో తెలుగు కవిత్వములోను అంత ఆరితేరినవారు. ఒక్క విజయనగరంలోనే కాదు. తక్కిన సంస్థానాల్లోను ఇట్లే ఉండేవారు. తెలుగు దేశంలో తక్కిన సంస్థాన పండితులకు విజయనగర విద్వాంసులకు ఇదే భేదం. అక్కడి వారెంత గొప్ప సంస్కృత పండితులైనా, మాతృభాషయైన తెలుగును గూర్చి పట్టించుకొనేవారు కారు. ఇక కవిత్వము మాట సరేసరి.

అట్లాంటి ఆనందగజపతి ఆస్థానానికి తిరుపతి వేంకటకవులు వచ్చి—"అష్టకాల్ మొదలుగా నాభాష్య పర్యంత మే మహా మహుడు మా కిచ్చె విద్య" అన్న గురుస్తుతితో ప్రారంభించారు. ఆనందగజపతి, తన ప్రక్కనే ఆసీనులైన పేరి కాశీనాథశాస్త్రుల వారి వైపు తిరిగి "గురూజీ! వీరు భాష్యం చదివినారట. కొంచెము ప్రశ్నించండి" అని సెలవిచ్చారు. కాశీనాథశాస్త్రిగారు కౌముదిలోని మొదటి సూత్రాన్ని యెత్తుకొని పూర్వపక్షం చేసేసరికి వారు జవాబు చెప్పలేకపోయినారు. రాజుగారా పరిస్థితిని గమనించి, తెలుగు పద్యాలు చెప్పమన్నారు. తిరుపతి వేంకటకవులు రసవంతమైన పద్యాలు చెబుతున్నారు.

> "ఎందఱ జూపెనేని వరియింపదు మా కవితా కుమారి క
> వ్వందుకు దేశముల్ తిరుగు టబ్బెను సౌఖ్యము లేకపోయె నా
> వంద.నృపాల నీవు సుగుణంబుల ప్రోవని విన్నమాత్ర వెం
> టం దలయూచె గావున తటాలున దీని పరిగ్రహింపుమా"

అన్న పద్యం చెప్పగానే కాశీనాథశాస్త్రులుగారు—"ఆగండి, ఆగండి. ఇంతమందికి చూపిన తర్వాతా, మా రాజుగారి వద్దకు తీసుకొని వచ్చారు" అని ఆక్షేపించారు.[8] దీనితో ఈ సన్నివేశం పూర్తి అయింది. ఆనందగజపతి అనంతరముగాని, ఆ వెనుకగాని వెంకటశాస్త్రిగారు జీవితంలో ఎప్పుడూ విజయనగరంలో అడుగు పెట్టలేదు.

పేరి కాశీనాథశాస్త్రిగారితో వివాదము

కాశీనాథశాస్త్రులుగారు అఖండ పండితులు. భాష్యాంత వైయాకరణులైనను ప్రశస్తమగు తెలుగు కవిత చెప్పేవారు. వారు పూర్వ శాకుంతలము అను నాటకాన్నేగాక, శ్రీనాథుని వెనుక తెలుగులో వీథి నాటకము వ్రాసినవారు. తిరుపతి వేంకటకవులకు వీరికి వాద ప్రతివాదములు పత్రికాముఖమున జరుగుచునే యుండెడివి. వారు రచించిన "ఏడ్వర్డు పట్టాభిషేక" నాటకాన్ని కాశీనాథశాస్త్రిగారు మంజువాణి పత్రికలో తీవ్రంగా విమర్శించారు.[10]

తిరుపతి వెంకటకవులు పత్రికా ముఖంగా కాకుండా, గ్రంథరూపంగానే కాశీనాథశాస్త్రులవారి పూర్వ శాకుంతల నాటకాన్ని విమర్శించినారు.[11]

ఈనాటి నవ్య సాహిత్య చరిత్రలలో, కవి పండిత చరిత్రలలో కాశీనాథశాస్త్రిగారినిగురించి లేకపోయినా "అధునిక కవి జీవితములు" అన్న గ్రంథంలో ఉన్నది.[12]

బొబ్బిలి

ఆకాలమున బొబ్బిలి సంస్థానమును శ్వేతాచలపతి రంగారావుగారు పాలిస్తూ ఉండేవారు. వారి ఆస్థానంలో అభినవాంధ్ర కవితా పితామహులైన మహాకవులు మండపాక పార్వతీశ్వర శాస్త్రులుగా రుండేవారు. సంస్కృతాంధ్ర కావ్యాలు రచించి, మహామేధావియైన కొటికలపూడి కోదండరామకవిగా రుండేవారు. తిరుపతి వెంకటకవులు తమ సంస్థానమునకు వచ్చిన వారికి తగిన గౌరవ సత్కారము జరుగదని, ఆ రాజుగారు విశాఖపట్టణమున వారి భవనమునకు పిలిపించి, ఇద్దరికి చెరి 116 రూ. శాలువలు యిచ్చి పంపివేసినారు.[13]

---

7. కవులు.గాథలు. 3 సం. వెనకటి పండితులు, పుట.103.

8. ముడుంబివారు వాక్చమత్కారానికి ప్రసిద్ధులు. ఒక మారు 'భారతి' ఈ క్రింది చమత్కారం ప్రకటించింది. ఆనందగజపతి మహారాజు పండితులసభలో ఆసీనులైనారు. ఆస్థాన కవులైన నరసింహాచార్యస్వామిగారు వస్తుండగా ఆనంద గజపతి "కవి వృషభం వస్తున్నది. వచ్చిన తివాసీ పరిపించండి" అని అన్నారు. స్వామివారు వెంటనే—"మీవంటి కామధేనువులుండగా మాకు లోటేమిటి" అని ప్రత్యుత్తర మిచ్చారట. ఇది సహృదయైకవేద్యము.

9. ఈ విషయం అనాడు ఆనంద గజపతి సభలోనున్న బ్రహ్మశ్రీ దువ్వూరి నారాయణదాసుగారికి, నా జనకులైన విడుదవోలు సుందరరామయ్యగారికి తెలియును. వారి నుండే దీనిని గ్రహించాను.

10. ఆ కాలములోనే సరస్వతి పత్రికలో ప్రకటితమైన ఏడ్వర్డు పట్టాభిషేక నాటకము నేటి సంపూర్ణ కృతులలో కానవచ్చుటలేదు.

11. ఇది క్రీ. శ. 1912 నాటికే ముద్రితమైనది. నేడు వారి కృతులలో లేదు.

12. ప్రకాశకులు కీ. శే. రాజా మంత్రిప్రెగ్గడ భుజంగరావుగారు, ఏలూరు. (1913)

13. ఈ సన్నివేశం క్రీ. శ. 1896. ఆ తర్వాత మరి 37 యేండ్లకు 1933 లో వెంకటశాస్త్రిగారు బొబ్బిలి యుద్ధ నాటకాన్ని రచించి వారి పాత్రుల కంకితం చేశారు. అప్పుడైనా వారు బొబ్బిలి రాలేదు.

గోడేవారి సంస్థానము-విశాఖపట్టణము

విశాఖపట్టణమునువున్న గోడేవారి సంస్థానమును నా కాలమున గోడే నారాయణ గజపతిరాజగారు పాలించేవారు. ఈయన గొప్ప వైదుష్యం కలవాడు. హైందవ మత సంస్కృతి సంప్రదాయాలను ఆకళింపుకొన్న మనిషి. ఆ పైగా, మహా మహోపాధ్యాయ పరవస్తు వేంకట రంగాచార్యులవారి శిష్యుడు. రంగాచార్యులుగారు సంస్కృతంలో ఎంత మహా పండితులో తెలుగులో అంత మహాకవులు. వారు గోడేవారి ఆస్థానంలో తిరుపతి వేంకట కవులకుముందు 300 మందితో అనగా 'త్రిశతావధానము' చేసినారు. ఇంత చరిత్ర ఉన్నవారు కాబట్టే నారాయణ గజపతి రాజుగారు తిరుపతి వేంకటకవులు తమ సంస్థానానికి రాగానే 'ఈ కవిత్వపు ముష్టి ఏమిటి' అని ఎగతాళించారు. మన కవులు తక్కువవారా! సూటిగా ఈ క్రింది రీతిని పద్యంతో ప్రత్యుత్తరమిచ్చారు.

> "సంగర శక్తిలేదు, వ్యవసాయము సేయుట సున్న, సంతలో
> నంగడి పెట్టి యమ్ముటదియన్నిటికన్న హాళక్కి చక్కగా
> బొంగు బుజాన వైచికొని పోయెద మెక్కడికైన ముష్టి చెం
> బుంగొనిపెట్టుమొక్కటి యమోఘము మాకది దంతిరాణ్ణృపా"

ఇచట దంతిరాణ్ణృపు డనగా (నారాయణ) గజపతి రాజు. దీని పర్యవసానము స్పష్టమే.

పిఠాపురము

పిఠాపుర సంస్థానాధీశ్వరులు శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు, నవీన యుగంలో ఆంధ్ర భాషా పోషకులలో అగ్రగణ్యులు. వారు సంస్థానాధిపతులు కాక పూర్వమే మదరాసులో విద్యాభ్యాసము చేయుచున్న రోజులలోనే తమ భాషాభిమానము, కవిపోషణ వ్యక్తపరచేవారు. వారు సంస్థానాధీశ్వరులైన తరువాత శతావధాన చతురులూ సంస్కృతాంధ్ర కవితా విశారదులూ అయిన వేంకట రామకృష్ణ కవులను (ఓలేటి వెంకటరామశాస్త్రి—ద్వివేది రామకృష్ణశాస్త్రి) ఆస్థాన కవులుగా నియమించినారు. నాటినుండియు తిరుపతి వేంకటకవులకు రామకృష్ణ కవులకు వాగ్యుద్ధములు ప్రవర్తిల్లినవి. అవి పద్య రూపమున గ్రంథములుగా ప్రకటితములైనవి.

రామకృష్ణకవులు 'కవిత' అను మాస పత్రికలో 'కోకిల కాకము' అన్న వ్యాసంలో తిరుపతి వేంకట కవులను విమర్శించారు. వారు 'గీరతము' అనే 25 సర్గాల కావ్యము (భారతానికి ప్రతిగా) ప్రకటించారు.

"అట్టహాసము" అనే మరో వ్యాసంలో వారి సంస్కృత రచనలను రామకృష్ణకవులు విమర్శింపగా, శివరామశాస్త్రిగారు 'తాలుకుట్టనము' అనుపేర ప్రత్యుత్తర మిచ్చారు. తక్కిన వివాద గ్రంథాల పేర్లు మాత్రము సూచిస్తున్నాను.

వేం. రామకృష్ణకవులు	తి. వేం. కవులు
శతఘ్ని, (పాండవ రాజసూయముపై విమర్శ)	పాశుపతము
శృంఖల. (శ్రవణానందము పాణిగృహీత విమర్శ)	శృంఖలాత్రుటీకరణము

రామకృష్ణకవుల తిరుపతి వేంకటకవుల వివాద సందర్భంలోనే వేలూరి శివరామశాస్త్రిగారి పేర 'బిడాలోపాఖ్యానము' అనే కావ్యాన్ని తిరుపతి వేంకటకవులు ప్రకటించారు.

ఈ విధంగా రామకృష్ణ కవులకు తిరుపతి వేంకటకవులకు వివాదములు జరుగుచున్నప్పుడు వారికి పిఠాపుర సంస్థానమందు ప్రవేశ మెట్లు గలుగును? వెంకట రామకృష్ణకవులలో రామకృష్ణశాస్త్రి చిన్నతనముననే గతించినను వేంకటరామశాస్త్రి గారు క్రీ. శ. 1940 వరకు జీవించియేయుండిరి.

పై పరిస్థితులవల్ల ఆంధ్రభోజుడని అఖండ ఖ్యాతి వహించిన పిఠాపురాధీశ్వరుని ఆస్థానంలో వారికి గౌరవ సత్కారాలు లభించుట కాస్కారమే లేకపోయినది.[15]

క్రీ. శ. 1891 లో వారు దేశాటనను ప్రారంభించినది మొదలు 1920 వరకు పై సంస్థానములలో పిఠాపురం తప్ప తక్కిన వానిని ఒక్కమారే తిరుపతి కవులు సందర్శించినారని తెలియుగలదు. క్రీ. శ. 1920 లో తిరుపతి శాస్త్రిగారి మరణానంతరము కూడా వెంకటశాస్త్రిగా రెన్నడూ తుని దాటి రాలేదు.[16]

పిఠాపురాధీశ్వరుల మాట ఎట్లున్నా, వారి పెత్తల్లియైన కోలంక జమీందారిణి చెలికాని వెల్లయ్యమ్మారావుగారు బంధువులైన రావు చిన్నారావుగారు తిరుపతి వేంకటకవుల నాదరించేవారు. చిన్నారావుగారిపై చెప్పిన యీ క్రింది పద్యం ఎంత రసవత్తరంగా ఉందో చూడండి.

---

14. ఆ దినములలో రాజధాని కళాశాలా పండితులు వావిలి కొలను సుబ్బారావుగారు వాల్మీకి రామాయణము ననువదింపగా పిఠాపురము రాజుగారు దాని ముద్రణకై పదివేల రూపాయ లిచ్చినారు. కాని తమపేర దందు వేయవలదని చెప్పినారు. వావిలికొలనువారు సముచిత రీతిని కృతజ్ఞత చూపినారు.
15. 'తిరుపతి కవుల సాహిత్య సమీక్ష—దేశ సంచారము' అన్న శీర్షికలో 24—48 పుటలలో పై విషయములు సూచితము కాలేదు.
16. 1920 లో తిరుపతి శాస్త్రిగారి జ్ఞాపకార్థము విశాఖపట్టణము హిందూ పఠన మందిరములో వారి ఛాయా చిత్రమును, యువకులమైన మేము ప్రతిష్ఠించుటకు పూనుకొన్నాము. దాని ఆవిష్కరణకు వేంకటశాస్త్రిగారిని ఆహ్వానించగా, వారు "తుని దాటి ఆ పైకి వెళ్లే భాగ్యం మాకు కలుగలేదు" అని జవా బిచ్చినారు.

"శ్రీ నిండారిన నీ గుణంబులను వర్ణింపంగ తద్వార్తముల్
'నేనే వత్తు మనేనె వత్తు మరి నేనే వత్తు నే వత్తునే
నే నేనే' యని పైబడంగ మరి మే మెద్దాని గైకొందు మె
ద్దాని న్వీడుదుమో యిచిన్న నృపతీ! దాన ప్రధానాకృతి."[17]

వచన రచనలు

తిరుపతి వేంకటకవులు పద్య రచనయందే కాక నవ్యయుగ చిహ్నమైన వచన రచనలోను సిద్ధహస్తులు. వారు 'సరస్వతీ' పత్రికలో ఈ క్రింది వచన గ్రంథములు రచించి ప్రకటించారు.

1. విక్రమాంక దేవ చరిత్రము — బిల్హణుని సంస్కృత కృతికి ఆంధ్ర వచనానువాదము.[18] ఇది చారిత్రాత్మక కావ్యము.

2. చంద్రప్రభ చరిత్రము — వీరనంది రచితము. జైన సంప్రదాయమునకు సంబంధించిన చంద్రప్రభ తీర్థంకరుని చరిత్ర. ఇందు మత సిద్ధాంతములు విశదముగా గలవు. ఈ రెండును మూలములో శ్లోకములతోనే యున్నవి. అయినను కాలానుగుణ్యముగా వారు వచనములో రచన చేసినారు.

3. హర్ష చరిత్ర — మహాప్రసిద్ధుడగు బాణ భట్టారకుని రచన. మూలమున గద్యమునకు సరియైన వచనానువాదము.

సంస్కృత మూలమున, అవతారికా భాగము శ్లోకములతో నుండగా, వానిని మాత్రము పద్యములతోనే వారు వ్రాయుట సరసముగా నున్నది. అందు విశేష భాగము కవుల స్తుతియే.

పై మూడు గ్రంథాలు 'తిరుపతి వేంకట కవుల గ్రంథావళి'లో తిరిగి ప్రకటింపబడినవి.

చెళ్ళపిళ్ళ వారు—వ్యావహారిక భాషా [illegible]

తిరుపతి వేంకట కవులలో తిరుపతిశాస్త్రిగారు వెంకటశాస్త్రిగారితో కలిసి "పల్లెటూళ్ల పట్టుదలలు" అను ప్రహసనము వ్రాసినను వారు గ్రాంథిక భాషావాదులు. "పల్లెటూళ్ల పట్టుదలలు" రచన[19] నాటికి (క్రీ. శ. 1903) తెలుగు దేశమున వ్యావహారిక భాషావాదము ప్రారంభము కాలేదు. వ్యావహారిక భాషలో వ్రాయబడిన కన్యాశుల్కము క్రీ. శ. 1909 లో అనగా "పల్లెటూళ్ల పట్టుదలలు" వెలువడిన మరి యారేండ్లకు వెలువడినది. ప్రహసనములలో వ్యావహారిక భాష వాడవచ్చునను సంప్రదాయముచే తిరుపతిశాస్త్రులు గారట్లు వ్రాసిరిగాని తక్కిన రచనలయందు వ్యావహారిక భాష వాడకూడదనియే వారి నిశ్చితాభిప్రాయము. తిరుపతి వెంకటకవుల వచన రచనలు విక్రమాంకదేవ చరిత్ర, చంద్రప్రభ చరిత్ర, హర్ష చరిత్ర అనునవి గ్రాంథిక భాషలోనే యున్నవి.[20]

హర్ష చరిత్ర రచన వెనుక మరి మూడేండ్లకు క్రీ. శ. 1914 లో రాజమహేంద్రవరమున—ఆంధ్ర సాహిత్య పరిషద్ద్వితీయ వార్షికోత్సవమున—నప్పటికే గిడుగువారు ప్రతిపాదించిన వ్యావహారిక భాషావాదమును గూర్చి తిరుపతిశాస్త్రిగారిట్లు కవులకు విన్నవించినారు.

"సీ. ఆంధ్ర భాషావధూటి కో యార్యులార!
కష్టవచ్చిన యట్లు నిలా వచ్చినట్లు
నగలు నాకెంబులున్ బెట్టవగునుగాని
మాత్రములు త్రెంపకుం డాంధ్ర శూరులార!"

దీనిని బట్టి వ్యాకరణ సూత్రబద్ధమైన వచన రచనయే యుండవలెనని వారి వాదము.

రాజమహేంద్రవర పరిషత్సభకు—నిత్య వ్యవహారములోను గ్రాంథిక భాషనే యుపయోగించు—మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నము పంతులు వారధ్యక్షులు. వారు జీవించియున్నంత కాలము గిడుగువారి వ్యావహారిక భాషావాదము ప్రవర్తిల్లలేదు.[21] వారు గతించినవెనుక గిడుగువారు గ్రాంథిక భాషా వాదమును ప్రోత్సహించుచున్న పండితులుగాని, గ్రాంథిక భాషలోనే రచనలు చేయుచున్న కవులుగాని విస్పష్టముగా రచన చేయలేరని సవాలు చేసి, వ్యావహారిక భాషా వాదము ప్రతిష్ఠాపించుటకు కాకినాడ,

---

17. ఈ పద్యము పై సమీక్షా గ్రంథములో పేర్కొనబడలేదు.

18. దీని నీ తరువాత నెవ్వరును వచనముగా తిరిగి అనువదించలేదు. ప్రశస్త ప్రౌఢ పద్య కావ్యముగా విక్రమాంక దేవ చరిత్రను, ప్రస్తుతము ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా ప్రాచ్య భాషాధ్యక్షులు విద్వచ్ఛిరోమణి కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారు రచియించినారు. విక్రమాంకదేవ చరిత్ర అవతారికా భాగము పద్యములలోనే ననువదించి విజయనగర 'కల్యాణి' పత్రికలో ప్రకటించి యున్నాను. (1934—1935)

19. ఈ గ్రంథ రచన క్రీ. శ. 1902 లో జరిగియుండును. ఇది శ్రీ రాజా మంత్రి ప్రెగ్గడ భుజంగరావు గారి "మంజువాణి" పత్రికలో క్రీ. శ. 1903 లో పూర్తిగా ముద్రితమై ప్రకటితమైనది. తరువాత తిరుపతి వేంకటకవుల సంపూర్ణ గ్రంథావళిలో నిది పునర్ముద్రితమైనది.

20. ఇవి యన్నియు తొలుత 'సరస్వతి' పత్రికయందు ప్రకటితములైనవి. తరువాత పునర్ముద్రితములైనవి.

21. గిడుగువారు అప్పారావుగారిట్లు వ్రాసినారు:

"The only exception is Mahamahopadhyaya Kokkonda Venkarathnam Pantulu, who cannot withstand two things in this otherwise imperfect world—Social Reforn and spoken Telugu."

—Introduction to Kanyasulkam. (1909)

రాజమహేంద్రవరము, గుంటూరు మున్నగు పట్టణములలో పండిత సభలు గావించినారు. రాజమహేంద్రవరములో తిరుపతిశాస్త్రి గారి మరణానంతరమున గిడుగువారు సభ చేయించినారు. ఆ సభకు శ్రీపాద, చిలకమర్తి, చెళ్లపిళ్ల మున్నగు విద్వన్మహాకవులు వచ్చినారు.

రామమూర్తిపంతులుగారా సభలో తిరుపతి వెంకటకవుల యీ క్రింది ప్రసిద్ధ పద్యము చదివి—

"దోసమటంచు నెఱింగియును దుందుడుకొప్పగఁ బెంచినార మీ
మీసలు రెండు భాషలకు మేమె కవీంద్రుల మంచుఁ దెల్పఁగా
రోసము గల్గు సత్కవివరుల్ మము గెల్వఁడు గెల్చిరేని యీ
మీసలు దీసి మీ పద సమీపమునం దలుంచి మ్రొక్కమే'

ఇందలి దోషమేదో తెలుపుడని వేంకటశాస్త్రిగారి నడిగారు. వారేగాక, తక్కిన పండితులు దీనిలోని దోషము నిరూపింప లేకపోయినారు. అప్పుడు గిడుగు వా రిట్లు వివరించినారు.

"గెల్చిరేని" అను క్రియకు కర్త మీరు—అనునది. మధ్యమ పురుషక్రియలకు 'తి' వర్ణము వచ్చును. మీరు "గెల్చితిరేని" అనవలయును. మీరు చదివితిరేని, కొట్టితిరేని ఇత్యాదిగా అవి కవి ప్రయోగములు చూపినారు. గిడుగువారి పాండిత్యమునకు వెంటనే చెళ్లపిళ్లవారు జోహారు అర్పించినారు. ఆ సభానంతరమున మరికొన్ని దినములకు కృష్ణా పత్రికలో—

'గిడుగా పిడుగా'

అని వ్యాసము వ్యావహారికభాషలో వ్రాసి యానాటినుండియు వ్యావహారిక భాషా రచనను చేపట్టి పరశ్శతములైన వ్యాస రచనలను చెళ్లపిళ్లవారు వారి జీవితాంతమువరకు గావించినారు. గిడుగువారి వ్యావహారిక భాషా సూత్రములకు చెళ్లపిళ్లవారు భాష్యకారులైనారని యీవరకే తెలిపినాను. వ్యావహారిక భాషలో వారు వ్రాసిన పరశ్శతములైన వ్యాసాలు పత్రికా ముఖమున ప్రకటితములై సాహిత్యవీథిని వెలిగించినవి.[22] అయితే చెళ్లపిళ్లవారు తమ వ్యావహారిక భాషా రచనలో సందర్భాన్ని అనుసరించి, ఆంగ్ల భాషా పదాలు వాడారు. ఇది గిడుగువారి సిద్ధాంతానికి పై మెట్టు. పద్య కావ్యాలలోనేకాక, గద్యంలో (వ్యావహారికంలో) ఆంగ్ల భాషా పదాలు వాడవచ్చునని నిరూపించారు.

వారి వ్యావహారిక భాషాశైలి అనన్యసాధ్యం. దాని కదే సాటి. దానివలన వ్యావహారిక భాషావాదమునకు బలము చేకూరినది.

వ్యాసరచన

ఇంతవరకు నవీన వచన శాఖలలో ప్రథమగణ్యమైన వ్యాస రచనము గూర్చి పరిశ్రమ జరుగలేదు.[23] చెళ్లపిళ్లవారి వ్యాసము లన్నియు కొన్ని సంపుటములుగా ప్రకటితములైనచో అప్పుడు వారికి వ్యాస రచనా శాఖా చరిత్రమున నెట్టి యున్నత స్థానము గలదో వ్యక్తమగును.

బుద్ధచరిత్ర

తిరుపతి వెంకటకవుల పద్యరచనలలో ప్రశస్తమైన బుద్ధచరిత్ర నేడెంతో వ్యాప్తిలోనికి రావలసియున్నను నే కారణముననో రాలేదు. దీనికి కృతిపతులగు పోలవరము జమీందారు కొచ్చెర్లకోట వెంకటకృష్ణారావుగారే దీనిని ముద్రించినారు. క్రీ. శ. 1901 లో ముద్రితమైన యీ కృతి కొక పీఠికయున్నది![24] ఆ పీఠికయం దుదాహరింపబడిన కొన్ని పద్యములను నా పమీక్షలో నిచ్చియున్నాను. అందు చేరని దొకటి:

"చ. తిరిగితి మెల్ల దేశము లదేపనిగా నికమీద దేశ సం
చరణ మొనర్పఁగా విసుగు చాల మనంబున దోఁచెనయ్య! యీ
తిరుపతి వేంకటేశ కవి ధీరుల నొక్కెడ నుండఁజేసి భూ
వర సభలందు ఖ్యాతిని నవశ్యము జెందుము కృష్ణ భూవరా."

తిరుపతివేంకటకవులవెనుక బుద్ధచరిత్రను పద్య కావ్యముగాగాని, వచన కావ్యముగాగాని రచియించినవారు లేనేలేరు. ఈ విషయ మొక్కటియే దాని ప్రాశస్త్యము తెలుపుచున్నది. ఇది సమకాలికుల మెప్పును పొందిన రచన. ఆ కాలమున తెనుగు దేశములో నతిప్రసిద్ధమైన అముద్రిత గ్రంథ చింతామణి దీనిని గూర్చి ప్రకటించిన విమర్శన నిందు పొందుపరచుచున్నాను.

'బుద్ధచరిత్ర కృతి విమర్శనము'

"బుద్ధ చరిత్రము అను పద్య కావ్యము గోదావరీ మండలమునందలి పోలవర సంస్థానాస్థాన విద్వాంసులగు బ్రహ్మశ్రీ తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపబడి తత్సంస్థానాధిపతిచే మాకొక ప్రతి విమర్శనమునకై తే 2—12—1902 దిని బంపబడినందున సాంతముగా జదివి సంతోషించితిమి. ఈ కవుల ప్రభావ మందరకు నిదివరకే విదితముగాన నిచటు బెంచి వ్రాయ విరమించి గ్రంథ గుణాగుణమును మాత్రమే ప్రకటించెదము. శైలి యనర్గళమైనదిగా నున్నది. "అల్లితిమి తోచుగతి కవి! తల్లజాలోన రించు గ్రంథతతి కిది నవమా! ఢిల్లికి ఢిల్లే! పల్లెకు పల్లె యని చెప్పునట్టి పల్కులు నినరే." అని గ్రంథకర్తలు పీఠికలో ప్రకటించుకొన్నను గవిత్వ మంత నీరసముగా నుండలేదు. ఈ క్రింది పద్యములం జదివిన గ్రంథ గౌరవము తెలియునగు. ప్రథమాశ్వా

---

22. చెళ్లపిళ్లవారి వ్యాసములను చాలావరకు ప్రకటించిన యశస్సు భారతీ పత్రికాధిపులది. వారి తుది వ్యాసము భారతియే ప్రకటించినది. (మార్చి1950)

23. నే నీ శాఖనుగూర్చి మొదట కొంత పరిశ్రమ చేసి "నూరేండ్ల తెనుగు వ్యాసము" అను వ్యాసమును ప్రకటించినాను. (ఆంధ్రపత్రిక 1961 సంవత్సరాది సంచిక). అది చాలగా నేడు విశేష విషయములతో అనగా వ్యావహారిక భాషా వ్యాస విశిష్టతతో వెలువడవలసియున్నది.'

24. బుద్ధ చరిత్ర—ద్వితీయ ముద్రణమున నీ పీఠికలేదు.

సమున 5—38—39—95—126—177, 206; ద్వితీయాశ్వాసమున 10, 11, 12; తృతీయాశ్వాసమున 96, 152, 157, 175. ఇంకను గొన్ని పద్యములున్నవి. వానిని గ్రంథము జూచి చదివి సంతసింపవలయునుగాని వ్రాసిన దీరదు. ఈ కృతియందు కృష్ణారాయయనియు (పుట 37), వ్రేటపడుచుఁడనియు (పుట45), బడిపిల్లఁడనియు (పుట38), బంట్రౌతనియు (పుట 37) మొదలగు నవ రూప ప్రయోగము లగపడెడు. మఱియు 'దీక్షాతంత్రతంబు లొనర్పఁ బాడియని వేదంబుల్ విధింపన్' అని 64 వ పుటయం దగపడెడి. ఇయ్యతి నియతిం జెందినదాయని సందియ మందెదము"—పత్రికాధిపతి.[25]

పై సమీక్షను చూచినట్లయితే ఆ కాలములో సాహిత్య విమర్శన మెట్లుండెడిదో తెలియుగలదు. ఇప్పటివలెగాక ఆనాడు గ్రంథమునకు మూలమగు శాబ్దిక చర్చయే ప్రధానముగా నుండెడిది. అందును అముద్రిత గ్రంథ చింతామణి అగ్రగణ్యత వహించినది. పై శబ్దముల విమర్శ.

తిరుపతి వేంకటకవులు బుద్ధచరిత్ర రచననాటికింకను ప్రాచీన భాషాసంప్రదాయము నలవరించుకొనలేదు. అందుచే పై విమర్శ వెలువడినది.

1. కృష్ణారాయఁడు—ఇది సంజ్ఞా వాచకమగుట చేతను తమకుముందు మను చరిత్రలో కృష్ణదేవరాయాగ్రగణ్యుడు మొదలగు సమాసము లుండుటచేతను పరిహార్యమే.

2. వ్రేటపడుచుఁడు—ఈ ప్రయోగము సరికాదు. పడుచు శబ్దము—ఉభయలింగము. కన్యకయందును బాలుని యందును వర్తించును.

కన్యక—'దానిఁ బడుచుం జేకొనఁగా' భార. ఉద్యో. 4—126.

బాలుడు....'కరణ గ్రామణిపాటి బిడుగాఁగ' మార్కండేయ పురాణము 5—110. పుంలింగ పడుచు శబ్దమునకు పుంల్లింగ వివక్ష కొఱకు 'డు' ప్రత్యయము చేర్చనక్కరలేదు.

3. బడి పిల్లఁడు—ఇదియును పై పడుచు శబ్దమువంటిదే. 'బిడ్డ' శబ్దము పోలినది. పిల్ల + వాడు—పిల్లాఁడు కావలెను కాని పిల్లఁడు కాదు. దీనికి కవి ప్రయోగములులేవు. అందుచే అప్రయోగము.

4. బంట్రౌతు—ఇది బంటు + రౌతు అని రెండు పదముల కూడిక. బంటు—ఇది 'భటు' శబ్దభవము. రౌతు—ఇది తద్భవమే. (రాజపుత్ర) (రాహుత్త) (రావుత్త) (రౌతు) లోకవ్యవహారమున "బంట్రౌతు" కవి ప్రయోగము లేదు.

64వ పుటలో 'దీక్షాతంత్రతంబు......వేదంబుల్' యతి తప్పినదని చూపబడినది. ఇది తరువాతి ముద్రణములో సరిచేయబడినదో లేదో తెలియదు.

కవి ప్రయోగములు—వ్యాకరణము

బుద్ధచరిత్రమున నిట్టి ప్రయోగములు చేసినను చెళ్ళపిళ్ళవారు కాలక్రమమున భారతాది కావ్య ప్రబంధ ప్రాచీన సాహిత్యమంతా కూలంకషముగా పరిశీలించి తెనుగు భాషకు కవి ప్రయోగమే ఆధారమని, వ్యాకరణము కాదని ఘంటాపథముగా చాటినారు. తెలుగుననున్న వ్యాకరణము లైనను, కవి ప్రయోగములతో సమన్వయము కాలేదని తిరుపతి వేంకటకవుల సిద్ధాంతము. "వైయాకరణాః పిశాచాః ప్రయోగ మంత్రేణ నివారణీయాః" అని వారి సూక్తి.

"క. వ్యాకరణ మ్మొక త్రోవ మ
హా కవులొక త్రోవ"

అనియు "తెనుగున కున్న వ్యాకరణ దీపము చిన్నది" అనియు ఖండితముగా ప్రకటించినారు.[26] నేటివరకును వారి కవితా స్వాదస్వమును మనము గ్రహించుచున్నాము గాని వారి గ్రంథములలోగల భాషా విశేషములుగాని ప్రయోగ విశేషములుగాని మనము పరిశీలించలేదు.

పదజాలము — అన్యదేశ్యములు

తెలుగు భాషలో క్రీ. శ. 14 వ శతాబ్ది ప్రారంభము నుండి అరబ్బీ, పారసీ భాషా పదములు కావ్యములలో ప్రవేశించినవి. ఇంగ్లీషువారి పాలనమున ఆంగ్లేయ భాషా పదములు సక్రమముగా కావ్యములలో చోటు చేసికొన్నవి. అద్యతన కాలమున నాంగ్ల భాషా పదాలను ధారాళంగా, రసోచితంగా ప్రయోగించి కేవల మన్య భాషా లక్షణ లక్షితములైన ఆంగ్ల పదాలకు తెనుగుగా దిద్ది తీర్చినవారు తిరుపతి వేంకట కవులే.

"ఉ. కాలము బట్టి దేశమును గాంచి ప్రభుత్వము నెంచి దేశ భా
షా లలితాంగి మారుటది సత్కవి సమ్మతమౌట యున్య దే
శ్యాలును తెల్గుభాష గలవంచు నెరుంగుచు నేడు మేము "కే
బ్బాల"ని వాడుచుంటి మిక పండితులేగతి నొప్పకుందురో"[27]

తిరుపతి వేంకట కవుల కావ్యములనుండి కొన్ని ఇంగ్లీషు పద ప్రయోగములు చూపుచున్నాను:

---

25. అముద్రిత గ్రంథ చింతామణి. సం. 16 నం. 2 ఫిబ్రవరి 1903 పుటలు 19—20

క్రీ. శ. 1885 నుండి 1904 వరకు నడచిన యీ పత్రిక యందలి వ్యాసములు సమీక్షలు సర్వమూ తిరిగి ముద్రించిన' నవ్యయుగ గ్రాంథిక భాషా సాహిత్య చరిత్రకు సంబంధించిన నూతన విషయము లెన్నో వెలుగులోనికి రాగలవు.

26 నేటికిని తెలుగు భాషకు సమగ్రము, సాధికారమునైన వ్యాకరణము లేదు. అట్టి సమగ్ర వ్యాకరణ రచనకు తిరుపతి వేంకటకవుల కృతులలోని భాషా పరిశీలన యత్యావశ్యకము.

27. ఈ పద్యమును గిడుగువారు తమ బాల కవి శరణ్యంలో ఉదాహరించారు.

అడ్వొకేటు. ప్లీడరు: లాయరు

సీ. రామకృష్ణరాయ భూమి నాథుండే
మూగురు పెద్ద...హైకోర్టునం దడ్వొకేటు
నిప్పుండ బుద్ధి—జాతక చర్య. 45 ప.

ఆసుపత్రి: ను స్థిరముగ ఆసుపత్రి గయి సేయుదు.
నానాజనదర్శనము ఉ. భా. 756 ప.

ఇంగ్లీషు భాష: సీ. ఇంగ్లీషు భాషలో నెమ్మదియున్ ధాక
స్యాను చేసిన మహా పండితుండు[28]
జాతకచర్య, 85 ప.

ఎన్సైక్లోపీడియా: "ఎన్సైక్లోపీడియా మణి"
జాతకచర్య—ఉ. భా. 101 ప.

పోటరు: "సీ. పోటర్లు భయపెట్టి పాటు లంచములిచ్చి
సభ్యతాపదవి కొనపడువారు.
కలగూరగంప. 32 ప.

కోట్లు: కోటు—సీ. ప. ప్రస్తుత కాలమున ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎట్టి వేషములతో నుందురో ఈ క్రింది పద్యము నిరూపించుచున్నది.

ఉ. చెప్పుల కాళ్ళు, ముండితపు శిర్షము, శాస్త్యలలాటమున్ మఫీన్
గొప్ప బడాయి వేషములు కుప్పల పోగులు కోట్లు కంఠమం
దొప్పెడి పట్టముల్ గలుగు నొజ్జలు శిష్యులు నీకు తేరు మా
యప్ప చిరాయువై బ్రదుకు మమ్మరో! వేదమ నీకు
మొక్కెదన్. కల. 70

కంఠమం దొప్పెడి పట్టములు—కాలరులు

నోబిలు ప్రైజు: "సీ. భారతీయులు తుష్టిపడగ నోబిలు ప్రైజు
గైకొని నరనవరా కవనమందు" కల. 17.

ఇది రవీంద్రుని గూర్చి చెప్పినది.

పోస్టుపోను: "గీ. విరుడు మా యువధానంపు నేర్పు జూడ
నను నుతించియు రాజకార్యప్రసక్తి
పొసగుటం జేసి యది పోస్టుపోను జేసిరి."
జాతకచర్య. 4 ప.

బ్రెయినుశక్తి: "బ్రెయిను శక్తియ యుదియంచు బల్కువారు
సైరి సభనున్నవారు శతావధాన మరసి."
శతావధానసారము. ఉ. 51 పుట.

---

28. ఇది విజయనగర మహారాజాంగ్ల సంస్కృత కళాశాలల యధ్యక్షులు కిళాంబి రామానుజాచార్యులు గారిని గూర్చి చెప్పినది.

బెంచీలు : "బెంచీ లక్కరలేదు గేమ్సు మొదలౌ ఫీజుల్
మరిన్ లేవు"

కల. 62

మనియార్డరు : "రెండునూరారులు వచ్చి చేరె మనియార్డరు
మూలమునన్."

జూత. 807.

మ్యానేజరు : "సీ. మంజువాణీ ప్రెస్సు మ్యానేజ రొక సాక్షి."
(జయంతి)

రూల్సు : "మ్యాలున కొన్ని రూల్సు లవి క్రొత్తగ పుట్టు
కతాప

నావా. ఉ. 338.

లెక్చెరు : "సీ. శేషునిం బోలు లెక్చెరు చెప్పగా జాలు
వావిబిసేం టొక్కయుండ దనర

కల. 50.

విడో : "మ. సడికిస్ బూర్వులు జంకువార లిపుడో
జంకన్నదే లేదు మున్
విడియంబంగన కుండె యుప్పు డది
యుంటే పెద్దదోషంబహో
విడియాకుల్ మరియున్ విడోస్పరిణయా
విర్భావముల్ తల్లి యీ
చెడు కాలాన మనస్వి యే విధముగా
జీవించు కామేశ్వరీ."

కామేశ్వరీ శతకము.

మచ్చునకు కొన్నియే చూపితినిగాని, చెళ్లపిళ్ల వారి రచనలలో నివి కోకొల్లలు.[29]

సంస్కృతభాషాపాండిత్యము - కృతులు

"రెండు భాషలకు మేమె కవీంద్రులము" అని సవాలు చేసిన తిరుపతి వేంకట కవుల కృతులలో సంస్కృత రచనలున్నవి. కాని ప్రస్తుతము ముద్రితములైన వారి గ్రంథములలో వారి సంస్కృత కృతులు లేనేలేవు. తెలుగుదేశపు సంస్కృత కవులలో వారి కొక స్థానమున్నదన్న మాట నేటికిని మన సాహితీ విమర్శకులు గ్రహింపలేదు.

కాళీసహస్రము

తిరుపతి వెంకట కవుల రచనలలో ప్రాథమికమైనది సంస్కృత రచనయేయని యీ క్రింది విషయముచే నిరూపించ వచ్చును.

క్రీ. శ. 1891 లో వారి ప్రథమ శతావధానములో ఆదిశక్తి వర్ణనలో నీ పద్యము గలదు.

ష. నిరతము మానసంబునను నేర్పున గొల్చెద శక్తిభక్తితో,
సరసిజ సంభవాది దివిజ ప్రకరార్చిత పాదపంకజన్
సరసిజమిత్ర చంద్రమ ఉషర్బుధరూప విలోచనోజ్జ్వలవ్
తిరుపతి వెంకటాభిధ సుధీమణి గీత సహస్ర నామకవ్.

28 ప.

తిరుపతి వెంకట కవులచే కీర్తింపబడిన సహస్రనామాత్మిక అని దేవిని సంబోధించినారు. దీనినిబట్టి కాళీసహస్రమువారి ప్రథమ రచన. వెంకటశాస్త్రిగారే దీనిని గూర్చి యిట్లు చెప్పారు.

"మొట్ట మొదట సంస్కృత కవిత్వానికి ఆరంభించినప్పుడు కాళిదాసుగారి—శ్లో. "ద్వైపాయన ప్రభృతి శాపాయుధ
త్రిదివ సోపాన ధూళి చరణా"
అన్న శ్లోకాలను వరవడిగా పెట్టుకొని మేము
శ్లో. నాళీకజాత్యదితి జాలీ శిరః
కలిత మౌళి ప్రభాంచిత పదా
అంటూ కొన్ని శ్లోకాలు యిష్టదేవత కాళికను గూర్చిన్నీ—
శ్లో. బాలం సమస్త జగదాలంబ మంబుధర నీలం
బలారి వినుతం—"
అంటూ శ్రీ కృష్ణభగవానుణ్ణిగూర్చిన్నీ వ్రాసిఉన్నాం."[30]

అష్టకములు

పై కృష్ణభగవానుని గూర్చిన రచన గోపాలాష్టకము లోనిది కావచ్చును. ఈ గోపాలాష్టకముతో, కాళికాష్టకము మొదలైన రచనలు "అష్టకములు" అనుపేర 1912 లో ముద్రితమైనది. ఇది వారి సంపూర్ణ కృతులలో లేదు.

మూలస్థానేశ్వర స్తుతి శతకము

తెలుగు మకుట లక్షణముగల యీ సంస్కృత శతకము క్రీ. శ. 1894 లో రచితమైనది. దీనిని సంపూర్ణముగా నిందుతో ప్రకటించుచున్నాను.

వెంకటశాస్త్రిగారికి కావ్య రచనతోపాటు సంస్కృత భాషలో కూలంకష పాండిత్య ముండేది. ఒక్కొక్క ప్రయోగాన్ని గూర్చి ఎంత లోతుగా పరిశీలించేవారో యీ క్రింది ఉదాహరణ తెలుపు కుంది.

ఉదరశబ్ద వ్యుత్పత్తి

పాండవాశ్వమేధంలో వారు—

"దురో। దరమా నీ దగు పేరెరింగియును కట్టా మోస పోతిం జుమీ" అని ఉదర శబ్దములో అచ్చుకు యతి కూర్చి నారు. ఇచ్చట ఉదర శబ్దములోని 'అ'కారమునకు 'కట్టా'లో'కా'కు స్వర 'అ' కారానికి యతి. కాని ఉదర శబ్దములో అకారమున్నదని అమరకోశ వ్యాఖ్య గురుబాల ప్రబోధిక చెప్పలేదు.

---

29. ఒకప్పుడు భారతీ పత్రికాధికాధ్యక్షులు శ్రీ శంభు ప్రసాదుగారు నన్ను ఇంగ్లీషు భాషా పదములున్న పద్యములను సేకరింపమని కోరినారు. వారి యాదేశానుసార మప్పుడు చాలా సేకరించినాను. కొన్నింటిని నా "శబ్ద రత్నాకరానుబంధము"లో చూడవగును.

30. కథలు—గాథలు 3 వ సంపుటము. వికట విమర్శనం. పుట 85. ఈ కాళీసహస్రము లభ్యము కాలేదని దివాకర్ల తిరుపతిశాస్త్రిగారి కుమారుడు వెంకటావధానిగారు చెప్పినారు.

"ఉదయుర్తి గర్భోఽస్మాదితి ఉదరం—ఋుగతౌ. దీనివలన గర్భము ప్రకాశమానమగును" పుట.393

ఉదర శబ్దములో పై వ్యాఖ్యనుబట్టి అకారములేదు కాబట్టి—ఈ యతి తప్పని పండితు లాక్షేపించినారు. వెంకట శాస్త్రిగారు తదేక దీక్షతో మరికొన్ని అమర వ్యాఖ్యానాలు పరిశీలించారు. క్షీరస్వామి వ్రాసిన సుధావ్యాఖ్యలో

ఉత్ + అర = ఉదర

అన్న వ్యుత్పత్తి యున్నది. దీనిని చూపగానే పండితులు నిరుత్తరులైనారు.

ఒక అవధానంలో తిరుపతి కవులు 'బొక్కుచు' అని ప్రయోగించారు. ఇది గ్రాంధికముకాదని వ్యావహారికమని కవులాక్షేపించారు. వెంకటశాస్త్రిగారు వెంటనే సంస్కృత ధాతురత్నావళితో

'బుక్క భషణే'

అన్న ధాతువును చూపి, వారు మాటాడకుండా చేశారు.

ఇది ఆంధ్ర కవి ప్రయోగ పాటవానికి— వారి 'జయంతి' చూడవచ్చును. ఇట్టి శాబ్దిక వివరణలు, వెంకటశాస్త్రిగారి వ్యాసములలో పరశ్శతములుగా నున్నవి. విస్తర భీతిచేత విరమిస్తున్నాను.

నా ట క ము లు

తిరుపతి వేంకటకవుల కృతులలో ఒక్క నాటకములను గూర్చిమాత్రమే యింతవరకు సాహిత్య సమాలోచనలు వెలువడినవి.[31]

తిరుపతి కవుల సాహిత్య సమీక్షలో నాటకములను గూర్చి 88 పుటలున్నవి.[32] అందు 1. ఆంధ్రీకృత రూపకములు 2. పాండవ నాటకములు 3. ఇతర నాటకములు — అని వారి నాటక రచనలు మూడు విధాలుగా పేర్కొనబడినవి. కాని యీ విభజన చారిత్రాత్మకముగానే కాక వారి సాహిత్య రచన దృష్ట్యా కూడ అసంబద్ధము. వారి రచనలు నాలుగు విధాలు. 1. అనువాదములు 2. పౌరాణికములు—భారత నాటకములు, ఇతరములు 3. చారిత్రకములు, 4. సాంఘికములు.

అ ను వా ద ము లు

తిరుపతి వేంకటేశ్వరులు సంస్కృత నాటకానువాదాలు ప్రారంభించేసరికి మూడు దశలుగా ముందుగానే ఆ పథకం వ్యాప్తి చెందినది. బాలరామాయణము (1902), మృచ్ఛకటికము (1907), ముద్రారాక్షసము (1908) అను మూడింటిలో బాలరామాయణము తప్ప తక్కిన రెండింటికి అనువాదము అంతకు ముందు వెలసినవే.

మృచ్ఛకటిక వావిలాల వాసుదేవశాస్త్రిగారు 1892 లోను, ముద్రారాక్షసము[33] నునర్గ అనంతరావుగారు 1890 లోను అనువదించారు.

బాలరామాయణాన్ని తిరుపతి వేంకటకవుల వెనుక నెవ్వరును నాంధ్రీకరింపలేదు.

కర్పూరమంజరి (సట్టకము)

బాలరామాయణము సంస్కృత భాషలో రాజశేఖర మహాకవికృతము. అతడు బాలరామాయణమునేగాక బాలభారతము అను నాటకమును, విద్ధసాలభంజిక అనే నాటికను పై కర్పూరమంజరీ సట్టకమును రచించినాడు. తిరుపతి వెంకటకవు లీ సట్టకమును (ప్రాకృత భాషారచన) తమ నాటక రచనకు నాందిగా చేసినారని అందలి ప్రస్తావననుండి తెలియుచున్నది. దాని వివరము:

నా ం ది

"సీ. కవిరాజ రసనాగ్ర కమనీయమైన ప
　　ల్లవముల వెలందుక శుభం బొలయుగాత.
భారత ప్రముఖ ప్రబంధ నిర్మాతలు
　　వ్యాసాదులకును మేలగును గాత
లాంతి కబ్బపు దొర ల్లవరసంబులకును
　　గుదురైన పల్కు పల్కుదురు గాత
పరువైన మాగధీ భాష పాంచాలికా
　　రీతితో మాకు స్ఫురించుగాత
గీ. గద్య పద్య ప్రబంధ వాక్కల్పనంబు
　　తెలిసి తెలుపంగ నేర్చిన ధీరులెల్ల
రాత్రి వెన్నెలలను చకోరముల పగిది
　　బొదలు సత్కావ్యరసము గ్రోలుదురు గాక

పారి: బావా! ఎందులకు బిలిచితివి తెలుపుము.

సూత్ర: ఏమి? ఈ గడబిడ జూడ నేదియో యొక నాటక మాడ దలచిన వారివలె నున్నారు.

పారి: ఆ! నాటకమనుకారు కాని యొక సట్టకమాడ దలచితిమి. ప్రవేశ విష్కంభములు లేకుండ నాటికవలెనున్న సట్టక మందురుగా!

సూత్ర: అది యే కవి రచించినది?

పారి: సీ. గోదావరీ పావనోదార తీర ద్వ
　　యీ రాజితావనీదారు డనుచు
సంస్కృతాంధ్ర కవిత్వ సారస్యమకరంద
　　భపలాయితామిత ప్రతిభు డనుచు
హూణ భాషోద్భవ్వదుల్లంఘమన క్రమ

---

31. అ. ఆంధ్ర నాటక వికాసము. డాక్టరు పోణంగి శ్రీరామ అప్పారావు. 304—307, 333—334 పుటలు. ఇందు నూతనాంశములున్నవి. ప్రామాణికమైన రచన.

ఆ. డాక్టరు జి. వి. సుబ్రహ్మణ్యముగారి 'తిరుపతి వేంకట కవుల నాటక సమాలోచనము'.

32. నా 'భారతి' సమీక్షలో నీ విషయము నెత్తుకొనలేదు.

33. ముద్రారాక్షసమును నిప్పటికి పదేండ్లక్రిందట శ్రీ అవధానము చంద్రశేఖరశర్మగారు సరసముగా తెనిగించియున్నారు.

ప్రౌఢ బి. యే. పట్టభద్రుడనుచు
కరుణాంతరంగ రంగత్కటాక్షచ్ఛటా
పాలితాఖిల పరివారు డనుచు
గీ. ఎవని నుతియింతు రట్టి పోలవర నగర
పాలకుండగు కృష్ణ భూపాలవరుని
యొద్ద విద్వత్కవీంద్రులై యున్నవారు
శతవధానులు రెండు భాషలకు గవులు.[34]

సూత్ర: అరరే! వీరిని తెలిసికొనుట యొక దుష్కరమని ప్రశ్నించితిరా. తిరుపతి వెంకటేశ్వరులే వారు.

పారి: భావా! తెలుసుకొనలే వనుకొంటిని. తెలిసికొంటివి. వారే యీ నట్టకమును రచించినవారు.

సూత్ర: వారు రచించిన పెక్కు శ్రవ్య ప్రబంధములు జదివితిని గాని యిది స్వతంత్ర ప్రబంధమా? అన్య కవి కర్తృకమునకు తెనుగా?

పారి: ఇది కర్పూర మంజరియను ప్రాకృత నట్టకమునకు తెనుగు. మహేంద్ర పాల మహారాజుగారి గురువుగారగు రాజశేఖర మహాకవిది. ఆ మహాకవి రచించిన బాలరామాయణము, బాలభారతము, కర్పూరమంజరి, విద్ధసాలభంజిక అను నాల్గును నీ తిరుపతి వెంకటేశ్వరులే తెలిగించిరి.

పై ప్రస్తావనను బట్టి తిరుపతి వెంకటకవుల తొలి నాటక రచన కర్పూర మంజరి అనువాదమే యని తెలియుచున్నది. ఆంధ్ర నాటక వికాసమున నీ విషయమునుగూర్చి యిట్లున్నది.

"తిరుపతి వేంకట కవుల నాటకములలో తొలి రచన పదంకముల పండితరాజము. (రచన 1900 ప్రాంతములు ప్ర. ము. 1909) (పుట 304).

తిరుపతి వేంకటకవుల రచనలలో దీని కాకర మెక్కడ మన్నదో తెలియరాలేదు బాలరామాయణము క్రీ. శ. 1902 లో ప్రకటితమైనది. అందు వారు తక్కిన వాని ప్రస్తావన యెత్తుకొనలేదు. బాలరామాయణము కర్పూరమంజరితో పాటు బాల భారతము, విద్ధ సాలభంజిక కూడ తెనిగించినట్లు తెలియుచున్నది. కాని అవి రెండు అసలే కానరాలేదు![35]

పై వివరణను బట్టి వారి రచనలలో అనువాదములలో మొదటిది కర్పూరమంజరి అని, దాని సమకాలికమైనది బాల రామాయణమని, స్వతంత్ర రచనలలో మొదటిది పండితరాజమని చెప్పవచ్చును.

చారిత్రకములు

విద్ధ సాలభంజికను కీ. శే. జనమంచి వెంకటరామయ్యగారు తెనిగించిరి. ఇది యొకప్పుడు ఆంధ్ర విశ్వ విద్యాలయములో పఠనీయ గ్రంథము. తెలుగులో సంస్కృత నాటకము ననుసరించి పద్య రూపముగా వెలువడినవానిలో తొలిది, మంచన కేయూర బాహు చరిత్ర (క్రీ. శ. 1260). దానికి మూలము విద్ధసాలభంజిక.

శ్రీమదెడ్వర్డు పట్టాభిషేక నాటకము

తిరుపతి కవుల సాహిత్య సమీక్షలో దీని ప్రస్తావనయే లేదు. ఇది క్రీ. శ. 1901 లో విక్టోరియా అనంతరము పాలకులైన సప్తమెడ్వర్డు పట్టాభిషేక మహోత్సవ సందర్భమున రచితమై 1902 లో 'సరస్వతి' పత్రికలో ప్రకటితమైనది. దీనిని పేరి కాశీనాథశాస్త్రులుగారు విమర్శించిన విషయము ముందే తెలిపినాను. ఇది అనాటి రాజకీయ పరిస్థితులు తెలుపును కాబట్టి పునర్ముద్రణ చేయదగినది.

సాంఘికములు—సువర్ణ పాత్రికము

ఇంతవరకు తిరుపతి వేంకటకవులను గూర్చిన యే విమర్శక గ్రంథముల యందుగాని వ్యాసముల యందుగాని, దీని ప్రసక్తి గన్పట్టదు. దీనిని గూర్చి తొలుత నేనే లోకమునకు వెల్లడించినాను.[36] సువర్ణపాత్రికమనగా పన్నిద్దరాళ్వారులలో నొకడగు తొండరడిప్పొడి అళ్వారు (భక్తాంఘ్రిరేణువు) కథ. విప్రనారాయణుడని అతనికి నామాంతరము. సారంగు తమ్మయ్య వైజయంతీవిలాస కథ యిదే.

విప్రనారాయణుని కథను నాటకముగా రచించినవారిలో రెండవవారు తిరుపతి వేంకటకవులు. రచనా కాలము 1911.[37] ఇది పానుగంటివారి విప్రనారాయణ రచనకు (1909) తర్వాతిది. అయినను ప్రత్యేకత గలది. సువర్ణ పాత్ర నాటకమునకు కీలకము వంటిదిగాన, యీ పేరెంతయు సహేతుకముగా నున్నది.

నాందీ పద్య మెంత సరసముగా కథా వస్తు నిర్దేశము చేయుచున్నదో చూడండి!

---

34. దీనిని గూర్చి తొలుత నేను నా సమీక్షలో తెలిపినాను. పుట 68. ఇది సంపూర్ణముగా లభింపలేదు. ప్రథమాంకము (మూలములో జవనికాంతరము) లో కొంత భాగము మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తకశాలలో నున్నది. చూ. R 45. 1910—1913. (గ్రంథ సూచిక. త్రైవార్షిక నివేదిక.) ఈ భాగము నకై ప్రయత్నించి, యిందు చేర్చదలచితిని. కాని సకాలమునకు నాకు చేరకపోవుటచేత — నీ సంచికలో చేర్చలేకపోయినాను. అవకాశము చూచుకొని ముందు ప్రకటింతును.

35. కర్పూరమంజరి సంపూర్ణానువాదము. కీ. శే. పిలకమర్తి లక్ష్మీనరసింహముగారి మేనగోడలు విద్వాన్ రాపూరి వెంకట సుబ్బమ్మగారిది ముద్రితమైనది.

36. నా భారతి సమీక్ష. పుటలు 69—71.

37. ఇది 'సరస్వతి'పత్రికలో క్రీ.శ. 1911—1912 లో ప్రకటితమైనది. రెండంకములు మాత్రమే లభించినవి. ఈ రెండంకములు నిందుతో చేర్చుటకు ప్రయత్నించితిని. సకాలమునకు లభ్యము కాలేదు. నాకు చేరిన వెంటనే—కర్పూర మంజరి భాగముతో వీనిని ప్రకటించెదను. పాఠకలోకము మన్నించుగాక.

"వెలతల నెట్టుచాటు చనుమిట్టల పై జనసంబు గాంచె, వ
వ్వుల కథరస్థితామృతము పొంగి వహింపగ బెంపు జెంది, వ
వ్వులను సుమంబులన్ గలయఁ బూచు మనోభవభూరుహంబు నె
ల్లలుగ ఫలించు పండ్ల రుచి లాగుత యోగుల చిత్తమేనియున్"

ఆంధ్ర నాటక వికాసమున "వ్యసన విజయము" అను నొక అసంపూర్ణ ప్రకరణము పేర్కొనబడినది. (పుట. 334)

తిరుపతి వేంకటకవులు "జీవానంద నాటకము" అను వింకొక నాటకము రచించినట్లును, అది 'ధన్వంతరి' అను పత్రికలో ప్రకటితమైనట్లును కీ. శే. శివరామశాస్త్రిగారు తెలిపినారు. దానికొరకు గవేషణ చేయవలసియున్నది.

ప్రహసనములు

నాటక రచనయందువలె, ప్రహసన[40]రచనయందును వారు సిద్ధహస్తులు. అయితే నాటకములను గూర్చి జరిగినంత పరిశ్రమ కూడా ప్రహసనములను గూర్చి జరుగలేదు.

1. పల్లెటూళ్ళ పెట్టుబడులు (1903). దీనిని గూర్చి తెలిపితిని.
2. రసాభాసము.
3. త్రిలోకీ విజయము. ఇవి ముద్రితములైనవి.
4. తవిటి రొట్టె ప్రహసనము. 1913 లో ముద్రితము. 1950 లో పునర్ముద్రితమైనది.
   (చూడుడు. తిరుపతి వెంకటేశ్వర కవికృత గ్రంథములు. శ్రవణానందము ముఖపత్రము.) కాని నేడు లభ్యము కానట్లున్నది.
5. స్కూలు పిల్లల ప్రహసనము.
6. నవీన విద్యా విలాసము.

వీని సమగ్ర పరిశీలన యావశ్యకమైయున్నది.[38]

ఆంధ్ర నాటక చరిత్రలో నొక ప్రత్యేక స్థానము సంపాదించిన తిరుపతి వేంకటకవుల నాటకము లన్నింటిని సమగ్రముగా కూలంకషముగా పరిశీలింపవలసియున్నది. వారి యనువాద నాటకాలను ఇతరుల యనువాదములతో తారతమ్య పరీక్ష చేసి మూలముల తులనాత్మక పరిశీలనతో సమీక్షింపవలెను. ధర్మవరమువారి చిత్రనళీయము, చిలకమర్తి వారి గయోపాఖ్యానమువలె, ఆంధ్ర నాటక ప్రపంచమున శాశ్వత కీర్తి నార్జించిన పాండవోద్యోగ విజయములను రచించిన తిరుపతి వేంకటకవుల స్వతంత్ర నాటకములనుగూర్చి యింకా ఎంతో పరిశ్రమ జరుగవలసియున్నది.

పురాణము—ప్రబంధరచన

తిరుపతి వేంకటకవులు ప్రాచీన కవితా సాంప్రదాయికములైన పురాణ రచనలు చేసియున్నారు. అవి వారి శతావధాన, నాటకములయంత ప్రచారమును పొందలేదు. నాటకములలో పాండవోద్యోగవిజయములవలె, కావ్యములలో శ్రవణానందము[40] అఖిలాంధ్ర జన శ్రవణానందకరమైనది. వారు తెనుగు చేసిన పురాణ మొక్కటే—అది:

దేవీ భాగవతము

దేవీభాగవతాంధ్రీకరణము 19వ శతాబ్ది ప్రారంభమున ప్రసిద్ధులగు పాపయారాధ్యుల వారితో ప్రారంభమైనది. వారి తరువాత త్రిపురాన తమ్మయ్య దొరగారు దీనిని తెనిగించిరి. కాని అది యముద్రితము. నేటి దేవీ భాగవతములలో దాసు శ్రీరామకవి గారిది ప్రచారములో నున్నది.[41] శ్రీరామకవిగారే సమకాలికులైన తిరుపతి వేంకట కవుల దేవీ భాగవత రచనను తమ గ్రంథములో నిట్లు ప్రశంసించారు: "తిరుపతి వేంకటేశ కవి దీరుల నెంచెద మిత్ర భావనన్". ఇట్లు సమకాలికుల మెప్పు పొందిన దేవీ భాగవతమునకు మూల సంస్కృత గ్రంథముతో సమ్యక్పరిశీలనగల విపుల విమర్శలేదు.

శ్రీనివాస విలాసము

సంస్కృతమున శ్రీనివాస విలాసము శ్లేషలతో శబ్ద చమత్కృతులతో నున్న ప్రౌఢ రచన. దీనిని తెనిగించుట తిరుపతి వేంకటకవులవారికి తక్క తక్కిన వారికి సాధ్యముకాదు. దీనికిని మూలముతో పరిశీలించి, వారి యపూర్వ కవితాసామర్థ్యమును ప్రకటించు విమర్శన వెలువడలేదు.

(ఇట్లే వారి శతక, లఘు కావ్య (ఖండ కావ్యము), వివాద కావ్య ఖండన(గ్రంథము)లను గూర్చి విమర్శనలావశ్యకములు.

తిరుపతి వేంకట కవుల రచనలలో ఒక్కొక్క శాఖను గూర్చి ఎంత పరిశ్రమ చేయవలెనో సూచించుటకై పై విషయములు సంగ్రహముగా తెలిపినాను. ఇంకా ఎన్నో వివరంప వలసియున్నను విస్తర భీతిచేత విరమించినాను.

అరవైయేండ్ల ఆంధ్రసాహిత్య చరిత్ర

తిరుపతి వేంకటకవుల రచనలు అరవై యేండ్ల ఆంధ్ర సాహిత్య చరిత్రకు ప్రతిబింబాలు. ఒక్క సాహిత్య చరిత్రయే గాదు—ఆంధ్ర దేశ సాంఘిక సాంస్కృతిక చరిత్రకును అవి ప్రధానాధారములు. ముఖ్యముగా చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారి—

---

38. తిరుపతి కవుల సాహిత్య సమీక్షలో ప్రహసనముల ప్రస్తావనయే లేదు.

39. నేడు వ్యావహారిక భాషయే ప్రధానముగా వ్యాప్తిలో నున్నది కాబట్టి ప్రహసనములలోని భాషా పరిశీలన కూడా భాషా పరిణామ దృష్ట్యా చేయదగినది.

40. "శ్రవణానందము" అను నీ పేరు తిరుపతి వేంకట కవులు—పంచమ కేయూర బాహు చరిత్రములోని "శ్రవణానందన ఖారతీ చతురునిన్" అన్న పద్య పాదమునుండి గ్రహించినారు.

41. దీనిని విశాఖమండలమున పురాణముగా చదివెదరు.

1. జాతక చర్య—ఇటీవలి చర్య.

2. కథలు—గాథలు. ఇవి పై చరిత్రను వివరించు విజ్ఞాన సర్వస్వాలు. ఇవన్నీ విపులమైన సారస్వత, భాషా చారిత్రక సూచికలతో, అక్షరములతో, వ్యాఖ్యానములతో ప్రకటితములైనచో తిరుపతి వేంకట కవుల కాంధ్ర వాఙ్మయ ప్రపంచమున గల శాశ్వత మహోన్నత స్థానము వ్యక్తము కాగలదు.

తిరుపతి వేంకట కవులు—కేవలము వ్యక్తులు కాదు. వారొక సంస్థ. కాబట్టి వారి పేర "తిరుపతి వేంకటకవుల సంస్థ" అను నొక సంస్థ యేర్పడి వారి గ్రంథములను సుపరిష్కృతముగా వెలయింపవలసిన బాధ్యత ఆంధ్ర మహాజనులపై నున్నది.

అముద్రిత రచనలు

తిరుపతి వెంకట కవుల అముద్రిత రచనలను గూర్చి వేంకటశాస్త్రిగారి కుమారులైన దుర్గేశ్వరశాస్త్రిగారికి వ్రాయగా వారు తే. 2—10—1970 దీని యిట్లు బదులు వ్రాశారు.

"నేనును కొన్ని యిబ్బందులకు లోనగుచునే తి. వెం. కవుల గ్రంథములను సాహితీ పిపాసు లోకమునకై ప్రచురించినాను. ఇంకను నేను ప్రచురించవలసినవి ముద్రితాముద్రితములు సుమారు 30 గ్రంథముల వరకు గలవు."

వారే క్రింది వివరముల నా తరువాత తెలిపిరి.

"తిరుపతి వేంకటకవుల అముద్రిత గ్రంథములు 30 వరకు గలవని నేను వ్రాసినట్లు మీ జాబులో మీరు వ్రాసితిరి. అవి అన్నీ అసలే ముద్రింపబడనివి కావు. ముద్రణ అయి మరల అచ్చుకై ఎదురుచూచుచున్నవే గాని వేరు గావు.

అసలు అముద్రితములు 1. సతీజాతకము 2. శ్రీమదాంధ్ర [illegible]ంథము అను శివలీలలు 3. శివశంకర విజ్ఞప్తి 4. దివ్య తిరుపతి 5. క్షమాపణము 6. దైవతంత్రము—శివమాత్రము."

పై విషయములను తెలిపిన శ్రీ దుర్గేశ్వర శాస్త్రి గారికి నేను కృతజ్ఞుడను.

తిరుపతి వెంకటకవుల సంపూర్ణ గ్రంథములకై గవేషణ అవసరము.

వెయ్యేండ్ల ఆంధ్ర సాహిత్య చరిత్రలో ప్రభువుల మన్నన ప్రజల సమాదరణ ఒక్కమారే చూరగొన్నవారు తిరుపతి వెంకట కవులు. ఆదిని నన్నయ మొదలుకొని అధునాతనులలో గోపీనాథము వెంకటకవివరకు—రాజులచేత పోషితులుగాని కవులే లేరు.[42] అయితే వారికి ప్రజలతో సంబంధము లేదు. ఆధునికులలోను, ప్రాచీన సంప్రదాయానుసారులై, మహాకవులైన వారికిని ప్రజలతో సంబంధము లేదు.

తిరుపతి కవులు—అటు ప్రభువులను మెప్పించి, యిటు ప్రజాసామాన్యములో వారి పేరు నాల్కలపై తాండవమాడు నట్లు చేసినారు. ఇది ఆంధ్ర సారస్వత చరిత్రలో నొక సువర్ణ ఘట్టము.

భారతదేశము పరపాలనలో నున్నప్పుడు వెళ్లపిళ్ల వారు జన్మించారు. ఆ భారతదేశమే స్వాతంత్ర్యమును బడసిననాడు ప్రథమంగా ఆస్థాన కవులైనారు. వారాస్థాన కవులైనది దేనికి? ప్రజారాజ్యమునకు—ఆ పదవికి ప్రజలే వారికి పట్టాభిషేకము చేసినారు.

---

42. పూర్వకవులవలె అగ్రహారాది సత్కారము లంది, రాజులవలన గౌరవింపబడిన ఆధునిక కవులలో గోపీనాథము వేంకటకవి కడపటి వాడు. ఈతడు రాజులవలన పొందిన గౌరవ మర్యాదలు పూర్వ కవులలో ఏ కొద్దిమందియో పొందినారు.

అ ను బం ధ ము

ఇంతవరకు ప్రకటితములైన తిరుపతి వేంకట కవుల గ్రంథములలో చేరనివి, సాహిత్య చరిత్రకారులకు విమర్శకులకు పరిచితముగానివి యీ క్రింది వాని నిందుతో ప్రకటించుచున్నాను.

1. తిరుపతి వేంకటకవుల తొలి అవధానము. (1891)
2. చెళ్లపిళ్లవారి చివరి అవధానము. (1924)
3. మూలస్థానేశ్వర స్తుతి శతకము. (1894)

మొదటి శతావధానము

(25—10—1891) ముఖపత్రము

శుభమస్తు

శ్రీమత్పరదేవతాయై నమః

శతావధాన శ్లోకములు.

ఇవి

శ్రీ కింకవీంద్ర పంచానన విద్వత్కవి బిరుదాంకితులగు
దివాకర్ల తిరుపతిశాస్త్రి చళ్లపిళ్ల వెంకటశాస్త్రియును
నీ మహాకవులచే రచియింపబడి

తత్ప్రియ శిష్య విశ్వనాథ రామబ్రహ్మ సోమనాథ
శాస్త్రులను నీ మువుర ప్రేరణచే

చెన్నపురి

వర్తమాన తరంగిణీ ముద్రాక్షరశాలయందు
ముద్రింపించి ప్రకటింపబడినది.

1892

పుటలు 28. క్రౌను ప్లైజు

ప్ర క ట న

అయ్యా! కాకినాడ పురంబునందు పిఠాపురం రాజావారి హిందూ పాఠశాలలో ఖర సం. ఆశ్వీజ బహుళ రోజున నొక మహాసభ జరిగినది. అట్టియెడ మ. రా. రా. శ్రీ శ్రీ తోలేటి నృసింహంగారు ధురిసేటి శేషగిరిరావుగారు బాదం వెంకటరత్నంగారు బోడా రాజా గారు మొదలగు సరసులు మా గురువులగు తిరుపతి వెంకట శాస్త్రుల వారిని జూచి ఇదివరలో శతావధానము చేసెదమని పలికి యున్నారు. దాని రీతి యెట్టిదో వివరింపవలయుననిన వారిలో నొకరి[43] శ్లోకమున నుత్తరమిచ్చిరి.

శ్లో. తత్తన్నామపద మాస పాద్యుతతమం వృత్తం తథా వస్తు చ
ప్యేకృత్య ప్రథమం శతాయ సరయుం తత్పాద మేకం వదేత్,
భూయః క్రైర్పద బోధితః క్రమవశాత్సార్ధ్రశయం కీర్తయే
దేవన్నామ శతావధాన మథ చే త్పద్యాన సంకీర్తయేత్.

వారు దీనివిని "యిట్టి దుష్కరమైన పని మీరు జేసెదమనిన నమ్మశక్యము గా"దని పలికిరి. అట్టియెడ వారిలో నొకరి[44] పద్యమున వారి సందియము దీర్చిరి.

ఉం. నిలుచుని వేయి పద్యములు నేర్పలరంగను సంస్కృతాంధ్ర భా
షలఁ దగఁ జెప్పనేర్తుమని చాలఁ బ్రతిజ్ఞ వహించి నట్టి మే
మెలమిని నూరు పద్యముల నిప్పుడు జెప్పుట కేమి చిత్రమో
విలవర బాదవాన్వయనదీశసుధాకర వేంకటాహ్వయా.

వారి కవితారీతిని విని వీరు బాలులైనను వీరి సరస్వతి బాల గాదని నిశ్చయించి చేయుట కంగీకరించిరి. అప్పుడు వీ రిరువురు నాంధ్రంబున నేబది పద్యంబులును, సంస్కృతంబున నేబది శ్లోకంబులును చెరియొక చరణముగా రచియించిరి. అప్పుడు కోరిన వృత్తములయొక్కయు, వర్ణనలయొక్కయు కష్టమును పద్యములే విశదపరచుచున్నవి. కొందరు తారుమారుగా గూర్చుండిన పది కనుగొనుటయు తల క్రిందుగా జెప్పుటయు మొదటి మనుష్యులు లేకపోయినను జెప్పుటయు మొదలగు విచిత్రము లీ శతావధానముననేగాని మరి యెచ్చటను జూడబోము. ఈ పద్యములు నిర్దుష్టముగా నుండుటచేతను, వ్యాకరణాది శాస్త్రములయందు స్వతంత్రులగుటచేతను వీరలా సభయందు విద్వత్కవు లను బిరుదు నొందిరి. ఈ పద్యములు సర్వజనులకు తెలియుట కొఱకు కచ్చు వేయించినారము.

విధేయులు

రాఘవబొట్ల విశ్వనాథశాస్త్రి
లంకావని రామబ్రహ్మశాస్త్రి
దేవరకొండ రామనాథశాస్త్రి

శ్రీరామాయనమః

శుభమస్తు—అవిఘ్నమస్తు

తిరుపతి వేంకటీయ శతావధాన శ్లోకాః

శ్రీ రా మ వ ర్ణ న

సీ. శ్రీమద్ధరణిజాత సీమంతినీ మణీ
హాస ద్విగుణిత ప్రభాబ్జకుండు
నమిత నిర్జర సంఘ కమనీయ మకుట సం
ఘటిత రత్న ప్రభా కలితపదుఁడు
మహితమసృణ వనమాలా కలిత గంధ
వాసిత దిక్చక్రవాళకుండు
ఖండిత తామర శత్రు మండల మణిగదా
దండ మండిత భుజాదండకుండు

గీ. భాను వంశాబ్ధి సోముండు, వరగుణుండు
నైన శ్రీరామచంద్రు డనంత కృపను

43. తిరుపతి శాస్త్రిగారు.
44. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి.

సకల సంపత్సమృద్ధులఁ జక్క నిచ్చి
ధరణి రక్షించు నాచంద్ర తారకముగ (1)

గణేశ్వరవర్ణన—లయగ్రాహి

శ్రీ మహిత నాయకుని సోమమణి భూషణుని
భూమహిత సచ్చరితు ప్రేమను గణేశున్
సోమధర పుత్రకుని సోమ సమకాంతి యుతు
భీమ బల సంయుతు సుధీమణి వినోదున్
భూమతర విఘ్నమద సామజ మృగేంద్రు ఘన
ధామనిధిధామ వసుధామహిత తేజున్
నా మనమునం దెపుడు నేమముల గొరి గడు
సీమమున గొల్తు నిఖిలామయ విభేదున్. (2)

విక్టోరియా రాణి వర్ణన—మత్తకోకిలము

వీర ధారలు లేని భూముల నీరధారలు నింపుచున్
సారవత్తరమైన ధాన్యము చక్కఁబండగ జేయుచున్
భూరి సౌఖ్యము మానవాళికి బొల్చు మీరగ జేయు వి
క్టోరియాభిధరాణి నెన్న వటుల్ జగంబున లేరుగా (3)

స్త్రీ వర్ణన

సీ. నీర జాతము బోలు నెమ్మొగంబున మేలు
కస్తూరి నామంబు కళలు గులుక
బంగార గట్టిన బంగారు సరిగంచు
జీర పాదములపై చిందులాడ
ఉరుగువంక కువలయుసరములు దాపి న
ట్లొత్తిలీల నేత్రాంతగతులు వెలఁగ
జలలోడిన జక్కవల రీతి కుచపాళి
కంచెల ఖండించు కరణి నిగుడ
తే. చెలి యొకతె వచ్చుచున్నది చెలుల గూడి
వలరు విల్తుని బల్మావు టమ్మనంగ
దీని గూడంగ గల్గిన మానవులకు
వేరె నాకాబలా రతు లోర్గనేల ? (4)

కాకినాడ పురవర్ణన—మహాస్రగ్ధర

అలితోద్య ద్విద్వన్మణాళుల్ లలిత గుణ గణుల్
రాజరాజావతంసుల్
విలసద్వైశ్యాన్వవాయుల్ వితరణ నిరతుల్
క్షిపపూజాత్త విత్తుల్
విలస ద్వేదౌఘ సేవా ధిరతమతియుల్
విష్ణు పాదాబ్జ జాతుల్
గలదై శ్రీ కాకినాడాఖ్య నగర మిలలో
గాంతిఁ జెన్నారుచుండున్. (5)

పాఠశాల వర్ణన

ఉ. శీలము నీతి బోధములఁ జెప్పెడి సద్గురు కోటు లొక్కచో
మేలగు నానా భాష నెలమిం జదువుచుండెడు బాలు రొక్కచో
లీల జెలంగుచుండ శుభలీలల చెన్నగు రాజ పాఠశా
శాల గనుం గొనంగ నకశాలికినైన సుఖంబు పుట్టదే ? (6)

ఇంగ్లీషువిద్య వర్ణన

మ. తిరిపెం బెత్తెడు వారి నెయ్యది మహా దేవేంద్రులన్ జేయునో
పర నీచాన్వయ జాతు నెయ్యది మహా వంశోత్తముం జేయునో
దరణి నెవ్వరికైన నెయ్యది దగంగా హూణుగాఁ జేయునో
పర శోభాకర యట్టి హూణ కళనే వర్ణింపగా నేర్తునే. (7)

గోదావర్యుజ్జృంభణ

శా. భవామి ప్రోద్భవ పుంజముల్ గుములులై బొల్పొప్ప చో నేగగా
వ్యోమాచుంబి ఝరీ పరీత యగుచుం భూమాంబుధారా త్వరన్
భూమీధ్రంబులు వ్రక్కలై జన తటీ భూభాగము ల్లోలన్
భూమి స్వర్గప వచ్చె గౌతమి మహాపూర్ణంబుగాఁ జూడుమీ! (8)

చిన్నికన్నెలకు వివాహము చేయుటవలన గలిగెడి నష్టము

చ. జనములు చిన్ని కన్నెలకు సత్వర మొప్పగ బెండ్లిచేసినన్
ఘనమగు తెల్వి లేకునికి కన్నియ లప్పుడు పెండ్లియాడి యౌ
వనమున నాత్మగుం దగని వాడయినం దిగనాడి యాతనిన్
ఘనత దొలంగ జార రతి గాంక్ష లొనర్చిన దోసమే జుమీ! (9)

కురుపాండవుల జూదము

శా. శ్రీరాజిల్లగ జూదమాడిరి సభన్ శ్రీ కౌరవుల్ పాండవుల్
రారాజచ్చతురబ్ధి వారిత మహారాష్ట్రంబు లశ్వాంగనా
గా రానేకప రత్న సంచయ ధనాగారంబులుం బందెమై
మీర న్నీరజ మిత్ర పుత్ర ముఖ భూమి స్వర్షుల్ జూడగన్.(10)

దేశసంచారమువలన గలిగెడి లాభము

ఆ. వె. దేశ చాలనంబు తెల్విబుట్టగ జేయు
గరుణ జిత్తమందు గలుగజేయు
నతిథి పూజలందు నాసక్తి బుట్టించు
వేణు గోప బాల విజయ లీల. (11)

రామరావణ యుద్ధము

శా. రాముం డప్పుడు బాణ సప్తకముచే రక్షోవరుం గొట్టినన్
భీముండై దశకంధరుండు విపులాభీలాతిహేతిచ్ఛటా
ధామ స్ఫూర్జిత వీతిహోత్రుడగుచున్ ధైర్యంబు జెంపారగా
భూమ్యాస్త్రంబుల రాము నేయ నపుడా పోరయ్యె ఘోరంబుగన్.

ప్రాతఃకాల వర్ణన

మ. కమలంబు ల్వికసింప గోక వితతుల్ గాంతిం జెలంగం దగన్
విమలాకాశ మహాంతరాళమున దీప్తి జ్వాల లింపారగా
గనులొప్పు ల్గిరి డుదయింప దూర్పునలపై గాంచిచ్చుటల్ దారకా
సముదాయంబులు జాలె తెల్విగనియెన్ సర్వ ప్రపంచంబులున్.

ఫిడేలు సుందరి : సేకరణ—శ్రీ కోడూరి రామమూర్తి—మద్రాసు.



కాశీపతి వర్ణన

క. కాశీపతిఁ గొనియాడెద
నే శీతమయూఖ మూర్ధ్న నీశ్వరు ననఘున్
కాశ శరన్నీరద నీ
కాశ శరీర మహిత హిమకాద్రిజా ధవున్. (14)

గోపాలకృష్ణ వర్ణన

ఉ. సలలిత వేణు నాదమున జక్కగ గోగణ ముల్లసిల్లగా
విలసిత గోపికానికర వేష్టిత పార్శ్వ ధరాభి శోభియై
యిల తులసీ వనంబున జరించెడు నందుని ముద్దు పట్టి నా
బలరిపు నీల నీలు మది భావన జేసెద గార్యసిద్ధికై. (15)

శ్రీరామచంద్ర వర్ణన—మాలిని

జలజ లలిత నేత్రున్ జారు సీతాకళత్రున్
బలరిపు మణినీలున్ ధర్మ సంశోభి చేలున్
లలిత గుణగణాఢ్యున్ రామచంద్రున్ నృపేంద్రున్
దలచెద మదిలోనన్ దత్త్వ విద్వద్విహారున్. (16)

భోగముదాని కొప్పుమీది పువ్వు వర్ణన

ఉ. మానము జూడు మిత్రవర మానవశార్త భుజంగ వంగ వ
న్మానిత వారయోషిదసమాన నవాంబుద కేశపాశ స
న్మానము గాంచి మించెడు ఘుమంఘుమ వాసిత ధర్మ నిర్మితా
మాన విభూషణంబయి మహోన్నత భాగ్యదశాపరీతమై. (17)

కాకినాడలో సుదతి పడుపాటు వర్ణన

గీ. ఇమ్ము వంశాబ్ధి సోముండు వరగుణుండు
గర్వదూరుండు కామేశ ఘనుడు ప్రేమ
గుప్పు కుండ్లను గట్టించి కడపె జలము
కాకినాడ పురంబున గరువుదీర. (18)

కైలబండి వర్ణన

ఆ. వె. కాళ్లు లేనివారు కాశి జనం గను
సాధనంబు దూము శకటు మయ్యె
గాన ముక్తి కిదియె కారణంబై యుంట
దీని నెన్నవలదె మానవేంద్ర. (19)

మన్మథవర్ణన—మత్తకోకిల

భూరి కీర సమాజ మెప్పుడు బొందుగాగను గొల్వగా
జారు కుంద రసాల దుర్బల సాయకుండయినం దగన్
సేరి సోదర నాయికోదర శీతతా పటిమంబుచే
మారు డీ జగమందు గెల్చెడు మానినీ నివహంబులన్. (20)

కైలాస వర్ణన

సీ. ఏ గిరీంద్రమునందు నిందువతంసుండు
భార్యా సమేతుడై వరలుచుండు
నే గిరీంద్రమునందు నింద్రాది దేవతల్
శివ కథాలాపముల్ చేయుచుండు
రే గిరీంద్రమునందు నిభరాజరాజి దా
నీలోపంబుల నీటు జూపు
నే గిరీంద్రమునందు నినసమతేజులౌ
మును లెల్ల శివు జూడ మొనసియుండు
గీ. రట్టి యసమాన మహిమచే నలరు హరుని
గిరిని వర్ణింప శక్యమే హరికినైన
ఫణిపతికినైన నా బృహస్పతికినైన
గల్ప పరిమిత కాలంబు గలిగియున్న. (21)

కుబేరపుష్పక వర్ణన

చ. సలలిత రత్న సంతతి ఇసత్పరిత స్థల భాసమానమై
విలసిత మౌక్తిక ప్రకర వేష్టిత హాటక సాలభంజికా
విలసితమై సురేశ గిరి విస్తృతమై జనరంజనంబునై
వెలయు గుబేర పుష్పకము విశ్వజనీన కళాధురీణమై. (22)

శ్రీకృష్ణ వర్ణన

క. నీరద నిభాన కాయున్
వారదసుత దివ్యనామ సతతదేవ గణున్
పారద సమ సుశ్లోకు ర
మారమణుని గృష్ణు గొల్తు మాననీయున్. (2[illegible])

శృంగారనాయక లక్షణము

గీ. గుణ గణాఢ్యుండు ధనికుండు కులవంతుడును
పండితోత్తమ హృత్పద్మ భానుమూర్తి
దానకర్ణుండు దుర్జన దానవారుడు
సభకు నాయకుడై యుంట సమ్మతంబు. (2[illegible])

బ్రహ్మ వర్ణన

ఉ. సలలిత వేద శాస్త్రముల జక్కని మోములనెప్పు జక్కనన్
లలిత ఘనః ప్రభావమున రాజ విరాజిత పార్శ్వభాగుడై
జలరుహ విష్టరంబునను జక్కగ గూర్చుని నేర్పు మీర బ్ర
హ్మల సృజియించు బ్రహ్మను వినోదము మీరగ సంస్మరించెదన్.

శ్రీరామ వర్ణన

సీ. శ్రీమత్క్షణ ప్రభాస్తోమ సంయుత మేఘ
మన జానకిని గూడి దనరువాడు
యుబ్బంబుపై నొప్పు నళి చందమున మొగ
మున మృగీమదనామ మొనరువాడు

యుంజనాచలముపై యలరారు వాగ్ధని
యున భీతపటముపై దనరువాడు
పీల శిలం గ్రాలు నిర్ఝరాపగ యున
నురమున హారముల్ వరలువాడు
గీ. నైన శ్రీరామచంద్రు డనంత కృపను
గాకినాడ సభాసీమ గలసియున్న
సర్వ మానవులను బ్రోచు సర్వ సంప
దల నొసంగుచు నాచంద్ర తారకముగ. (26)

గంగా వర్ణన

సీ. శారద నీరద చందన మందార
కుందాభ జలముచే గొమరు మిగిలి
జలజాత కువలయ శైవాల సముదయ
వారితాంతరసీమ వలపు మిగిలి
కమనీయ కోక చక్ర క్రౌంచ సారస
రాజిత భంగాళి రహి జెలంగి
భ్రాజమాన తపః ప్రభావమహా నీశ్వర
రాజస్తుతంబుల రంగు మిగిలి
గీ. జలజ నేత్రుని పదమున జన్మమంది
నిఖిల లోకాళి పాపముల్ నెమ్మి గలచి
వెజరిల్లెడు భాగీరథీ ముదమున
విన్ను గొల్చెద మనమున నెల్లవేళ. (27)

ఆదిశక్తి వర్ణన

ఉ. నిరతము మానసంబునను నేర్పున గొల్చెద శక్తి భక్తితో
సరసిజ సంభవాది దివిజప్రకరార్చిత పాదపంకజన్
సరసిజ మిత్ర చంద్రమ ఉషర్బుధ రూప విలోచనోజ్జ్వలన్
తిరుపతి వెంకటాఖ్య సుధీమణి గీత సహస్రనామకన్.

పుష్పకానన వర్ణన

ఉ. చెలగు పుష్పకాననము మిత్రుడ జూడుమి వేడ్కమీరగా
జాలరసాల శాలి పికపాలి మధువ్రత పాలి గాన లీ
లాలలితంబు సంతతమరాళ రథాంగ యుగాభిశోభితో
త్ఫుల్ల దవంతపద్మ రమణీయ సరోవర రాజమానమున్. (29)

బృందావన వర్ణన

గీ. దనరు మీరెడు బృందావనంబు జూడు
మంబుజాక్షుండు గాంతాజనంబుతోడ
నిచట వసియించుటను జేసి యిది విశిష్ట
లోకములలోన మిగుల ముఖ్యమయ్యె. (30)

ప్లీడరుల వర్ణన

మ. త్వరలో హానా కలాకలాపకములన్ బాగొప్ప వ్యాఖ్యానముల్
స్థిరులై జేసి పరీక్ష లిచ్చియు [illegible]
వర హిందూజన శాస్త్ర పద్ధతులచే వాదింపుచుం గోర్టులో
పరధర్మంబు లెరుంగజేయుదురు భూపాలాళికిం బ్లీడరుల్.

మెఱుపు వర్ణన

క. కనుల మిరుమిట్లు గొలుపుచు
ఘనములపై మెరసి మెరసి కాశ్యపి కాంతా
జనముల గన్గొని సిగ్గున
జనియె ననగ దనరు మెరుపు జనవర కంటే. (32)

సూర్యవర్ణన—మత్తకోకిల

నీరజంబుల మేలు కొల్పుచు నీరజాప్తుడు తూర్పునన్
తీరు మీర దిగంగనామణి నాస ముత్తియమో యనన్
మీరెడుం గిరణాళి ధూత తమిస్ర సంచయుడై సదా
చార తత్పర బాడబార్ఘ్య లసత్పురారి జయార్థుడై. (33)

సరస్వతీ వర్ణన

శా. శ్రీ మీరంగ దలంచెద న్మనమునన్ శ్రీమత్కళా దేవతన్
సోమాబ్జారి సుధా సరిద్ధవ శరన్మాల్యాబ్జభా సంయుతన్
భూమాదిత్య మనోంబుజన్మ తరణీభూత ప్రభావత్పదన్
శ్రీమచ్ఛ్రీపతి వేంకటేశ్వర సుధీ శ్రీసోదరాప్యాలయన్. (34)

లక్ష్మీ వర్ణన

మ. కలధౌతాంబరుదేవి నా మనమునం గాంక్షింతు నెక్కాలమున్
కలధౌతోజ్జ్వల దంగ విభ్రమకళా కల్యాణ జాలాస్పదన్
కలధౌతోదర ముఖ్య నిర్జర మనః కంజాత సూర్యాయితన్
కలధౌతాద్రి ధనాభిశోభిత మహాగారావళీవాసినిన్. (35)

అలమేలుమంగతో గూడుకొనియున్న వెంకటేశ్వరుని వర్ణన

క. అలమేలు మంగతోడను
విలసద్వేంకటమహీంధ్ర విభు శిఖమున జం
చలతో గూడిన మొగులన
వెలసెడు శ్రీ వెంకటేశు వినుతింతు మదిన్. (36)

హిమవత్పర్వత వర్ణనము

చ. వెలతితరత్నసంచయలసత్కటకప్రతిభాసమానమై
జలజలసత్సరోవర విశాలతటీరుహ కల్పభూజమై
విలసిత కాంచనోపల నవీన గుహావృత పర్వదిక్కమై
వెలయు హిమాగరాజ మిల వేల్పుమిటారుల కాటపట్టునై. (37)

కరువు వర్ణన

శా. ధారాపాతము లేక సస్యవితతుల్ తప్తంబులయ్యెం గడున్
జేరెన్ సర్వ జనంబు నీపురమునే జీవింప వాగండరన్
శ్రీరామేశ ఘనుండు బ్రోచి మమును దా శ్రీవృష్టి నాక్షామమున్
వారంద్రోలెను దావి గోరమరలన్ వాగెట్లు గున్ మూరుడా. (38)

కావ్యవర్ణన — స్రగ్విణి

సార రాజన్యులన్ జక్క మెప్పించుచున్
జారు వాక్చిత్ర విస్తార పద్యమ్ములన్
మారిచేతోలసద్భావసారభ్యమై
మీరు గావ్యంబు నెమ్మిన్ బ్రశంసించెదన్. (39)

వేశ్యాగుణ వర్ణన — భుజంగ ప్రయాతం

చలాపాంగ దృష్టి ప్రసారమ్ము చేతన్
విలాసమ్ములం జూపి పిత్తమ్ము లాగున్
కలావిద్వరాగిప్రకాండంబునైనన్
గలంచు న్నృపన్ విత్తకాంతా జనంబౌ. (40)

చంద్రోదయ వర్ణన

ఉ. శ్రీరమగేహముల్ గుసుకజేయుచు కోకములన్ గలంచుచున్
జారు చకోర సంతతుల జక్కగ వెన్నెల నాదరింపుచున్
మారునికి స్సహాయుడయి మానినులం గలగంగ జేయుచున్
మీరెడు జంద్రుడుజ్వల తమిస్ర మహీధర వజ్రి శస్త్రమై. (41)

మన్మథోపాలంభ వర్ణన

ఉ. నీరజ వాసియై తనదు నీరజ పుత్రికి పుత్రకుండవై
నీరజశత్రు గూడి నవనీరజగంధుల నేయు వాయువూ
నీరజ నూన ముఖ్య శర నీరజ విష్టర సోదరా నినున్
నీరజ ముఖ్య మానముల నేర్తున బూజ లొనర్ప బ్రోవరా.

కేవల వేదపాఠకుడు వ్యర్థుడని వర్ణన — సుగంధి

వేద మెల్ల నభ్యసించి వేత్తృతా విహీనుడై
మోద కర్మ జాల మెల్ల మేదినిన్ రచించినన్
లేదు లేదు లేదు పుణ్యలేశమైన నంచు నా
వేదమే వచించు గాన వేదవేత్త గావలెన్. (43)

సత్య వర్ణన

ఉ. సారతరార్థ సంతతుల సారతరంబగు సత్య మిద్ధరన్
గోరి వచించువారలకు గోటి సుఖంబులు జేయు నే ఫలం
బారయ గల్గునట్టి ఫల మబ్బును గాన సమస్త రీతులన్
మీరు వచింపుడీ జనులు మేలగు సత్య వచః కలాపముల్. (44)

అనువ్రతి వర్ణన

శా. సేతోగార్త జనాళికిన్ శరణమై సేంతోగులం జేయుచున్
శారీరాది సమస్త వ్యస్తకలనత్సారంబు వింగ్లీషు భా
షా రీతిం గృతి జేయు డాక్టరులచే చారుప్రభా భాసురం
బై రాజిల్లెడు వానుప్రతి గన వాహో శ్లాఘ్య మింపారెడున్.

నాటకుల వర్ణన

చ. సలలిత నాట్య చిత్రముల సభ్యుల చిత్తము లుల్లసిల్లగా
బలువడి జేయుచున్ మిగుల బావగమై దనరారు విష్ణు శ
ర్వుల శివ చర్యలం గమలజానను చర్యల నెప్పు డాడుచున్
వెలయుదు రిట్లు నాటకులు విశ్వజనీన కళాధురీణులై. (46)

సంగీత వర్ణన

చ. సలలిత తోడి మారువ వసంత ముఖారి ముఖాభిధానముల్
గలిగి వెలుంగు రాగములు కాలములున్ స్వరముల్ పదాదులున్
నిలసిత గీత తానముఖ భేదములుం గల గాన విద్య దా
నలవడ కుండలిద్విజాళికైన ముదం బొనగూర్పకుండునే.

నెమలి వర్ణన — తోటకము

శరజాతక వాహన సత్తమమున్
పరిపుల్ల కలాప విభాసురమున్
అరికుండలి దుర్మద హారకమున్
సురుతొప్పగ జూడర కుండలిమల్. (48)

శార్దూల వర్ణన

శా. ఘోరాకారము సర్వహింసకము సత్కాంజాంతరావాసమున్
రారాజద్వరణీధరాకగక వక్త్రంబున్ మహాభీల గం
భీరారావ పలాయమాన మహిషీ భీత్యుద్గరాఖిల సం
చారానేక మృగాళి దిక్సిచయమున్ శార్దూలమున్ జూడుమీ.

ఉపరతి వర్ణన

క. ఘన వితతి చంద్రు గప్పను
వనకలశం బూలు పూసె గనకల్ సత్కాం
డన వనమం బదరె సళియుగ
గనకము దరిజేరె గాంత కాంతుని గవయున్. (50)

భ్రమరాంబా సహిత మల్లేశ్వర వర్ణన — మందాక్రాంతావృత్తం

వందే సాంబం భ్రమర జననీ యుక్త మల్లేశ్వరాఖ్యం
నాశం వంశాంబునిధి శశినా పద్మనాభేన సేవ్యం,
లోకా ధీశం సుజన హృదయాంభోజ సూర్యాయమానం
విఘ్నేశాది ప్రమథ వినుతం కాకినాడాధివాసం. (51)

శరత్కాలచంద్ర వర్ణన — మందాక్రాంతం

శోక వ్యాప్తం తిమిరనిచయం భక్షయ స్నక్షయం వా
జారాం శ్చోరా నపి వికలయన్ జారగా నారిణశ్చ
పద్మాళీనాం వనమపి పునః కోచయం శ్చంద్రికాభి
ర్నీలాంభోజా న్యహహ కలయన్ శారదో భాతి చంద్రః. (51)

సీతాశతాక్షీ వర్ణన — ఉపజాతివృత్తం

సీతా మహామాతృతి భాసమానాం
శతేశ్వరీతాం తే ప్రవదే హి జాయాం,
తథా చ కించిత్తు వదామి సంజ్ఞా
శాస్త్రేషు తస్యా విధినేవ మాన్యా. (53)

ఆ: విష్ణోః ఇతః భర్తుః యస్యాస్సా సీతా, పూర్వజన్మ సీతి తేషు. తాం, సీతాం, సీతా సీత్యర్థః. అన్యేష్వపి తారోము అన్యాదేశస్య భావాత్, విధినా, విధి శాస్త్రేణ సంజ్ఞాశాస్త్రమివ, మాన్యా కార్యేణా పక్ష ఇతి బోధ్యం. ఏతచ్చ పాణినీయ శాస్త్ర ప్రసిద్ధం.

కాకినాడ పురస్థ బ్రాహ్మణ వర్ణన — వంశస్థవృత్తం

సుకాకనాడాఖ్య పురస్థ భూసురా
శ్రుతేన శీలేన విరాజితా భృశం,
తథాపి కేచి ద్ధ్రువమేవ త్యాగయుతా
న తేషు విద్యోతితు సుందరద్విజాః (54)

ఆపి చ. ప్రవాతితే కాకపురే ద్విజోత్కరే
శ్రుతేన శీలేన తపోబలేన చ,
అథః ప్రవృత్తం ఖలు సుందరీశ్వరం
బుధాశ్చతుష్టి ప్రవదేము కించన.

బాలావర్ణన — వసంత తిలకావృత్తం

నీలాంబుజోపమ శరీర విరాజమానాం
నీలాంబుజస్య నయనాం కవిరాజ సేవ్యాం,
శీలార్థ శీతకిరణోపమ దివ్యహాసాం
బాలాం భజే పతత మాధవ పానలోలాం. (55)

సరస్వతీ వర్ణన — ఆర్యావృత్తం

శ్రీమూరి బుద్ధి దాత్రీం
సితాంభోజోపమాన నేత్రాంతాం,
ధ్యాయామి ధాతృపత్నీం
ధాత్రీం సర్వస్య లోకస్య. (56)

శరత్కాల వర్ణన — మాలినీవృత్తం

జలజలలితవాత్తైః పూరితాశేషభాగాం
శరదమధివసంతః కామినీభి ర్వరా యాం,
పరిణత విధు తేజః పుంజితాయాం క్షపాయాం
విహరణ సుఖభాజ స్తే మహాం సంస్మరామి. (57)

అంజనేయ వర్ణన — మందాక్రాంతావృత్తం

వాయోః పుత్రం జలధితరణ ప్రాభవోపేత మంబే
చిత్తే సీతాధవ పద యుగాంభోజ వేంధంచిదంతం,
లంకారణ్య జ్వలన మరుణ ప్రోద్యవాశోభ్యవక్త్రం
కారుణ్యాంచజ్జలధి నయనం శబ్దశాస్త్ర ప్రవీణం. (58)

త్రిమూర్తి స్తవనం — శిఖరిణీ వృత్తం

కనత్కోటీ రాగ స్థగితమణి కాంతిర్య చరుణీ
కృతాశేషాశాంతం సకల ముని వంద్యాంఘ్రియుగళం
కృపాసింధుమ్యాంచన్నయన జలజాతం నిరుపమం
మహ స్సేవే చిత్తే నిధి వాగీహారాకార సుసమం. (59)

లక్ష్మీవర్ణన — మాలినీవృత్తం

జలజనయన జాయాం సర్వసంపత్ప్రదాత్రీం
నిరుపమ గుణజాలాం నిత్యకల్యాణశీలాం,
ధనికసదన వాసాం చంద్రముఖ స్వోదరీం తాం
హృది భజతి నితాంతం వెంకటాభిఖ్యశాస్త్రీ. (60)

మదగజ వర్ణన — మాలినీవృత్తం

సమదగజ నిసంతం కాననే సంచరంతం
ప్రమద మధునవాళీ శాలి గండస్థలాఢ్యం
కరవింసిత శాఖిం కాల మేఘోపమానం
కలయ నయనహాస్తా మోహితాశాంతరాళం. (61)

లక్ష్మీనృసింహ వర్ణన — స్రగ్ధరావృత్తం

శ్రీమద్దేవేంద్ర ముఖ్యాదితి తనయ శిరోరత్నసిద్దజతాంఘ్రిం
గర్వద్యాదాక్షసాళి ధన హనన లసన్నక్క సంశోభిహస్తం,
ప్రహ్లాదార్తి ప్రహారం సకల సుర మునిస్తోత్ర పాత్రం మహాంతం
శ్రీలక్ష్మీనృసింహం భజత మను మను స్సర్వదా దీనబంధుం.

వింధ్యపర్వత వర్ణన — రథోద్ధతావృత్తం

వింధ్యపర్వత మహాద కంతరం
కుంభ సంభవ వినమ్ర గోత్రకం,
మత్తదంతి నికరా కరాకరం
విశ్వ విశ్రుత మణిమంటప ప్రభం. (63)

సాంబ వర్ణన — రథోద్ధతావృత్తం

సాంబ మున్నత జటాల మాథజే
పార్వతీ కలిత వామవిగ్రహం,
రాజతాద్రి నిలయం జగత్త్రయం
సర్వదేవ ముని గేయ నామకం. (64)

సంధ్యాకాల వర్ణన — స్రగ్ధరావృత్తం

సంధ్యాయం భాతి రక్తా సరసిజనికతే ర్వ్యద్ధ భాసాం ప్రరోహా
దుద్యంబత్యక్షి ప్రకాండావృత తల ధరణీజాత జాతాతి శోభా,
స్త్రీ సౌభాగ్య ప్రవాస ప్రకలిత తత బుజ్జాద రాజస్తటాకా
కించిత్ కించిత్సరోవాత్తిమిర సముదయ ప్రావృతా కాంతరాశా.

కాశవృక్ష వర్ణన-మాలినీవృత్తం

సరస ఫల భరాఢ్యః స్ఫీతశాఖాగ్రరాజో
విలసతి వనమధ్యే కాకలోక ప్రకీర్ణః,
కలయ తమిహ మిత్ర వ్యోమ మంజుల ప్రసన్నం
శ్రుతి కటు రవ గుంజన్మక్షికాళి ప్రకీర్ణం. (66)

పార్వతీవర్ణన-రథోద్ధతావృత్తం

పార్వతీం సకలలోక మాతరం
సర్వదా మునుల వర్ణ్యగేహినీం,
భక్తమానస సరోజ వాసినీం
భావయే మనసి పాపహారిణీం. (67)

ఆరామ వర్ణన-ప్రహర్షిణీవృత్తం

ఆరామః ప్రమదకరః ప్రభాతి సోయం
శ్రీరాజత్సుమ భరితైః కుజప్రకాండైః,
నీరేజ ప్రకరయుతైః సరాకరైశ్చ
దారాజత్పికనికరై శ్చూతైశ్చ భృంగైః. (68)

ఆంజనేయ వర్ణన-రథోద్ధతగతివృత్తం

మరుత్సుతం తమహం సదాహృది భజే
హరిప్రభువరం విశాల కరుణం,
కుజారమణ పద్మసేవ మధుపం
నిదాన రజనీచరాళి హరణం. (69)

వసంతవర్ణన - వసంతతిలకావృత్తం

చూతం సదా హరతి మానస మానసాబ్జం
గుంజ న్మధువ్రత వరైః పిక కాకలీభిః,
కీరోత్కరై ర్నతదలం మధుమాసగుచ్ఛైః
స్పష్టం వసంత సమయోపి న యోగమానం. (70)

సరస్వతీ వర్ణన - స్రగ్ధరావృత్తం

శ్రీశ్రీ పద్మాక్షి విద్యుత్ప్రతిభ హృదయాంభోజ మధ్యాయమానాం
శ్రీరాజద్వేంకటాఖ్యోజ్జ్వలసదతులం కలావిస్మృతే సుస్థయమానాం
నీరేజాస్యాం శుభాంగీం కర కలితలసత్పుస్త కాంభోజపాణిం
వాణీదేవీం నిశాంతం సకల కవి నుతాం నౌమి మన్మానసాబ్జే.

సరస్వతీ వర్ణన - మాలినీవృత్తం

విలసదు గుణజాలాం భావయే ధాతృజాయాం
తిరుపతి హృదయాంభోజాత మధ్యాయమానాం,
సరస వచన ధాత్రీం సర్వలోకైక నేత్రీం
విలసిత తనుజాత ద్వేంకటాఖ్యాభి మానం. (72)

ద్రాక్షామాలికా వర్ణన - ఆర్యావృత్తం

ద్రాక్షా మాలికేయం
మమ రాజత్యంతర భాగసంసక్తా
ప్రాజ్యా జయతాయ నిత్యం
ఛాయయా తృప్త్యై లోకస్య. (73)

గౌరీ వర్ణన - మదనార్తావృత్తం

గౌరీం హిమగోత్రాధర పుత్రీం హృది సేవే
నీలాంబుజ స్త్రోతను నేత్రాం ఉత్తగాత్రాం
శ్రీపత్యభిధానోత్తమ విద్యుత్ప్రవి నంద్యాం
శ్రీవెంకట నామోత్తమ విద్యన్ముఖ నాసాం. (74)

గంగావర్ణన - ప్రహర్షిణీవృత్తం

గంగాం తాం భజత సదాతి శీతనీరాం
భంగాళీకనదురగాం సభాసమానాం,
భృంగాళీ కలిత సరోజ గంధపూర్ణాం
రంగత్ప్రౌ మునివర భాసమానతీరాం. (75)

కాసారవర్ణన - జలధర మాలావృత్తం

నీరేజాతై ర్వరద గజ భూషైర్యుక్తైః
నీలాంభోజై ర్మధుకర జాలైః కోకైః,
హంసైః కీర్ణైః ద్విజముల తరంగైః స్ఫారైః
కాసారాళి ర్వనభువి భాతా స్పైసే. (76)

పతివ్రతాలక్షణం - మందాక్రాంతావృత్తం

పత్యా సత్యా సురుచిరగుణా శోభనాంగీ సుశీలా
మాన్యా నాత్ర త్వఖిల ధరణీమానవా స్తుత్యకార్యా,
హాస్యా కోపాదికలుషయుతా ద్యా పతివర్తకే
సాధ్వీ సత్యం ఖలు భవతి సా సర్వలోకైక మాన్యా. (77)

లక్ష్మీనృసింహావర్ణన - ఆర్యావృత్తం

లక్ష్మీ నృసింహ మీడే
నిజ వాంఛిత వరదాన వ్రతం తం,
బ్రహ్మాది దేవ వంద్యం
నేతారం సర్వలోకానాం. (78)

శ్రీవిష్ణు వర్ణన-శార్దూలం

శా. హాహా విశ్వం రక్షణారం విలసన్నాలీక పాదం హరిం
పద్మా కుంకుమ పంకిల స్తన యుగీ వక్షోదరం తం భజే
యస్యాశ్రిత మనుజాళ్య ముక్తి తనయానాథ స్సదా శంకరో
జాయామాద్యై కథయ ద్వినుత సుగుణోపేతః కృపాసాగరః.

శరన్మేఘవర్ణన – ద్రుతవిలంబితవృత్తం

హరతుషార గిరీంద్ర సితద్యుతి
స్ఫురిత కాశ పటీర సమ ప్రభా,
శరది భాతి ఘనాళి రియం పరం
వితరణా వదనో ధనరా శివ. (80)

జీవవర్ణన – వసంతతిలకావృత్తం

జీవస్సదా సకల మానుష దేహభాజీ
భిన్నో హ్యభిన్నకలయాపి స భిన్నరూపః,
సంసార దుస్తర మహార్ణవ మజ్జితాత్మా
సౌఖ్యాధికం భజతి దారసుతాది జన్యం. (81)

మాతృవర్ణన – ద్రుతవిలంబితవృత్తం

జయతి మాత మహో శుక కోకిల
ర్మధుర మానవచ్యై రతి సుందరైః,
యదనుషంగత ఏవ చకాస్త్యసౌ
వ్యాహృతి రత్ర స్ఫుట సాధన లక్షణం. (82)

బాలావర్ణన – క్షమావృత్తం

జయతు స్వాన్తే సదా మేంబికా బాలికా
సకల మునివరై స్సేవ్యమానాంఘ్రికా,
శశధర మకుటే మన్మథోహాసినీ
శశధర హృదయాంభోజ సంతోషిణీ. (83)

విష్ణుచక్రవర్ణన – వంశస్థవృత్తం

సుదర్శనం భాతి హరేః కరే సదా
సుదర్శనం సజ్జన సంతతేః పరం,
కుదర్శనం దుర్మద రాక్షసావళేః
కరోత్వరాతి ప్రశమౌషధాయితం. (84)

కాశీనాథవర్ణన – శార్దూలవృత్తం

కాశీనాథ మహం భజే హృది సదా దివ్యాన్నపూర్ణాయుతం
లోకానందకరం గణేశ్వర ముఖై స్సేవ్యం నితాంతం గణైః,
గంగా శారదనీరదాకర జటాహారోప వాంగప్రభం
గంగా శ్రైవలితాంచిత మకుటం కారుణ్య పూరార్ణవం. (85)

అన్నపూర్ణాస్తవం – మందాక్రాంతావృత్తం

పూర్ణాం సేవే దివిజవినుతాం భాసురాన్నప్రపూర్ణాం
పర్ణ బ్రహ్మోద్భవ బుధగృహ ప్రాంగణ ప్రాప్తమానాం,
సద్భక్తశ్రేణి వరసుధీ సేవ్యమానాంఘ్రి యుగ్మాం
తాం వృద్ధ్యై వెంకట బుధ విధు ప్రార్థనా పద్య తక్తాం.

ఖండితావర్ణన – స్వాగతావృత్తం

ఆగతం హ్యుషసి నాథ మపశ్య
స్వాగతం కిమపి నైవ వదంతి,
కోప ఘూర్ణిత విలోచన పద్మా
ఖండితా ఖలు నినిందతి హానా. (87)

త్రిపురాంతకవర్ణన – వంశస్థవృత్తం

జిగాయ యో హ్యై త్రిపురం దృగగ్నినా
చకార యో హ్యై మదనం నిరంగికం,
జహార యో హ్యై గజనామదానవం
సుబుద్ధి నారీ స్మరతం విశిక్షతాం. (88)

త్రిమూర్త్యాత్మక తేజోవర్ణన – పృథ్వీవృత్తం

పురాంతక మురాంతక ద్రుహిణ రూప మీడే మహః
కృపావృత రురీకృత స్వయము నీరజాతం తథా.
సమస్త మునిరాణ్మనః కమలభాస్కరం సత్వరం
సురేశముఖ దేవతామకుటరత్న శుంభత్పదం. (89)

తురగవర్ణన – తోటకవృత్తం

తురగః ఖలు గచ్ఛతి సత్వరకః
స్ఫురితాయక సత్పతగోపమకః
స్ఫురదద్భుత సత్వరముద్ధనకో
పవమాన భాసురకేసరకః. (90)

శతఘంటకవిహృదయ వర్ణన – స్రగ్ధరా వృత్తం

హేతాదృగ్రూపాంబుజాభం శతకవిహృదయం భాతి భో పండితేంద్రాః
తస్మాత్త్వద్యాపి దోషా స్త్వదపి చ నహి సంశేరతాం మానసేషు
యుష్మా నాలోక్య పద్యే కథమపిరపితే కుండలీశే సహాసం
పృష్ట్వా దోషా స్వపూర్ణం ప్రతిపద మధవా క్షాంతిమాన్ కో న లోకే.

సత్యదేవ వర్ణన – మాలినీ వృత్తం

నిరుపమ గుణజాలం భావయే సత్యదేవం
దురితజలధి వ్రజం దోషవిత్పద్మనాశం
కరకలసిత చక్రం కాలసేనాభిరామం
సకల జగదధీశం సత్యభామాసమేతం. (92)

అన్న మరణవృద్ధి కృత వరస్తోత్రం – మందాక్రాంతా వృత్తం

తాద్యం జాతం గురుతర అన్నక్రిడయా వృద్ధకాలం
దారిద్ర్యం చాప్యప గత మహో కాపి నేకోకకాథః,
ప్రస్వత్యంవా న్యగత మహో చింతయా చాన్యశక్త్యై
స్త్రైషేహాక్షః పరమ పురుషోప్యపి నా తం భజస్వ

నాళం పద్మనాభ ప్రతిష్ఠిత మల్లేశ్వర వర్ణన— స్రగ్ధరావృత్తం

శ్రీమన్నాళీకకుచాగ్రోల్లస దతుల నిశా పంకిలోరః ఫణీంద్రో
నాళంపంతాన్వ వాయూంబుధి వర శయనో పద్మనాభేన సేవ్యః,
ఏతాం శ్రీకాకినాదాభిధ పురవరిరాం సత్సభా మా
పూర్వాం పాయం గిరీశో నత సకలసురః పాతు మల్లేశ్వరాఖ్యః.

వామనమూర్తి వర్ణన—మాలినీ వృత్తం

అదితితనయ మీశే వామనం దేవవంద్యం
బలిసురరిపు కుంభత్సర్వ రాజ్యాపహారం,
నిరుపమ గుణజాలం సత్యకల్యాణశీలం
సకలముని గణేడ్యం సత్యభామాసమేతమ్. (95)

ప్రహ్లాదవర్ణన—వంశస్థ వృత్తం

నృసింహభక్తం మనసా సదా భజే
సమస్త కల్యాణ సుధాకరం పరం,
రమేశ భక్తావళి గేయసత్కథం
మదాది దూరం కరుణామృతార్ణవం. (96)

గౌతమీ వర్ణన—సుమా వృత్తం

అలఘుయుతజలాం గౌతమీం భావయే
ప్రకటతరలసద్భంగ సంశోభితాం,
మునివరచయ ప్రోజ్జ్వల త్సత్తటీం
దురితహరవరప్రాభవాలంకృతాం. (97)

మరణకాలావస్థావర్ణన—సుమా వృత్తం

యమ భటనికరే సన్నిధిం సంగతే
మతిరతిచపలా జాయతే దుఃఖితా,
భయమపి పృథులం జాయతే మానసే
నవ గమనమతి ర్దారపుత్రాశయా. (98)

కోకిల సముదయ వర్ణన—ప్రహర్షిణీవృత్తం

చూతే యత్పిక నితతిః ప్రహర్షిణీయం
గాయంతి మద మధురం సమం మిళింద్యైః,
ఖాదంతి కిసలదళం స్వకాంగనాభిః
తస్మాన్మే హరతి మనో నితాంత మద్య. (99)

శ్రీరామ వర్ణన—శార్దూల వృత్తం

శ్రీరామం దశకంఠ కంఠ సరసీ జాతాళి మత్త ద్విపం
సుగ్రీవానుజ రావణానుజ మరుత్పుత్రాదిభిః సేవితం,

దుర్వార్త్యుండలి గండభేదన చణ్డ్రసజ్జాకళాపోజ్జ్వలం
సీతాకుంకుమ పంకిలస్తనయుగీ బద్ధాదరం భావయే. (100)

సమస్యలు

"బకము న్వడి మ్రింగుచున్న బల్లిం గనుమా"

క. ప్రకటతర కన్యగంతుల
సుకులోదధి చంద్ర రామసూరి జనేంద్రా
సుకరముగ మక్షికా శా
బకము న్వడి మ్రింగుచున్న బల్లిం గనుమా.

వెంకటశాస్త్రి కృతము.

క. ప్రకట తరోన్నతతర స
ద్వకనత్కుడ్యంబు విరాడ మహీదేవవరా
యికటకటా లూతాశా
బకము న్వడి మ్రింగుచున్న బల్లిం గనుమా.

తిరుపతి శాస్త్రికృతము.

"అంధుం డర్ధ నిశీథమందు గనె నయ్యర్కేందు బింబములన్"

శా. సింధో కావ్యకలామృతస్య సుకవే శ్రీసోదరం పద్మినీ
బంధుం చాహని పూర్ణకాంతి కలితం త్వం పర్వయామే యటం
చుం ధార్ష్ట్యంబున బల్కె రాజొకడు తత్సాక్ష్యర్థ సంధానని
ర్బంధుం డర్ధ నిశీథమందు గనె నయ్యర్కేందు బింబములన్.

వెంకటశాస్త్రి కృతము.

శా. పుంధర్మేత సరస్వతీ కవులతో భూపాలకుం డాదితే
యాంధస్తీక్ష్ణ గభస్తి బింబముల సవ్యద్యుత్తి వర్ణించి స
ద్గ్రంథంబుల్ రచియింపుడీ యనగ తద్గ్రంథాను సంధానని
ర్బంధు డర్ధ నిశీథమందు గనె నయ్యర్కేందు బింబమ్ములన్.

తిరుపతి శాస్త్రికృతము.

అందములు జూడవాకు నానందమయ్యె.

సీ. వేదవేదాంగాది వేత్తృతా ధుర్యులౌ
వైదికాగ్రణు లొక్కవంక జెలగ
శత లేఖినీ పద్య సంధాన ధుర్యులౌ
కవిగజ సింహు లొక్కట జెలంగ
సరస సంగీతవైఖరి బురాణము సెప్ప
బాడబు లొకవంక పరిఢవిల్ల
మంత్ర సంధాన ధీమంతులౌ శాకేశా
గ్రణులొక్క వంకను రహిజెలంగ.

గీ. సకల బాంధవ సజ్జన సమితులొక్క
వంక జెన్నారుచుండ శ్రీజాదమాన్య
గ్రామాంబుధిశశాంకమూర్తి సత్యవ్రవర్తి
వెంకటరత్నమూర్తి

నిండు పేరోలగంబున నుంచి వండి
తేంద్రులను భక్తితోడ బూజించినట్టి
యందములు జూడ వాకు నానందమయ్యె.

ఇతి శ్రీ కంకంటి వీంద్ర ఘటా పంచానన
విద్వత్కవి తిరుపతి వేంకటీయ శతావధానస్తోత్రాః

శ్రీ శ్రీ శ్రీ

చెళ్ళపిళ్ళ వారి చివరి శతావధానము

శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారును, వేలూరి శివరామ శాస్త్రిగారును తేతలి గ్రామమున శతావధాన సమయమున చెప్పినవి.

ఉ. అల్ల శతావధానమున కక్కట తిర్పతియొజ్జవల్ల నా
యల్లిక మబ్బ జింతిలెదు నాంధ్రులు మోదిలగా మహాకళా
భిల్లుడు వెంకపేశ కవిసిరునిచే శివరామశాస్త్రిచే
జెల్ల! శతావధానమును జేయగజేసితివోలె తేతలీ! 1

శా ణ క వి

శా. ప్రాక్కాలంబున నేటి కాలమున పై రాబోవు కాలాన నీ
పక్కిన్ సత్కవితన్ రచించనె యనన్ ప్రాముఖ్యముంజెందె నీ
దృక్కవ్యంతరు డుండ బోవడనుచున్ శ్రీహర్షుడే తెల్పె తా
దృక్కున్ బాణు వచః ప్రవీణు దలతున్ దివ్యత్కళా ప్రాణునిన్.

వర్షాధిక్యమువల్ల పంట చెడిన రైతు

సీ. అవసరంబున్నప్డు డంబరంబున నుండి
యొక నీటిబొట్టైన నుట్టిపడద
ఇంజనీయరుగారి నెంత వేడినసేని
యించుకేనియు దల్పులెత్తబోరు
ఆ. వారుణ జపంబు లాచరించిన చోని
వరుణదేవున కింత కరుణరాదు.
జతపంబున నుండి యా విరాట్పర్వంబు
చెప్పించినను గాని చినుకు పడదు.

గీ. ఇప్పు డెందుకు గురిసెనో తెప్పదోగ
పనలు ధాన్యంబు పాడయ్యె వినడు దీని
బుచ్చుకొమ్మన నా బాబు పిచ్చి పట్టు
పట్టునని బీదరైతు నా వద్ద జెంగు. 3

---

45. తాళ్లపూడి శతావధానమున వేలూరి శివరామశాస్త్రిగా రీ సమస్య నిట్లు పూరించినారు.

46. ఈ మొదటి యవధానము సందలి నిశేషములకు చూ పూర్వోక్త భారతి. 1966 సెప్టెంబరు.

శా. బంధంబుల బురుడించు నా ప్రణయ కోపస్ఫూర్తి వేళం బున
స్యందానంబగు న్యాపసాద గరిమల్ సాధించు వేళం గడున్
బంధూకాధర చంద్రమోవదనయౌ బామాస్యమందౌర కా
(మాంధుండర్ధ నిశీథమందు గనె నయ్యర్కేందు బింబమ్ములన్)

చెంచిశాలవు వర్ణనము

మ. ఘన ధూళీ భర మెల్ల బోసడగె సంతాపంబు తగ్గెన్ నిరం
తరమున్ మేనికి మందవాయువు లమందంబైన యానందమున్
వరలం జేసెను ముందు వేసవి సొగస్ వర్ణింపఁ జోరాని చు
ట్టరికంబుల్ నిగుడించె మేనుఁ డొకనాటన్ చూచితోయీ సఖా.

సమస్య

గీ..................పరిహసించి
పువ్వులమ్మెదు రవ్వేటి పువ్వుబోండ్లు,

సీ. పూల గుత్తులమీద నేల గప్పితి చీర?
యెఱుఁగవో గోప్యమ్ము తెమ్మెకాఁడ
నీ దండ వెల యెంత నిక్కమ్ము చెప్పవే
యెరయు మమూల్యమో యుండఁగాఁడ
మనసు నా కచ్చోట మసలు నయ్యది చూపు
పైకమ్ము గలదేని బయల నిడుదు
పృథులకుచమ్ముల బేరమ్ము కుదురదా
కుదుర కేమది కొసగోరు మోవి

గీ. యనుచు నెరజాణతనపు మంతనపు పెంకె
విటుల మాటల కనువగు వింత వింత
పలుకు లొలయఁగ సొగెకు బరిహసించి
పువ్వు లమ్మెదు రవ్వేటి పువ్వుబోండ్లు. 5

ఈ శతావధానమున పద్యము లైదే లభించినవి. ఇవి సార
స్వత సర్వస్వము అను పత్రికలో 1 సం. 8 సం. (రక్తాక్షి చైత్ర
వైశాఖ మాసములు)లో ప్రకటితమైనవి. ఆ సంవత్సరము మార్చి
ఏప్రియలు 1924 కావున 1924 మార్చి నెలలో పై శతావ
ధానము జరిగియుండును.

ఈ సారస్వత సర్వస్వము కీర్తిశేషులు ఏలూరిపాటి రామ
భద్రయ్యగారి సంపాదకత్వమున తణుకు నుండి వెలువడు
చుండెడిది. ఇందు 14 సంచికలే వెలువడినను అన్నియు ప్రశస్త
మైన వ్యాసములుగలవి. శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు తాళ్ళ
పూడిలో 20—4—1924 లో పై రామభద్రయ్యగారి
కుమారుని యుపనయన సందర్భమున శతావధానము చేసి
నారు. అది శివరామశాస్త్రిగారి చివరి శతావధానము. అది 10వ సంచి
కలో ప్రకటితమైనది. 30 పద్యములున్నవి. పై శతావధాన పద్యము
లన్నియు పూర్తిగా సంపాదించుటకు ప్రయత్నించుచున్నాను.

శ్రీరామాయనమః — శ్రీమ త్పురదేవతాయై నమః
శ్రీ శారదాంబాయై నమః

తిరుపతి వేంకటీయ మూలస్థానేశ్వర స్తుతి

శతక ప్రారంభః[47]

ఆర్యావృత్తాని

1 శ్లో. వేదాంత వాక్యసారం వేదవిదాం పాలకం గజాస్యేశం
సింహపురవాస మనఘం మూలస్థానేశ్వరం సదా సేవే.

2 నారాయణ ముఖ నిర్జర వారాధారం ఫణీ దలంకారం
వారాణసీ పురపతిం ॥మూ॥

3 నారీ కుచ కుంకుమ రస చిహ్నిత వక్షః ప్రదేశ ముఖిలేశం
కైలాస శిఖర రత్నం ॥మూ॥

4 నిర్మల చిత్తై ర్మునిభి స్సేవ్యం దుర్మార్గ దూర మతివిమలం
నిత్యానందోపేతం ॥మూ॥

5 అత్యంత శాంతి మమలం నిత్యం పండిత మనోంబుజావాసం
సత్యం సత్యవదీడ్యం ॥మూ॥

6 దేవేంద్ర ముఖ్య నిర్జర మకుట మణీకాంతిఘృష్ట పాదాబ్జం
సర్వ జగన్మయ మమలం ॥మూ॥

7 లఘు రణతః పరతః పర మధికాదధికం చ శాంతత శ్శాంతం
ధీరతరాద్ధీరతరం ॥మూ॥

8 బాణాసుర వరదాయక మేణ ధరాలంకృతోత్తమాంగ తలం
ఏణ శిశు భాసురకరం ॥మూ॥

9 రంగత్తరంగ గంగాలంకృతశీర్షం సదాపి ధృత హర్షం
శృంగార మూర్తి మతులం ॥మూ॥

10 సూర్య విధువహ్నినయనం సూర్యభినిర్వర్ణ్యమానగుణ విభవం
ఆర్యా విలసితకాయం ॥మూ॥

11 శారద నీరద నారద పారద సమకాంతి విలసిత శరీరం
భక్తాధీన సద్భావం ॥మూ॥

12 కామాది గుణ విదూరం కామేశ్వర రూపధారిణం దేవం
కామేశ్వరీ సమేతం ॥మూ॥

13 విషమశర దేహదాహం విషమాంబక ధారిణం చ విషకంఠం
విషధర భూషణ భూష్యం ॥మూ॥

14 శూలాలంకృత హస్తం బాలేందు ప్రసవ భాసుర శిరస్కం
బాలాలంబిత దేహం ॥మూ॥

15 కాలమదహర మురుతరచేలీభవ దజిన మఖిక వృజిన హరం
ఆలంబ మఖిల జగతాం ॥మూ॥

16 ఉత్తర పినాకినీ తట హరిపగర నివాస ముత్తమైస్సేవ్యం
భూతి విభూషిత దేహం ॥మూ॥

17 గోవాహన మాగోహర మాగోపతి ముఖ సురాళి వినుతాఖ్యం
నాగ దనుజ మదహరణం ॥మూ॥

18 రాగాది శూన్యమమలం యోగిధ్యేయం సమస్త నుత చరణం
శ్రీ గణనాయకతాతం ॥మూ॥

---

47. ఇది యస్. యస్ కృష్ణమూర్తిగారిచే నెల్లూరు మండల
సర్వస్వమున ప్రకటింపబడినది. కాని యందు కొన్ని శ్లోకములు
లోపించినవి. నేడు మరియొక ప్రతి లభించినది. అందు సంపూర్ణ
ముగా శ్లోకములున్నవి. ఇందువలనను, తిరుపతి వెంకటకవుల అలభ్య
కృతులన్నియు నొక్కచోనున్న సాహిత్య లోకమున కనుకూలముగ
నుండునని యిది తిరిగి ప్రకటించుచున్నాను.

19 నాగాజిన ధర మానఘనం దిగంబరం శంబరారి రూపహరం
సాంబం దంభవిదారం ॥ము॥

20 దుర్గం దుర్గుణ దూరం భర్గం సద్గుణవిశారదం నిత్యం
దుర్గా మనోబ్జ భృంగం ॥ము॥

21 శర్వం శర్వాణీ ప్రియ సర్వస్వం సర్వదుష్ట గర్వహరం
నిర్వాపిత గుర్వఘకం ॥ము॥

22 శంభుం గంభీర వచోగుంభం కుంభీనసాది నరకహరం
దంభాచార విదూరం ॥ము॥

23 దక్షం దక్షాధ్వర పరిశిక్షం భిక్షాటనేచ్ఛ మనలాక్షం
రక్షః పక్ష క్షతిదం ॥ము॥

24 సారం సంసారహరం ధీరం ధీరావళీ హృదాధారం
సారాసార వివేకం ॥ము॥

25 మార్కండేయాలంబం లంబోధర భాసమాన విపులాంకం
కంఠ ధృత విష విలాసం ॥ము॥

26 వారాణసీ పురీశం క్రూరావళి విపిన దావ మఖిలేశం
భూరి కృపాంకిత దృష్టిం ॥ము॥

27 త్రిపురాసుర సంహరణం కపిలాది మహా మునీశ్వరాధారం
కృపణం జన రక్షణ పరం ॥ము॥

28 రుద్రాద్రుద్రం భద్రాద్భద్రం భద్రప్రదం చ నిర్నిద్రం
సాంద్ర గుణాళి సముద్రం ॥ము॥

29 సంతం నిందిత కామము మంతక మదహారిణం మృదు స్వాంతం
శాంతిం జగతి నితాంతం ॥ము॥

30 తారక మనఘం జనానాం మారక మఘయుక్త చేతసాం నిత్యం
నారక భారవిదారం ॥ము॥

31 నిష్కామ మనుజ సులభం నిష్కారణ కరుణయా సదాభాంతం
దుష్కర తపో విలాసం ॥ము॥

32 అంబర శీర్ష మనంబర మంబుజ సంభవ ముఖామరాధారం
సంబాధిత సుర శత్రుం ॥ము॥

33 కాంచ త్కాంచనకుధరోదంచిత హస్తాంబు జాత మురుసత్త్వం
కించిద్వికసితముఖాబ్జం ॥ము॥

34 కంజాలయ ముఖ సురకరకంజాతా సేవ్య మాన పద యుగళం
భంజిత దుర్జన పుంజం ॥ము॥

35 వందారు భక్త సంతతి మందారం హార శోభి హారాంగం
కుందార విందకాంతిం ॥ము॥

36 అస్తప్రదోషనిచయం దుస్తర సంసార ఘోర హరచరణం
నిస్తామసగుణ సేవ్యం ॥ము॥

37 హస్తగత శూల మాగమ శస్త్రాంతర రాజమాన గూఢ ధనం
ధ్వస్తాది కోటి మనఘం ॥ము॥

38 మృదుశీలం హత కాలం జగదాలంబ మపి వహ్నియుత ఫాలం
విలసిత హరి రుచిచేలం ॥ము॥

39 హాహాహూహూ ప్రముఖైర్గంధర్వైర్గీయమాన మృదుచరితం
బాహాలంకృతసర్పం ॥ము॥

40 శిష్టజన రక్షణపరం దుష్టజన ప్రాణహరణ కలిత మహం
అష్టైశ్వర్య సమేతం ॥ము॥

41 దోషాటవిదావశిఖిం శేషాలంకార భాసుర శిరస్కం
భాషాపతి నత చరణం ॥ము॥

42 భవ మభవం గురు మగురుం
సగుణం నిర్గుణ మమేయ మపి మేయం
జగదాధారాధేయం ॥ము॥

43 సంసృతి విరక్త చిత్తైః స్వాత్మజ్ఞాన ప్రభావ గుణవిత్తైః
నిత్యం సేవ్యం సత్యం ॥ము॥

44 మతి చండిమ ఖండాయుత పండిత మండలనుతం కుధరకోదండం
బ్రహ్మాండ మండనమణిం ॥ము॥

45 రాజ విరాజిత శిరసం రాజాదిభి రీడితం చ రజతాభం
తం రాజరాజ మిత్రం ॥ము॥

46 సంసారదుఃఖ జాలై ర్వంతస్తాపం విరక్త మాత్మస్థః
కంసారి పూజిత పదం ॥ము॥

47 సత్త్వాన్వితైర్నిత్యం తత్త్వద్భిః భూపతిస్తనా సేవే
కరుణా వరుణాలయకం ॥ము॥

48 ద్రవ్యైః కిందారైః కిం పుత్రైర్మిత్రైఃభవేత్సమాతి గేహైః
తం దేవ దేవ మేకం ॥ము॥

49 నిందంతు వా బుధా మాం నో చే న్నందంతు తత్ర న విచారః
ఇహ పర సాధన మేకం ॥ము॥

50 ప్రారబ్ధ పుణ్యవశతో జాతా యాతావ దాశు కరతా మే
తత్కాండహారి శమార్ధర ॥ము॥

51 భుక్తిం దదాతి భవాసః తుష్టః శ్రీ దత సవే ప్యమపి స్మై చ
తద్భుక్తి ముక్తి దమముం ॥ము॥

52 యద్దృశ్యం తన్నశ్యం దృశ్యత్వా న్నశ్యమేవ జగదేతత్
తత్సత్యం నిత్య మముం ॥ము॥

53 నాస్తి యస్య గుణో వా నాసితే యస్య నామ రూపే వా
తత్త్వదృక్ష మమేయం ॥ము॥

54 యత్తత్త్వం సత్యతయా వేత్తుం బ్రహ్మాదయోపి న సమర్థాః
తత్త్వదృగ్భగవంతం ॥ము॥

55 చిత్తం విత్తమివ సదా దీన స్స్వవిత్తమత్త భూపాలాన్
సేవితు మసమర్థోహం ॥ము॥

56 భక్తేషు శ్రిత పక్షం దధతం లోకైక నాథ మురుకరుణం
నిత్య మమందానందం ॥ము॥

57 దాతా నేతా మాతా భ్రాతా నో యోపి వా భవే త్రాతః
సద్వస్వరూప మేనం ॥ము॥

58 సౌభాగ్యం చారోగ్యం భుక్తిర్ముక్తిశ్చ యస్య సత్కృపయా
భూయాదమను తనాయాసా ॥ము॥

59 శాంత హృదంత నిశాంతైః క్రాంతం యుక్రాంత వచ్చిదా శేతే
సంతత మనంతనుమయా ॥ము॥

60 యః కార్యం యః కారణ మధ పార్యః పౌలకశ్యపో భూయోత్
యావజ్జగద్వ్యరూపం ॥ము॥

61 యస్మిన్ ప్రజతి యుక్తి రక్షతి యోగా వా శయతి విశ్వ మఖిల మపి
మూర్తిత్రితయాకారం ॥మూ॥

62 శైలాపత్య సహా వా శాంత స్వాంభోంబుజాత మథవా స్యాత్
వాసో యస్యత విశాలం ॥మూ॥

63 శృంగారోద్యానం వా పితృవన మథవా సమం భవే ద్యస్య
సర్వసమదృష్టి విశాలం ॥మూ॥

64 విష మథవా పీయూషం సమం భవే ద్యస్య వాపి రసనాయాః
సర్వ సమభావ విశాలం ॥మూ॥

65 రత్నధర మాలికా వా కపాల మాలాపి యస్య కంఠస్య
తుల్యా స్యా త్సర్వ సమం ॥మూ॥

66 మలయజ లేపన మథవా పితృవన భూతేశ్చ లేపనం యస్య
తుల్యా స్యా త్సర్వ సమం ॥మూ॥

67 నవ రత్న ఖచిత సురభీ గోప్య ప్యస్య స్థలేపి సమబుద్ధిః
యస్య స్యా త్సర్వ సమం ॥మూ॥

68 లోకైక భూపతి ర్వా శుద్ధ దరిద్రోపి యస్య తు సమస్స్యాత్
సర్వ సమ బుద్ధివిశాలం ॥మూ॥

69 దివ్యం దుకూల మథవా చర్మాపి చ యస్య తుల్యమేవాద్యః
న్యూనాధిక్య విరహితం ॥మూ॥

70 పంచ ముఖ మద్రి పుత్రీ కంచుకిత శరీర మంచితాలాపం
పంచశర శత్రునేత్రం ॥మూ॥

71 సుందరగుణ మందిర మధి
కందర యుత శయన మయన మపి ముక్తేః
కంధర సమ కంధరకం ॥మూ॥

72 అంగీకృత భృంగిరిటి సంగీతం సాధులోక భంగీతం?
అంగీకృత గిరితనయం ॥మూ॥

73 దదతం వరాంశ్చ చంద్రం దధతం శిరసి జ్వలద్భవ నమదంతం
మదనంత పుణ్యరాశిం ॥మూ॥

74 దంతి దంతక మంత స్వంతం వసతాం జితాక్ష సుపథి సతాం
సంతత మనంత భూషం ॥మూ॥

75 సతతావృత మతి తాపస జనతా ఘనతాపహార గతవాసనం
గోరాడనసం సరసం ॥మూ॥

76 అంతిక సద్దంతి ముఖం సంతాన ప్రసవ భాసుర శరీరం
దంతావళ చర్మధరం ॥మూ॥

77 అంగ వ్యాళయ మగళయ మజగవళయ మసుర మర్ష నాళయుకం
త్రిజగత్పాలన ధుర్యం ॥మూ॥

78 కాశీపురవాసం లసదాశాంబర మాశరోరగళ పాశం
అశాంత మభ్రకేశం ॥మూ॥

79 దాసీ కృత కేశవ నరకేశ వరుణ కేశరాజ సంఘేశం
ఈశీకృత లంకేశం ॥మూ॥

80 శివ! పరమేశ్వర! శంభో! శూలిన్! నాళీక భవనుత! కపాలిన్!
ఇతి వినుతం సతతం తం ॥మూ॥

81 రంగద్గంగా భంగ తరంగాలంకృత మహా శిరోరంగం
పాణిత్రాత కురంగం ॥మూ॥

82 శుద్ధం బుద్ధం కేవల మద్వానథబుద్ధ్యై వరద మరిదం తం,
బుద్ధిమహాతిశాతిం ॥మూ॥

83 ఉపనిష దభివదయోపిత్యు నతటయుగ మభినివిశ్య నిర్దాంతం
నేతి వచః వరిశిష్టం ॥మూ॥

84 పిత్త ప్రమత్త భూపా స్సక్తందివ మత్రసమత్తకత్వేన
దుష్పష్టా భజ త్వహం చేత్ ॥మూ॥

85 యత్తేజో లోకయుతం ప్రాకృత దష్టిష్వనా సమర్థా స్యాత్
అత్యద్భుత మహసం తం ॥మూ॥

86 యన్నామామృత పానా ద్విప్రః చండా కోపి వా మాతుః
నపిబతి పయః పునస్తం ॥మూ॥

87 భక్త్యా ప్రమాదతో వా చిత్త భ్రమతో యథాతథా వాపి
స్మృత్వా ముక్తి మవాప్నుం ॥మూ॥

88 యద్భక్తానాం దూరే వర్తంతే దుష్ట కాల భట సంఘాః
కాలమదాపహా మేవం ॥మూ॥

89 యస్య హృదయ నైర్మల్యం సూచయతే కాంతిరేవ దేహస్య
శరదభ్రాకారం తం ॥మూ॥

90 రుద్రాక్ష మాలికాభి ర్భూషితకంఠ ప్రదేశ మతి విమలం
వ్యాఘ్రహాజిన కలిత తనుం ॥మూ॥

91 యస్య ప్రభావ మఖిలం వక్తుం వేదాంత వాక్య నిచయోపి
మూకస్స్యాత్త మనుపమం ॥మూ॥

92 యస్స్యాత ద్విశ్వ మయో ద్గోచరతాం యస్తు నాస్య విశ్వస్య
సకలస్య సాక్షిణం తం ॥మూ॥

93 యన్మాయయా విరించ్యాది ప్రముఖా అపి మోహితా భవంతిపరం
త మతీతమాయ మగుణం ॥మూ॥

94 యస్యేచ్ఛా మాత్రా జ్జగ దిద మఖిలం జాయతే యతో రక్షాం
గచ్ఛతి యు ష్యశ్యతి తం ॥మూ॥

95 భవతి నిమిత్త నిమిత్తం దండాది యథా ఘటస్య లోకే స్మిన్
కారణ మేవం జగతాం ॥మూ॥

96 బ్రహ్మేతి విష్ణురిత్యపి శివ ఇతి యం వా వదంతి పరమేశం
నిష్కామకం తమీశం ॥మూ॥

97 తిష్ఠతి వా నవదతి స్వాత్మానం ద్రష్టు మాగతా నేవ
న భజామి కేలకేశాన్ ॥మూ॥

98 భృత్యాగ్రే ప్రస్తౌయ భూసుర మాయాంత మేవ మాలపతః
న భజే రండా తనయాన్ ॥మూ॥

99 వదతి చ సతత శ్లోకా న్బధిర ఇవాశ్రుత్వా తిమత్తత్వాత్
న భజామి దాసభీసుతాన్ ॥మూ॥

100 విద్యాగంధా విదుషా మహిషా నారాధయామి న కదాపి
దేవం కలాప శిరసం ॥మూ॥

101 అనుదర్శన మాగచ్ఛ త్వ్వారే ర్యస్త్రం విహాయ దర్శయతః
ప్రీడాహీనా న్న భజే ॥మూ॥

102 శివ మశివాపహా మురుతర శివ ప్రదం సహిత మపి సదా శివయా
శివ చరితం శివనిలయం ॥మూ॥

103 తిరుపతి వేంకట విద్వద్వరకవి యుగ్మేన సజ్జన ప్రీత్యై
ఆర్యాభి కవన రచితా మూలస్థానేశ్వర స్తుతి ర్జీయాత్.

ఇతి శ్రీ కింకపేరుకి ఘటికా పంచానన బాల కలానిధి శతావధాని
తిరుపతి వేంకటీయ మూలస్థానేశ్వరశతకం.

భగవంతుడా! ఈ దేశాన్ని మనుషుల్తో నింపు!

శ్రీ కె. శివారెడ్డి

ఎంతదూరం వెళ్ళినా
ఎక్కడికి వెళ్ళినా
ఈ మంటలు చల్లారవు
ఈ చెమటలు ఆరవు
జీవితమంతా కుంటుకుంటూ
జైత్రయాత్ర సాగించటం –

ఎంతదూరం పరుగెత్తినా
అక్కడికక్కడే అడుగులో అడుగే!

రెక్కలు కత్తిరించబడ్డ పావురాయిలా
కాళ్లు కట్టివేయబడ్డ కోడిలా
అక్కడికక్కడే తన్నుకోవటం
తల తల కొట్టుకోవటం తప్ప
స్వేచ్ఛగా గాలిదారుల్లో
కూనిరాగాలు తీసుకుంటూ
కేరింతలు కొడుతూ పరుగెత్తటం లేదు.

తరమబడ్డట్టు
పిచ్చికుక్కలు వెంటబడ్డట్టు
పరుగులు – ఒకటే పరుగులు.
బొమ్మల కొలువు కూటమిలా
కన్పిస్తుంది ఈ ప్రపంచం.
అర్థరహితమైన శబ్దాల
ప్రతిధ్వనులు తప్ప
కమ్మని స్వర సమ్మేళనం లేదు.
వికాస ప్రఫుల్ల ఉత్పల మాలికల్లేవు.
'సర్వేజనా సుఖినో భవంతు' అనే

సాహిత్య సదస్సులు లేవు,
సామాజిక చైతన్య
కవితా స్రోతస్సులు లేవు.

ఇదంతా ఎడారి.
ఇచట ఎడారి, సహారాకి
తగలడిన ఇసుక రేణువులు,
ఇచట ఇసుక తుఫానుల
వేడి, వేడి నిట్టూర్పులు,
ఇచట ఒయాసిస్సులు
ఆర్ద్ర ప్రజల నయనాలు కావు.

ఇచట ప్రతి ఒక్కడూ
ఒక్కొక్క ఏకశిలా విగ్రహం!
పాడుబడిన శిథిలాల్లో
కూలిన గోడల మూలల్లో
విరబోసుకున్న తలల్తో
దెయ్యాల్లా జీవిస్తూ
ఎలాతో కా తెలియని
పరిస్థితుల్లో కాలుతూ
జీవితం భయం నర్కంలో నానుతూ
ఇక్కడ ఒక్కొక్కడూ
ఒక్కొక్క కదిలే ఏకశిలా విగ్రహం.
కదలే వరాస్థి పంజరం,

ఇచట
ఆస్తుల అంతస్థుల అలలపై
కేవలం ఉత్త గాలితో నింపబడ్డ
తేలియాడుతున్న రబ్బరు బంతులు,
ఈ బంతుల బొజ్జల్ని
నింపేందుకు సతతం
పతమౌతూ ఎన్ని హస్తాలు
కాలి పోతున్నాయి,
రాలి పోతున్నాయి.

ఈ రాక్షస పరిస్థితులే
ఒకనెల్లాంటి వర్షాలుగా

ప్రతి అంగుళంలోనూ
ప్రవర్ధమాన మౌతున్న
ఈ సమాజం వాతావరణం
కళింగ యుద్ధం తర్వాత
మహా జుగుప్సా సాగరంగా
బీభత్సంగా, భీతావహంగా
మిగిలిన కదనరంగం.

బుద్ధుణ్ణి, గాంధీని కాలదన్నిన వీళ్ళు
మెకివిలియన్ ఆదర్శ బంధుకోటి.
స్వకీయాత్మ సంస్కార సంపన్నులు కాని వీళ్ళు
స్వార్థ వ్యవరాగ సంపర్క కేళీ వినోదప్రియులు.

కాబట్టే, ఇదట నీ
శల్య సారథ్యాలే;
శూన్య గర్భకుల్యావళులే–
ముకుళిత హస్తాల ఈ ముస్తాబులు
మొనదేలిన విచ్చు కత్తులకు సన్నిహితులు.

యంత్రం ఎంత గొప్పదైనా
పెద్దదైనా – ఎంత పనిజేసినా
యంత్రం యంత్రమే !
యంత్రం మనిషి కాగలదా ?

ఈ దేశం
యంత్రాల మయం.
కుతంత్రాల యంత్రాలమయం
భగవంతుడా !
నా ఈ దేశాన్ని
మనుషుల్తో నింపు
నా ఈ మనుషుల్ని
జీవంతో నింపు !!!

కవిత్వము - రాజకీయాలు

శ్రీ రామమోహనరాయ్

ఇటీవల తెలుగు కవిత్వంపైన రాజకీయాల ప్రభావం పూర్వం ఎప్పుడూ లేనంతగా కన్పిస్తున్నది. కవిత్వమూ, జన జీవితమూ కలగలిసి పోవటమూ లేకపోతే కవిత్వంలో విలువలు క్షీణించటమూ దీనికి కారణమని ఆలోచిస్తే, సమాజంలోని పరిసరాలే కవిని ప్రేరేపించి, ప్రజల సమస్యల్ని కావ్యవస్తువుగా స్వీకరించేటట్లు చేస్తున్నాయని అనిపిస్తున్నది. సత్యం, ధర్మం, శాంతి, పుణ్యశ్లోకుల చరిత్రలూ వ్రాయాలని వింపాదిగా సార్వకాలికమైన విషయాలను కావ్యవస్తువులుగా యెంచుకొని, తగిన వ్యుత్పన్నతతో, అలంకారికమైన శైలితోనూ, విపులమైన వర్ణనలతోనూ, ఛందో వ్యాకరణ మర్యాదల నతిక్రమించకుండానూ కావ్యం వ్రాయాలని ప్రయత్నించటం వృథా శ్రమ. దీనిని గమనించి సంప్రదాయ బద్ధులైన కవులు కాల ప్రవాహాన్ని గమనించి కాలాన్ని శాసించే క్రాంతదర్శులు కావలసి ఉన్నది. సమకాలికులంతా ఆధునికులు కారని శ్రీ శ్రీ ఒకచోట పేర్కొన్నారు. 'న చాపి కావ్యం నవమి త్యవద్యం' అని ఆధునికుల కావ్యవస్తు స్వీకరణను, నిర్వహణమూ, ఛందోవిధానాన్ని సంప్రదాయవాదులు నిరసించవచ్చు. కాని కేవలమూ సార్వకాలికమైన యితివృత్తం తోనే కవిత వ్రాయాలనుకోవటం కెరటాలు తగ్గిన తరువాతనే స్నానం చెయ్యాలనుకోవటం. ప్రతి రాజకీయోద్యమానికీ కవులు బాసటగా నిలువతగదని, దానివలన ఉన్నతమైన విలువలు అడుగంటి పోతాయని కొందరు అభ్యుదయవాదులే వాదించటం ఒక విడ్డూరం. ఆంధ్ర సాహిత్యానికి వైతాళికులు కావలసినవారు దురదృష్టవశాత్తు ఒక పార్టీకి తాళికులై పోయారని వాపోయారు ఆరుద్ర. ఐతే 'ఆంధ్ర సాహిత్యానికి వైతాళికులు' ఒక పార్టీకి తాళికు లెందుకు కావలసి వచ్చిందని ఆలోచిస్తే పాలక పక్షం వహించిన బాధ్యతా రహిత విధానమూ; నానాటికీ పేదలు మరింత పేదలుగా మారటమూ, 'సెక్యులర్ స్టేట్'లో మూఢ నమ్మకాలూ, మతం తెచ్చిపెట్టే సమస్తమైన అనర్థాలు పెచ్చరిల్లి పోవటమూ చూచిన కవులు దీన్ని ఎదుర్కోవటానికి ముందుకు వచ్చిన పార్టీకి తాళికులు కాక తప్పలేదు. ప్రభుత్వాధినేతలు ఉపన్యాసాలలో చూపించిన చొరవ కార్యాచరణలో చూపించలేదు. శ్రీశ్రీ అన్నట్లు 'అందరూ గజీతగాళ్లే కాని గజం ప్రోగ్రెస్ లేదు.'

స్వాతంత్ర్యానంతరం మారుతూన్న దేశస్థితిని సకలజన సౌభాగ్యవంతంగా మలచవలసిందని పిలుపు నియ్యవలసిన కవులు పూర్వకావ్యాల పద్ధతిలోనే ఛందోవ్యాకరణ మర్యాదలను తప్పక పోవటమే ప్రధానంగా పెట్టుకొని కేవల పద్యరచన చేయుటం చూస్తే విచారం కలుగుతుంది. కవి సంగీత ప్రధానంగా ఉన్నప్పుడు కాలక్షేపానికీ, ఏ వెలుగునూ చొరనివ్వకుండా చీకటి గుయ్యారాలుగా ఉన్న విశ్వ విద్యాలయాలలోని పాఠ్యగ్రంథాలకూ, అదికూడ ఆధునిక కావ్యాలపేరుతో చలామణీ కావటానికి పని కొచ్చాయేగాని రసజ్ఞుల ఆర్తిని తీర్చలేకపోతున్నాయి. శక్తి ఉండీ కూడా యిటువంటి కవిమాత్రులు వర్తమాన సమాజంలోని మనుష్యులు కాకుండ పోతున్నారు.

ఒక ఉద్యమాన్ని నడిపించటానికి శక్తినిచ్చే లేక ప్రోత్సాహమిచ్చే గీతం వ్రాయుటంవలన తక్కువ ప్రయోజనమేమీ ఉండదు. అయా ఉద్యమాలు నమసిపోయినా కవులు చిరంజీవులుగానే ఉంటారు. భారత స్వాతంత్ర్య యుద్ధకాలంలో గరిమెళ్ళ సత్యనారాయణ వంటివారూ, రాష్ట్రోద్యమ కాలంలో తుమ్మల మొదలైనవారూ, ఆంధ్ర సంస్కృతి పునరుజ్జీవన కాలంలో రాయప్రోలు మొదలైనవారూ ఈ విధంగా కీర్తినిగడించారు. రెండవ ప్రపంచయుద్ధకాలంలో 'ఫాసిస్టు' వ్యతిరేకగీతాలు వ్రాసి కొందరు ప్రజాహృదయాన్ని చూరగొన్నారు. మళ్ళీ ఇన్నాళ్లకు భూస్వామ్య వ్యవస్థపైన, పారిశ్రామికవేత్తల దోపిడిపైన, వడ్డీ వ్యాపారుల పీడనపైన తిరుగుబాటు చేయాలనే సంకల్పంతో వేలాదియువకులు అరణ్యాలను ఆసరాగ చేసుకొని పోరాటం సాగిస్తూ, తమ శత్రువులకు కాపలాగ ఉన్న పోలీసులను, న్యాయస్థానాలను ధిక్కరించి 'దీర్ఘకాలిక పోరాటానికి' సంసిద్ధులౌతున్నారు. వీరికి శక్తి ఉత్సాహం నివ్వాలనే సంకల్పంతో విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. మావో; హోచిమిన్; చేగువేరాలు వీరికి ఆదర్శంకాగా ప్రభుత్వపు పోలీసులచేతిలో మరణించిన 'నక్సలైట్' ఉద్యమ నాయకులైన వెంపటపు సత్యం, ఆదిభట్ల కైలాసం; నాగంటి భాస్కరరావు; పంచాది నిర్మల మొదలైనవారి జీవితాలూ, పోరాటాలూ వీరికి కావ్యవస్తువు లౌతున్నాయి. 'విరసం' సభ్యులలో పెక్కుమంది నినాదప్రాయమైన గీతాలే రచించటం కన్పిస్తున్నది. కాని ఉద్యమ ప్రవాహంలో సకల కల్మషాలూ ఆదిలో కన్పించటం

సహజం. ఉరవడితగ్గిన కొద్దీ తేటనీరు బయటపడినట్లు విసర్గమైన కావ్యఖండికలు వెలువడతాయనటంలో సందేహం అక్కర్లేదు. నక్సలైట్ ఉద్యమం ఆంధ్రలో వెనుకబట్టినట్లు కన్పిస్తున్నది గదా వీరి కవిత్వమూ ఆవిధంగానే ఉరవడి తగ్గటమేకాక నమసిపోతుందని కొందరికి శంక కలుగుతున్నది. వీరు మాత్రం తమది దీర్ఘకాలిక పోరాటమనీ అణగారిపోయేది కాదనీ, మార్క్స్—లెనిన్ సిద్ధాంతాలకు ప్రపంచంలో నిలువ నీడ ఉన్నంతకాలం తమ భావాలకు కూడ వ్యాప్తి ఉంటుందని తమ ఆశయాలు సిద్ధించేవరకూ కలం దించేది లేదని చెప్తున్నారు.

విద్యార్థులకు రాజకీయాల ప్రమేయం తగునా లేదా అని చర్చించటం యీనాడెంత అసందర్భమో కవిత్వానికి రాజకీయాలతో సంబంధం ఉండనక్కరలేదని వాదించటమూ అంత అసందర్భమే. చారిత్రకంగా పరిశీలించి చూస్తే తెలుగు కవిత్వానికి రాజకీయాలతో సంబంధం యీనాటిది కాదని ఆదికవి కాలం నుండీ ఉన్నదేననీ తెలుస్తుంది. నన్నయ భారతాంధ్రీకరణ కున్న అనేక కారణాలలో రాజరాజనరేంద్రుడు తాను చంద్రవంశం వాడి ననుకోవటమూ, తన పూర్వుల కథను తాను వినాలని కోరుకోవటమూ ఒక ముఖ్య కారణంగా గమనించాలి. సత్యభాంతర సరసీవాలకు ప్రమొక్కటంలో తెలుగు కవిత్వానికి గల వ్యతిరేకతను తొలగించుకొని భారత రచనామార్గం సుగమం చేసుకోవటమూ జరిగింది. భారత రచనలో ఆంధ్రుల జీవితాన్ని ప్రతిబింబించటాని కవకాశం చిక్కనందున అర్జునుణ్ణి గోదావరీ నదీతీరానికి తప్పించి, వేంగిదేశాన్ని సందర్శింపచేయటం నన్నయకున్న గాఢమైన ఆంధ్రాభిమానమేనని అనిపిస్తుంది.

మతాన్ని ప్రచారం చేయటానికి రాజుల్ని ధిక్కరించి వెండితులూ, కవులూ ప్రజల భాషనూ, ఛందస్సునూ, కొన్నిసార్లు యితివృత్తాన్ని గూడ ప్రజలనుండే స్వీకరించి కవిత్వం రచించటం శివకవుల కాలంలో కన్పిస్తుంది. తనను పోషించిన బిజ్జలునిపైన కత్తిగట్టి బసవేశ్వరుడు తన మతమే ప్రచారం చేసుకోవాలనుకోవడం ఆనాటి రాజకీయ పరిస్థితులను విశదం చేస్తుంది. పాల్కురికి సోమనాథాదులు కూడ తమ మతానుయాయులు అన్యమతస్థులను చంపినట్లుగా సగర్వంగా చాటుకోవటం చూస్తే, తమ సిద్ధాంతాల ప్రచారానికి హింసను అవలంబించటంలో తప్పేమీలేదని అనుకున్నట్లుగా తోస్తుంది. జనజీవితాన్ని ప్రతిబింబించటంలో పక్షపాతంతోనైనా శివకవుల కాలం ముందంజ వేసింది.

తిక్కన భారతరచన ఆంధ్రీకరణమే అయినా ఆనాటి మత సామరస్యానికి ఆయన అమోఘమయిన కృషి చేసినట్లు భారతరచన వలనవే తెలుస్తుంది. అమూలకమైన విషయాలను కల్పించి, పాత్రల స్వభావాల తక్కడక్కడా ఆంధ్రత్వాన్ని ఆపాదించి శాంతి ప్రియుడుగా సామరస్యానికే కృషి చేసిన ట్లనిపిస్తుంది. పలనాటి యుద్ధమూ, కాటమరాజు యుద్ధమూ జరిగిన తరువాత అట్టుడికి నట్టుడికిపోతున్న దేశంలో హరిహరనాథ తత్వాన్ని స్వీకరించి తద్వ్యాప్తికి తోడ్పడటం రాజకీయంగా కాకతీయు లవలంబించిన మత సామరస్యానికి దోహదం చేసింది.

"సభాపర్వం ఎత్తుకుంటూనే రాజుల్ని వడ తిట్టాడు తిక్కన. దానికి మనుమసిద్ధి మొదలైన రాజులు ఏడ్చుకొనివుంటారు" అని శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు సాహిత్య వ్యాసాలలో పేర్కొన్నారు. తిక్కన సభాపర్వం వ్రాశాడనటం పొరపాటు. అంతేగాక తిక్కన ఆంధ్ర భారతంలో చెప్పిన విషయాలు సంస్కృత భారతంలో ఎంతవరకు ఉన్నాయో పోల్చి చూసి, దేశ స్థితిని కూడ గమనించి మిగిలినవి తిక్కన రాజకీయాభిప్రాయాలుగా నిర్ణయించాలే గాని, భారత రచనలోని రాజకీయాభిప్రాయాలన్నీ తిక్కన స్వంతమే ననటానికి వీల్లేదు.

మంచన 'కేయూర బాహు చరిత్ర' ఆనాటి శిక్షాస్మృతిని కొంతవరకు తెలియజేస్తుంది. కేతన 'విజ్ఞానేశ్వరీయం' తననాటి రాజనీతిని నిలువుటద్దం పెట్టి చూపించే గ్రంథం. రెడ్డి రాజుల సామ్రాజ్య స్థాపనకు తోడ్పడిన రాజకీయ పరిస్థితులను ఎఱ్ఱాప్రెగ్గడ అంతగా తడవలేదు. హరివంశం, నృసింహపురాణం, ఆరణ్య పర్వాలలో ఏ పీఠికలలోనో తప్ప ఆ అవకాశమూ అంతగా లేదు. రెడ్డిరాజుల కాలంనాటి రాజకీయ పరిస్థితులను సమకాలిక జనత జీవిత విశేషాలకు కొంతవరకైనా తెలియజేసేది భోజరాజీయము; విక్రమార్క చరిత్ర; సింహాసన ద్వాత్రింశిక; క్రీడాభిరామము మొదలైన గ్రంథాలే.

మహాభక్తుడుగా శ్రీనాథు డొక వంక కన్పిస్తూనే రాజులనూ, సంపన్నులనూ ఆశ్రయించి కృతు లంకితంచేసి పబ్బం గడుపుకొన్నాడు. కోమటి వేమారెడ్డిని ఆశ్రయించి, విద్యాధికారి పదవిని నెఱపి నట్లే శత్రుకూటములో వారైన పెండపూడి అన్నయ మంత్రినీ, వీరభద్రారెడ్డినీ కూడ మెప్పించి కృతు లంకిత మిచ్చాడు. తా నాశ్రయించిన రాజు పదవిచ్యుతుడు కాగానే పరుల నాశ్రయించటానికి వెనుకాడలేదు. విన్నకోట మంత్రితో లభించినట్లు హేమపాత్రాన్న భోజన మెవ్వరి పంక్తి లభిస్తుందనీ, దిన వెచ్చమే రాజు తీర్చగలడనీ చూశాడు. ప్రజల జీవిత విధానాన్ని పట్టించుకొని వ్రాసినది పలనాటి వీరచరిత్ర — అతడిదే అయితే క్రీడాభిరామమూ కన్పిస్తుంది. నందికంత పోతరాజు కథ చారిత్రకంగా వాస్తవమే అయితే శ్రీనాథుడు ప్రభుభక్తుడు కూడ నని తెలుస్తుంది. ఏమైనా శ్రీనాథుడు కాలం తీరుకు లొంగిపోయి తన కృతిభర్తలను రాయ వేశ్యాభుజంగులుగా స్తుతించాడు. శాలి వ్యసనా

లను కీర్తించాడు. ముమ్మడి శాంతయ్య వంటి యతిని కూడ శృంగార పురుషునికి మళ్ళే 'శృంగారసంబోధనలతో నుతించాడు. తమ రాజు గెలిచినప్పుడు ఓడిన రాజు ఆంధ్రుడే అయినా, ఓడిన రాజా బొమ్మను పాదానికి అలంకరించుకొన్నా దాన్ని కూడ ఘనంగానే కీర్తించాడు.

పరిపాలనలో మత సహనానికే రాయలవారు పేరు గాంచినా ఆముక్తమాల్యదా గ్రంథంతో వైష్ణవేతరుల భక్తిని నిరసించారు. మూరు పద్యాలకు పైగా రాజనీతికి కేటాయించారు. రాజనీతి చాల అంశాలు మహాభారతాది గ్రంథాలలో చెప్పినవే అయినా తన పరిపాలనానుభవాలను, తాను పాటిస్తున్న వాటిని గూర్చి కూడా ప్రస్తావించి ఉండవచ్చు. రామకృష్ణ కవి శైవుడుగా ఉండి వైష్ణవుడుగా మారటం చూస్తే, సంపన్నుల ఆశ్రయం కోసం కవులు పడిన పాట్లు కొంతవరకైనా అర్థమవుతాయి. పింగళి సూరననకూడ కృతిభర్త చిత్తవృత్తి ననుసరించి మధ్య వైష్ణవుడైనట్లు తెలుస్తున్నది. ధూర్జటి, సంకుసాల నరసయ్యల రాజ దూషణలను బట్టి చూస్తే రాయల అనంతరం ప్రభువుల సమక్షంలో సాంస్కృతిక జీవనం అంత సుభిక్షంగా ఉన్నట్లు తోచదు. తిమ్మరుసు రాయలవారికి అండదండలుగా ఉన్నట్లు చరిత్ర ఘంటాపథంగా చెప్తున్నా మన మహాకవులెందుకో మూకీభావం వహించారు. తమ ఆశ్రయదాతయైన రాయలవారు సకల లోకాలకూ రాజైనంతగా అతిశయోక్తులను పలికారు. చంద్ర దూషణలో 'తురకల దైవంబ నీవు' అని పరూధినిచేత పలికించటం చూస్తే ఆనాటి కవులకు మహమ్మదీయులపట్ల గల ద్వేషభావం తెలుస్తుంది. కాని కాల మొకేరీతిన గడవదు కదా! మహమ్మదీయుల నింతగా దూషించిన కవులు దేశం అన్యాక్రాంతం కావటంతో కందుకూరి రుద్రకవి వంటి వారు ఇబ్రహీము రాజును ఆశ్రయించి 'మల్కిభరాముణ్ణి' చేసినట్లే మహమ్మదీయులను హిందూ దేవతలలో అభేదం చెప్తూ కవితలు రచించారు. ఇంకా ఆనాటి కవి పండితుల వివాదాలను పరికిస్తే సరసమైన కవిత్వాన్ని కవితా హృదయంతో ఆమోదించడం పోయి, తమ ప్రత్యర్థిని ఓడించి తమ రాజాదగ్గర మెప్పు పొందాలన్న తాపత్రయం కన్పిస్తుంది.

ఏనుగు పాడిగా యిచ్చిన రాజుల్ని స్తుతించటంలో కవులు తాము తమ కాలానికి ప్రతినిధుల మన్నది కూడ మరచి ఆ రాజుల వ్యసనాలను గుణాలనుగా భూషించారు. రానురాను చిల్లర రాజుల నాశ్రయించి ఆ రాజుల ఉంపుడుగత్తెలతోడి శృంగారాన్ని దక్షిణ నాయకత్వంగా అభినుతిస్తూ శ్రీ కృష్ణునితో ఆ రాజుల కభేదాన్ని కల్పిస్తూ వారి రసికతను వేనోళ్ళ కొనియాడటానికే తమ జీవితాల నంకితం చేసుకొన్నట్లుగా కావ్యాలు రచించారు. అలా పలికితేనే తమకు 'భవహర' మౌతుందని భావించారేమో! పురిమీద పుట్టగా రాధికాసాంత్వనమూ, అహల్యాసంక్రందనమూ, తారాశశాంకమూ నని దేవలోకపు స్త్రీలను గూడ జారిణులుగా, సంభోగ శృంగారవర్ణనలతో ఘాటైనపదాలతో మత్తెక్కించ చూచారు. తమ జాతికి చెందిన పొరుగురాజును దోచుకుంటే "పరరాజ్య పరవైభవశ్రీల" గైకొనినట్లే వ్రాశారు గాని సోదర రాజుల మధ్య వైరం తగదని హితవు చెప్పి శాంతిని కోరటమే కలవైనది. మహమ్మదీయ దండయాత్రల ధాటి తాగలేని దేవాలయాల స్థితికి వగచి కాసుల పురుషోత్తమకవి ఆంధ్ర నాయక శతకం వంటివి ఒకటీ అరా వెలువడినా అవి అంతగా గణనలోకి రాలేదు.

కృష్ణదాటి, కావేరిని కూడ దాటి కన్యాకుమారిని తాకుతుంటున్న ఇస్లాము ధాటిగాని, మన గడ్డపై కాలూని స్వంతం చేసుకో జూస్తున్న పోర్చుగీసు, ఫ్రెంచి, ఇంగ్లీషు పాలకుల రాజకీయపు వ్యాపారపు ఎత్తులు గాని యీ కవులను కదిలించలేకపోయాయి. తిని తిని మొఖం మొత్తినట్లు ఏ చిల్లర రాజా పైనసో కినుక వహించి, లేక ఆ రాజుల నిరాదరానికి గురియైనప్పుడో 'చంద్రరేఖా విలాపం' మొదలైన కావ్యాలు తొంగి చూచాయి. ఇంగ్లీషు పరిపాలకులను గూడ ఆశ్రయించి, మిషనరీలు మొదలైనవారి మెప్పు పొందిన కవులు కూడ కొందరున్నారు. కాని హిందూ దేవతల వైభవాన్ని చాటేవిగాని, కవు లానాడు వ్రాస్తున్న దేవతల రంకుపురాణాలు గాని వారిని ఆకర్షించకపోవటాన జమీందారులనే నమ్ముకోవలసి వచ్చింది.

తిరుపతి వేంకటేశ్వర కవుల వరకూ యీ స్థితి కొనసాగుతూనే వచ్చింది. కవులకు కావ్య వస్తు స్వీకరణలో స్వాతంత్ర్యం తక్కువగానే ఉండజొచ్చింది. పోలవరం జమీందారు కోరగా వ్రాసిన 'బుద్ధచరిత్రము' జమీందారుగారి కోరికను తీర్చటానికి వ్రాసినదే గాని దేవీభాగవతము ఆరోగ్య కామేశ్వరి మొదలైన గ్రంథాలు వ్రాసే కవులు మనస్ఫూర్తిగా వ్రాసినది కాదు. ఐతే వారి ప్రతిభచేత తాము విశ్వసించని మతానికి చెందిన గ్రంథమే అయినా బుద్ధ చరిత్రము రసవంతంగానే నడిచింది. పింగళి—కాటూరి కవుల సౌందరనందము చివరలో సంఘ బహిష్కృతులుండే వీధిలో సుందరీనందుల సమాగమ దృశ్యం కవుల హృదయాలను పట్టిస్తుంది. కాటూరి వారి 'గుడిగంటలు'లోను, జాషువా కవి 'గబ్బిలము'లోను హరిజన సమస్య రసవంతంగా ప్రదర్శింపబడినది.

నవ్య కవిత్వానికి తిరుపతి వేంకటకవులు నాందీవాక్యం పలికితే సహస్రకిరణుడుగా వీరేశలింగం పంతులు ఉదయించారు. ఆయన కిరణ ప్రకాశం ప్రక్రియా వైవిధ్యానికి తోడ్పడినంతగా మహాకావ్య రచనకు తోడ్పడలేదు, అన్యాయాలనెదిరించే రాజకీయవాదిగానేగాక సంస్కర్తగా యుగపురుషుడుగా ఆయన సంభావ్యులౌతున్నారు. శాకుంతలాది సంస్కృత నాటకాలను, షేక్స్పియర్ ఇంగ్లీషు నాటకాలను

బ్రాహ్మ వివాహము మొదలైన స్వతంత్ర నాటకాలను రచించి మార్గం సుగమం చేశాక గురజాడ కన్యాశుల్కమనే మహోత్తమ నాటకాన్ని రచించి సంఘజీవితాన్ని కళ్లకు కట్టించారు. గిరీశం వంటి కుహనా రాజకీయవేత్తల బ్రతుకులను బట్టబయలుచేసి, అంతులేని కరుణతో గిరీశాన్ని సహజమైన మనిషిగా నిలిపి అతడి పట్ల జాలిని పుట్టించారు. ముత్యాలసరాల రచనతో, దేశభక్తి గీతంతో నవయుగ కళలను మేల్కొలిపే వైతాళికుడుగా ఆయన కీర్తిని పొందారు. వీరేశలింగం పంతులుగారు బ్రిటీషు ప్రభువు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిని కాంక్షించారు. గురజాడ ఆనంద గజపతి కొలువుచేశారు. కాని వీరేశలింగంగారి కావ్యవస్తు స్వీకరణ బ్రిటీషు పరిపాలకుల చిత్తాన్ని అనుసరించిగాక, వారి భాషా సౌంద ర్యానికి ముగ్ధులై ప్రక్రియా వైవిధ్యాన్ని సాధించటంవరకే పరిమితమైనది. గురజాడ తనది ప్రజల ఉద్యమంగా భావించి తాను వ్రాయదలచుకొన్న కళింగదేశ చరిత్ర గ్రాంథిక భాషలోనే జరగాలన్న ఆంక్షకు తల ఒగ్గలేదు. మతంలోని మూఢవిశ్వాసాలకు ప్రాణం పోయటం కోసంగాక మానవతా భావానికి నివాళిగా వ్రాసిన కరుణ రస భరితమైన గాథ పుత్తడిబొమ్మ పూర్ణమ్మ.

దేశంలో స్వాతంత్ర్యవాయువులు పిల్ల తెమ్మెరలుగా వీచసాగాయి. సంపూర్ణ స్వాతంత్ర్య కాంక్ష కాకపోయినప్పటికీ మన మందరమూ భారతీయులం; మనదొకదేశం; మనకూ స్వాతంత్ర్యం కావాలి అనేభావన కవుల హృదయాలను తొలుస్తూనే వచ్చింది. చిలకమర్తివారు "భరతఖండము చక్కని పాడియావు, తెల్లవారను గడుసరి గొల్లవారు మూతులబిగియుగట్టి పిదుకుచున్నారు" అని గీతమాలపించటంతో స్వాతంత్ర్య కాంక్ష రాజుకొన్నది. ఆంధ్ర పురాణము, శివభారతము, రాణాప్రతాపసింహ వంటి వీర గాథాకావ్యాలు వెలువడినాయి.

మనది వీరజాతి. మన కావ్యజాలంలో అత్యధిక భాగం శృంగారమయంగా వెలువడినది. అందులో కాముక శృంగారం అధికమైంది. 'మోహమధువె గవేషించె మున్ను కవి'. స్త్రీని ప్రేయసిగాగాక తల్లిగా, చెల్లిగా, నెచ్చెలిగా, సౌందర్యమూర్తిగా హృదయేశ్వరియైన ఆరాధ్యమూర్తిగా కవ్పించటంలేని చేతను పొంది 'అమలిన శృంగారం' పేరిట రాయప్రోలు సుబ్బారావుగారొక కొత్త త్రోవ తీశారు.

ఇరవైయవ శతాబ్దంలో రాజకీయాల ప్రభావం అతితక్కువగా పడినది భావకవిత్వం పైననే. దేశం పారతంత్ర్యంలో మగ్గుతున్నప్పుడు ప్రపంచయుద్ధానికి సమాయత్తమౌతూ దేశదేశాలు కత్తులు నూరుతున్నప్పుడు కొందరు దేశభక్తి ప్రబోధంతో మనసంస్కృతి వైభవాన్ని గూర్చి కవిత్వం వ్రాశారు. రెండవ ప్రపంచయుద్ధం రావటంతో కొందరు కవులు బ్రిటీషువారి అభిశంసను పొంది భుక్తి గడుపుకోవటానికి యుద్ధప్రచార గీతాలు వ్రాయసాగారు. కొందరుమాత్రం యివేవీ తమకు పట్టనట్లుగా సెలయేళ్లు, మొయిలునడకలు, పూలబాసలు, ఋతువులు, పర్వతాలూ, నదులూ, కాదంటే కారుచీకటి; నిశిరాతిరిలో దిక్కుతోచనిస్థితిని; అయోమయమైన విషాదాన్ని కవితావస్తువుగా చేసుకొన్నారు. మహాత్ముడు తన అహింసా సిద్ధాంత ప్రవచనాలతోనూ, మత సామరస్యపు సూక్తులతోనూ, ధనికులు పేదలను ధర్మకర్తలుగా చూస్తారని చెప్పే నీతివ్యాక్యాలతోను దేశమంతా సంచరిస్తూ ఆంధ్రదేశాన్ని గూడ తన రాకతో పునీతం చేశాడు. అంతకుముందే కొందరు గాంధీజీ సిద్ధాంతాలను తెలుసుకొని దానికి వశులై కవితలల్లారు. వారిలో ఉత్తుంగ శృంగంగా నిలిచి 'మహాత్ముని ఆస్థాన కవి' యయ్యారు శ్రీ తుమ్మల. శ్రీ దామరాజు పుండరీకాక్షుడు స్వరాజ్య సోపానం మొదలైన నాటకాలు వ్రాశారు. కవిత్వం వ్రాసినందుకు ప్రభుత్వం పెక్కుమందిని చెఱసాలల్లో నిర్బంధించింది. కొన్ని పుస్తకాలను నిషేధించింది. బసవరాజు, అడవి బాపిరాజు గాంధిజీ నిరాడంబరతకు మురిసిపోయి గేయసుమాలర్పించారు. మహాత్ముని మరణం కవులగుండెల సమితంగా కదిలించే కావ్యవస్తువే. కాని మన భాషలో ఆ విషాద సన్నివేశాన్ని కళ్లకు కట్టించే, కంట తడిపెట్టించే 'ఎలిజీ' రూపంలోగాని మరే రూపంలోగాని మంచి కావ్యం రాలేదు. ఎన్నో కావ్యాలైతే వచ్చాయిగాని వాటిలో జాషువాకవి బాపూజీ కావ్యమే యెన్నదగినది.

ఆంధ్ర సంస్కృతిని చాటే కావ్యాలలో ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే వాంఛ పొడసూపింది. అమరజీవి పొట్టి శ్రీరాములు నిర్యాణంతో రాష్ట్రం సిద్ధించింది. పొట్టి శ్రీరాములుగారి త్యాగం కవులను చెప్పుకొనదగినంతగా కదిలించలేదు. శ్రీ బండ్ల సుబ్రహ్మణ్యకవి అమరజీవిని గూర్చి వ్రాసిన కావ్యమూ, శ్రీ బోయి భీమన్న వ్రాసిన "ఒక్కొక్క దీపం" అనే పాటా ఆ సంఘటను కావ్యవస్తువుగా చేసుకొన్నాయి.

రష్యాదేశపు బోల్షివిక్ స్వాతంత్ర సమరం ఆంధ్రులలో మేధావులను ఆదిలోనే ఆకర్షించింది. గోవిందరాజు వెంకటకృష్ణారావు గారు 1924 లోనే లెనిన్ జీవితచరిత్రను వ్రాసి మార్క్స్-ఏంగిల్స్-లెనిన్ విధానాలపట్ల ఆసక్తిని కలుగజేశారు. క్రొవ్విడి లింగరాజు గారు గోర్కీ వ్రాసిన అమ్మ [Mother] ను తెలుగు చేయటంతో ఆ విప్లవ పంథా యువతరాన్ని బాగా ఆకట్టుకొన్నది. భావకవిత్వం ఫిమ వీథుల్లో విహరించి చలంగారి మాటల్లో చెప్తే "స్పైడుకాలువల్లో పలకటం" మొదలైనాక ఆకలి, దారిద్ర్యం దేశంలో విలయతాండవం చేయటం చూచిన కవులు నూతన మార్గాలకై అన్వేషించారు. కవితలో ప్రయోగాత్మకంగా నవత మొదలైనది. శిష్ట్లా, పురిపండా, ముద్దుకృష్ణ, దేవరాజు కృష్ణశర్మ, శ్రీశ్రీ, శ్రీరంగం

పోరాయోధులు మొదలైనవారు సామాన్య ప్రజల సమస్యలను వర్గ పోరాట దృక్పథంతో ఛందస్సుపైగూడ విప్లవం ప్రకటిస్తూ రచించారు. వీరికి శ్రీశ్రీ నేతయై "ఆకలి మా జీవితం; ఆందోళన మా వూపిరి; తిరుగుబాటు మా వేదాంతం" అని స్పష్టీకరించి అనితర సాధ్యమైన మార్గంలో మహాప్రస్థానం వెలువరించారు. ప్రపంచ చరిత్రకు నూతన వ్యాఖ్యానం చెప్పిన ఏంగెల్స్ వాక్యాలు ప్రేరణ కాగా దేశ చరిత్రలు గేయంలో నల్లమందుతో జోగుతున్న చరిత్ర రచనను బద్దలు కొట్టారు. ప్రపంచ చరిత్ర అంతా వర్గ పోరాటమయమేనని ఖండితంగా చెప్పారు. ఒక వ్యక్తిని మరొక వ్యక్తి, ఒక జాతిని మరొక జాతి పీడించే సాంఘిక ధర్మం అణగారి పోవాలని కోరుకున్నారు. ధనవంతుల పన్నాగాలూ, బలవంతుల దౌర్జన్యాలూ యికపై సాగవని శపించారు. శ్రామికులను "యీ చరిత్ర మీదే— మీరే ఏలండోయ్" అని ఆహ్వానించారు. మహాప్రస్థాన రచన ఆంధ్ర కవిత్వాన్ని రాజకీయంగా నూతన మార్గానికి మళ్ళించింది. యుద్ధకాలంలో ఫాసిస్టు వ్యతిరేక గీతాల నెందరో వ్రాశారు. అభ్యుదయ కవితలో శ్రీ శ్రీ కృష్ణ వ్రాసిన 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా', శ్రీ పులుపుల శివయ్య వ్రాసిన 'పలనాడు వెలలేని మాగాణిరా' అనే గీతాలు ప్రసిద్ధిని పొందినాయి.

తెలంగాణంలో నైజాము పరిపాలన దుస్సరం కాగా ఆంధ్ర మహాసభలతో జాగృతమై, ప్రాణాలకు తెగించిన వీరుల ఉపన్యాసాలతో మొదలై దాశరథివంటి కవులు ఉద్యమ నేతలయ్యారు. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని పలికిన దాశరథి మహాంధ్రోదయ కావ్యాన్ని రచించి తెలంగాణాలోని రాజకీయ పోరాటానికి నిలువుటద్దం పట్టాడు. నైజాం కుయుక్తులకు 'షా' చెప్పి ఆట కట్టించవలసిందిగా తెలుగుబాబులు సిద్ధర మేలుకొగ పాటలు పాడారు. తెలంగాణా ప్రజల జీవిత గాథలు మహాభారతాన్ని తలపిస్తాయని పదునెనిమిది పర్వాలుగా 'తెలంగాణ' కావ్యాన్ని రచించి కుందుర్తి రసవంతమైన ఉత్తమ కవిత్వాన్ని అందించారు. ఆరుద్ర 'త్వమేవాఽహమ్' రచన సాంకేతికమైన పద్ధతిలో సాగి వర్గపోరాటాన్ని గణితశాస్త్రపు గణనతో శ్రామికులే విధంగా పీడింపబడేదీ, వాటి నెదుర్కోవటానికి వారేమి చెయ్యవలసినదీ "What is to be done?" (ఈ పేరుతో లెనిన్ రచనను కూడ గుర్తు చేశారు) అని ప్రశ్నించి కవితా పద్ధతిలో విముక్తి మార్గాన్ని సూచించారు. అటు రాయలసీమలోను విద్వాన్ విశ్వం కఱవు సమయంలో హృదయవిదారక దృశ్యాలను 'పెన్నేటిపాట'లో ప్రదర్శించారు. ప్రపంచంలో ఏ మూల ప్రజలను పాలకులు హింసలకు గురిచేసినా, యుద్ధ పిశాచం ఎముకలను పిప్పిచేసినా తెలుగు కవి మేల్కొని రాజకీయమైన వివేచనతో ప్రజాపక్షం వహించి, దూరాన ఉన్నవారిని ఆత్మబంధువులుగా యెంచు కొని కవిత అల్లారు. కొరియా, మలయా, కాంగో, ఇటీవల వియత్నామ్ దేశాల ప్రజల కడగండ్లకు సానుభూతిని చూపించే కవిత్వం వచ్చింది.

అభ్యుదయ రచయితల సంఘం తన బాధ్యతను నెరవేర్చకుండానే నిర్వీర్యమై పోయింది. రకరకాల అభిప్రాయాలు గల వాళ్ళు అభ్యుదయ రచయితలుగా చలామణీ కావాలని చూడటంతో, మార్క్సిజం ఆమోదించేవారే సభ్యులుగా వుండాలని నియమం లేకపోవడంతో యీ సంఘం తన లక్ష్యమేమిటో తనకే అర్థం కాని స్థితికి వచ్చింది. ఆరుద్ర "అభ్యుదయ కవుల ధర్మమా అని వర్గ చైతన్యం గురించి పాడితేనే తప్ప మిగతాది కవిత్వం కాదేమోనన్న అపోహ ఆంధ్రదేశంలో అనవసరంగా వూపిరి పీలుస్తోంది" అని ప్రక్కత్రోవలు పట్టించారు. "అంగారమూ—శృంగారమూ" విడదీయరానివని చెప్తూ దాశరథి శృంగార కవిత్వాన్ని అభ్యుదయ కవిత్వంతో ముడిపెట్ట జూచారు. అభ్యుదయ కవులలో కొందరు కాంగ్రెసులోని అభ్యుదయశక్తులే విప్లవం తేగలవని ఆశ పెట్టుకొని కూర్చున్నారు. చికట్లో చిందులుగా సాగుతున్న ఉద్యమం ప్రభుత్వాన్ని మాడకుండానే "డెక్కు మార్చి జండా మార్చకుండా ఉన్న పార్టీ" లాగ తన గమ్యం వైపు గాక తిరోగమన మార్గాన్ని వెదుక్కుంటున్నది. దీన్ని మళ్ళీ ఉద్ధరించే ప్రయత్నంలో రెండవ తరానికి చెందిన గజ్జెల మల్లారెడ్డి; వరవరరావు; సి.వి. మొదలైన వారు ప్రయత్నించినా అది కొనసాగలేదు. 1955 లో జరిగిన ఎన్నికలలో అభ్యుదయ కవుల నడవడి ఆ ఉద్యమాన్ని గూర్చి పెట్టుకొన్న ఆశల్ని నిరాశగా మార్చింది. ప్రజా నాట్యమండలికి బాసటగా నిలిచిన కవులు శక్తిని కోల్పోయాక అది కూడ మూలబడింది. ఆ తర్వాత పది సంవత్సరాలలో దిగంబర కవులు బయటికి వచ్చేటంత వరకూ అభ్యుదయ కవుల రచనలు ఒకటీ అరా వెలువడినా మునుపటి స్ఫూర్తితో వెలువడలేదు.

1965 లో ఆరుగురు యువకులు దిగంబర కవులుగా పేరు పెట్టుకొని 'డిక్'ం పేరుతో షాక్ చేస్తున్నట్లు అశ్లీల పదాలతో వ్రాసి క్రొత్త త్రోవ తీయగా, తామూ తిరుగుబాటు చేసినవారే అయినా అభ్యుదయ కవులలో చెక్కుమంది వీరి నిజాయితీని శంకిస్తూ, వీరివి ప్రగతిని కోరే కవితలు కావని సంప్రదాయ పద్ధతిలో విమర్శించారు. జుగుప్సాకరంగా వున్న సమాజ స్థితిగతులను జుగుప్సాకరంగానే చూపించడానికి అశ్లీల పదాల సాహాయ్యాన్ని కోరితే మర్యాదస్తులకు కర్ణకఠోరంగా వినిపించాయి; నోట పట్టరానివయ్యాయి. అభ్యుదయ విమర్శకులలో ప్రసిద్ధులైన రాచమల్లు రామచంద్రారెడ్డిగారు వీళ్ళను 'అరిషడ్వర్గా'లని దుయ్యబట్టారు. దిగంబర కవులు ఆరంభంలో ఏ 'ఇజాని'కీ లొంగకట్టు పడిన కవులు కారు. 'ఈ దేశంలో యీ గోళంలో వూపిరి పీల్చే ప్రతి మనిషి

ఉనికికోసం తపన పడి, ఆకలి బాధని చూసి వెక్కివెక్కి ఏడ్చి, నిప్పుకక్కి ప్రవహించిన కవిత' ఇది. దీనిలో రసమూ, ఔచిత్యమూ ధ్వని, వక్రోక్తి మొదలైన వాటికోసం వెదికి ప్రయోజనం లేదు. శ్రావ్యమైన శబ్దజాలం కోసం శబ్దాలను చిత్రిక పట్టటం కూడా లేదు. శ్రీ ఆర్. వి. టి. శర్మగారు చెప్పినట్లు [1]"It will not be wise for any one to adopt the traditional methods of literary appraisal in their case. It will be like trying to find out the "raga" of the cry of a hungry child." కాగలదు.

వీరు విప్లవ కవులుగా పరివర్తన పొందిన తరువాత ఋతువులు, సంవత్సరాలు, వారాల పేర్లను మార్చటమనే వ్యర్థ ప్రయత్నాన్ని విడిచిపెట్టారు. కుల మతాలను తెలియజేసే పేర్లను విడిచి పెట్టి దిగంబర కవులుగా ఉన్నప్పటి పేర్లనే నిలుపుకొన్నారు. ఇక వాడుక అవసరంలేని అశ్లీల పదప్రయోగాధిక్యం విడిచిపెట్టారు. దేశం సాయుధ విప్లవాన్ని కోరుతున్నదా లేదా అని ఆలోచించి జరుగబోయేదాన్ని జోస్యం చెప్పటం అనవసరం. అభ్యుదయ కవులుగా ఉన్నవారు వ్రాస్తున్న కవితకంటె రసవత్తరమైన కవితను విప్లవ కవులు రచిస్తున్నారన్నది సత్యం. అయితే విప్లవ కవులంతా రస వత్తరమైన కవితనే రచించటం లేదు. కొందరు నినాదప్రాయ మైన కవిత్వమే వ్రాస్తున్నారు. విప్లవ కవులలో ఏకోన్ముఖమైన ఏకాగ్రత సిద్ధించిందని చెప్పటం అసత్యం. "సభ్యులలో ఏకాగ్రత రావటానికి మరి కొంత కాలం పడుతుంది. తప్పదు. ఉన్నతనన్ను విలువ చేష్టలకూ దురుసు మాటలకూ కాలం కాదిది. బాధ్యత పెద్దది. వివేచన అవసరం. సంయమనం అంతకంటేను. అంటే రాజీ పద్ధతి అనవసరం" అని శ్రీ కె. వి. రమణారెడ్డి గారు విప్లవ రచయితల సంఘ కార్యదర్శిగా చెప్పినారు.[2] శ్రీశ్రీ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారన్నది కూడా సత్యం. ఆయన వ్రాస్తున్న విమర్శలలో అక్కడక్కడా దురుసుతనమూ, విలువ మాటలూ, పేలవమైన నీరసమైన చిత్ర కవిత్వమూ ఆయన సాగిస్తున్న ఉద్యమ శక్తుల్ని అవహేళనకు గురిచేస్తున్నాయి. ఏ ఇజాన్ని నమ్మవద్దని చెప్పేవారిలో తిలక్, దాశరథి ప్రముఖులు. జీవితం ప్రిజమ్ లాంటిదనీ ఇజమ్‌లలో ఇంప్రిజన్ అయితే లాభం లేదన్నారు కీ. శే. తిలక్. తానూ దిగంబర కవినే నంటూ ఏ ఆచ్ఛాదనలకూ లొంగనని, జెండాలను నమ్మి పుండాకోరులు కావద్దని హెచ్చరించారు శ్రీ దాశరథి. చేతనావర్త కవులు తాత్త్విక జిజ్ఞాసతో మానవత్వపు విలువలకోసం అన్వేషిస్తున్నారు.

రాజకీయాలకూ కవిత్వానికీ యింతగా బ్రహ్మముడి పడిపోవ టానికి కారణాల నన్వేషిస్తే దేశంలో సాగుతున్న పరిపాలనపై నిస్పృహ; జుగుప్సాకరంగా దిగజారిపోయిన సమాజ స్థితిగతులూ; నానాటికీ పెరుగుతున్న ఆర్థిక అసమానతలూ; మానవుడు మాధవుడు అని చెప్పే సర్వోదయవాదుల, జీవకారుణ్యవాదుల ఇతరేతర మాన వతావాదుల మాటలూ చేతలూ తగినంత ఫలితాన్ని కలుగజెయ్యక పోవటమూ అని తెలుస్తున్నది. ప్రజలు తమ కోరికలు తీరక సాగి స్తున్న సమ్మెలు, పోరాటాల పట్ల ప్రభుత్వం పోలీసులద్వారా వ్యవ హరిస్తున్న తీరు విమర్శలకు గురియౌతున్నది. అహింసాత్మకంగా ప్రజల జీవితం సుభిక్షంగా సాగుతూనే ఉన్నట్లయితే ఏ కవి మాత్రం సాయుధ విప్లవం రావాలని ఎట్లా కోరుతాడు? కోరినా దాన్ని ఎవరైనా ఎంతకాలం ఆదరిస్తారు? "నేను రాజకీయాల కతీ తుణ్ణి. నాకు ఏ ఇజమూ అక్కర్లేదు. స్వచ్ఛమైన కవిత్వం రచిం చటమే నా మతం" అని చెప్పేవారి మతాన్ని ఎంద రనుసరిస్తారో, రాజకీయాలనే రక్తనాళాలుగా యెంచుకొని, కవిత్వాన్ని తమ ఊపి రిగా భావించుకొన్న వారి నెంద రనుసరిస్తారో కాలమే తన నిర్ణ యాన్ని తెలియజేస్తుంది.

---

1 Aaccent on the New Sameeksha—Nineteen Seventy Edited & Published by M. Govindan.

2 సృజన; ఆగష్టు—అక్టోబర్—1970.

వెలుగు

శ్రీ నూతలపాటి గంగాధరం

నాకు వెలుగు కావాలి

నన్నూ, నా జాతినీ చీకటినుంచి బయటికి లాగే
చిరునవ్వును వెలిగించి, చెలిమిని చెరనుంచి విడిపించి
ఎదనూ ఎదనూ ఎప్పుడూ కౌగిలి గదిలో బంధించే
అద్భుతమైన చిరువెద్పని వెలుగు కావాలి.

అపార్థాలు లేని, అనర్థాలు లేని
అనురాగం లాంటి వెలుగు కావాలి.

వివేకం భుజంమీద చెయ్యివేసి నడ్చే విజ్ఞానాన్నీ,
ఎంత ఆవేశంలోనూ గమ్యాన్ని మరువని చైతన్యాన్నీ,
ఎట్టి పరిస్థితిలోనూ ఎదుటివాడు పీడింపబడని స్వాతంత్ర్యాన్నీ,
ఆకలి అపశ్రుతులు పలకని అమృత జీవనగానాన్నీ,
ప్రసాదించే వెలుగు కావాలి.

నీలి మంటలు లేని, ధూమకలుషితం కాని
పాల వెల్లిలాంటి వెలుగు కావాలి.

పీడితులను కరుణించే వెలుగు
ప్రేమను గుండెల నిండుగా నింపే వెలుగు
విషమోన్నతాలను సమతలంచేసే వెలుగు
అరణ్యాలలోనూ సాధుత్వాన్ని సృష్టించే వెలుగు
అందరిలోనూ సమంగా ప్రవహించే వెలుగు

వెలుగు కావాలి నాకు!
నాకూ నా దేశానికీ వెలుగు కావాలి!

వచన కవిత - వర్తమానతరం

శ్రీ టి. ఎల్. కాంతారావు

శ్రీశ్రీ, శిష్ట్లా మొదలైన కవులతో ప్రారంభమయిన వచన కవితా ప్రక్రియ ఆ తరం కవులలో ప్రయోగాత్మకంగా నిలిచి ఈ తరం కవులలో సంప్రదాయంగా విస్తరించింది. శ్రీశ్రీ, శిష్ట్లా, ఆరుద్ర, తిలక్ మొదలైన మొదటి తరం కవులలో—వచన కవితాపరంగా కావ్యపరిణామ దశల్ని 'తెలుగులో వచన కవిత' (భారతి నవంబరు 69) అనే వ్యాసంలో ఉదాహరణ మాత్రంగా వివరించాను. ఈ తరం కవులు, వారి విశిష్టతని విశ్లేషించటమే ఈ వ్యాసంయొక్క పరమార్థం.

ఏ భాషాసాహిత్యంలోనైనా విప్లవం అనేది ఒకే ఒక నాడు అకస్మాత్తుగా పుట్టుకురాదు. సాహిత్య ప్రారంభం నాటినుంచీ ఆ యా యుగాల్లో ఆ యా కవుల్లో ఉన్న స్వాతంత్ర్య కాంక్ష మీద సాహిత్య విప్లవం ఆధారపడి ఉంటుంది. ఒక్కొక్క కాలంలో—తత్కాల సాంఘిక వ్యవస్థలో ఒక విశిష్ట లక్షణం యొక్క చైతన్యం ప్రవహిస్తూ ఉంటుంది. అసమాన మేధా శక్తితో, బహుముఖ శిల్ప పరిజ్ఞానంతో తత్ చైతన్యాభిముఖమైన సాహిత్య ప్రక్రియని సృష్టించినవాడు ఆ యుగ సాహిత్యానికి ప్రాతినిధ్యం వహించడం సర్వసర్వత్రా రుజువైన సత్యం. అయితే ఒక యుగంనాటి మహాకవిని దృష్టిలో ఉంచుకుని ఆనాటి తదితర కవుల ప్రతిభా విశేషాన్ని కొలుస్తూ వీళ్ళందరూ ఆ మహాకవి అనుయాయులేనని సాహిత్య విమర్శకులు తోసి పారేస్తే ఆ యుగంలో మిగిలే కవు లెవ్వరు? సాహిత్య చరిత్రలో వాళ్ళ స్థానమేమిటి?

భావ కవితానంతరపు తెలుగు సాహిత్యాన్ని అభ్యుదయ యుగంగా భావించి ఆ యుగానికి 'శ్రీశ్రీ యుగం' అని నామకరణం చెయ్యడం ఏనాడో జరిగింది. శ్రీశ్రీ తనకు పూర్వం ఉన్న సాహిత్య సంప్రదాయంమీద తిరుగుబాటు లేవదీశాడు. తెలుగు సాహిత్యంలో సరికొత్త యుగానికి శ్రీశ్రీ సింహద్వారం తెరిచినమాట వాస్తవమే; సందేహం లేదు. శ్రీశ్రీ తిరుగుబాటు వెనుక అనంతమైన సంప్రదాయ సంస్కారం నిక్షిప్తమై ఉన్నది. ఆ సంస్కారాన్ని [illegible] అర్థం చేసుకోకుండా ఆరాధించడం జరిగింది. శ్రీశ్రీ సంప్రదాయ కవిత్వం రాశాడు; మాత్రాబద్ధ ఛందస్సులలో గేయాల్ని రాసి అతని సొంతగొంతు వినిపించాడు. మాత్రాబద్ధ ఛందస్సులలో గేయాలు రాస్తున్న [illegible]లోనే వచనగేయాలు కూడా రాశాడు. మాత్రాబద్ధ ఛందస్సుల వరకూ అభ్యుదయ తెలుగు కవితాకాలాన్ని శ్రీశ్రీ యుగంగా భావించటంలో దోషంలేదు. కాని జరిగిం దేమిటంటే—శ్రీశ్రీ యుగం తదనంతరయుగంలోకి కూడా చొచ్చుకుపోయి, శ్రీశ్రీ అనే విరాట్ స్వరూపం వెనుక శ్రీశ్రీ అనంతర కవులు నిలబడి తమ ముందుమార్గాన్ని శ్రీశ్రీ భుజాలమీదనుండి చూడవలసి వచ్చింది.

ఇది ఇట్లా ఉండగా రెండోవైపునుంచి మరో వాదం బయలుదేరింది. అదేమిటంటే—ఈ వచనకవితాప్రక్రియ అసమర్థులకి ఆయుధమని, సంప్రదాయ పద్యకవిత రాయలేనివాళ్ళు మాత్రమే వచనకవిత రాస్తున్నారని, వీళ్ళకి సంప్రదాయ కవితానుయాయిత్వం కాని, భాషాపరిజ్ఞానంకాని లేదని. ఈ విమర్శని ప్రామాణికంగానే కాదు అసలు విమర్శగానే పరిగణించవలసిన అవసరంలేదు. ఎందుకంటే—ఈ విధమైన విమర్శ మనసాహిత్య పరిణామదశల్ని, తత్పరిణామకారణాల్ని సమగ్రంగానూ, సక్రమంగానూ, అవలోకించి, ఆలోచించినవిమర్శ కాదు: సంప్రదాయంమీద ఉండవలసిన అభిమానంకంటె మితిమీరిన అభిమానం ఉండటం; సాహిత్యంలో ప్రయోగాలమీద, కొత్తదనంమీద విముఖత కలిగిఉండటం ఈ రకమైన బలహీన విమర్శకి మూలం. వచన కవితలో సాంప్రదాయిక నియమాలు విసర్జించబడినంత మాత్రంలో ప్రక్రియ లోపభూయిష్ఠమైనదనటం, ఎవరైనా రాయగలరనటం హాస్యాస్పదమైన మాట. ఛందస్సు తెలిసిన ప్రతివాడూ ఒకటో అరో పద్యాలు కొంచెం శ్రమించి రాయగలడు. అట్లాగే కాస్తో కూస్తో భాషా శాస్త్రాన్ని అర్థం చేసుకున్నవాడు తన పరిమితిలో వచన గేయం రాయగలడు. అయితే వీళ్ళందర్నీ కవులుగా పరిగణించే అవకాశం ఉన్నదా? ఛందస్సులో బంధించినంత మాత్రంలో వచనానికి కవితా వాసన రాదు; వచనాన్ని ముక్కలుగా విరిచి గేయంగా రాసినంత మాత్రంలో కవిత్వం కాదు. మొదటి ప్రక్రియ నియమాలకు లోబడి శిల్పాన్ని ఆశ్రయిస్తే రెండో ప్రక్రియ నియమాలను ఉల్లంఘించి శిల్పాన్ని ఆశ్రయించింది. అంటే రెండు ప్రక్రియలూ కావ్యగతమైన శిల్పాన్నే ఆధారం చేసుకుంటున్నాయని విశదమవుతోంది. ఏ ప్రక్రియకి ఆ ప్రక్రియా వైవిధ్యాన్ని, దానిలోఉన్న మంచి చెడుల్ని విశ్లేషించుకోవలసిన బాధ్యత వచన విమర్శకులది; సహృదయులది.

వచన కవిత ఒక ఉద్యమమా? దీనికి వాదాలూ ప్రతివాదాలూ ఉన్నాయి. అభ్యుదయ కవితా ప్రస్థానంలో వచన కవిత ఒక మజిలీ అని చాలామంది అభిప్రాయం. కవి యొక్క వైయక్తిక స్వేచ్ఛ కాంక్షించే కాల్పనికోద్యమ సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవిత్వంకూడా ఒక భాగమేనని, దానికి ఉద్యమ ప్రాధాన్యం లేదని అంటే ఎంతనిజమో పైవాదన కూడా అంతే నిజం. కాల్పనికోద్యమంలో భావకవిత్వానికి, తరువాత కాలంలో వచ్చిన అభ్యుదయ కవిత్వానికి లక్ష్యంలోకాని, లక్షణంలో కాని చాలా భేదాలుండటం వలన దేనికదే ఒక ఉద్యమంగా నిలిచింది. అభ్యుదయ కవిత్వానికి, ఈనాటి వచన కవిత్వానికి భాషలో, భావంలో, వ్యక్తీకరణలో అనంత వైవిధ్యం కనబడటంవలన వచన కవిత్వాన్ని కూడా ఒక ప్రత్యేక ఉద్యమంగా భావించడంలో తప్పులేదు. అభ్యుదయ కవిత్వానికి, వచన కవిత్వానికి ఉన్న భేదం స్థూల పరిశీలనవల్ల కనిపించేదికాదు. సూక్ష్మాంశాలలో ఈ రెండు ప్రక్రియలకి మౌలికమైన భేదాలున్నాయి. భేదాలు లేవనుకోవడం అభ్యుదయ కవితాయుగాన్ని దాని తరువాత యుగంలోకి విస్తరింప జెయ్యట మన్నమాట. ఈ కారణంగానే ఈ తరం వచన గేయకవుల్ని గడిచిన తరంలోని కవులనీడల క్రింద సమర్థించవలసిన దుస్థితి ఏర్పడుతోంది.

అభ్యుదయ కవిత్వం ఒక ప్రత్యేక సిద్ధాంతాన్ని ఆశ్రయించుకుని ఆ సిద్ధాంతపు గోడల్లోంచి బయటకు రాలేకపోయింది. వచన కవిత్వం యొక్క పరిధి ఒకే సిద్ధాంతానికి పరిమితంకాక విస్తృతమై ఎవరికివారు వైయక్తిక పరిణతిని సాధించే ఒకానొక మార్గంగా నిలిచింది. ఏక భావాశ్రితమైన ప్రక్రియగా కాకుండా అనేక భావాల సంగమ స్థానంగా వచన కవితని రూపొందించిన వాడు తిలక్. తిలక్‌లో కూడా భావ కవితా విశేషాలు కొన్ని తొంగి చూశాయి. వచనకవితా ప్రక్రియకి ఆద్యులైన శ్రీ శ్రీ, శిష్ట్లా—తరువాత వచ్చిన ఆరుద్ర, కుందుర్తి, తిలక్‌లను అధిగమించి వచన కవిత్వం వర్తమాన తరంలో ముందుకు పోతోంది. ఈ తరంలో వచన కవిత్వంలో వివిధ కవులు సాధించిన వైయక్తిక పరిణతి ఆరు దశాబ్దాల ఆధునిక సాహిత్యంలో ఏ తరం సాధించలేదనటంలో విప్రతిపత్తి లేదు. క్షణం, క్షణం మారుతున్న రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు సాంఘిక వ్యవస్థమీద తమ ప్రభావాన్ని చూపడమే కాక సాహిత్యరంగంలో ప్రయోగ వాదానికి దారి తీసి అనేక భిన్నభావాల వ్యక్తీకరణకి కారణభూతాలయ్యాయి. "The painter of our own time will live our own life, with our own levels and our own ideas. He will take the feelings he gets from the look of things in our society, and give them back to us in pictures where We recognise ourselves and our own surroundings. It will not do to loose sight of the fact that we ourselves are both the subject and object of the art; art is the expression of ourselves for our own sake." ఈ నిర్వచనాన్ని తెలుగు సాహిత్యంలో వర్తమాన తరానికి చెందిన వచన కవులకి మనం అన్వయించవచ్చు.

2

తెలుగు కవిత్వంలో కవి తనలోకి తను చూసుకోవటం భావ కవిత్వంతో ప్రారంభమయింది. బాహ్య జగత్తునుంచి అంతర్ జగత్తుకి, స్థూల ప్రవృత్తినుండి సూక్ష్మ ప్రవృత్తికి ప్రయాణం చేసినవారు భావకవులు. సాంప్రదాయిక మతమౌఢ్య క్షీణ దశలో భావకవులు స్వకీయ ఆధ్యాత్మిక అనుభూతిలోంచి నూతన మతానికి దారి తీశారు. కొత్తదనంతో కూడిన ఈ వైయక్తిక అనుభూతితో భావకవులు ఆధ్యాత్మిక ఏకాంతవాసంలోకి పయనించారు. మానసికమైన ఒకానొక నూతన అనుభూతి పరిధిలోకి పాఠకుణ్ణి తీసుకుపోయింది భావకవులే. కవి తనలోకి తను చూసుకోవటం భావ కవులలో మొట్టమొదటి సారిగా కన్పించి ఆ కాల్పనికోద్యమంలోనే పరిణతి చెందినప్పటికీ అభ్యుదయ యుగానంతర వచన కవులలో కవుల ఆత్మ అంతర్ముఖం కావటం విలక్షణ పరిణామం. భావకవులకి, వర్తమాన వచన కవులకి ఈ లక్షణంలో సామ్యం ఉన్నప్పటికీ అనుభూతిలో, రూప చిత్రణలో అనంత వ్యత్యాసం గోచర మవుతోంది.

వచన కవితా పరిణామ దశల్లో మొదటిదశ ఒక **rigid form** గా మిగిలిపోయింది. అభ్యుదయ కవితా ప్రసాదితమైన మార్క్సీయ సిద్ధాంత వాదన నుంచి వచన కవిత తొలినాళ్లలో తప్పించుకోలేక పోవటంవలన నూతన రీతులకి దానిలో అవకాశం తక్కువైంది. మార్క్సీయవాదం నుంచి ప్రజాస్వామిక వాదానికి కాలం పరిణామం చెందటంతో వచన కవితా విధానంలో కూడా మార్పు అనివార్య మయింది. ముఖ్యంగా వచన కవిత్వంలో కనిపించే అనేక పరిణామాలకి వర్తమానకవులే కారణం. వర్తమాన వచనకవులు గతసంప్రదాయాలతో పాటు భావ, అభ్యుదయ కవులు ప్రతిష్ఠించిన నూతన సంప్రదాయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న పిమ్మట వినూతన మార్గాన్ని అవలంబించారు. అయితే వర్తమాన తరంలో వచ్చిన వచనకవిత అంతా ఉత్తమమైనదికాదు. విత్తనం ఆరోగ్యకర మైనది, పుష్టికరమైనదీ అయినప్పటికీ విత్తనం వృక్షంగా పరిణామం చెందింతర్వాత కొన్ని శాఖలకి చెదలుపట్టింది. సకాలంలో గుర్తించకపోతే ఈ చెదలు మొత్తం వృక్షాన్నే తినేసే అవకాశం ఉంది.

"దీపమై వెలుగుతాను గుండెలో
తోరణమై వ్రేలుతాను తలపై
అణువణువున వర్తించే శక్తిని" అంటారు మాదిరాజు రంగారావుగారు యుగసంకేతంలో. ఈ తరంయొక్క ప్రధాన లక్షణం చైతన్య ప్రభావాన్ని గుర్తించటం. నిరాశల చీకట్లు దుప్పట్లు కప్పుకున్న గుండెలో ఆశల దీపాలు వెలిగించటం, వెలిగిస్తాననటం, భవిష్యత్తుని బంగారు కాలంగా భావించటం కవి ఆశావాదానికి గుర్తు. ఈ ఆశావాద మనేది ఆధునిక యుగ లక్షణమే కాని వర్తమాన కాలంలోని లక్షణాన్ని—

"ప్రతిమనిషీ ముఖ్యంగా తనలో తాను
మేల్కొనవలసిన అవసరమూ ఎంతో ఉంది" అన్న పాదాల్లో వ్యక్తం చెయ్యటం జరిగింది.

"ఈనాటి అశాంతి ఆక్రందంలో
రేపటి అభ్యుదయంకోసం
అగ్నినై మేల్కొంటాను
వర్షమై బ్రతుకుతాను"

రంగారావుగారి కవిత్వంలో ఉన్న విశిష్ట లక్షణమేమిటంటే—చాలా తేలికైన మాటల్లో చాలా గంభీరమైన భావాన్ని వ్యక్తంచెయ్యటం. అశాంతి, అభ్యుదయం, అగ్ని, వర్షం అన్న ఈ నాలుగు పదాలు ఒక పరమార్థాన్ని ఆశించి వాడబడినాయి. ఈనాటి జీవిత వైక్లబ్యం, సంక్షోభం అంతా అశాంతి అన్న శబ్దంలో వ్యంజితమైంది. ఈ అశాంతిని దహించటానికి సామాన్యుడు అగ్నియై జాగృత మవవలసిన అవసరమున్నది. మనిషి దేవుడు కాకపోయినప్పటికీ కనీసం మనిషిగా బ్రతకగలగటం అభ్యుదయమే. ఆ అభ్యుదయంకోసం వర్షమై బ్రతుకుతా ననటంలో వర్షం అన్న శబ్దంయొక్క ఔచిత్యం గొప్పది. అగ్నితర్వాత వర్షం ప్రశాంతిస్థితికి ప్రతీక; దేశసౌభాగ్యానికి మూలం.

రంగారావుగారి వచన కవితలో నున్న మరొక విశేషం తాను చెప్పదలుచుకున్న భావాలకి ప్రతీకలను ప్రయోగించటం. ప్రతీకవాదాన్నిగురించి ముందుముందు ఈ వ్యాసంలో వివరిస్తాను. ఒకఅర్థం ధ్వనించడానికి దానిస్థానంలో ఆ అర్థస్ఫురణ కలిగేటట్లుగా వేరొక సంకేతాన్నుపయోగించటం ప్రతీక వాదంయొక్క ప్రాథమిక లక్షణం.

'పగలు మరుపు మగతలో
రాత్రి అరని తెలివిలో ఉంటాను
నాపై పగటిముద్రలు
పూర్తిగా వదలవు, రాత్రి
నాపై రాత్రిముద్రలు
పూర్తిగా వదలవు పగలు'

ఈ పాదాల్లో పగలు బాహ్యప్రపంచానికి లేక మనిషియొక్క బాహ్యప్రవృత్తికి, రాత్రి మనఃప్రపంచానికి లేక అంతఃప్రవృత్తికి ప్రతీకలు. జీవనప్రవృత్తిలో మనిషి తన్నుతాను మర్చిపోవటం మరుపుమగతలో వ్యక్తమయింది. అంతర్జగత్తులో అంటే మానసిక ఏకాంతంలో తన్ని తను దర్శించటం ఆరని తెలివిలో వ్యక్తమయింది. మానసిక ప్రపంచంలో మనిషి జీవించేటప్పుడు బాహ్యప్రవృత్తి పూర్తిగా వదలకపోవటం, బాహ్యప్రవృత్తిలో జీవిస్తున్నపుడు అంతః ప్రపంచంయొక్క ప్రభావం పూర్తిగా వదలకపోవటం మనిషియొక్క అంతర్, బహిస్సంఘర్షణలకి నిదర్శనం.

'ఈ చెట్టుకొమ్మలపై ఏండ్లుగా
గూళ్లుకట్టుకుని నివసిస్తున్నవి పక్షులు
దప్పికగొని పిడచకట్టిన నాల్కలతో
తడుస్తూ నిలిచి ఉన్నవీ,
చలికి ముడుచుకొన్న శరీరాలతో,
వణుకుతూ వొదిగి ఉన్నవీ,
వానజల్లుకు తడిసి ముద్దయి
వెచ్చదనంకోసం వగర్చేవి,
వసంతం వచ్చే వరకూ
ఆశలో బ్రతికి ఆనందించేవీ,
కాంతి ప్రోదిచేసుకుంటూ
బయళ్లపై రోదసిలో దృష్టిబరపేవీ,
బహువిధ స్థితులకు ప్రతీకలుగా"


చెట్టు సామాజిక వ్యవస్థకి ప్రతీక. దాని కొమ్మలపై నివసించే పక్షులు మానవులు. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ మంచి కాలంకోసం ఆశతో ఎదురుచూసే దైన్య మానవజాతికి ప్రతి అక్షరం ప్రతీకగా రాయబడినవి పైపాదాలు.

చైతన్యానికి, జడానికి, జ్ఞానానికి, అజ్ఞానానికి సమాజంలో ఉన్న వ్యత్యాసాన్ని గూర్చి 'రెక్కలు దాల్చిన కొండలు' అన్న ఖండికలో చక్కగా వివరించారు.

"వాయువు కదలికలేక
మేఘాలెక్కడి వక్కడ
స్తంభించి పోతున్నాయి
కృత్రిమమైన రెక్కలతో అమాంతం
కొండ లెక్కడనుండి ఎక్కడికో ఎగిరిపోతున్నాయి."

వాయువు అవకాశానికి, మేఘాలు చైతన్యానికి, కొండలు చైతన్య రాహిత్యానికి అంటే జడత్వానికి సంకేతాలు. కాలం అనుకూలించక చైతన్యోత్సాహులైన మేధావుల అధోగతి, సమాజం కల్పించిన అవకాశాలవే కృత్రిమపు రెక్కలు ధరించి




PAINT

ఎక్కడెక్కడినో ఎగిరిపోతున్న జడబుద్ధులైనవారి ఊర్ధ్వగతి పై సంకేతాల ద్వారా వ్యక్తీకరింపబడింది.

> "గడచిన ఏ ఒక స్థితిని
> తిరిగి ఎవడూ మార్చలేడు
> ఆఖరికి ఆ భగవంతుడైనా.
> కాలం ఎవరి చెప్పు చేతలలోనూ ఉండదు.
> కాలం ఎవరినీ ఎప్పుడూ లక్ష్యపెట్టదు.
> భోజనంవేళ టేబుల్ పైనుండి
> క్రింద పడి ముక్కలైన
> గాజు పాత్రపై ఆశనదలి
> క్రొత్తదానికై ప్రయత్నించు.
> లేని పోని మమకారం పెంచుకుని
> పగిలిన గాజుముక్కల నేరి కూర్చుతూ
> తల వాల్చి ఆవేదన పడేకన్నా
> అలౌకిక మేముంది? జీవితంలో."

పై పాదాలు మన సంప్రదాయాన్ని, దాన్ని గుడ్డిగా అను సరిస్తున్న వాళ్ళని సూచిస్తున్నాయి. ఏ కాలంలోనైనా గతం నుంచి వర్తమానానికి సంక్రమించేది చాలా కొద్ది. అంటే ఆ కొద్ది భాగం మాత్రమే జీవం కలిగినదన్నమాట. మిగలకుండా పోయిన దేదీ తిరిగి రాదు. అనంతకాలంలో అనేక పరిణామాలు. పోయినదే నిజమైనది; ఉన్నదంతా భ్రాంతి అనుకోవటం అజ్ఞానాన్ని ఆహ్వానించడ మన్నమాట. పగిలిన గాజుముక్కల్ని అతికించటం చచ్చిన చెట్టుకొమ్మలకి రాలిన ఆకుల్ని జిగురుతో అతికించటంలాంటిది. క్రొత్తని అన్వేషించటం, క్రొత్త రూపానికి ప్రాణం పొయ్యటం వివేకానికి చిహ్నం.

రంగారావుగారి వచన గేయాలు చాలాభాగం చిన్న చిన్న పాదాలతో, తేలికైన పదాలతో నిర్మించబడ్డాయి. ఆయన అన్నట్టు గానే ఆయన గేయాల్లో అంతర్నాదం ప్రవహిస్తూ ఉంటుంది. కవి చెప్పదల్చుకున్న భావం ఏ సంకేతా న్నుపయోగించినా పాఠకునికి ట్రాన్స్‌పరెంటు టీకట్టై ఉండాలన్న తిలక్ అభిప్రాయం రంగారావుగారిపట్ల నిజమైంది.

3

ఈ తరం కవులలో కవితాశక్తి, విమర్శనజ్ఞానం సమపాళ్ళలో మేళవించిలేదు. ఆధునిక తెలుగు సాహిత్యానికి విమర్శన ప్రక్రియద్వారా ఒకస్థితిని కలుగచేసిన కవి విమర్శకుల్లో శ్రీ అద్దేపల్లి రామమోహనరావు ఒకరు. ఆధునిక కవిత్వాన్ని సిద్ధాంత వాదంతో కాక శిల్పవాదంతో విమర్శించే శ్రీ రామమోహనరావు కవిత్వంలో సిద్ధాంతాతీతమైన మానవహృదయ దర్శనమేకాక స్వచ్ఛమైన వచన కవితా స్వరూపం సాక్షాత్కరిస్తుంది. సామాజికమైన లోపాల్ని ఎత్తిచూపినంతగా సమస్యా పరిష్కారానికి సంబంధించిన సూత్రాలు ఆయన కవిత్వంలో కనబడవు. ముఖ్యంగా ఆయన కవిత్వంలో మానవతావాదం, హృదయవాదం కనబడతాయి. వీటితో పాటు కొన్నివచనగేయాల్లో నిరాశావాదం తీవ్రస్థాయిలోవినబడుతుంది. ఈ నిరాశావాదాన్ని ఆధునిక విమర్శకులు కొంతమంది అంగీకరించరు. కారణం—వారి వారి సిద్ధాంతపు తూకపు రాళ్లలో కవిత్వాన్ని కొలవటంవలన. అవాస్తవికమైన ఆశావాదంకంటె వాస్తవమైన నిరాశా వాదంలోంచే నిజమైన ఆశ పుడుతుందనే సత్యాన్ని గ్రహించిన చాలా కొద్దిమంది ఆధునికులలో శ్రీ రామమోహనరావు గారొకరు.

> 'విశీథిని నిరంతమైన ఈ కీచురాయి యొక్క అలాపులో
> అనంతమైన ఈ మానవ సృష్ట్యాదినుంచీ
> మానవుని మనస్సులోని
> తీరరాని కోరికల సముద్రాల తరంగాల
> ఘోష వినిపిస్తోంది!
> చాచినచేతికి అందని అందపు వికటాట్టహాసం
> రేపిన ఏడుపు బావురు మంటున్నది.'

కీచురాయి ధ్వని నిరాశకి, విషాదానికి సంకేతం. కీచురాయి ధ్వనిలో అనేకానేక మానవతరాల ఆశల వైఫల్యాన్ని వినగలిగాడు కవి. ద్రాక్షపళ్ళు తన కందకపోతే అవి పుల్లగా ఉంటాయని మానసికంగా సంతృప్తిపడే నక్కజీవితంకాదు మనిషి బ్రతుకు. తన ప్రగతికోసం ప్రతినిత్యం ఆశల స్వర్గానికి ఊహాల నిచ్చెనల్ని నిర్మించుకుంటాడు మనిషి. అవి నిజం కాకపోతే...

...ఆ బాధే అందని అందపు వికటాట్టహాసం రేపిన ఏడుపు బావురు మంటున్నది' అన్నపాదంలో ధ్వనించబడింది.

ప్రపంచం చైతన్య రహితమైన పెద్ద పాషాణంగా కనిపించింది కవికి. ఈ పాషాణానికి ఎదురొడ్డి, ఢీకొని పరాజయం పొందిన అసంఖ్యాక చైతన్య మూర్తుల్నిగూర్చి కవి పడే బాధ, ఆవేదన భ్రాంతిమయ నిరాశా వాదం కాదు.

> "ఎన్ని జీవసంస్కారాలలోని
> నిత్య చైతన్య మహాసాగర తరంగాలు
> ప్రపంచపు బండకు కొట్టుకుని
> తునాతునకలైపోయాయో!
> ఎన్ని—ఎన్ని—ఎన్ని—ఆశలు
> శిరస్సులు నరకబడిన మొండాలు."

పై నాలుగు పాదాల్లో సంస్కారయుతమైన చైతన్యం యొక్క నిష్ప్రయోజనాన్ని చెప్పి చివరి రెండుపాదాల్లో కవి భాషలో వ్యక్తం చెయ్యలేని ఒకానొక మానసిక అవస్థని ధ్వనింప

శారు. ఎన్ని—ఎన్ని—ఎన్ని ఆశలు అని ఒక పదాన్ని పునరావృత్తి చెయ్యటంలో ఇంకా, ఇంకా ఏదో చెప్పాలనే కవిహృదయం యొక్క ఆవేదన, చెప్పలేని స్థితి— శిరస్సులు నరకబడిన మొండాలు అవటంలో ఆశల విఫలత్వం విశదమవుతున్నాయి. ఇంత దారుణమైన స్థితి అనంతరం ప్రపంచాన్ని గూర్చి కవి దృక్పథం ఏమిటంటే—

> "ఈ ప్రపంచకం యింతే!
> కంటికి అంది నోటికి అందని భోజనం
> కత్తిరించిన చిత్రం
> కొన్ని అంగాలు మిగిలిన శిల్పం
> మొండిగోడల అసంపూర్ణ గృహం."

భోజనం ప్రతివాడికీ ఇష్టమే. ఇష్టమైన భోజనం చెయ్యటం కోసమే అనేక తరాలకి చెందిన మానవజాతుల్లో సంభవించిన అనేక పోరాటాలు, సంఘర్షణలు. ఇక్కడ కంటికి అంది నోటికందని భోజనం. బాగా ఆకలేసి డబ్బుల్లేనిమనిషి బజార్లోపోతూ ఉంటాడు. అతని మార్గంలో అనేకమైన తినుబండారాల దుకాణాలుండవచ్చు. గాజు తలుపుల్లోంచి వాటి ఆకారాలు కనబడుతూ ఉండవచ్చు. ఆవేమనిషి అక్కడున్నాడు, అతను తినటానికి చేయబడిన పదార్థాలూ అక్కడున్నాయి. కాని తినలేడు. కంటికి కనబడినంత మాత్రంతో నోటిదగ్గరకు పదార్థం రాదు. నోటికందాలంటే డబ్బు కావాలి. అది అతనిదగ్గర లేదు. తినలేడు; చూడకుండా ఉండనూలేడు. ఈ స్థితి ఒక్క భోజనానికే కాదు. భోజనం మానవుని జీవితావసరానికి గుర్తు. నోటికందకపోవటం మానవుని అవసరం తీరకపోవటానికి గుర్తు. కత్తిరించిన చిత్రం, మొండిగోడల అసంపూర్ణ గృహం, కొన్నిఅంగాలే మిగిలిన శిల్పం — ఇవన్నీ వికృతత్వానికి చిహ్నాలు. అసమానతవలన ఏర్పడిన వికృతి ఇది. పై పాదాలన్నీ ఈ వికృతికి ధ్వనిగా నిలిచాయి. ఈ వచన గేయంలో సమాజస్థితిని ఫోకస్ చెయ్యటమే జరిగిందికాని తత్‌స్థితి నిర్మూలనమార్గం మిరూపించబడలేదు. ఇది కవి బాధ్యత ఎంతమాత్రమూ కాదని నా అభిప్రాయం. కవి తన కాలంనాటి సమాజస్థితిని విశ్లేషిస్తాడు. పరిష్కారం పాలకునిది; ప్రజలది. అయితే పరిష్కారం చూపించకూడదని నా ఉద్దేశంకాదు. చూపించకపోవడం కావ్యదోషంమాత్రం కాదనే నేననేది.

వచనగేయం కవి హృదయోద్రేకానికి స్పష్టమైన ప్రతిబింబం. సంప్రదాయపద్యం కవి హృదయోద్రేకానికి ప్రతిబింబం కాదా? అనే సందేహం కలగవచ్చు. వచనకవితలోనున్న స్వేచ్ఛ పద్య కవిత్వంలో లేదు. లేనప్పటికీ దాని విశిష్టత దానికున్నది. పద్య కవితా ప్రక్రియని కించపరచటం నా ఉద్దేశం కాదు. ఈ విషయాలలోఉన్న అభిప్రాయభేదాల్నిగూర్చి వ్యాసాంతం వివరంగా వివరిస్తాను.

ఈనాటి సామాజికదుస్థితిని వర్ణించటానికి వచనగేయమే స్వచ్ఛమైన వాహిక. వచనగేయంలో భవిష్యత్ సమాజంయొక్క స్వరూపాన్ని స్పష్టంగా చూడగలిగాడీ కవి. ఈ భవిష్యద్దర్శనంలో ఆగామి ఆశావాదం లేదు. భవిష్యత్తు ఇప్పటికంటే ఇంకా భయంకరంగా ఉండవచ్చుఅనే ఊహామాత్రమే కన్పిస్తుంది. దానికి సహేతుకమైన కారణాలు 'భయంకర భవిష్యత్తు'అనే ఖండికలో వివరించారు.

> 'సంప్రదాయోపన్యాసాల తెరల వెనుక
> నిత్యనైమిత్తిక ధర్మానుష్ఠానపు ముసుగుల క్రింద
> నిర్మినృర్యాసన్యాసాల ప్రకటనల మరుగున
> దైవభక్తి ప్రకంపిత శరీరాల అణువణువునా
> స్వార్థం! కామం! డబ్బు!
> అనాథుల్ని రక్షిస్తానని సమాజంపథ్య
> తలయెత్తి నిలబడి కంకణం కట్టుకుని
> ఆ కంకణాన్నే అనాథుల పీకలకి బిగించే
> అనాథరక్షకుల నరనరాన
> అసమర్థుల హక్కుల్ని కాపాడుతానని
> నెత్తిన జండా పాతుకుని
> ఆ జండాతో శవాల్ని కప్పుతున్న మహా
> సమర్థుల అణువణువునా
> స్వార్థం! కామం! డబ్బు!'

సాంఘికవ్యవస్థలో మతం, సంప్రదాయం, సంస్కరణ, రాజకీయం ఏవైపుగా ప్రయాణం చేస్తున్నాయో పై పాదాల్లో పేర్కొనబడింది. కంచే చేనుమేస్తే అనే సామెతకి ప్రబలోదాహరణలు పై పాదాలు. వర్తమాన సమాజంలో మానవప్రవృత్తిని చిత్రించటంలో చక్కని ఉపమానాల్ని తీసుకున్నారు.

> 'ఆధునికకాలమనే రక్తసంధ్యలో
> ఆధునిక మానవుడనే లయకారుడు
> స్వార్థం! కామం! డబ్బు! అనే భయంకర త్రిశూలంతో
> విలయతాండవం చేస్తున్నాడు
> అతని వొంటిమీంచి రాలే బూడిదలోనుండి
> భవిష్యత్ సమాజం రూపం దిద్దుకొంటోంది.'

లయకారుడు శివుడు. శివుడు విలయతాండవ చెయ్యటం, అతని మూడోనేత్రంనుండి రాలే అగ్నికణాలకి అన్యాయం అక్రమం ఆహుతికావటం సాంప్రదాయకమైన నమ్మకం. ఇక్కడ లయకారుడు ఆధునిక మానవుడు. అతను ధరించిన త్రిశూలం ధర్మానికి ప్రతీక కాదు. ధర్మాన్ని హత్యచేసే స్వార్థం! కామం! డబ్బు! అనే మూడు శూలాల్ని కలిగిఉంది. అతని వొంటినుండి రాలే బూడిదలోంచి భవిష్యత్ సమాజం రూపం దిద్దుకోవటం అంటే

కాపోతే సమాజం శ్మశానవాటికకి దగ్గరగా ఉంటుందనే అర్థం. ఎంతకాలం ఈ సమాజాన్ని స్వార్థం! కామం! డబ్బు పాలి స్తాయో అంతకాలం సమాజానికి ఈ దుస్థితినుంచి విముక్తిలేదు అని చెప్పటమే ఈ గేయంయొక్క ప్రధానలక్ష్యంగా కనబడుతుంది.

'రాతిబొమ్మ' అనే కావ్య ఖండికను దుష్ట సంప్రదాయానికి, దుర్మార్గ మనస్తత్వానికి, గుడ్డి దైవభక్తికి ప్రతీకగా తీసుకో వచ్చు. రాతిబొమ్మ అని పేరు పెట్టడంలోనే ధ్వని ప్రాముఖ్యం ఉన్నది. రాతిబొమ్మ జడత్వానికి సంకేతం. చైతన్య శూన్యమైనది ఏదైనా జడమే.

"సమాజపు రాళ్ళ బాటపై స్వార్థపరుల ఎదురుదెబ్బ తగిలి
నెత్తురోడ్చే బ్రతుకుల్ని ముందు వదిలావు
సమర్థుల కళ్ళలోని క్రౌర్యపు మంటల్లో
కాలిపోయి కూలబోతున్న అసమర్థుల ఆశాగృహాన్ని చూసించావు
శిథిల సుప్రతున సంఘపు నడి కొప్పునుండి
జాలిగా నిక్కంగా, ఏకధారగా ప్రవహిస్తున్న
ఒక మహాభయంకరమైన అశ్రుశోణి తరంగాల మధ్య
దాన్ని అతి జాగ్రత్తగా నిలబెట్టావు
దానికి చీమంత కదలికలేదు.
అది రాతిబొమ్మ—"

స్వార్థపరులు అమాయకుల్ని తినేసినా, బలవంతులు బల హీనుల్ని మింగేసినా మన సంప్రదాయానికి, మన దేవుళ్ళకి చేరేత్తే యోగ్యత లేదు. ఈ అన్యాయా లన్నీ సంప్రదాయం ముసుగులో, మతం మత్తుమందులో, రాజకీయపు నిషాలో వృద్ధిస్తున్నాయి.

"నింగీ రోదసీ, సముద్రమూ ఏకమై
వినూతన కాలమేఘాన్ని సృష్టించి
దేశం శిరస్సుపైన కమ్ముకొస్తున్నా
ఆ రాతిబొమ్మ చలించదు—ఫలించదు. చలించదు.
ఆ రాతిబొమ్మ మారదు. నిన్ను మారనివ్వదు."

ఇక్కడ నింగీ, రోదసీ, సముద్రమూ ఈనాడూ అంతా లేవు. ఇవి మానవజాతి ఐక్యతకి సంకేతాలు, వినూతన కాలమేఘం గతానుగతమైన సంప్రదాయాల మూఢ విశ్వాసాల నుండి విడివడి, జాతి, కుల, మత రహితమైన విశ్వమానవతా వాదానికి చిహ్నం. రాతిబొమ్మలో చలనం లేకపోవటం మార్పుని అంగీకరించని మూఢత్వానికి నిదర్శనం. ఈ గేయంలో మాత్రం యువతరానికి మహోత్తర సందేశం అందించడం జరిగింది.

"ఏ సర్వ సంకల్పంలో
ఒక మహాశక్తివంతమైన గొడ్డలిని తెచ్చి
ఏ సర్వ ధైర్యంతో
ఒక మహాదీక్ష వహించి
ఆ రాతిబొమ్మని వెయ్యివ్రక్కలుగా భేదించు
ఆ వ్రక్కలమీదనుండి ఈ లోకాన్ని ముందుకు నడిపించు."

ఈనాటి యువతరానికి కావలసిన సందేశం కూడా ఇదే.

రామమోహనరావుగారి వచన గేయంలో ఉన్న గొప్పతనం ఏమిటంటే—అనుప్రాసలనుంచి, అంత్యప్రాసలనుంచి వచన గేయం సంపూర్ణ స్వేచ్ఛని పొందటం. వచన గేయంయొక్క బహిర్లయకీ, అంతర్లయకీ ఎంత మాత్రం అప్పంరాని శైలి, పాదాల విరుపూ ఆయన వచన గేయానికి ఆయనదైన ఒక ముద్రని వేశాయి. వర్తమాన వచన గేయ కవుల్లో రామమోహనరావు గారి స్థానం మొదటివరుసలో ఉంటుంది.

4

సాహిత్యంలో సామాజిక దర్శనం నాడూ ఉన్నది; నేడూ ఉన్నది. అయితే ఈ సామాజిక స్వరూపాన్ని కవులు వారి వారి సిద్ధాంతాలకి అనుకూలంగా ప్రతిపాదించటం జరిగింది. ఈ ప్రతి పాదనలలో కొన్ని విదేశీయ వాసనల్ని పులుముకొన్నవి; మరికొన్ని స్వదేశీయ సంప్రదాయాలని ఆశ్రయించినవి. మన సమస్యల్ని విదేశీయ పద్ధతులలో కాకుండా మన జాతీయ పద్ధతులలోనే పరిష్కరించుకోవాలనే సిద్ధాంతం చేతనావర్త కవులలో కనబడు తుంది. మన సంస్కృతి పునాదులమీదనే భవిష్యత్ సమాజ భవనాన్ని నిర్మించాలనే వాదం ఆమోద యోగ్యమైనదే. పాశ్చాత్య సాహిత్యంలో కనిపించే పరిణామాలన్నింటినీ సాదరంగా ఆహ్వానిస్తూ ఆ ప్రక్రియా వైవిధ్యాలని నిర్మాణాత్మకంగా తెలుగు కవిత్వంలో ప్రతిఫలింపజెయ్యటం చేతనావర్త కవుల దృక్పథంగా కనబడు తుంది. చేతనావర్త కవులు నలుగురు: వే. నరసింహారెడ్డి, పేర్వారం జగన్నాథం, సంపత్కుమార, సుప్రసన్న. వీరి కావ్యసంకలనం చేత నావర్తం.

"విప్లవం విహంగంలా ఎక్కణ్ణించో ఎగిరిరాదు
మన దేహంలో రక్తం ఇంకా ఇగిరిపోలేదు. పోదు
ఇదిగో ఆత్మ విశ్వాస శ్వాస పీల్చుకో
ఇక మరణం లేదు
ఇది సియిల్లేమవా! పెల్చుకో
ఇరుల శరణనరాదు."

శ్రీ వే. నరసింహారెడ్డి పై గేయంలో జాతీయ భావన స్ఫురిస్తుంది. విప్లవం జాతి రక్తంలోంచి పుట్టవలసినదే గాని విదేశ రాజకీయ నినాదాలతోరాదని ఆయన అభిప్రాయం. భావనలో విశ్వాసం ఉన్నంతకాలం వ్యక్తి అదర్శాలనుంచి మృతుడుకాడు. ఇది నీ

ట్లోనుమా! అనేపాదంలో స్వదేశం, ఒరుల శరణాగరాదు అన్న పాదంలో మన కాళ్లమీద మనం నిలబడవలసిన అవసరం ధ్వనిస్తున్నాయి. 'అడు గడుగునా అడుక్కుతినే బడుగు జాతి అడుగంటక తప్పదు' అన్నపాదాల్లో ఈ నిజమే రుజువవుతున్నది.

నరసింహారెడ్డి వచన గేయంలో విలక్షణమైన తపనా శైలి, వ్యంజకత్వం ప్రధాన లక్షణాలు.

"ఇవ్వాళ తేళ్లవి ఉడుత మొగాలు
తోడేళ్లవి లేళ్ల తోళ్లు
ఇవాళ కంసుడు ఖాదీహంస
శిశుపాలుడు నీ గుడి పూజారి."

ఈ నాలుగు పాదాల్లో నేటినాయకుల సంపూర్ణ స్వరూపం ఆవిష్కృతమైంది. ఉడత అపకార రాహిత్యానికి, లేడి అమాయకతకి, హంస ప్రశాంతతకి, పూజారి పవిత్రతకి ఉదాహరణలు. ఉడత స్థానంలో తేలు, లేడి స్థానంలో తోడేలు, హంస స్థానంలో కంసుడు, పూజారి స్థానంలో శిశుపాలుడు రక్షక కవచాలు కప్పుకుని రంగంలోకి ప్రవేశించారు. 'కంసుడు ఖాదీ హంస' అదే పాదంలో గాంధీ సిద్ధాంతాల నివేదికలు మీద వెదజల్లి చీకట్లో లాల్చీ జేబులు నింపుకుంటున్న కుహనా ప్రజాస్వామిక వాదులు కనిపిస్తారు.

"ఈనాడు నా దేశాన్ని
సిడులు పాలిస్తున్నవి
నా నడుమ గోడలు మొలుస్తున్నవి
ఇక్కడ శవాలు సంచరిస్తున్నవి
విశ్వాసాలు తీస్తున్నది."

ప్రజల్లో పేరుకుపోతున్న అశాంతికి, నిరాశకి, విషాదానికి మూలం వాళ్లని పాలిస్తున్నవారు. నాయకులని పిడులతో పోల్చటంలో గల ఔచిత్యం ఇదే. వ్యక్తికీ వ్యక్తికీ మధ్య మతం, కులం, భాష ప్రాంతీయతత్వం మొదలైన అనేక అడ్డుగోడలు విశాల మానవతా దృక్పథానికి అడ్డుగా నిలిచాయి. ఆకలి ఆవేదనతో మానవుడు జీవచ్ఛవంగా మారి నిరాశలో నిట్టూరుస్తున్నాడు. పై పాదాలు సామాజికమైన కవి ఆవేదనకి తార్కాణాలు.

గవర్నమెంటు ఉద్యోగులు ముఖ్యంగా ఎన్.జి. వో. ల జీవిత విధానాన్ని చక్కగా చిత్రించా రీయన. వచనగేయంయొక్క నడక, శైలి ఒకదానిలో ఒకటి ఐక్యమై గేయంయొక్క ఆకృతిని విందుగా రూపొందించాయి ఈ పాదాలు.

'ఎప్పుడూ చాలని దుప్పటే కప్పుకుంటూరు
కలల్ని తింటూరు కష్టాల్ని కంటూరు
వాళ్ళు పైళ్లకుకట్టిన ప్రాణంలేని తాళ్ళు
కోరలూ కండ్లూ పెరికేసిన పాములూ తేళ్ళు
జరుగుబాటు గాత్రం తప్ప
తిరుగుబాటు సూత్రం తెలియనివారు
వాళ్ళు గవర్నమెంటు ఉద్యోగులు యోగులు
బానిసలుగా పడిఉంటామని

అగ్రిమెంటువ్రాసి ఇంక్రిమెంటుకే తపన్ను చేస్తున్నారు.'

ఈ దేశంలో గోవు పరమపవిత్రంగా భావించబడుతుంది. దేశాన్ని గోవుతో పోల్చటం ఈ దేశంయొక్క ధార్మికప్రవృత్తికీ, దేశసౌభాగ్యానికి చిహ్నం. గోవులాంటి దేశాన్ని పెద్దలు తినేస్తున్నారు అంటే దేశసౌభాగ్యాన్ని కొంతమంది మాత్రమే తమ సొంతం చేసుకుంటున్నారని అర్థం. దేశసౌభాగ్యాన్ని వారి సొంతం చేసుకుని దేశదౌర్భాగ్యాన్ని ప్రజలపరం చేశాక దేశస్థితిని చక్కని ఉపమానంతో వర్ణించారు.

'పెద్దలూ గద్దలూ తినేసినాక
తోలూడదీసి వ్రేలాడేసిన గోమాతలా ఉంది దేశం.'

శ్రీ పేర్వారం జగన్నాథం వచనకవితా ఖండికలకి వ్యంజకత, సెటైరు జీవలక్షణాలు. కావ్యఖండికలలో అంతశ్చేతన కంటె, బహిశ్చేతనే ఎక్కువగా కనిపిస్తుంది. 'దైవాసుర పరస్పర సంద్విభాగ యోగః' అనే ఖండికలో నాయకుల్నిగూర్చి ఇలా రాస్తారు.

'వాళ్ళా—
మాతోటి వాళ్లే
మా మనుష్య కోటిలోని వాళ్లే
మాకన్నా నాజూకుగా కనిపిస్తారు
మధురంగా మాట్లాడుతారు
మల్లెలలాంటి వస్త్రాలుతప్ప
మరేవీ తొడిగేరకం కాదు
వేషభాషల్లో ఏమాత్రం
కసాయితనం కనిపించదు
అందం ఆనందం
వాళ్ల జీవిత పరమావధి.'

పై పాదాల్లో ప్రతిపాదంలోనూ వెక్కిరింత, దాంతోపాటు వాచ్యార్థం ఒక్కటే కాక వ్యతిరేకార్థ స్ఫురణ గోచర మవుతాయి. మాతోటివాళ్లే మా మనుష్యకోటిలోని వాళ్లే అనటంలో ఒకవైపు వెక్కిరింత మరోవైపు మనుషులతో సమానంకాదు అనే అర్థం స్ఫురిస్తుంది. మాకన్న నాజూకుగా కనిపిస్తారు మధురంగా మాట్లాడుతారు అంటే కనిపించటం వరకే నాజూకుతనంకాని కంటికి కనిపించనిలోపలి పాశవికప్రవృత్తి విశదమవటంతో పాటు మాట్లాడటం మధురంగానే ఉంటుంది గాని చేష్టలు మాత్రం కర్కశంగా ఉంటాయనే అర్థం ధ్వనిస్తోంది. పలుకులు మల్లెపూలులాంటి వస్త్రాలు తొడిగితే మసిబొగ్గులలాంటి వస్తాలు

పాలితులు తొడుగుతారన్నమాట. వేషభాషల్లో ఏమాత్రం కసాయి తనం కనిపించదు; చేతలుమాత్రం కసాయిచేతలే. అందం ఆనందం పాలకుల జీవితపరమావధి. వికృతి, విషాదం పాలితుల జీవిత పరమావధి. ఇట్లా ఈ పాదాల్లో రాజకీయాలమీద వెక్కిరింత వ్యంజితం చేయబడింది.

నేటి సమాజాన్ని ఈయన దర్శించిన తీరు మెచ్చతగినది. బలవంతుడు బలహీనుణ్ణి అడుక్కితొక్కేసే విధానానికి ఈనాటి సమాజం ప్రతీక.

> 'ఈ ఇల్లు కీచకుడు సైరంధ్రికోసం ఎదురుచూస్తూ
> ఉబుసుపోకకై కట్టుకున్న
> ఇసుకగూడులా ఉంది
> బకాసురుడు వండుకుని పారేసిన
> పగిలిన కుండలాగుంది.'

కీచకుడు, బకాసురుడు ఇద్దరూ ఒక్కొక్క రకమైన దుర్మార్గత్వానికి ప్రతిరూపాలు. కీచకుడు స్వవాంఛా ఫలసిద్ధి కోసం సమాజాన్ని సైతం లక్ష్యపెట్టని పరమదుర్మార్గుడు. బకాసురుడు సమాజసంపదనంతటిని తానొక్కడే అనుభవించాలను కునే పరమభయంకరుడు. ప్రపంచం కీచకునికి ఎంత అల్పంగా కనబడిందో ధ్వనింపజెయ్యటమే 'ఇసుకగూడు'అన్న పదంయొక్క ఉద్దేశం. పగిలినకుండ ప్రజాజీవితానికి ప్రతీక.

'యదా యదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత' అనే కావ్య ఖండిక దిగంబర కవులపై సెటైర్‌గా కనబడుతుంది.

> 'అందుకే మళ్లీ రాస్తున్నాం—
> మా కాలమానం వేరు
> మా ఋతువులు వేరు
> మా తిథి వార నక్షత్రాలు వేరు
> మా వేష్టాలు వేరు
> మా పేటలే వేరు
> చివరికి మేం తినే తిండే వేరు.'

దిగంబర కవులు తమ పేర్లనే కాకుండా కాలమానాన్ని కూడా మార్చారు. ఇది దిగంబరశకంఅని, ఋతువులు ఆరని, ఇంకా ఏవేవో చెప్పారు. వాటికి సెటైరు పైపాదాలు. 'చివరికి మేం తినే తిండే వేరు' అన్నపాదం ధ్వనిప్రాయంగా ఉంది.

> "మేం 'వన్‌అయ్యో' కు కానేకాం వారసులం
> ఆకాశంనుండి ఊడిపడ్డ దేవారసులం
> కలంబడితిమా కానేకాం మనుష్యులం"

'వన్‌అయ్యో' అనటం దిగంబరకవుల్లో కనబడే కృతకత్వాన్ని, వికృతత్వాన్ని ధ్వనింప జెయ్యటం. కలంబడితిమా కానేకాం మనుష్యులం అనటం వారు రాసే అశ్లీలాల్ని గుర్తు చెయ్యడం.

'పట్టాలు తప్పిన బండి' 'ది గ్రేట్ ఇండియన్ పర్సన్' మొదలైన వచన గేయాలన్నీ సెటైరికల్‌గా ఉంటాయి. ఈయన వచన గేయంకూడా క్లిష్టతకి దూరంగా స్పష్టంగా ఉంటుంది. అంత్య ప్రాసలమీద ఈయనకి మోజెక్కువ. అంత్యప్రాసలు కావాలని వేస్తే అవి కావ్యఖండికని ఎట్లా వికృతం చేస్తాయో చూపటానికి ఈ క్రిందిపాదాలు ఉదాహరణలు.

> "ఈ మగడు నాకొద్దు
> పీడనలే తుమ్మమొద్దు"
>
> "ఉన్నదానికి బిల్లులు మెండు
> చుట్టూరా నల్లులదండు"
>
> "నారదుడు చెప్పగా విన్నాను నిన్న
> నీడి ఆయుర్దాయం రేపటితో నిండుతున్న"

ఇలాంటి లోపాల్ని మినహాయిస్తే జగన్నాథం వచన గేయం సాఫీగా సరళంగా సాగిపోయే తత్వం కలది.

వే. నరసింహారెడ్డి, పేర్వారం జగన్నాథం తమ వచన గేయాల్లో ఎక్కువగా సాంఘిక వేదనని చిత్రిస్తే సంపత్కుమార, సుప్రసన్న తమ వచన గేయాల్లో వ్యక్తియొక్క అంతర్వేదనని చిత్రించారు. అయితే వీళ్లలో సామాజిక వేదన లేదని అర్థం కాదు; వైయక్తిక వేదన బహుళమైనదని మాత్రమే. సంపత్కుమార ఛంద శ్శాస్త్రంమీద అధికారం కలిగినవాడు; దాని రహస్యాల్ని ఆకళింపు చేసుకొన్నవాడు. ఈ కవిలోని అంతర్వేదన, మన శ్రోతంతో వ్యక్తమవుతుంది.

> "నీ వెంట రాలేదని కోపగించకోకు
> నిన్ను వెన్నంటి వచ్చే వీలులేదు నాకు
> ఇచ్చిన చేయూత నెందుకో వెనక్కులాక్కుని
> క్షణంలో కన్పించని తటిద్రేఖలమాదిరిగా
> అదృశ్యమవుతావని నేనకున్నానా"

ఇక్కడ నీవు అనేపదం దైవ సంబంధమైనది. అతన్ని వెన్నంటి వెళ్లలేని తన మానసిక అశక్తతని విందించుకుంటాడు ఈ వచన గేయంలోనే వేరొకచోట పెరిగిపోతున్న మానవ మేధను గూర్చి దిగిపోతున్న మానవ హృదయాన్ని గూర్చి చెబుతాడు. పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానంతో మనిషి యంత్రంగా మారుతున్నాడే తప్ప మనిషిగా నిలబడే అవకాశం లేదనే జీవవేదన ఈ పాదాల్లో వ్యక్తమవుతుంది.

> "కొండ గుహల్లోంచి చంద్రశాలల్లోకి
> బండలు తొల్చించి ప్రవాహాలు నిలుపుతుంచి

ఆకాశం అధిగమించి అనిలాన్ని బంధించి
కృశాను రేఖావికాస విలాసాన్ని కుదించి
ఒక ప్రక్కగా లోకాలోకనాన్ని దాటిపోతూ
మరొక ప్రక్కగా ఊహించని అడుక్కు జారుతూ
బంధం ఏదో అనుబంధం ఏదో తెలియక
మరల్లో బిగిసిన మనస్సు విడివడటం కుదరక..."

చివరికి ఈ బిగిసిన దిగుబాటునుంచి పైకి లేస్తానా? ఎప్పుడైనా ఏ వెంట రాగలుగుతానా? అనే నిస్పృహలోకి జారి పోతారు. తన్ని తను గుర్తించుకోవాలనే తలంపు, ఆ గుర్తింపు పై అంతస్సమాధిలోకి పోవాలనే ప్రయత్నం 'అంతర్నయం'లో వ్యక్త మవుతుంది.

"నన్ను నేను బాగా పరీక్షించుకుని
నేను కానిదాన్ని దులుపుకుని
నన్ను నాలో లయం కానీయండి"

'గృహ ప్రవేశం' అనేఖండిక ప్రస్తుతకాల తత్వాన్ని గూర్చి చెబుతుంది. బయటికి కనిపించే మనిషి లేడిలాంటి అమాయకుడు. అతని లోపలనున్న మరో మనిషి పులి లాంటి క్రూరుడు. బయటి మనిషి సాంఘిక నీతి నియమాల సూత్రాలకి అనుకూలుడు. లోపలి మనిషి వ్యక్తి స్వార్థానికి సంఘాన్ని బలిపెట్టే పశువు.

"ఇప్పుడు—
కాలానికి కట్టిన ఇల్లు
దీని పైస్వరూపాన్ని మాత్రమే చూసి గాబరాపడకు
'ఇదేమిటి అంతా పర్ణశాల మాదిరుంది' అనకు
లోపలనొక్క అడుగువేసి వోసారిచూడు
అంతే, చూపులో ఇది వైకుంఠానికి జోడు."

పంపత్తుమార వచన గేయంలో ఉన్న ఒకే ఒక లోపం శైలి. వచన గేయాల్లో ఆయన అక్కడక్కడా ప్రయోగించే సమాసాలు వచన గేయానికి నొదిగేవి కాకపోగా పూర్తిగా గ్రాంథిక వాసనని కలిగి ఉంటాయి. ఈ లోపం అయినా ఆయన వచన గేయంలో విస్తృతంగా లేదు. స్వల్పం మాత్రమే.

సుప్రసన్న వచన గేయం వ్యక్తి అంతశ్చేతనాభి ముఖంగా సాగిపోతుంది. ఆధునిక కాలం యొక్క ప్రధాన లక్షణం వ్యక్తి నియమాలనుంచి వేరై తన మార్గంలో తను పరిపూర్ణ తని సాధించడం. ఈ 'వైయక్తిక పరిణతి' అనే పదాన్ని వ్యక్తి స్వార్థంగా పొరబడ నక్కర్లేదు. వ్యక్తి పరిణతి అనేపదంలో వ్యక్తి స్వార్థం ధ్వనించదు. వ్యక్తి మానసికంగా ఔన్నత్య శిఖ రాల నందుకోవటానికి అతని మార్గాన్ని అతను అన్వేషించు కుంటాడు. ఏఒక్కమార్గాన్ని అతికట్టే అవకాశం మరొకడికి లేదు. ఎవడిదారి వాడిదే. ఆ దారిలో అతను ఎంతవరకూ పరి పూర్ణతను సాధించాడు అన్నదే ఆలోచించతగ్గది. తను ఆశించే ఉన్నతస్థితిని పొందటంలో మరొకడికి అపకారం జరగకపోవడమే అతను పరిణతిని సాధించడం అన్నమాట. వ్యక్తులు భిన్నం కావచ్చు; వారివారి మార్గాలు వేరుకావచ్చు. కాని వీరందరిలోనూ ప్రవహించే చైతన్యస్రవంతి ఒక్కటే. ఉష్ణశక్తి, విద్యుచ్ఛక్తి గాను, విద్యుచ్ఛక్తి కాంతిశక్తిగాను మారినట్లుగానే చైతన్యజ్యోతి వారి మార్గానికి అనుకూలంగా పరిణామం చెందుతుంది.

'ఎవడికివాడే ఒక వెలుగునీడల సంపుటి
ప్రపంచమంతా చైతన్యకల్లోల సంవర్తావృతి
ప్రతిఒక్కడూ ఒక దీపశిఖ
ఎవడి మనస్సు వాడికే ఆవిష్కారశాల
కాని ఒక్కటే ప్రాణస్రోతస్సు అంతటికీ
అదే జీవనధార'

అయితే ప్రపంచంలో ప్రతివాడూ తనని వదలి జరిగే అన్యాయాలన్నింటికి రెండోవాడే బాధ్యుడని అనుకోవటం, తన అస్తిత్వపు అహంకారంలో రెండోవాడి ప్రాముఖ్యం విస్మరించటం జరుగుతుంది.

'ఇక్కడ ఎవడికివా డొక్కడే ఉన్నట్లు
ఇతరుల అస్తిత్వానికి ప్రమాణమే లేదాయె'

'అన్నా'అనే కావ్యఖండికలో తనలోని తనని గుర్తింపజేసిన చైతన్యశక్తినిగూర్చి చెబుతారు.

'అన్నా ఒకనాడు నాలో నేను లేనప్పుడు
అహంకృతిని నాలో రేపింది నీవు
నేను బావిలో చెకచెక లాడేటప్పుడు
నన్ను పావురంగా మార్చింది నీవు'

మొదటి రెండు పాదాల్లోనూ మానవత్వం, చివరి రెండు పాదాల్లోనూ విశాలతత్వం వ్యక్తం చేయబడ్డాయి. నాలో నేను లేక పోవడమంటే మనిషిలో మానవత లేకపోవటం. బావిలో చెకచెక లాడటమంటే వ్యక్తిసంకుచిత పరిధిలో జీవించడం. పావురంగా మారటం సంకుచితపరిధిలోనుండి బయటపడి విస్తృతమూ, విశాలమూ అయిన విశ్వాన్ని దర్శించడం.

విూట నొక్కనంతవరకూ విద్యుచ్ఛక్తి స్వరూపం కాన రానట్లుగానే ఆత్మలో అంతర్లీనమైన చైతన్యం స్పందన కానంత కాలం గూఢంగానే ఉంటుంది. చైతన్యస్పందన కలిగిననాడు అది వ్యక్తియొక్క బాహ్యపరిధుల్ని అధిగమించి, బాహ్యప్రపంచయుములకి అలవాటుపడిన ఇంద్రియాలకి నూతనమైన అంతర్లోకాలను చూపిస్తుంది. ఆనాడు జీవితం ఆనందవాటిక, విద్యుద్వల్లిక. 'ఆవర్తనైభ్రమణ' అనే ఖండికలో ఇదే చెబుతారు.

'ఆత్మలో నిస్పందమైన చైతన్యం
అవధులు దాటి, అంతఃకరణాన దూకి
మనోఽంబుధులలో లయించి
జడములైన ఇంద్రియాల పొరాల్లో
చేతః జ్వాల మండించిన
ఒక్క వ్యక్తమైన క్షణం
ఒక ఆనంద విద్యుద్వల్లిక'

ప్రతివ్యక్తి ఈనాటి వ్యవస్థలో మార్పుని కోరుతున్నాడు. అయితే ఆ మార్పు ఎలా వస్తుంది? అన్న ప్రశ్నకి అనేక సిద్ధాంతాలు అనేక సమాధానా లిచ్చాయి. ఉన్నస్థితి సమూలంగా విధ్వంసం అయితేగాని వేరొక కొత్త స్థితి ఏర్పడదని ఒక అభిప్రాయం. ఈ సమాజం అంతా బూడిదైపోతే ఆబూడిదలోంచి మరో నవసమాజావిష్కరణ జరుగుతుందని ఒక సిద్ధాంతం. ఇది కొంచెం తీవ్రమైన వాదం. ఈ వాదం క్రమేపీ రాజకీయాల్లోంచి కవిత్వంలోకి కూడా ప్రవేశించింది. ఈ మార్పుకి మూలం మనిషిని, మనిషి మేధలోంచి, చైతన్యంలోంచి, క్రియా రూపంలో ఈ మార్పు రావచ్చుని సుప్రసన్న అభిప్రాయం.

"శ్మశానంలోంచి రానక్కర లేదు మార్పు
సౌందర్య నిరంతరదాన్వేషణలోంచి రావచ్చు
సంపూర్ణత కోసం, సమగ్రత కోసం మనం చేసే
తపస్సులోంచి రావచ్చు"

ఇదొక్కటే కాక కాలం మీద కూడా కొంత మందికి కొన్ని అభిప్రాయాలున్నాయి. గతమంత చెడ్డదని, వర్తమానాన్ని గతంతో సంబంధం లేకుండా మరమ్మతు చేస్తేనేగాని భవిష్యత్తు బాగుండదని. ఈ అభిప్రాయాలు ఈనాటి సమాజంలో జబ్బియుంగా ఉన్నాయి. గురజాడ అన్నట్లుగా "మంచి గతమున కొంచెమేనోయ్" అయినప్పటికీ ఆ కొంచెం మంచితోనే పాతకొత్తల మేలుకలయిక సంభవించేది. 'ఇంద్రియాలు నిద్రపోయిన వేళ' అన్న గేయంలో కాలసమన్వయం ఆమోద యోగ్యంగా ఉంది.

"భవిష్యత్ సరోవరాలలోకి
భూతకాలపు నదులను మళ్లించి
వర్తమాన శతపత్రవల్లికలు వెలయించి
ఎక్కడిదో ఎప్పటిదో తెలియని
అపూర్వమైన సౌందర్య పరీమళం వీచేచోట..."

సుప్రసన్న వచన గేయాల్లో కూడా అక్కడక్కడ అంత్య ప్రాసలు, కృతకమైన శైలి వచన గేయపు నడకకి అడ్డం తగులు తున్నాయి. ఉదాహరణకి—

ఆరు ఋతువులు సరోవరముకన్న
ఆమె తనువులావణ్యము మిన్న'

ఇది కొట్టొచ్చినట్లు కనబడే అంత్య ప్రాస.

"నీడలకోసమైన పరుగు, చీకటి
గోడలను తాకగానే ఉడుగు"

పై రెండు పాదాల్ని ఆవిధంగా విరవటంతో ప్రయోజనం కనిపించదు.

"నీడలకోసమైన పరుగు,
చీకటి గోడలను తాకగానే ఉడుగు"

ఇలా విరవవలసింది పాదాల్ని. ఇలా విరవంగానే పరుగు, ఉడుగు పాదాంతాల్లో ప్రవేశిస్తున్నాయి. అంచేత అంత్య ప్రాస తప్పనిసరి అవుతోంది. అంత్య ప్రాస లేకుండా చీకటి పదాన్ని మొదటి పాదం చివర ఉంచినందువల్ల పాదాల విరుపులో కృతకత్వం ప్రవేశించింది. "శిలాసరోజ స్నిగ్ధ ఆలోలమానేంద్ర ధనువు" లాంటి పాదాలు వచన గేయంలో అమరవు. ప్రాసల్ని గూర్చి కృతకశైలిని గూర్చి ఈనాడు ఆలోచించవలసిన అవసరంలేదు. వచన గేయం ఏనాడో ఈ తొడుగుల్ని విసర్జించింది.

5

తెలుగు వచన కవిత్వంలో తొలితరం కంటె విధానంలో ఇంకా ముందు చూపు చూస్తున్న కవితాపరిణామ దశ ప్రతీక కవిత్వదశ. ఈ ప్రతీకకవిత్వానికి మాతృస్థానం ఫ్రెంచి దేశం. ఫ్రెంచి సామాజిక వ్యవస్థలో పొడచూపిన అనేక పరిణామాలు సాహిత్యంపై తమ ప్రభావాన్ని గాఢంగా ముద్రించాయి. ఫలితమే ప్రతీక కవిత్వం. మలార్మే, బాడ్లేర్‌వంటి ఫ్రెంచి కవులు ఆనాటి కవిత్వంలో ప్రతీకవాద సిద్ధాంతంతో అనేక నూతన కవితా రీతుల్ని నెలకొల్పారు. ఆ తరువాత కూడా తత్కవితా ప్రభావం ఆంగ్ల మహాకవి అయిన టి. ఎస్. ఇలియెట్‌పై తీవ్రంగా పని చేసింది. ఆంధ్ర సాహిత్యంలో వర్తమాన తరంపై ప్రతీకకవితా ప్రభావం కొద్దిగానో, గొప్పగానో పనిచేస్తూనే ఉంది. ఈ విధానాన్ని సంపూర్ణంగా తన సొంతం చేసుకున్న వర్తమాన వచన గేయ కవి వేగుంట మోహనప్రసాద్.

ప్రతీక కవిత్వంలోని మూలతత్త్వ మేమిటంటే—కవి తను చెప్పదల్చుకున్న భావాన్ని కొన్ని సంకేతాలద్వారా వ్యక్తం చెయ్యటం, అంటే సంకేతాలు కవియొక్క భావానికి, పాఠకుని అర్థగ్రహణ శక్తికి మధ్య వాహికగా పనిచేస్తాయి. చీకటి విషాదానికి, సముద్రం గాంభీర్యానికి, స్వేచ్ఛా ప్రవృత్తికి సంకేతంగా చాలామంది కవు లుపయోగించారు. వీటిని సహజంగా సాంప్రదాయక సంకేతా లంటాం. అయితే ప్రతీక కవిత్వం ప్రచారంలోకి వస్తున్నకొలదీ సాంప్రదాయక సంకేతాల స్థానాన్ని వ్యక్తిగత సంకేతా లాక్రమించాయి. ఈ కారణంగానే ప్రతీక కవిత్వంలో అస్పష్టత ఎక్కు

వయింది. కవి ఒకానొక భావాన్ని ఉద్దేశించి తద్భావావిష్కరణకి అనుకూలంగా తనవైన ఏవో సంకేతాల్ని ఉపయోగిస్తాడు. పాఠకుడు ఆ సంకేతాల్ని కవి ఊహించిన మార్గంలో అర్థం చేసుకుంటేతప్ప లేకపోతే ఆ కవితాఖండికయొక్క అర్థం అయోమయంగానే ఉండి పోతుంది. వేగుంట మోహనప్రసాద్ కవిత ఎక్కువగా మేధాగత మైనది. మేధాగతమైన కవిత హృదయానికి దూరంగా ఉండటం సర్వసామాన్యమైన విషయం. కవియొక్క మేధను పాఠకుడు అందుకోగలిగితే ఆ కవిత్వం యొక్క రసానుభూతిని పొందుతాడు; లేకపోతే లేదు. ఇదే ప్రతీకకవిత్వంలోని బలమూ, బలహీనత.

మోహనప్రసాద్ కవిత్వానికి జీవనాడి నైరాశ్యం, విషాదం. కృష్ణశాస్త్రి భావకవితామార్గంలో విషాదానికి ఏకైకనాయకుడుగా నిల్చారు. ప్రేయసీ విరహంలో విషాదపుచివరి అంచులవరకూ పయనించినవారు కృష్ణశాస్త్రి. ప్రాపంచిక జీవితాన్నుంచి ముక్తినిపొంది ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రయాణించాలనే వాంఛలోంచి విషాదం పుట్టింది మోహనప్రసాద్ కవిత్వంలో.

'నాకు కార్తిక పూర్ణిమా స్నానములు లేవు
కృశాంగిత నిజాకృతికి వెన్నెల వస్త్రములూ లేవు
దుఃఖం ముసురుకొన్నవేళ మూడు మునుగులే తప్ప
ధూళి ధూసరిత జీర్ణకాషాయాంబరములే కాని.'

అంటాడు మోహనప్రసాద్. కాషాయాంబరాలు అతను కోరే తాత్విక జీవితానికి సంకేతాలు. మోహనప్రసాద్ వచనగేయ సంకలనం 'చితి—చింత'. మృత్యువు—జీవితం ఈ రెంటి సంఘర్షణ కావ్యం పేరులోనే ధ్వనిస్తోంది. జీవనసత్యం తాలూకూ అన్వేషణలోంచి వేదాంతానికి తన వచన కవిత్వంలో జీవం పోశాడు మోహన ప్రసాద్.

'నువ్వు నెయ్యి చెప్పు
చివరికి మనందరం చింతాక్రాంతులమయ్యే ఉంటాం
హోరబ్బాయ్
ఇదంతా రాముడాడు [illegible], [illegible] [illegible]
వర్తనకాల.'

మానవ జీవితానికి అంతిమ లక్ష్యం విషాదమని, ఈ జీవిత మంతా మాయ అని కవి విశ్వాసం. ఈ ప్రాపంచిక జీవితంనుండి విముక్తికై కవి పడే ఆవేదనే పై పాదాలు. (మరణానికి విముక్తి అనే పదం సంకేతం కాదు.) ఈ మాయనుంచి బయటపడటానికి మానవుడు చేసే ప్రయత్నమే ఆధ్యాత్మిక తపస్సు. ఆ తపస్సు మాధిలో సర్వానికి అతీతమైన ఆనందం, ప్రేమ దర్శించగలడు మనిషి.

'ఎన్ని సంవత్సరాల దూరాన్నించైనా.
ప్రజల ప్రపంచోత్సవ కోలాహలంలోంచైనా
సమాధిలో ప్రాణం విడిచిన యోగి వెటుకుటేరంతోనైనా
కొండలమించీ లోయల్లోంచీ ఎక్కడ్నించైనా విను.
ఒకటే జీవనాదం—ఆనందం
వియోగంలోనూ విస్మృతిలోనూ.
ఒకటే ఆత్మగతమైన చిత్రం—ప్రేమ'

జీవితంపట్ల మోహనప్రసాద్‌కున్న దృష్టిని ఆధునికులు హర్షించరేమోకాని అతని దృక్పథం తనదే అయినప్పుడు కాదనే అధికారం ఎవ్వరికీ ఉండదు. జననం, మరణం ఈ రెండూ ఒక దాని ప్రక్కన మరొకటి ఉంటూనే ఉంటాయి. జీవితాన్ని, మృత్యువుని ఒకే సరళ రేఖమీద దర్శించాడు మోహనప్రసాద్. జీవించడమంటే మృత్యువుకోసం ఎదురు చూడటం అనే ఇతని అభిప్రాయం సామాన్యునికి ఆశ్చర్యంగానే ఉంటుందిగాని—గాఢంగా ఆలోచిస్తే అతని భావనలోని ఆధ్యాత్మిక పరిణతి బోధపడుతుంది.

'జీవం ఉన్నంతవరకు
మృత్యువుకోసం చేసే తపస్సు జీవితం
మాతృ గర్భంలోనూ, నేల ఒడిలోనూ'

మాతృ గర్భం జననానికి, నేలబడి మరణానికి సంకేతాలు. జీవితమంతా ఏ ఆశా లేకుండా మృత్యువుకోసం ఎదురు చూడటం అనేది గొప్ప నిరాశా వాదమే. అయితే ఇక్కడే మృత్యువుకోసం చేసే తపస్సులో ఒక అర్థం ఉన్నది. పరమార్థం ఉన్నది. జననానికీ, జననానికి మధ్య విశ్రాంతి క్షణమే మృత్యువు అనీ, ఈ జనన మరణాలకి ఈశ్వరుడే అధిపతి అని నమ్మితే మరణం మానవుని జన్మ పరంపరలో ఒక మహోత్సవం కాలేకాక పోగా జననం, మరణం ఒకటేననే అద్వైత భావన కలుగుతుంది. జనన మరణాలు చక్ర ప్రభ్రమణంలోంచి జననాన్ని ధిక్కరించి, మరణాన్ని అధిగమించి ఈశ్వరునిలో లయం కావటమే ముక్తి.

"[illegible] జన్మలు జన్మలు మధ్య ఒక [illegible]
[illegible] [illegible] మధ్య
మమతల్ని తెంచుకోలేని [illegible] [illegible]
కొత్త పలవుల ఆనందోత్సాహాలకి [illegible]
ఈశ్వరుడే అవధి
ఈశ్వరుని కాలాన్ని, నీ దూరాన్ని దాటుతూ
ఏ అణువూ ఏ రూపాన్ని ధరించదు.'

ఇతని కవిత్వంలో కనిపించే విషాదానికి, నిరాశకీ మూలం జీవిత వైఫల్యం. అవ్యక్తానందాన్ని అన్వేషించటంలో అలసిపోయిన హృదయం నిరాశనే వ్యక్తం చేస్తుంది. హృదయం నిండా నిరాశ దట్టంగా వ్యాపించినపుడు కవి తన నిరాశని వ్యక్తం చేసేందుకు తదనుగుణమైన సంకేతాల్ని ఉపయోగిస్తాడు. ఈ సంకేతాలద్వారా

తను చెప్పదల్చుకున్న భావాన్ని రసాత్మకమైన మార్గంలో చెప్పటం శక్తివంతుడైన కవి లక్షణం.

'జన్మభారం
పైన తిరిగే పంకా చేతికందదు.'

పై పాదాల్లో పంకా ఆశకి లేక ఆదర్శానికి సంకేతం. పంకా కదలిక చైతన్యానికి సంకేతం. చేతి కందకపోవటం ఆశ నెరవేరకపోవటానికి నిదర్శనం. తను కోరిన మార్గంలో చైతన్యాన్ని తను పొందలేకపోవటంతో బ్రతుకు భారంగా కనబడింది. ఇలాగే—

'గది
గదిలో శవం
క్షణక్షణానికి ఉబ్బి విశ్వవ్యాప్తమవుతోంది
ఒక్కణ్ణే
బయట గొళ్ళెం.'

గది శరీరానికి, శరీరం చేతనారాహిత్యానికి సంకేతాలు. అచేతన స్థితియొక్క దీర్ఘత్వాన్ని దీర్ఘపాదంలో వ్యక్తం చేశాడు. ఈ అచేతన స్థితిలోంచి చేతనావస్థలోనికి రావటానికున్న మార్గాలన్నీ మూసుకుపోయి ఆశక్తుడవటం 'ఒక్కణ్ణే, బయట గొళ్ళెం' అన్న పాదాల్లో ధ్వనింపజేశాడు. బాహ్యప్రపంచంలో కవికి ఆనందం లభించకపోగా తా నాశించే ఆధ్యాత్మిక పరిణతి తనకి కొన్ని యోజనాల దూరంలో ఉంటోంది. ఆత్మ అంతర్ముఖం అవటంలోంచి బాహ్యాతీతమైన ఒకానొక ఏకాంత మానసికానందాన్ని కవి అన్వేషిస్తున్నాడు. సుఖదుఃఖాలకి, జననమరణాలకి అవల నిత్యమూ, సత్యమూ అయిన జ్ఞానజ్యోతిని ఆధ్యాత్మిక అంతస్సమాధిలో కవి దర్శించగలుగుతున్నాడు.

"హిమాలయచిత్రాల మంచుసోనల నీడల్లో దాక్కుంటూను
అక్కడొకచోటే మనిషి
జ్ఞాననేత్రం తెరుచుకుంటుంది.
మాటి మాటికీ
బ్రతుకు దుఃఖాలకి ఆడపిల్లలా కన్నీళ్ళు
నింపుకునే నగ్ననేత్రం
చికిపోయి
నీల్గోడి
చివరకి అక్కడొకచోటే జ్ఞానదీపం వేడిగా కాల్తుంది.'

మోహనప్రసాద్ తన కవిత్వంలో ఉపయోగించిన ప్రతీకలన్నీ కూడా అతని తాత్విక చింతన అర్థం అయితేకాని విశదంకానివి. ప్రతిపదార్థాలు మాత్రమే చదవటానికి అలవాటుపడిన వారికి అతని సంకేతాలన్నీ కొత్త ఉపమానాలుగానో, రూపకాలుగానో మాత్రమే కనబడతాయికాని వాటిద్వారా కవి వ్యక్తం చేయదలుచుకున్న భావం బోధపడదు. కవి హృదయోద్రేకాన్ని, ఊహాజనితమైన అనుభూతిని అవగాహన చేసుకొనక పోతే—ముఖ్యంగా ప్రతీక కవిత్వాన్ని అంచనావేసేటప్పుడు విమర్శకుడు తప్పటడుగు వెయ్యక తప్పదు. ఎవరికి తోచిన అర్థాలు వారు ప్రతీక కవిత్వానికి అన్వయించవచ్చు గాని కవి నిర్దేశించిన పారమార్థిక భావాన్ని పసిగట్టడం కష్టం.

'మునిగిపోతున్న పడవదిక్కుచూడు
అరుణవర్ణ పశ్చిమాద్రిని జారిపోతున్న
కమలాకాయని చూడు, నన్నుచూడు,
ఎండుటాకులమధ్య రాలిపడిన ఒకేఒక్క
రోజావంక చూడు, నన్ను చూడు
మదపుటేనుగు నోట కరచిన గడ్డి
పరకని చూడు, నన్ను చూడు—'

పై పాదాలని సూర్యాస్తమయ వర్ణనగా ఊహించి భ్రమపడే అవకాశం ఎంతైనా ఉంది. ఆ పాదాల్లో సూర్యాస్తమయ వర్ణన ప్రధానం కాదు. మునిగిపోతున్న పడవ అస్తమిస్తున్న సూర్యుడు విషాదానికి సంకేతాలు. ఎండుటాకుల మధ్య రాలిపడిన రోజా, మదపుటేనుగు నోటకరచిన గడ్డిపరకా జీవితవైఫల్యానికి, నైరాశ్యానికి సంకేతాలు. అతని కవితానుభూతి యొక్క స్పందనని పాఠకుడు గ్రహించగలిగితే పై సంకేతాలు సులభంగా అర్థం అవుతాయి. లేకపోతే సూర్యాస్తమయవర్ణన ప్రధానంగా నిల్చిపోతాయి.

'పైన బస్సు
కింద రైలు
మధ్య వంతెన
....
రైలు వెళ్ళినాక [illegible]
ఇహం పొట్టి
పరం దూరం.'

పై పాదాల్లో బస్సు, రైలు ఇహానికి; ఆముష్మికానికి సంకేతాలు. ఆ రెండిటిమధ్య వంతెన జీవితం. మానవుని పరలోకభావనని భౌతికజీవితప్రభావం కప్పివెయ్యటం రైలువెళ్ళినా వంతెన విరిగిపడటం. ఇహంపొట్టి, పరందూరంఅనే పాదాల్లో పరిమితమైన భౌతికజగత్తు, అనంతమైన ఆధ్యాత్మికజగత్తు ధ్వనిస్తున్నాయి.

ఇలాంటి కవిత్వాన్ని ఇదేం కవిత్వమని చప్పరించేవాళ్ళు, ఇది కవిత్వమేనా అని కొక్కిరించేవాళ్ళు లేకపోలేదుకాని పాఠకుల్లోనూ, ఆలోచనాపరుల్లోనూ సహృదయత, చిత్తశుద్ధి లోపించనంత కాలం మోహనప్రసాద్ ప్రతిభావంతుడైన కవిగా భాసిస్తాడు.

6

ఈనాటి సమాజమంతా వర్గపోరాటాలతోను, వర్ణభేదాలతోను కల్లోలితమై ఉన్నది. అధికారబలం, ధనబలం ఈ రెండూ సమాజాన్ని శాసిస్తున్నాయి. ఈ కల్లోలమయవ్యవస్థలో కష్టజీవులంతా భావికాలపు స్వర్ణకాంతుల కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ సంధికాలంలో సామాజిక పరివర్తనకి విప్లవం తప్ప మరో మార్గంలేదని విశ్వసించే కవులు కొంతమంది ఉన్నారు. వారిలో వరవరరావు, సి. విజయలక్ష్మి, దిగంబరకవులు ప్రధానమైనవారు. వరవరరావు, సి. విజయలక్ష్మి వీరిద్దరి దృక్పథం సామ్యవాద దృక్పథమే. దిగంబరకవుల సిద్ధాంతం ఇంకా ఎవ్వరికీ అంతుపట్టడం లేదు. మొత్తం మీద ఈ కవులంతా గడిచిన దశాబ్దాల అంధకారంలోంచి భావియుగాల కాంతిరేఖల్ని దర్శిస్తున్నారు.

"వర్గరహిత సమాజంకొరకు రాస్తున్నాను
వర్ణరహితమహిత సూర్యోదయంకొరకు చూస్తున్నాను."

అంటున్నాడు వరవరరావు. పై రెండు పాదాల్లో అతని కవితా లక్ష్యం విశద మవుతోంది. తదితర సామ్యవాద వచనకవులతో పోలిస్తే వరవరరావు కవిత నిండుగా, హుందాగా ప్రవహించే జీవ నదిలాంటిది. పొద్దున విరిగిపడే సముద్ర కెరటంలాంటిది కాదు. సామ్యవాదకవు లందరివలెనే వరవరరావుకూడా భవిష్యదాశావాది.

'భళ్లున తెల్లవారుతుంది భయంలేదు
కుళ్లు నల్లదని తెలుస్తుంది నయం గద.
రేపు మంచిరోజు ఎద్దవి ఎండకాస్తుంది
రేపు సావిలక్ష్మిత ఎట్లాగా మండుతుంది
రేపు వసుధైకశాంతి ఎల్లెడల నిండుతుంది.'

ఈలాంటి పాదాలు కవి ఆశావాదానికి నిదర్శనాలు. ఇంతకు ముందు తరం అభ్యుదయ కవులుకూడా ఇంతకంటె బాగానే ఆశపెట్టుకున్నారు రాబోయే కాలంమీద. కవిని కవిగా నిలబెట్టడానికి ఉత్త ఆశావాదం ప్రయోజనంలేదు. ఏ వాదాన్ని చెప్పినా కళాత్మకంగా ఉండాలి. కళాత్మకమైన కవిత ఏదైనా 'వాదాన్ని' మించి నిలుస్తుంది. 'రాత్రి' ని వరవరరావు ఊహించిన తీరు గొప్పది. రాత్రి వర్తమాన సమాజ స్థితికి దర్పణం. రాత్రిలో సమాజ గమనాన్ని దర్శించా డితను.

"ఈ రాత్రి దొంగ పసరానికి బంజరు దొడ్డిలా వున్నది
నిద్రరాని ఆలోచనా రాత్రి జడిపిస్తున్నది
వేకువకై ఏకారే మనసుకు గడివేస్తున్నది
రాత్రి మరవాలనుకున్న గాథల్ని, అగాథాల్ని
మానుతున్న గాయాల్ని కెలుకుతున్నది
రాత్రి నిన్నటి జ్ఞాపకాలకు రేపటి కర్తవ్యాలకు మధ్యన
కూలిపోయిన వంతెనలా వున్నది."

ఇలాగే రాత్రి దర్శనలో వర్తమాన సాంఘిక స్థితిని ధ్వనింపజేస్తాడు. ఇదొక పరిణామస్థితి. పాతకి, కొత్తకి మధ్య సంధికాలం. సమాజం పాత తొడుగుల్ని పొంతం విప్పలేదు, కొత్త తొడుగుల్ని పూర్తిగా ధరించలేదు. ఒక రకమైన అవినీతిలోంచి మరొక రకమైన అవినీతిలోకి సమాజం దిగజారు తోంది కాని నిజమైన ప్రగతిని గుర్తించలేకుండా ఉంది.

"రాత్రి చలిచెలత ఒడిలో గిలిగింతల కలలుకన్న
సూర్యభగవానుడు
కరకర పొద్దెక్కినా ఇంకా మబ్బులో
కరాలు సాచి వొళ్ళు విరుస్తున్నాడు.
ప్రకృతి కాంత ప్రశాంతంగా
దోమ తెరలాంటి మంచుతెర కప్పుకొని
మగత నిద్దుర నటిస్తున్నది."

పై పాదాల్లో రాత్రి, సూర్యుడు, మబ్బు, మంచు తెర, మగత నిద్ర మొదలైన పదాల్లో ఒక్కొక్క పదం ఒక్కొక్క ప్రత్యేకార్థాన్ని ధ్వనిస్తోంది. రాత్రి—గడిచిన దోషభూయిష్ఠమైన వ్యవస్థకి, సూర్యుడు రాబోయే సమాజ వ్యవస్థకి; మబ్బు మంచుతెర గడిచిన కాలానికి, రాబోయే కాలానికీ మధ్య సంధి యుగానికి, మగత నిద్దర చేతనాచేతన స్థితుల మధ్యస్థ స్థితికి సంకేతాలు. సామాజిక జీవితంలో చీకటి నశించి వెలుగు అవతరించింది. అయితే ఈ వెలుగు ఇంకా ప్రకాశమానం కాలేదు. మబ్బుతెరలు, మంచుతెరలు (స్వార్థానికి సంకేతాలు) వెలుగుని వెనక్కి నెట్టుతున్నాయి. అందుచేతనే జీవితం మగత నిద్దరలో ఉంది.

"ఇంత పెద్దదేశంలోని సగంమంది
ఊపిరిపై పదిమంది బైఠాయింపు
ఈసారి కాగితాలమీదకాదు
కటిక నిరుపేద పేగులమీద
రాసాడు పన్నులమంత్రి బడ్జెటు"

ఇట్లా తేలికైన పదాలతో సంఘంలో సామాన్యుడికి జరుగుతున్న అన్యాయాన్ని చెప్పటం ఒక్క వచన కవిత్వంలోనే సాధ్యపడుతుంది.

మనుషులమీద తనకున్న అసంతృప్తిని, హేయాన్ని ఈ క్రింది నాలుగు పాదాల్లో అద్భుతంగా చెప్పాడు వరవరరావు.

'ఎండలో, ఎడారిలో దుర్భర నిశీథిలో, ఏకాంతంలో
తనను భరించిన ఒంటెను—దాహం వేసినపుడు

కడుపు చీల్చి పేగు లాగే
కుటిలులు చెల్లెలూ—ఈ మనుషులు!

ఈ నాలుగు పాదాల్లో వ్యక్తి స్వార్థం సామాజిక దృక్పథాన్ని మింగేసి సంకుచిత పరిధిలోకి దిగజారిపోవటం కనిపిస్తుంది: పాలు తాగిన రొమ్మునే గుద్దటం అనే సామెతకి ఈ పాదాలు ఉదాహరణ.

వరవరరావు ప్రక్రియాపరంగా వచనగేయకవి అయినా సిద్ధాంతపరంగా సామాజిక ప్రగతి వాద కవిగా గుర్తింపబడ్డాడు. అతని వచన కవిత్వపు శైలి సులభతరమైనది. చెప్పే విధానంలో ఎత్తు పల్లాలు లేకపోవటంవలన వచన కవితా సాఫీగా సాగుతుంది.

'స్పష్టి సమష్టితో కలిస్తే శక్తి
చీలిపోతే లేదు నరునికి విముక్తి
నిర్మించాలి వర్గరహిత సంఘ స్వర్గం
ఇదే నేటి కైటరిచ్చే మహోజ్వల సందేశం.'

ఈ సిద్ధాంతం వెన్నెముకగా నడుస్తుంది సి. విజయలక్ష్మి వచన కవిత్వం. వర్తమాన వచన గేయ కవులందరికంటె తెలుగు నుడికారాన్ని ఎక్కువగా తన కవిత్వంలో ఉపయోగించిన కవయిత్రి సి. విజయలక్ష్మి. ఈమె వచనకవిత్వమంతా ఉద్రేక ప్రధానమైనది కావడంచేత అంత్యప్రాసలు, భావాడంబరత ఈమె కవిత్వంపై ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి. సమాజం మారాలి, వేగంగా మారాలి, మార్పు తీవ్రతరం కావాలి అన్న ఆవేదన ఈమె కవిత్వంలో అడుగడుగునా వ్యక్తమవుతుంది. ఈ కవయిత్రికి తన కవితా లక్ష్యంపట్ల స్పష్టమైన భావసిద్ధాంతం ఉన్నది. చెప్పటంలో తొట్రుపాటుతనం గాని, గోడమీద పిల్లి మనస్తత్వం గాని లేదు. చెప్పేది సాఫీగా, నిర్భయంగా చెప్పగలదు.

'మహోద్దండ గండ భేరుండ చండ ప్రచండ వదనంతో
అగ్ని లాంటి నాలికను ఆడిస్తూ
చింతనిప్పుల్లా మండుతున్న కళ్ళని మూస్తూ తెరుస్తూ
మధ్య మధ్య పళ్ళు కొరుకుతూ పిడికిలి బిగిస్తూ
లక్షోప లక్షల రూపాలుగా విస్తరిల్లిన
అవినీతి బంధుప్రీతి ఆశ్రిత పక్షపాతం
లంచగొండితనం రండాగొండితనం నిరంకుశత్వం శిరస్సులతో
పస్తులు సమ్మెలు సత్యాగ్రహాలు మహోగ్ర ఉద్యమాలు
కోటానుకోట్ల అష్ట దరిద్రుల ఆకలిమంటల హాహాకారాల్ని
ఘాతుకంగా పరమ కిరాతకంగా
కాలరాస్తున్న శత సహస్ర పాదాలతో
ఆపరకృష్ణావతారమైన అష్ట్రలాజు విశ్వరూపం ధరించాడు.

పై పాదాల్లో కవితావేశంయొక్క పరాకాష్ఠ స్థితిని చూడ గలుగుతాం. ఇలాంటి పాదాల్లో భాషాకృతకత్వం కాని, ప్రాసల బాధ కాని కనిపించవు. ఎన్నికల ప్రచారం ప్రజాస్వామిక రాజ్యాంగంలో ఒక భాగం. ఆ భాగపు రాజకీయ యంత్రాంగం పనిచేసే విధానాన్ని స్పష్టంగా చూపగలిగిందీ కవయిత్రి విషాదభారతంలో. ఎన్నికల్లో పౌరునికున్న వోటు హక్కు ప్రజాస్వామికమైన భారత దేశంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో—ఈ కవయిత్రి చెప్పినంత బలంగా, వ్యంగ్యంగా మరే వచన కవి చెప్పలేదన్నది యథార్థం.

'వోటంటే అయిదురూపాయల నోటుగాదు అర్ధశేరు బియ్యంగాదు
వోటంటే రద్దయే ప్రామిసరీ నోటుగాదు బిరియానీ పార్టీగాదు
వోటంటే సారా పీపాలుగాదు కల్లు ముంతల తందనాలూగాదు
వోటంటే మూలబడ్డ గుళ్ళనీ
పాడుబడ్డ చర్చిలని బాగుచేయడం గాదు.'

ఇట్లా ఓటంటే ఫలానాదికాదు అని చెప్పటంలో ప్రస్తుతం ఎన్నికల్లో వోట్లు అమ్ముడుపోయే విధానం వ్యంజితం చేయబడింది.

సి. విజయలక్ష్మి కవిత్వంలో సామాజికమైన తిరుగుబాటు లేక సామాజిక విప్లవం ప్రధానమైన అంశం. ఆమె రచనలన్నీ తదనుగుణమైన సంఘవ్యవస్థను ప్రతిపాదించేవిగాను, కష్టజీవులకు, కర్మవీరులకు ఒక స్పష్టమైనమార్గాన్ని సూచించేవిగానూ ఉంటాయి. కొన్ని కవితాఖండికల్లో మరీ సిద్ధాంతభావన ఎక్కువైపోవటంవలన ఆ ఖండికల్లో వచనకవితాస్థాయి పడిపోయి వచనత్వం చోటు చేసుకుంటున్నది.

'సోదరసోదరీమణులారా స్వతంత్రభారత పౌరులారా!
ప్రజాతంత్ర భారతవోటు హక్కుదారులారా'
బహద్దరు కాయితం చదవటం మొదలెట్టాడు
'దేశంలో గాంధీజీ కలగన్న రామరాజ్యం రావాలి'
'రామరాజ్యమా కామరాజ్యమా?' కేక!'

ఇత్యాదులైన పాదాల్లో శుద్ధవచనం కనబడుతుందిగాని కవితాచ్ఛాయ కనబడదు. ఈవిడ కవితాశక్తికి 'కారుచీకట్లో కాంతి రేఖ' 'విషాదభారతం' వచనకవితా సంకలనాలు నిదర్శనాలు.

వచనకవితామార్గంలో ఈ తరంలో అతినవీనులుగా ఎంచబడుతున్నవారు దిగంబరకవులు. వీరిపై జరిగినంత చర్చ ఈ తరంలో వేరెవ్వరిపై జరగలేదు. దానికి కారణాలు అనేకం. దిగంబరకవులు వారి ప్రక్రియావిధానాన్ని ఎలా నిర్వచించుకున్నా నిస్సందేహంగా వీరిది వచనకవితామార్గమే. ఈనాడు దిగంబర కవులపై రెండు విధాలైన విమర్శ లొస్తున్నాయి. మొదటి విమర్శ వారి కవిత్వం హర్షణీయమైనదికాదని, రెండో విమర్శ వారిని పోలిన కవిత్వం ఈ తరంలో లేదని. ఈ రెండు రకాల విమర్శలూకూడా పాక్షికమైనవే. ఎందుచేతనంటే దిగంబరకవుల కవిత్వమంతా ఆదరణీయమూ కాదు; అంతా తిరస్కరణీయమూ.

కాదు. దిగంబరకవులు ఇప్పటివరకూ అక్కడక్కడ పత్రికల్లో ప్రచురింపబడిన గేయాలుకాక మూడు సంపుటాలు ప్రచురించారు. వీటిలో రెండో సంపుటిలో ఉన్నతమైన కావ్యఖండికలు రాశారు. మొదటి సంపుటిలోకూడా కవితాశిల్పానికి లోటులేదు. మొదటి రెండు సంపుటాలవరకూకూడా వారి సిద్ధాంతభావన ఎవరికీ అంతుబట్టలేదు. మూడో సంపుటిలో కవితాస్థాయి అధమస్థితి లోకి దిగజారిపోయి కవిత్వంయొక్క స్థానాన్ని బండబూతు ల్లాక్రమించాయి. ఈ బూతులుకూడా కొంతమందికి కవిత్వంగానే కనబడుతోంది. అలాగే వారు రాసిన చాలా బాగున్న కావ్యఖండికలు కూడా కొంతమంది దృష్టిలో కవిత్వంకాకుండా పోతున్నాయి.

'నేను—మనిషిని
ఇంకా చావలేదు!
చచ్చింది నా కుక్కనేస్తం
టాక్సీ డ్రైవర్ నరాల బలహీనతకు బలిగా,
వేగానికి బానిసఅయిన మనసు
జాలిలేదు
కంఠరాల గుంజాటనతప్ప!'

ఇలాంటి పాదాలు చాలా కవితాశక్తిగల పాదాలు. మనిషి చావలేదు. చచ్చింది మనిషిలోని విశ్వాసం. ఈ అర్థాన్ని 'చచ్చింది నా కుక్కనేస్తం'అన్న పాదంలో ధ్వనింపచేశారు. టాక్సీ డ్రైవర్ మేధకు సంకేతం. మనస్సుని మేధ జయించింది. ఫలితం మనిషిలోని మానవత చచ్చింది. ఇంత ధ్వని ప్రధానంగా అమితకవితాశక్తితో చెబుతున్నపుడు వాటిని తోసిపారేసే సంస్కారం ఏకొద్దిమందికోగాని ఉండదు. అలాగే—

"మతాధికారుల మతాలు యెందుకు
ఆకలి, కామం, కలలు, కన్నీళ్ళు
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశ మేదైతేనేం? మట్టంతా ఒక్కటే
అమ్మ ఎవరైతేనేం? చనుబాల తీపంతా ఒక్కటే
దిక్కుముఖాలతో చూస్తారేం?
పిచ్చివాణ్ణిగా కేస్‌పుటప్ చెయ్యండి
నన్నెక్కనివ్వండి బోను" లాంటి పాదాలు కవిత్వం కాదనే మనస్థితి ఎవరికీ ఉండదు. సమర్థిస్తే అంతా సమర్థనే; వ్యతిరేకిస్తే అంతా వ్యతిరేకించే అనే సూత్రం సాహిత్యవిమర్శకి, సాహిత్యసరణానికి మంచిదికాదు.

"భూమి ముసలి వరిబీజములా ఉన్నది
భూమి కవిసామ్రాట్టు తర్కంలా ఉంది
భూమి వచన కవితోద్యమంలా ఉంది
....
భూమి కడగని ఎండిన పీతిముడ్డిలా ఉంది"

ఇలాంటి పాదాల్ని ఎవరైనా అశ్లీలం అంటే వారికి దిగంబర కవుల సమాధాన మేమిటంటే—

"'అశ్లీలం పలుకుతోంది దిగంబరాక్షరం'
అంటున్నావు సిగ్గులేకుండా
నీ మెదడు పురుగు తినేసింది
నీ చర్మం పుచ్చిపోయింది
నీ అవయవం పుచ్చిపోయింది
నీ కళ్ళకి కన్నం పడింది"

ఇట్లా శాపనార్థాలు పెట్టారు. ఈ పాదాల్నికూడా కవిత్వంగా భ్రమించే స్థితిలోకి మన సాహిత్య మేధావులు కొంతమంది దిగజారిపోయారు. వారు దిగజారింది కాక ఈ మానసిక అవ్యవస్థా ధోరణిని వ్యతిరేకించే వారినందరినీ నక్కలనో కుక్కలనో తిట్టడం మొదలుపెట్టారు. అందమైన శరీరాన్నంతటినీ వదలి ఈగ పుండుమీద వాలుతుందనే కాళిదాసు శ్లోకార్థాన్ని దిగంబర కవితలోని లోపాన్ని చూపించేవారిపై ప్రయోగించారు శ్రీశ్రీగారు. అయితే శరీరమంతా పుళ్ళమయమయినపుడు ఈగ ఎక్కడ వాలాలి? అన్నది ప్రశ్న. 'భూమి కడగని ఎండిన పీతి ముడ్డిలా ఉన్నది' అన్న పాదాల్నికూడా కవిత్వమంటారేమో శ్రీశ్రీగారు.

సమాజంమీద, సాహిత్యంమీద దిగంబర కవుల దృక్పథం లోని ప్రధానాంశాలను పరిశీలించవలసిన అవసరంకూడా ఉంది. "కవిత్వం ప్రబంధ యుగాల కానలనే యింకిపోయిందని కవి మేళాల్లో, శాసనాలు మాత్రమే అచ్చేసే పత్రికల్లోను బాకా బూదేవాళ్ళకోసం (మొదటి సంపుటి)" "సినీమదత కొజ్జాల ముఖాన్ని తగిలించుకుని ప్రతివారం ఇంత చెత్త దేశంమీద పోస్తున్న వారపత్రికలు, రాజకీయ పురుగులకి, సినీమదత కొజ్జాలని, ఆంధ్ర దేశాన్ని తారుస్తున్న ఈ పత్రికాధిపతులు, సంపాదకులు, రాజకీయ నంగి వెధవలకి, సినీ మదతకొజ్జాల కన్నుగీట్లకి, సాహిత్య అనాథ మీద బహుమతులకి చొంగ కార్చుకుంటూ వారపత్రికల్లో, వాంతులు చేసుకుంటున్న రచయిత పందులు..." ఇట్లా సాగింది మూడో సంపుటి ఇంట్రో. ఈనాటి పత్రికలమీద, పత్రికాధిపతులమీద, రచయితలమీద వారికున్న అభిప్రాయాల్ని వ్యక్తీకరించారు. అయితే ఈ అభిప్రాయాలకి వీరు కట్టుబడి ఉన్నారా? శాసనాలు మాత్రమే అచ్చేసే పత్రికలు అన్న వీరు ఆ పత్రికల్లోనే తమ వ్యాసాలు, గేయాలు ప్రచురించుకుంటున్నారు. వారపత్రికల ఉపసంపాదకుల స్థాయిలోకి మహామేధావులైన దిగంబర కవులు తమ విప్లవాత్మక సాహిత్యాన్ని దిగజార్చటం వారి సిద్ధాంతానికి అనుకూలమేనా? మొత్తం రచయిత లందరినీ పందులుగా సంభావించే దిగంబర కవుల నైతిక సంస్కారం

మీద పాఠకునికి సందేహం కలగకుండా ఉంటుందా ? పత్రికల్లో రచనలన్నింటిని రచయితల వాంతులుగా పరిగణిస్తున్న వీరు—వీరి రచనలు అదే పత్రికల్లో అచ్చయినపుడు వాటినేమంటారు? బహుశా వాంతులకు మించిన మరో పదం ఏదైనా వెతుకుంటారేమో! తనదైతే లౌక్యము, మరొకడిదైతే మోసమూనా పంతులుగారూ! అంటుంది మధురవాణి కన్యాశుల్కంలో. పత్రికల్ని, పత్రికా సంపాదకుల్ని, రచయితలని దూషించే దిగంబరకవులు వారి రచనల కోసం వేరే పత్రికలు పెట్టుకొని వారి భావాల్ని ప్రచారం చేసుకున్నట్లయితే వారి సిన్సియారిటీ మీద ఎవరూ, ఎప్పుడూ సందేహ పడనక్కర్లేకుండా ఉండేది. తమ దృష్టిలో కూడని పనిగా, హేయమైన పనిగా భావించినదానిని చేస్తున్న ఇతరులని దూషిస్తూ అదేపనిని దిగంబరకవులు కూడా చేస్తుంటే—అది గమనించిన ప్రతి వ్యక్తి ఈ దిగంబర కవులకంటె ఆ రచయితలే నయమని వెనక్కి పారిపోయే ప్రమాదం ఉంది.

దిగంబర కవుల సాహిత్యానికి వెనుక అంతర్గతంగా ఐక మత్యం ఉన్నదా? అన్న ప్రశ్నకి సమాధానం ఏ పాఠకునికీ లభించదు. కారణం వాళ్ళకి ఒక ప్రత్యేక సిద్ధాంత భావన లేకపోవటం. 'మాకు స్పష్టమైన సామ్యవాద దృక్పథం ఉంది' అన్నారు దిగంబరకవులు ఒక ఇంటర్వ్యూలో. అయితే వారి సామ్యవాద సిద్ధాంత దృక్పథం ఏమిటో ఎవరికీ అర్థంకాదు. ఎంచేతనంటే, వారికి సామ్యవాద సిద్ధాంతం మీదకూడా నమ్మకంలేదని వారు రెండో దిగంబర కవితాసంపుటికి రాసిన పరిచయవాక్యాల్లో స్పష్టం అవుతుంది. 'దిగంబర కవులు ఈ మతాలతోనూ, ఇజాలతోనూ నిమిత్తం లేదంటున్నారు.' 'సిద్ధాంతాల వక్రభాష్యం' అన్న దిగంబర కవులు సామ్యవాద సిద్ధాంత వర్గాల్లో ఏ వర్గానికి చెందుతారోకూడా మనకి తెలియదు. వారికివారు మాకొక స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథం ఉంది అని ఎవరి ప్రశ్నకో సమాధానం ఇచ్చినంత మాత్రంతో ప్రయోజనంలేదు. వారి సిద్ధాంత దృక్పథాన్ని దేశం ముందుంచాలి. చిత్తశుద్ధి, నిజాయితీ మీద ఆధారపడిన సంఘ వ్యవస్థ రాజకీయ దృక్పథంయొక్క స్వరూప స్వభావాలని నాళ్ళవైన పత్రికల్లో ప్రజలకి, పాఠకులకి విశదం చెయ్యవలసిన అవసరం ఉన్నది.

ఈ వ్యవస్థని మొత్తాన్ని కుష్ఠువ్యవస్థగా పేర్కొన్నారు. దీంట్లో జీవించే జనాభాలో చాలా భాగాన్ని సన్నాసులుగాను, దుష్టపోతులుగాను చిత్రీకరించారు. పత్రికల్ని, పత్రికాధిపతుల్ని, సంపాదకుల్ని, రచయితలని దూషించారు. దిగంబర కవులు ఈ కుష్ఠువ్యవస్థనుంచి వృత్తిరీత్యా స్వేచ్ఛా జీవులైతే వారితో పేచీఉండదు. అలాకాకుండా ఈ కుష్ఠు వ్యవస్థలోనే వారుకూడా ఏదో ఒక బాధ్యతాయుతమైన వృత్తిని నిర్వహిస్తున్నపక్షంలో వారు ఆశించే సామాజిక విప్లవానికీ, వారు సృష్టించాలనుకునే నవసమాజ నిర్మాణానికి వాళ్ళు చాలా దూరంలో ఉన్నారనే అర్థం. అర్ధరాత్రి ఎప్పుడో ఒక సంపుటాన్ని ఆవిష్కరించి ఆ సంపుటాన్ని మార్కెట్టులోనికి ప్రవేశపెట్టినంతమాత్రంలో దిగంబరకవులు ఆశించే కుష్ఠుసమాజ విధ్వంసం పూర్తికాదు. యువతరంలో నిజమైన చైతన్యాన్ని వారు ఆశించేటట్లయితే—వారుకూడా ప్రజల మధ్యలోకి రావాలి. ఈ వ్యవస్థ ఏవిధంగా కుష్ఠువ్యవస్థగా మారిందో ప్రజలకీ, యువతరానికి వారు విశదంచెయ్యాలి. కుష్ఠువ్యవస్థా నిర్మూలనకి యువతరం బాధ్యత లేమిటో కూడా వాళ్ళు ప్రత్యక్షంగా ప్రచారం చెయ్యవలసిన అవసరం ఉన్నది. అలా కానినాడు దిగంబర సాహిత్య ప్రయోజనం నామమాత్రంగానే మిగిలిపోతుంది. వైయక్తికమైన త్యాగం ఉద్యమాల వెనుక లేకపోతే ఏ ఉద్యమమూ ఎక్కువకాలం మనలేదు. ఈనాడు దిగంబరకవులనుండి కూడా సమాజం ఆశిస్తున్నది ఈ త్యాగమే. సమాజానికి దూరంగా ఉండి వారు వారి ఉద్యమాల విజయాన్ని ఆశించడం శుద్ధ భ్రమ. ఇంత విపులంగా కవుల త్యాగాన్ని గూర్చి ఎందుకు రాయవలసి వచ్చిందంటే—దిగంబర కవులు తత్పూర్వ కవులందరినీ ఏదో నెపంతో వెనక్కి నెట్టేసి తాము ముందుకొచ్చి నిలబడ్డారు. శ్రీశ్రీతో భౌతికహేతువాదం సంప్రదాయంతో రాజీపడిందన్నారు. విశ్వనాథ మార్పుకి బద్ధశత్రువన్నారు. 'కవికోకిల గ్రంథావళికి ఉపయోగించిన కొలమానాలతో దిగంబర కవుల్ని కొలవటం ఆయన భావించే అభ్యుదయ సాహిత్య దృక్పథానికి వెన్నుపోటు' అన్నారు కె. వి. రమణారెడ్డిని. 'ఆయన ఆచార్యత్వం వహిస్తున్న వచన కవిత్వంలోని గుమాస్తా గొణుగుడు తత్వాన్ని పీడిత సమాజానికి పరిష్కార మార్గంగా చూడలేము' అన్నారు కుందుర్తిని. గురజాడ వారి 'పాత కొత్తల మేలు కలయిక' నవీన ఛాందస వాదంగా కనబడింది దిగంబర కవులకి. బాగానే ఉంది కాని దేశాన్ని, దేశంలో జనాభాని, నాగరికతని, సంస్కృతిని కవిత్వమనే పేరుతో బండ బూతులు తిట్టే నైతిక అర్హత దిగంబర కవులకున్నదా ?

దిగంబర కవుల్లో ప్రధానంగా కనిపించే అంశం వారి అభిప్రాయాలకి వారే ఎదురు తిరగటం. 'వృథా శోకాలపీడిత లోకాలలో/ కారుణ్యం మహాబోధి వెలుగులో/ మెరిసిన తథాగతుణ్ణి నేను' అన్న దిగంబర కవులే 'బుద్ధా, నువ్వూ, నీ క్షమా నా కక్కర్లేదు/ నువ్వెక్కడివో బోధికింద చావు' అన్నారు. ఆ పై రెండు అభిప్రాయాల్లో ఏది దిగంబర కవుల నిజమైన అభిప్రాయం? 'బాబూ మోసపోలేదుగదా! నువ్వు' అన్న దిగంబర కవులే మరోసారి' ఈ దేశం మోసపోగూడదు, అని గాంధీని తిట్టేరు. మాకు ఇజంతోనూ, మతంతోనూ నిమిత్తం లేదన్న దిగంబర కవులు మాకొక స్పష్టమైన సామ్యవాద సైద్ధాంతిక దృక్పథం ఉంది అంటున్నారు.

'బూతులు తిడితే సమాజం మారుతుంది ?' అన్న ఒక ప్రశ్నకి 'మేం రాస్తున్నది బూతు కాదు' అని బుకాయించారు. వారిని వారు ఎలా సమర్థించుకున్నారంటే—నిత్యం వాస్తవికంగా చూసే బూతు దృశ్యాల్నే రాశామని అదీ గాక ప్రబంధ సాహిత్యమంతా బూతులేనని. ఒక వైపునుంచి ప్రబంధసాహిత్యం నేటి యువ తరాన్ని పనికిరానివాళ్ళలాగా మార్చిందని చెబుతూ వారి తిట్ల బూతుల్ని ప్రబంధ సాహిత్యంతో సమర్థించుకోవటం వారి స్పష్టమైన ద్వంద్వ దృక్పథంగా కనబడదు. ప్రబంధ సాహిత్యానికి దిగంబర కవులు ఏ విలువ ఇచ్చారో అదే విలువని దిగంబర కవితకి పాఠకు లివ్వాలనే అభిప్రాయమైతే పేచీ లేదు. దిగంబర కవుల కవితో ద్దేశం సామాజిక విప్లవమైనపుడు ఆ విప్లవ సాధన ఈ బూతు సాహిత్యంతో నెరవేరదన్నది యథార్థమైన విషయం. కవిత్వంలో ఏ విషయాన్నైనా చెప్పవచ్చు. ఏదో ఒక విషయాన్నే చెప్పాలనే నిర్ణయం కాని, శాసనం కాని ఎక్కడా లేదు. ఏది చెప్పటానికైనా దానిదైన పంథా ఉంది. బాట తప్పిన నాడు ఏదీ కవిత్వం కాక పోగా తాటాకు మంటలా ఎలా వచ్చిందో అలా పోవటం ఖాయం.

> 'ఈ మహాపాపంలో
> మనమంతా భాగస్థులం
> రాగల యుగాలకోలకు
> అణువణువును చిదిమిచిదిమి
> చైతన్యాగ్ని జ్వాలాముఖులమై
> చితిపేర్చుకుందాం రండి.'

అలా పిలవవలసిన తీరులో పిలిస్తే అడుగు వెనకాల పది అడుగులు నిశ్చయంగా పడతాయి. చెప్పవలసిన తీరులో చెబితే పదిమందీ వింటారు. ఏ ఉద్యమమైనా ఈ సత్యాన్ని గమనించాలి.

7

ఇంతవరకూ రాసిన వ్యాసంలో ప్రసిద్ధులైన కొంతమంది వచనగేయకవుల్నిమాత్రమే పేర్కొన్నాను. ఈ తరంలో పత్తిగి రాధాకృష్ణ, మిరియాల రామకృష్ణ, సంగంబాబు, కె. శివారెడ్డి, గంధం జోయెల్, సి. వి. కృష్ణారావు, నూతలపాటి గంగాధరం, ఇస్మాయెల్ మొదలైన కవులున్నారు. సుమారు పదిమంది కవుల్ని ఈ వ్యాసంలో వదలివేయటం జరిగింది. వీరిపై ప్రత్యేకంగా మరొక వ్యాసం రాయవలసిన అవసరం ఉన్నది.

వచనకవితా ప్రక్రియలో కవికి భావవ్యక్తీకరణకు స్వేచ్ఛ లభించినదని ఈ తరం అభిప్రాయం. అయితే ఈ అభిప్రాయంతో ఏకీభవించని వాళ్ళున్నారు. ఆ స్వేచ్ఛ సాంప్రదాయక పద్యకవిత లోనూ ఉన్నదని వారి అభిప్రాయం. భావవైవిధ్యమే ప్రక్రియా వైవిధ్యానికి దారితీస్తోందన్న నిజాన్ని గ్రహించకపోతే అసలువాదమే లేదు. మనుచరిత్రని వచనకవిత్వంలో రాస్తే ఎంత సొగసుగా ఉంటుందో తిలక్ వృతం కురిసిన రాత్రిని సాంప్రదాయక పద్య కవిత్వంలో రాస్తే అంత సొగసుగానూ ఉంటుంది. ఒక్కొక్క రకమైన భావధారకి ఒక్కొక్క రకమైన ప్రక్రియ ప్రతినిధిగా నిలుస్తోంది. ఇది సాహిత్య పరిణామం వెల్లడిస్తున్న నిజం.

ఛందస్సునే లయగా భ్రమించడంవలన కొంతమందికి వచన కవిత్వంపై అపోహ లేర్పడ్డాయి. ఇది చాలా ప్రాథమికమైన విషయం. ఛందస్సు లయలో ఒకభాగమే కాని ఛందస్సే లయ కాదు. వచన కవిత్వంలో లయ ఉన్నది కాని ఛందస్సులేదు. ఏదో ఒక ఛందస్సు లేనిది అసలు లయ ఏమిటి? అని ప్రశ్నించే వాళ్ళు మరీ అమాయకులు.

ఈ వాద వివాదాలు ఎలాఉన్నా, ఎవరు ఏమార్గమైనా ఈ కవితా పరమావధి సహృదయ హృదయాహ్లాదం. అట్టి హృద యాహ్లాదాన్ని కలిగించటానికి వచన కవితా ప్రక్రియ మరే సాహిత్య ప్రక్రియతోనూ తీసిపోదని చెప్పటమే నా ఉద్దేశం.

ముక్తకాలు

డా. మాదిరాజు రంగారావు

ఈ నా రాగ సముద్రం
  వెలియాలి కట్టుపై నేను.
ఎక్కడ నిల్చినా, నిలువునా
నన్నెత్తుకు పోతోంది గాలి!

అన్నిటిలోనూ ఒక్క తరంగం చాలు
గట్టుపైనుండే నీటిలో ముంచడానికి.
అన్నిటిలోనూ ఒక్క తరంగం చాలు
నీటిలోనుండి బయట వేయడానికి.

పూల చెండ్లవలె నీటిబుడగలు
నా స్థితికి నవ్వుతున్న రూపాలు.
ప్రేమతో పలుకరించేను నిజాలు.
అందులోనే ఉంది సర్వహితం.

ప్రేమించే మనిషి. మనసులో
పొంగుతోంది ఉదయం.
[illegible] అర్థానం
[illegible] తేలం.

అంతటా మరుగులు! [illegible]
నవ్వు పూలు! పూలచెండ్లు.
వెనకనే పరుగెత్తే నవ్వు
బాయా తరంగాల్లో తరంగ [illegible]

సముద్రంనుండి వచ్చే అలలు
పరుగులు తీసే కోర్కెలు.
వెనుకకు మరలే అలలు
[illegible] ఆశలు.

ప్రయాణాన్ని మందిస్తూ రాత్రిని తోలిస్తూ
సముద్రంపై నడుస్తుంటే వివేకము.

ఎక్కడ నిల్చినా నన్నార్పజాలదే గాలి
ఎటు పోయినా కనిపెట్టుకుండే ఆకాశం

సూర్యుడు తల ఎత్తగనే పైకి
నన్ను భయపెట్టింది సముద్రం!
ఆశ రేకెత్తించింది అవని!
అంతలో మెరిసింది కాలం.

నిదురించు, నిదురించు
నిదురించే వేళ వినిపిస్తుంది.
అడుగుల సవ్వడి, విను
లేదాక జ్ఞాపకం పెట్టుకో.

గాలి వాన అరచేసు
తలుపువద్ద నిలచి తట్టి
నిద్దుర చాలిందని;
లేదాక పట్టించుకోకు.

ఆ కన్నులలో ఊగిన సముద్రాలు
ఈ ఎదలో దాగిన ఆకాశం.
రెండిటి కలయిక ఊహలో
అంతకన్న వాస్తవంగా నీటిలో.

మనిషికుంది పుట్టుకనుండే వాతావరణం
మనసు వీడి లేదుగాని ప్రవాసం
ప్రశ్నకు లేదు తృప్తినిచ్చే సమాధానం
[illegible] సాగితే అంతవరకే అదృష్టం!

వ్యావహారిక భాషోద్యమ చరిత్ర

డా. అక్కిరాజు రమాపతిరావు

ఈ శతాబ్ది ప్రథమ పాదంలో వ్యావహారిక భాషోద్యమం తల ఎత్తినప్పుడు గ్రాంథిక భాషాభిమానుల్లో ఈ వ్యావహారిక భాషపట్ల చాలా అపోహలు కలిగినయ్. మొట్ట మొదటినుంచీ సనాతన సంప్రదాయ వాదులు, సంఘ సంస్కరణపట్ల కనపరచిన నిరసననే, ఇంకా అంతకన్నా ఏవగింపునే, గ్రాంథిక భాషాభిమానులు, వ్యావహారిక వాదులపట్ల కనపరచారు. వ్యావహారిక భాష గ్రామ్యం కన్నా అన్యం కాదనీ, ఆ భాషలో వ్యవస్థ లేదనీ, ఉండదనీ, ఉదాత్త విషయాల నిరూపణకు, వ్యావహారికం అసమర్థమనీ, అందులో ఉండే పదజాలం నిత్యజీవితంలో లోకవ్యవహారాన్ని నిర్వహించుకొనేందుకు మాత్రమే చాలి ఉంటుందనీ, కాబట్టి ఆ భాష ఎన్నటికీ కావ్యభాష కాలేదనీ గ్రాంథిక భాషాభిమానుల సిద్ధాంతం. వ్యావహారికం భాషావిష్కరణైకమాత్ర ప్రయోజనకారి అనినీ రసావిష్కరణకు సాధనం కాజాలదని గ్రాంథికులు ప్రతిపాదించారు.

లక్షణ విరుద్ధమైన భాష అంతా గ్రామ్యమే కాబట్టి, కేవలం పామరులు వ్యవహరించేది మాత్రమే కాక, శిష్టులు వ్యవహరించినప్పటికీ అది లక్షణానికి విరుద్ధంగా ఉంటే గ్రామ్యమే ననీ, కావ్య ప్రయోగార్హం కాదనీ వాదించారు.

వ్యావహారిక భాషావాదులు, తమ ఉద్యమం కేవలం వచన రచనకు మాత్రమే సంబంధించినదనీ, కావ్య రచనకు పండితులు తాము అభిమానించే భాషనే వాడుకోవచ్చుననీ చెప్పినా ప్రయోజనం లేకపోయింది. శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు, గురజాడ అప్పారావుగారు, నవీన భాషోద్యమ స్వరూప స్వభావాలను ఎంతగా విశదీకరించినా పండితులు వ్యావహారిక భాషకు గ్రామ్యతా కళంకాన్ని తొలగించలేదు.

ఇంతకూ వ్యావహారిక భాషావాదం సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి పుట్టింది. నూటికి తొంభై మంది విద్యావంతులైనప్పుడు తప్ప సంఘానికి మేలు కలగదనీ, అట్టి సుస్థితిని సాధించాలంటే శాస్త్రీయమైన విషయాలన్నీ వాడుకభాషలో రచించినప్పుడే ఉద్దిష్ట ప్రయోజనాన్ని అవి సాధించగలుగుతాయని రామమూర్తి పంతులు గారి వాదం.

వ్యావహారిక భాషా ఉద్యమానికి 1910 వ సంవత్సరంలో బీజావాపం జరిగిందని చెప్పవచ్చు. అంతకుపూర్వమే వ్యావహారిక భాషలో రచనలు సాగించవచ్చునన్న అభిప్రాయం కొందరిలో ఉన్నా వచన పాఠాదులు సైతం వ్యావహారిక భాషలోనే కొనసాగాలని, పాఠ్యపుస్తకాలు కూడా సరళమైన భాషలో వ్యవహారానికి చేరువగావుండాలనీ, విద్యాశాఖాధికారుల్లో అభిప్రాయం కలగడం 1920 కి పూర్వం సంభవించలేదు.

వ్యావహారికభాషవైపు ఈ విధంగా విద్యాశాఖాధికారులూ, కొందరు విద్యావేత్తలు దృష్టి మళ్లించటానికి కొంత పూర్వరంగం ఉన్నది. 1903 వ సంవత్సరంలో అప్పటి గవర్నర్‌జెనరల్ కర్జన్ అప్పటివరకూ దేశంలో సాధించిన విద్యాభివృద్ధినిగురించి సమగ్రమైన నివేదిక సిద్ధంచేసేందుకు, ఒక సంఘాన్ని నియమించాడు. దేశంలో సుప్రసిద్ధ విద్యావేత్తలందరూ ఇందులో సభ్యులు. బొంబాయి, మదరాసు, కలకత్తా రాష్ట్రాలలోని విద్యాప్రమాణాలను గూర్చి, అభివృద్ధినిగూర్చి, యీ సంఘంవారు పరిశీలనం జరిపారు. అటుతరువాత రెండు సంవత్సరాలకులంటే 1905 లో ఈ నిపుణులసంఘం ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది.

"Lord Curzon convened in 1901 an educational conference at Simla. The conference was held under the Chairmanship of Lord Curzon and lasted for fifteen days. The conference considered all the aspects of Indian education from primary to the university stage and passed one hundred and fifty resolutions on which Lord Curzon based his education policy." (PP 439)

"The Government Resolutions of 1904 (Page 26) said if the educated classes neglect the cultivation of their own languages these will assuredly sink to the level of mere colloquial dialects.... and no progress will be possible in giving effect the principle affirmed in the despatch of 1854, that European knowledge should gradually be brought by means of Indian Vernaculars within the reach of all classes of the people (P 447) (As quoted by Dr. S. P. Chanbe in "A History of Education in India-1965)

1852 వ సంవత్సరంలో భారతదేశంలో బొంబాయి, మదరాసు, కలకత్తాలలో మూడు విశ్వవిద్యాలయాలు స్థాపించి



లింటాస్ - INC. 15-140 TL

వస్తుంది. ఈ విశ్వవిద్యాలయాలనుంచి పట్టభద్రులయ్యే విద్యార్థులు తమతమ ప్రాంతీయభాషలద్వారా, ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని, ఆధునికభావాలనూ విద్యాభిరుచిని పెంపొందింప జేయగలరని ప్రభుత్వం ఆశించింది. కాని 1905 వ సంవత్సరంలో విద్యావేత్తలు సమర్పించిన నివేదికను బట్టి అటువంటి ఫలితాలు సాధించకపోగా ఆ సంబంధమైన ప్రయత్నాలు కూడా జరగలేదని తేలింది. దేశవ్యాప్తంగా, విద్యార్థులు, తాము నేర్చిన విషయాలను, జనసామాన్యానికి మాతృభాషలో అందించే ప్రయత్నం చేయలేదు. ఆ విధమైన ప్రయత్నం చెయ్యటానికి కావలసిన శక్తిసామర్థ్యాలు కూడా విశ్వవిద్యాలయాలలో వారికి లభించిన శిక్షణద్వారా వారు పొందలేకపోయారని ఆ నివేదిక పేర్కొన్నది. ప్రాథమిక తరగతులనుంచీ పట్టభద్రులయ్యే వరకూ కూడా వారి దృష్టి అంతా ఇంగ్లీషు నేర్చుకోవడం పట్లనే కేంద్రీకరింపబడటమూ, అన్ని విషయాలను విశ్వవిద్యాలయపు తరగతులలో ఇంగ్లీషులో బోధించడమూవల్ల పట్టభద్రులయ్యే వాళ్ళంతా ఇంగ్లీషులోనే తగినంత పరిజ్ఞానాన్ని సంపాదించగలరు కాని, మాతృభాషలో తమకు తెలిసిన విషయాలను బోధించగల నైపుణ్యం వారికి అలవడే అవకాశంలేదు అని ఆ నివేదికలో విద్యావేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందువల్ల విశ్వవిద్యాలయాల స్థాపనోద్దేశాలు నెరవేరలేదని వివరించారు. అంతేకాకుండా దేశభాషల్లో ఆధునిక విజ్ఞానం విస్తరించక పోవటానికి, ఆ భావాలను వెల్లడించగల పదజాలం కూడా లేకపోవటం ఒక కారణమైంది. అటువంటి పదజాలాన్ని ఆయా శాస్త్రాల పట్టభద్రులు సృష్టించుకోలేక పోవడానికి, విశ్వవిద్యాలయాలలో దేశభాష నిర్లక్ష్యం చేయబడటమే కారణం. బోధనాభాషగా ఇంగ్లీషు ఉన్నా, పాశ్చాత్యదేశాలలో దేశభాషలు సగౌరవమైన స్థానాన్ని పొందలేదు.

"తెలుగు యెప్పుడూగాని ఉత్తమ విద్యాద్వారంగా ఉండలేదు. నన్నయ కాలంనుండి మదరాసు విశ్వవిద్యాలయం వచ్చేవరకు విజ్ఞానప్రదమైన ఉత్తమ విద్య అంతా సంస్కృతం ద్వారానే విద్యాపీఠాల్లో అభ్యస్తమవుతూవుండేది. మదరాసు విశ్వవిద్యాలయం వచ్చినతరువాత మనలో అనేకులు ఇంగ్లీషుద్వారా ఉత్తమ విద్య నభ్యసిస్తున్నారు. కనుక ప్రాచీనకాలంలోకాని, యిప్పుడుగాని తెలుగు ఉత్తమ విద్యాద్వారంగా ఉండే ఉదాత్త ప్రతిపత్తి పొందలేదు (పుట 10--ఉమాకాన్త విద్యాశేఖరుల పల్నాటి వీరచరిత్ర ద్వితీయ భూమిక—1955)

ఇందువల్ల ఇంగ్లీషు బోధనాభాషగా పట్టభద్రులైన విద్యార్థులందరూ తమ మాతృభాషలోకన్నా ఇంగ్లీషులోనే ఒక విషయం గురించి వ్రాయటానికికాని చెప్పటానికి కాని యోగ్యతను, సామర్థ్యాన్ని సంపాదించగలిగారు. ఈ లోపాన్ని నివారించాలంటే దేశభాషలపట్ల శ్రద్ధ వహించాలని, శాస్త్రీయ విజ్ఞానాన్ని, ఆధునిక భావాలను, దేశభాషల్లో వివరించగలి రచయితలను ప్రోత్సహించాలని, అటువంటి పుస్తకాలు వ్రాయించాలని, పీటికి ప్రాతిపదికగా ఉన్నతపాఠశాల తరగతులలోను, కాలేజి తరగతులలోను, మాతృభాషలో వ్యాస రచనను నిర్బంధ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలనీ, వారికి శిక్షణగా అనువాద పద్ధతులు నేర్పాలని విద్యాశాఖాధికారులు నిశ్చయించారు. ఇందువల్ల కాలేజీ తరగతులలో, అనువాదము, వ్యాస రచన, నిర్బంధంగానైనా విద్యార్థులకు నేర్పవలసి వచ్చింది. అప్పుడు ఈ అనువాదంలోను, వ్యాసరచనలోను ప్రవేశపెట్టవలసిన శైలి ఏదన్న మీమాంస వచ్చింది.

శాస్త్రీయ విజ్ఞానాన్ని, ఆధునిక విషయాలను వ్యక్తీకరించటానికి ప్రాచీనమైన కావ్యశైలిని ఆశ్రయించాలా లేక సులభశైలిని ప్రవేశపెట్టాలా అన్న జిజ్ఞాస కలగడం సహజమే. అప్పుడే ఈ వ్యావహారికభాష అన్నది తెలుగుదేశానికి సంబంధించినంతవరకు ప్రసక్తికి వచ్చింది.

1905 వ సంవత్సరంలో విద్యావేత్తలు సమర్పించిన నివేదికలోని సూచనలను వలుకులను ఆచరణలో పెట్టటానికి రెండుమూడు సంవత్సరాలు పట్టివుంటుంది. యావద్భారతదేశానికి సంబంధించిన యీ విచారణకాకుండా, తెలుగుదేశంలో రాష్ట్రస్థాయిలో ఇంచుమించుగా ఆ కాలంలోనే విద్యాభివృద్ధి విషయార్థమైన విచారణకూడా జరిగింది.

1906 వ సంవత్సరంలో గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల పాఠశాలా పరీక్షాధికారిగా జె. ఏ. యేట్స్ అనే ఆంగ్ల విద్యాధికుడు నియుక్తుడైనాడు. ఆ మూడు జిల్లాల కేంద్ర కార్యాలయం అప్పుడు విశాఖపట్నంలో ఉండేది. తెలుగు జిల్లాలలో పాఠశాలాధికారిగా ఉన్నందున తెలుగుతో ఆయనకు తగినంత పరిచితి ఏర్పడిఉంటుంది. అప్పుడాయన తెలుగులో గ్రంథరచనా శైలికి వాడుకలోఉండే భాషా స్వరూపానికీ మధ్యఉన్న భేదాన్ని గుర్తించి విస్మయం పొందారు. గ్రాంథికశైలికీ, వ్యావహారిక భాషకూ చాలా అంతరంవుందన్న విషయం ఆయనకు అప్పుడు స్పష్టపడింది. దీనికి కారణమేమిటో తెలుసుకోందామని విశాఖపట్నంలో ఒక స్థానిక కళాశాలకు ప్రధానాధ్యాపకుడైన పి. టి. శ్రీనివాసయ్యంగారిని కలుసుకొని తన జిజ్ఞాసను ఏట్సుదొర వెల్లడించాడు. శ్రీనివాసయ్యంగారు ఏట్సుకు, సంతృప్తికరమైన సమాధానం చెప్పలేక, గురజాడ అప్పారావుగారిని, గిడుగు రామమూర్తిగారిని, ఈ విషయం సంప్రదించవలసిందిగా సలహా చెప్పారు. ఏట్సు ఆటుతరవాత అప్పారావుగారిని విజయనగరంలోను, రామమూర్తిగారిని పర్లాకిమిడిలోను కలుసుకొని గ్రాంథికాంధ్రానికీ వ్యావహారికాంధ్రానికిగల వ్యత్యాసంగురించి చర్చించారు. అప్పారావుగారు, ఆ విషయాన్ని తాము అంతకు పూర్వమే గమనించామనీ, జీవద్భాషలోఉన్న స్ఫూర్తి, అందచందాలు

గుర్తించే కన్యాశుల్కమనే నాటకాన్ని వాడుకభాషలో రచించామనీ పాతపడ్డమాటలతో వ్యవహారదూరమైన రూపాలతోఉండే కావ్యశైలికన్నా, వ్యావహారికశైలి ఉత్కృష్టమైనదని తమ అభిప్రాయమని ఏట్సుదొరకు వివరించారు. అంతేకాకుండా పండితులు వ్యావహారిక భాషను నిరసిస్తారనీ, పాఠ్యపుస్తకాలుగా వాటిని ఎన్నిక చేయుటం ఏమాత్రమూ సహించరనీ, వీరేశలింగం పంతులు మొదలైనవాళ్ళు, సరళమైనశైలిలో, వ్యవహారంలో ఉన్నభాషను గ్రంథాలలో ఉపయోగించారని, అయినా ఆ పుస్తకాలను మాత్రం పాఠ్యగ్రంథ నిర్ణేతలు, పాఠ్యపుస్తకాలుగా, బళ్లలో కాలేజీల్లో వాటి ప్రవేశార్హతను నిరాకరిస్తున్నారని అప్పారావుగారు ఏట్సుదొరకు విశదం చేశారు.

పర్లాకిమిడిలో రామమూర్తి పంతులుగారిని కలుసుకొని, ఈ విషయమై మాట్లాడవలసిందిగా కూడా అప్పారావుగారు సూచించారు. ఏట్సు రామమూర్తిగారిని కలుసుకున్నప్పుడు, ఆయనకూడా అప్పారావుగారు వెలువరించిన అభిప్రాయాలను బలపరచారు. అయితే ఈ విషయాన్ని ఆలోచించటానికి తమకు కొంతవ్యవధి ఇవ్వాలని రామమూర్తి పంతులుగారు కోరారు.

దేశీయులు విద్యావిజ్ఞానవికాసాలలో వెనుకబడి ఉండడంవల్ల, వీరేశలింగం పంతులు ఆశించిన సంఘ సంస్కరణంపట్లకానీ, అటు పిమ్మట గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు బోధించిన భాషా సంస్కరణంపట్లకాని, తొలిదశలో ప్రజాసామాన్యంలో అభినివేశం కలగలేదు. పండితులుతీవ్రంగా ప్రతిఘటించారు.

1907 వ సంవత్సరంలో ఏట్సు, రామమూర్తిగారిని మొట్టమొదటి సారిగా కలుసుకొనే సమయానికి, ఆయనకు తెలుగు కావ్యాలతోగాని, తెలుగుభాషలోని పరిణామాలను గూర్చిగాని పరిచయం లేదు. అయితే ఆయన అప్పటికే సంస్కృతంలో కొంత విద్వత్తు సంపాదించారు. భాషాశాస్త్రం లెస్సగా అభ్యసించారు. శాసనాలు చదవటం నేర్చుకొని ప్రాచీన జాతులను గూర్చిన పాండిత్యం సంపాదించారు. అతి ప్రాచీనకాలానికి చెందిన 'ముండారి' లేక 'సంతాలి' భాషాకుటుంబానికి చెందిన సవరభాషను అధ్యయనంచేసి ఆ భాషలో గొప్ప పాండిత్యం సంపాదించారు రామమూర్తి పంతులుగారు. ఇంగ్లీషు భాషాచరిత్ర బాగా అధ్యయనం చేశారు. ప్రాచీన శిలాశాసనాలను చదివి అప్పటికే వారు పత్రికల్లో ప్రకటించారు. ఈ సాధన సంపత్తులతో తెలుగు వ్యాకరణాన్ని తెలుగుకావ్యాలను పంతులుగారు, తదేక దీక్షగా రెండు సంవత్సరాలపాటు అధ్యయనంచేసి, తెలుగు భాషా సంబంధమైన క్రమపరిణామ వికాస దశలను హృద్గతం చేసుకొన్నారు, ద్రావిడ భాషలతోను, ఆర్యభాషా కుటుంబాలకు సంబంధించిన భాషాశాస్త్రంతోను రామమూర్తిపంతులుగారికి అంతకుపూర్వమే విశేషపరిచయం ఉన్నది. ఈ పూర్వరంగంతో 1909 వ సంవత్సరంలో రామమూర్తిపంతులుగారు ఏట్సు కోరిక ననుసరించి, భాషోత్పత్తి పరిణామాలనుగూర్చి ఉపన్యసిస్తూ, తెలుగుభాషకు సంబంధించిన పరిణామాన్ని వివేచనాదృష్టితో పరిశీలిస్తూ అనేక కొత్తవిషయాలను ఉపాధ్యాయ వార్షికసభకు వినిపించారు. అందులో స్థూలంగా ప్రపంచభాషలు, సూక్ష్మంగా తెలుగుభాష, ఏ విధమైన మార్పులు పొందాయో వివరించారు. 1907 వ సంవత్సరం నుంచి ఈ విధంగా ఉపాధ్యాయ వార్షిక సమావేశాలను ఏట్సు నిర్వహించేవారు. రామమూర్తిపంతులుగారి ఉపన్యాసం ఆకర్షకంగానే ఉన్నా, పూర్వాచారపరాయణులైన పండితుల మనస్సులలో, ఆయనగారి ఉద్దేశాలనుగూర్చి భయసందేహాలు కలగకపోలేదు.

సరిగ్గా ఈ సమయంలోనే ఉన్నతపాఠశాలలకు సంబంధించి, విశ్వకళాపరిషత్తులకు సంబంధించి పాఠ్యప్రణాళికలలోను, విద్యావిధానంలోను చెప్పుకోదగ్గ మార్పులు సంభవించాయి. మెట్రిక్యులేషన్ స్థానంలో స్కూలుఫైనల్, ఎఫ్. ఏ. స్థానంలో రెండు సంవత్సరాల పరిమితిగల ఇంటర్మీడియెట్ తరగతీ ప్రవేశించాయి. విద్యార్థులు అధ్యయనం చేయవలసిన విషయప్రాధాన్యంలోను, పాఠ్యప్రణాళికల్లోనూ చాలా మార్పులు వచ్చాయి. స్కూలుఫైనల్ స్థాయిలోను, ఇంటర్మీడియట్‌స్థాయిలోను, మాతృభాషలో వ్యాసరచన, అనువాదము పాఠ్యాంశాలూ, కాబట్టి పరీక్షాంశాలూ అయినాయి. అప్పుడే వ్యాసరచనకు, అనువాదానికి ఉపయోగించవలసిన శైలిని గూర్చిన ప్రస్తావన కూడా తలయెత్తింది. ఆధునిక భావాలున్న విద్యావేత్తలు కొందరు అదే తగిన సమయమని ఎంచి, వ్యావహారిక భాషలోనే ఈ వ్యాసరచనా, అనువాదమూ ఉండాలని ప్రతిపాదించారు. పూర్వాచార పరాయణులైన పండితులకు ఈవాదం చాలా కంటగింపు కలిగించింది. 1910 వ సంవత్సరంలో రామమూర్తి పంతులు మళ్ళీ ఉపాధ్యాయ వార్షిక సభ నుద్దేశించి ప్రసంగిస్తూ, జీవద్భాషాప్రాశస్త్యాన్ని, కావ్యభాష నిరుపయోగితను సిద్ధాంతీకరించారు. దీని కుపబలకంగా పాశ్చాత్య భాషలలోని పరిణామాలను, ప్రధానంగా ఆంగ్లభాషా సంప్రదాయాలను, ఆధునికాంగ్లభాషా సాహిత్య స్వరూపాన్ని, రామమూర్తి పంతులుగారు విశదీకరించారు. అయితే పండితులాయన వాదాన్ని అంగీకరించలేదు. వాళ్ళకు పాశ్చాత్య రీతుల పరిచయం తక్కువేకాక, స్థితిపాలన పరత్వమందుండే అభినివేశం కూడా, ఆయన వాదాన్ని వాళ్ళు అంగీకరించక పోవటానికి దోహదం చేసింది. ఇంగ్లీషు భాషా సామ్యం కూడా వాళ్ళకు నచ్చలేదు. ఇంతేకాక పి. టి. శ్రీనివాసయ్యంగారు ఏ భాషాశైలికి కూడా చావు పుట్టుకలుంటూ ఉంటాయని చిన్న పుస్తకం ప్రకటించటం కూడా (Language-life and death) పండితులు నవీన భాషోద్యమాన్ని విరసించటానికి కారణమైంది. ఈ పరిస్థితుల్లో సెట్టి లక్ష్మీనరసింహంగారు రచించిన గ్రీకుపురాణగాథలు (Greek Myths) 1911లో

సంవత్సరపు స్కూలుఫైనల్ పరీక్షకు పాఠ్యగ్రంథంగా నిర్ణ యించటం అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. ఈ పుస్తకం పండితులు నిరసించే గ్రామ్యభాషలో లేకపోయినా, స్వర సంధి విషయకంగాను, ఇంకా అఖిలాంధ్ర దేశ వ్యవహార స్థితములే అయిన కొన్ని శబ్దరూపాల ప్రయోగ విషయకంగాను, గ్రంథ కర్త కొంత స్వాతంత్ర్యం వహించాడు. ఈ పుస్తకం కన్నా, పి. టి. శ్రీనివాసయ్యంగారు ఈ పుస్తకానికి వ్రాసిన ఉపోద్ఘాతం పండితులకు చాలా ఆగ్రహాన్ని కలిగించింది. ఆ పీఠికలో శ్రీనివాసయ్యంగారు నవీనభాషను జీవద్భాష అని వొక్కి చెప్పటంవల్ల కావ్యభాష మృతభాషఅని సూచించినట్లుగా పండితులు కంటగించుకున్నారు. గ్రీకుపురాణగాథలన్న గ్రంథం పాఠ్యపుస్తకంగా ఉండకూడదని ఆందోళన లేవదీశారు. వాళ్ళప్పటికి రామమూర్తి పంతులుగారి ప్రజ్ఞా ప్రాభవాలను గూర్చి ఎరగరు. 1909,10 సంవత్సరాలలో అధ్యాపక సదస్సులో ఆయన స్థూలంగా భాషా పరిణామాన్ని గూర్చి మాట్లాడటమే వాళ్లకు తెలుసు కాని, ఆయన ప్రాచీన కావ్యభాషకు సంబంధించి తెలుగు వ్యాకరణానికి సంబంధించి అమోఘమైన కృషి చేసిన విషయం ఎరగరు. గురజాడ అప్పారావుగారిని వాళ్ళు లక్ష్య పెట్టలేదు. కన్యాశుల్కాన్ని గ్రామ్యగ్రంథమని నిరసించారు. ఉదాత్త సాహిత్యం వ్యవహారభాషలో సృష్టించటం అసంభవమని వాళ్ళ దృఢాభిప్రాయం. వీరేశలింగం పంతులుకూడా కొంత వ్యావహారిక భాషను తన రచనల్లో ప్రవేశపెట్టినా, కేవలం ప్రహసనాలకు మాత్రమే, ఆ గ్రామ్యాన్ని పరిమితం చేసినందుకు వాళ్ళు సంతృప్తి చెందారు. అప్పారావుకు సలక్షణమైన భాష వ్రాయటం చేత కాదని, రామమూర్తికి తెలుగురాదని, పి. టి. శ్రీనివాసయ్యంగారు తమిళుడని, ఏట్సు ఇంగ్లీషువాడని, వీళ్ళు నలుగురు దుష్ట చతుష్టయంలాగు, తెలుగు భాషకు మహాద్రోహం తలపెట్టారని ఆందోళన లేవదీశారు[1]. 1906, 12 సంవత్సరాల మధ్యకాలంలో వందేమాతరం వివాదాన్ని రాజద్రోహ నేరంగా బ్రిటీషువాళ్ళు పరిగణించినంత తీవ్రంగా, వ్యావహారిక భాషావాదాన్ని పూర్వకాలపు పండితులు నిరసించారు. ఈ పుస్తకంపట్ల, వ్యావహారిక భాషా వాదంపట్ల పండితులు తమ అసమ్మతిని తీవ్రంగా వ్యక్తం చేశారు. ఆంగ్ల ప్రభుత్వం అప్పటికే తమ సంస్కృతిని, మతాన్ని, ఆచార వ్యవహారాలను పాడుచేసిందని, భాషనుకూడా మైలపరచటం సహించకూడదని ఉద్యమించారు.

ఈ వర్గంవాళ్ళకు జయంతి రామయ్య పంతులుగారు నాయకత్వం వహించారు. అంతకుపూర్వం స్కూలుఫైనల్ స్థాయిలో తెలుగు అనువాదంలోను, వ్యాసరచనలోను, వ్యావహారిక భాషను అనుమతిస్తూ జారీచేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహ రించుకోవాలని పెద్దపెట్టున మహాజర్లు సేకరించి ప్రభుత్వానికి పంపారు. అనేక పట్టణాల్లో సభలుచేసి ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ తీర్మానాలు చేశారు.[2] పదివేల సంతకాలతో ప్రభుత్వానికి మహజరు సమర్పించారు. ఆ మహజరులో నన్నయగారి ఆంధ్ర శబ్ద చింతామణి కాలం నుంచి నేటిదాకా గ్రాంథిక భాషలో ఎటువంటి మార్పులూ రాలేదనీ వ్యావహారిక భాషవలె గ్రాంథిక భాష త్వరితగతిని మారిపోయేది కాదనీ పేర్కొన్నారు. కాబట్టి అనేక మాండలికాలతో త్వరితగతిని మారిపోయే వ్యావహారిక భాష కన్నా గ్రాంథికభాషే ఉపాదేయమని వాదించారు. అప్పుడు మద్రాసు విశ్వవిద్యాలయంవారు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకుగాను ఒక సంఘాన్ని నియమించారు. 1911 వ సంవత్సరం సెప్టెంబరు 8 వ తేదిన ఈ సంఘం నియామకం జరిగింది. ఈ సంఘంలో గ్రాంథిక భాషావాదులు నలుగురూ, వ్యావహారికభాషావాదులు నలుగురు నియు క్తులైనారు. తటస్థుణ్ణి ఒకరిని దీనికి అధ్యక్షుడుగా ఉంచారు. చెన్నపట్నంలోని రాజధానీ కళాశాలాధ్యాపకులైన ఎమ్. రంగాచార్యులు గారు దీని అధ్యక్షులు. ఈ సభ్యులు చాలాసార్లు సమావేశాలు జరిపి శిష్టవ్యవహారానికి అనుకూలంగా ఒక తీర్మానాన్ని ఆమో దించారు. ఆ తీర్మానం ఈ కిందివిధంగా ఉన్నది.

"The nominal, pronominal and verbal forms be classified as far as possible into archaic and current varieties and that current forms alone be allowed to be used in modern prose composition, current forms being determined from usage in literature as well as in the polite speech prevailing among the educated Telugu people." 3

ఈ తీర్మానం వ్యావహారిక భాషావాదులకు కొంత తృప్తి నిచ్చింది. ఇంతకుపూర్వమే విద్యాశాఖాధికారులుకూడా వ్యావహారి కాన్ని అనుమతించారు: ఆ మేరకు స్కూలు అధికారులకు తెలియ జేశారు.

"Extract from No. 3098 dated 20—9—12 of the Secretary to S. F. Board, Madras.

1. I have the honour (by direction) to inform you....That the pupils in Telugu will be examined on the supposition that they write modern or classical Telugu according to the declaration of the school they come from.....

In the case of Telugu (Group A and Group C information as to the number of pupils who will answer the papers in modern Telugu and classical Telugu should also be furnished in the statement.

(Sd) Geo Maddox, Secretary. 4

ఆ తరవాత నెలరోజులకు మళ్ళా ఆధునికభాషఅంటే ఏమిటో వివరిస్తూ స్కూలుఫైనల్‌బోర్డువారు ఒక వివరణను ప్రకటించారు.

3479 dated 29–10–12. By modern Telugu the Board means Language of the kind used in such books as Brown's Reader, the first part of Arden's Telugu grammar and Enugula Veeraswamayya's 'Kasiyatra Charitram'. Schools which do not favour this kind of Telugu need make no declaration It was reported to the Board that one and the same school proposed to send up some pupils of the school in classical Telugu and remaining pupils in modern Telugu. It is the desire of the Board that all pupils belonging to a school should be examined alike; that is either in classical Telugu or in Modern Telugu alone, not in both, It is accordingly requested that this may be borne in mind in filling the enclosed form, there is thus to be only one entry under Telugu - either against classical Telugu or Modern Telugu.

(Sd) Geo Maddox, Secretary.[5]

ఈ విధంగా 1912 వ సంవత్సరానికల్లా, స్కూలు ఫైనల్, ఇంటర్‌మీడియట్ పరీక్షలలో వ్యాసరచన, అనువాదాలకు వ్యావహారికభాష ఉపయోగించవచ్చునన్న అనుమతి లభించింది. గురజాడ అప్పారావుగారు, పి. టి. శ్రీనివాసయ్యంగారు మొదలైనవారు విశ్వవిద్యాలయం నియమించిన ఇంటర్‌మీడియట్ కాంపోజిషన్ కమిటీ సభ్యులు. వచనరచనలో ఈ దిగువ పేర్కొన్న రూపాలు, ఉపయోగించవచ్చునని ఆ కాంపోజిషన్ కమిటీవారు సూచించారు.

1. పదస్వరూపం. (ఉనుచు)—ఉంచు, (వలదు)—వద్దు, కొద్ది, కద్దు, వెదుకు, చిదుకులు, చిలక, ఎలక, మరుదులు

(క్రాగు)—కాగు, ప్రాత—పాత, కంత, కత్తి
(ఇరువది)—ఇరవై, అరవై
(రెండవ)—రెండో, మూడో
(అదియా?)—అదా !
(వాడేయా?)—వాడేనా !

(తాటియాకు)—తాటాకు, ఒకరాత్రి, ఓరాత్రి, మహాబాగు, మాబాగు, మహాలక్ష్మి, మాలక్ష్మి, వాడూనేనూ, తల్లీతండ్రీ, అలా, కావా, మరీ, కూడా, చాలా, అనే, ఐతే, ఐనా.

(అదియే)—అదే, ఇంకా
(యౌవనము)—యవ్వనము
(సంజ్ఞ)—సౌంజ్ఞ, అదిగో, అవిగో
(సందేహము)—సందియము
(ముప్పురు)—ముగ్గురు, ఇద్దరు
(ఇట్టులు)—ఇట్లు
(కన్నియ)—కన్య
(ముత్తియము)—ముత్యము మొదలైనవి.

2. విభక్తులు—వాండ్లు, వాళ్లు, ఇండ్లు, ఇళ్లు, కాళ్లు, వేళ్లు, గుర్రములు, గుర్రాలు, ప్రాణాన, (అల్లుండు)—అల్లుళ్లు, కూతుళ్లు, పెళ్లిళ్లు, (వానిని)—వాడిని(వానికి)—వాడికి, పిల్లవాడికి, వాడితో, వాటిని, వాటికి, రాజుకు, కూతురికి, ఊరునించి, కేసి, కోసము, కోసరము, వల్ల, దగ్గరికి, (గుంటూరునకు)—గుంటూరికి, నెల్లూరికి, (గుంతకల్లునకు)—గుంతకంటికి, నోరుగంటికి, చేబ్రోలికి, నడిమికి, నోటికి, నీటికి, అందుకు, ఎందుకు మొదలైనవి.

3. క్రియలు—చేస్తాను, చేశాను, చేసినా, చేతును, చేస్తివి, చేస్తూ, చేసింది, చేసే, చేసేటి, చేయించు, చేయించక, చేతాము, చేస్తే, చేసుక, చేసుకొని, చేసుకో, చేసినాను, చేసే చేయక, చేయడము, చదవడము, చదివేటి, చదువుతూ, చదివితే, పడ్డాను, పడతాను, అంటాను, ఉంటాను, చదువుదాము, చదువుతారు, వద్దాము, తెద్దాము, తెలుసును, చేతును, కోతును మొదలైనవి.

4. మిశ్ర సమాసములు—అపనమ్మకము, అర్ధరూపాయి, దురలవాటు, గతనెల, గ్రామమునసబు, వినాయకచవితి, అర్ధణా, ఉత్తమ తరగతి, అనేకమంది, ప్రతివాడు, గర్భగుడి, దానపట్టా, క్రయచీటి, నేరారోపణము మొదలైనవి.[6]

ఈ పైపేర్కొన్న రూపాలన్నీ సాధువులుగా అంగీకరించవచ్చునని కమిటీవారు సూచించారు. అటు తరవాత రామమూర్తి పంతులుగారు. బాలకవిశరణ్యం లోను, ఆంధ్రపండిత భిషక్కుల భాషా భేషజంలో లోను, అసాధువులుగా పండితులు నిరసించిన రూపాలను, సాధువులుగా నిరూపించి, పూర్వకవి ప్రయోగాలతో సాధించారు.

కాని వ్యావహారిక భాషావాదుల విజయం అల్ప కాలికమే అయింది. ఏ రెండుమూడు సంవత్సరాలు మాత్రమో వారికోరిక సిద్ధించింది. ఈ లోపున వ్యావహారిక భాషను గ్రామ్యభాషగా చిత్రించి, దేశంలో పెద్దపెట్టున ఆందోళన లేవదీసి, ప్రభుత్వం పైన గ్రాంథిక భాషావాదులు వత్తిడి తెచ్చారు.

1911 వ సంవత్సరంలోనే ఆంధ్రసాహిత్య పరిషత్తు స్థాపనం జరిగింది. ఆంధ్రసాహిత్య పరిషత్తువారు అప్పట్లో తల పెట్టిన ఉద్యమాన్ని గురించి రామమూర్తి పంతులుగారు ఇట్లా చెప్పారు. "1911 వ సంవత్సరమున బడులలో విద్యార్థులు వ్యావహారికాంధ్రమున రచనాభ్యాసము చేయుడమునకు విద్యాధికారులు అనుమతించినారు. అది కొందరికి అయిష్టమైనది. ప్రాచీనాంధ్ర గ్రంథములలోని భాష వాడుకలో లేనందుచేతను, ఆ భాష నేర్చుకోవడమునకు కావలసిన వ్యాకరణముగానీ, నిఘంటువుగానీ సంపూర్ణమైనది లేనందుచేతను, పండితులకైనా ఆ భాషను అభ్యసించడం దుష్కరముగా ఉన్నదని అప్పుడు నావంటివాళ్ళు,

వాదిస్తే, ప్రతికక్షులలో ధనికులు కొందరు గ్రాంథిక కాంధ్ర భాషాభిమానము కలవారు, సద్భావముతోనే వ్యావహారిక భాష వ్యాపింపకుండా చేయడము కోసము ఈ ఆంధ్రసాహిత్య పరిషత్తు స్థాపించినారు. వ్యావహారికభాష గ్రామ్యముగనుక దానిని త్యజించవలెను. గ్రాంథిక భాష నెలకొల్పవలెను. అది ఆంధ్రులందరూ నేర్చుకోవడము సుకరముగా చేయడానికి సంపూర్ణమైన నిఘంటువూ సంపూర్ణమైన వ్యాకరణమూ, భాషా రచన సమగ్రముగా నిరూపించే బాలశిక్షము రచించి ప్రకటించవలెను. అని వీరు తీర్మానాలు చేసినారు.'' 7

తెలుగుదేశంలోను ఇతర్రతా కూడా గ్రాంథిక భాషాభిమానులు, సభలూ సమావేశాలు జరిపి, నవీనభాషా ప్రవర్తకులను విమర్శిస్తూ తీర్మానాలుచేసి, విశ్వవిద్యాలయాధికారులకు, ప్రభుత్వానికి పంపించారు. ఈ విషయంలో రాజకీయాందోళనమువంటి ఆందోళన ఆ రోజుల్లో చెలరేగింది. రెండుపక్షాలు, వాదోపవాదాలు ఖండన మండనలు పత్రికల్లో వెలయించారు. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'హిందూ' ఈ వాదవివాదాల భాగాములను ప్రజలకు తెలియచెప్పేందుకు, ఒకచర్చా వేదికను నిర్వహించి, ఇరుపక్షాల వాదాలను ప్రకటించడం, ఆ ఉద్యమ తీవ్రతను వెల్లడిస్తున్నది. నాటి దినపత్రికలన్నీ, ఈ సభలూ సమావేశాలు, తీర్మానాలు ప్రకటించేవి. 1914 వ సంవత్సరంలో ఈ ఆందోళన చరమస్థాయి నందుకోవడంతో, విశ్వవిద్యాలయాధికారులు, వ్యవహారిక భాషకు తాము కల్పించిన గుర్తింపు రద్దుచేయవలసి వచ్చింది. 1914 వ సంవత్సరంలో ఆంధ్రదేశంలో వివిధ ప్రదేశాల్లో వ్యావహారిక భాషను నిరసిస్తూ, జరిగిన సమావేశాల వివరాలు నాటి హిందూపత్రికద్వారా తెలుసుకోవచ్చు. గొప్పగొప్ప రాజకీయోద్యోగులుగా ఉన్నవాళ్లూ పండితులూ కవులూ ఈ సమావేశాలకు అగ్రాసనాధిపత్యం వహించి, వ్యావహారిక భాషోద్యమాన్ని నిరసించే తీర్మానాలు చేశారు. ఇవికాక ఆంధ్రసాహిత్య పరిషత్తువారు కొన్నిసభలూ సమావేశాలూ నిర్వహించారు. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు, కాశీ కృష్ణమాచార్యులుగారు, కొలాచలం శ్రీనివాసరావుగారు, కందుకూరి వీరేశలింగం పంతులుగారు, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, మొదలైనవారంతా ఈ సమావేశాల్లో పాల్గొన్నవాళ్లే. ప్రతిపాదకులుగానో, అనుమోదకులుగానో, అగ్రాసనాధిపతులుగానో, ఆయాఊళ్లలో బహిరంగసభలూ, సమావేశాలూ జరిపి, వ్యావహారిక భాషోద్యమాన్ని నిరసించినవాళ్లే. కాకినాడ, బెజవాడ, నూజివీడు, గుంటూరు, పిఠాపురం, కడప, పెద్దాపురం, తుని, తిరుపతి, ప్రొద్దుటూరు, అమలాపురం. ఎలమంచిలి, తణుకు, రాజమండ్రి. అనంతపురం, బందరు, బళ్లారి, కర్నూలు, పెనుగొండ, నెల్లూరు, బరంపురం, హార్పనహళ్లి, బారువ, అన్నవరం మొదలైన ప్రదేశాలలో, జరిగిన సమావేశాలు, వ్యావహారిక భాషోద్యమాన్ని తెగడుతూ ఎటువంటి తీర్మానాలు ఆమోదించాయో అప్పటి హిందూ, ఆంధ్రపత్రిక మొదలైన దినపత్రికల నుంచి తెలుసుకోవచ్చు.8

ఆ రోజుల్లో వ్యావహారిక భాషావాదుల, తద్వ్యతిరేకుల వాదవివాదాల స్వరూపాన్ని వివరించడం అప్రస్తుతం కాదు.

ఇంగ్లీషు భాషకు సంబంధించి శిష్టుల వాగ్వ్యవహారానికి, ఆధునిక కావ్యభాషకు అట్టే అంతరంలేదని, కనక తెలుగులోకూడా అట్టి అంతరం అవాంఛనీయమనీ, ప్రపంచ పరివ్యాప్తంగా ఆర్థికసాంఘికరాజకీయాదిరంగాలలో నెలకొంటున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని, తెలుగుభాష వికసించవలెనంటే, సుసంపన్నం కావలెనంటే, శిష్టవ్యవహారికభాషమాత్రమే అందుకు సాధనం కాగలదని వ్యావహారిక భాషావాదుల వాదం

ఇంగ్లీషుతో తెలుగుకు సామ్యం తీసుకొనిరావడం తప్పనీ, స్వాభావికధర్మాలనుబట్టి, ఈ రెండింటికీ చాలాభేదం ఉందనీ, దేశకాలపాత్రలనుబట్టికూడా, తెలుగుకూ ఇంగ్లీషుకూ, భాషాపరిణామం, భాషావికాసాలదృష్ట్యా సాదృశ్యంలేదనీ, ఈ విధంగా తెలుగును ఇంగ్లీషుతో ముడిపెట్టడం, తప్పుదారి తొక్కించే ప్రయత్నంతప్ప వేరేమీకాదనీ, తెలుగుభాషకూడా క్రమంగా అభివృద్ధిపొందుతూనే ఉన్నదనీ, నవలలు, నాటకాలు మరింకెన్నో సాహిత్యశాఖలు, అపూర్వమైనవి తెలుగులో నెలకొంటూనే ఉన్నాయని, ఉదాహరణకు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి గయోపాఖ్యానం, పాఠ్యపుస్తకంగా స్కూల్లోగాని, కాలేజీలోగాని, పెట్టక పోయినప్పటికీ 16,000 కాపీలు చెల్లిందనీ, ఫోర్టుసెయింటు జార్జి గెజటును పరిశీలిస్తే తెలుగులో పుస్తకాలు ప్రతిసంవత్సరమూ అధికసంఖ్యలో వెలువడుతూఉండటం చూడవచ్చుననీ, ఈ గ్రంథాలు గ్రాంథికభాషలోనే వెలువడుతూ ఉన్నాయని, గ్రాంథికభాషావాదులవాదం. అంతేకాని స్కూలుపిల్లలు, కాలేజీ విద్యార్థుల వ్యాసరచనలోను, అనువాదంలోను గ్రామ్యరూపాలను అనుమతించకూడదని గ్రాంథికభాషావాదులు విద్యాశాఖాధికారులకు విజ్ఞప్తులు పంపుకున్నారు.

వ్యావహారికభాష అనగానే శిష్టేతర వ్యవహారంలోఉన్న గ్రామ్యమేనని నిర్ధరించడంతో, గ్రాంథికభాషాభిమానులవాదం, సంకుచితమైపోయింది. వ్యావహారికభాషా ప్రయోజనాలను గుర్తించటానికి వాళ్లు నిరాకరించారు. వాళ్ల తీవ్రప్రతిఘటనోద్యమం ద్వారాకూడా కొంతలోకొంత వ్యవహారికభాషావాదానికి ప్రచారం చేకూరిందని చెప్పవచ్చు.

పూర్వుల ఫర్మానాలు, క్రయపత్రాలు, దానపత్రాలు, శిలా శాసనాలు, ఉత్తరప్రత్యుత్తరాలు, మతవేదాంత నీతివిషయక గ్రంథాలకు వ్యాఖ్యానాలు మొదలైనవన్నీ వ్యావహారికభాషలోనే ఉండేవన్న సత్యాన్ని, వ్యావహారికభాషావాదులు ప్రతిపాదించినప్పుడు, అవన్నీ తెలుగుభాషా పాండిత్యంలేని సంస్కృత విద్వాంసులు రచించినవనీ, వాటిలో మాండలిక భేదాలు పరశ్శతంగా ఉంటాయనీ, అవి ప్రామాణికంగా గ్రహించటానికి వీలులేదనీ, ఈకాలం వాళ్ళకు అవి బోధపడటంలేదనీ, ముఖ్యంగా శాసనభాష, ఇప్పుడు అర్థంకాదనీ, కావ్యభాషకూడా కాలక్రమేణా తరవాత కాలం వాళ్ళకు అర్థంగాకుండా పోయేదురదృష్టం సంభవించ కూడదనీ, వ్యావహారిక భాషావాదాన్ని అంగీకరిస్తే అటువంటి ప్రమాదం తప్పకుండా సంభవిస్తుందనీ గ్రాంథికభాషావాదులు వాదించారు. వ్యావహారిక భాష అనగానే, అది మాండలిక భేదాలతో వివిధ ప్రాంతాలవాళ్ళకు దురవగాహంగా ఉంటుందనీ, అన్ని ప్రాంతాల వాళ్ళకూ గ్రాంథిక భాష సులభంగా అర్థమవుతూ ఉన్నదనీ, కాబట్టి గ్రాంథిక భాషే శరణ్యమని ప్రతిపాదించారు.

గ్రాంథిక భాష నన్నయ్యగారి కాలంనుంచీ మార్పులకు లోను కాలేదనీ, మాండలికభేదాలు పరస్పరావగాహనకు ఆటంకమవుతాయనీ వాదించటం గ్రాంథిక భాషాభిమానుల అనభిజ్ఞతను, భాషా సాహిత్య విషయకమైన పరిణామదృష్టి లేకపోవడాన్ని సూచిస్తున్నాయని చెప్పవచ్చు. మాండలిక భేదాలు పరస్పరావగాహనకు ప్రతికూలంగా పరిణమించినప్పుడు అవి ప్రత్యేకభాషా ప్రతిపత్తిని పొందుతవేకాని, మాండలిక భేదాలుగా ఉండిపోవు. ఒక ప్రాంతం వారికీ ఇంకొక ప్రాంతం వారికి మధ్య వ్యవహారం అప్పుడు ఒకేభాషలో సాగదు. భాషలో రూపాంతరాలు, పర్యాయపదాలు అన్నవాటికి అర్థాన్ని నిరూపించటం కుదరదు. వాగ్వ్యవహారంలో భాష మారిపోతూనే ఉంటుంది. లేకపోతే వర్ణలోప, వర్ణాదేశ, వర్ణవ్యత్యయాదులకు కాని, అర్థవిపరిణామాన్ని కాని నిరూపించడం సాధ్యంకాదు. అంతే కాకుండా వ్యావహారిక భాషావాదుల వాదాన్ని సమర్థించేవాళ్ళు, ఆ కాలంలో వెలువడిన బుర్రా శేషగిరిరావుపంతులుగారి విమర్శాదర్శాన్ని, 1911 వ సంవత్సరంలో స్కూలుఫైనల్ తరగతికి పఠనీయగ్రంథంగా నిర్ణయించిన 'గ్రీకు మిత్రులు 'అన్న సెట్టి లక్ష్మీ నరసింహంగారి గ్రీకు పురాణగాథలను, అంతకుపూర్వం సుమారు పదిహేను సంవత్సరాలకుముందు వెలువడిన గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కాన్ని, తమ వాదప్రామాణ్యాన్ని నిరూపించే కొల బద్దలుగా పేర్కొనటం, ఒక లోపమేనని చెప్పాలి. ఎందుకంటే వారాశించే ప్రయోజనాలను, ఈ గ్రంథాలు ప్రతిపాదించటంలేదు. కన్యాశుల్కంలోని జీవద్భాష అపరిమిత ప్రయోజనాన్ని సాహిత్య దృష్టితో సాధించగలిగినా, స్కూలు పిల్లల కాంపోజిషన్‌కు పనికిరాదు. తక్కిన రెండు గ్రంథాలలో లోపాలు చాలా ఉన్నాయి. గ్రీకు మిత్రులన్న గ్రంథంలో మూలాన్ని చదవకుండా అర్థం చేసుకోలేని భాగాలున్నాయనీ, విమర్శాదర్శంలో శబ్దాడంబరమూ, సంస్కృత సమాసజటిలతా, అధికంగా ఉన్నాయనీ గ్రాంథికవాదులు విమర్శించారు. తెలుగు పండితులుగా పనిచేస్తూ, విశ్వవిద్యాలయంనుంచి స్వర్ణపతకాన్ని తెలుగులో పాండిత్యానికిగాను పొందిన గ్రాంథికవాది హిందూ పత్రికలో ఇట్లా వ్రాశారు.

"The modernist has produced three books to illustrate his literature. 1. Kanyasulkam 2. Greek Myths 3. Vimarsadarsa, the last of which is a very recent publication. It can be challenged that the prose of Nannaya in Bharatam, the first known work in Telugu, written 900 years ago stands far higher in respect of intelligibility than any of the above three books, which the modernists boast of. To have even a glimmering idea of the subject matter of Kanyasulkam is impossible, if the reader has not got a fair knowledge of English. He must be acquainted with some works of Shakspeare also. Greak Myths are unintelligible in some parts unless the leader has read the original in English. The last but not the least in importance viz. 'Vimarsadarsa' is nothing but a tissue of pedantic, lengthy sanskrit compounds cemented by colloquial if not slang inflections" 9

గ్రాంథిక భాషాభిమానులు, వ్యావహారిక భాషావాదాన్ని సరిగా అర్థం చేసుకోలేదని చెప్పటానికి, నాటి వాదాల తీరుతెన్నులు స్పష్టం చేస్తున్నాయి. వ్యావహారిక భాషావాదులు, వ్యాకరణ నియమోల్లంఘనం మాత్రమే ధ్యేయంగా పెట్టుకున్నారనీ, కావ్యభాషను సంపూర్ణంగా నిరసిస్తున్నారనీ, నోటిమాటకు, చేతివ్రాతకు అభేదాన్నే లక్షీకరిస్తున్నారనీ, వస్తువు, శైలి, లక్షణము, ఉదాత్తత మొదలైనవన్నీ పరిహరించవలెనంటున్నారని అభిప్రాయపడటం ఎంతమాత్రమూ సహేతుకం కాదు. ఈ విషయాన్ని పూర్వోదాహృతుడైన స్వర్ణపతకగృహీత వాక్యాలనుబట్టి అర్థం చేసుకోవచ్చు:

"The literature will be modern, not that it transgresses the approved rules of Grammer, prosody and rhetoric but that it assimilated new ideas and enriches its vocabularry amidst the new surroundings and dealings with the modern progressive world." 10

పైన పేర్కొన్న అభిప్రాయంలో ఉత్తరార్ధమైన భావమే వ్యావహారిక భాషావాదులవాదానికికూడా జీవగర్ర. తిరుపతి వేంకట కవులు చెప్పిన 'కాలముజట్టి దేశమునుగాంచి ప్రభుత్వము నెంచి దేశభాషా లలితాంగి మారుటది సత్యమవి సమ్మతమౌట, నన్యదేశ్యాలును నాంధ్ర భాష గలవాటను నొచితిబట్టి మేము కబ్బాలను వాడుచుంటి మవి పండితు లేగతి నొప్పుకుందురో' అన్నవాదమే వ్యావహారిక భాషావాదులకు శిరోధార్యమూ, ప్రమాణవాక్యమూ అయింది తరవాత.

అర్ధశతాబ్దం గడిచిపోయిన తరవాత వాదవివాదాల తీక్ష్ణతలను అవతలకు నెట్టి స్థిమితంగా ఆలోచిస్తే ఆ రెండుపక్షాల వాళ్ళూ, అనేక విషయాలలో ఏకీభవించే ఉన్నారన్న విషయం

మనకు ఆశ్చర్యాన్ని కలగజేస్తుంది. అయితే ఆ విషయాన్ని వాళ్లు ఎందుకో ఆ రోజుల్లో గుర్తించలేదు. తెలుగు ప్రధానోపాధ్యాయుడిట్లా వ్రాస్తున్నాడంటూ 'హిందూ'పత్రికలో నవీనభాషోద్యమ వ్యతిరేకాభిప్రాయం ఈ విధంగా వెలువడింది.

"English Literature has improved by the richness of its vocabulary. Telegu may do so. Grammar sanctions it and tradition allows it. If to express a new idea there is no Telugu word or easy sanskrit equivalent, borrow the English word in to Telugu giving to it the terminations prescribed in the Grammer. The concession was given long before it was asked for. 'Anya thesyams' were freely used in old Telugu books. Where for any word, Grammar prescribes more than one form select only that for use which is current in spoken language, leaving the rest for metrical and other purposes. Visandhis began to be used with a view to clearness in popular prose works, long before the modern movement came into existence."[11]

ఈ అభిప్రాయంతో వ్యావహారిక భాషావాదులకు అట్టే వ్యతిక్రమం లేదు. ఒక పదానికి ఒకటినిమించిన రూపాంతరాలుంటే వ్యవహారంలో ఉన్నదానిని స్వీకరించాలనటమే వ్యావహారికభాషావాదుల అభిప్రాయంకూడా. అన్యదేశ్యాలు స్వీకరించడంలో, ఏ విధమైన సంకోచాలూ లేనివాళ్లు వందల సంవత్సరాలుగా ప్రజల వాగ్వ్యవహారంలో నలిగిన రూపాలు, అసాధువులనీ, గ్రామ్యాలనీ నిరసించటం భాషాపరిణామదృష్టి లేకపోవటమే. వ్యాకరణమంటే సరైన అవగాహన లేకపోవటంవల్ల ఈ చిక్కు కలిగింది. అదీకాక నవీన భాష ముఖ్యంగా వచన వికాసంకొరకే తాము ప్రతిపాదిస్తున్నామని రామమూర్తి పంతులుగారు, అప్పారావుగారు మొదలైన నవీన భాషోద్యమ ప్రవర్తకులు పదేపదే స్పష్టంచేసినా, సంప్రదాయ వాదులు ఆ విషయాన్ని చెవికెక్కించుకోలేదు.

బహుశా ఆ రోజుల్లో నవీన భాషను వ్యతిరేకించిన వాళ్లంతా స్కూలు కాలేజీ విద్యార్థుల వ్యాసరచనలోనూ, అనువాదంలోను దాని ప్రవేశార్హతను గురించే మిక్కుటమైన వ్యతిరేకతను కనపరిచారనుకోవాలి. ఆధునిక విజ్ఞాన విషయాలను వివరించాలన్నా, భాషాంతరీకరణం చెయ్యాలన్నా, వాడుకరూపాలే ఎక్కువగా ఉపయోగపడతాయన్న విషయం, గ్రాంథికవాదులు గుర్తించక పోవటంతో ఈ వాద వివాదాలు చాలాకాలం కొనసాగాయి.

పూర్వోదాహృతుడైన ప్రధానోపాధ్యాయుడే తమ గ్రాంథికాభిమానాన్ని ఈ విధంగా వెల్లడి చేశారు.

"The attempts of the well wishers of any Language should be to elevate, as far as possible, the spoken dialect to the level of the literary, not to lower the literary Language to that of spoken"...

"It must be admitted that there is a greater divergence between 'spoken' and 'grandhic' Telugu than between 'spoken' and written English, but the gulf should be covered not by pulling down the standard Telugu, but lifting up the language of speakers..."[12]

సరిగ్గా వ్యావహారిక భాషావాదుల ఉద్యమం ఈ ప్రయత్న సాఫల్యంకొరకే. శిష్టవ్యవహారానికి కావ్యత్వం కల్పించడంలో దోషం లేదన్నదే నవీనవాదుల తాత్పర్యం. పై అభిప్రాయాన్నిబట్టి ఇరు పక్షాల వారికీ వాదవివాదాలు అంత తీవ్రంగా ఎందుకు కొనసాగాయో అర్థంకాదు. అయితే రెండు పక్షాలవారికీ వ్యాకరణాధిపత్యందగ్గరే భేదదృష్టి ప్రాబల్యం వహించింది. వ్యావహారిక రూపాలను, వ్యాకరణ సమ్మతంగాచేసి సంస్కరించి గ్రహించాలని పూర్వపక్షీయుల మతమైతే, శిష్టవ్యవహారంలో ఉన్నరూపాలను అనుశాసనం చేయవలసిన బాధ్యతే వ్యాకరణానికి వుంటుందికాని, వ్యాకరణాన్ని దృష్టిలో పెట్టుకొని వాగ్వ్యవహారంలో ఉన్న రూపాలను మార్చరాదని ప్రతిపక్షాల మతం. లక్షణాన్నిబట్టి లక్ష్యం మారాలా, లేక లక్ష్యాన్నిబట్టి లక్షణం విస్తృతి పొందాలా అన్న ప్రాథమికాంశం దగ్గరే, వాళ్లకు ఏకవాక్యత కుదిరేందుకు అవకాశం లేకుండా పోయింది. దాంతో వ్యావహారిక భాషను గ్రామ్యమని గ్రాంథికాభిమానులు నిరసించి, వ్యావహారిక ప్రయోగాలు అసాధువులని తీర్పు చెప్పారు.

అంతే కాకుండా శిష్టవ్యవహారిక మనేది కూడా దేశవ్యాప్తంగా ఒకేరూపంతో లేదనీ, అందువల్ల శిష్టవ్యవహారికంతో రచించినా, ఆ రచనలు ఉద్దిష్ట ప్రయోజనాన్ని సాధించలేవనీ, కాబట్టి అనేక వందల సంవత్సరాలనుంచీ, అన్నిప్రాంతాలవాళ్ళూ, అర్థంచేసుకొని కావ్యానుభవానందాన్ని అనుభవించ గలుగుతున్న గ్రాంథికాన్నే విద్యార్థులు తమ విద్యాభ్యాసకాలంలో నేర్చి, అటుతరవాత గ్రంథాలు రచించాలని గ్రాంథికవాదులు తీర్మానాలు చేశారు. కొన్ని వ్యావహారిక రూపాలు కవుల గ్రంథాలలోకి ఎక్కినంత మాత్రాన, శిష్టవ్యవహారిక భాష, గ్రంథ రచనకు ఉపాదేయం కాదనీ, ఒకవేళ శిష్టవ్యవహారంనుంచి ఏవైనా రూపాలు స్వీకరించవలసివచ్చినప్పుడు ఆ శబ్దాలను పదాలను, వ్యాకరణ సమ్మతాలుగా చేసి ఉపయోగించుకోవాలనీ, గ్రాంథికాభిమానులు వాదించారు. గ్రాంథిక భాష తొమ్మిది వందల సంవత్సరాలనుంచీ మారలేదనడం, వీరేశలింగం ప్రభృతులు తమ రచనలను వ్యాకరణబద్ధంగా, సులభ గ్రాంథికంలో రచిస్తున్నారనడం, గ్రాంథికభాషావాదుల వాదంలో గొప్ప లోపాలని చెప్పాలి. హిందూ పత్రికలో శిష్టవ్యవహారానికి గ్రంథప్రవేశార్హత లేదటానికి తెలుగు ప్రధానోపాధ్యాయులవారు చూపిన ఉపపత్తులు శాస్త్రీయ దృష్టి లోపించినట్టివి. అయినా ఇట్లా వ్రాశారు.[13]

"........I fail to see how Modern Telugu which is none other than colloquial Telugu, contraversing Tradition and most of the accepted rules of Grammar and varying almost with the district and caste to which the speaker belongs can be more intelligible

than the simply written Grandhic Language which is common to all that go by name of Telugus.

I append here to a small list to prove lack of uniformity and hence of general intelligibility in colloquial tongues.

Colloquial Telugu of upper classes in the Ananthapur District.	Corresponding words in colloquial Telugu used by the upper classes of the Godavari District.
పిసువులు	ఆవాలు
వాడ	గాడి
వాకిలి చిలుకుపెట్టు	తలుపు గొళ్ళెం వేయు
తిక్కట	తోపుట, నొక్కి రాయడం
పైటి వేళ	మధ్యాహ్నం దాటినతర్వాత
కుజ్జ	గిత్త
మెత్తగా	సుస్తీగా, జబ్బుగా
లక్ష్మీవారము	శుక్రవారము
మర్నాడు	మొల్కొండి
కొలకున్నాయి	వాలా వున్నాయి
పెన్నప్ప	పోతానయ్యా
సుగ్గులు	పిడకలు
కొంప	వూరు''

అని ఈ విధంగా గోదావరిజిల్లాకున్నూ, అనంతపురంజిల్లాకున్నూ శిష్టుల వాగ్వ్యవహారంలో మాండలికభేదాలున్నాయని గొప్ప లోపంగా ఆయన విమర్శించారు.

శిష్టవ్యావహారికంలో ఏకరూపతలేదనీ, భిన్నప్రాంతాల వాళ్ళకు తమ తమ వ్యావహారికం తప్ప అన్యం బోధపడదనీ సిద్ధాంతీకరించదలచుకొన్నా పై పరిశీలన విమర్శకు నిలవదు. అనంతపురం వాళ్ళు వాకిలి అంటారనీ, గోదావరిజిల్లా వాళ్ళు తలుపు అంటారని అందువలన పరస్పరం వాళ్ళకు గుమ్మం అనే అర్థంలో అవి దురవబోధాలనీ అనుకోవటం సత్యదూరం. ఏమైనా ప్రకరణం, ఆకాంక్ష, అన్వయము, మొదలైన వాటి సన్నిధిని విడిచి, ఏవో కొన్నిపదాలు, వేరువేరు ప్రాంతాలలో వేరువేరు రూపాలలో ఉన్నంతమాత్రాన శిష్ట వ్యావహారికం బోధపడదనుకోవటం సరైన పంథా కాదు. ఆ పదాలు పూర్వవ్యాకరణ సమ్మతాలై ఉండాలనటం ఉచితంకాదు. ఈ విషయాన్ని గురించి పూర్వవైయాకరణులు, స్పష్టంగా విశదీకరించే ఉన్నారు.

'ఒక జీవద్భాషకు సమగ్రమైన వ్యాకరణం అసాధ్యం. ఒకరికి సమగ్రమనిపించింది కొన్నాళ్ళకి అసమగ్రమవుతుంది. మానవులలో దినదినాభివృద్ధిచెందే అనుభవ వైశాల్యం భాషావైశాల్యానికి కారణమౌతుంది. అందుకే 'లోకోపచారాద్గ్రహణసిద్ధిః' (కాతం 1—1—23) అన్నారు వైయాకరణులు.'[14]

మహామహోపాధ్యాయులైన తాతా సుబ్బరాయశాస్త్రులవారు "గ్రాంథికభాషే అందరికి సుబోధము కాని వ్యావహారికభాష అన్ని మండలములవారికీ సుబోధకముకాదు' అని గ్రాంథికవాదులు వాదిస్తారు. మాండలిక భేదములుంటే నిఘంటువులు వ్రాసి వాటిని చూపండి. గ్రాంథికభాషకు మాత్రము మాండలికభేదము తప్పేదికాదు" అనిశిష్టభాష ప్రాముఖ్యాన్నిగూర్చి వివరించారు.[16]

అయితే క్రమక్రమంగా గ్రాంథికాభిమానులు వ్యావహారిక భాషావాదంలోని ఔచితిని గుర్తించారుకాని తొలిదశలోమాత్రం, తీవ్రమైన వ్యతిరేకతనే కనపరచారు. అన్నిటికన్నా ముఖ్యంగా స్కూలుపిల్లల కా స్వాతంత్ర్యం కలిగించేందుకు వాళ్లకు ఎంత మాత్రమూ ఇష్టంలేకపోయింది. 1912 వ సంవత్సరంలో ఎప్పుడైతే ప్రభుత్వం స్కూలుపిల్లల పరీక్షలకు సంబంధించిన సమాధానపత్రాలలో వ్యావహారికభాషకు ప్రవేశార్హత కల్పించిందో, నాటినుంచే ఆ అనుమతిని ప్రభుత్వం ఉపసంహరించుకొనేవరకూ ఆందోళన జరిపారు.

"It may be recollected that the meeting of the local legislature council in November last, the Hon'ble Mr. B. N. Sarma recommended that the circulars of the Secondary School-leaving Certificate Board giving to schools the choice of presenting all their pupils for examination in modern Telugu or classical Telugu and another circular giving the pupils from the same schools the option of using different styles and enabling the same pupils to answer the papers in different styles at the public examinations should be withdrawn. The mover withdrew the resolution, however on the distinct assurance given on behalf of Government by Sir Alfred Bowne, that the circulars will remain in force only until the Intermediate Telugu Composition Committee submits its report."[16]

దీన్నిబట్టి గొప్పగొప్ప పదవు లలంకరించిన ప్రభుత్వోద్యోగులు, శాసనసభ్యులు, ప్రజాహితైకతత్పరమతులు, సాంఘికరాజకీయ రంగాలలో కృషిచేస్తున్న పెద్దలు, వ్యావహారిక భాషోద్యమంపట్ల ఎటువంటి వైముఖ్యాన్ని ప్రదర్శించారో తెలుస్తున్నది. పైన ప్రసక్తమైన ఇంటర్మీడియట్ తెలుగు కాంపోజిషన్ కమిటీ 1913 మార్చినెలలో ఇంకొకసారి విస్తృత ప్రాతిపదికపైన ఏర్పాటయింది. ఇందులో శ్రీ వేదం వెంకట్రాయశాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, జయంతి రామయ్యపంతులు గ్రాంథికభాషా వాదానికి ప్రతినిధులుగానూ, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, బుర్రా శేషగిరిరావు మొదలైనవారు వ్యావహారికభాషా వాదానికి ప్రతినిధులుగాను నియుక్తులైనారు.

"వ్యాసరచనకు గ్రంథములందలి రూపములున్నూ వాడుకలో గల రూపములున్ను ప్రయోగార్హములే" అని తీర్మానం ఆమోదించారు. ఇది గ్రాంథిక భాషాభిమానులకు ఇష్టం లేకపోయినా, అధిక సంఖ్యాకులైన సభ్యులు సమ్మతించడంవలన ఆమోదం పొందింది.

అటువంటి పద పట్టికలను తయారు చేయవలసిందిగా, సిమ్మిటి 1913 సెప్టెంబరులో వెంకట్రాయశాస్త్రి, లక్ష్మణరావు, అప్పారావులతో ఒక ఉపసంఘాన్ని నియమించారు. రెండునెలల గడువుపెట్టి, వీరిని నామవాచక, సర్వనామ, క్రియారూపాల వర్గీకరణం చేయవలసిందిగా కమిటీ ఆదేశించింది. అయితే గ్రాంథిక భాషావాదులు నిరాశ పొందలేదు.

"వాడుకలోగల రూపములను ఎన్నుకొనునప్పుడు దేశమందంతటనుగల శబ్దరూపములను ఎన్నుకోవలసి యున్నది. ఈ ఉపసంఘంలోఉన్న సభ్యులందరూ సర్కార్ జిల్లాలవారే. కాని ఇందులో రాయలసీమ ప్రతినిధులు ఎవరును లేరు. కనుక రాయలసీమ ప్రతినిధులను నలుగురిని ఈ ఉపసంఘములో చేర్చుకొనవలెను అన్న కోరిక తెలియజేస్తూ తెలుగు పెద్దలు విశ్వవిద్యాలయము వారికి మహజర్లుపంపి ఒత్తిడి కలిగించినారు. వారి కోరిక ననుసరించి నలుగురిని రాయలసీమ ప్రతినిధులను ఈ ఉపసంఘములో చేర్చుట జరిగినది. వారు గ్రాంథికభాషా వాదులయిన సభ్యులతో ఏకమయి తీర్మానము ననుసరించి వాడుకభాషా పదములను ఎన్నుటకు మారుగా అసలు తీర్మానమునకుగల అర్థమునే తారుమారు చేయుటకు తోడ్పడినారు. ఎన్నుకునే రూపములలో ప్రతిదిన్ని గ్రంథమందుండవలెను. వాడుకలోను ఉండవలెను. అట్టి రూపములనే ఎన్నుకొనవలెనన్న అర్థము ఆ తీర్మానమునకు కలదని వాదించినారు."

విశ్వవిద్యాలయంవారు రాయలసీమ ప్రతినిధులుగా కోలాచలం శ్రీనివాసరావు, టి. శంకరలింగంపిళ్ల, వాగవూడి కుప్పుసామయ్య, బారిష్టర్ కె. సుబ్బారెడ్డిగార్లను చేర్చుకొన్నారు.

ఉపసంఘంవారు తయారుచేసిన పదపట్టికలకు సంబంధించిన అభిప్రాయభేదాలు వచ్చాయి. గురజాడ అప్పారావుగారు తన అసమ్మతిని వ్యక్తం చేస్తూ విశ్వవిద్యాలయంవారికి వొక నివేదికను సమర్పించారు. కాని సంఖ్యాధిక్యం వల్ల గ్రాంథికభాషావాదుల తీర్మానాలే ఆమోదాన్ని పొందాయి. వాడుకలోను, గ్రంథస్థంగానూ కూడా ఉన్న రూపాలనే అంగీకరించాలని, గ్రాంథికాభిమానులు వాదించడంవల్ల 'వస్తుంది' 'పోతుంది' వంటి రూపాలు వాడుకలో ఉన్నా, ఉపసంఘం పదపట్టికల్లో ప్రవేశించలేకపోయినాయి. 'అనఘుడు, నావుడు, అర్ధానుస్వారము, శకటరేఫము గల పదములు గ్రాంథిక భాషలో ఉన్నా వ్యవహారమందు లేవు కనుక అవి కూడా పనికిరావని అనవచ్చా?' అని వ్యవహారభాషావాదులంటే వాటికి ఇదివరకే ప్రాచుర్యం వున్నదని గ్రాంథికవాదులు, వ్యావహారికవాదులను త్రోసిరాజన్నారు.

ఈ విధంగా వ్యావహారికభాషావాదం, తొలిదశలో ఓటమిని పొంది, సంఘంలో పలుకుబడి గల ఉద్యోగస్థులు, విద్యావేత్తలలో కొందరు వ్యావహారికభాషా స్వరూపాన్ని ప్రయోజనాన్ని గుర్తించకుండా గ్రామ్యమని దానిని దూరుకు గురిచేయడం వల్ల విశ్వవిద్యాలయంవారు ఆటుతరువాత కొన్నాళ్ళకు ప్రభుత్వంవారు తమ అభిప్రాయాన్ని మార్చుకోవలసివచ్చింది.

"సిండికేటు వారి క్రింది తీర్మానము చేశారు. 1914 వ సంవత్సరము ఆగస్టు 11 వ తేదిని Report of the Intermediate Composition Committee circulated by the direction of the Syndicate with the information that the Syndicate is not at present in a position to recognise what is known as 'Modern Telugu' for university purposes."17

ఈ శతాబ్ది ప్రథమపాదంలో ఈ విధంగా భాషావివాదాలు చెలరేగడంవల్ల తెలుగుభాషకు, తద్వారా సాహిత్యానికి గొప్ప ఉపకారమే జరిగిందని చెప్పాలి. ఆంధ్రదేశంలోని ముఖ్య నగరాలలో సాహిత్య సంస్థలు వెలిశాయి. భాషావికాసమూ, వ్యాకరణాధ్యయనమూ పట్ల పండితులదృష్టి మళ్ళింది. భాషను అధ్యయనం చేసేందుకు కొత్తకొత్త పద్ధతులు వచ్చాయి. ఇంగ్లీషుభాషను నేర్పడానికి ప్రత్యక్షబోధన అంటే డైరెక్టు మెథడ్ అనేది ప్రవేశించినట్లుగానే తెలుగునుకూడా సుందరంగాను, సరళంగాను, ఆధునికావసరాలను దృష్టిలో పెట్టుకొని, వికసింపజేయాలని ప్రయత్నాలు జరిగాయి. విశాఖపట్నంలో భాషాధ్యయన పద్ధతుల్లో కొత్తరీతులను ప్రవేశపెట్టాలని ఒకసంస్థ వెలసింది. ఈ సాహితీ సమాజానికి ఏట్సు అధ్యక్షుడు. శ్రీనివాసయ్యంగారు కార్యదర్శి. ఇట్లాగే విజయనగరంలో ఏర్పాటయిన సాహిత్యసంఘానికి అక్కడి కళాశాల ప్రధానాధ్యాపకులు కిళాంబి రామానుజాచార్యులవారు అధ్యక్షులు. గిడుగు రామమూర్తి పంతులుగారు ఉపాధ్యక్షులు. కాకినాడలో ఆంధ్రభాషా సంరక్షక సమాజం ఏర్పాటైంది. ఇంకా అనేకప్రాంతాలలో చాలా కవిపండిత సంఘాలు వెలిశాయి. అంతకు పూర్వం ఇంచుమించుగా నాలుగు దశాబ్దాలుగా శబ్దసాధుత్వాసాధుత్వాలనుగూర్చి పండితులలో, పత్రికాముఖంగా వాదవివాదాలు ఉంటూవచ్చినా, వ్యావహారిక భాషా ఉద్యమంద్వారా ఆంధ్రసాహిత్యపరిషత్తుస్థాపన జరగటం, ఆ తరువాత సూర్యరాయాంధ్ర నిఘంటువువంటి నిఘంటువు వెలువడటం, తెలుగుభాషకు ఒనగూరిన గొప్ప ప్రయోజనాలని చెప్పాలి. వేదం వెంకటరాయశాస్త్రిగారు సంకల్పించినట్లుగా ఆంధ్రభాషాసర్వస్వము వెలువడి ఉన్నట్లయితే తెలుగుభాష మరిన్ని అభివృద్ధి సాధించి ఉండేది. ఆంధ్రభాషా సర్వస్వార్థనియమకతిపయములన్న వేంకటరాయశాస్త్రులవారి నిబంధన గ్రంథంలో ఆంధ్రసాహిత్యపరిషత్తువారు వెలువరించదలచిన నిఘంటు స్వరూప స్వభావాదులను లక్ష్యీకరించారు. ఆ విధంగా పరిషత్తువారి నిఘంటువు వెలువడకపోవటం తెలుగుభాష దురదృష్టమనే చెప్పాలి. 1911 లోనే ఆంధ్ర సాహిత్య పరిషత్తు స్థాపనం కావటం, పరిషత్పత్రిక ప్రకటించటం, గ్రామ్య గ్రాంథికభాషావాదాలు, ప్రాచీనగ్రంథప్రచురణం, వ్యావహారికభాషోద్యమ ఫలితాలే. కొక్కొండవారు, వీరేశలింగంగారు, ఇంకా ఆ తరం పండితులు, కవులు సాహిత్యచర్చలు చేశారుకాని, భాషావిషయకమైన చర్చలు చేయలేదు. పురుషార్థప్రదాయిని, సకలవిద్యాభివర్ధని, అముద్రితగ్రంథ చింతామణి, వైజయంతి మొదలైన కిందటి శతాబ్ది సాహిత్యపత్రికలలో అలంకారము, రసము, ఛందము, శబ్దసాధుత్వాసాధుత్వము మొదలైన సాహిత్యచర్చలు ప్రధాన స్థానాన్ని ఆక్రమించిఉండేవి. కాని భాషాశాస్త్రంగూర్చి, పండితులు పట్టించుకోలేదు. ఒకేభాషా కుటుంబానికి చెందిన వివిధ భాషల క్రమపరిణామవికాసాలను తులనాత్మకంగా పరిశీలించటమనేది, దేశభాషాపండితులు చేపట్టారు. ముఖ్యంగా శాసనభాషను అధ్యయనం చేయడమనేది. యీ ఉద్యమం తాలూకు సత్ఫలితమనే చెప్పాలి. కొమర్రాజు వెంకటలక్ష్మణరావుగారు, జయంతి రామయ్య పంతులుగారు, చిలుకూరి నారాయణరావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారు, గురజాడ అప్పారావుగారు మొదలైన మహామహులందరూ శాసన భాషనుగూర్చి కృషి చేశారు.

తెలుగులోని వచన వాఙ్మయంపట్ల, విస్మృత వాఙ్మయంపట్ల, దేశిరచనలపట్ల, ప్రజావాఙ్మయంపట్ల, విశేషమైన ఆసక్తి కలగటంకూడా ఈ ఉద్యమ ఫలితమే. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయమంతా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. తంజావూరు, మధుర రాజుల కాలంలో వెలసిన వచన కావ్యాలు, యక్షగానాలు, పండితుల దృష్టిని ఆకర్షించాయి. రాయవాచకము, మన్నారుదాస విలాసము, సాహిత్య పరిషత్పత్రికలో వెలువడ్డాయి. చిన్నయసూరికి పూర్వం వచన రచనా సంప్రదాయం, ఏ విధంగా ఉండేదో, సాహిత్యము, వేదాంతము, జ్యోతిషము, మొదలైన వాటి వ్యాఖ్యానాలు ఏభాషలో వెలువడుతూ ఉండేవో, వ్యావహారిక భాషావాదుల విమర్శనాత్మక దృష్టికి పాత్రమైనాయి.

గ్రామ్యగ్రాంథిక వివాదం సాహిత్య ప్రపంచంలో గొప్ప సంచలనం సృష్టించకముందు, కన్యాశుల్కమూ, ప్రతాపరుద్రీయమూకాడా సాహితీపరులను బాగా ఆకర్షించాయి. కన్యాశుల్కం తొట్టతొలుత వెలువడినప్పుడు, అముద్రిత గ్రంథ చింతామణి, వైజయంతి, చింతామణి, మొదలైన పత్రికల ప్రశంసలకు పాత్రమైంది. ప్రతాపరుద్రీయం వెలువడినప్పుడు, అముద్రితగ్రంథ చింతామణి, కలావతి, శశిరేఖ మొదలైన పత్రికలు చాలా ప్రశంసించాయి. పాత్రోచితమైన భాషను నాటకాలలో ప్రయోగించాలి అన్న సిద్ధాంతం కూడా, వెంకటరాయశాస్త్రులవారి ప్రతాపరుద్రీయం నాటకంద్వారా, కలిగింది. నాటి పండితులు కూడా ఈ వాదాన్ని చాలావరకు అంగీకరించారు. అయితే వ్యావహారిక భాషోద్యమం తల ఎత్తగానే పండితులు పాత్రోచిత భాషను కూడా వ్యతిరేకించారు. "కావ్యములలో కవులు ఔచితినిబట్టి ఎట్టి శబ్దములు వాడుక చేసినా చెల్లును గాని లోకవ్యవహారములోను, జనసామాన్యమునకు వ్రాసే గ్రంథములలోను, చెల్లకూడ"దన్నదే రామమూర్తిపంతులుగారి వాదము. అయినా వచనరచనల్లో కూడా వ్యావహారికానికి స్థానం ఉండకూడదని పండితులు పట్టుపట్టారు. వడ్డాది సుబ్బారాయుడు, పూండ్ల రామకృష్ణయ్యగార్లవంటి కవులు, విమర్శకులు అంతకు పూర్వం నాటకాలలో గ్రామ్యభాషను అంగీకరించినా, వ్యావహారికభాషోద్యమం బలపడిన తరవాత, గ్రామ్యమని వ్యావహారికాన్ని తృణీకరించారు. 1909 లో గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం రెండవ ముద్రణం పొందినప్పుడు, మొదటి ముద్రణంపొందిన ఆదరణ పొంద

లేకపోయింది, 1910 తరవాత ప్రతాపరుద్రీయంకూడా చాలా విమర్శలకు గురిఅయింది. అంతకుపూర్వం పొగడినవాళ్ళు కూడా, వ్యావహారికం బలపడుతుందన్న ఉద్దేశంతో పొగడకపోగా నిరసించ డానికి పూనుకొన్నారు. అప్పట్లో వ్యావహారిక భాషావాదం, సాహితీ పరుల్లో అధిక సంఖ్యాకుల ఆమోదాన్ని పొందలేక పోయింది. కందుకూరి వీరేశలింగంగారు గ్రామ్యాదేశ నిరసన సభకు అధ్యక్షత వహించి, గ్రంథాలలో గ్రామ్యం ప్రయోగించరాదని ఉద్ఘాటించారు. గ్రామ్యభాషా ప్రయోగ నిబంధనము ప్రకటించిన వేంకటరాయ శాస్త్రులవారే గ్రామ్యాదేశ నిరసనం కూర్చారు. 1912 వ సంవత్సరంలో నిడదవోలులో గ్రామ్యాదేశ నిరసనసభకు అధ్యక్షత వహించి వేంకటరాయశాస్త్రుల వారిట్లా అభిభాషించారు.

'బాలుర పాఠ్యపుస్తకములను గ్రామ్యమున వ్రాయుట, ఆ గ్రామ్యపుస్తకములను దొరతనమువారు నిర్బంధ పూర్వకముగా పాఠశాలలో చదివించుటయు అసమంజసము.'[18]

ఈ విధంగా పండితుల వొత్తిడివల్ల ప్రభుత్వంవారు 1914 వ సంవత్సరంలో, వ్యావహారికభాషను పఠనీయగ్రంథాలలోకాని, విద్యార్థుల సమాధాన పత్రాలలోకాని, ఉపయోగించకూడ దని, ఉపయోగించవచ్చునని నాలుగేళ్ళక్రితం తామే ఆమోదించి ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకున్నారు. వెంటనే రామమూర్తి పంతులు ప్రభుత్వ నిర్ణయానికి, మరింత పట్టుదలతో, తన వాదంలోని యథార్థాన్ని పండితు లంగీకరించేట్లుగా చేయడానికి గొప్పదైన కృషికి పూనుకొన్నారు. ఎప్పుడైతే, ప్రభుత్వంవారు వ్యావహారికభాషను అంగీకరించలేదో, అంతటితో గ్రాంథికవాదు లకు జయము, వ్యావహారికవాదులకు అపజయము కలిగాయని లోకమంతా భావించింది. దినపత్రికలూ, మాసపత్రికలు గ్రాంథిక భాషావాదుల ఈ విజయాన్నిగూర్చి సంపాదకీయాలు ప్రచురిం చాయి. ఆంధ్రసాహిత్యపరిషత్తు ఆశించిన ఫలితాన్ని సాధించినా ఏమరి ఉండలేదు. ప్రతివార్షికసభలోను గ్రామ్యవాదాన్ని విమ ర్శిస్తూను, గ్రాంథికభాషా ప్రాశస్త్యాన్ని విశదీకరిస్తూనూ, తీర్మా నాలు చేసేవాళ్ళు. వార్షికసభలకు అధ్యక్షత వహించే పెద్దలందరూ గ్రామ్యవాదాన్ని విమర్శిస్తూ ముందుముందుకూడా పరిషత్తువారు అప్రమత్తులై ఉండాలని హెచ్చరించేవాళ్ళు.

1915 వ సంవత్సరంలో గురజాడ అప్పారావుగారు స్వర్గస్థు లైనారు. అయినా రామమూర్తిపంతులుగారు అధైర్యపడక, పట్టు దలతో ఆంధ్రదేశమంతా సంచారంచేసి, తమ వాదంలోని సత్యాన్ని తెలియజేస్తూ, విప్రతిపక్షులను ఒప్పించే ప్రయత్నం చేశారు. దక్షిణ దేశంలోని తంజావూరు మొదలుకొని గంజాం జిల్లాలోని ఛత్ర పురం వరకు తాము సంచారంచేసి అనేక తాళపత్రాలను సేకరిం చామని వారే వ్రాసుకొన్నారు. ఈ విధంగా సంచారంచేస్తూ తాము సేకరించిన సాక్ష్యాధారాలన్నిటినీ, ఆయా ముఖ్యనగరాల్లో పండిత సమావేశాలు ఏర్పాటుచేసి, వారి ముందుంచి, విషయ ప్రధాన మైన గ్రంథాలన్నీ మన పూర్వులు వాడుక భాషలోనే రచించే వారన్నీ టీకలూ, వ్యాఖ్యానాలు, అన్నీ వాడుక భాషలోనే ఉండే వనీ నిదర్శన పూర్వకంగా నిరూపిస్తూ, నిజమైన సంప్రదాయమూ అదేనని వాదిస్తూ తాము చూపిన విషయాలన్నీ వాస్తవమైనవేనని చెల్లెంటూ ప్రమాణ పత్రాలు ఇవ్వవలసిందని వారిని కోరేవారు. బందరు, కాకినాడ, గుంటూరు, విశాఖపట్నం, విజయ నగరము, రాజమండ్రి మొదలైన ప్రాంతాల్లో పండితులను కలుసుకొని రామమూర్తి పంతులుగారు, ఇటువంటి ప్రమాణ పత్రాలను చాలా సంపాదించారు. ఇటువంటి ప్రమాణ పత్రాల్లో కొందరు రామమూర్తి పంతులుగారి వాదాన్ని సమర్థిస్తూ, కొందరు విమర్శిస్తూ తమ అభిప్రాయాలు వెల్లడించేవారు. శిలా శాసనాలనుంచి రామమూర్తి పంతులుగారు వాడుక భాషాప్రయోగా లను చూపిస్తే, అవి చాలామటుకు లేఖక ప్రమాదాలనీ, ప్రామాణిక ప్రయోగాలు కావనీ, తెలివిడులు, టీకలూ, వ్యాఖ్యా నాలు కేవల విషయ ప్రకటనే ప్రాధాన్యంకలవి కాబట్టి, ఆ భాషనే అనుసరించాలనటం సబబుకాదనీ, గ్రాంథిక భాషా వాదులైన పండితులు వాదించారు. కాని 'భావప్రకటనము చేయుటకు మాత్రముపయోగపడు గ్రంథములలోనైనా వ్యావహారిక భాషా ప్రయోగము సంప్రదాయ సమ్మతమని ఒప్పుకోక తప్పదుగదా' అని రామమూర్తిగారు ఎదురుప్రశ్న వేశారు. ఆయాప్రాంతాల్లోని పండితు లందరూ సమావేశమై తమ అభిప్రాయాన్ని సంయుక్తంగా ప్రకటించటమూ, ఆ అభిప్రాయంతో ఎవరైనా ఏకీభవించకపోతే వారు వారి ప్రత్యేకమైన అభిప్రాయం ప్రకటించటమూ జరిగేది. ఈ విధంగా సేకరించిన ప్రమాణ పత్రాలన్నిటినీ పంతులుగారు 1919 వ సంవత్సరంలో తాము నిర్వహించిన తెలుగు పత్రికలో ప్రకటించారు. బందరు కాలేజీవారు రామమూర్తి పంతులుగారి కిచ్చిన ప్రమాణ పత్రంలో, పంతులుగారు చూపిన సాక్ష్యాధారాల నన్నిటినీ తాము పరిశీలించామని, 'వాడి, వాణ్ని, వాండ్లు, నుంచి, కోసను, రాజుకు, వాటికి, అందరికి, కూతురికి, నద్దు, వల్దు, వద్దు, కొద్ది, కద్దు, చేస్తాను, చేసేను, చేతుము, చేస్తిని' మొదలైన రూపాలు, లక్షణ విరుద్ధమని పండితులు బహిష్కరించేవి తాటాకుపుస్తకాల్లో, పునఃపునః కనపడుతున్నా యని, వ్రాతమూలకంగా తమ అభిప్రాయం తెలియజేశారు.

ఈ నిదర్శన పత్రాలను సేకరించేందుకే రామమూర్తి పంతులుగారు ఊరూరా తిరిగారు. దూరప్రాంతాలనుంచి పండితుల అభిప్రాయాలను లేఖల మూలకంగా తెలుసుకొన్నారు. తంజావూరు సరస్వతీమహల్ గ్రంథాలయ కమిటీమెంబరైన పిండ్లచెరువు గోపాలయ్యగారు, గ్రంథాలయంలోని తాటాకుపుస్తకాలన్నీ పరిశీ లించి, రామమూర్తిపంతులుగారి కిట్లా తెలియజేశారు: 'వర్త మానములోఉండేభాషే గ్రంథములలో ఇదివరకే వాడుతూవచ్చినా రనేది నిశ్చయము. దాని నాక్షేపించువారి న్యాయము గ్రుడ్డివాడు చంద్రుడే లేడని వాదించు న్యాయమేగాని వేఱుకాదు. పాతపుస్తకాలు శోధిస్తే ఇది తేలును.' రామమూర్తిపంతులుగారు పండితుల నుంచి సంపాదించిన ఈ అభిప్రాయాలన్నిటినీ **Tradition regarding Telugu Composition: Testimony,** తెలుగు రచనా

సంప్రదాయమునకు సాక్ష్యము, అన్న శీర్షిక క్రింద తమ తెలుగు పత్రికలో ప్రచురించారు.[19] రామమూర్తి పంతులుగారు చూపిన నిదర్శనాలనుగూర్చి వ్రాస్తూ "ఈ నిదర్శనములలో శిలాశాసనములు, వ్యవహారపత్రములు, ఉత్తర ప్రత్యుత్తరములు, కథల పుస్తకములు, శాస్త్రాదిగ్రంథము టీకలును సర్వజనసాధారణముగా భావప్రకాశనమాత్ర ప్రయోజనములగుటచే వానియందలి భాష యిప్పటి వచనరచయితలు ప్రమాణముగా గైకొనుట కర్హమైనదికాదు. కొన్నిమహాప్రబంధములయందలి శైలి సామాన్యజన దురవగాహముగావున, నందలి విషయంబులెల్ల సుబోధంబులగు నటులు, వ్యావహారికభాషలో వానికి బండితులే టీకలు వ్రాసిరి. సామాన్యజనోపయోగముకొరకు వ్రాయబడిన యీ టీకలలోని భాష వచనరచనలకు ప్రమాణముగా గ్రహింపదగదు. శతకము లనేకములు విశేషభాషాలక్షణ పరిజ్ఞానములేని భక్తులచే వ్రాయబడినవగుట నయ్యవి, స్మృతులయందువలె గృతులయం దుపకరించునవి కానేరవు. ఇక మనవుసకున్, రాజుకున్, వద్దు, కొద్ది, కోసము, కోసరము, మా (మహత్),చేతురు, కోతురు, ఆడిగే, దాటే, వచ్చినాను, వచ్చినావు, ఎక్కించుకో, ఎత్తుక, పట్టుక, వద్ద, వాటి' — ఈ రూపములను బెక్కండ్రు లాక్షణికులు వాడియుండుటచేత, నాధునికులు గూడ వీనిని తమ కృతులయందు బక్కగ నుపయోగించవచ్చుననియే నా నిశ్చితాభిప్రాయము" అని ప్రయాగ వెంకటరామశాస్త్రిగారు మార్చి 23, 1915 వ సంవత్సరంలో తమ అభిప్రాయాన్ని వ్రాతమూలకంగా తెలిపి ఉన్నారు. టీకలూ వ్యాఖ్యానాలు భావ ప్రకాశనమాత్ర ప్రయోజనాలు కాబట్టి వాటిలో భాష, వచన కావ్యాలకు తగదంటే, 'సర్వజన సాధారణముగా భావప్రకాశనమాత్ర ప్రయోజనములగు గ్రంథములు వ్రాసే వారికైనా, ఈ నిదర్శనములు పనికివచ్చునుగదా' అని రామమూర్తి పంతులుగారు ప్రత్యాఖ్యానం చేశారు.

'మహారాజ శ్రీ రావుసాహెబు వేంకట రామమూర్తి పంతులు బి. ఏ. గారు శాసనములు, పత్రములు ఘనులయుత్తరములు మొదలైనవానిలో గ్రామ్యములు కనబరచు పుస్తకముల రికార్డులను ప్రశంసింప, శనివార మొకటి రెండు గంటలు విన్నాడను. ఆ శాసనాది నిర్మాతల ప్రభుత్వాచార్యత్వాదుల ఘనులైనను గ్రామ్యము తెలుగలవడని వారో, అభ్యసించినవారైన మన మెల్లరునువలె సర్వజనులకు దమకు దెలిసిన వైద్య వేదాంత జ్యోతిషాదుల దెలుపనో యట్టి తెలుగు వ్రాసిరి. అది విద్యార్థులకు బోధ్యము. శాస్త్ర నిరుద్ధముగాదు' అని ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారు తమ అభిప్రాయ పత్రికను రామమూర్తి పంతులు గారికి పంపించారు. ఈ విధముగా రామమూర్తి పంతులుగారు చాలా తాళపత్ర గ్రంథాలు, అచ్చు పుస్తకాలు వెంటబెట్టుకొని, జైత్రయాత్రకు బయలుదేరినట్లుగా బయలుదేరి పండితులతో వాద వివాదాలు సాగించారు. కేవలం దేశాభిమానమూ, భాషాభిమానమూ మాత్రమే ఆ మహానుభావుణ్ణి ఇట్లా దేశపర్యటనకు పురికొల్పాయని చెప్పాలి. మహారాజులు, ధనవంతులూ వారికి వ్యతిరేక పక్షంలో ఉన్నారు. కీర్తి ప్రతిష్ఠలు ఉద్దేశించి అంటే, ప్రజాసామాన్యాభిప్రాయంకూడా అప్పటికి వారికి వ్యతిరేకంగా ఉన్నది. అప్పటికే ఉద్యోగ విరమణంచేసి విశ్రాంతి తీసుకుంటున్నారు వారు. అయినా పట్టుదలతో తమ కృషిని సాగించారు.

"కావ్యేతరముల విషయమై ప్రాచీన సంప్రదాయములు దెలిసినతరువాత నట్టి సంప్రదాయము ననుసరించి, ప్రయత్నము చేయుటలో నేమియు తప్పులేదు. కావ్యగౌరవమున కర్హముగాని ఒడిపిల్లల వ్రాతలలో కావ్యనియమము లుండితీరవలయుననుట సంప్రదాయ విరుద్ధము. కావ్యగౌరవమునకు పాత్రమగుపట్ల కావ్యనియమము లవశ్యముగ పాటింపబడవలయును. గనుకనే విజ్ఞాన చంద్రికాగ్రంథమండలివారు నైత మీ స్వాతంత్ర్యమును కొంతవర కుపయోగించిరి. జీవశాస్త్రము మొదలగునవి వ్రాయునెడ వారును కొన్నివ్యావహారికరూపముల గ్రహించుటయేగాక వ్యాకరణ నియమములను చాలవర కుపేక్షించిరి. ఇది విషయానుసారమగుటచే నుచితమే. ఇట్టి స్వాతంత్ర్యమును 'కాలేజి' విద్యార్థులలో నలయు వారి కిచ్చుటవలన నేమియు లోపము సంభవింపకుండుటయేగాక, సాంప్రదాయ ప్రవాహము ననుసరింప నిచ్చుటయని దృఢముగ నమ్ముచున్నాము.

గిడుగు జగన్నాథస్వామి
20—3—15.

కొమర్రాజు లక్ష్మణరసింహారావు
20—3—15.

తురగా శ్రీరామమూర్తి
20—3—15.

దుగ్గిరాల వెంకటసూర్యప్రకాశరావు

శతావధాని దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు
24—3—15.

అన్న పై సంతకాలతో కాకినాడ పండితమండలి, రామమూర్తి పంతులుగారు సేకరించిన సాక్ష్యాధారాలను పరిశీలించి ప్రమాణపత్రం ఇచ్చింది. ఇటువంటి ప్రమాణపత్రాలనుబట్టి వ్యావహారిక భాషావాదం 1915 సంవత్సర ప్రాంతంనుంచే తెలుగుదేశంలో బలపడుతూ వచ్చిందనటానికి సందేహంలేదు.

"గ్రంథాలయములలోని పుస్తకములు అందరూ చూచినవి కాకపోవడముచేత అక్కడివారి సాక్ష్యము కావలసివచ్చినది. మావద్దనున్న పుస్తకాలు మాతో తీసుకొనిపోయి పదమూడు కాలేజీలలో ఉన్న పండితులు మొదలైన ఉపాధ్యాయులకు చూపించి సంప్రదాయమునుగురించి వారివల్లను నిదర్శనపత్రములు పుచ్చుకొన్నాము.'

'ఈ ప్రకారముగా పూర్వసంప్రదాయము స్పష్టముగా తెలుసుకొని 1916 వ సం॥ నవంబరు 19 వ తేదిన కొవ్వూరిలో...... ఆంధ్రసారస్వతమహాసభలో తెలుగు మాటల సాధుత్వాసాధుత్వము నిర్ణ

యించడమునకు, మేము ఒక ప్రమాణము నిర్వచించి, ఉపన్యసించినాము. మా నిర్వచనము బ్ర. శ్రీ. దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు, తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు, చిలుకూరి వీరభద్రరావుగారు సమర్థించగా వందలకొలదిగా ఉన్న సభవారందరు (బ్ర. శ్రీ. శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారు ఒక్కరు తప్ప) ఐకమత్యముగా అనుగ్రహించినారు. దీనితో మా మతము స్థిరపడినది. అదివరకే మాకు ప్రతిపక్షులుగా వుండినవారు అనేకమంది మా మతము నవలంబించి దానికి సంరక్షకులైనారు.'' అని రామమూర్తి పంతులుగారు తెలుగు పత్రికలో వ్రాయటంబట్టి వ్యావహారిక భాషా ఉద్యమాన్ని ఫలవంతం చేయుటానికి వారు ఎటువంటి కృషిచేశారో తెలుస్తున్నది.

''మా మతమును దూషించే వారయినా మా మతము చొప్పున వ్యవహరించక తప్పదు. తెలుగువారు తెలుగు మాటాడకుండా ఉండలేరు కదా. వివేకము గలవారు ఎవరిమట్టుకు వారు ఆలోచించుకొని దురాగ్రహము లేకుండా ఏది మంచిదయితే అదే అంగీకరిస్తారు. ఇకను మాకున్న నూతన సంప్రదాయమును అంగీకరించినవారికిన్ని కొవ్వూరి మహా సారస్వత సభవారి సమ్మతి సర్వజనానుగ్రహము వంటిదే. అది మేము శిరసావహించి లోకములో ప్రకాశింప జేయుడమునకు నిశ్చయించుకొన్నాము. ఆ సభవారి తీర్పు ఏమంటే 'తెలుగు మాటల సాధుత్వా సాధుత్వములు స్పష్టముగా బోధించే తెలుగు వ్యాకరణము లేనందుచేతను, ఉన్నవ్యాకరణములు పరస్పర విరుద్ధములుగను, అసంపూర్ణములుగను, ఉన్నందుచేతను, వ్యాకరణమునకు మూలము ప్రయోగములే అగుటచేతను, తెలుగు గ్రంథములలోని ప్రయోగములు ప్రమాణములుగా అంగీకరింపక తప్పదు. నేటి వాడుకలోనున్న పదములు నూఱు సంవత్సరములనుండి పెద్దల వాడుక చొప్పున ఉన్నట్లు నిదర్శనములున్నప్పుడు, అవి నిర్దుష్టములుగా ఎన్నవలెను. నేడు తెలుగు దేశమంతటను పెద్దలవాడుకలో ఒకరూపమున ఉన్న పదములు కూడా, పూర్వకాలపు గ్రంథములలో కనపడక పోయినను నేటి గ్రంథములలో నున్నయెడల సాధువులే.'

1916 వ సంవత్సరానికే కొవ్వూరులో జరిగిన మహాసభలో రామమూర్తి పంతులుగారు ఇటువంటి తీర్మానాన్ని ఆమోదింప జేశారంటే, వ్యావహారికభాష ఏవిధంగా వికసిస్తూ వచ్చిందో గ్రహించవచ్చు. మూడు నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే రామమూర్తి పంతులుగారు తెలుగు దేశంలో చాలామంది పండితులు, పెద్దల అభిప్రాయాలు మార్చివేశారు.

ఈ కొవ్వూరుసభలో రామమూర్తిపంతులుగారు ఉపన్యసిస్తూ ఉండగా, వీరేశలింగంపంతులుగారు, ఆ రోజున్నే కొవ్వూరు వచ్చి ఉండటం తటస్థపడి, ఆ సభకువచ్చి దూరంగా నిలుచుండి ఆయన వాదం విన్నారుట. ఆ తరువాత తమ మిత్రులతో 'రామమూర్తి పంతులు చేస్తూవున్న వాదంలో సత్యం లేకపోలేదు. ప్రాచీన లక్షణానికి విరుద్ధమైన ప్రయోగాలు కొన్ని లోకంలో వాడుకలోనికి వచ్చినవి. **అందు కొన్ని లోకాన్ని మాచి కవులున్నా** ప్రయోగించారు. అవి తప్పులనుటకంటె ఒప్పులుగానే గ్రహించి లక్షణం సవరించుకోవాలె. అయితే రామమూర్తిపంతులు అంతటితో తృప్తిపొందలేదు: కవులకున్న్ను లోకమే ప్రమాణం గనుక కవులు ప్రయోగించినా, ప్రయోగించకపోయినా వాడుక భాషఅంతా ఆ గ్రంథ రచనకు అర్హమయినదేఅని వాదిస్తున్నాడు. అది యెంతవరకు గ్రాహ్యమాఅని ఆలోచిస్తున్నాను'అని అన్నారట.[20]

వీరేశలింగంపంతులుగారు తమ మిత్రులతో ఇట్లా అన్నారని రామమూర్తిపంతులుగారికి తెలిసింది. వెంటనే వీరేశలింగంగారిని కలుసుకున్నారు. ఆయనగారి సంశయాలన్నీ తీర్చారు. తత్పర్యవసానంగా 'వర్తమానాంధ్రభాషాప్రవర్తకసమాజము' 28-2-1919 వ తేదిన రాజమహేంద్రవంలో వెలసింది. దీనికి వీరేశలింగంపంతులుగారు అధ్యక్షులు. రామమూర్తిపంతులుగారు, జయంతి గంగన్నగారు కార్యదర్శులుగా ఉండేవారు. వర్తమానాంధ్రభాషా ప్రవర్తక సమాజంవారి ఉద్దేశాలివి.

1. వ్యావహారికభాషకును, గ్రాంథికభాషకును ఇప్పుడున్న వ్యత్యాసము సాధ్యమైనంతవరకు తగ్గించి భాషను సులభము చేయుట.

2. జ్ఞానాభివృద్ధికై వ్రాయు గ్రంథములలో సాధ్యమైనంతవరకు వ్యవహారములో ఉన్న రూపములే ఉపయోగించి, వ్యవహారములో లేనివి విడిచిపెట్టుట.

3. వ్యవహారములో ఆవశ్యకములుకాకుండ ఉపయోగించుచున్న అన్యదేశపదములను విడిచి ఆవశ్యకమైన పదములనే చేర్చుకొనుట.

4. పై వుద్దేశముల ననుసరించి గ్రంథములను వ్రాయుట.

కాని దురదృష్టవశాత్తూ వీరేశలింగం పంతులుగారు, వర్తమానాంధ్రభాషా ప్రవర్తకసమాజం స్థాపించిన మూడు మాసాలకే పరమపదించారు. దాంతో ఈ సమాజ కార్యక్రమం నిలిచి పోయిందేమోకాని, రామమూర్తి పంతులుగారు సమాజం ఉద్దేశాలను ఇరవై సంవత్సరాలు ప్రచారంచేసి, తామాశించిన ఫలితాలను తమ కళ్లముందే చూశారు. వీరేశలింగం పంతులుగారికి రామమూర్తిగారి వాదం సమ్మతమైన తరువాత, వ్యావహారిక భాషకు అనుశాసనం రచించాలన్న సంకల్పం కలిగింది. అంతకు నాలుగు సంవత్సరాలకు పూర్వమే వెలువడ్డ వారి స్వీయచరిత్రలో పంతులుగారు 'పూర్వ వ్యాకరణాలన్నీ కావ్యభాషకు సంబంధించినవనీ, ఆ లక్షణాలు వచన కావ్యాభివృద్ధికి తగనివనీ, ఇప్పటి కాలానికి తగినట్టుగా వ్యాకరణం వ్రాసి, లక్ష్యంగా ఒక వచన కావ్యం రచించాలనీ, తమకు కోరిక ఉన్నట్టుగా వ్రాశారు. వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజానికి అధ్యక్షులైన తరువాత వారిలో ఆ కోరిక మరింత బలపడినట్లుగా తోస్తుంది. పరమపదించటానికి కొన్ని రోజులు ముందుగా నవ్యాంధ్ర వ్యాకరణం పేరుతో, నాలుగైదు పుటలు వ్రాశారు పంతులుగారు. **వచనవిద్య పరిశీలనతో ఈ గ్రంథం ప్రారంభం కావటం గమనార్హం.**

వీరేశలింగంపంతులుగారు పరమపదించే నాటికి తెలుగు దేశంలో సారస్వత రీతులు మారిపోవొచ్చాయి. భావ కవిత్వానికి పూర్వరంగమంతా సిద్ధమైంది. భావనవ్యతకోసం కవులు అర్రులు చాచారు. నిజానికి గురజాడ అప్పారావుగారి పూర్ణమ్మ, కన్యక, నీలగిరిపాటలతోనే తెలుగు దేశంలో నవ్య కవిత్వోద్యమం ప్రారంభమైంది. అప్పటికి కవిత్వం ప్రజల చేరువకు చేరుతూవచ్చింది. తిరుపతి కవుల, అష్టావధానాలు, మరింత ప్రజల్లో సాహిత్యాభిరుచిని పెంపొం చాయి. దేశంలో రాజకీయ చైతన్యం వెల్లివిరిసింది. కొత్త కొత్త పత్రికలెన్నో వెలిశాయి. 1914 లో రాయప్రోలు సుబ్బారావుగారు తృణకంకణం ప్రకటించారు. కథానికకూడా పుట్టి, అప్పటికే బాగా ప్రాచుర్యం పొందింది. విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలివారు అప్పటికే శాస్త్రీయ గ్రంథాలు, నవలలూ చరిత్రలూ ప్రకటించారు. అందువల్లనే కాబోలు వీరేశలింగం పంతులుగారు 1919 లో ప్రారంభించిన నవ్యాంధ్ర వ్యాకరణం, నవకవిత్వ పరిశీలనతో ప్రారంభించారు. నవ కవిత్వాన్ని గూర్చి కూడా పంతులుగారు విశ్లేషించి చూపటానికి పూనుకోవటం వారిపై వ్యావహారిక భాషోద్యమ ప్రభావమే అని చెప్పాలి. అటు తరువాత దేశపరిస్థితులన్నీ మారిపోయినాయి. మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది. స్వాతంత్ర్యోద్యమం ముమ్మర మైంది. ప్రబోధ సాహిత్యం విజృంభించింది. ఈ దేశ కాలపరిస్థితులన్నీ వ్యావహారిక భాషావాదాన్ని బాగా బల పరచాయి. సాహిత్యం బాగా విస్తరించటానికి వ్యావహారిక భాష చక్కగా తోడ్పడుతుందని బుద్ధిమంతులు గ్రహించారు. క్రమేపీ వ్యావహారిక భాషా ఉద్యమంపట్ల, రచయితలలో వ్యతిరేకత తగ్గిపోయింది. కాని మొదటిరోజుల్లో వ్యావహారిక భాషా వాదం తీవ్రమైన ప్రతిఘటనోద్యమాన్ని ఎదుర్కోవలసివచ్చింది. "శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు మొదలైనవారు 'ప్రవాహినీ దేశ్యా' అన్న యర్థమును నిలువదొక్కుటకు చేసిన ప్రయత్నము, తద్భిన్నమైన నింద్యగ్రామ్య శబ్ద బహుళమైన భాషా ప్రచారమునా దురర్థము చేసికొనబడినది" అన్న విశ్వనాథ సత్యనారాయణగారి వాక్యాలలో, వ్యావహారిక భాషా ఉద్యమం ఎటువంటి అపోహలకు గురైందో స్పష్టపడుతున్నది. 21

వాడుక భాషలో గ్రంథాలు రచిస్తేనూ, పఠన పాఠనాదులు జరిపితేనూ భాష అస్తవ్యస్తమై, ఆరు మూడై, పాడైపోతుందని వాదించటం, భాషాతత్త్వం ఏమాత్రం అర్థం గాకపోవటమేనని అనుకోవాలి. వాడుక భాషను ఉపయోగించినందువల్ల ప్రాచీన కావ్యభాష దురవగాహమైపోతుందన్న వాదంలో ఏమాత్రం సత్యం ఉన్నా, అది ఈపాటికే ఎప్పుడో నిరూపితం అయిఉండేది. కొన్ని వందల సంవత్సరాలుగా, వివిధ శాస్త్రాలు, వ్యాకరణ గ్రంథాల వ్యాఖ్యానాలు, పాటలు, పదాలు, చిన్నయసూరిగారికి పూర్వం పాఠ్య పుస్తకాలూ కూడా వాడుకభాషలోనే ఉండేవి. కాబట్టి ఈపాటికే, ప్రాచీన కావ్యభాష దురవబోధంగా పరిణమించి ఉండేది. వచన కావ్యాలన్నీ వాడుకభాషలో రచించటమే నిజమైన సంప్రదాయం కాని, తదన్యంకాదు. కొన్నివందల సంవత్సరాలనుంచీ ఇట్లా జరుగుతున్నా వాడుకభాషను గ్రామ్యమని నిందించి, దాన్ని పూర్తిగా గ్రంథాలనుంచి బహిష్కరించాలన్న ఉద్యమాన్ని అనేక అపోహలకు లోనై ఆంధ్రసాహిత్య పరిషత్పండితులు లేవనెత్తారు. వాడుకలో ఉన్న పదాలను ప్రయోగిస్తే గ్రామ్యతాదోషం అంటుకొంటుందేమో నని, కృతకగ్రాంథికాన్ని సృష్టించుకొని సంతృప్తి చెందారు. ఈ పండితుల గ్రంథాల్లోంచి ప్రాచీన కావ్యభాషా లక్షణానికి విరుద్ధాలైన కొన్నివందల దుర్దోషాలను రామమూర్తి పంతులుగారు చూపి, ఆయా పండితుల ముఖపిధానం గావించారు. అయినా వారు పూర్తిగా వ్యావహారిక భాషావాదాన్ని అంగీకరించలేకపోయినారు. అయినప్పటికీ, ఇరవై సంవత్సరాలలో వ్యావహారిక భాష బాగా వృద్ధి పొందింది. కేవలం వ్యావహారిక భాషలో మాత్రమే రచనలు ప్రచురించే పత్రికలుకూడా పుట్టాయి. కథా, నవలా, ఏకాంకిక నాటిక, మొదలైన ప్రక్రియల్లో వాడుకభాష బాగా స్థిరపడిపోయింది. నండూరి సుబ్బారావుగారి ఎంకిపాటలు ఆంధ్రదేశాన్నంతా ప్రభావితం చేశాయి. 1933 వ సంవత్సరంలో రామమూర్తి పంతులు గారి సప్తతి తమ జన్మదినోత్సవం జరిగినప్పుడు నవ్య సాహిత్య పరిషత్తువారు రామమూర్తి పంతులుగారి కృషినంతా పుస్తక రూపంలో ప్రకటించారు. వ్యాసావళి, గద్యచింతామణి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం, బాలకవిశరణ్యం, అనే పంతులు గారి ఈ నాలుగు గ్రంథాలు బయటకు రాగానే వ్యావహారిక భాషోద్యమానికి జయపతాకం ఎగరవేసినట్లైంది.

"......నా వాదము అందరూ అంగీకరించలేదనిన్ని విశ్వ విద్యాలయముల వారున్ను విద్యాశాఖవారున్ను వ్యావహారిక భాషను గ్రహించ లేదనిన్ని నే నెరుగుదును. కాని నా వాదము సరియైన దన్న విశ్వాసము నాకు పూర్తిగా ఉండుటవల్ల ఎప్పటికైనను తెలుగు వారరెదరూ నా వాదము పూర్తిగా అంగీకరించక పోరన్న నమ్మకం నాకు కలదు..." అన్నారట రామమూర్తి పంతులుగారు ఇంకా వారం రోజులకు స్వర్గస్థులవుతారనగా. ఆధునికాంధ్ర వాఙ్మయ చరిత్రలో రామమూర్తి పంతులు స్థానం విశిష్టమైంది. నవీన మైన దృష్టితో ప్రాచీనమైన సంప్రదాయాన్ని రామమూర్తి పంతులుగారు పరిరక్షించారు. ఏది ఏమైనా మన మతాన్ని, సంస్కృతిని, సాంఘిక వ్యవస్థను, సాహిత్యాన్నికూడా ప్రభావితం చేసి నట్లే ఇంగ్లీషు సాహిత్యమూ, ఇంగ్లీషు మేధావులూ వ్యావహారిక భాషావికాసానికి కూడా పూర్వ రంగాన్ని సిద్ధం చేయుటం విచిత్రం.

"In composing this work I have had the approbation of many learned assistants. But some (Sastris) scholars have disapproved the spelling here exhibited. instead of that found in poems and used in ordinary life they wish us to practice a pedantic style which is admired because conceited and far from clear. Such refinements are disregarded by men of real learning, who are therefore considered vulgar by some who are inferior in sound scholarship (Preface) అని బ్రౌన్ నిఘంటువు ఉపోద్ఘాతంలో బ్రౌన్‌దొర వ్రాయటం గమనార్హం. ఈ వాక్యాలవే

రామమూర్తి పంతులుగారు కూడా బలపరచి నిరూపించవలసి వచ్చింది. బ్రౌన్‌దొర 1852 ప్రాంతంలోనే వ్యావహారిక భాషా ప్రాశస్త్యాన్ని గుర్తించి నిఘంటువు నా భాషలోనే రచించాడు. ఆటుతరువాత చిన్నయసూరిగారు, బహుజనపల్లి సీతారామాచార్యులుగారు గ్రాంథికభాష లోకంలో ప్రాచుర్యం పొందేటట్లు చేయుటవలన, గ్రాంథిక గ్రామ్యవాదం ఇన్నాళ్ళు కొనసాగవలసి వచ్చింది.

1920 వ సంవత్సర ప్రాంతంలో ఆంధ్రరాష్ట్రోద్యమం కూడా, స్వాతంత్రోద్యమంతోపాటు, ఆంధ్రులను ఉత్తేజపరచింది. ఆంధ్రరాష్ట్రం వచ్చి, ఆంధ్రుల ప్రభుత్వం ఏర్పడి, ఆంధ్రభాష ప్రభుత్వ భాష అయినప్పుడైనా, ప్రభుత్వ వ్యవహారాలు ఏ భాషలో నిర్వహించుకొంటారు మీరు అని గ్రాంథిక భాషావాదులను ఆక్షేపించాడు ఇంగ్లీషులో తెలుగు వ్యావహారిక భాషా నిఘంటువును రచించిన గెలట్లీదొర. 22

ఏమైనా గ్రాంథిక భాషావాదులు కూడా ఇప్పుడు కావ్యభాషలోనే గ్రంథాలు రచించాలనకుండా, సులభమైన శైలిలో నియమాలను పాటిస్తూ రచించాలని వాదిస్తున్నారు. ఇది వ్యావహారిక భాషా ఉద్యమం సాధించిన సత్ఫలితమేనని చెప్పాలి. ఈ అరవై సంవత్సరాలలో వాడుక భాష గొప్ప ప్రాచుర్యాన్ని పొందింది. అయితే ఇప్పటికీ వివిధ మండలాల్లో శిష్టవ్యావహారికం, వివిధరీతుల్లో ఉన్నప్పుడు పాఠ్య పుస్తకాలలో ఉపయోగించే భాష, ఏ ప్రాంతం వారినుంచి స్వీకరించాలని, కొందరు తర్కిస్తూనే ఉన్నారు. ఈ తర్కం విమర్శకు నిలచేదికాదు. దినపత్రికలలోను, కథల్లో, నవల్లో, నిఖిలాంధ్ర దేశమూ ఏ భాషను ఆదరిస్తున్నదో, ఆ భాషనే పాఠ్య పుస్తకాల్లోనూ కూడా ఉపయోగించవచ్చు. వ్యావహారిక భాషోద్యమానికి పోను పోను కొంతబలం చిక్కింది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో, నిఘంటు కర్తలు అనేకమైన వాడుక పదాలను చేర్చడం జరిగింది. తాతా సుబ్బరాయ శాస్త్రులగారివంటి పండితులుకూడా, వ్యావహారిక భాషావాదులు కావటం, వ్యవహారికభాషా ఉద్యమం సాధించిన ఘనవిజయమని చెప్పాలి.

'శిష్టవ్యవహారభాషను కాలానుసారముగా సేకరిస్తూ దానినే సంస్కరిస్తూ ఉండవలెను.'

'నేటి వ్యావహారికభాషను గ్రాంథికభాషగా అంగీకరిస్తేనే కాని దేశమునకు సర్వవిధములా అభివృద్ధి చేకూరదు.'

'ప్రాచీనాంధ్రము అన్యభాషవలె అభ్యసించవలసినదేకాని, మాతృభాషవలె స్వయముగా మనలను వరింపదు. దానితో భావము ఉదయింపకుండా ఉండడమే ఇందుకు కారణము.'

'విజ్ఞానాభివృద్ధికిన్ని వ్యవహారసిద్ధికిన్ని శిష్టభాషే ఉపకరిస్తుంది.'

ఈ విధమైన అభిప్రాయాలను మహామహోపాధ్యాయులైన తాతాసుబ్బరాయశాస్త్రులవారు వెలువరించటంకన్నా. ఈ ఉద్యమ సాఫల్యానికి నిదర్శనం ఏంకావాలి? నేడు వ్యావహారికభాషలోనే నూటికి తొంభైతొమ్మిదిమంది రచనలు చేస్తున్నప్పుడు, రామమూర్తిపంతులుగారి ఆశయం నెరవేరిందనే ఎంచుకోవాలి.

వ్యావహారిక భాషావాదం పుట్టి అరవై సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ అరవై సంవత్సరాల కాలంలో సాంఘిక రాజకీయ రంగాలలో దేశంలో చాలా మార్పులు వచ్చాయి. తద్వారా తెలుగు దేశాన్నికూడా ఆయామార్పులు ప్రభావితం చేశాయి. వ్యావహారిక భాషను గ్రామ్యమని ఇప్పుడెవ్వరూ నిందించటం లేదు. ఆ భాష ఉదాత్త విషయ ప్రకటనానికి సాధనంకాదని ఇప్పుడెవ్వరూ అనుకోవటం లేదు. వ్యావహారిక భాషను అంగీకరిస్తే ప్రాచీన కావ్యభాష అంతా దురవగాహమై, ప్రాచీన సాహిత్యమంతా నిరుపయోగమై పోతుందనే భయంకూడా ఇప్పుడెవ్వరికి లేదు. భాషా శాస్త్రజ్ఞులు, సాహిత్యనేత్తలూ అంటూనే పండితులెవ్వరూ ఇప్పుడట్లా వాదించటంలేదు. వ్యావహారిక భాషలోనే ఇప్పుడు రచయితలందరూ రచనలు చేస్తున్నారు. ఊరూరా అచ్చుయంత్రాలు వెలసినాయి. రాష్ట్ర పత్రికలు చదివి లోకవార్తలను పల్లీయులుకూడా తెలుసుకొంటున్నారు. సినిమాలు, రేడియో, వార్తా పత్రికలు, నేడు శిష్టుల వాగ్వ్యవహారంలో ఉన్న భాషనే ఉపయోగిస్తున్నాయి. 'పరుల దెగడుచోట జెప్ప నొప్పు' అని నిందకూ, హాస్యానికే మాత్రమే అనుమతి పొందిన 'గ్రామ్యం' నేడు ఆ కళంకాన్ని తొలగించుకొని, సర్వసాహిత్య వ్యవహారానికి యోగ్యమైనదిగా స్వీకృతమైంది. హాస్యానికి తత్తదుచిత సందర్భంగా ఇప్పుడు గ్రాంథికాన్నే ఉపయోగిస్తున్నారు. కాబట్టి ఈ అరవై సంవత్సరాల కాలంలో తెలుగు సాహిత్యంలో గణనీయమైన మార్పులే వచ్చినట్లుగా నిరూపణం అవుతున్నది.

కథలూ, నాటకాలు, నవలలు, సాహిత్య విమర్శ, పత్రికా వ్యాసాలు, సంపాదకీయాలు అన్నీ ఇప్పుడు వ్యావహారిక భాషలోనే వెలువడుతున్నాయి. కావ్య రచన విరళమై పోయింది. వచన రచన బహుళమైంది. నేటి పాఠకుల అభిరుచులననుసరించి నవలలు కథలు, ఎక్కువగా రచయితలు వ్రాస్తున్నారు. ఐదారువేల రూపాయల బహుమానాలు నవలలు వ్రాసేవారు పొందుతున్నారు. కథలు ప్రతివారమూ అధిక సంఖ్యలో వెలువడుతున్నాయి. భారతివంటి సాహిత్య మాసపత్రికకూడా కథలూ నవలలూ సాహిత్య విమర్శ, వ్యావహారికంలోనే ప్రచురిస్తున్నది. భగవద్గీతా వ్యాఖ్యానాలు, ఉపనిషద్వ్యాఖ్యానాలు, సాహిత్య చరిత్రలు వ్యాకరణ భాష్యాలుకూడా వ్యావహారిక భాషలోనే రచితములవుతున్నాయి. ఏ దిన, వార, పక్ష, మాసపత్రికలు చూసినా వ్యావహారిక భాషలోనే సర్వరచనలు సాక్షాత్కరిస్తున్నాయి. పక్కుతుగా గ్రాంథిక భాషాభిమానులు, గ్రాంథికంలో రచనలు వెలయిస్తున్నా ఆ గ్రాంథికంకూడా నేడు వాగ్వ్యవహారంలోఉన్న శిష్టుల భాషకు చేరువగానే ఉంటున్నది. శబ్దరూపాలనుకాని, వాక్యవిన్యాసంకాని, ఆధునికమైన అభివ్యక్తీకరణకు దూరంగా, ఏ ఉత్తమ రచయితా తన రచనను నిర్వహించలేదు.

మూకీలుపోయి కొత్తగా టాకీలు వచ్చిన రోజుల్లో సినిమా సంభాషణలుకూడా అచ్చమైన గ్రాంథిక భాషలోనే ఉండేవి. కృష్ణలీలలనే చిత్రంలో దేవకీ దేవిని పెండ్లాడి వసుదేవుడు తన రాజ్యానికి మరలిపోతున్న సన్నివేశంలో, ఆకాశవాణి పలుకులను విని కంసుడు, అనుజను చంపటానికి ఉద్యమించి కత్తినెత్తుకొని వచ్చే ఘట్టంలో 'బావా ఇది పాడిగాదని నా తలంపు' అని వసుదేవుడంటే, కంసుడు ధర్మిస్తూ 'నీ తలంపు నాకడ తలపంపులు గావిన నిలింపుల కడ వచింపుము' అంటాడు. ఇప్పుడు వస్తున్న సినిమాలలో ఇటువంటి సంభాషణలు మచ్చుకైనా వినపడవు. పౌరాణిక చిత్రాలలోకూడా ఆయా సన్నివేశాలలో పాత్రోచితంగా కావ్యభాష కనపడినా, వినపడినా, ఆ భాషా ప్రయోగ వైఖరి శిష్టవ్యవహారికానికి చేరువగానే వుంటున్నది. పాటలూ పద్యాలు కూడా నేటి భాషలోనే రచితములవుతున్నాయి. రేడియో ప్రసంగాలు, రంగస్థలంమీద ప్రదర్శించే నాటకాలు, వ్యావహారికంలోనే వెలువడుతున్నాయి. వేలూరి శివరామశాస్త్రిగారివంటి గొప్పపండితులు వ్యావహారికభాషలో చిన్నకథలూ, వ్యాసాలూ వ్రాశారు. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మొదలైన పండితులు వ్యావహారికభాషలో రచనలు వెలయించారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, చిన్నకథలు, నవలలే కాక 'అనుభవాలు—జ్ఞాపకాలూను' అన్నపేరుతో తమ స్వీయ చరిత్రను మూడు సంపుటాల్లో వ్యావహారికభాషలోనే ప్రకటించారు. అరవై సంవత్సరాలక్రితం వ్యావహారికభాషలో రచన చేయటం ఎంత అరుదుగావుండేదో, ఇప్పుడు గ్రాంథికభాషలో రచన చేయటం అంత అరుదుగా వుంది. క్రిందటి శతాబ్దపు ఉత్తరార్థంలోనూ, ఈ శతాబ్ది ప్రథమ పాదంలోను, పత్రికలన్నీ శబ్దసాధుత్వాసాధుత్వ చర్చనే ప్రధానంగా సాహిత్య విమర్శగా పరిగణించేవి. అముద్రితగ్రంథచింతామణి, శశిలేఖ, ఆంధ్రభాషాసంజీవని, మొదలైన క్రిందటి శతాబ్దపు సాహిత్యపత్రికలనిండా ఆ చర్చలే ప్రచురంగా ఉండేవి. ఈ శతాబ్ది ప్రథమ పాదంలో ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, వజ్రాయుధం, మొదలైన పత్రికల్లో వ్యావహారికభాషను గ్రామ్యమని నిందిస్తూ శబ్దరూపాలకు సంబంధించిన చర్చలు వెలువడేవి. భాష కాలక్రమానుసారంగా మారిపోతుందన్న విషయాన్ని గుర్తించటానికి నిరాకరిస్తూ, సంప్రదాయవాదులైన పండితులు, శబ్దరూపాలు లక్షణ విరుద్ధంగా ఉండకూడదని వాదించేవాళ్ళు ఎవరైనా కొత్తరూపాలు ప్రయోగిస్తే భారత ప్రయోగాలు చూపవలసిందనీ, అట్లా చూపకపోతే, వాటిని సాధువులుగా అంగీకరించమని వాదించేవాళ్ళు. తక్కిన విషయాలలో ఉత్తరోత్తరోరం బలీయమన్న ప్రామాణ్యంఉంటే, సాహిత్యవిషయంలోమాత్రం సంప్రదాయవాదులైన పండితులు, భారత ప్రయోగాలను, ఆంధ్రశబ్దచింతామణినీ మాత్రమే ప్రామాణికాలుగా గ్రహించి, తద్విరుద్ధమైన ప్రయోగాలను ప్రామాదికాలని నిరసించేవాళ్ళు. 'నలుక' 'మలీక', 'గలను' 'గలాను' మొదలైన రూపాంతరాలను ప్రాచీనులు ఛందంకొరకుగా ప్రయోగించినా అవి సాధువులనే అంగీకరించేవాళ్ళుకాని, శిష్టవ్యవహారదృష్టమైనా, మహాకవి ప్రయోగం లేకపోతే, ఆ ప్రయోగాన్ని సాధువుగా అంగీకరించేవాళ్ళుకారు. అవధాన విద్యావిశారదుడు, మహాపండితుడు సర్వతంత్ర స్వతంత్రుడు, అభినవపండితరాయలూఅయిన శ్రీ మాడభూషి వేంకటాచార్యులవారు, 'యోచన'అన్నపదం తమ గ్రంథంలో ప్రయోగిస్తే, ఆ ప్రయోగం అసాధువని అల్లంరాజు సుబ్రహ్మణ్యకవి ఆక్షేపించారు. పాణినీయాన్ని అనుసరించి 'యుచ'ధాతువు నిష్పన్నం కాదనీ, కనుక 'యోచన' శబ్దం అసాధువనీ సుబ్రహ్మణ్య కవిగారు ఆక్షేపించినప్పుడు, శబ్ద రత్నాకరంలో 'యోచన' శబ్దంఉన్నా, అది ప్రామాణికం కాకపోయింది. పూర్వకవి ప్రయోగాన్ని చూపవలసిందని సుబ్రహ్మణ్య కవిగారు కోరారు. అప్పుడు మాడభూషి వేంకటాచార్యులవారు 'యోచనాకమలాలోచనీ' అన్న త్యాగరాజ స్వామివారి కృతిని ఉదాహరించారు. అయితే త్యాగరాజస్వామిని, లాక్షణికులు ప్రామాణికుడుగా అంగీకరించ లేదు. 'యోచన' శబ్దం అసాధువుగానే ఉండిపోయింది వారిదృష్టిలో. 'లోకులరసనలె ఆకులుగా నుండునట్టి యువి వో కవితల్' అన్న కవికర్ణరసాయన కర్తవాక్కులు, ఈ లాక్షణికులకు సమ్మతంకావేమో! భాషా పరిణామ దృష్టి లోపించటమే వారిలోని ఈలోపానికి కారణమని, రామమూర్తిగారు వాళ్ళను విమర్శించారు. భాష ఎప్పుడు మారిపోతూనే వుంటుంది. అయితే ఒకవ్యక్తి జీవితకాలంలో తాను వ్యవహరిస్తున్న భాష మారిపోతున్నదని గుర్తించలేనంత నెమ్మదిగా అది మారుతుందని గురజాడ అప్పారావుగారు వ్రాశారు. వ్యవహారాన్నిబట్టి గ్రాంథికంకూడా మారుతూ వుంటుంది. లోక వ్యవహారానికి భిన్నంగా ఏకవీ తన రచనలను దిద్ది తీర్చలేదు. 'లోక వ్యవహారానుసారంగానే వీలయినంతవరకు కవిత్వం నడిపించుకోవడమే యెక్కువ హృదయంగమంగా ఉంటుంది' అన్నారు చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రిగారు.[23]

'జనుల వ్రాతలలో ఆయాకాలమందుండే శబ్దరూపములు పడుతూనే వుంటవి' అన్నారు బాలకవి శరణ్యంలో గిడుగువారు. అయితే గ్రాంథిక భాషాభిమానులు వారి సిద్ధాంతంతో ఏకీభవించనందువల్లనే గ్రామ్యగ్రాంథిక వాదం చాలారోజులు కొనసాగింది. మాండలికాలు వాడకూడదనీ, అవి వాడితే ఒక ప్రాంతంలో వ్యవహారంలో ఉన్న మాండలికాలు మరో ప్రాంతంవారికి అర్థం కాక, రసస్ఫూర్తికి భంజకం కలుగుతుందనీ, వ్యావహారిక భాషలోని మాండలిక పదప్రయోగం గొప్ప లోపమని గ్రాంథిక భాషాభిమానులు వాదించారు. అది సరైన వాదం కాదు. ప్రకరణాన్ని బట్టి, ఆ పదాల అర్థాలు తెలుసుకోవచ్చు. మాండలికోచ్చారణలోని విభేదాలగూర్చి వ్రాస్తూ జయంతి రామయ్య పంతులుగారు వివిధమండలములలో వివిధ 'యాచ'లున్నాయని చాలాచోట్ల 'యాచ' అని ప్రయోగించారు.

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు సాక్ష్యపవ్యాసాల్లోకూడా 'యాసను యాచ'గానే ప్రయోగించారు. సాక్ష్యవ్యాసాలలోనే పానుగంటివారు 'రైల్వే కంపార్ట్మెంటు'ను రైలుగదిగా వ్యవహరించారు. 'రైలుపెట్టె' అని గుంటూరు, కృష్ణా జిల్లాలవారు వ్యవహరిస్తారు. తెలంగాణాలో 'డబ్బా' అంటారు. పానుగంటివారు, కానీ జయంతి రామయ్య పంతులుగారుకానీ, మాండలికాలను

ప్రయోగించకూడదని వాదించేవారే. అయినా శిష్ట వ్యవహారానికి దూరంగా ఎవరూ వ్యవహరించలేరు. 'ఎంత మడిగట్టుకున్నా లోకంలో పుట్టి పెరిగే వాళ్లకు లౌకిక భాషతో సంబంధం అనివార్యం...' అన్నారు చెళ్లపిళ్లవారు. అయినా 'వ్యావహారికభాషా బహిష్కరణానికి చాలామంది పెద్దలు లోగడ పాటుపడ్డారు. వారిలో కొందరు గతించినా కొందరింకనూ సజీవులు. వారుకూడా లోయరు క్లాసు పిల్లకాయలకు అభ్యనుజ్ఞనిస్తారనే నేను విశ్వసిస్తాను. పత్రికా సంపాదకీయాలేకాక వార్తలుకూడా వ్యాకరణ సమ్మతంగా ప్రచురించబడి వుండే రోజులు నేను యెరుగుదును' అని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు వ్రాయటం గమనార్హం.[24]

'నన్నయ నాటి భాషయే మార్పులేక చిన్నయసూరినాటి దాకను సాగుచున్నదన్న నమ్మకముగలవారెందేని గొందరుందురేమో కాని, వారు భాషాచరిత్ర మెరుగని, కావ్యపరిణామములను గుర్తింపని పండితమ్మన్యులే యగుదురు' అని వేటూరి ప్రభాకర శాస్త్రివారు అటువంటి వారిని విమర్శించారు.[25]

అయితే ఇంకా కొందరు ఇప్పటికీ, ఆంధ్రదేశంలో ఏప్రాంతపు భాషను ప్రామాణికంగా గ్రహించాలీ అని, వివిధ మాండలికాలలో దేనిని ప్రామాణికంగా ఎంచాలి అని వాదిస్తూనే ఉన్నారు. మాండలికభేదం గ్రాంథికంలోకూడా తప్పేదికాదని గ్రాంథికవాదులు గ్రహించటం అవసరం. లేకపోతే వ్యాకరణంలో వర్ణలోప, వర్ణాగమ, వర్ణవ్యత్యయాదులకు ప్రక్రియ కల్పించవలసిన ఆవసరం లేదుకదా. ఒకే పదానికి బహుళ సంఖ్యలో రూపాంతరాలు పుట్టవలసిన అగత్యమున్నూ కనపడదు. అట్లానే ఏ భాషకైనా మాండలిక భేదాలు తప్పనిసరి అని చెప్పటానికి భాషలోని పర్యాయ పదాలే సాక్ష్యం పలుకుతాయి. 'వ్యవహారమున నంతగా గానరాకున్నను, ఊయెల, ఊయేల, ఉయ్యెల, ఉయేల—రూపములు సాధువు లనుచు, సర్వజన వ్యవహార రూఢమైయున్న 'ఉయ్యాల' తప్పనియు వాదించువారిని నేను సంభావింపజాలను' అని ప్రభాకర శాస్త్రిగారు వ్యావహారిక భాషా ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు.[26] కాలక్రమానుసారంగా జనుల ఉచ్చారణలో శబ్దరూపాలు రూపాంతరాలను సంతరించు కొంటాయి. 1874 వ సంవత్సరంలో చింతా సుందరరామశాస్త్రిగారనే వారు 'సంస్కృతాంధ్ర శబ్దరూప రహస్యము' అనే పుస్తకాన్ని ప్రకటించారు. ఇది మచిలీ పట్టణంలో అచ్చైంది. "ఈయన కాలంనాటికే అప్పుడే గ్రాంధికం పాతుకపోయింది. కనుక ఈ పుస్తకంలో కేవలం గ్రాంధికరూపాలే ఇచ్చాడు. ఈ గ్రంథంలో రూపాంతరాలు గల జాబితా అకారాదిగా ఇచ్చాడు...'ఎవరు' అన్న శబ్దానికి పదకొండు రూపాలున్నాయి. చురకత్తికి పధ్నాలుగు రూపాలు. 'ఒకడు' అన్న పదానికి పదహారు. 'ఎవరై'కు ఇరవైరెండు. 'ఒకరు' కు ముప్పై. 'ఒకరై'కు యాభైరెండు పర్యాయపద రూపాలను గ్రంథకర్త అందులో ఇచ్చారు[27]. ఈవిధంగా గ్రాంథికభాషలోకూడా రూపాంతరాలు పర్యాయ పదాలు లాక్షణికులు అంగీకరిస్తూ ఉండగా' మాండలికాలవల్లనున్ను బహుప్రాంతాల విశిష్టోచ్చారణాది భేదాలవల్లను వ్యావహారికం గ్రంథ ప్రయోగార్హం కాదనటం సబబు కాదు. వ్యావహారికభాషలో ఉన్న స్ఫూర్తి గ్రాంథికభాషలో ఉండదనటానికి సామెతలే సాక్ష్యం పలుకుతాయి.

'వ్యావహారికంలో అయితే రచన నీరసం అవుతుందనుకోవటం, గ్రాంథికం అయితే చాలు రసమహితం అయిపోతుందనుకోవడమూ, అవివేకానికి రెండు నిదర్శనాలు...జీవద్భాషకు నియామకుడు కవేగాని పండితుడూ వైయాకరణీకాదు...' అన్నారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు.[28]

ఈ విధంగా గడచిన అరవైసంవత్సరాల్లో భాషా విషయకంగా మనపండితుల, సాహిత్యవేత్తల, అభిప్రాయాలు మార్పు చెందాయి.

ఇక మిగిలిపోయింది ఒక్కటే ఉన్నది. అయితే వ్యావహారికానికి కూడా ఒక ప్రామాణికతను ఏర్పరచుకొనవద్దా? అని.

ఇటీవల వ్యావహారికభాషకుకూడా ఒక వ్యాకరణం నిర్మించుకోవాలనీ, ఆధునిక ప్రామాణికభాషఅంటూ ఏర్పరచుకోవాలనీ కొందరు పండితులు భావిస్తున్నారు. 1934 వ సంవత్సరం నాటికే మండపాక పార్వతీశ్వరశాస్త్రులవారు, వ్యావహారికభాషలో ఏకతను సాధించవలసిన అగత్యాన్నిగూర్చి వ్రాశారు. ఇంగ్లీషు భాషలో ఉన్నట్టు ప్రమాణము (Standard) తెలుగుభాషకు కూడా నియమించవలసిఉన్నదని శాస్త్రులుగారు భారతిలో ప్రకటించిన వ్యాసాల్లో అభిప్రాయపడ్డారు. గ్రాంథికభాషలో 'ఏకత' ఉన్నదనీ, జీవంలేదనీ, వ్యావహారికభాషలో జీవం ఉన్నదనీ, ఏకత లేదనీ, ఏకతా, జీవమూ రెండూ ఉన్నభాషే ఉత్కృష్టమైన భాష కాగలదనిన్నీ, ఉత్తమసాహిత్యసృష్టికి అటువంటి భాషే సాధనం కాగలదనీ పార్వతీశ్వరశాస్త్రులుగారు అభిప్రాయం వెలిబుచ్చేరు. అయితే పార్వతీశ్వరశాస్త్రులుగారి ఈ అభిప్రాయం, శాస్త్రదృష్టికి దూరమైనదని రామమూర్తిపంతులుగారు నిరాకరించారు.

'పార్వతీశ్వరశాస్త్రులుగారు తెలుగుభాషలో నాలుగు భేదాలు నిరూపించారు. అవి **Archaic, classical, standard, Dialectat** గా రూపించారు. వీటికి ఉదాహరణగా

Archaic—నేను చేయవలతును. నాకు చేయవలయును.

Classical—నేను చేయవలయును.

Standard—నేను చేయవలెను.

Dialectal—నేను చేయాలి—చేయాలె—చేయాల మొ॥ ఇంకో ఉదాహరణగా

Archaic—వలవదు

Classical—వలదు

Standard—వద్దు

Dialectal—ఒద్దు

Archaic, classical అనేవి ప్రాచీనాంధ్రం. **Standard** అనేది వర్తమానాంధ్రము. **Dialect** అనేది అభినవాంధ్రము. ఈ అభినవాంధ్రము వ్యాపిస్తున్నది. ఇందులో ఏకతలేదు. కనుక వర్తమానాంధ్రాన్ని, అభినవాంధ్రంనుంచి వేరుగావుంచి, వర్తమానాంధ్రాన్ని ప్రామాణీకరించవలె' అని పార్వతీశ్వర శాస్త్రులువారు అభిప్రాయపడినట్లూ, అట్లా అభిప్రాయపడటం శాస్త్రీయ దృక్పథంకాదనీ, అది నెరవేరేదని కాదనీ రామమూర్తి పంతులుగారు వివరించారు.[29] వ్యావహారిక భాషలో ప్రామాణికతను ఏర్పరచవలసిన ఆగత్యాన్ని ప్రశ్నించిన వారికి సమాధానంగా రామమూర్తి పంతులుగారు 'ఈనాట్లు నన్ను కట్టమన్నారు. అది నాకేకాదు. ఎవరికైనా అసాధ్యమే. ఇంగ్లీషుభాష మారి పాడైపోతూ ఉన్నదని పూర్వము భాషాతత్వము తెలియని కాలములో ప్రతిభగలవారు తమకాలపు భాష గురించి మొరపెట్టేవారు. జాన్సన్ తనకాలపు భాష మారకుండా కట్టుకట్టి నిఘంటువులో బంధించడానికి ప్రయత్నించినాడు. నిఘంటువు పూర్తిగా రచించేసరికి అతని భ్రమ వదలిపోయినది. జీవద్భాషను మారకుండా బంధించడం అసాధ్యమని ప్రకటించినాడు.'

ఏ వ్యావహారిక భాష కాలక్రమేణా ప్రపంచ సర్వభాషా సామాన్యంగా మార్పుకు లోనవుతూ వుంటుందనీ, ఆ మార్పును అనుసరించే ఆయా కాలాలలో గ్రంథస్థభాష రూపొందుతూ ఉంటుందని ఇది శాశ్వతంగా కొనసాగుతూ ఉంటుందనీ భాషావేత్తల అభిప్రాయం.

'... ...A spoken language is therefore necessarily a vague and floating entity And English is no exception to the rule-...A standard spoken language is strictly speaking an abstraction. No two speakers of standard English pronounce exactly alike.' (Encyc. Britanica-Phonetic)

భాషలో ఏకత లేకపోతే ప్రామాణికత్వం ఉండదనుకోవటం పొరపాటని రామమూర్తి పంతులుగారీ విధంగా వివరించారు.

'ఆంధ్రదేశములో అన్నిమండలముల వారికీ పరస్పర సంబంధం అన్నివిధాలా ఎప్పుడు ఏర్పడుతుందో, ప్రజలకు నూటికి తొంభయి మంది చొప్పున అయినా, చదువు ఎప్పుడు వస్తుందో, అప్పుడు ఆంధ్రభాషకు **standard** దానంతట అదే ఏర్పడుతుంది. అదైనా కేవలమూ ఏకరూపమున ఉండదు సుమండీ! పరమైకతగల భాష లోకములో ఎక్కడా లేదు. సృష్టిలో ఏ రెండు వస్తువులూ అన్నివిధాలా ఒక్కలాగున ఉండవు. **standard** కోసము మనము పరితపించవక్కరలేదు. పండితుల ప్రయత్నంవల్ల అది ఏర్పడదు.'

కాబట్టి ఆధునిక ప్రామాణిక భాషావాదుల వాదం అశాస్త్రీయమని రామమూర్తి పంతులుగారి వివరణనుబట్టి తెలుస్తున్నది. దీనినిబట్టి ఆధునిక ప్రామాణిక భాష అంటూ ఒకటి రూపొందించలేమనీ, ఒకవేళ రూపొందించినా, ఆభాషకూడా దేశ కాల పాత్రలను అనుసరించి మారిపోకుండా ఉండదనీ స్పష్టమవుతున్నది. యువతరం రచయితల రచనలను పరిశీలిస్తే, వాళ్ల రచనల్లో ఏకత కనపడుతూనే ఉన్నది.

వ్యావహారికభాషా ఉద్యమం అన్నది చారిత్రక పరిణామం. బహుళంగా వచన రచనలు వెలువడి వ్యావహారిక భాష ప్రాముఖ్యానికి దోహదమైంది. ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన అనేక పరిణామాల ప్రభావం దేశభాషల్లో ప్రతిఫలించక తప్పదు. శాస్త్రీయ విజ్ఞానం అమితమైన వేగంతో పురోగమిస్తున్నకాలంలో భావప్రకటనకు సమర్థమైన శబ్ద జాలాన్ని ఎంతగానో సంతరించుకోక తప్పదు. మానవుడు చంద్రమండలం పైనకూడా అడుగు పెట్టిన ఈరోజుల్లో కాలానికీ దూరానికీ కొత్త అర్థం చెప్పుకుంటున్న ఈరోజుల్లో, సాంఘిక పరిణామాలు' కళ్లముందే చూస్తున్న ఈరోజుల్లో దేశభాషల్లో వాటి ప్రభావం ఉండకుండా వుండదు.

ఇప్పటి వ్యావహారికంకూడా ఇంకో శతాబ్దంలో మారిపోవచ్చు. భాష స్వభావసిద్ధంగా మార్పులకు లోనైనా తాతల నాటి భాష, మనవలకు అర్థంకానంతగా మారిపోవచ్చు. ఏడెనిమిది వందల సంవత్సరాల క్రిందటి శాసనభాష మనకిప్పుడు ప్రయత్న సాధ్యంగాతప్ప అర్థంగాదు. అయినప్పటికీ, అది తెలుగుభాష కాదేమోననే భ్రాంతి కలిగేంతగా ఇప్పటి భాష మారలేదు. బొంబాయి ప్రాంతంలో మాట్లాడే కామాటిభాషకాని, దక్షిణ దేశంలో మాట్లాడే తెలుగుకాని, అవి తెలుగులోంచి రూపొందినవే అయినా, తెలుగుదేశంలోని వారికా భాషలు సులభగ్రాహ్యం కావు. కాబట్టి భాష మారటమనేది చారిత్రక, భౌగోళిక, రాజకీయ, సాంఘికాది పరిణామాలపై ఆధారపడి ఉంటుందని గ్రహించాలి.

తెలుగుదేశంలో నేటి వ్యావహారికభాషే ప్రామాణికభాష. అదే నేటి గ్రాంథికభాష.

ఉపయుక్త గ్రంథ సూచి

1. History of Telugu literature—By late Dr. G. V. Sitapati (Sahitya Academy Publication—1968 PP-142)

2. వ్యావహారికభాషా బహిష్కార నిరసనము—శ్రీ గిడుగు వెంకటరామమూర్తి పంతులు—భారతి సం. 1, సం, 5, 6—1924.

3. కృష్ణాపత్రిక 1953 జనవరి 10 వ తేది సంచిక—శ్రీ తెలికచెర్ల వేంకటరత్నంగారి వ్యావహారికభాషనుగూర్చిన వ్యాసం.

4. & 5. Reprints of the extracts from the Hindu of the year 1914 in a book form regarding the Modern Telugu Movement—కాకినాడ ఆంధ్రభాషా సంరక్షక సమాజంవారి ప్రచురణ.

6. గిడుగు వర్ధంతి సంచిక, కృష్ణాపత్రిక—1953 జనవరి 10

7. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు విమర్శనము—1939 (ప్రతిభనుంచి పునర్ముద్రితం.)

8. Reprints from Hindu of the year 1914.

9. A Medalist in Telugu writes—HINDU(20-7-14)

10. „ „ „

11. Hindu—18th & 19th June 1914.

12. Hindu 1-9-1914

13. Hindu August 1914

14. కాతంత్రవ్యాకరణం—శ్రీ ఎస్. పి. యస్. వెంకటాచార్యులు—(అమరవాణి పుట 51)—1968.

15. శిష్టభాష—శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రి. ప్రతిభ—నవంబరు 1936.

16. Hindu 10—10—1914.

17. కృష్ణాపత్రిక 1953 జనవరి 10—శ్రీ తెలికచెర్ల వెంకటరత్నంగారి 'వ్యావహారిక భాషోద్యమం' గూర్చిన వ్యాసం.

18. శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రులవారి జీవితము—వి. వి. శాస్త్రి—1949 పుట 125.

19. తెలుగు—1918 (గిడుగు వెంకట రామమూర్తి గారు పర్లాకిమిడినుంచి ప్రచురించేవారు—మాసపత్రిక)

20. గిడుగు వేంకటరామమూర్తి జీవితచరిత్రము—గిడుగు వెంకట సీతాపతి, పుట. 30' 31

21. భాగ్యనగర ఆంధ్రసాహిత్య పరిషత్తు స్వాగతోపన్యాసం (14—1—53) పుట. 3.

22. A Dictionary of Current Telugu (Introduction) R—GALLETE Page 11—1935.

23 కథలు—గాథలు 3 వ భాగం—పుట 176

24. కథలు—గాథలు 3 వ భాగం—పుట. 422

25. గిడుగు వెంకట సీతాపతిగారి భారతీశతకం (పీఠిక) పుట. 8

26. భారతీశతకం పీఠిక.

27. వాడుకభాష రచనకి కొన్ని నియమాలు—పేకుమళ్ల కామేశ్వరరావు—పుట. 22

28. అనుభవాలూ—జ్ఞాపకాలూను 2వ భాగం పుట146.

29. వాడుకభాష రచనకి కొన్ని నియమాలు (పీఠిక)—పుటలు 4—5.

30 వాడుకభాష రచనకి కొన్ని నియమాలు—(పీఠిక) పుటలు 10, 11.

ముక్కుపుల్ల

శ్రీ పి. వి. ఎస్. రామదాసు

"ఇంత పని చేశాక నిన్నింకా పనిలో ఉంచుకోమంటావా? ఇంకెప్పుడూ దొంగపని చేయకుండా బుద్ధిరావడానికి నిన్ను పోలీసులకు అప్పగించినా తప్పులేదు' అన్నాడు వెంకటరావు.

పాతికేళ్ల పనిమనిషి పోచమ్మ ఏడుస్తూ నిలుచుంది.

పోచమ్మను విడిగా చూస్తే పనిమనిషి అని ఎవరూ అనుకోరు. నూనె రాసి చక్కగా దువ్వి, తీరుగా పెట్టిన ముడి, ముడిలో తురిమిన కనకాంబరాలూ, క్రొత్త ఖరీదైన నయాపైసల నాణెమంత కుంకుమబొట్టూ శుభ్రంగా ఉతికి పొందికగా కట్టిన చీరా, బిగుతుగా నిండుగా అమరిన రవికా చూసినవారు ఆమెను పనిమనిషిగా పెట్టుకోడానికే జంకుతారు.

ఆదివారం కదా అని ఇంగ్లీషు సినిమా ప్రోగ్రాం పెట్టుకుని వెంకటరావుని తీసుకుని వెళదామని ఇబ్రహీం మంజిల్ కాలనీ నుంచి మలకపేట కాలనీకి అరగంట క్రితం వచ్చిన కరుణాకరరావు ఆ గొడవమూసి లోపలికి వెళ్లడానికి సంకోచిస్తూ దూరంగా నిలుచున్నాడు.

ఆ యింటినిండా పదిమంది అమ్మలక్కలు చేరారు.

'పనిమనిషికి దొంగబుద్ధి ఉంటే కష్టం సుమండీ' అన్నది ఒకామె తక్కినవారికి దొంగబుద్ధి ఉంటే ఫరవాలేదనే ధ్వని రాకుండా.

'అసలు దాన్నిచూస్తే—దానిపోకూ, దాని వేషమూ చూస్తే అది పనిమనిషి అని ఎవరూ అనుకోరు.' అన్నది మరొకామె.

'రోజుకొక రకం జుట్టుముడీ, రకరకాల గిల్టు ముక్కుపుడకల మార్పు, లోలక్కులూ, రింగులూ - ఒకటేమిటి అది వేసే వేషాలకి ఏ సినిమా స్టారూ సరిపోదు' అన్నది వేరొకామె.

'ఆ వయ్యారమూ, ఆ కులుకూ, ఆనడకా, ఆ తనివి శ్రీమంతులకు కూడా రావు.' అన్నది మరొకామె.

'సిగ్గు విడిచిపెడితే చాలు, అవే వస్తాయి.' అన్నది ఒకామె.

'తనేదో, తన తాహతేదో గ్రహించక కొడుకును చదివిస్తుందా?' అని ముక్కుమీద వ్రేలు వేసుకుంది మరొకామె.

'చదివించినా ఏదో గవర్నమెంటు స్కూలులో వెయ్యక మన మాదిరిగా కాన్వెంటులో వేసి చదివిస్తుందా' అని ఆశ్చర్యపోయింది వేరొక గేస్తురాలు.

'శక్తికిమించిన పరుగులు పరుగెత్తడ మెందుకు? ఇలా దొంగతనాలు చెయ్యడమెందుకు?' అన్నది ఒక గృహిణి.

'ఇటువంటి పని చేసిన దానిని పోలీసులకు అప్పజెప్పాలి.' అన్నది వెంకటరావు భార్య.

'అంతపని సెయ్యకమ్మా, నీకాలు మొక్కుతా.' అన్నది పనిమనిషి పోచమ్మ.

'మరి నువ్వు చేసినది దొంగపని అవునంటావా కాదంటావా?' అన్నది వెంకటరావు భార్య.

'జర గలత్ అయిందమ్మా. ధిమాక్ ఖరాబయింది. పోరడికి యిస్కూలుకి పైసలు సాల్లేదు...' అని వివరించబోయింది పనిమనిషి పోచమ్మ.

'అయితే నా వస్తువు దొంగతనం చేసి తాకట్టు పెడతావా?' అన్నది వెంకటరావు భార్య.

'మాఫ్ చెయ్యమంటున్నా. నాది దొంగబుద్ధికాదు. పోయిన నెల పోరడికి 'యిస్కూలు పైసలు తక్కువయినాయి. అందరినీ అడిగినా ఒక్కరూ యివ్వకపోయిను. ఏం సెయ్యాలమల్లా? గుండె బేజారయింది. నిన్నూ అడిగినా యాదుందా?'

'అవును. అడిగావనుకో. లేదన్నమాత్రంచేత దొంగపని చేస్తావా?'

'ఆ మాటనకమ్మా, నీ కాలు మొక్కుతా. నాది దొంగబుద్ధి కాదమ్మా. నేను చోర్ అయితే నీ ముక్కుపుల్ల మళ్లీ నీకు తెచ్చియిస్తునా?' అన్నది పనిమనిషి పోచమ్మ.

'అసలు మొట్టమొదట ఆ పని ఎందుకు చేశావు?' అన్నది వెంకటరావు భార్య.

'ఎవరినడిగినా పైసలియ్యక పోయిరి. నాకున్న అసలు బంగారం ముక్కుపుల్ల ఎన్నడో అమ్మేస్తిని.'

'నీ మగడు వడ్రంగి పని చేస్తాడు కదా, ఆ మాత్రం డబ్బు అడగలేకపోయావా?' అన్నాడు వెంకటరావు.

'ఆడు తెచ్చిందంతా ఆడి నిషాకి, కుసీకీ సరిపోతది. నాకేమిస్తడు. మట్టి?' అన్నది పనిమనిషి పోచమ్మ.

'అలాగని దొంగతనం చేస్తావా?' అన్నాడు వెంకటరావు.

'అయ్యో, చోరీ కాదయ్యా' పోయిన నెల అమ్మ తలంటు కుండది. దుద్దులూ, ముక్కుపుల్లా భరిణెలో పెట్టి దాసింది. నేను దొంగనయితే అన్నీ తీసేదాన్ని కదా. దొంగనుకాను కను కనే ముక్కుపుల్ల ఒక్కటే తీసి తాకట్టు పెట్టా. పబ్బం గడిపింది...'

'మరి అప్పుడు నేను ముక్కుపుడక పోయిందో అని గోల పెట్టినప్పుడు నువ్వు ఏమీ అనకుండా మన్ను తిన్న పాములా వూరుకున్నావేం?' అన్నది వెంకటరావు భార్య.

'అదే నేను చేసిన గల్తీ. ఈ నెల సహేలకి తనఖా పైసలు పడినంక ముక్కుపుల్ల విడిపించి తెచ్చి యిస్తాని. ఇంకా దొంగ అనక మాఫ్ సెయ్యి. అమ్మ, మీ కాలు మొక్కుతా. పోలీసు మాట అనకయ్యా. ఎప్పటిలా మీ బాసెన్లు తోముతా, పనిలో ఉంచుకో అయ్యా.' అన్నది పని మనిషి పోచమ్మ.

'ఇంత పని చేశాక నిన్నింకా పనిలో ఉంచుకోమంటావా? ఇలాంటి దొంగపని చేయకుండా నీకు బుద్ధి రావడానికి నిన్ను పోలీసులకు అప్పజెప్పినా తప్పు లేదు.' అన్నాడు వెంకటరావు.

పని మనిషి పోచమ్మకి దుఃఖం ఆగలేదు. ఏడుస్తూ నిలుచుంది.

అరగంట క్రితంనుంచీ బయట నిలుచుని గమనిస్తూ ఉన్న కరుణాకరరావు సినిమా ప్రోగ్రాంకి తిలోదకా లిచ్చుకుని తిరుగుముఖం పట్టాడు.

కాళ్లీడ్చుకుంటూ బస్సు స్టాపు వైపుకి నడిచాడు కరుణాకర రావు. అతడు అల్లంత దూరంలో ఉండగా ఒక బస్సు దూసుకు పోయింది. నిరుత్సాహంగా బస్సు స్టాపు దగ్గరకు చేరి నిలబడ్డాడు కరుణాకరరావు.

మరొక గంట వరకూ తనకు బస్సు లేదన్న విషయం అనుభవపూర్వకంగా తెలిసినదే కాబట్టి అంతవరకు నిలబడే వోపిక లేక చుట్టూ కలయచూశాడు కరుణాకరరావు. దగ్గరలో ఒక రాతి బండ కనిపించగా దాని మీద కూర్చున్నాడు.

వెంకటరావు యింటి దగ్గర జరిగిన గొడవ గురించి ఆలో చించాడు కరుణాకరరావు.

నిజమే, పనిమనుషులతో చాలా పేచీ లున్నాయి. నిజానికి తన యింట్లో కూడా ప్రస్తుతానికి పనిమనిషి లేదు. వాళ్లు పెట్టే వాగాలకీ వాళ్లు చేసే చిన్న చిన్న చౌర్యాలకీ విసిగి పనిమనుషులతో వేగలేక మానిపించింది అతని భార్య సుగుణ.

కాని, వెంకటరావు యింటిలో పనిచేసిన పోచమ్మ ఒక విశిష్టమైన వ్యక్తిగా అతనికి తోచింది.

పోచమ్మ శుభ్రతా, నాజూకుతనమూ ఒక ఎత్తూ, తన కొడుకును కాన్వెంటులో చదివించి పైకి తీసుకురావాలనే ఉన్న ఆశయం మరొక ఎత్తూ! ఈ రెండు లక్షణాలూ అతనికి నచ్చాయి.

ఆమె ఆశయానికి త్రాగుబోతు భర్త చేసే సహాయం ఏమీ లేకపోయినా ఒంటరిగా పోచమ్మ జరిపే పోరాటం అతడు మెచ్చు కున్నాడు.

అలా అని ఆమె చేసిన దొంగతనాన్ని సమర్థించగలడా? ఎవరూ సహకరించని పరిస్థితులలో ఆమె అలా చేయవలసి వచ్చిందని సరిపెట్టుకున్నాడు కరుణాకరరావు. అదీకాక దొంగతనం చేసిన పనిమనుషుల్ని తాను చూశాడు కాని ఇలా తనంత తానే తిరిగి వస్తువును వాపసు యిచ్చిన పనిమనిషిని చూడడం యిదే ప్రథమం.

మంచిగా బ్రతకడానికి ఆమెకు చేయూత నివ్వవలసిన కర్తవ్యం వెంకటరావుమీద ఉన్నదని కరుణాకరరావు అనుకున్నాడు. ఒకసారి తప్పుచేసినంతమాత్రాన పోలీసులకి అప్పచెబితే జైలు గదిగోడలు చూసిన వ్యక్తిని బాగుచెయ్యడం మరింత కష్టం అవు తుందని అతని నమ్మకం.

ఈ విధంగా కరుణాకరరావు ఆలోచిస్తూ, బస్సుస్టాపు వద్దకు వచ్చి చేరిన జనాన్ని పరధ్యానంగా చూస్తూండగా పనిమనిషి పోచమ్మ విషణ్ణవదనంతో అతనికి కనిపించింది.

కరుణాకరరావు చేతిగడియారం చూశాడు. తానక్కడ కూర్చుని నలభై నిముషాలయిందని గ్రహించాడు.

జనానికి దూరంగా మ్లానవదనంతో నిలుచున్న పనిమనిషి పోచమ్మను చూసి కరుణాకరరావు లేచాడు.

ఏమి జరిగిందో తెలుసుకోవాలనే కౌతుకంతో ఆమె నిలు చున్న చోటికి వెళ్లాడు.

'అవ్వా, ఏమయింది'? అన్నాడు కరుణాకరరావు.

'కొంప మునిగిందయ్యా. ఈ కాలనీలో అందరూ! నన్ను పని మానిపించిన్రు' అని ఏడ్చింది పనిమనిషి పోచమ్మ.

'ఎందుచేత?' అన్నాడు కరుణాకరరావు.

'నేను దొంగనట. ఎట్ల బతకాల? ఏమీ పనుకే పట్టడం లేదు' అన్నది పనిమనిషి పోచమ్మ; ఏడుస్తూనే.

కరుణాకరరావు కాస్సేపు ఆలోచించాడు.

'ఏడవకు అవ్వా. నువ్వు మళ్లీ అలాంటిపని చేయనని మాట యిస్తే మా యింట్లో పనిమనిషిగా పెట్టుకుంటాను. ఇంద్రం నుంచిలే వస్తావా?' అన్నాడు కరుణాకరరావు.

పనిమనిషి పోచమ్మ ముఖం వికసించింది. దుమ్ముతుడిచిన అద్దంలా ఆమె ముఖం ప్రకాశించింది.

'జరూర్ వస్త.' అన్నది.

'అయితే ఇప్పుడే నాతో రా. నువ్వు నివ్యంగా పనిచేసు కుంటే మా కాలనీలో ఇంకా కొంతమంది ఇంట్ల పని దొరక వచ్చు.' అన్నాడు కరుణాకరరావు.

గ్రామసీమ :　　　　కర్ర చెక్కడపు చిత్రం — కేరళ.

ఇంతలో బస్సు వచ్చింది. ఆమె బస్సు ఎక్కడం చూసిన తరువాత కరుణాకరరావు బస్సు ఎక్కాడు.

కోటీ వచ్చింది. అందరూ బస్సు దిగారు. పనిమనిషి పోచమ్మ దిగింది; కరుణాకరరావుకూడా దిగాడు. అతనికి కాఫీ త్రాగాలనిపించింది. కాని పనిమనిషిని కాఫీకి తీసుకుని వెళ్లడం బాగుంటుందా అనే సందిగ్ధావస్థలో పడ్డాడు. అతని మానవత్వం ఓడిపోయింది. కాఫీ త్రాగడాన్ని వాయిదా వేశాడు.

కోటీ నుండి ఆమెను ఇర్రం మంజిల్‌కి తీసుకుని వెళ్లాడు కరుణాకరరావు.

ఇంటికి వెళ్లగానే అతని భార్య సుగుణ. 'ఏమండీ, అప్పుడే వచ్చారు. సినిమాకి వెళ్లలేదా? వెంకటరావుగారు లేరా? వీరెవరూ?' అని ప్రశ్నల వర్షం కురిపించింది.

'వెంకటరావుగారికి తీరుబడిలేకపోయింది. అందుకని వచ్చేశాను.' అన్నాడు కరుణాకరరావు అల్పోక్తిగా.

'పోనీలెండి. వీరెవరూ?' అన్నది సుగుణ.

'మనకి పనిమనిషి కావాలికదా. అందుచేత ఒక స్నేహితుని సిఫార్సుమీద ఈమెను తీసుకు వచ్చాను.' అన్నాడు కరుణాకరరావు నిజానికి అబద్ధాన్ని జోడిస్తూ.

'మంచిపని చేశారు.' అని ఒకసారి మళ్లీ పోచమ్మను పరీక్షగా చూసింది.

'బాసెన్లు ఉన్నయా, అమ్మా' అని పనిమనిషి పోచమ్మ నోరు విప్పగానే సుగుణకు ధైర్యం వచ్చింది.

వెంటనే పురమాయింపులు ప్రారంభించింది సుగుణ.

పనికి సంబంధించినంతవరకు పోచమ్మపని సుగుణకు నచ్చింది.

కాని పోచమ్మ కొడుకుని తన కొడుకులతో పాటు కాన్వెంటులో చదివించడమూ, ఆమె తనకంటె శుభ్రంగాను అందముగానూ ఉండడం సుగుణకు నచ్చలేదు. అయినా ఆమెను మాని పించితే సొంతంగా అంట్లు తోముకోవాల్సి వస్తుందని సహనం చూపేది సుగుణ.

పనిమనిషి పోచమ్మ శక్తివంచన లేకుండా తనపని శుభ్రంగా చేయడం చూసిన మరికొంతమంది యిళ్లలో ఆమెకు పని దొరికింది.

వారి పిల్లలకుకూడా పోచమ్మ అంటే ఎంతో యిష్టం.

ఈ విధంగా కొన్ని నెలలు గడిచాయి. తానొకరికి సహాయం చేయగలిగాను కదా అని కరుణాకరరావు అప్పుడప్పుడు సంతోషించేవాడు.

అదే సంతోషంతో—పనిమనిషి పోచమ్మ కనబడినప్పుడు ఆమెవైపు జాలితో దయతో చూసేవాడు —

ఆ విధముగా కరుణాకరరావు పనిమనిషి పోచమ్మను చూడడం సుగుణ గమనించింది. కాని సరిగా అర్థం చేసుకోలేక పోయింది. జాలి దృష్టికీ మోహదృష్టికి తేడా తెలుసుకోలేక పోయింది సుగుణ.

ఇట్లా రోజులు గడుస్తున్నాయి.

దసరా వచ్చింది.

బొమ్మలకొలువు పెట్టడాలూ, ఒక కాలనీవారు మరొక కాలనీకి పేరంటానికి వెళ్లడాలూ జరిగాయి.

అదనంగా ఎంతపని తగిలినా విసుగుకోకుండా పనిచేసింది పని మనిషి పోచమ్మ.

సుగుణకూడా పోచమ్మను ఎక్కువగా ఆదరణతో చూడడం వల్ల కరుణాకర రావుకి మరింత సంతోషం కలిగింది.

దీపావళి వచ్చేనాటికి తానేదో గొప్ప పని చేసినట్లు భావించాడు కరుణాకరరావు. అంధకారంలో పడడానికి సిద్ధముగా ఉన్న ఒకనాటి ప్రాణికి వెలుగుచూపించిన తృప్తి ఆతనికి కలిగింది.

ఆరోజు నరక చతుర్దశి.

తెల్లవారుజామునే పోచమ్మ వచ్చింది. పిల్లలకు తలంటి నీళ్లుపోసింది సుగుణ.

కరుణాకరరావు కూడా తలంటి పోసుకున్నాడు. పిల్లల్ని వీధివాకిలిలోకి తీసుకొనివెళ్లి మతాబాలు కాలిపిస్తున్నాడు.

సుగుణ అభ్యంగ స్నానంచేసి బట్టలు కట్టుకుని హాలులోకి వచ్చి, 'పోచమ్మా, ఆ దుద్దుల భరిణె తీసుకురా' అన్నది.

పోచమ్మ గదిలోకి వెళ్లి అలమరాలో నున్న భరిణె తీసుకుని వెళ్లి యిచ్చింది.

'పోచమ్మా. ముక్కుపుడక కనపడటం లేదేమిటో' అన్న సుగుణమాటలు విని కరుణాకరరావు లోపలికి వచ్చాడు.

'నాకు తెల్దమ్మా' అన్నది పనిమనిషి పోచమ్మ.

'నీకు తెలియకపోతే యింకెవరికి తెలుస్తుంది. మర్యాదగా యిచ్చేసెయ్యి, నీ దొంగబుద్ధి ఎక్కడికిపోతుందో?' అన్నది సుగుణ.

'సత్తెపెమానికంగా నాకు తెల్దు. నాబిడ్డ కొడుకుతోడు.' అన్నది పోచమ్మ.

'అనవసరంగా పసివానిమీద ఒట్టు పెట్టకు. మర్యాదగా ఇచ్చేసెయ్యి.' అన్నది సుగుణ.

కరుణాకరరావు తనచెవులను తానే నమ్మలేకపోయాడు. తానేదో బాగుచేశాననుకున్న వ్యక్తి యింతపని చేస్తుందా? ఇప్పుడేం చెయ్యాలి?

"ఉండు సుగుణా. నేనడుగుతాను. అసలామె తీసి ఉండక పోవచ్చు." అన్నాడు.

'పోనీ మీరైనా అడిగి నాముక్కుపుల్ల దానిచేత యిప్పించండి. మీ మాటకైనా విలువ యిస్తుందేమో చూద్దాం.' అన్నది సుగుణ రెండవసారి కాఫీ పెట్టడానికి వంటింట్లోకి పోతూ.

'అయ్యా నాకే పాపమూ తెల్దు' అన్నది పనిమనిషి పోచమ్మ.

'చూడు, పోచమ్మా, నీకేమయినా డబ్బు కావాలంటే నన్ను డిగి తీసుకోలేక పోయావా? ఎందు కిలాంటి పనిచేశావు?' అన్నాడు కరుణాకరరావు.

'నేను తియ్యలేదయ్యా' అని గద్గదిక కంఠంతో చెప్పింది పోచమ్మ.

'నీ మాటలు ఎలా నమ్మాలో తెలియడంలేదు. నీకు సాయంత్రంవరకు వ్యవధి యిస్తున్నాను. ఈలోగా నిజం చెప్పేసెయ్. నీకేమన్నా డబ్బు కావాలంటే నేనిస్తాను.' అన్నాడు కరుణాకరరావు.

'నాకు ఏమీతెల్దు, అయ్యా.' అని పనిమనిషి పోచమ్మ వేరే ఇండ్లలో పనిచేయడానికి పోయింది.

ముక్కుపుడక ఎక్కడైనా దొరుకుతుందేమోనని పిల్లలతో కరుణాకరరావు ఇల్లంతా నలుమూలలా వెతికాడు. కాని లాభం లేకపోయింది.

'మీకేమయినా పిచ్చిపట్టిందా? ఎత్తుకుపోయిన సొత్తు ఇంట్లో దొరుకుతుందా?' అన్నది సుగుణ.

'అయితే పనిమనిషి తీసిందంటావా?'

'తప్పకుండాను. దీనికిలాంటి దొంగపని క్రొత్తేంకాదు. ఇదివరకు మలకపేటలో చేసిందటగా?' అన్నది సుగుణ.

'ఎవరు చెప్పారు నీకు?'

'దసరా బొమ్మలకొలువుకి వెంకటరావుగారి భార్య పేరంటానికి వచ్చినప్పుడు చెప్పింది.' అన్నది సుగుణ అతనిని దీక్షగా చూస్తూ.

పనిమనిషి పోచమ్మ బ్రతుకుతెరువు నిలపడంకోసం తా నే విషయం దాచుదామనుకున్నాడో అది సుగుణకు తెలియడంతో కరుణాకరరావు విస్తుపోయాడు.

'మీరలా ఊరుకోవడం కాదు. దీనిమీద పోలీసు రిపోర్టు యివ్వండి' అన్నది సుగుణ.

'చూడు సుగుణా. ఆమె తీసిందో లేదో మనం ఎవరమూ చూడలేదు. ఒకసారి నేరం చేస్తే మళ్లీ చేస్తుందనుకోవడం పొరపాటు. అమాత్రందానికి మనం పోలీసురిపోర్టు యిస్తే ఆమెకు పని దొరకడం కష్టం' అన్నాడు కరుణాకరరావు.

'మీకు పనిమనిషిమీద ఉన్నంత అభిమానమైనా నామీద లేదు' అన్నది సుగుణ కసిగా.

'ఛ. ఛ. అదేమిటి సుగుణా, నీకు పనిమనిషితో పోలికేమిటి?' అన్నాడు.

'చెడురోజులు వస్తే ఒక్కొక్కప్పుడు ఎవరితోనైనా పోటీ పడవలసివస్తుంది. దానికేంగాని మీరు దానిమీద పోలీసురిపోర్టు యివ్వడానికి యిష్టపడినా యిష్టపడకపోయినా అది ఈ రోజు నుంచి నా యింట్లో పనిచెయ్యడానికి వీలులేదు' అన్నది సుగుణ ఖచ్చితంగా.

'సరే నీ యిష్టం.' అన్నాడు కరుణాకరరావు నిస్సహాయంగా.

ఆ సాయంత్రం పోచమ్మతో కరుణాకరరావు యిలా అన్నాడు. 'నువ్వు నాతో నిజం చెప్పడంలేదు. నువ్వు యిదివరకు చేసినపనికి యిప్పుడు చేసినపనికి పోలీసురిపోర్టు యివ్వవలసినదే. కాని ఈ దీపావళిపండుగరోజున ఆ పని చెయ్యదలచుకోలేదు. అయితే ఒకటి మాత్రం తప్పదు. నువ్వింక మా యింటికి పనికి రానక్కరలేదు.'

'మీకు రహం లేకపాయె. ఇది నా బదనసీబ్.' కాని సత్తెం సెబుతూండా. నేను మీ ముక్కుపుల్ల తియ్యలేదు. మీ పని మానమంటున్నారు. ఏంచెయ్యాల? నాకు మానడం పసందు లేదు. అయినా మీరు మాలిక్‌లు. మీ హుకుమే మాకు ఫర్మానా. పోతుండా.' అని వెళ్లిపోయింది పనిమనిషి పోచమ్మ.

పిల్లలంతా ఉత్సాహంగా మతాబాలు వెలిగిస్తున్నారు. కాని అతడేదో వెలితి ఉన్నట్టు చిన్నబోయిన ముఖంతోనే దీపావళి చేశాడు.

ఆ రాత్రి పిల్లలంతా పడుకున్న తరవాత. 'ఏమండీ అదోలా ఉన్నారు? దానిని పనిలోనుంచి మానిపించేశామనా? దొంగతనం చేసిన దానిని ఎలా పనిలో ఉంచుకుంటాము?' అన్నది సుగుణ.

'ఆమె దొంగతనం చేసినదో లేదో మనకు తెలియదు...'

'అది తియ్యకపోతే భరిణే తినేసిందా? ఎలా పోయింది ముక్కుపుడక?'

'ఏమో. కాని, ఆమెను ఎందుకు పనిలోనుంచి తీసివేశామో. ఎవరికీ చెప్పకు.'

'చెబితేనేం?'

'చెబితే అందరూ ఆమెను పనిలోంచి తీసేస్తారు...'

'తీసేస్తే ఆమెకేం గడవకపోదు. ఆమె సంగతి మీకు తెలియదనుకుంటాను.' అన్నది సుగుణ.

'ఎలా గడుస్తుందంటావు?'

'దాని గురించి ఒక్కొక్కరు నాకు చెప్పిన మాటలు మీ కెలా తెలుస్తాయి?'

'ఏమిటని?'

'అదెక్కడెక్కడ పనిచేస్తుందో అక్కడ మగవాళ్లంతా ఆమె పక్షమే. అదంటే పడిచస్తారు; మీకు మల్లే.' అన్నది సుగుణ కసిగా.

'సాటి స్త్రీ గురించి అంత చులకనగా మాట్లాడతావేం, సుగుణా?' అన్నాడు కరుణాకరరావు మందలిస్తూ.

'పనిమనిషిని పట్టుకుని సాటిస్త్రీ అంటారేమండీ. అవును మరి. మీ కంటికి ఆమె ఆ విధముగానే కనిపిస్తుంది.' అన్నది సుగుణ వెటకారంగా.

'మానవత్వం మరిచిపోకు, సుగుణా.'

'పెద్ద పెద్ద మాటలు చెప్పి మీ స్వార్థానికి రంగు పూయకండి.' అన్నది సుగుణ తీవ్రంగా.

'ఏమిటి నువ్వంటున్నది? ఇందులో నా స్వార్థం ఏముంది?'

'నాకేమీ తెలియదనుకోకండి. నేను వెయ్యి కళ్లతో కని పెడుతున్నాను. కనుక మీరేమి చెయ్యడానికీ అవకాశం దొరక నివ్వడంలేదు. పదోనంబరు పంకజంగారి మొగుడు దీనితో పరాచికాలాడుతూ ఉంటే ఆమె నాతో చెప్పుకుని ఏడ్చింది. ఇంకా చాలా ఉన్నాయి, ఆ మోహినీ పిశాచం గురించి...'

'పుక్కిటి పురాణాలు వినడానికి నాకు ఓపికలేదు. రోజుకొక ఘట్టం తీరికగా రేపటినుంచి చెబుదువుగాని ప్రస్తుతానికి నన్ను నిద్రపోనియ్యి, పదకొండు గంటలయింది...' అని గోడవైపు తిరిగాడు కరుణాకరరావు,

తాను సహాయంచేసి ఉద్ధరిద్దామనుకుంటే ఈ విధముగా పరిస్థితి విషమించినందుకు కరుణాకరరావు విచారించాడు.

చాలాసేపు ఆలోచించి చివరకు నిద్రపోయాడు.

మరునాడంతా అతనికి ఆఫీసులో ఒకటే చింత—ఎలాగైనా గృహంలో శాంతిని పునరుద్ధరించుకోవాలని.

సాయంత్రం నాలుగు గంటలకి క్యాంటీన్‌లో కాఫీ త్రాగుతూంటే అతనికొక ఆలోచన తట్టింది.

ఎప్పుడూ ఆలస్యంగా ఇల్లుచేరే తను ఆ రోజు త్వరగా ఇంటికివెళ్లి సుగుణనూ పిల్లల్ని ఏదయినా మంచి తెలుగు సినీమాకి తీసుకొని వెళదామనుకున్నాడు. గబగబా సీటు దగ్గరకుపోయి పర్మిషను చీటీ వ్రాసి శ్రకటేరియట్ బయటకు వచ్చి ఆటోలో అయిదు నిముషాలలో ఇంటికి చేరుకున్నాడు.

ఉత్సాహంగా మెట్లెక్కిన అతనిని వీధి తలుపుకి వేసిన తాళం కప్ప వెక్కిరించింది.

పొరిగిండ్లలో ఏదో ఒక యింటికి పిల్లలతోసహా సుగుణవెళ్లి ఉంటుందని అనుకుని మెట్లమీద కూర్చున్నాడు.

అయిదు నిమిషాలు గడిచాయి. ఎదురింటి పిల్లవాడు తాళాల గుత్తి యిస్తూ 'పిన్నిగారూ మా అమ్మా కలిసి రీగల్ టాకీసులో మేటినీకి వెళ్లారు.' అన్నాడు.

'మరి నువ్వు వెళ్లలేదేం?'

'అది పరమ చెత్త డబ్డ్ పిక్చరు అని నాన్నగారు చెప్పారు. అందుచేత నేను వెళ్లలేదు.'

ఆరేళ్ల కుర్రవాడు ఆ విధముగా చెప్పడం వినిన కరుణాకరరావు నవ్వుకున్నాడు.

కరుణాకరరావు తాళంతీసి లోపలికి వెళ్లాడు. కాళ్లూ చేతులూ కడుక్కుని పడక గదిలోకిపోయి వాలు కుర్చీలో కూర్చున్నాడు. ఏదయినా పుస్తకం చదువుదామనుకున్నాడు. కాని బద్ధకంగా ఉండడంవల్ల ఆ ఉద్దేశ్యం మార్చుకున్నాడు.

అతడు విసుగు లేకుండా చేయగలిగిన పనుల్లో ఫ్యామిలీ ఆల్బంలోని ఫోటోలను చూడడం ఒకటి. పెళ్లయిన తొలి రోజులలో వ్రాసిన ఉత్తరాల కట్ట చదవడం మరొకటీను.

ఆల్బమూ ఉత్తరాలకట్టా సుగుణ బట్టలపెట్టెలో ఉంటాయి. నెమ్మదిగా లేచి ఆమెపెట్టె తాళంతీసి పెట్టె తెరిచాడు. ఆల్బమూ ఉత్తరాలకట్టా మామూలుగా ఉండవలసిన స్థలంలో లేవు. బట్టలన్నీ ఇవతలవేసి వెతికాడు. పెట్టె అడుగున మరొక మూల ఆల్బమూ ఉత్తరాల కట్టా కనిపించాయి.

ఆల్బం తీశాడు. ఉత్తరాల కట్టకూడా తీశాడు. ఉత్తరాలకట్టక్రింద తెల్లని చిన్నరాయి మెరిసింది. పరీక్షగా చూశాడు.

అది ముక్కు పుడక.

ఏ ముక్కు పుడక దొంగతనం చేసిందన్న అనుమానంమీద పనిమనిషి పోచమ్మని పని మానిపించారో ఆ ముక్కు పుడక దొరికింది. అతని దృష్టిలో పోచమ్మకుగల స్థానం మరింత ఉన్నతం అయింది. ఆల్బం చూడాలనే కోరిక మానుకున్నాడు.

ముక్కుపుల్లను యథాస్థానంలో ఉంచి ఆల్బమూ ఉత్తరాల కట్టా మామూలుగా దానిపైన ఉంచి పెట్టె సర్ది తాళంవేశాడు.

కాగితం, కలం తీసుకుని ఈ విధముగా ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టాడు.

'డియర్ సుగుణా,

నేను పనిమనిషి పోచమ్మ గుడిసెకు వెళుతున్నాను. నువ్వు కంగారుపడవలసిన పనిలేదు. కేవలం క్షమాపణ చెప్పడానికి వెళుతున్నాను. క్షమాపణ ఎందుకు చెప్పుకోవాలో నీకీపాటికి అర్థం అయ్యే ఉంటుంది.

అయినా వ్రాస్తున్నాను. ముక్కుపుల్ల నీ పెట్టెలోనే నాకు కనిపించింది.

పనిమనిషి పోచమ్మను పని మానిపించవలసిందని నూటిగా నాతో చెప్పలేకపోయావా? దానికింత పన్నాగం ఎందుకు? ఇంత అభాండం ఆమె నెత్తి మీద వెయ్యడం ఎందుకు? కాలేజీలో నాతో చదివిన అమ్మాయిలను గురించి నీతో చెప్పేటప్పుడు ఎప్పుడూ అసూయ చెందని నువ్వు ఈ ఒక్క పోచమ్మ గురించి నా మీద అసూయ పడడం ఎందుకో నాకు అర్థం కావడం లేదు.

ఆమెను మళ్లీ పనిలో పెట్టుకుందామని నేను అనను.

కాని పనిమనిషి పోచమ్మకి తక్కిన యిళ్ళలోనైనా పని నిలవడానికి వీలుగా కొంతవరకైనా నిజం చెప్పాలి. పూర్తి నిజం చెప్పే ధైర్యం మనకు లేదని నాకు తెలుసు. ఏ కనుపులోనో ముక్కుపుల్ల దొరికిందనీ అనవసరంగా పనిమనిషి పోచమ్మను అనుమానించామనీ నలుగురికీ చెప్పగలిగితే చాలు.

నేను క్షమాపణ చెప్పి వచ్చేలోగా ముక్కుపుడక దొరికిన సంగతి అందరికీ తెలియచెయ్యి.

ఇట్లు నీ భర్త,
కరుణాకరరావు.'

ఉత్తరం వ్రాయడం పూర్తి చేసి బల్ల మీద పెట్టి ఇంటికి బీగంవేసి తాళంచేతులు గుత్తి ఎదురింటి అబ్బాయికి యిస్తూ, 'ఈ తాళం గుత్తి సుగుణత్తకియ్యి. దేవి గుడికి వెళుతున్నానని చెప్పు.' అన్నాడు కరుణాకరరావు.

'అలాగే మామా. కాని, గుడికి వెళితే మరి పువ్వులూ, పళ్లూ, కొబ్బరికాయా తీసుకెళ్లడం లేదేం?' అన్నాడా అబ్బాయి అమాయకంగా.

'నా దగ్గర లేవు బాబూ. వూరికే దేవికి నమస్కారం చేసి వచ్చేస్తా.' అని గబ గబా నడిచి వెళ్లాడు కరుణాకరరావు.

చారిత్రక నవలలు - చరిత్రౌచిత్యము

[illegible]

నవ్యాంధ్ర సారస్వత సరస్సులో నవనవలాడుతూ నూతనంగా విచ్చుకున్న నన 'నవల', ఆంధ్ర సరస్వతికి అందాన్ని చేకూర్చిన ఆభరణం అయి ఆధునికయుగంలో అత్యంత వ్యాప్తిలోనున్న సాహిత్యప్రక్రియ అయినా ఇది విదేశాలనుండి దిగుమతయిన దనడంలో వివాదంలేదు. ఈ నవయుగ ప్రభాతానికి వేగుచుక్క, నవ్యాంధ్ర సారస్వతానికి మూలపురుషుడయిన శ్రీ వీరేశలింగము గారే, ఈ నవ్యవ్యవసాయానికి కూడా నాట్లు నాటా రనడంలో విప్రతిపత్తిలేదు. పందొమ్మిదో శతాబ్దంనాటికి ఆంధ్ర ప్రబంధాలమీద ఆంధ్రప్రజకు మోజతగ్గింది. పంతులుగారి దృష్టిని ఆంగ్ల సారస్వతంలోని ఈనవలా ప్రక్రియ ఆకర్షించింది. అంతకు ప్రితం మనకు పేదరాసి పెద్దమ్మకథలు, కాకమ్మకథానికలూ ఉండేవేగాని, పాత్రలశీలం ముఖ్యంగా కలిగి, కథాభవన నిర్మాణంతో, సంభాషణ పూరితాలైన గాథలు తెలుగులోలేవు. నవలలో ఊహ కన్న, కల్పనకన్న వాస్తవికత అధికం. ఇందులో వాస్తవ జీవితానికి సంబంధించిన స్త్రీపురుషపాత్రలు, సన్నివేశాలు చిక్కని అల్లికలో కలసి ప్రకాశించుతవి. నవల కుండవలసిన ప్రధానగుణం వాస్తవిక జీవిత చిత్రణ. కథలోని ఔత్సుక్యంతో పాత్రపోషణను మేళవించి సమకాలిక నాగరికతను ప్రతిబింబిస్తూ వ్రాయబడేదే నవలని నిర్వచనం. అందుచేత తదితర వాఙ్మయ ప్రక్రియలకన్నా నవల సాంఘిక జీవితానికి సన్నిహితంగావుండి, వాస్తవికంగా సమాజాన్ని చిత్రిస్తుంది.

పంతులుగారు తమ 'రాజశేఖరచరిత్ర' రచనతో తెలుగు నవలకు ప్రారంభోత్సవం చేశారు. ఆనాటినుండి ఈనాటివరకు నవలారచన నిరాఘాటంగ కొనసాగుతూనే వున్నది. విషయాన్నిబట్టి నవలల్ని వివిధ విభాగాలుగ విభజించవచ్చు. అయితే వీరిలో ప్రధానమైనవి సాంఘికాలు, చారిత్రకాలు, అపరాధ పరిశోధకాలు. తెలుగునవలకు 1872 వ. సం॥ లోనే శ్రీనరహరి గోపాలకృష్ణ సెట్టిగారు రచించిన 'శ్రీరంగరాజు చరిత్ర'లోనే బీజం నాటబడిందనుకుంటే, తెలుగు నవల చారిత్రకనవలగానే మొట్టమొదట వెలసిందనాలి. పంతులుగారు సంఘసంస్కారానికే ప్రధానంగా పూనుకొని, సాహిత్యాన్ని సాధనంగ వాడారు గనుక, వారి రచనలు సంస్కార ప్రధానమైన రచనలు. సంఘసంస్కారోద్దేశంతోనే తొలి తెలుగు నవల అవతరించినా, అనతికాలంలోనే చారిత్రక నవలలు పట్టం గట్టుకున్నవి.

నానావిధ నవలల్లో చారిత్రక నవల ఒక ముఖ్య విభాగం. ప్రతి దేశంలోను, ప్రతి వాఙ్మయంలోనూ రచయితలు నవలలు వ్రాశారు; వ్రాస్తున్నారు. అంతటా చారిత్రక నవల ప్రముఖ స్థానాన్ని వహించింది. చారిత్రక నవలావిర్భావానికి దేశ చరిత్ర అసమగ్రతే కారణం. ఆ లోపాన్ని పూరించడానికే చారిత్రక నవల ఆవశ్యకత యేర్పడింది. చరిత్ర కేవలం చారిత్రక సంఘటనల్ని, ముఖ్యసంఘటనాల్ని మాత్రమే ఏకరువు పెడుతుంది. చరిత్రకారుడు చారిత్రక సత్యాన్వేషణలో పడి ఆ కాలపు ప్రజల జీవితాన్ని గాని, వారి భావోద్వేగాల్నిగాని గమనించడు. వాటిని తన రచనలో ప్రదర్శించడు. కనుక చరిత్రాంశాలపై శ్రద్ధలేనివారికి చరిత్ర ఉత్సుకతను కలిగించదు. గతించిన యుగాల సజీవ చిత్రాలు చరిత్ర పుటల్లో మృగ్యాలు గనుకనే చారిత్రక నవలలవైపు వానికై చూడవలసివస్తుంది. నవలలో నవలాకారుడు ఆ కాలపు జీవితాన్ని ఉజ్వలంగా చిత్రిస్తాడు. ఏ కొందరు సిద్ధహస్తులైన చరిత్రకారులో చరిత్రను చక్కగా వ్రాసి ఒప్పించగలరు. చారిత్రక నవలలు పండిత ప్రకాండుల మేధకు మేతను కల్పించటమే కాకుండ, సామాన్య ప్రజానీకపు చరిత్రదాహాన్ని, అవసరాన్ని తీరుస్తున్నవి.

చారిత్రక నవలల లక్షణాన్ని ఇదమిత్థంగా నిర్దేశించటం కష్టం. గత చరిత్రను భావుకతతో పునర్నిర్మించి, ఆ నాటి ప్రజాజీవితానికి దర్పణం పట్టడమే నవలా రచయిత ప్రధాన కర్తవ్యం. చరిత్ర, సాహిత్యాల సమ్మేళనమే చారిత్రక నవల. అది సమగ్రంగా చరిత్రకాదు. సంపూర్ణమైన కళాఖండమూ కాదు. అందులోని యితివృత్తం చరిత్రాంశాల్ని అధిగమించిందంటే అది చరిత్ర కానేరదు. అందులో చరిత్రదే పైచేయి అయితే అది నవలనిపించుకోదు. చారిత్రక నవలా రచయిత చరిత్రను, తన ఉపజ్ఞను, రెంటిని కలబోసి గతచరిత్రను నిశితమైన ఊహాబలంతో నిర్మించాలి. చరిత్ర ప్రసిద్ధ పురుషులు, చరిత్రలో ప్రముఖమైన సంఘటనలమీద దృష్టి నిలపక, తానెన్నుకున్న ఆ యుగపు ప్రజల జీవన సరళిని, వారి భావావేశాలను వర్ణిస్తూ, ఆనాటి సాంఘిక జీవనాన్ని రూపొందించాలి. ఇదే అతని ప్రధానోద్దేశం గనుక చారిత్రక నవలలు మనస్సు నాకట్టుకునే ఆకర్షణీయమైన చరిత్రగ తయారవుతున్నవి.

చారిత్రక నవలల్లో ప్రణయ గాథలుకూడా వున్నవి. (Historical Romances). ఈ ప్రణయగాథలు తఱచు ఊహాకల్పితాలే. వానిలో చరిత్రాంశ తక్కువ. ఈ ప్రణయ గాథల నుండి ఆనాటి చరిత్రను విడదీయాలి. వీనిలో చారిత్రక పూర్వరంగం (back ground) మాత్రమే వాస్తవమైనది. చరిత్ర

ప్రసిద్ధపురుషులు (ప్రణయగాథలు ప్రాతపదికలకు ఉపకరిస్తాయి. చరిత్ర పూర్వరంగంగల ప్రణయగాథల్లో, కథాగమనం, సన్నివేశ కల్పనపై ప్రాధాన్యం చూపబడుతాయి. ఈ నవలా రచయిత చేతుల్లో కన్యాశుల్కాలవంటి చరిత్ర లక్ష్యాంశాలకు పుంజుకొని సజీవంగా మన యెదుట నిలుస్తుంది.

కేవలం గత కాలాన్ని పునరుజ్జీవింపజేయటంతో రచయిత తృప్తినొందడు. అతడు వర్తమానాన్ని గతంలోకి ప్రసరింపచేస్తాడు. ఆ పురాతన ప్రపంచంలోని పాత్రల్ని సజీవంగా చేయటానికి సమకాలీన జీవితజ్ఞానాన్ని ఉపయోగించుకుంటాడు. ప్రజా జీవన సరళి మారవచ్చు. సంప్రదాయాలు, పద్ధతులు పాతపడవచ్చు. కాని మానవనైజం మాత్రం ఎప్పటికీ ఒక్కలాగే వుంటుంది. అది మారదు. ఆ మారని మానవస్వభావాన్ని ఆలంబనంగా గొనే చారిత్రక నవలారచయిత తన నవలల్ని అల్లుతాడు. ఈ హేతువు చేతే అప్పుడప్పుడు నవలలు అప్పటివి కావు, ఇప్పటివి అనిపిస్తుంటాయి. ఈ సత్యాన్నే Carlyle మహాశయుడు ఇలా చెప్పాడు:—

"These historical novels have taught all men this truth; which looks like truism and yet was as good as unknown to writers of history and others till so taught; that the bygone ages of the world were actually filled by living men not by protocols, state papers, controversies and abstractions of men"

ఈ నవలల్లో చక్కని వర్ణన లుండాలి. సాధ్యమైనంత వరకు అందులోని చరిత్రాంశాలు చరిత్రకు సన్నిహితంగా వుండాలి. శాస్త్రకారుడు, చరిత్రకారులవలె కాకుండ నవలాకారుడు చప్పిడి చరిత్రాంశాలను తన భావనతో, కల్పనతో ఆకర్షణీయంగా చేయాలి. అనేకమూలాలనుండి (Sources) సేకరించిన విషయాల్ని గుదిగుచ్చి, ఒకటిగా చేర్చి దానినొక కళాఖండంగా సృష్టించాలి. గడచిన శతాబ్దాలలోని నాగరికతా సంస్కృతుల్ని తన భావశబలతతో పునర్నిర్మించి, కండ్లకుకట్టే వర్ణనలతో వాటిని వాస్తవికంగా చేయాలి. తన వర్ణనలు, చెప్పుచున్న ఉదంతాలు ఎంతవరకు చారిత్రకంగా సత్యాలు అన్నదానిని చదువరి ఒక్కొక్కప్పుడు పట్టించుకోకపోవచ్చు.

చారిత్రక నవలల్లో యథార్థతకన్న, కల్పనే అధికమన్న ఒక అపప్రథ ఉన్నది. చారిత్రక సంఘటనల్ని వర్ణించేటప్పుడు మాత్రం అతడు జరిగినవి జరిగినట్లే వర్ణించాలి. అంతకన్న ముఖ్యంగా అతడు ఆనాటి ప్రజాజీవితాన్ని సహజంగా చిత్రించాలి. అతడు చరిత్రను, సాహిత్యాన్ని రెంటిని సంతృప్తిపరచాలి. ఒక విధంగాచూస్తే చరిత్రలోకన్న నవలలోనే యథార్థత అధికమనవచ్చు. ఒకరు చతురంగా అన్నారు: 'నవలలో పేర్లు, తారీఖులు తప్ప అంతా వాస్తవమే. చరిత్రలో పేర్లు, తారీఖులు తప్ప అంతా అవాస్తవమే' అని.

నవల సామాజిక జీవితంతో ముడిపడి వుంటుంది. స్త్రీ పురుషులు—వారి అనుబంధాలు, అనురాగాలు, అభిప్రాయాలు; వారి బాగోగులు, గెలుపోటములు—అన్నీ యథాతథంగా నవలలో ప్రదర్శింపబడుతవి. కాని నవలలో మన మాశించే వాస్తవికత, విజ్ఞాన శాస్త్రంలో మనం కోరే వాస్తవికత వంటిదికాదు; కాకూడదు; జరిగింది జరిగినట్లు, ఉన్నదున్నట్లు చెప్పటమే చరిత్రలో, శాస్త్రంలో సత్యమనిపించుకుంటుంది. కాని నవలలో ఆదర్శనీయమైనదే సత్యమనబడుతుంది. శాస్త్రంలో ఈనాడు నిరూపించబడిన సిద్ధాంతం, రేపు మరొక నూతన పరిశోధనతో పాతబడిపోతుంది. ఎప్పటికప్పుడు నూతనంగా కనిపెట్టబడిన పరిశోధనల్ని, వాటి సత్యాల్ని కచ్చితంగా వ్రాస్తుండాలి. చరిత్ర అంతే. ఒక యుగపు చరిత్ర మరొక యుగానికి పనికిరాదు. ఏ నాటి సంఘటనల్ని ఆనాడు చరిత్ర భద్రపరచాలి. కాని మానవ జీవితాన్ని వారి మనోగత భావాల్ని చిత్రించే సాహిత్యంమాత్రం శాశ్వతమైనది. మానవ ప్రవృత్తి ఎప్పటికీ ఒక్కటే అన్నదే సాహిత్యం లోని వాస్తవికత; యథార్థత. మహాసామ్రాజ్యాలు నశించినా, నాగరికతా సంస్కృతులు పెరిగినా, భౌతికంగా ప్రగతి సాధించినా, గ్రహాల్ని అవగాహనం చేసుకున్నా, మానవుని స్వభావంలో మార్పు అల్పం. కనుక నవలలోని వాస్తవికత అప్పటికీ, ఇప్పటికీ ఒక్కటిగనే వుంటుంది. గోతే అన్నట్లు కళాకారుని సృష్టి సార్వకాలికమైనది గనుక సర్వదా వాస్తవమైనదే. అది నిజంగా జరిగి వుండదు గనుక ఆదర్శనీయమైనది. ఆదర్శాల మైనూతతో వాస్తవికతను సాహిత్య శిల్పంగ మలచాలి. అంతేగాని భావనాశక్తిని విశృంఖలంగా వదలి యథార్థ జీవితాన్ని కృత్రిమంగా, అవాస్తవికంగ చేయకూడదు. 'To present and interpret facts is the historians business; to sum up a past epoch, to show men and women alive in it and behaving as they must have behaevd in the circumstances is the labour and joy of the genuine historical novelist' అని Baker చక్కగా నిర్వచించారు.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న సూక్తి వాల్మీకి రామాయణంలోనిది. రామాయణకాలానికే దేశాన్ని మాతృదేవితో సమానంగా చూడాలన్న భావాలు, భక్తిప్రపత్తులతో సేవించాలన్న తలపులు ఉండినా, వానికి ఆధునికయుగంలోనే ఆచరణ సాధ్యమైనది. భారతదేశ సమైక్యదృక్పథం, 19 వ శతాబ్దినుండే మన కవులలో, రచయితల్లో పొడచూపింది. పరపాలనలో దాస్య శృంఖలాలతో బంధింపబడిన ప్రతిమానవుని హృదయం దేశభక్తితో తొణికిసలాడింది. తన జాతిని, తన సంప్రదాయాల్ని ప్రేమించ నేర్చుకున్నారు. రచయితలనాడు నవయుగోదయానికి తోడ్పడి దేశభక్తిపూరితమైన రచనలు చేయసాగారు. ప్రజానీకం గుండెల్లో గుచ్చుకునేలా మహోత్కృష్టమైన ఆంధ్రాభిమానాల్ని పెడ కట్టారు. దేశాభిమానం, ఆంధ్రాభిమానం వెల్లివిరిసిన రచనలు చేశారు. ఆంధ్రజాతి దీనమైపోతున్న సమయంలో తమ విధ్యుక్తధర్మాన్ని మరువక, మన పూర్వపు ఔన్నత్యాన్ని కండ్లకు కట్టించి, మహావేశంతో రక్తం ఉప్పొంగేలా చేశారు.

తెలుగులో చారిత్రక నవలలకు పాదుపోసినవారు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు. వీరు పంతులుగారిని అనుసరించి

మొదట 'రామచంద్ర విజయము' వ్రాసినా వెనువెంటనే తమకు ప్రీతిపాత్రమైన చరిత్రకు కావ్యరూప మిచ్చారు. వీరి 'హేమలత' తెలుగులో తొలి చారిత్రకనవల. అవి జాతీయోద్యమ దినాలు. అప్పటికి ఆంధ్రులకు తెల్లదొరల్ని బాహాటంగ ధిక్కరించే సాహసం లేకపోయింది. అందుచేత మరుగునబడి మనం విస్మరించిన ఆంధ్ర సామ్రాజ్యవైభవాన్ని, గతించిన ఆంధ్రుల వీరాన్ని నవలలుగా రూపొందించి, ప్రజల కర్తవ్యాన్ని పరోక్షంగ ప్రబోధించారు.

అప్పుడప్పుడే మనదేశ చరిత్రలో పరిశోధనలు ప్రారంభించారుగనుక చిలకమర్తివారి నవలల్లో చారిత్రికాంశాలు అల్పము. వీరి 'హేమలత' టైలరు చాంద్‌బీబీని గురించి వ్రాసిన గ్రంథం నుండే గ్రహింపబడింది. 'అహల్యాబాయి' కూడా యిటువంటిదే. హేమలత మహారాష్ట్రులకు, రెండవది పఠానుల చరిత్రకు చెందినవి. జాతీయతా, స్వాతంత్ర్యాభిమానం, వీరోద్రేకపౌరుషాలు, ప్రాచీనభారతీయవిజ్ఞాన ఔన్నత్యం అనే విషయాలతో ఈ రెండు నవలలు చదువుతున్నకొలది చవులు పుట్టించి దేశంయొక్క పూర్వపు టౌన్నత్యాన్ని పునఃపునః స్ఫురింపచేస్తూ, దాని అంతస్తును ఉత్తేజవంతంగ నిరూపిస్తున్నవి. వీరిని 'ఆంధ్రా స్కాట్' అని వ్యవహరిస్తారు. ఇంగ్లీషులో చారిత్రక నవలలకు స్కాట్ మార్గదర్శకుడైనట్లు తెలుగులో చిలకమర్తి మార్గదర్శకుడు. అంతేకాకుండ స్కాట్ నవలలనే ఒరవడిగ పెట్టుకొని, వ్రాసినట్లు కనిపిస్తుంది. వీరి నవలల్లో చరిత్రకన్న, చారిత్రక పూర్వరంగంలో స్వకపోలపాత్రలతో కథ నడ్పినట్లు తోస్తుంది. వీనిలో చరిత్రకన్న ప్రణయగాథలకే ప్రాముఖ్యము. వీరిది సులభమైన శైలి. సున్నితమైన హాస్యము, చిలకమర్తివారి నవలలు ఆంధ్రదేశచరిత్రకు సంబంధించినవి కావు.

క్రమంగా చిలకమర్తివారి చారిత్రక నవలల వాజ్ఞాకు లపై మోజు పెరిగింది. దానితోపాటు పరిశోధనకూడా పెంపొందింది. అనేక విషయాలు వెలుగులోనికి వచ్చినై. చారిత్రక నవలల ప్రాముఖ్యం హెచ్చింది. అదీగాక చారిత్రక నవలలంటే వేరే కథ వెదక నక్కరలేదు. కనుక ఇందులో కొంత సుకరంకూడా లేకపోలేదు. ఈ కారణంగాకూడా తెలుగులో అప్పట్లో విరివిగా చారిత్రక నవలలు వ్రాశారు. చారిత్రక నవలలను ప్రోత్సహించి, ప్రచురించిన సంస్థ 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి.' ఈ మండలియొక్క ఒక లక్ష్యం తెలుగు చరిత్రను ప్రకటించటమే. అందుచేత చరిత్ర పుస్తకాలు, నవలలు ప్రచురించారు. ఈ మండలిద్వారా వెలువడినవే 'రాయచూరు యుద్ధం' 'విమలాదేవి' 'విజయనగర సామ్రాజ్యం' మొదలైన నవలలు.

శ్రీ భోగరాజు నారాయణమూర్తిగారు 'విమలాదేవి' నవలా రచయిత. ఇది మొగలాయి కాబూలకాలంలో రాజపుత్ర స్థానానికి చెందిన యితివృత్తం కలది. విమలా విజయసింహుల ప్రేమే ప్రధానేతివృత్తమయినా మొగిలాయి చక్రవర్తులను ధిక్కరించి, రసపుత్రవీరులు పోరిన విధం, ఆ శూరశిఖామణులు తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనినరీతి, అత్యంత రమణీయంగా వర్ణింపబడ్డవి. 'చంద్రగుప్త' 'అస్తమయము' 'ఆంధ్రరాష్ట్రము' 'ఆంగ్లరాజ్య స్థాపనము' 'ధరణికోట' అనేవి వీరు వ్రాసిన మరికొన్ని చారిత్రక నవలలు.

'రాయచూరు యుద్ధము' అనే నవలను శ్రీ కేతవరపు వెంకటశాస్త్రిగారు వ్రాశారు. శ్రీ కృష్ణదేవరాయలు రాయచూరు దుర్గాన్ని పట్టుకున్నది ఇందులోని కథ. రాయల యుద్ధాలలో రాయచూరు దుర్గం ముట్టడి సుప్రసిద్ధమైనది. ఇందులో రచయిత వాస్తవికంగా చిత్రింప పరిశ్రమించినట్లు కనిపిస్తుంది. విజయనగర మహానగర వర్ణన వాస్తవికంగా వున్నది. 'అన్యథా చింతితం కార్యం దైవమన్యత్ర చింతయేత్' 'నసాహస మనారుహ్య నరో భద్రాణి పశ్యతి' 'అత్యుచ్ఛ్రయః పతనహేతు' ఇత్యాది సూక్తులు కథ కనుగుణంగా పసందుగ పొందుపరచారు. సుదీర్ఘమైన సంభాషణలతో నవల నడిచింది.

> 'విపద లెల్లవారికి సంభవించుచుండు
> పనట చెందకు ధైర్యంబు వదలబోకు
> దేవు నెదలోన నిల్పి చింతించుచుండు
> విపదలొక్క క్షణంబులో వెడలిపోవు'

వంటి పద్యాలు సుభాషితాల్ని గుర్తు చేస్తవి. వీరు 'బొబ్బిలి యుద్ధము' అనే మరో నవలను రచించారు. వెంకటశాస్త్రిగారు, నారాయణమూర్తిగారు చిలకమర్తివారి అడుగుజాడలనే అనుసరించి చారిత్రకపు పునాదులతో కథను నిర్మించారు.

శ్రీ దుగ్గిరాల రాఘవచంద్రయ్య చౌదరిగారి కలంనుండి వెలువడిన నవల 'విజయనగర సామ్రాజ్యము.' విజ్ఞానచంద్రికా గ్రంథమండలివారు ఈ నవలకు రూ 500/—బహుమతి నిచ్చారు. దీనిలో ఆంధ్రసామ్రాజ్యాన్ని, ఆంధ్రుల పరాక్రమాన్ని, ఆంధ్ర దేశభక్తిని వర్ణించటమే నవలాకారుని ముఖ్యోద్దేశంగా తోస్తుంది. విజయనగరసామ్రాజ్య పతనం ప్రధానకథ. ఆనాటి విజయనగర వైభవాన్ని కొంతవరకు ఉత్కృష్టంగానే వర్ణించారు. వర్ణనల్లో కల్పనాచాతుర్యం, పటుత్వం కనుపిస్తవి. మహమ్మదీయ చక్రవర్తులు బహిరంగంగ యుద్ధానికి దిగక, ఉపాయంతో పన్నాగాలు పన్ని సామ్రాజ్యపతనానికి పదకాలు వేశారు. రామరాజు బహుధైర్యశాలి, న్యాయమూర్తిఅయిన చక్రవర్తి. అతడు ఆదిల్‌శాహాను నమ్మి, మిత్రుడైన బుద్ధిసాగరుని మాటల్ని పెడచెవినిబెట్టి, తురకలతంత్రంలో చిక్కుకుంటాడు. స్వర్ణకుమారీ, జగన్మోహినులనే క్షత్రియవనితలు తమ భర్తలతోపాటు యుద్ధభూమికి వెళ్లి వీరమరణాన్ని పొందుతారు.

రామరాజును మోసపుచ్చటానికి తురుష్కులు పన్నిన కపటోపాయాలు, వారి బారినుండి చక్రవర్తిని తప్పించటానికి ఆతని మిత్రులు పడినపాట్లు, వారి స్వార్థత్యాగం, తుదకు ఆ సామ్రాజ్యం అస్తమించటం ఇందులోని ముఖ్యభాగం. జగన్మోహినీ విజయసింహుల, స్వర్ణకుమారీ రాధాకుమారుల ప్రణయగాథ రెండవ భాగం. నవలలోని వర్ణనలు స్వాభావికంగ, పాత్రానుగుణంగా

వున్నవి. వచనరచన మృదుమధురంగా కొనసాగింది. 'రజనీకాంత ధరించిన నీలవస్త్రమువోలె నల్లడల జీకట్లు వ్యాపింపదొడగెను. మృదుమధురా వ్యక్త కల నిస్వనంబులుమీర విహంగములు వృక్షములనుండి శ్రవణానందముగా గూయుచుండెను. రజనీసుందరి విశ్రమించు మంచముయొక్క పందిరియోయన నాకసము శోభిల్లు చుండెను. చుక్క లందలి పాదరసపు బుడ్లకరణిం బ్రకాశించు చుండెను.' మధురభావన. ఒక్కొక్క అధ్యాయానికి ప్రత్యేకంగా నామకరణం చేశారు. కథాభాగంతోటి చారిత్రకాంశాల్ని పొందు పరచారు. ప్రణయకథ ప్రబంధధోరణిలో సాగింది. రచయిత పాఠకుని విజయనగరానికి తోడ్కొనిపోయి, కథాకాలంలో విడిచిపెడతాడు. 'మనమున్న యీ శతాబ్ద మిరువదియవది. కాని యిపుడు మన మొకసారి 16—వ శతాబ్దమువంక జూడవలసియున్నది.' ప్రతిఅధ్యాయారంభంలో, మధ్యమధ్య 'విజయనగర పట్టణమున నొకచోటికిప్పుడు మన మరుగవలసియున్నది.' 'పాఠకుడా! నీ దృష్టి నొకసారి యీ భౌతికప్రపంచముపై బరపుము.' 'పాఠకులారా భయపడకుడి.'—ఇలా హెచ్చరిస్తూ వ్రాయటంవలన పఠితకు ఉత్సుకత పెంపొందుతుందని భావించియుండవచ్చు. దేశరక్షణకు ప్రాణాల్ని కూడా అర్పించాలన్నది పరోక్షంగా బోధించారు. ఆంధ్ర శూరత్వాన్ని వేనోళ్ల చాటారు.

శ్రీ వంగూరి సుబ్బారావుగారుకూడా ఆనాటి యుగధర్మాన్ని అనుసరించి కొన్ని చారిత్రక నవలలు వ్రాశారు. వారి నవలల్లో 'ప్రభాతం' పేర్కొదగినది. దీనిలోనూ శ్రీ కృష్ణదేవరాయల రాజ్యవైభవము, సంస్థాన మర్యాదలు చక్కగా వర్ణింపబడ్డవి. రాయలకున్న కవితాదరణ, ఆ కాలంలో రాజులకుండే చిత్రలేఖన శక్తి, అప్పటి కాగితాలవాడుక, పరదేశీయుల ప్రసంగం ఇత్యాది చరిత్రాంశాలు తెలుపబడ్డవి. మంత్రి తిమ్మరుసుయొక్క రాజకీయ కార్యనిర్వహణ ధురంధరత్వం, సేనానాయకుల ప్రభుభక్తి, రాజాదరణ, రాజపరిపాలన విధానం, చక్కగా చిత్రించారు. గజపతి పుత్రిక రుచిదేవిని రాయలు పరిణయమాడ తిమ్మరుసు పన్నిన పన్నాగము ప్రధాన కథ. రాయలు కులీనుడు కాడన్న అపవాదాన్ని ఆధారంగ చేసుకొని రుచిదేవి దాసీదాని ఉదాసీన సంభాషణలకు లొంగి రాయల్ని పరాభవింప ప్రయత్నిస్తుంది. కాని క్రమంగ రాయల ఔన్నత్యాన్ని గుర్తించి తన క్రియలకు పశ్చాత్తాపం చెందుతుంది. ఆమె సపత్నియే ఆమెను రాయలతో కలుపుతుంది. వర్ణనలు వాస్తవికంగావున్నవి. సుబ్బారావుగారి వచన రచన సరళంగా సాగింది. అది గ్రాంధికమైనా సుగమంగావున్నది.

మాతృభాషయిన తెలుగునెడ ప్రజల కేర్పడిన అనాదరణము పోగొట్టడానికి సుబ్బారావుగారీ నవలను రచించారు. రాయ లెలా ఆంధ్రసరస్వతి సేవచేసి "దేశ భాషలందు తెలుగు లెస్స" అన్న ఖ్యాతిని దానికి చేకూర్చాడు, అలాగ అందరూ భాషా సముద్ధరణ చేయాలని హెచ్చరించారు.

రాయల దిగ్విజయాల్ని, దండయాత్రల్ని పురస్కరించుకొని మరికొందరు నవలలు వ్రాశారు. 1940వ సంవత్సరంలో

'శ్రీ భువన విజయము' అనే నవలను విద్యార్థుల ఉపయోగార్థం శ్రీ పోతుకూచి గంగాధరంగారుగారు వ్రాశారు.

'తొలుదొల్త నుదయాద్రి శిలదాకి తీండ్రించు
నసిలోహమున వెచ్చనయిజనించె
మఱి కొండవీడెక్కి మార్కొని వలియైన
యల కసవాపాత్రు నంటి రాజె
వెస సాగి జమ్మిలోయబడినేగి దహించె
గోన బిట్టేర్చె గొట్టాన దగిలె
గనకగిరి స్ఫూర్తి గరచె గౌతమి గ్రాచె
నవుల నా పొట్నూర రవులు కొనియె
మాడెముల వ్రేల్చె నొడ్డాది మసియొనర్చె
గటకపురిగాల్చె గజరాజు కలగి పఱవ
దోక చిచ్చన నౌర యుద్ధురత గృష్ణ
రాయబాహు ప్రతాప జాగ్రన్మహాగ్ని.

అని మనుచరిత్రలో పెద్దన వర్ణించిన ఆ రాయల సంగ్రామాలు, దిగ్విజయాలే ఈ నవలలో వర్ణితాలు. అయినా రాయలు గజపతి పుత్రికను పాణిగ్రహణం చేయటమే ప్రాధాన్యం వహించింది. 'ఈ నవల శ్రీ రాయల ప్రతిభా ప్రభావాలకు అద్దం, తిమ్మరుసు మస్తిష్కపు శక్తికి లక్ష్యం' అన్నారు, ప్రాస్తావికలో శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు.

'శ్రీ భువన విజయము' అనే పేరుతోనే మరల 1954వ సంవత్సరం శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తిగారు మరొక నవలను వెలువరించారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయపు బహుమతి నంది, ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారిచే ప్రకటింపబడింది. రాయలు అరిభయంకరుడై తన సామ్రాజ్యాన్ని ఎలా వైరినిష్కంటకంగ చేసుకొని, సుస్థిరంగ స్థాపించి; సాహిత్య సేవను, కళాపోషణను చేశాడన్నదే ఇందులోని విషయం. శ్రీ శ్రీరామమూర్తిగారు అనాటి సమకాలీన జీవితాన్ని చిత్రించటంలో కృతకృత్యులయ్యారు. రాయలవారి పేరోలగాన్ని వర్ణించిన విధం, మనమూ ఆ కవుల సాహిత్య సమాలోచనల్లో చర్చల్లో పాల్గొంటున్నట్లే ఉంటుంది. రాయల దినచర్య ఆయన డైరీనిచూచి చెప్పుతున్నట్లనిపిస్తుంది. రచయిత సంగీత, సాహిత్య, నాట్య, వైణిక విద్యల వివరణలలో చూపిన సూక్ష్మ పరిశీలనకు పఠిత ముగ్ధుడవుతాడు.

రాయలకు సంబంధిలచిన యీ నవలలన్నింటిలో రాయల శౌర్య ధైర్యస్థైర్య గాంభీర్య పరాక్రమ సాహసాది గుణాలు, తిమ్మరుసయ్య బుద్ధిబలం బహుధా ప్రశంసితాలు. భారత భూమిలో, తెనుగు సీమలో శత్రుకోట్లుల్ని వేటాడి అఖండ రాజ్యాలను నిర్మించిన మహారాజు లెందరో ఉన్నారు. సామ్రాజ్యరథాన్ని నిరాఘాటంగా—ఎత్తి నకత్తిని దించకుండా—నడిపించిన మహామేధావులైన మంత్రులూ లేకపోలేదు. కాని కృష్ణదేవరాయలు—మంత్రి తిమ్మరుసు రచయితలను ఆకర్షించినంతగా మరెవ్వరూ ఆకర్షించలేదనిపిస్తుంది. రాయలు కేవలం సమ్రాట్టేకాదు. ఆయన కవుల సమ్రాట్టున్నూ.

"'తెనుగుగడ్డ ఉన్నంతకాలం—తెనుగుబిడ్డ మన్నంతకాలం—ఆ మహానుభావులకీర్తి కర్పూర పరిమళం, నాటి ఆంధ్రతేజం హరించదు. ఆరిపోదు. వారి అమృత చరిత్రలో మనకు పౌరుషం, ప్రతిష్ఠ, ఆనందం, అనుభూతి, ఆంధ్రత్వం కరవుదీర దొరుకుతవి.' అన్న అభిప్రాయాలే వీరిని ప్రోత్సహించింది.

అందరు రచయితలు 'రాయలు తొలిజామునసే నిద్రలేచి, కాల్యములు నిర్వర్తించుకొని, చేరెడు నువ్వుసూనె త్రావి రెండు గడియలకాలము వ్యాయామ మొనర్చును.' అని తెలియచేశారు; ఇలాగే గజపతిని కైవసం చేసుకున్న ఉదంతాన్ని కూడ ఒక్కలాగే ఉద్ఘాటించారు. గజపతిని గెలవడానికి తిమ్మరుసయ్య తన బుద్ధిబలాన్ని ప్రయోగించి, గజపతికి ఆధారమైన 16 గురు పాత్రుల మీద అపనమ్మకం కలిగిస్తాడు. ఇన్నింటిలో ఏకవాక్యత కుదిరినా గజపతిపుత్రిని రాయలు వివాహమాడే విషయంలోమాత్రం కుదరలేదు. ఒక్కొక్క నవలలో ఒక్కొక్కరీతిగ వర్ణింపబడింది. ఆమె పేరుకూడా ఎవరికనుగుణంగ వారు పెట్టుకున్నట్లుంది.

శ్రీ వేంకట పార్వతీశ్వరుల నవలలు సకలజనాదరణాన్ని పొందిన నవలాసారస్వతంలో అమృతత్వాన్ని సంపాదించు కున్నవి. 'ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల'ద్వారా వీరు ఎక్కువగా అనువాదాలే ప్రచురించినా, కొన్ని చారిత్రిక నవలలుకూడా వ్రాశారు.' వసుమతీ వసంతము' 'ప్రమదావనము' భారత చరిత్రకు, ఆంధ్రచరిత్రకు సంబంధించిన నవలలు. 'వసుమతీ వసంతము'న గ్రీకు వీరాగ్రేసరుల వాత బడనున్న హిందూస్థానాన్ని ఏకచ్ఛత్రాధిపత్యానికి తేగలిగి, హిందూరాజ్యరమ కత్యంతానందాన్ని కల్గించి హైందవులను స్వాతంత్ర్య సౌఖ్యరసాంబుధిలో నోలలాడింప గలిగిన చంద్రగుప్త మౌర్యుని చరిత్ర వర్ణితం. చంద్రగుప్తుని చరిత్రకన్న వసుమతీ వసంతుల శృంగారగాథే ప్రధానం. ఈ గ్రంథమాల సంపాదకుడు 'ఇక్కవులుభయు లాంగ్లేయ విద్యావాసన నెఱుంగని వారయ్యును, ఆంధ్రీకృత చరిత్ర గ్రంథసాహాయ్య మాత్రముననే యీ గ్రంథము రచియించిరి' అని తెలిపారు.

ఈ నవలలో ఒక్కొక్క అధ్యాయం చివరలో రాబోయే అధ్యాయపు కథాభాగానికి ప్రవేశికల్లాంటి సూచికలున్నవి. సంభాషణలు క్లుప్తంగ, చతురంగ సాగినవి. ఈ నవలల్లో వీరు జరుగని సంఘటనలకు చరిత్ర రంగు పూసి ఇది చరిత్రే నని ఒప్పించారు.

స్వాతంత్ర్యానికి పూర్వం వెలువడిన నవలలు పేరుకు చారిత్రక నవలలే అయినా వానిలో చరిత్రాంశం తక్కువ. ఇంచుమించుగ నవల లన్నింటిలో కథాసంవిధానం ఒక్కటిగనే కనిపిస్తుంది. నాయకుడు నాయికను కోరడం, అతడు వలచిన వనితను ఉపనాయకుడు బంధించడమో, యెత్తుకపోవడమే జరుగుతుంది. నాయకుడు బలశౌర్యాలను ప్రదర్శించి నాయికను విడిపించడం, వారి వివాహంతో కథ కంచికి పోతుంది. లేదా నాయకుని రాజ

విద్రోహం; అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి, రాజుగారి కోపానికి లోనై బంధితుడు కావడం, చివరకు రాజు నిజాన్ని తెలుసుకొని అతనిని విడిపించడంతో కథ సుఖాంతమవుతుంది.

స్వాతంత్ర్యానంతరమూ చారిత్రక నవలలు రచించారు. అట్టి వారిలో శ్రీ అడవి బాపిరాజుగారు, శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు, శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు ప్రసిద్ధులు. తెలుగు చారిత్రక నవలా రచయితలలో శ్రీ అడవి బాపిరాజుగారిదొక ప్రత్యేక స్థానము. చారిత్రక నవల లెలా వుండా లన్నది బాపిరాజు గారు చక్కగా అవగాహన చేసుకొన్నారు. వారు ఆ అస్తమించిన సామ్రాజ్యాల వైభవాన్ని ప్రత్యక్షంగ ప్రదర్శించటమే కాకుండా, ఆనాటి సమాజాలనే సాక్షాత్కరింపజేశారు. ఆకాలపు ప్రజల జీవితాన్ని యథాతథంగ, సహజంగ రూపొందించారు. సహజతను, సజీవతను సృష్టించడానికి వారు నవలలో అతి అల్పాంశంలో కూడ జాగర్త వహించారు. ఈ విషయం "హిమబిందు" నవలలో చూడవచ్చు. ఇది ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించిన సాతవాహనుల నాటి కథ. ఆంధ్రుల ప్రాక్తన వైభవాన్ని, సాతవాహన చక్రవర్తుల చరిత్రను రమ్యంగా వర్ణించారు. ఆనాటి పరిభాషనే వాడి మరింత సహజతను సమకూర్చారు. ఆనాడు మహారాజపథాలు, ఘంటాపథాలు, రాజమార్గాలు, బాటలు విరివిగా వుండేవి. మహారాజ మార్గం ఎని మిది దండాల వెడల్పు. ఆకాలంలో వారు పొడవు వెడల్పుల్ని అంగుళం, హస్తం, క్రోశం, గవ్యూతి, యోజనం, ధనువు, గోరుతాలలో కొలిచేవారు. పణాలు, మాడలు, వరహాలనే నాణాలు వాడకంలో వుండేవి. వీరి నవల లన్నింటిలో ఆయా కాలపు ప్రజల వేషభాషలు, ఆచార వ్యవహారాలు, ఆహార పానీయాలు, వేటలు వేడ్కలు, పండుగలూ పబ్బాలు, వ్రతాలు నోములు, పాడి పంటలు, వ్యాపార పరిశ్రమలు, ఎగుమతులు దిగుమతులు అన్నీ ఛాయాగ్రహణ చిత్రాలులా కన్నెదుట కనిపిస్తవి. ఆ రోజులలో ఆంధ్రులకు కూరగాయలంటే ఎంతో ప్రేమ. అరటులు విస్తారంగా పెంచేవారు. ఈ దినాలలో ఏ పంటలు పండిస్తున్నారో ఆనాడునూ ఆ పంటలే నేటి వ్యవసాయ విధానాన్నే పండించేవారు.

వీరి నవలల్లో "అడివి శాంతిశ్రీ" ఇక్ష్వాకుల నాటి నవల. "గోనగన్నారెడ్డి" కాకతీయుల నాటిది. "అంశుమతి" తూర్పు చాళుక్యుల నాటిది. వీరి నవలల్లోని ప్రత్యేకత ప్రతి సూక్ష్మాంశాన్ని గురించి వీరు చూపిన పరిశీలన. నవలను చదువుతున్న పాఠకునికి ఆకాశంలో జీవిస్తున్న భావనే కలుగుతుంది. ఆయా సందర్భాలలో వీరు ధర్మం, శిల్పం, సంగీతం, ప్రేమ, యుద్ధ రచన, న్యాయవిచారణ, ఆయుర్వేదం ఇత్యాదుల్ని గురించి చేసిన చర్చలు ప్రత్యేకంగ పుస్తకరూపంలో ప్రచురింప తగినవి.

"ప్రేమే లేనివారికి ప్రేమేది లేమేది." "ప్రేమ రెండు విధములు. నువ్వు ప్రేమింతువు. కాని ఆ ప్రేమించిన వానిని నీ భర్తగా గోరవు. అది మహోత్తమ ప్రేమ. రెండవది నీవు ప్రేమించిన వానిని భర్తగా వాంఛింతువు. అది ఉత్తమ ప్రేమ." ఇటువంటి గంభీరమైన భావాలు వెలిబుచ్చారు. ఆయన నవలల్లో చిత్రకారుని చాతుర్యం, శిల్పి నైపుణ్యం కనిపిస్తవి. ఆయన కళా హృదయం అంతటా వెల్లివిరుస్తుంటుంది. ఆయన పాత్రల రూపు రేఖల్ని వాక్చిత్రాలలో చిత్రించారు.

"ఇంతలో క్రొక్కారు మెరుంగుతీవలా, ఆకాశాన్నుంచి దిగి వచ్చే రతీదేవిలా, మహేశ్వరునికై హైమవతి హృదయంలోంచి బయలు వెడలిన దివ్యకాంక్షలా..."

"పరువములు తొంగిచూచు ఆమె వక్షోరుహద్వయము తరుణ కదంబము పూచిన తొలి పూతగుత్తులు. ముగ్ధత్వము వీడని యా బాలికా తనూరేఖలు అపశ్రుతి రహిత రాగమాలికా మోహన తరంగములు. మత్స్యాకారములై దీర్ఘములైన యామె లోచనాలు కలలు తిరుగవు. అవి నిశిత నారాచముఖధగద్ధగితములు. ఆమె హోష్ఠములు మధురములు. కరుగని ఆరణ్యక బింబ ఫలములు" ఇలాగే వర్ణనలు పుంఖానుపుంఖంగ ఉపమానాలతో సాగుతుంటవి.

ఆయన భాష హృదయంగమమైనది. క్షుణికింపైన శబ్ద లాలిత్యంతో ముగ్ధమోహనంగా వుంటుంది. ఆయన రచనలన్నీ కవితా మయాలే.

"అల్లిబిల్లిగ నల్లుకొన్న పచ్చని పొదలలో విడిపోయిన సకల గుణచాంపేయ సౌరభము దిలకించెదవుగాక. కమలినీ సౌశీల్యము, మల్లికా శిశుత్వము; మాధవీ లతా మాధుర్యము, దమన మరువ కౌషధీ సౌభాగ్యము చండకూర్చెదవుగాని..."

"ఆ స్పందనముచే నిదురపోవు పామును పాములవాడు నాగ పిరబుర్ర మొనతో పొడిచినట్లయినది. ఆ స్పందనము వేసవి కాలమున భూమిలో నడగియున్న బీజమును ఆషాఢ ప్రథమ వర్ష బిందువు చుంబించునట్టిది. ఆ స్పందనము ఆకురాల్చిన చెట్టు కొమ్మలో దాగుకొనియున్న లేచిగురును మధుర వసంత మంద మలయానిలములు మునివేళ్లతో దాకినప్పటిది." ఇలా కవిత్వ ప్రవాహం గంగోత్తర స్వరూప మందాకినీ ప్రసన్నవణమై ప్రవహించింది. నవలల్లో చారిత్రక వాతావరణాన్ని కాపాడుతూ, కల్పన ద్వారా నవలకు రామణీయకంతోపాటు రోచకత్వాన్ని నిలుపటంలో నిపుణులు. పాత్రలు సమకాలీన వ్యక్తిత్వం కలిగి, సహజంగ వుంటవి. బాపిరాజుగారికి వెన్నెల ప్రియతమమైనది. ఆ స్నిగ్ధ జ్యోత్స్నల్లో మనమూ తలమునకలుగ తడిసి, తెరపి వెన్నెల్లో విహరిస్తుంటాము.

'గోనగన్నారెడ్డి' నవలతో గన్నారెడ్డియే నాయకుడైనా రాణిరుద్రమ తండ్రి అనంతరం సింహాసనాన్నధిష్ఠించి, ధర్మపాలన ఎలా కొనసాగించినదన్నది కూడా ప్రధాన విషయమే. నవలారంభమే పఠితలలో ఉత్కంఠని పెంపొందిస్తుంది. పీటలమీద పెండ్లి తొలగిపోయినట్లు వర్ణించి, నాయికానాయకులకు చమత్కారంగా పరస్పరావలోకన అవకాశాన్ని కల్పించడమేకాకుండా, పఠితలకూ పరిచయం చేయుట మవుతుంది. అనాటి కాకతమ్మ ఉత్సవాలు, దసరాపండుగలు, నవరాత్రికొలువులు, దేవాలయ శిల్పాలు హృద్యంగ వర్ణించడమేకాకుండ, పరోక్షంగ అనాటికి ఈనాటికి ఆడదాని అధికారాన్ని ధిక్కరించే మగవాని మగతనాన్ని బయలు పరిచారు.

ఇదే యితివృత్తాన్ని స్వీకరించి శ్రీ నోరి నరసింహశాస్త్రి గారు 'రుద్రమదేవి' అన్న నవలను రచించారు. కాని యీ యిరువుర ఆశయాలు, లక్ష్యాలు వేరు. శాస్త్రిగారు "భారతధర్మము ఏయేకాలముల నెట్లెట్లు విజృంభించినదో వర్ణించుటే యీ నవలలు వ్రాయుట కుద్యమించుటకు ప్రధాన కారణము...... రుద్రమదేవితో బాహ్యమైన విప్లవము ముఖ్యము. దాని నెదుర్కొనుటకు ఆంతరంగికమగు పరస్పర విరుద్ధశక్తు లెన్నియో ఏకమై ఆత్మస్థైర్యము సాధించినవిధము దీనిలో చిత్రింపబడినది. ఇందులో వ్యక్తులెందరో కనిపింతురు. కాని వారందరు నేదో యొకతీరున ఆంధ్రసామ్రాజ్య రక్షణ కుపయోగింతురు. త్రిమూర్తులనదగిన విశ్వేశ్వర శంభుదేశికులు, తిక్కన సోమయాజులు, అన్న మంత్రీశ్వరులుఅను మహానుభావులు మూడు శక్తులై యందరను ధర్మవృక్షమునకు ప్రోదిచేయునట్లు నడిపింతురు. అందులో ఒకరు రాజగురువు, ఒకరు కవీశ్వరుడు, ఒకరు మంత్రిపుంగవుడు" అని తమ రచనోద్దేశాన్ని వారే వివరించారు. మరి బాపిరాజుగారి లక్ష్యం ధర్మసంస్థాపనం కాదు. నిద్రాణమైయున్న ఆంధ్రజాతిని తమ పూర్వుల శక్తిసంపన్నతను చూపి మేలుకొలపటం.

బాపిరాజుగారు కాకతిగణపతిదేవుని మరణానంతరమే రుద్రమ రాజ్యానికి వచ్చినట్లు, ఆమె స్త్రీఅనే సత్యం శివదేవయదేశికులకు, అంతఃపురస్త్రీలకు, ముఖ్యమైన సామంతులకుతప్ప మరెవ్వరికిని తెలియని రహస్యంగా చిత్రించుకుంటూవచ్చారు. రుద్రమ స్త్రీయై యుండి, స్త్రీ సహజమైన కోర్కెలు, వాంఛలు కలిగినా, ధర్మం నిమిత్తం వాటిని అణచడానికి ఆమె పడే వేదనని అతిహృద్యంగ, మనోహరంగా వర్ణించారు. స్త్రీ హృదయాన్ని చక్కగా ఆవిష్కరించారు. ఆమెను చేపట్టిన చాళుక్యవీరభద్రప్రభువు వీరుడు. ప్రేమోపాసకుడు. రుద్రమను దేవిగ ఆరాధించిన భక్తుడు. ఆమెపై త్యాగమొనర్ప సంసిద్ధుడైన త్యాగశీలుడు. ఆమె చక్రవర్తినిగనుక తన ఘనటిమికి లోటు కలిగిందన్న సంకుచితభావాలులేని నిర్మలుడు. మరి శాస్త్రిగారు దీనికి భిన్నంగ కథ చెప్పుకుంటూ వచ్చారు. రాజ్యంలోని వారి కందరకు రుద్రమ ఆడదని తెలుసు. గణపతిదేవుని మరణానికి ముందే రుద్రమకు వీరభద్రునితో వివాహమైనది. ఆయనకు అంతకుముందే మరొక భార్యవంక యిరువురు పుత్రులున్నారు. రుద్రమను రాణిగ అంగీకరింపనివారిలో వీరభద్రుడు అగ్రగణ్యుడు. అతడే రాజ్యంలో కుట్రలు పన్ని, విద్రోహానికి దారితీస్తాడు. తన పుత్రునికి రాజ్యాన్ని సంక్రమింప జేయాలని, నానాయాతనలు పడుతాడు. వీరభద్రు డిందులో రాజద్రోహిగ, మోసగాడుగ చిత్రింపబడ్డాడు. బాపిరాజుగారి దొక గంధర్వలోకం. అందులోని వ్యక్తులు, పాత్రలు అందరూ గంభీరులు. ఉదారులు. ఉత్కృష్టులు. ఉన్నతులు. శాస్త్రిగారినవల నరలోకంలో నడయాడుతుంది. ఈ రెంటిలోని సత్యాసత్యాలు తేల్చలేము. 'సమగ్రమగు ఆంధ్రుల చరిత్ర మిప్పటికి వెలువడలేదు. ఉన్నకొలదిమంది చరిత్రకారులును ఒకరితోనొకరు ఏకీభవింపరు' అన్న శాస్త్రిగారి వివరణనే ఇక్కడ సరిపెట్టుకోవాలి.

శాస్త్రిగారు తమ నవలలో ఆనాటి సమ్మెలు, వరదబాధితులు, తన్నివారణోపాయాలు, వర్తక వ్యాపారాలు, సిస్తులు చెల్లించే పద్ధతులు, వేశ్యల శృంగారజీవితం, యుద్ధానంతర సంరక్షణా, భద్రతలు క్షుణ్ణంగ విశదీకరించారు. శాస్త్రిగారు మరికొన్ని చారిత్రక నవలలు రచించారు—'నారాయణభట్టు' 'మల్లారెడ్డి' 'కవిసార్వభౌముడు' 'కవిద్వయము.' వీరి నవలల్లో ఆంధ్రసాహిత్యంలో ఆణిముత్యాలై రాజాదరణను, ప్రజాభిమానాన్ని చూరగొన్న కవుల జీవితాన్ని చిత్రిస్తూ, ఆ పోషక రాజాస్థానాలను, పాలిత ప్రజల జీవనాన్ని అనుసంధించారు. వీరూ శ్రీ విశ్వనాథవారిలా సనాతన భారత ధర్మాన్ని సముద్ధరించే ఉద్దేశంతోనే కలంపట్టారు. ఈ నవలలు వ్రాయటంతో వారు చూపిన భావనాబలం. కల్పనాశక్తి అద్వితీయం. అతులనీయం. సాహిత్య విద్యార్థుల కనగతమైనట్లు కథల కాలాలు, కర్తృత్వాలు వివాదగ్రస్తమైన విషయాలు. అట్టి విషయాల్నే తమ నవలలకు కథావస్తువులుగ స్వీకరించి రచించారంటే ఎంతో పరిశ్రమవుండాలి. దానికి చిన్నమెత్తు బంగారంతో చింతాకు పతకాన్ని చేసినంత చాకచక్యం కావాలి. ఈకోవకు చెందినదే డా॥ బొడ్డుపల్లి పురుషోత్తంగారి 'మహోదయము.' దీనికి ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు బహుమతి

న్నారు. రాజరాజనరేంద్రుడు రాజై, ఆంధ్రభాష నుద్ధరించి, నన్నయచేత భారత రచన చేయించడం ఇందులోని యితివృత్తం.

కవిసమ్రాట్టు కాలూనని తావంటూలేదు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు సనాతనధర్మాన్ని పునరుద్ధరింప కంకణంకట్టి కలం చేపట్టినా, వారూ తెలుగు నవలలను, అత్యధికంగా పోషించారు. అందునా పేర్కొదగ్గ కొన్ని చారిత్రక నవలల్లో వారి 'ఏకవీర' అగ్రశ్రేణికి చెందుతుంది. 'ధర్మచక్రము' 'బద్దన్న సేనాని' 'కడిమిచెట్టు' అప్పట్లో వీరు వ్రాసిన చారిత్రక నవలలో కొన్ని. నేపాళదేశచరిత్ర నాధారంగా ఇటీవల మరికొన్నింటిని వెలుగులోకి తెచ్చారు.

ఏకవీర చారిత్రకనవలే అయినా శిల్పదృష్టితో రచింప బడ్డది. అందులోనూ రచయిత ధర్మాన్నే ప్రబోధింప సంకల్పించారు. విసిగించే వర్ణనలులేవు! మధుర రాజుల కాలపు సాంఘిక జీవనం ప్రతిబింబిస్తుంది. ప్రతి సన్నివేశం కథాపరిణతికి సహాకరిస్తుంది. వైగై నది, కూచిపూడి భాగవతము, గుర్రపు వాళ్ళ పిల్ల అమ్మితము— ఇవన్నీ కథా సన్నివేశ కల్పన కుపకరించిన సాధనాలు. "అది వేసంగి! వైగైనది కృశించి ప్రోషితభర్తృక వలె సన్నగిల్లినది" అన్న వర్ణనతో కథ ఆరంభమై "చీకటులు క్రమ్మి నల్లనిగుడ్డ కప్పబడిన గతప్రాణి వలె వైగై తరలిపోయెను" అన్న వర్ణనతో ముగుస్తుంది. వైగై నదితోనే కథ ముడిపడి వున్నది. వైగై నది కదలికలు, పొంగులు కథా పాత్రల నడవడికను నడిపిస్తుంటవి.

"ఏకవీర కిపుడు పదునెనిమిదేండ్లు. ఆమె సౌందర్యమునకు జోలికి నిండుగాఁ బ్రవహించునది; కంకె విడిచి ముదుపులొలుకుఁ బంటచేను."

"వెన్నెలలో దీపముదగ్గర నొక వస్తువునకు రెండు నీడ లుండును — దీపపుఁ జిక్కని నీడ; వెన్నెల పలుచని నీడ. వీర భూపతికి వారిద్దరు నతని కా రెండు నీడలు. మీనాక్షి దీపపు నీడ. ఏకవీర వెన్నెల నీడ." ఇటువంటి అందమైన వర్ణనలతో నవల అలరారుతున్నది.

ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు చరిత్ర రచనల్ని ప్రోత్సహించే కొన్ని పోటీలను పెడుతున్నారు. ఆ పోటీలలో బహుమతి నందిన కొన్ని నవలలు 'తంజావూరు పతనము', 'దూధపు కొండలు', 'రఘునాథ విలాసము', 'సప్తపర్ణి'. ఈ నవలలన్నీ కుమారి మల్లాది వసుంధరగారు రచించారు. కాకతీయ వంశస్థులు, విజయనగర సమ్రాట్టుల అనంతరం ఆంధ్ర సాహిత్యానికి సేవచేసి తరించినవారు నాయకరాజులు. అందులో శ్రీ రఘునాథనాయకుడు రెండవ ఆంధ్రభోజు డనిపించుకున్నాడు. రఘునాథ విజయరాఘవ

నాయకు లిరువురు పేరెన్నికగన్న చారిత్రక పురుషులు. వారి చరిత్రలే యీ నవలల్లో అభివర్ణితాలు. విజయనగర పతనానంతరం వారి సామంతులైన నాయకరాజులు స్వాతంత్ర్యాన్ని కొంతవరకు వహించి తమ రాజ్యాన్ని దక్షిణాపథంతో నెలకొల్పారు. వీరు రాయలులా కొలువుకూటాలు తీర్చి, సాహిత్యం దిద్దారు.

'రఘునాథ విలాసము'లో ఆ రాజ్యంలోని విప్లవాలు, రఘునాథుని యుద్ధాలు ముచ్చటగ ముచ్చటించారు. కథకన్న సంగ్రామాలే అధికభాగాన్ని ఆక్రమించాయి. శ్రీరంగరాయల మరణానంతర మేర్పడిన అంతఃకలహాలు—అవి బాహ్యశత్రువులవలన కాకుండా, ఆంతిరంగికుల విద్రోహంవలన యేర్పడడం, ఒకరాజు మరణిస్తే ఆతని స్థానాన్ని ఆక్రమించడానికి ఎంతో రక్తపాతం అనివార్యం కావడం ఇత్యాది విషయాలు సుమనోజ్ఞంగ సంతరించారు. తళ్లికోట యుద్ధానంతరం విజయనగర సామ్రాజ్య బలం క్షీణించి, ఉత్తరాన మహమ్మదీయులు సుస్థిరులై దక్షిణంపై దాడులుచేయటం, స్వజాతీయులలో ద్రోహులైనవారు విజాతీయులతో చేతులు కలిపి స్వరాజ్యానికే ఎసరుపెట్టటం అవే చారిత్రకాంశం రఘునాథ విలాసంలో కనిపిస్తుంది. విదేశీయుల రాక, వారి శతఘ్నుల ప్రభావానికి లొంగి మనరాజులు వారిని చేరదీయటం, బుడత కీచులు మన రాజకీయాలలో జోక్యం కలిగిందుకోవడమన్న చారిత్రకాంశాలు వెల్లడి చేశారు.

'తంజావూరు పతనములో' వీరరఘునాథుని పుత్రుడైన విజయరాఘవుని విషయాలలోలతే ఎక్కువ కనిపిస్తుంది. నాయక రాజులు మధుర కవితను పోషించిన మహారాజులు. కవయిత్రుల్ని కనకాభిషేకంతో సన్మానించిన సరసులు. అట్టి రాజుల చరిత్రను చిరస్థాయి చేసిన కుమారి వసుంధరగారు అభినందనీయులు.

శ్రీ కొర్లపాటి శ్రీ రామమూర్తిగారి 'చిత్రశాల' శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారి 'మీనాంబిక', కాకర్లవారి 'కనకాభిషేకము' తెనుగుదేశపు చరిత్రేకల మరికొన్ని నవలలు.

స్వాతంత్ర్యానంతరం మనకు ప్రజాస్వామిక ప్రభుత్వం సిద్ధించింది. క్రమంగ ఈ చారిత్రక నవలా రచన సన్నగిల్లుతూంది. ఈ నాటి రచయిత, పఠిత—ఇరువురూ కల్పనకన్న వాస్తవికతనే వాంఛిస్తున్నారు. తన పరిసరాల్ని, పరిచితుల్నే అతడు ఊతగగొని రచన చేస్తున్నాడు. ఆ నాటి సమ్రాట్టులు, చక్రవర్తులు కాలగర్భంలో కలసిపోయారు. నేడు ప్రజలే అధినేతలు. పాలకులు, పాలితులు వారే. కనుక వారికి సంబంధించిన ప్రతి రచనా చరిత్ర ప్రాధాన్యం కలిగినదే అవుతుంది. ఈ యుగపు చరిత్రలో మైలురాయిగ చెప్పదగిన చంద్రమండలయానం, మన దేశాల్ని అల్లకల్లోలం చేస్తున్న నక్సలైటుల దుండగాలు ఇత్యాదులు ఇతివృత్తంగా గలిగిన యే నవలైనా ఇప్పటి చారిత్రక నవలగ పరిగణింపవచ్చు. నేటి రాజకీయాలే దేశచరిత్ర కనుక వానిని ప్రతిబింబించేవే చారిత్రకనవల లవుతవి. స్వాతంత్ర్యసమర సమయం లోని రాజకీయాల్ని ప్రతిఫలింపచేసిన నవలలు 'మృత్యువు నీడల్లో', 'కొల్లాయి గట్టితేనేమి', 'చదువు', 'ప్రజల మనిషి' ఇత్యాదులు.

ఇప్పటికీ ఈ చారిత్రక నవల ఆవశ్యకత వున్నదా అన్న దానికి సమాధానం "దేశ చరిత్ర మనుజుని వివేకవంతునిఁ జేయును. పూర్వులెట్టి కష్టముల నెట్టి యుపాయాంతరములచేఁ దొలగించుకొనగలిగిరో తెలుపును. ఎట్టి సాధనాంతరముల నెట్టి మహోన్నత దశల నందగలిగిరో విశదీకరించును. ఎట్టి జ్ఞానహీనతచే నెట్టి యధోగతుల పాల్పడిరో స్పష్టపడును. ఎట్టి సదాచారముల నవలంబించి యెట్టి బలపరాక్రమంబులచే ఖ్యాతి జెందగలిగిరో బోధపడును. ఎట్టి దురాచారగ్రహణమున నెట్టి దురవస్థలకు లోనైరో తెలియజెప్పును. ఎట్టి స్వార్థత్యాగమున కొక్కొక్క పురుషుడు స్వదేశమునకుఁ కలుగనున్న మహోపద్రవమును భేదించి శాశ్వత కీర్తిని జేపట్టగలిగెనో ప్రబోధించును. వేయేం! ఏ జాతి వారు గాని, యే సంఘమువారు గాని, యే దేశమువారు గాని, యే నాగరికులు గాని, యే జానపదులు గాని, తమ తమ శాశ్వత దేశక్షేమమునకై యెట్టి ధర్మాచరణంబున కెట్లు పాటుపడవలయునో తెలుపుచు, వారి వారి జీవయాత్రలకు దారిఁజూపును. చరిత్ర జ్ఞానములేని దేశ ప్రజాజీవనము సూదంటుఱాయి లేని యోడ యాత్ర వంటిది. చూడ గన్నులును, చేత గ్రుఱయు నైనలేని దీనుని ప్రయాణము వంటిది.

...కేవలము చరిత్రమును వ్రాసినచో నందలి విషయములు సామాన్య జనరంజకములుగాకుండి, రోగికి పథ్యపు నస్తువులవలె రుచింపక పోవచ్చును. ఈ కారణముచేతనే మేధావంతులైన మన పూర్వులు సామాన్య జనులకు వివిధ నీతులను ప్రబోధించుటకు పురాణేతిహాసంబులే యుక్త గ్రంథములని తలంచిరి...కావునఁ జరిత్రము లన్నియును నితిహాసరూపములుగ సర్వజన రంజకముకాగ వెలయించుట యాధునిక కవివరులకు ప్రస్తుత కర్తవ్యము. ఇట్టి యుద్యమము నెఱవేర్చుట కొఱకు మా యాంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయము స్థాపింపబడినది." అన్న శ్రీ అయ్యగారి నారాయణమూర్తిగారి సమాధానం ఈనాటికీ వర్తిస్తుంది.

'దేశమును ప్రేమించు' వారున్నంతవరకూ, 'అవమానమేలరా! అనుమానమేల భారతీయుడనంచు భక్తితో పాడ' అన్న ప్రబోధానికి చెవియొగ్గేవాళ్లున్నంతవరకూ చరిత్ర రచనలు కొనసాగుతూనే ఉంటవి. అయితే గతంకంటే భవితవ్యం గొప్పదనీ, మతంకంటె మానవత గొప్పదనీ భారతీయుల్ని ప్రబోధించి, భారత సమైక్య భావనకు, సహజీవనానికి తోడ్పడే రచనలు కోకొల్లలుగ వెల్లివిరియ గలవని ఆశిస్తున్నాను.

క్షమా భిక్ష

శ్రీ "కాలకూరి"

రెణ్ణాళ్లనుంచి ముసురుపట్టింది. ఆకాశంలో ఎక్కడ చూసినా వల్లమబ్బులు! అంతదాకా వర్షం కురిసి అప్పుడే ఆగిపోయింది. మళ్లీ ఏ క్షణాన్నయినా తిరిగి వర్షం మొదలుకావచ్చు. ఈదురు గాలి విపరీతంగా వీస్తూవుంది. చెట్లమీది నీటి బొట్లు ఒక్కొక్కటే పడుతున్నాయి. ఆకాశం జార్చిన కన్నీటిబొట్టు ఘనీభవించినట్లుంది రైల్వే హాస్పిటల్.

రెండు ప్రక్కలా ఉన్న హాస్పిటల్ గదుల మధ్యగా ఉన్న వరండా చివర ఎక్స్‌పెండెడ్ మెటల్ కన్నాలలోంచి దూసుకొని రాక్షసుడు విసిరిన సూదుల గుంపువంటి చలిగాలి వచ్చి, ఎటు పోవటానికి తోవలేక తిన్నగా సాగి, ఒక గది ముందు బెంచీ పైన కూర్చున్న చెంచయ్య శరీరాన్ని పొడిచి పొడిచి హింసిస్తూ వుంది.

రెండు కాళ్ళూ బెంచీ పైన పెట్టుకొని, కాళ్ళమధ్య తలచేర్చుకొని, చేతులు కాళ్ల చుట్టూ చుట్టుకొని వణుకుతున్న శరీరాన్ని తన అదుపులో వుంచుకోలేక, అదుపులో ఉన్న కళ్లను పెద్దవి చేసుకొని, తదేక దీక్షగా ఆత్రంగా వాకిలివైపు చూస్తున్నాడు చెంచయ్య. వేసిన తలుపు వేసినట్లే వుంది.

ఔట్ పేషెంట్స్ అంతా వెళిపోయారు. వరండాలు చాలా వరకు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఎవరో ఒకరిద్దరు అప్పుడప్పుడూ అటూ ఇటూ పోవటంతప్ప, రద్దీ లేదు. కాజువాలిటీ డాక్టరు రోగులు లేక, రాక, పనిలేక కిటికీలోంచి, యూకలిప్టస్ చెట్ల ఆకుల్లోంచి, మేఘాలలోంచి, ఆకాశం అంచుల్లోకి చూస్తూ నిలబడ్డాడు.

చెంచయ్య వయస్సు డెబ్బై. వృద్ధాప్యపు పునాదులు స్థిర పడి, కట్టడాలు లేచాయి ముఖంమీద. తలవంగి పోయింది. శరీరంలో ఎముకలు తప్ప మాంసం లేదు. వణుకు తప్ప, అతని శరీరంలో ఏ కదలికా లేదు. ఎదుటి గదిలోకి చూస్తున్న కళ్ళుమాత్రం రెండు దివిటీలు. రెండు ఎక్స్‌రేలు.

కాజువాలిటీ డాక్టరు ఆకాశంలోంచి రూంలోకి చూపులు మళ్లించి అటూ ఇటూ తిరిగి, వెలుపలికి వచ్చి యథాలాపంగా చెంచయ్యను చూశాడు. లేదు. చూడలేదు. చూసీ చూడనట్లే! చూడకపోయినా చూచినట్లే! కంట్లో పడిన బొమ్మను మనిషి అనుకోలేదు. అంతే!

చెంచయ్య దగ్గాడు.

డాక్టరు వెనుదిరిగి చూశాడు.

'ఎవరు మీరు ?'

చెంచయ్య చూశాడు. చూసిందానికి గుర్తుగా శిలా కళ్ళూ కదిలాయి. నవ్వినట్లే లెక్క! ఎందుకంటే పెలవులు విప్పుకొని బోసినోరు కనిపించింది.

'ఏం జబ్బు ?'

ఏమీ లేదన్నట్లు తల వూపాడు.

'లోపలికి వస్తారా ?'

రానన్నట్లు తల తిప్పాడు.

'చలిగా లేదూ ?' ఉలెన్ కోటు సరిచేసుకొంటూ అడిగాడు.

నూలు చొక్కా లోపల వణుకుతున్న శరీరం దాచుకొంటూ లేదన్నట్లు తల ఆడించాడు.

'జబ్బు లేదు. లోపలికి రాడు. చలి లేదు' అనుకొంటూ లోపలికి పోయి, కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తూ నిలబడ్డాడు కాజువాలిటీ డాక్టరు.

సూదుల గుంపుకు పదునుపెట్టి విసిరినట్లుగా ఈదురుగాలి. ప్రేగులు వణుకుతున్నాయి. వళ్లంతా కొరుక్కు తింటున్నట్లుంది చలిగాలి. అప్పుడు ఎదుటి గది తలుపు లోపల్నుంచి తెరుచుకొంది. యువకులు ఎనిమిదిమందీ వెలుపలికి వచ్చారు. సదాశివం దగ్గరకు వచ్చి 'ఎక్స్‌రే స్క్రీనింగ్, ఫరవాలేద'ని చెప్పి ప్రక్కనే కూర్చున్నాడు.

స్క్రీనింగ్ రూంలోంచి డాక్టరు రఘురాం వెలుపలికి వచ్చాడు. చెంచయ్యను చూసి, చేతులు అసంకల్పితంగా పైకి లేచాయి. ముఖం మీదికి రాలేదు. జోడింపబడలేదు. గుండె మీదికి వచ్చి, గుండె చప్పుడు విని, గుండెతో మాట్లాడి, క్రిందికి వాలిపోయాయి. ముఖం ఈషణ్మాత్రంగా చలించి బిగిసిపోయింది. ఏమో అనబోయి అల్పంగా తెరుచుకొన్న నోరు, మళ్లీ మూతబడక అలాగే వుండిపోయింది. ముందుకు రాబోయి పడిన కాలు అలాగే ఆగిపోయింది.

చెంచయ్య డాక్టరును చూశాడు. కళ్ళు పెద్దవి చేసుకొని చూశాడు. కళ్ళు కుంచించుకొని చూశాడు. శిఖరం మీదివాడు లోయలోవాణ్ణి చూసినట్లు చూశాడు. లోయలోవాడు శిఖరంమీది వాణ్ణి చూసినట్లు చూశాడు. ముందడుగు వేయుబోయి ఆగిపోయాడు. నోరు తెరవలేదు. చేయి కదపలేదు. మూగై చెవిటై గుడ్డై గడ్డకట్టిపోయాడు చెంచయ్య.

సదాశివం వాళ్ళిద్దరినీ చూసి బిత్తరపోయి, తండ్రిని అడిగాడు: 'డాక్టరుగారు తెలుసా నాన్నా?' 'ఊ! రఘురాం అను కొంటాను' అన్నాడు. ఏమో చెప్పబోయి తల వూపి క్రుంగిపోయి, దిగాలుపడి బెంచీమీద కూర్చున్నాడు.

డాక్టర్ రఘురాం, కాంపౌండరు ఇచ్చిన కాఫీ ఏ లోకంలోనో ఉన్న మనిషిలాగా తాగాడు. సిగరెట్టు టిన్ను ఇస్తుంటే 'వద్దు! వద్దు!' అంటూ దూరంగా నెట్టాడు. ముఖం వణికింది. 'ఏం సార్?' అంటే, 'ఏమిటీ!' అంటూ ఈ లోకంలోకి వచ్చిన డాక్టరు సిగరెట్టు తీసుకొని, ముట్టించబోతూ, తలుపువైపు చూసివెళ్ళి, తలుపులేసివచ్చి కూర్చుని, సిగరెట్టు కాల్చుకొన్నాడు.

కాజువాలిటీ ముందాగిన టాక్సీలోంచి దించి స్ట్రెచర్‌మీద ముసలాయన్ని కొడుకు లిద్దరు తీసుకువచ్చారు. బాత్‌రూంలో పడ్డాడట. కాలు బెణికింది. ఆ ముసలాయన కొడుకులిద్దరినీ చూస్తున్న చెంచయ్య లోతుకళ్ళలో, ఎండకాలం ఎండిపోయిన బావిలో ఎక్కడో చెమ్మ అయి, వూటపడ్డట్టుగా అయింది. 'అదృష్టవంతుడు' గొణుక్కున్నాడు.

ఐ టెస్ట్ ప్రారంభమయింది. రైల్వేహాస్పటల్‌లో డాక్టరు రఘురాం ఒక్కొక్కరినీ పరీక్షించి పంపుతున్నాడు. వాళ్ళంతా రైలింజన్ డ్రైవర్ ఉద్యోగాలకు అప్లికేషన్‌లు పెట్టుకొన్నవాళ్ళు. అంతవరకు అన్ని పరీక్షలు అయిపోయాయి. మెడికల్ ఎగ్జామినేషన్‌లో ప్రధానభాగం కంటిపరీక్ష. అందులో మొదటిభాగం.

'ఏం టెస్ట్?'

'ఎలా వుంది?'

'లైట్ సరిగావుందా?'

'డాక్టరు ఎలా వున్నాడు'

టెస్ట్ అయిన వాళ్ళను కానివాళ్ళు అడిగే ప్రశ్నలు వింత వింతగా వున్నాయి.

సదాశివం గదిలో ప్రవేశించి రఘురాం ముఖంలోకి చూశాడు. డాక్టరు ముఖం పూర్వం ఉన్నట్టులేదు. మునుపు కోపంగా వుంటే ఇప్పుడు నెమ్మదిగా వుంది. ఇంతకుముందు ఆదరంగా వుంటే, ఇప్పుడు చిరాకుగావుంది.

'పేరు?'

చెప్పాడు.

'ఊరు?'

చెప్పాడు.

'తండ్రిపేరు?'

చెప్పాడు.

డాక్టరు గొంతు మారుతూ వుంది. పూర్వంలా లేదు. మునుపు కఠినంగావుంటే ఇప్పుడు దయగా వుంది. ముందు దయగా వుంటే ఇప్పుడు కఠినంగా వుంది.

ఈ నాలుగునెలల్లో డాక్టరు స్వభావం తనకు బాగా తెలుసు ననుకొన్న కాంపౌండరుకు ఆ ధైర్యం సడలిపోసాగింది. అర్థం కాలేదనిపించింది.

'చదువు!'

ఎదుట గోడమీద వున్న చార్టులో అక్షరాలు చదువుతున్నాడు సదాశివం. చివరి మూడువరసలు మసకమసకగా అలుక్కుపోయి నట్లు ఉన్నాయి. కనిపించటంలేదు.

చదువు!'

చదవటంలేదు. నోరు కదపటంలేదు, కళ్ళు కదిపాడు. చెమ్మగిల్లాయి.

'చదువు!'

డాక్టరు గొంతు మునుపున్నట్టులేదు. వింతగా వుంది.

'కనిపించనంతవరకు చదువు!'

డాక్టరు గుండెలో ఏదో పొరలో మెలికబడి దాక్కొనివున్న అల్పదీప్తితో, మెదుల్లా అబ్లాంగేటాలో ముడిపడివున్న ఏదో అనుభూతి వెలుగుతూ, ఆరిపోతూ స్పష్టంగా కనిపించక, పూర్తిగా కనిపించకుండా పోక అస్పష్టంగా అవ్యక్తంగా వుంది.

'చదువు!'

'చదవలేను'

డాక్టరు సదాశివం ముఖంలోకి విస్మయంగా చూసి, మూడు అట్టలు ముందుంచాడు, రెండు పెద్దలిపి వున్న అట్టలు చదివాడు. మూడవది మిగిలి వుంది.

'చదువు!'

'చదవలేను'

సదాశివం వెలుపలికి రాగానే 'ఏలావుంది?' తండ్రి అడిగాడు 'ఏంవుంది—మామూలే—నా కళ్ళు—మనవకున్నట్లే—సరింగా పడ వలా'. 'ఏం భయం లేదు కూర్చో' తండ్రి మందలించాడు.

చెంచయ్య చొక్కా జేబు తడుంకొన్నాడు.. నోట్లకట్ట భద్రంగా వుంది. డబ్బు చేతితో తాకుతున్నప్పుడు చెంచయ్య మూరేళ్ళు నిండినవాడై పోయాడు. నరాలు బిగునుకు పోతున్నాయి.

చెంచయ్యకు లేకలేక కలిగిన ఏకైక సంతానం సదాశివం. మొదట్లో అంతా చెంచయ్యకు పిల్లలు కలగరనే అనుకొన్నారు. వలపై అయిదో ఏట కొడుకు పుట్టగానే భార్య గతించింది. నాకు తోడు ఇద్దరుండే జాతకం కాదు కాబోలునని సర్దుకొన్నాడు.

సదాశివానికి తల్లీ తండ్రీ తనే అయి పెంచాడు. తన దుర దృష్టమో గారాబమో తెలియదు కానీ, కొడుక్కు చదువు అబ్బ లేదు. స్కూలుఫైనల్ చివరి ఛాన్సు ముగించి ఊరుకొన్నాడు.

చదువు రాలేదు కానీ వయస్సు వచ్చింది. వచ్చిన వయస్సు ముఖానికి వన్నె తెచ్చింది. అంతటితో ఆగలేదు. ఆగడాలు ప్రారం

భించింది. అవకతవకలు చేసింది. అందుకు విరుగుడుగా కొడుకు వొక యింటివాణ్ణి చేశాడు.

అంతవరకు సాఫీగాపోతున్న బండి గతుకుల్లో పడింది. డబ్బు ఖర్చుంది ఎక్కువయింది. తనకు పూజలు చేసినా పిల్లలు కలగలేదు కాని, సదాశివం వద్దనుకొంటున్నా ఏడాదికొక కాన్పు చొప్పున నాలుగేళ్లలో కుటుంబం బాగా పెరిగిపోయింది.

తనకు కలిగినకాలంలో చేసిన ఖర్చు తల్చుకొంటే బాధగానే వుండవచ్చుకానీ, వృధామాత్రం కాలేదన్న నమ్మకం అతని బ్రతక నిస్తుంది.

తల్లిదండ్రులు తనకు ఇచ్చిపోయిన ఆస్తి ఏమీలేదు. అయితే తను చదువుకొన్నాడు. ఉద్యోగం చేసుకొన్నాడు. కాని సదాశివం చదువుకో లేదు. ఆస్తిలేదు, ఉద్యోగంలేదు. ఎలా బ్రతుకు తాడు? పిల్లల్ని ఎలా పోషిస్తాడు?

తొర్రిదో మొర్రిదో ఒక ఉద్యోగ మంటూ వుంటే బ్రతుకు తెల్లవారిపోతుంది. అందుకోసం సదాశివం ఎంతో ప్రయత్నించాడు. ఎటుపోయినా చుక్కెదురయింది.

కొడుక్కోసం తను కూడా ప్రయత్నించాడు. ఏ ప్రయత్నమూ న్యాయమార్గంలో ధర్మయుతంగా కలిసిరాలేదు. దాంతో తను బాగా విసిగిపోయాడు. వీడికి ఉద్యోగదశ లేదని నిరుత్సాహపడ్డాడు. 'నా కిహంకే వుద్యోగంలే' అని ప్రయత్నాలే మానుకొన్నాడు సదాశివం.

ఆ మధ్య రైల్వేలో డ్రైవరు ఉద్యోగాలు కాళీలు ప్రక టించారు. జీతంకూడా బాగుంది. సదాశివం దరఖాస్తు పెట్టు కొన్నాడు. పరీక్ష వ్రాశాడు. ఇంటర్వ్యూకి వెళ్లాడు. సెలెక్టు అయ్యాడు. ఆ వార్త విన్నరోజు తను పొందిన ఆనందం ఎంతని చెప్పటానికి వీల్లేదు.

మెడికల్ ఎగ్జామినేషన్ వుంటుందని, అందులో అన్‌ఫిట్ అయితే ఉద్యోగం రాదని, ఫిట్ అయినే ట్రయినింగ్‌కు పిలుస్తా రని, మెడికల్ ఎగ్జామినేషన్ చాలా కష్టంగా వుంటుందని, తెలిసి గుండెల్లో రాయిపడ్డట్లు తాను బాధపడ్డాడు.

రైల్వే హాస్పటల్‌లో కాజువాలిటీముందు వరండాలో బెంచీ మీద కూర్చున్న చెంచయ్య ముసలినరాలతో పరాచికాలు ఆడుతున్న చలిగాలిని పారద్రోలటానికి మరీ మునగరదీసుకు కూర్చుంటే, ఇంకా చొరబడి నరాలు కసాబసా నములుతున్న చలిగాలిని ఏమీ చేయలేక, ఏడవలేక ఒదిగిఒదిగి దాక్కుంటుంటే, బైట వర్షం హోరు ఎక్కువయింది.

డాక్టరు చేతులు కడుక్కొని, నీళ్ళు తాగి, ఈజీచైర్‌లో చేరగిలబడి, సిగరెట్టు కాల్చుకొంటూ కాంపౌండరును పిలిచి. చెప్పాడు 'డ్రైవరుకు చెప్పు! వరండాలో ముసలాయ మున్నాడు చూడు—ఆయన్ని కారులో ఇంటికి తీసుకుపోయి, నా గదిలో దించమని చెప్పు! ఏం కావలసినా చూడమన్నావని ఇంట్లో చెప్పి రమ్మను! పో!'

కాంపౌండరు డ్రైవరుతో సంగతంతా చెప్పాడు. ఇద్దరూ చెంచయ్యతో సంగతిచెప్పి బయలుదేరమన్నారు. చెంచయ్య రెండు క్షణాలు ఆలోచించి 'అక్కర్లేదు. ఇక్కడే వుంటాను' అన్నాడు. కదల్లేదు. బిగిసిపోయాడు. బ్రతిమాలారు. మరీ శవంలాగా బిగిసి పోయాడు.

సిగరెట్టు పూర్తయి, ఏష్‌ట్రేలో వేస్తున్నప్పుడు కాంపౌం డరు వచ్చి, జరిగిం సంగతంతా చెబితే, డాక్టరు వణికిపోయాడు. పెద్ద గాలిదుమారం రేగితే అల్లాడిపోయే మల్లెతీగలాగ వణికి పోయాడు. తనను తాను సంబాళించుకోలేక టేబిల్‌మీద తల పెట్టుకొని కూర్చున్నాడు.

చెంచయ్య సెకండరీ గ్రేటు టీచరు. తనకు మాష్టరు. నిప్పులాంటి మనిషి. తన జీవితంలో ఎప్పుడూ ఎవరినీ ఏమీ యాచించలేదు. ఏదీ ఆశించలేదు. తనకోసం ఏమీ కోరుకోలేదు. అడిగిన వాళ్లకు, తనదగ్గరుంటే, లేదనలేదు. హెడ్మాష్టరు అయినా, ఇన్స్పెక్టరు అయినా, డీయీవో అయినా అతని నిజా యితీ ఎదుట తల ఎత్తే వాళ్లుకారు. అతనికి హాని చేయటానికి ఎవరికీ చేతులాడేవి కావు. దమ్ము ల్లేవు.

ట్యూషన్లు చెప్పి అందరూ అంతో ఇంతో సంపాదిస్తుంటే అడిగిన వాళ్లకు పాఠాలు చెప్పి పైసా అయినా తీసుకోలేదు. పంట కాలం పండిందాట్లోంచి ఎవరైనా ఏమయినా ఇవ్వబోయినా ఏమీ ముట్టుకొనేవాడుకాదు. తన జీవితంలో ఒక్కరోజుకూడా స్కూలుకు సెలవు పెట్టలేదు. రిటైరు అయినరోజు చాలామంది చెంచయ్య సేవను పొగిడారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరూ సహాయం చేయలేదు. చెంచయ్య ఈ కాలంతో ఉండవలసిన మనిషి కాదు. గతకాలపు అవశేషం. ఒకానొక ధర్మకాలమనే పాలపాత్ర లోంచి చిందిపడ్డ క్షీరబిందువు చెంచయ్య! ఒకానొక ధర్మయుగం లోని అంతిమ ఆధ్యాత్మిక రేఖ చెంచయ్య!! ఈ లోకంలోని పిచ్చి వాళ్లు కనే బంగారు కలలకు రూపచిత్రణం చెంచయ్య.

చెంచయ్య ఎదుట గదిలో నంబరు టెస్ట్ జరుగుతూ వుంది. ఒక పేజీలో ఉన్నరంగురంగుల చుక్కల్లో ఒక రంగు చుక్కలన్నీ కలిపి చూస్తే ఏదో ఒక నంబరు కనిపిస్తుంది, సదాశివం చూస్తున్నాడు. పేజీ తెరిచివుంది.

డాక్టరు అడిగాడు.

'నంబరు ఎంత?'

'ఇరవై!'

'ఏమిటో'

'ఇరవై'

డాక్టరు మరో పేజీ తిప్పాడు.

'చూడు! ఎంత?'

'డెబ్బైరెండు!'

ఎంత?

'డెబ్బై రెండు!'

'చెంచయ్యగారి అబ్బాయివి కదూ?'

డాక్టరు గొంతు కొండమీది నుంచి పడే సెలయేరు ధ్వని లాగా వుంది. డేగ తరుముతుంటే అరిచే పావురం అరుపులాగా వుంది. టీచర్ కొడుతుంటే ఏడ్చే పిల్లవాడి గొంతులాగా వుంది.

'అవును!'

'నీ కనలు అంతెలు కనిపిస్తున్నాయా?'

'లేదండీ!'

సదాశివం విచారంగా వెలుపలికి వచ్చాడు.

నంబరు టెక్స్ట్ పూర్తిచేసి, తన గదికి పోతూ చలిలో వణుకుతూ, బాధగా దగ్గుతూ వున్న చెంచయ్యను చూచి తల వంచుకొన్నాడు డాక్టరు.

మధ్యాహ్నం రెండయింది. ముసురు తగ్గలేదు. గాలికి కిటికీ తలుపులు తపతప కొట్టుకొంటున్నాయి. చలిగాలి విసిరి కొడుతూ వుంది. ఎక్కడ చూసినా మేఘాలు. ఉండి వుండి జల్లులు. కోటు వేసుకొన్నా చలిగా వుంది. ప్రేగులు ఉమ్మలు చుట్టుకు పోతు న్నట్లుంది. చలి. చెంచయ్య కళ్లలో మెదులుతున్నాడు. నూలు చొక్కా, వల్చటి చొక్కా, చలికి తట్టుకోలేని చొక్కా, పాత చొక్కా, శరీరాన్ని చలి ముట్టడినుంచి కాపాడలేక పోతూ వుంది. డాక్టరు రఘురాం వెంటనే లేచి, కోటుతీసి కాంపౌండర్ కిచ్చి 'చెంచయ్యగారికి కప్పిరా పో!' అని పంపించాడు. కాంపౌండరు బెదురుతూ వెళ్లాడు.

చెంచయ్య బెంచీమీద కూర్చునే వున్నాడు. గోడకు వీపూ తలా తగిలేటట్లు నిటారుగా కూర్చున్నాడు. కాళ్లు నేలమీద వున్నాయి. చెప్పులయినా లేవు. చేయి గోడకు తగిలినా కాలు నేలకు తగిలినా నరాలు పీక్కు పోయేంత చల్లగా వున్నాయి. బక్క ప్రాణి వృద్ధ ప్రాణి నిర్లక్ష్యంగా బెంచీపైన కూర్చుని వుంది. దూరంగా ఎక్స్‌పేండెడ్ మెటల్‌లోంచి నేర్పరి అయిన విలుగాడు వదిలితే దూసుకు వచ్చే బాణాలులాంటి చలిగాలి, ఎముకల వోపిక పరీక్షించే చల్లని చలిగాలి దూసుకు వస్తూ వుంది.

'ఈ కోటు వేసుకోండి!'

'ఎవరిది?'

'డాక్టరుగారిది!'

చెంచయ్య కాంపౌండరు ముఖంలోకి చెట్టున పూసిన పూవు రాలిపడుతున్నట్లు చూసి, తల దించుకొన్నాడు.

'అక్కర్లేదు. నాకు చలిలేదు'

'కాదు—చలిగా వుంది—వేసుకోండి'

మాట్లాడ లేదు.

'ఏమండీ?'

కొంచెం సేపు నిలబడి, ఇక నిలబడలేక వెళ్లి పోయాడు కాంపౌండరు.

చెంచయ్యకు ఉన్నట్టుండి దగ్గు వచ్చింది. విపరీతంగా దగ్గు! వళ్ళంతా చల్లగా అయిపోతూ వుంది. భరించరాని చలి!

కాంపౌండరు కోటు తీసుకుని వస్తుంటే డాక్టరు రఘురాం చూస్తూ వున్నాడు. 'అంతా చూశాను' పక్కకు నడిచాడు. 'సర్!' తల వూపాడు. 'కోటు కుర్చీకి వేయి' తప్పుకొన్నాడు.

ఈ నాలుగు నెలల్లో కాంపౌండరు చాలా గ్రహించాడు. రఘురాం అంత మంచి డాక్టరును తన సర్వీసులో ఇంతవరకూ చూళ్లేదు. జీతం తప్ప పైసా అయినా ముట్టని ఈ డాక్టరు మొదట్లో వింత జంతువుగా, ఆతర్వాత మండే నిప్పుగా అనిపించాడు. అంతా బాగానే వుంది కాని, ఏమీ పట్టువిడుపులు లేని మనిషి. తను మంచి అనుకొంటే ఎవరేం చెప్పినా వినడు. తను చెడ్డ అనుకొంటేమాత్రం ఎవరయినా ఏమయినా చెబితే వింటాడు. సిక్ చేయటానికి వచ్చిన ఏ రైల్వే ఉద్యోగి అయినా, ఎన్ని కష్టాలు చెప్పుకొన్నా, నిజంగా సిక్ కాకపోతే, ఈ డాక్టరు దగ్గ ర్నుంచి సిక్ సర్టిఫికేట్ పొందలేదు. మొన్నటికి మొన్న ఏయస్ఎం కాండిడేట్‌లు వస్తే పదికి ముగ్గురు అన్‌ఫిట్. అలా మునుపు ఎప్పుడయినా జరిగిందేమో అంటే అనుమానమే! ఇంతగా రూల్ ప్రకారం పోయే మనిషిని తనింతకుముందు చూళ్లేదు.

దయా దాక్షిణ్యాలు పుష్కలంగా ఉన్న మనిషి! జాలీ సాను భూతీ ఉన్న వ్యక్తి! రూల్ ఏ పరిస్థితుల్లోనూ తప్పని స్వభావం. లంచం ముట్టడమే కాదు, చూడటం వినటం కూడా ఇష్టం లేని తరహా!

ఏ కొంచెం కష్టం ఎవరికి కలిగినా సహించలేడు కానీ సంచలించిపోడు. తనలో కలిగిన ఏ భావమూ అంత త్వరగా బైటపెట్టే మనిషి కాడు. ఇవాళ మాత్రం చాలా విడ్డూరంగా కనిపిస్తున్నాడు.

డాక్టరుకు కారియర్ వచ్చింది. సిద్ధమై, కారియర్ తీసి, అన్నం వడ్డించుకోబోతూ ఆగిపోయాడు. అలాగే లేచి వెలుపలికి వచ్చి బెంచీమీద కూర్చున్న చెంచయ్యను చూసి బెదురుతూ దగ్గ రకు వచ్చాడు.

బెదరటానికి కారణం వుంది. చిన్నతనంలో తనతో స్కూలులో చదువుకొన్న మిత్రుడొకడు రైల్వే పోర్టరుగా వుండి జబ్బు చేసి, సిక్ చేయటంకోసం వచ్చి, మెడికల్ ఎగ్జామినేషన్ పూర్తయిపోతుంటే, పరాచికాలు ఆడి, ఇంటికి తీసుకుపోయి, చిన్న ప్పటి ముచ్చట్లు చెప్పుకొని పంపిస్తే ఎవరో గిట్టనివాళ్ళు ఫలానా డాక్టరు లంచం తీసుకొన్నాడని ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాయటం ఆపైన ఏమీ జరక్కపోయినా గొడవ జరగటంవల్ల గుండెకాయను గుప్పిట్లో భద్రంగా ఉంచుకొన్నాడు డాక్టరు రఘురాం.

అప్పటిదాకా దగ్గి దగ్గి అలసిపోయి కూర్చున్న చెంచయ్య మాట్లాడితే దగ్గు వస్తుందని భయపడుతూ వున్నాడు. డాక్టరు రఘురాం వచ్చి 'మాస్టారూ!' అన్నాడు.

'ఊఁ' అంతకంటే మాట్లాడలేదు చెంచయ్య. తలయినా పైకెత్తలేదు.

'ఇంటికి రాకూడదా ?'

'నువ్విక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యావని నా కింతకు ముందు తెలియదు.'

ఈమధ్య సంవత్సరంగా ఉత్తరం వ్రాయలేదు రఘురాం.

'భోజనం చేద్దాం రండి !'

చెంచయ్య డాక్టరు ముఖంలోకి చూశాడు. కళ్ల వెంట నీళ్లు తిరుగుతున్నాయి. 'నేనా ?—ఇప్పుడెందుకు—ఆకలి లేదు—వద్దు' వద్దు అన్నమాట చాలా కఠినంగా వినిపించింది.

'లేదు. మీరు రావాలి' ఆజ్ఞాపించినట్లుంది స్వరం. ఆ అధికారం కొడుకు తండ్రిపట్ల చూపుతాడు. భక్తుడు దేవుడిమీద చూపుతాడు.

'రాను' తీక్షణంగా చెప్పాడు. 'అలాకాదు' మెల్లిదిగా అన్నాడు 'ఇంకోసారి' కళ్లవెంట నీళ్ళు తిరిగాయి.

'లేదు.' స్థిరంగా వుంది గొంతు. 'మీరిక్కడుండి,' గొంతు వణికింది. 'మీరు తినకుండా,' స్వరంస్థాయి తప్పింది. 'నేను తినను' నిశ్చయంగా చెప్పాడు.

'అలాగా!' చెంచయ్య పైకి లేచాడు. దగ్గుతెర ముందుకు వచ్చింది. 'నేనిక్కడుంటే' దగ్గాడు. రెండు అడుగులు ముందుకు వేశాడు. 'నువ్ తినవన్నమాట' ఆగాడు. దగ్గు ఆపుకోలేక పోయాడు. నిగశ్వాసగా వుంది. ముందుకు సాగాడు. 'అయితే' సదాశివంవైపు చూశాడు. 'వెళుతున్నాను' ముందుకు పోతున్నాడు. ఎముకలగూడులాగా వున్నాడు. వెంట సదాశివం నడుస్తున్నాడు. దర ఖాస్తు పెట్టుకొన్నవాళ్లు ఒక్కరొక్కరే వస్తున్నారు. చెంచయ్య వరండా దాటాడు. పోర్టికో దాటాడు. జల్లు పడుతూ వుంది. వర్షంలోకి పోయాడు. డాక్టరు రఘురాం గుండె పట్టుకొని తన గదిలోకి పోయాడు.

డాక్టరు రఘురాం టేబిల్‌ముందు కూర్చున్నాడు. వేసుకున్న విస్తరి వేసినట్లే వుంది. తీసిన కేరియర్ తీసినట్లే వుంది. అన్నం వడ్డించుకో బుద్ధి పుట్టలేదు. ఆకలి అవుతున్నట్లే లేదు. ఆకలి చచ్చిపోయింది.

తల్లీ తండ్రీ లేని తనను మేనమామ హస్టుఫారంలో చేర్పించి చెంచయ్యకు అప్పజెప్పాడు. తను వారాలు వుంటూ చదువుకొన్నాడు. వారంలో రెండురోజులు చెంచయ్య ఇంట్లో తినేవాడు.

గొప్పకోసం కొంతమంది, పాడయిన అన్నం పారేయలేక కొంతమంది, బీదవాణ్ణి రక్షించాలి చదివించాలని కొంతమంది వారాలు చెబుతూవుంటారు. ఎందుకయినా కానీ తనకింత తిండి పెట్టినవాళ్లను తాను నిందించలేదు. తన ప్రాణం కాపాడి, తన కాళ్లమీద తాను నిలబడగలిగేటట్లు అవకాశం కల్పించిన వాళ్లందరికీ తాను కృతజ్ఞుడు.

అయితే చెంచయ్య మాత్రం అలాకాదు. తనకు అన్నం వడ్డించింతర్వాత ఆయన తినేవాడు. తొందరపని ఏమీ లేకపోతే ప్రక్కనే కూర్చోబెట్టుకుని తినిపించేవాడు. తల్లీ తండ్రి గురువూ దైవం తనేఅయి ఏమీ బాధ కలగకుండా చూశాడు. ఆర్థికంగా హార్దికంగా తనకు అండఅయిన చెంచయ్య మరువురాడు. తను మరువలేదు.

చిన్నతనంలో ఋజుస్వభావంతో, క్రమజీవితంతో, దానధర్మాలతో, దయాదాక్షిణ్యాలతో, పాపం ఎరక్కుండా, పుణ్యం చేస్తూ, స్వార్థం చూసుకోకుండా పరార్థం చూస్తూ, నీతి నిజాయితీలతో ప్రవర్తించే చెంచయ్య చెప్పింది, చూపింది, నేర్పింది, తను విన్నాడు, చూశాడు. నేర్చుకొన్నాడు. తన జీవితంలో, తన రక్తంలో తన వ్యక్తిత్వంలో, తన అస్తిత్వంలో చెంచయ్య స్థిరమైన పునాదులతో ఉన్నాడు.

తను స్కూలుఫైనల్ చదువుతున్నప్పుడు సదాశివం పుట్టాడు. ఆ నెలంతా పండుగలా అయిపోయింది. ఆ సంవత్సరమంతా ఆ పసివాణ్ణి తాను ఎత్తుకొని ముద్దాడనిరోజు లేదు.

కాలేజీలో, మెడికల్‌కాలేజీలో, చదువుతున్న రోజుల్లో వారానికీ ఒకసారి అయినా వచ్చి చెంచయ్యను పలకరించి పోయేవాడు.

హౌస్ సర్జన్‌గావుంటూ, తన క్లాసుమేటును ప్రేమించి పెళ్లిచేసుకొన్నప్పుడు తన అదృష్టం చూసి సొంత తండ్రిలాగా చెంచయ్య పొంగిపోయాడు. సిరిసంపదలున్న ఇంటిలో లేకలేక పుట్టిన చక్కగా నొక్కకూతురు తన భార్య! నిండుహృదయంతో ఆశీర్వదించిన మేష్టారుకు గురుదక్షిణ ఇమ్మని మామ ఇచ్చిన రెండువేలు ఇవ్వబోతే తీసుకోకుండా చెంచయ్య వెళిపోతుంటంతో, ఆ డబ్బు సదాశివంపేర బ్యాంకులో వేసి, ఆ బుక్కు ఇచ్చి వెళిపోయాడు తను.

పదిహేనేళ్ల పూర్వం తనకు రైల్వేలో ఉద్యోగం వచ్చి బైలుదేరుతున్నప్పుడు చెంచయ్య చెప్పిన సత్యాలు జీవితం అంతా కాచి వడపోసిన సత్యాలు ! నిగ్గుతేల్చిన సత్యాలు !

ఆయన చెప్పిన సత్యాలు వేదసూత్రాలుగా, ఆయన జీవితం ఉదాహరణగా తన జీవితం రూపొందించుకొన్న రఘురాం అణువణువునా చెంచయ్య! కణకణానా చెంచయ్య! అర్థం తెలియని పదానికి విద్యార్థి నిఘంటువు వెదుక్కొన్నట్లు తన జీవితంలో ఏ సమస్య ఎదురైనా ఏ పరిష్కారం అవసరమయినా, చెంచయ్య జీవితమనే నిఘంటువు వెతుక్కొనేవాడు తను. బాల్యం నుంచీ తనకెంతో మేలుచేసిన చెంచయ్యకు తానేమీ చేయలేకపోయానని బాధగా వుంటూ వచ్చింది.

ఉద్యోగంలోచేరిన మొదట్లో ఎక్కువగానే చెంచయ్యకు ఉత్తరాలు వ్రాసేవాడు. క్రమక్రమంగా జీవితం బరువు పెరిగి,

వెంచయ్య ఒక జ్ఞాపకంగా మిగిలిపోయాడు. డాక్టరు రఘురాం అన్నం వడ్డించుకోలేదు. కళ్లనెంట నీళ్లు తిరుగుతున్నాయి. 'కలర్ టెస్ట్ రెడీసార్' కాంపౌండలు చెప్పి వెళ్లాడు.

కాజువాలిటీ డాక్టర్ యూకలిప్టస్ చెట్లు మీించి ఆకాశం లోకి చూస్తూ మధ్య మధ్య లేఖ వ్రాస్తూ కూర్చున్నాడు.

'ఈదేశం ఏమయిపోతుంది?'

'ఈ దేశంలో మనిషికి విలువలేదు. వాడి చొక్కాకు విలువుంది. వాడి చెప్పుకు విలువుంది. మనిషికి లేదు. మనిషికి విలువలేదు. మనిషి కులానికి విలువుంది. మనిషి మతానికి వుంది. భాష, డబ్బు, చదువు, రాష్ట్రం, దేశం అన్నింటికీ విలువుంది. మనిషికి లేదు. మనిషి ఈ దేశంలో దమ్మిడీకి కొరగాడు'

'మనకు మనజాతికి జాతీయత లేదు. ఒకణ్ణి ఇంకొక ఇప్పుడూ సోదరుడు అనుకోలేడు. అనుకోనీడు. అవకాశం లేదు. అది కలగదు. కలగనివ్వదు.'

'మన బ్రతుకుల్లో ఎంత వైచిత్ర్యం! ఎవడి స్వార్థం వాడిది. ఎవడిలాభం వాడిది. ఎవడిమేలు వాడిది. తన సుఖం, తన లాభం తన మేలు, తన ఆనందం తప్ప ఎవడూ ఎవడికోసమూ చూడడు'

'మనకు మరొకడితో సంబంధంలేదు. స్నేహంలేదు. కల యికలేదు. పొత్తులేదు. ఉన్నట్లు నటన. ఆభాస. మోసం.'

'ఈ వ్యవస్థలో అందరూ అందరికీ ఏదోవిధంగా విరో ధులు. ప్రతి వ్యక్తి మరో వ్యక్తికంటే గొప్పవాడు. ప్రతివ్యక్తి ఒక స్వయం వ్యక్తి! ప్రతిమనిషి ఒకస్వయం వ్యవస్థ! ఈదేశంలో సామూహిక చైతన్యంలేదు. సామూహిక సామర్థ్యం లేదు.'

'నలుగురిలో ఒకడుగా ఈ దేశంలో ఏ ఒక్కడూ ఉండడు! తనమాట నలుగురూ వినాలికాని తనుమాత్రం ఎవరిమాటా వినడు. తను అందరికంటే శ్రేష్ఠుడుకాని, తనకంటే అధి కుడు లేడు.'

'తనకు, తనవారికి, తనచుట్టూ తప్ప. ఈ జాతికి లోకం లేదు. తనది కానిది ఏమీ ఉండకూడదు. నలుగురి మేలుకోరే వాళ్లు లేరు. నలుగురికోసం తనమేలు వదులుకొనేవాళ్లు లేరు. పదిమందికోసం కష్టపడేవాడు అసలేలేడు. సామూహిక లాభం కోసం తనని తాను అర్పించుకో గలిగేవాడు ఈ దేశంలో మందు కైనా దొరకడు.'

'ఈ మనుష్యులతో, ఈ దేశంలో ఏం అభివృద్ధి ? ఏం అభ్యుదయం ? ఏం పురోగమనం? ఈ జాతి మేల్కోదు. ఈదేశం బాగుపడదు !'

కాజువాలిటీ డాక్టరు ఉత్తరం ముగించకుండా ఎక్కడా చూడకుండా కళ్లు మూసుకొని కూర్చున్నాడు.

కలర్ టెస్ట్ జరుగుతూ వుంది. స్విచ్‌బోర్డు డాక్టరు చేతిలో వుంది. గది కిటికీలు తలుపులు మూసివున్నాయి. కిటికీ కన్నాలలోంచి పడిన నీళ్లు సన్ననికాల్వగా కాళ్లక్రిందగా పోతు న్నాయి. డాక్టరు స్విచ్ ఆన్‌చేశాడు. గోడమీద బోర్డులో బల్బు వెలిగింది.

'ఏం రంగు?'

'పచ్చ!' సదాశివం చెబుతున్నాడు.

'ఏం పచ్చ?'

'ఆకుపచ్చ!'

'ఆ స్విచ్ ఆఫ్‌చేశాడు. రంగులేదు. మరోస్విచ్ ఆన్ చేశాడు.

'సరిగ్గా చూడు! ఇదేం రంగు?'

'ఎరుపు !'

'చూసి చెప్పు!'

'ఎరుపు!'

'సరిగ్గా చూడు!'

'ఎరుపు!'

రంగు మారింది.

'ఇదేం రంగు?'

'తెలుపు!'

'ఇదీ?'

'తెలుపు'

'నీకు రంగులు కనిపిస్తున్నాయా?'

'వెలుతురు కనబడుతూవుంది'

'సదాశివం' డాక్టరు గొంతు లోయలో వెదుకునవాడి కేక లాగా, పసివాడి ఆకలి అరుపులాగా, కొండరాయి దొర్లినట్లు, లారీ గోడకు ఢీకొన్నట్లు వింతగా వినబడింది.

'నీకు రంగులు తెలుస్తున్నాయా?'

'ఆఁ!'

డాక్టరు పెద్దగా నవ్వాడు. వికృతంగా నవ్వాడు. సుందరంగా నవ్వాడు. గ్రీన్‌బల్బు వెలిగింది. రెడ్‌బల్బు వెలిగింది. గ్రీన్ సిగ్నల్‌లా కనిపించింది. రెడ్‌సిగ్నల్‌లా కనిపించింది.

ఇంజను వస్తూవుంది. ఎదురుగా సిగ్నల్. లోకమంతా చీకటి! ఇంజన్ వెనుక కంపార్టుమెంటులు. జనం అదమరచి నిద్రపోతున్నారు. రైలునిండా జనం. ఎదురుగా సిగ్నల్. రైల్లో జనం. పిల్లలు స్త్రీలు పురుషులు ఏమీ చూడకుండా ఏమీ గమనించకుండా నిద్రపోతున్నారు. అద్భుతం! ఎదురుగా సిగ్నల్

రైలు వస్తూవుంది: ఇంజన్‌లో డ్రైవరు: ఎదురుగా సిగ్నల్ లైటు: గ్రీన్! రైలు పోతూవుంది. రెడ్! ఎదురుగా సిగ్నల్. ఎదురుగా లైటు! గ్రీన్! రెడ్! సిగ్నల్ వంగింది. సిగ్నల్ వంగలేదు. లైటు తెల్లగా! డ్రైవరు చూస్తున్నాడు. లైటు ఎర్రగా: రైలు పోతూవుంది. లైటు ఆకుపచ్చగా! జనం ఎక్కి దిగి పోతున్నారు.

డ్రైవర్ చూస్తున్నాడు. ఎదురుగా సిగ్నల్‌లైటు. ఇంజన్ కూతవేసింది. ఫైర్‌మన్ బొగ్గు వేస్తున్నాడు. రైలు పోతూవుంది. సిగ్నల్ వంగింది. సిగ్నల్ వంగలేదు. గ్రీన్, రెడ్, గ్రీన్, సిగ్నల్ వంగింది. రైలు ఆగలేదు. ఇంజన్ పోతూవుంది. రైలు పోతూవుంది. డ్రైవరు నడుపుతూవున్నాడు.

స్టేషన్ వచ్చింది. రైలు ఆగాలి. బ్రేక్ వేయాలి. అంతలో...భూమి పగిలింది. కొండ బ్రద్దలయింది. ఆకాశం విరిగింది: వస్తున్న ఎక్స్‌ప్రెస్, స్టేషన్‌లో ఆగివున్న పాసింజరును గుద్దింది. డ్రైవర్లు చచ్చిపోయారు. ఫైర్‌మన్‌లు చచ్చిపోయారు. పాసింజర్లు అరుపులు కేకలు ఏడుపులు మూలుగులు. స్త్రీలు పిల్లలు వృద్ధులు: ఏడుపు—విపరీతంగా ఏడుపు! గోల గోల! ఎక్స్‌ప్రెస్ ఇంజన్ డ్రైవరు సదాశివం చచ్చిపడివున్నాడు.

'తమ్ముడూ!' డాక్టరు రఘురాం అరిచాడు.

'ఏంసార్!' సదాశివం పలికాడు.

చేతిలోఉన్న స్విచ్ బోర్డులోని స్విచ్‌లు అన్నీ వత్తాడు. ఎన్నో బల్బులు. ఎన్నోరంగులు. వింత వింత రంగులు. చాలారంగులు. డాక్టరు ముఖంలో రంగులు మారిపోతున్నాయి. వింతగా విచిత్రంగా ముఖం కనబడుతూవుంది. వెర్రిగా పిచ్చిగా చూస్తున్నాడు. గట్టిగా శ్వాస పీల్చుకొన్నాడు. ఊపిరి బరువుగా ఆడుతూవుంది.

పూరింటిలో వంచలో కుక్కిమంచంలో డెబ్భైఏళ్ల ముసలాయన మాటలు పడిపోయి, నోరు కదుపుతూ ఉన్నాడు. ఆ గొంతులో పోయటానికి గంజి అయినా లేదు.

నలుగురు పిల్లలతండ్రి పాతికేళ్లవాడు ఏభైఏళ్ల వాడులాగ అయిపోయాడు. అతని భార్య నడుస్తున్న శవంలాగా వుంది.

ముసలాయన ఆకలితో చచ్చిపోయాడు. పిల్లల తండ్రి గుడ్డివాడయి; భార్యనూ పిల్లల్నీ పోషించలేక దేశాలవెంట వెళ్లిపోయాడు. భార్య శీలం కోల్పోయి గతించింది.

పిల్లలు అన్నంలేక అడుక్కుతింటున్నారు. కట్టబట్టలేదు. ఉంటానికి చోటులేదు. రైల్వేస్టేషన్‌లో బస్‌స్టాండులో. ఎవరో తిడుతున్నారు. తంతున్నారు. పెడుతున్నారు. వీళ్లు బ్రతుకుతున్నారు.

నీచంగా దీనంగా మానవుడి సంతతి భవిష్యత్ సమాజం దిక్కులేక అడుక్కుతింటూ వుంది. అవస్థపడుతూ వుంది.

ఎవడో పసివాడు బలంగా కడుపులో తన్నాడు. ఆకలయిన కడుపు, అన్నంలేని కడుపు, పేగుల్లో ఏమీలేని కడుపు, పేగులులేని కడుపు. వెన్నెముకకు అంటుపోయిన కడుపు, తన్ను భరించలేక నేలమీదపడి పాములా గిలగిలా తన్నుకులాడుతూ వుంది.

'అమ్మా! అమ్మా!! అమ్మా!!!

అరుస్తూవుంది.

అరుస్తున్నాడు.

అరిచాడు డాక్టరు రఘురాం.

'ఏందేంది సార్?' సదాశివం అదిరిపోయాడు'

'ఏమయింది సార్?'

కాంపౌండరు తలుపు తీసుకొని లోపలికి వచ్చాడు:

సదాశివం వెళ్లిపోయాడు. ఇంకోతను వచ్చాడు.

రైల్వే హాస్పటల్‌లోకి అప్పుడే రిక్షాలోవచ్చిన మనిషి ప్రక్కవాలుగాపడ్డ నీటిబొట్లు తుడుచుకొంటూ వరండా చివర నిలబడివున్నాడు. వరండానిండా కాళ్లతడి! మరకలు! చలిగాలి బుసలు కొడుతూవుంది. వయ్యారాలు పోతూవుంది. వళ్లు కొరుక్కు తింటూవుంది.

జరుగుతున్న పి—ఓస్ట్స్‌తో మెడికల్ ఎగ్జామినేషన్ పూర్తి అవుతుంది. చెంచయ్య లోపలున్న కొడుకుకోసం చూస్తున్నాడు. కాని గుంటల్లో చిక్కుబడిపోయిన కళ్లురెండూ విడిపించుకొని చూస్తున్నాడు.

సదాశివం చూపు సరిగా లేదు. వీడు సెలెక్ట్ కాడు. వీడికి ఉద్యోగం రాతలేదు. ఇంతకుముందు ప్రయత్నాలు నెరవేరలేదు. ఇదీ అంతే!

తన జీవితంలో ఎవరినీ ఏమి అడగలేదు. సర్వీసులో లోపం లేదు. తనవిధి తాను ఎప్పుడూ నెరవేర్చాడు. ఎప్పుడు ఎవరికీ ఏవిధంగానూ బరువు కాలేదు. తనపట్ల దేవుడుమాత్రం నిర్దయుడుగా ఉన్నాడు.

తనకు ఒక్కడే కొడుకు. వాడి బాగోగులు తన కక్కరలేదా? వాడు బికారి అయిపోతే చూస్తూ వూరుకోవాలా? వృద్ధాప్యంలో దిక్కులేని చావు చావాలా? ఎవరికోసం ఈ నీతినియమాల గొంపి? ఎవరికోసం ఈ సత్యధర్మాల పీడ? ఎవరికోసం ఈ ముక్కుకు సూటిగా పోయే ముదనష్టపు తత్వం?

ఈ ఆలోచనవల్ల, వచ్చేమార్పు—అవును—తను అంగీకరిస్తాడు. డెబ్భైఏళ్ల అమృతంవంటి జీవితంలో విషబిందువు చిలుక్కోక తప్పటంలేదు. తెల్లటి పట్టుబట్టవంటి జీవితంమీద బురద జల్లుకోక తప్పటంలేదు. ఇంతకాలం తిన్నగా స్వర్గం చూస్తూ పెరిగిన వ్యక్తిత్వపు వృక్షం కూకటివేళ్లతో కూలి

నరకంలో పడిబొబ్బలుగా వెతుక్కోక తప్పటంలేదు. ఎందరి హృదయాలలోనో ఉత్తముడుగా చిత్రితమయివున్న బొమ్మ చెరుపుకోక తప్పటంలేదు!

ఎప్పుడో సదాశివం పేరిట రఘురాం బ్యాంకులో వేసిన డబ్బు తప్పని సరిఅయి, వడ్డీతో సహా పూర్తిగా తీసుకొని మూటకట్టి భద్రంగా తెచ్చాడు.

ఈ డబ్బు అంటుకోవటంతోనే తన పతనం ప్రారంభమయింది. ఆడబ్బు మోస్తున్న కొద్దీ ఆ బరువుకు క్రమక్రమంగా క్రుంగిపోవటం తప్పటంలేదు. ఆ డబ్బు లంచంగా మెడికల్ ఎగ్జామినర్‌కు ఇచ్చి, కంటిచూపు సరిగా లేని తనకొడుకును సెలెక్టు చేయమని అడగటానికి మనస్సులో అనుకొన్న రోజు, అనుకోవటం సంకల్పం అయినరోజు, అందుకోసం బయలుదేరి వచ్చినప్పుడు, ఇక ఇవ్వబోతున్నాననుకొన్నప్పుడు, పూర్తిగా పాతాళంతో పడి, ఆ పొరల్లో కూరుకుపోయి, తొలుచుకుపోయి సజీవంగా శాశవమయిన శవమీద తనకే అసహ్యం కలుగుతూవుంది.

కాని, ఇవాళ తనకేం బాధ కలగటం లేదు. ఎగ్జామినర్ రఘురాం కాకపోతే, తను పాతాళంలోనే గతించేవాడు. అయితే ఇప్పుడు పైకి లేస్తున్నాడు.

రఘురాం చిన్ననాటి చిన్నవాడిలా ప్రవర్తించి తనను ఒకనాటి పెద్దవాణ్ణి చేశాడు. రఘు తనని పెద్దవాణ్ణి చేయకపోతే గుర్తుచేయకపోతే, అలా ప్రవర్తించి ఉండకపోతే తను చిన్నవాడుగా ఉండిపోక తప్పేదికాదు.

రఘురాం డాక్టరుగా ప్రవర్తించివుంటే, వృద్ధుడైన తండ్రిగా తనగోడు తను వెళ్లబోసుకొని వుండేవాడు. బాల్యం గుర్తుకు తెచ్చుకొని, నీ తమ్ముడికోసం, నీ గురువుకోసం ఈ డబ్బు. నీ డబ్బు తీసుకొని అయినా వీణ్ణి ఒక ఉద్యోగినిచేయుమని అర్థించివుండేవాడు.

కాని, తను పాతాళంలోంచి పైకి లేస్తున్నాడు. లంచం ఇవ్వబోవటం లేదు. నా ముఖం చూసి అయినా వాణ్ణి సెలెక్టు చేయుమని అడగటంలేదు. తను పాతాళంలోంచి పైకి లేస్తున్నాడు. చిన్నతనంలో తనుచేసిన మేలుకు ప్రతిఫలం అడగడంలేదు. తను పాతాళంలోంచి పైకి లేస్తున్నాడు. చిన్ననాడుచేసిన మేలుకు కృతజ్ఞత అయినా స్వీకరించకుండాలేదు. ఎప్పటిలాగే ఇప్పుడూ ఎవరినీ ఏమీ యాచించడంలేదు. తను పతనమయిపోలేదు. పాతాళంలో పడలేదు. కన్నీటితో తనను తాను ఓదార్చుకొంటున్నాడు వెంచయ్య

తను కొద్దిలో కొద్ది రఘు వ్యక్తిత్వపు ఆధిక్యానికి కారణం అయివుండవచ్చు. తన కంటి ఎదుట బాలుడు, తన కంటి ఎదుట యువకుడు, తన కంటి ఎదుట డాక్టరు. తన నీడలోనీడ, తన ఇంట్లో బిడ్డ. తన వ్యక్తిత్వంలో పుట్టిన మొలక, తాను పాడైపోతుంటే, తాను పతనమయిపోతుంటే, తాను నాశనమయిపోతుంటే బాగుచేశాడు, ఉద్ధరించాడు, కాపాడాడు. 'నీనీడ నన్ను కాపాడింది. నన్ను నేను కాపాడుకొన్నాను' అనుకొన్నాడు వెంచయ్య.

చెప్పరాని ఆనందంతో తల మునక లవుతున్నాడు వెంచయ్య. తాను ఆదరణ చూపుతూ పొంగిపోలేదు. తనకు అన్నీ వున్నప్పుడు అతిశయ పడలేదు. నిరవసరంగా ఉన్నప్పుడు విర్రవీగలేదు. అలాగే అవసరమయినా నిశ్చలంగా, ఆశిస్తూ, ప్రశాంతంగా, అత్యవసర జీవిత విషవలయంలో చిక్కుకొన్నప్పుడు నెమ్మదిగా ఉండే అవకాశం కల్పించిన తన విద్యార్థికి మనస్సులో కృతజ్ఞత చెప్పుకొన్నాడు వెంచయ్య.

సీ—టెస్టు పూర్తయి సదాశివం వెలుపలికి వచ్చాడు. ముఖం దీనంగా వుంది. మ్లానంగా వుంది. పిచ్చిగా వుంది. అయోమయంగా వుంది. 'బాగా కనిపించలా' చెప్పాడు. తండ్రి ముఖం మీద ఉదయంనుంచి క్రమ్ముకొన్న నల్లమేఘాలు తొలగి మెరుపు మెరిసినట్లు నవ్వు తొణికింది. సదాశివం అర్థంకాక పిచ్చిగా చూశాడు.

'నేను సెలెక్టు అవుతానో లేదో!'

'సెలెక్టు అయితే డ్రైవరువవుతావు. లేకపోతే లేదు.'

'డాక్టరుగారు ఏంచేస్తారో ఏందో!'

'నాకు సంతోషకరమయిన న్యాయంచేసి మనకు కష్టం కలిగిస్తాడో, నాకు బాధాకరమయిన అన్యాయంచేసి మనకు సంతోషం కలిగిస్తాడో చెప్పటం కష్టం. ఏంచేసినా......' వాక్యం పూర్తి కాలేదు.

సీ—టెస్టు ముగించి వెలుపలికి వచ్చిన డాక్టరు రఘురాం క్రొత్తమనిషిగా కనిపించాడు.

తన గదిలోకి పోయి, తలుపులు వేసుకొని, ఎనిమిది పేర్లున్న లిస్టు తెరచి టేబిల్‌మీదపెట్టి, ఒక్కొక్క పేరు తిన్నగా ఉన్న ఒక్కొక్క టెస్టు రిజల్టుచూసుకొంటూ ఫైనలైజు చేయబోతున్నాడు.

కిటికీలు తీసి వున్నాయి. ఈదురుగాలి జామ్మని తోలుతూ వుంది. నరాలు కొరికే చలి! బైట వాన! హోరు! డాక్టరు రఘురాం వంటినిండా చెమటపట్టింది.

రెండు ఫేన్‌లువేశాడు. గాలి విదిలించి కొడుతూవుంది. పైనుంచీ కిటికీలలోంచి చల్లని చలిగాలి. అయినా చెమట ఆరిపోలేదు. ముక్కు కొనలో బొణతల్లో నుదుటిమీద ఆగకుండా చెమట!

సదాశివం పేరు తిన్నగా పెన్ను వచ్చింది. ఆగింది. కదలేదు. అయిదు నిమిషాలు—కదల్లేదు. పది. కదల్లేదు. అది కదల్లేదు. నృత్యం చేసి చేసి అలిసిపోయిన నర్తకిలాగా ఆగిపోయింది కలం.

బాల్యం—చదువు—చెంచయ్య—మనస్సులో మెదులుతుంటే, కాలం కదలేల్దు. కలం కదలేల్దు. తన కెంతో సహాయంచేసిన వ్యక్తికి తానేం చేశాడు? బుఱ్ఱ బద్దలు కొట్టుకొన్నాడు. ఏమీ చేయలేదు.

తను కృతఘ్నుడా?

సదాశివం గుర్తుకువచ్చాడు. అతని కళ్ళు. రంగు నంబరులు. రంగులైట్లు. కళ్ల ముందు వింత వింతగా తిరుగుతున్నాయి. ఏం చేయాలి ?

తను ధర్మద్రోహి ?

కలం కాగితంమీద నడవబోయింది. మళ్ళీ ఆగిపోయింది. చెమటలు కక్కి నర్తకిలాగా కూలబడిపోయింది.

ఆప్యాయంగా అన్నంపెట్టిన చెంచయ్య, ఆదరంగా ఫీజు కట్టిన చెంచయ్య, అనురాగంతో నీతినియమాలు నేర్పిన చెంచయ్య ఎదుట నిలబడ్డాడు. గుండె వేదికమీద నిలబడ్డాడు. శిరశ్శిఖరం మీద అధిష్టించాడు. నాకు గౌరవం వద్దు—వాడికి. ఉద్యోగం! నాకు కోటువద్దు—వాడికి ఉద్యోగం! నాకు అన్నం వద్దు—వాడికి ఉద్యోగం! ముప్పేటన కేకలు పెడుతున్నట్లుంది.

ఏం చేయాలి ?

ఈదేశం. ఈ జనం వీళ్ళు! ధర్మం తాను తప్పటం; అన్యాయం తలఎత్తటం. నీతి లేకపోవటం. నిజాయితీ నాశనం కావటం, ఇదా నువ్ చేయబోయేది.

ఏం చేయాలి?

రఘురాం కలం తీసుకొన్నాడు. వ్రాయబోయాడు. ఆగిపోయాడు. కలం ఎగశ్వాస పుట్టిన నర్తకిలాగా పడుకొని దొర్లుతూ వుంది.

రైలు వెళుతూ వుంది. సిగ్నల్ ఇవ్వలేదు. డ్రైవరుకు కనబళ్ళేదు. రైలు పోయింది. పాసింజరును గుద్దింది. జనం చిన్నా పెద్ద చనిపోయారు.

ఏం చేయాలి?

తిండిలేక ముసలాయన చచ్చి, తండ్రి గుడ్డివాడై, తల్లి, పరాభవింపబడి, పిల్లలు దిక్కులేని వాళ్ళయి, దెబ్బలు తింటూ, తిండలేక, దొంగలై, హంతకులై—రామరామ!

ఏం చేయాలి?

పెన్ను తీసుకొన్నాడు. వ్రాయబోయాడు. పెన్ను పోట్లగిత్తలాగా ఎదురు తిరిగింది. మొరాయించింది. మొండి కేసింది. పాడవబోతా వుంది.

లైట్లు వెలుగుతున్నాయి. ఫేన్లు తిరుగుతున్నాయి. చలిగాలి కొట్టా లోపలా బాహిరంగా ఆంతరంగా. పెన్ను పాడవబోతూ వుంది.

ఏం చేయాలి?

తనకు సర్వం తానే అయిన చెంచయ్య వెఱ్ఱిగా ఆరుస్తున్నాడు. పిచ్చిగా చూస్తున్నాడు. ఎప్పుడూ చేయని పని చెంచయ్య కోసం చేయాలా? రైలింజనులు పగిలి బ్రద్దలయ్యాయి. ముసలాయన చనిపోయాడు. సదాశివం గుడ్డివాడయ్యాడు. రంగు బల్బులు పగిలిపోతున్నాయి. ఫేనులు తిరుగుతున్నాయి. పిల్లలు అడుక్కు తింటున్నారు. పిల్లవాణ్ణి పోలీసు కాలితో తంతున్నాడు. తిండిలేదు. బట్టలులేవు. రైలు పడిపోయింది. చనిపోతున్నారు జనం. చనిపోయారు పిల్లలు స్త్రీలు, వృద్ధులు. ఇనుపకడ్డీ గుచ్చుకొని, కనుగుడ్లు వెలుపలకి వచ్చి, రైలింజను పొయ్యి ప్రక్కనే చనిపోయిన సదాశివం. పెన్ను నర్తకి దొర్లి దొర్లి శవంలా పడివుంది. ఫేన్‌గాలిమోత శ్మశానంగాలిహోరు! లిప్టు గాలికి కొట్టు కొంటూ వుంది. తిండివద్దు! ఏమీ వద్దు! ఉద్యోగం! ఉద్యోగం!! ధర్మం నెత్తిన దుమ్ము! నీతి కంటకారం! అమ్మా ఆకలి. అన్నం పెట్టిన చేయి. ఆదరణ చూపిన హస్తం. యాచించని చేయి. యాచించే చేయి. అడక్కుండా అడిగే హస్తం.

వర్షం హోరు. ఫేనుగాలి—పెనుగాలి. చల్లని చలిగాలి మంట. ఆకాశంలో అగ్ని పర్వతాలు. చెంచయ్యలో పొంగే లావా! చలి పుడుతూవుంది. చిన్న తమ్ముడు! ఒకే ఒక్కడు! లిప్టు టేబిల్‌కేసి గుండె బాదుకొంటూ వుంది. ముఖంమీది చెమట బొట్టు, లిప్టుమీద గంధపుపూత. హిమాలయం ఎత్తు! ఆశలు ఎత్తు! శిఖరాలమీద ఆశలు! పెన్ను తీసుకొన్నాడు. పెన్నుకు ప్రాణం వచ్చింది. వళ్ళు విరుచుకొని ఆవులించింది. వెలుపల నిశ్శబ్దం! లోపల నిశ్శబ్దం! ఫేనులు నిశ్శబ్దం. చలిగాలి నిశ్శబ్దం! ఘోష—హోరు. గర్జన. భయంకరధ్వని, మేఘాలు పగిలిన ధ్వని, గుండెధ్వని. గుండెపగులుతున్న ధ్వని. లబ్ లబ్ లబలబా—దబదబా—వర్షంహోరు కిటికీ మోత. పెన్ను కాగితం మీదికి పోయింది ఇంజను పగిలిపోయింది. ధర్మం హాయిగా నవ్వింది. చెంచయ్య అరుపులు వినబడుతున్నాయి. అవ్యక్తమధురంగా పల్లకీల మోత! పెన్ను నృత్యం చేస్తూవుంది. సదాశివం పేరు తిన్నగా పెన్ను! భూమి తల కిందులవుతూ వుంది. ఆకాశం చాప చుట్టగా నేలమీద పడిపోయింది. వ్రాత పూర్తయింది. డాక్టర్ ముఖంనిండా చెమట! వళ్ళంతా చెమట! చేతినిండా చెమట! నీరుగా జవజవగా—వణుకుతున్నాడు డాక్టరు రఘురాం.

అన్ని పేర్లు తిన్నగా వ్రాత పూర్తి అయింది. ఆక్షణం కవరు తీసుకొన్నాడు వెంటనే లిస్టు కవరులో పెట్టాడు ఒకరు క్షణం అంటించాడు. సీలు వేశాడు కాంపౌండరును పిలిచాడు కవరు ఇచ్చాడు. పంపించాడు. మరునిమిషంలో కవరు సూపరింటెండెంటును చేరింది.

గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు డాక్టరు. చెమట తుడుచుకొన్నాడు. టవలు వానలో తడిసినట్లు అయింది. గుండెదడ హెచ్చింది. గుండెధ్వని శవవాహకుల పాదధ్వనిలాగా వుంది. గుండె చప్పుళ్ళని విలయం వినలేకపోతున్నాడు.

సదాశివం సెలెక్టు అయ్యాడా? డాక్టరు వేశాడా?

సూర్యుడు చూడలేని తావులు కవి చూస్తాడు. కవి చూడలేని చోటు డాక్టర్ రఘురాం అధీనంలో వున్న ఎక్స్‌రే చూస్తుంది. ఎక్స్‌రే కూడా చూడలేని పొరలు గుండెల్లో ఉన్నాయి. ఏ గుండెలో పొరలు ఆ గుండెవున్న మనిషికి తెలియవచ్చు, అయితే, రఘురాం గుండెలో ఉన్న పొరలు అరలు మరలు అతనికే తెలియవు. ఇక ఎప్పుడైనా అతనేం వ్రాశాడో—అతనికూడా—కవరు చించి చూస్తే తప్ప తెలియదు.

రఘురాం శ్వాస బిగబట్టాడు. చెమట తుడుచుకొంటూ ఉన్నాడు. ఆయాసంగా వుంది. కురుక్షేత్రంలో కౌరవుల పద్మవ్యూహంనుంచి తప్పించుకొని వచ్చిన అభిమన్యుడిలా రొప్పు తున్నాడు.

చెంచయ్య, దగ్గుతూ, తూలుతూ, ఆయాసంగా, ముఖం తెల్లగా, బాధగా డాక్టరు రఘురాం గదిలోకి వచ్చాడు.

డాక్టరు వెర్రిగా చూశాడు.

వస్తూనే జేబులోంచి డబ్బు కట్ట తీసి బల్లమీద వుంచాడు.

డబ్బు కట్ట చూస్తూనే పిచ్చి వాడిలా అయిపోయి 'ఏమిటది?' ప్రశ్నించాడు డాక్టరు.

'డబ్బు!'

'అదే! ఎందుకని!

'మిగిలిపోయింది. వడ్డీతోసహా...' దగ్గు తెరవచ్చింది. అంగు అంగున దగ్గాడు. పొర పోయింది. గొంతుకు పూడుకుపోతూ వుంది.

రఘురాం డబ్బు తాకలేదు. చెంచయ్య ముఖంలోకి భయంగా చూశాడు, పిచ్చిగా చూశాడు. ఆలోచనగా చూశాడు. ఇంతకాలం తిరిగి ఇవ్వనిడబ్బు—ఇంతకాలం తన సొంతం అనుకొన్నడబ్బు—ఇక్కడ తామున్నట్టు తెలియకపోయినా, తనకు, తనది, తిరిగి ఇవ్వాలని—కాదు, తెచ్చిన, ఎందుకో వడ్డీతో సహా తెచ్చిన డబ్బు—చూస్తూ. చెంచయ్య ముఖంలోకి తెల్లగా, నల్లగా, తారుగా, కాటుకగా, చీకటిగా, తారుకాటుకచీకటిగా చూశాడు డాక్టరు రఘురాం.

చెంచయ్య ఆ చూపు భరించలేకపోయాడు. రఘురాం ముఖంలోకి చూడలేకపోయాడు. 'కాదుకాదు' తలతిప్పుకొన్నాడు. 'కాదుకాదు' తలతిరుగుతూ వుంది. 'కాదుకాదు' ప్రవహిస్తూ వుంది. 'కాదుకాదు' నేలమీద పడ్డాడు. 'కాదుకాదు' రొణిగాడు. విపరీతంగా దగ్గాడు. భారంగా దగ్గు ఆగిపోయింది.

చేయి పట్టుకు చూశాడు డాక్టరు రఘురాం. ముక్కు దగ్గర చేయిపెట్టి చూశాడు డాక్టరు రఘురాం.

గుండెల్లో అలలు అలలుగా దుఃఖం పొంగుతూ వుంది. కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి.

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

నేనిచ్చిన డబ్బు మళ్ళీ నేను తీసుకోలేనో ఏమో!

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

మీకు ఇష్టమవుతుందని, మీకు సుఖం కలుగుతుందని, మీరు హాయిగా వుంటారని. మీరు చూపిన ధర్మపథం తప్పనందుకంటున్నాడో ఏమో!

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

మీరు చూపిన నీతిమార్గం తప్పలేక, మాకు కష్టం కలుగుతుందని తెలిసినా, మీరు బాధలు పడుతారని తెలిసినా, మిమ్మల్ని హింసించటమవుతుందని తెలిసినా, ఏమీ చేయలేకపోయానంటున్నాడో ఏమో!

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

పసిపిల్లవాడు తల్లిని చుట్టుకొని ఏడ్చినట్లు ఏడుస్తున్నాడు. డాక్టరు రఘురాం. అతని ఏడ్పు వినకుండా, క్షమించానని చెప్పకుండా, శరీరం వదిలేసి, దూరంగా, దూరదూరంగా, అనంత దూరంగా గర్వంగా వెళిపోతున్నాడు చెంచయ్య.

జనక సందేశము

శ్రీ వావిలాల రామమూర్తి

[ఊర్మిళ, సాక్షాత్కృతుఁడైన నాథుని కోరికపైఁ దపస్సు చాలించిన
వార్త విని, జనకుఁడు పంపినది.]

శ్వశురుల కింత సేవనము సల్పెడి భాగ్యము. పూర్వపుణ్య స
ద్వశమునఁగాని యబ్బదుగదా వనితాళికి, నూర్మిళా కుమా
రీ. శిరమునన్ ధరించునె వరిష్ఠముగా భవదాజ్ఞలన్, మహా
యశము గడించి నిల్పిన యహస్కర వంశజ రాజ్యపు పీఠిన్.

శ్వశురుల కింత సేవనము సల్పెడి భాగ్యము, మాతృదేవతా
విశద మతిత్వపై నిలిచి వెల్గెడి కూతులయందు, సీత, తాఁ
గు శలముగా, విదేశ సముకూలతనొంది, గమించెఁ గానకున్,
ప్రశుచిపథాన, మీకు సలుపన్ పరిచర్యల నిల్చె నూర్మిళయున్.

శ్వశురుల కింత సేవనము సల్పెడు భాగ్యము నోఁచు మానినీ
యశము, దిగంతముల్ సెగడి, యా ఋభుధేను మహీరుహావగా
శశితతులన్ జయించెడి, లసత్ప్రభఁ గూర్చు నిసాంబుజన్ బరా
న శివముఁ దల్లిదండ్రులకు, నా యనుఁగుం జనపుత్రి యెట్టిదో!

శ్వశురుల కింత సేవనము సల్పెడు పుణ్యము కల్గునే ధరన్
నిశలు దినంబులున్, దపము నిశ్చలబుద్ధి ఘటించినన్, మహా
ప్రశమము నొందినన్, సురవరంపరఁ బూజల దన్పినన్, సతం
బశనము మానినన్. దనయ యా విషయంబు నెఱింగియున్నదే?

శ్వశురుల కింత సేవనము సల్పెడు భాగ్యము కల్గుఁబో మహా
దశలు గ్రహాలు గూర్చిన; సతంద్రత సూనుఁడు తాతపాదులన్
నిశిత మహాఘముల్ దొలఁగ, నిర్మలసేవలఁ దన్పఁజెల్లుఁ. ద
ద్వశ, సహధర్మచారిణిగదా పతిదేవత, యీ ధరాస్థలిన్.

గురుతరభార సద్వహన గౌవన కోమలమూర్తు లీధరన్
నిరతము భామినీమణులు, నిర్మలభక్తివి, ప్రేమ, ధర్మ సుం
దరముగ భర్తృమూర్తియెడఁ దత్పరతన్ ఘటియించి, కాయము
న్విరవుడమందు, నిశ్చలమనంబున, సంకితముం బొనర్తురిగా!

వరుసెడ దైవభావము, పితృలెల్ల సహిష్ణుతల్, సుతో
త్కర్షము నయిం బ్రభూత మమతల్, నిజధర్మమునం జనిత్వమున్
గిరమరుదౌ సువర్తనము. కాంతలకుం దవణంబు లిద్ధరన్-
స్థిరమతి శైలి యార్మికి, వశిష్ఠులకుం బ్రణతుల్ ఘటించునే!

పరిణతి బుద్ధి యబ్బినది వర్తిల కృత్రిముల మధ్యమందు, మీ
కెఱుగునె నిత్యముం? బతి గ్రహించిన సద్వ్రతముం దలంచునే!
దూరలఁగఁ జేయు నెల్లు దరి దోఁచని యట్టి దినంబులం గుణో
త్కృత సహపద్య కీర్తి, జనక ప్రియవాక్యము లాదరించునే?

సరితలు భర్తృ సన్నిధిని గాంతు రనంత విలాస సంపదల్,
సొంగని శోభలం, బ్రకృతి సిద్ధము గాఁగ; వియోగ కాలమం
దుని సుధీరతా గుణ మహోన్నత, రక్షింపఁ బతివ్రతాత్వ సం
ధుర సహా [illegible] కంటకములతోఁ, [illegible] విరియించు నెమ్మదిన్.

ఆనువ్రతులై స్వధర్మములు నెన్నఁ దెవ్వతి మున్ను, సీత, తా
నరిగిన నాఁడె, ధైర్యముఁ దపంబుఁ, గనార్పితి, నింట నూర్మిళన్
బరఁగఁగఁ జేసినట్టి పతి భావము, నీ పదునాల్గు లోకముల్
[illegible] బ్రతి దాలము, నిగాఢము ప్రేమ శక్తిని తత్త్వముల్!

అతనికి సాటి యాతఁడె సుమా! నగుబ్రోతురుండు లక్ష్మణుం
డతనిఁజె ప్రేమ సోదరుని యంచు, మహాత్ముడ నొకర్ని యా
తత సుకృతంబు పండుటఁ, దతండు వతుండగు భాగ్యమబ్బె. త
ద్గతము లభించె నిక్కము పితార్లకుఁ, దక్షణ ధర్మవర్ధతన్.

మహిత సుఖాను భూతిరొ సమాధి, యతీంద్రియ శక్తిలబ్ధి, యా
బ్రదుహిణుని సృష్టి, మాయ, తన దుష్టత నింపఁగ రానిపోటు, స
ద్విహిత సురక్షణంబు పృథివిన్, దదభావమునన్. వియోగ మా
ర్వ్యహతిరొ కష్టమొందగు భామినికిన్, వ్రత నిష్ఠలింపిడున్.

గృహమును, దండ్రియాజ్ఞ జరిగింపఁగ, సీత, యరణ్యవాసమే
సుహమనఁగాఁ, జతుర్దశ సమల్ వసియింపఁగ, రామలక్ష్మణుల్
దుహితృ సమేతులై, సిలుగులున్ సహియింతురుగాదె! కింభవను
గ్రహము లభించుటన్, దనుజగర్వ మడంగుట, లోకశాంతికై!

అపారమహిమం, బదియు లవ భాగమమని మదినెంచుచున్, సుతా
పహితులు, రామలక్ష్మణులు, సర్వ విజేతలుగాఁగఁ, గోరెదన్
సహాయము వారిసొమ్ము, విలసద్భుజ బాహు పరాక్రమమ్మె. యీ
మహి విలసిల్లనిమ్ము పరమంబగు ధర్మము వెల్గుకొనన్మై–

గ్రహములు దారి తప్పినను, రాముఁడు మాత్రము ధర్మమార్గమున్
గహనము చొచ్చినన్, విడఁడు. విక్రమగుణుండు, సుమిత్రిజాగ్రజుం
డిహ పరముల్ కళంక వెలయించి, జయించును గర్వపుంగతుల్
మహితము లెల్లవేళల, నభీష్టములున్ నెఱవేరుఁ గైకమున్.

భరతుఁడు రాజ్య భారము, శుభంయొవనన్, దలఁదాల్చి వాఁడె సా
దరుని మహాజ్ఞ మేరకు; సుతల్, వినుతల్, శ్రుతకీర్తి నాండవుల్
మాఱవక యుందురే నను? సమానుప కష్టము సంక్రమించె, దు
స్తరముగ మీకిలన్, దశరథ ప్రియ భామినులార! యేమనన్

జనుమ కీర్తి, రాఘవుని సన్నిధినుండి, ప్రవృత్తి యుండెనా?
దనుజులఁ జెక్కరన్, యముని ధామముఁజేర్చిన యట్లు, చెప్పఁగా
విని, కడుమోద మందితి, నిపీడతి నమ్మను, లింత హాయిగా
మనఁగను, దిష్టమయ్యె, నడు మంతరవున్ సిరి యానురంబుగా!

గతము గతంబె, భావియు సుఖంబుగ సాగు నటంచు నెంచుచే
మతియు, సమస్త బంధుతతి; మా గృహమందుం, నీశ్వరాజ్ఞ చే
సతతము మోదఖేదముల సామ్యముగా భజియించువార. లా
ఐత యశ మొందుఁడీ దశరథ ప్రియభామినులార! విద్భలున్.

గురువులు శ్రీ వశిష్ఠు, లనుగుంబ్రియు, సేమమెగా, యరుంధతీ
వరసతి, పాల్యులున్ సిరుల వర్ధిలు వారలె? దుగ్ధధారలన్
గురియుచు నున్నవే పసులు? కోసలమెల్ల సుభిక్షమే గదా?
తిరముగు భక్తి, రామునెడఁ, దేఁకువగాఁ బ్రజ చూపునే గదా!

సుగుణగణ ప్రభాసి, యతి సుందరమూర్తి దయాపయోధి, యు
త్యగణిత వీర్య భంజిత మహా శివచాపుఁడు, మానవాకృతి
స్థగిత రమావరుండు, దనుజ ప్రకరాంతక రూపుడున్, భగ
ద్ధగిత శరీరుఁ, డార్త జనతావన హరుండని రాము నెంచుఁడీ!

అతులిత శాక పక్షధరుఁ, డంచిత కాంచన భూమిభృత్తిను
ద్యుతి లలితుండు, శౌర్య మహితుండు, గుణోజ్జ్వలుఁ డార్త సేవనాం
చిత తతమూర్తి లక్ష్మణుఁడు; స్వీకృత విద్వ్రతుఁ, డచ్ఛలక్షణా
ఢ్యుత భరితుండుగా భరతుఁ, డాతని దీటగు వా రిపుఘ్నుఁడున్.

విలసిత సద్గుణాలు సరవిం జెలువొందిన మూర్తులీర, లో
కుల వారి నర్థి వేడఁ బ్రభవించిన కారణ జన్ములీరు, నే
వలఁ గొని, మా సుతావళికి భాగ్యముఁ గూర్చఁగ నిల్చినారు, భూ
తలమున మాతగా, దశరథ ప్రియ భామినులార! చూడఁగన్.

'సునయన' పల్కుచుండు మనసున్ విడమర్చి, 'ప్రభాత సేవలం
గొనకొని శ్వశ్రుపాళి కొనగూర్చెను యూర్మిళ'యంచు; 'భక్తిమ
ఘనముగ నాథసేవ తమకంబున సల్పెను సీత'యంచుఁ బ
ల్కనుగ 'సుమేధ,' 'యిందిర'యు గోఁజుఁగదా శ్రుతకీర్తి మాండవిన్!

భరతుఁడు, పెద్దవానిపయి భక్తిని. పాదుక లంది దీక్షపై
కురులు జడల్ గొనన్, మెయిఁ గూరఁగ ధూళి తతుల్, ధృతిన్, వసుం
ధర శయనించుచున్, దనకుఁ దమ్ముఁడు సాయముగా నయోధ్య, నే
[illegible]రిని నేలువాఁడొ గదా! కష్టభరంబును దాల్చి నెమ్మదిన్.

ఇరువురు సోదరుల్, దితి సుతేంద్రులఁ గూల్చి, లవజ్జగత్ప్రమో
ద్ధరణము సల్పఁగా వలయు. ధర్మము నాలుగు పాదముల్ సదా
చరతిను జన్మమందెను గదా!, మహి ప్రేమతో వారిసామ్యము, స
[illegible]ముల కింత ధర్మనిభయుం దగఁ జూపెడువారు మీ సుతుల్!

[illegible]ంటుటలేని కీర్తి వహియించిన యూర్మిళయోర్పు, వృద్ధసే
వనమును, గష్టసంభరణ భాగ్యము, చెప్పక చెప్ప నామె దై
వ నియతి; శేషశక్తిఁ గొని, పావిత్రముగా ఘటియించ సీధర
[illegible] గాంచినట్లుగ, నిజంబుగ ధన్యులమైతి, మేదినిన్.

భరతుని ప్రేమ, రామజనపాల పరోక్షములో, సుతోర్మిళా
మరగృహసేవ, లక్ష్మణకుమార పరోక్షములో, జగత్ప్రభా
సురమయి, శాశ్వతత్వము విశుద్ధముగాఁ గొని దైవనిశ్చితం
బరమరలేని ప్రేమ [illegible] నాకు సుఖంబొసంగెఁ దా.

తనయులు కానకేగుట వెతన్ ఘటియింప, స్నుషా వియోగమున్
మనసు మెరియింప, భర్త యసులన్ విడుటల్ హృదయంబుఁ జీల్చ, జీ
వనము సుదుర్భరంబుగ, దివానిశలున్ దొరలించి, చిక్కెనో
యిక మిము, శంకరుండు కరుణించుత, నిండుత, శాంతి సంపదల్!

ప్రణతులు ధర్మవృద్ధులకుఁ బంచిన దీవెనలింత చిన్నవా
గ్గుణులకు, రాణివాసమునకున్ శుభపూత సుతాళి కెంతయున్
[illegible] పాత్రులెల్లరు, దిశావలయంబు జయంత్రుగారు! ల
[illegible]

హేళన కవిత

శ్రీ జి. రామమోహనరావు

సామాజిక వికాసం లేక చైతన్యరహితమైన ఈ జగత్తులో అసంతృప్తి పెరిగిపోవుటచే మానవుడు ఆవేశపూరితుడయాడు. తీవ్రమైన ద్వేషాన్ని ప్రదర్శించాడు. రచయితల హృదయాల్లో అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లాయి. సంఘజీవనం కవికి ఆధారమయింది. అతని కనుచూపుతో వస్తువును కదిలించి విప్లవాన్ని సృష్టించాడు. మనసు మారినగాని మనుష్యుడు మారడని భావించి అతని మనస్తత్వంపై ధ్వజమెత్తాడు. అది చివరకు వెక్కిరింత, అధిక్షేపం, పరిహాసం, హేళనగా తయారయింది. సాహిత్యంలో ప్రత్యేక ప్రక్రియగా మారింది. ఈ సాహిత్యపు 'వెక్కిరింత' ద్వారమున రాజుల పరిపాలన, ప్రజల జీవన విధానం మొదలగు వానిని కవులు దుయ్యబట్టారు. కవితలో హేళనతోపాటు హాస్యం ప్రాముఖ్యం వహించింది. కాలం గడిచే కొలది సాహిత్యం కూడ అభివృద్ధి చెందింది. పద్య, గద్య, నాటకాలలో ఆయా రచయితలు నాటి పరిస్థితులను అధిక్షేపించారు.

ఆంగ్లభాషలో ఉన్న SATIRE అను పదానికి తెలుగులో హేళన, పరిహాసం, అధిక్షేపం మున్నగువానిని ఉపయోగింపవచ్చును. హేళన చేసినా, అధిక్షేపించినా, పరిహాసం పాలైనా ఒకరి వెక్కిరింతకు గురి కావలసిందే. పాశ్చాత్య ప్రపంచం యీ రకపు కవితకు రంగస్థల మయింది.

లాటిన్ భాషలో ఉన్న SATIRA అను పదం నుండి SATIRE పుట్టింది. వ్యక్తులను ద్వేషించుటకు, దూషించుటకు ఈ కవిత శక్తివంతమైన ఆయుధంగా పరిగణింపబడింది. వ్యక్తిగతంగా పగదీర్చుకొనుటకు యిది బాగుగా ఉపయోగించింది. కొందరు దీనిని యీ విధంగా నిర్వచించారు.

"Sature, the term applied to any literary form in prose or poetry, which ridicules situation, individuals or ideas. Its purpose is to correct manners and morals through mockery, broad humour, sophisticated wit, harsh invective, parody or gentle irony. It may be humourous or serious but object is generally made to seem rediculous rather than evil."

(The columbia Viking Desu Encyclopedia-Page 1635)

"Satire should like a polished razor, keen wound with a touch that is scarcely felt or seen"

(Lady M. M. Montague)

"Arrows of Satire feathered with wit and wielded with sense, fly home to their mark."

(C. Simmons)

ఎవరెన్ని నిర్వచనా లిచ్చినా కవితోద్దేశం మాత్రం ఏకార్థభావమే. కవిత్వానికి అధిక్షేపం ప్రధానాంగం. దీనికి తోడు సుకుమారమైన, సునిశితమైన హాస్యం మేళవింపబడుటతో పాఠకుల కానంద ప్రాప్తికి హేతువయింది. అర్థాన్ని గ్రహించిన వారు తీవ్రతను గుర్తించి ఆవేశపూరితులై సమాజం గుండెపై నిలబడ్డారు. ఆ అర్థాన్ని గ్రహింపలేనివారు అందులో ఉన్న హాస్యాన్ని చూచి నవ్వుకొన్నారు.

వాడు 'సటైరు' కవితలు వ్రాయుట ఒక సృజనాత్మక కళావిలాసంగా భావించేవారు. గ్రీసు దేశంలో మొదటగా యీ కవితకు జీవన మిచ్చినవాడు ఆర్చిలోకస్ (Archilochus). ఇతని రచనలో వ్యక్తిగతమైన విద్వేషం, సామాన్య పౌర జీవితంతో విసుగు చెందిన ఆత్మక్షోభ ప్రముఖంగా కానవస్తాయి. సిమనిడెస్ (Simonides) హిపోనాక్సు (Hipponax) వీ రిద్దరు ఆర్చిలోకసుతో సరితూగగల కవులు. వీరి కవిత భిన్నత్వంలో ఏకత్వం సాధించింది. సిమనిడెస్ రచనలో బలీయమైన సంస్కార భావం గోచరిస్తుంది. హిపోనాక్సు భావంలో ఉత్సాహవంతమైన ప్రోత్సాహం దర్శన మిస్తుంది. వీరందరు రాజకీయ ప్రపంచంలో యేర్పడిన అవినీతిని, సంక్షోభాన్ని యెదుర్కొనుటకు సంసిద్ధమయారు, హిపోనాక్సు కవితలను తరువాత వారు అనుకరించుట ప్రారంభించారు. ఇతడు నాటిన కవితాబీజములు ఫలవంతములైనవి. హేళన అనునది కేవలము పద్యమునందు మాత్రమేగాక నాటకములందు చూపబడినది. అరిస్టాఫేన్సు నాటకాలలో సెటైరుకు తగిన ప్రాధాన్యం లభించింది.

ఇటలీ దేశంలో ఈ ప్రక్రియ చాలకాలం నుంచి ఉన్నట్లు తెలియుచున్నది. అయితే అది **Fescennine verse** లో ఉండేది. తరువాత అదే రోమను సాహిత్యంలో స్థిరస్థానమును పొందింది. ఈ ప్రక్రియకు ఊపిరి యిచ్చినవాడు గేయూస్ లూసిలియస్ (**Gaius Lucilius**) అనువతడు. క్రీ. పూ. **148—103** ప్రాంతమునందు తన కవితకు ప్రారంభోత్సవం సల్పాడు. ఇతని కవితలను హోరెస్ సిసిరో మున్నగు వారు బహుధా కీర్తించియుండిరి. లూసిలియస్ వారసుడుగా హోరెస్ బయలుదేరి ప్రపంచ దృక్పథాన్ని తన దృష్టిలో సమన్వయించుకొని కవితలు ప్రచారం చేయుటం ప్రారంభించాడు. కవిత్వంలో వేదాంతం ప్రాధాన్యం వహించింది. ఇతని తరువాత జువెనల్ (**Juvenal**) వచ్చాడు. అలంకారికమైన పద్ధతి రచనలో చూపించాడితడు. ప్రతిపదంలో విషాదం కానవచ్చుటచే ఇతనిని విషాదాంత కవిగా నాటివారు పిలిచేవారు.

నాల్గవ హెన్రీ ఫ్రెంచి దేశాన్ని పాలిస్తున్నప్పుడు ప్రజల్లో అసంతృప్తి చెలరేగింది. ఈ అలజడికి కొందరు తట్టుకోలేక ఒక సంఘంగా యేర్పడ్డారు. వారందరూ కేథలిక్కులు గావటం చేత తమ సంఘానికి కేథలిక్ లీగు అని పేరు పెట్టారు. అందులో లెరో, గిలెట్, పసరత్, రాఫిన్, చెరిస్టిన్, పిటో, డురెన్టు మొదలగు వారు (**Leroy, Gillot. Passerat, Rapin, Cherestion, Pithou, Durant**) సభ్యులు. వీరందరూ హెన్రీపై తిరుగుబాటు వేశారు. హెచ్. వి. మోలియరు తన నాటకాల్లో పాత్రల ద్వారమున నాటి సంఘంపై తిరుగుబాటు చేయించుటకు పూనుకొన్నాడు. పదియేడవ శతాబ్దమున బయలుదేరిన రచయితలు తమ కవితల్లో హేళనను అధికంగా చూపించారు. దీనివలన వచన రచనకు ప్రౌఢిమ లభించింది. పదునెనిమిదవ శతాబ్దం వచ్చుసరికి విప్లవవాదాలు హెచ్చు పెరిగాయి. పెయిరీ బెయిలీ అనే రచయిత ఆనాటి ప్రజలయొక్క మతాచారములను, నీత్యుపదేశాలను ఖండించాడు. ఆ తరువాత ప్రజల దృష్టిని ఆకర్షించినవాడు వాల్టేయిర్; సాహిత్యాన్ని ఒక సాధనంగా గ్రహించి రచనలు చేశాడు. ఇతనికి రూసో, మాంటెస్క్యూ వంటివారు తోడ్పడ్డారు. అతని దీర్ఘకాలంలో వివిధ రచనలు చేసినను అందులో వ్యంగ్యం తొంగి చూచింది. ఈ రచనలందు ప్రజాదృష్టియేగాక భావ తీవ్రత అధికంగా కానవస్తుంది. ఆయా రచయితలు సాగించిన సాహిత్య సమరం ఎల్ల సామాజిక చైతన్యం కలిగి ఫ్రెంచి విప్లవానికి కారణమయింది.

జర్మను సాహిత్యంలో యెక్కువగా ఫ్రెంచి సాహిత్యపు పోకడలు గోచరిస్తాయి. మోలియర్ ప్రభావం జర్మను సాహిత్యంపై బలీయమైంది. లెస్సింగ్ అనునతడు నైతిక సిద్ధాంతాలపై ధ్వజమెత్తాడు. మతపరంగా ఉండే అసహనాన్ని అధిక్షేపించాడు. గోథె భావాలు కూడ చాల తీవ్రంగా ఉండేవి. హెయిన్ కూడ గోథేతో భావతీవ్రత విషయమున సమానంగా ఉండేవాడు. కాని కొన్ని సందర్భాలలో హెయిన్, లెస్సింగ్, గోథేల కన్న మించిఉండేవాడు. ఇతడు ఆనాడు మహానుభావులుగ పరిగణించిన వారిని నిరసించాడు. అయితే యీ నిరసన కొంతమందికి నచ్చలేదు. అయినను తన విమర్శమాత్రము మానలేదు. అతని ధోరణి చాల తీవ్రమైనది కనుకనే ప్రసిద్ధులను బహిరంగంగా యెదుర్కొన్నాడు.

రష్యాలో సమాజాన్ని అన్ని కోణాల నుండి చూచి విమర్శించుటకు పూనుకొన్నవారిలో గొగోల్, టాల్‌స్టాయి, జోస్టావస్కీ ప్రధానులు. వీరి కవితావస్తువు శార్మిక జీవనం. వారి జీవిత సౌభాగ్యాన్ని తీర్చి దిద్దలేని వారిని దూషించారు.

అమెరికాలో జేమ్సు రస్సెల్, వాషింగ్టన్ ఇర్వింగ్, మార్కు ట్వైన్, పీటర్ డూన్ మొదలగువారు అధిక్షేప కవితలు వ్రాసి తగినంత ప్రచారం తెచ్చారు. ఇంతేగాక స్పెయినులో సెర్వాన్టెస్, నార్వేలో ఇబ్సన్, స్వీడన్‌లో స్ట్రిన్ట్స్‌వెర్గ్, కెనడాలో పాన్‌సిల్, జెకోస్లోవేకియాలో కీసక్, నెరిక్ మున్నగువారు ఆయా భాషల్లో హేళన కవితకు స్థాన మిచ్చి దాని వ్యాప్తికి తోడ్పడ్డారు.

ఆంగ్ల సాహిత్యంలో చాసర్, లాంగ్‌లాండ్ కవులు ఆనాడు క్రైస్తవ చర్చీలందు జరిగే అవినీతిని, అధర్మాన్ని, అన్యాయాన్ని సూటిగా యెదుర్కొన్నారు. రచనలు తదనుగుణంగా సాగాయి. ఎలిజబెత్ కాలంలో అదీ ఇదీ అనకుండ తమకు అసంతృప్తి కలిగించే ప్రతి విషయాన్ని ఆధారం చేసికొని రచించారు. పదునెనిమిదవ శతాబ్దంలో ఆవిర్భవించిన సాహిత్యం అధిక్షేప కవిత్వానికి ప్రాధాన్య మిచ్చింది. అందువల్ల దానిని అధిక్షేప కవితాయుగంగా పేర్కొన్నారు. డ్రైడెన్, పోప్, ఎడిసన్ మున్నగువారు యీ కవితలతో నూతనలోకాన్ని సృష్టించారు. ఛందస్సులో క్రొత్త రీతులు చూపించారు. ఆంగ్ల రచయితలను యితరులు అనుసరించినను అనుకరణగానే ఉన్నదిగాని సృజనాత్మకంగా కాన్పించలేదు. ఈ శతాబ్దంలోనే, ప్రసిద్ధుడైన బైరన్ భావచైతన్యం రావాలని వీక్షించాడు. పందొమ్మిదవ శతాబ్దంలో లాంబ్, డబ్ల్యు. యస్. గిల్బర్ట్, థాకరీ వీరందరూ అధిక్షేపక కవులుగా కీర్తింపబడ్డారు. థాకరీ రచనలు తీవ్రమైనప్పటికిని ఒక జాతిని ఉద్దేశించి దాని యొక్క బాగోగుల కోసం నిలబడినవాడు. **1841** లో ప్రారంభమైన "PUNCH" అనే పత్రిక యీ రకపు కవితకు బహుళ ప్రచార మిచ్చింది.

ఇరువదవ శతాబ్దంలో హేళనను ఆధారంగా గ్రహించి కవితలను వ్రాసినవారు చాలమంది ఉన్నారు. అందులో షా, చెస్టర్‌టన్, ఇ. వి. నాక్సు, ఎ. పి. హెర్బర్టు ముఖ్యులు. యూరపు దేశంలో బయలుదేరిన కవితలకు సాంఘిక విషయాలకంటె రాజకీయ విషయాలు ఆధార మయాయి.

సంస్కృత వాఙ్మయమునందు ఈ కవితా చిహ్నములు గలవు. ప్రాచీన వాఙ్మయ స్వరూపాలైన వేదములు, ఉపనిషత్తులు, సూక్తములు, వీనియందిట్టి చిహ్నము లున్నవి. అంతేగాక భాణములు, చాటుశ్లోకాలు, శతకములు వీనియందు పరిహాసపు ఛాయలు గలవు.

తెలుగులో శతక వాఙ్మయమునం దచ్చటచ్చట హేళనతో కూడిన పద్యములు గలవు. పదునెనిమిదవ శతాబ్దమున స్వదేశ సంస్థానాధిపతులు వారిపై అధికారులైన నవాబులను లక్ష్యపెట్టక ప్రజలను పీడింప దొడగిరి. అట్టి రాజుల దుర్నీతిని నిరసించుచు వెలువడిన శతకములు గలవు. అందులో ముఖ్యమైనవి అడిదము సూరకవి రామలింగేశ శతకము, కూచిమంచి తిమ్మకవి కుక్కుటేశ్వర శతకము. ఈ శతకములందు దుష్ట ప్రవర్తన గలవారిని దూషించారు. తిమ్మకవి రాజులను హేళన చేయుటలో వెనుకాడలేదు. ఈ శతకమునందు లోకమునకు నీతి బోధించి సమాజాన్ని సంస్కరించాలను కాంక్ష కన్పించును. అడిదము సూరకవి శతకము కూడ యింతే. ఇతడు శాపానుగ్రహ సమర్థుడు. వీరికన్న పూర్వంలోనే కావ్యంలో పరిహాసపు పద్యాలున్నవి. శతక కవులు పూర్వుల పలుకబడిని గ్రహించారు. వారి ప్రభావం శతక కవులపై నెలకొన్నది.

ఆధునిక సాహిత్యంలో అధిక్షేపక సాహిత్యం వ్యాప్తి చెందింది. ఆంధ్రదేశపు పరిస్థితులు దారుణంగా తయారయాయి. వ్యక్తిత్వంలో స్వేచ్ఛపోయింది. జీవన విధానం అంధకారబంధురమైంది. ప్రజలకు భీతి అధికమయింది. కాలం కుంచించుకొని పోయింది. సాంఘికాచారాలు మానవుల మధ్య దోబూచులాడుకొన్నాయి. కందుకూరి అవతరించాడు. గురజాడ కన్యాశుల్కం ప్రారంభమైంది. గడుగు పిడుగులా గర్జించాడు. ఈ కాలంలో కవితకు కావలసినంత పరిధి యేర్పడింది. కందుకూరి తన సిద్ధాంత ప్రతిపాదన చేయుటకు ప్రహసనాలు స్వీకరించాడు. అందులో నాటి పెద్ద మనుష్యులను, వారి పనులను ఆక్షేపించారు. తిరుపతి వెంకటకవులు దేశంలో సమున్నతస్థానం ఆక్రమించారు. అవధాన సందర్భంలో వారు ప్రదర్శించిన ఎత్తిపొడుపులు మరపురానివి. రాజులు — ప్రజలు అనే భేదం లేకుండ తమ పరిహాసాస్త్రాన్ని ప్రయోగించారు. నాడు అనేకులు ఆక్షేప కృతులు వ్రాసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

అభ్యుదయ కవులు సమాజాన్ని బాగుచేయాలనే తలంపుతో సాంఘిక వ్యవస్థపై కసిబూని నానా విధాలుగా వెక్కిరించారు. మానవుడు పెరగక క్షీణింపటం మొదలు పెట్టాడు. రాజుకు రాజ్యమే గాని రాజ్యంలో ఉండే జనులు అతని దృష్టికి కాన్పించలేదు. పాలకుల దుష్టచర్యలు భరింపలేక పోయారు. పరిస్థితులు ఆవేశాన్ని పురికొల్పాయి. కవిత దూషణతిరస్కార భావావేశంతో బయటకు వచ్చింది. కవులు ఆరాధించారు దానిని.

ఈ కవితను ఐదు భాగాలుగా విభజించుకొనవచ్చును. అవి సాంఘికము— రాజకీయము— ఆర్థికము— మతము— సాహిత్యము. ఈ వ్యాసంలో నవ కవితను పై విభాగాలతో సమన్వయించుటకు ప్రయత్నించెదను.

సాంఘికము :—ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణ అవసరమయింది. సాంఘిక దురాచార నిర్మూలనమునకు పంతులుగారు కంకణబద్ధులయారు. అవినీతిని బహిరంగపరచి నీత్యుపదేశం చేయాలని సమకట్టారు. అందుకొరకు రచనను సాధనగా గ్రహించారు. దేశాభివృద్ధికి తమ సాహిత్యాన్ని వినియోగించారు. బాల్యవివాహముల నరికట్టి, వితంతు పునర్వివాహాలు జరిపించారు. ప్రహసనములు రచించి నాటి సాంఘికాచారములపై దుమారం రేగించారు. దేశం నలుమూలల వారి ప్రహసన విషయ ప్రభావం గోచరించింది. చిలకమర్తి, పానుగంటి మొదలగువారు తమ రచనలచే సంఘాన్ని పరిపరి విధాల పరిహసించారు. జీవితమునందు పడరాని పాట్లు బడి గతకాలమునందు జరిగిన మంచి అల్పమని భావించి నూతన జీవన ప్రగతికి అహోరాత్రాలు మానవుడు తపించిపోయాడు. మూఢవిశ్వాసం కల్గిన వ్యక్తి సంఘంలో తానేది చేసినా గొప్పదని తలంచి సమర్థించుకొనుట ప్రారంభించాడు. నానాటికేది పెరిగి అసంతృప్తి, అసహనంగా మారిపోయింది. ప్రజాజీవనాన్ని ప్రతిబింబింప చేయటం కవుల కర్తవ్యం గనుక ప్రతి అక్షరంలో విమర్శ చూపించారు. పంతులుగారి ప్రతి రచనలో తీవ్రమైన తిరస్కారం కాన్పిస్తూనే ఉంటుంది.

దాసు శ్రీరాములు దేవీభాగవతమును తెనిగించిరి. అభిజ్ఞాన శాకుంతలాది నాటకములను ఆంధ్రీకరించిరి. వీరు తెలుగునాడు అను కావ్యమును రచించిరి. కావ్యమునందు నిందాపూర్వకమైన హేళన పొడగట్టును. నాటి వైదిక బ్రాహ్మణులను, వారి పద్ధతులను అవహేళనచేశారు,

లేవరు లెండు లెండనిన లేచిన వారయినం దటాలునం
బోవరు పోవచున్నిలిచి పోదుము పోదుము త్రోయకుండటం
చీ వరు సందు సేస్తు నలయింతురు పెండిలిలో సదస్య సం
భావనవేళ జూడవలె బాపన సాములు సాములన్నియున్.

కేవలము వారి ఆచార వ్యవహారములను నవ్వులపాలు జేయుటయే గాక వారి భాషను కూడ అధిక్షేపించారు. ఈతని కవితను, అందున్న విషయమును చెళ్లపిళ్ళ వెంకటకవిగారు లోకానుభవ వ్యంజక మని ప్రశంసించారు.

1892 లో ఆచంట వెంకట సాంఖ్యాయన శర్మగారు కల్పలతా సంపుటి ప్రచురించిరి. సంఘ సంస్కరణము అను ఖండికయందు మృదువుగా వెక్కిరించారు నాటి పురుష పుంగవులను—

మగువలకెగాని చప్పాలు మగల కేంచు
పాడమవనువహాట అన్నియు బహాటకములు
పురుషులిక విూద స్త్రీత్వంబు పొడముచున్న
దొమ్మ సవరించుకొనుట భాగ్యమ్ముకాదె.

సంస్కరణ దృష్టితో వారు సంఘాన్ని పరిహసించక తప్పలేదు. స్త్రీ స్వాతంత్ర్యం రావాలని అపేక్షించిన వారగుటచే సంఘంలో ఉండే అశక్తతను వివరించకుండ ఉండలేక పోయారు.

దేశంలో ఆంగ్లభాషపై మోజు కలిగింది. దాని విూద ఉండే అభిమానం కొలది మాతృభాషలను మరచిపోయే ప్రవమాదం వాటిల్లింది. కాని ఒక మంచి ప్రయోజనం ప్రాప్తించింది. ప్రాచ్య భాషా పండితులు సహితము ఆంగ్ల భాషాధ్యయనం ప్రారంభించారు. విద్యాసంస్థలు నానాటికి పెరిగి పోయాయి. ఆ భాషా ప్రభావం నుండి తప్పించుకొను టసాధ్యమైనది. దీనికి తోడు క్రైస్తవ మిషనరీల ప్రాబల్యం పెరిగింది. ఆరోజుల్లో ఆంగ్ల భాష నేర్చిన వ్యక్తికి సంఘంలో కావలసినంత పలుకుబడి ఉండేది. ఆ భాష ముందు ఏ భాష కూడ నిలబడటానికి సాహసింపలేకపోయింది. ఇంగ్లీషు భాషా వ్యామోహమును అపహేళన చేయుటకు పూనుకొన్నారు దాసు శ్రీరాములుగారు.

............తెలుంగు బాస మంచిది
మనపిల్లకాయలు పఠించెడు ఇంగిలిపీసు పుస్ పుసస్
పెదవుల దాటదెంతటి యొషేయు బియే యెమియె పఠించినన్

అయితే దీనికి వ్యతిరేకంగా గురజాడ అధిక్షేపించారు. భాషతో ఉన్న శక్తిని సమనించక మాట్లాడిన వారికి సమాధానంగా—

కప్పుకావని వస్తుతత్వము
కాంచనేర్చరు లింగిరీజులు
కల్లనొల్లరు; వారి విద్యల
కరచి సత్యము నరసితిన్

లవణరాజుకల లో అప్పారావుగారు ప్రాచీన వర్ణాశ్రమ ధర్మాన్ని తిరస్కరించారు. కులాన్ని బట్టి అధములు అగ్రజులను విధానం సంఘంలో బయలుదేరింది. గుణం కంటె కులమే ప్రధానంగా పరిగణించారు. ఆ హీన స్థితిని చూచి సహించక—

మలినదేహుల మాల లనుచును
మలిన చిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణధర్మ మధర్మ ధర్మంబె.

అని భేదము మాత్రం కులాన్ని బట్టిగాక మనసును బట్టి నిర్ణయించాలని ప్రతిపాదించారు.

ప్రాపంచిక స్థితులు మారిపోవడంతో కవులు కూడ నూతన పరిస్థితులను పరిశీలించి సామాజిక దృష్టికి పదను పెట్టారు. వర్గసంఘర్షణ సిద్ధాంత ప్రాబల్యంచే మానవుడు భౌతికంగా, మానసికంగా మార్పు చెందుటకు ప్రయత్నించాడు. అభ్యుదయవాదులు తమ ఆదర్శాలను నలుమూలలకు, వ్యాప్తి చేయాలని సంకల్పించి ప్రేళ్ళూనిన వ్యవస్థపై తిరుగుబాటు చేశారు. వారి మార్గానికి అడ్డువచ్చిన వారందరిని జుగుప్స, ద్వేషం, హేళనలతో యెదుర్కొన్నారు.

ప్రతినిత్యం ఫ్యాక్టరీ
కూలీ యెముకలనెన్నో
సున్నంగా చిదుకగొట్టి
రక్తంతో రంగరించి
ధనస్వామి పాదమ్ముల
పారాణిని పూస్తున్నది. [సోమసుందర్—వజ్రాయుధం]

రాజకీయము :—పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రామికుల పాలిట రాబందువు, నిరంతరం శ్రమించే కార్మికులు దేశానికి వెన్నెముక. కార్మికులు రాల్చిన ఘర్మకణాలను పీల్చి సంపద సంచులను పాతరులు వేసారు.

గాంధీయ దృక్పథంలో విశ్వమానవప్రేమ—కరుణ తొంగి చూచాయి. వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్య మియ్యబడింది. అహింస పరమధర్మంగా భావింపబడింది. శాంతిస్థాపనకు ప్రశాంత జీవితమున కివి తప్పక కావలసిందే. ఇంటింట స్వాతంత్ర్య గీతము లాలపింపబడ్డాయి. అందరాని ఫలం అందింది. జీవితంలో తెలియరాని నూతనత్వం ప్రవేశించినట్లనిపించింది. అంధకారంలో మునిగిన వారు ఒక్కసారి వెలుగును చూడగానే ఉత్సాహంతో పొంగిపోయారు. వ్యక్తి స్వేచ్ఛ ప్రారంభమైన నాటినుండి మానవుడు కలలుకంటూ వచ్చాడు. కాని ఆ వ్యక్తి స్వేచ్ఛ పేరిట సమాజాన్ని దోచుకోవటం ఉత్పన్నమయ్యింది.

పాశ్చాత్య దేశాల్లో ఎక్కడ చూచినా తిరుగుబాటే. పెట్టుబడిదారీ వ్యవస్థ నమ్మించి మోసం చేసింది. సామ్యవాద వ్యవస్థ ఆరంభమైంది. మార్క్సు సిద్ధాంతాలు ప్రపంచదేశాల్లో మారుమోగాయి. గతితార్కిక భౌతిక వాదానికి హెగెల్ ప్రాణప్రదాత. అయినా మార్క్సు కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. ఆ సిద్ధాంతంలో వర్గసంఘర్షణ ముఖ్యమైంది. సంఘర్షణ వల్లనే చైతన్యం వస్తుందని చెప్పాడు. వాడు ప్రపంచంలో, పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రాబల్యముంది. దీనితో గతితార్కిక భౌతికవాదం పోటీపడటంతో సమాజంలో నూతన వికాసం కలిగినట్లుగానే ఉన్నది.

పెట్టుబడిదారీ విధానాన్ని కార్మికవర్గం ప్రతిఘటించింది. కార్మిక సమాజంలో చైతన్యమువికసించింది. మార్క్సు, లెనిన్ బోధించిన సూత్రాలు ప్రపంచంలో ప్రచారానికి వచ్చాయి. ఆ ప్రభావానికి మానవులు లోనయ్యారు. కవులు కన్నులు విప్పి చూచారు. కలం బట్టి కవిత వ్రాయటం మొదలు పెట్టారు. ఈ కవితకు శ్రామిక జీవనం ముఖ్యం. అలజడి ప్రాణం, ఆందోళన ఊపిరి, తిరుగుబాటు వేదాంతంగా గ్రహించి అభ్యుదయ పథానికి అడుగువేసి నడవాలని అభ్యుదయ కవులు విప్లవ శంఖం పూరించారు. వారు సామాన్య మానవుడిని దృష్టిలో ఉంచుకొని అతనికి స్థానమిచ్చి కవిత చెప్పారు.

1870—75 వ ప్రాంతమున నున్న పోలిపెద్ది వెంకటరాయకవి వేణుగోపాల శతకమును వ్రాసెను. ఇతడు రాజులను మంత్రులను రాజోద్యోగులను విమర్శించుటయే గాక ప్రభువుల కాశ్రయమున నున్నవారిని తీవ్రంగా ఎదుర్కొన్నాడు. సంఘంలో నిరంతరం జరుగుచున్న అన్యాయములను,అక్రమములను విరసించాడు. గ్రామానికి పెద్దలైన వారు వీరి దృష్టి పథం నుండి తొలగలేకపోయారు. వారిని కూడ నానావిధాలైన పరిహాసాలు చేశాడు.

తిరుపతి కవులు ఆంధ్రదేశంలో ఏ ఆస్థానంలో కూడ అవధానాలు చేయకుండ ఉండలేదు. తమకు నచ్చకపోతే వెంటనే ఆయా వ్యక్తులను నిరసించేవారు. ఒక పర్యాయం ఆత్మకూరు సంస్థానంలో వీరి కన్యాయం జరిగింది. రాజు న్యాయం చెప్పకుండ సభనుండి వెళ్ళిపోయినందుకు కవులు రాజును హేళన చేశారు.

జమిందారుల పాలన అంతమయ్యింది. ప్రజాతంత్ర పరిపాలన వచ్చింది. ప్రజారాజ్యంలో ప్రజలకు సంపూర్ణాధికారం ఉన్నది. పాలకుల నిర్ణయాలు ప్రజల కనుకూలంగా లేకపోతే ఆ ప్రభుత్వాన్ని ఏదైనా చేస్తారు. రాజకీయ పరిస్థితులు ప్రజలను కలవరపరచాయి. సామ్యవాదం సామాన్యుని చక్కదిద్దుతుందనే ప్రచారం అభ్యుదయ కవులు మొదలుపెట్టారు. ఈ కవులకు రాజకీయంగా అసంతృప్తి పెరిగింది. ఆవేశం ముందుకు నడిపించింది. శ్రీశ్రీ, మల్లారెడ్డి, ఆరుద్ర, నయాగరా కవులు దేశంలో జరిగే రాజకీయాలను విరసిస్తూ కవితలు వ్రాసారు.

వీరందరికీ మనుష్యుడే సంగీతం—మానవుడే సందేశం.

అమరవీరుల త్యాగ ఫలితంగా ఆంధ్రరాష్ట్రం మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి ప్రత్యేక స్థానం సంపాదించుకొన్నది. మనమంతా ఒకటే అనే నినాదం వాడవాడల మారుమోగింది. పదవుల కోసం ప్రాకులాడే వాళ్ళ మనస్తత్వాలు

భస్మాసురహస్తంగా తయారయ్యాయి. నాయకత్వం కొరకు కీచులాటలు వచ్చాయి. స్వార్థం కోసం నడుంకట్టిన నాయకులను—

రాష్ట్రంలో రాజకీయ
మర్కటాల కర్కటాల
సర్కస్ ఫీట్లు, పందెపు
కుక్కుటాల పోట్లాటలు

అని నిరసించి అవహాస్యంచేసాడు శ్రీశ్రీ. నోరు మెదవలేని కుక్కుటాలు పోట్లాడుకున్నాయంటే కొంతవరకు సమర్థించుకోవచ్చును. కాని నోరున్న తెలివితేటలున్న ఈ కుక్కుటాల పోట్లాటలు చూస్తుంటే యివి రాజకీయ మర్కటాలంటూ శ్రీశ్రీ యీసడించాడు.

ప్రాసక్రీడలు శ్రీశ్రీ రచన. ఇందులో తన దృష్టికందిన వారిని హేళన చేశారు. కాంగ్రెసు పాలనతో విసుగు చెందిన కవి—

కాంగ్రెసు కింకా యెందుకు
కాయకల్ప చికిత్స
దానిపేరు చెబితేనే
మేరలేని జుగుప్స

అని తీవ్రంగా వెక్కిరించారు. అయితే వారే ప్రాసక్రీడల్లో నేను పేరాకోళం చేసిన నాయకులనే ఇప్పటికీ అంటిపెట్టుకొని ఆరాధించేవారూ, నా రచనలవల్ల ఆశాభంగాన్ని గాక అవమానాన్ని కూడ పొంది యాతన పడేవారూ ఆంధ్రదేశంలో ఇంకా అక్కడక్కడ ఉంటున్నారని అన్నారు. ఇందులో కూడ వ్యక్తిగతంగా వ్యంగ్యంగా విమర్శించటమే అయింది. అభ్యుదయవాదులకు వారూవీరూ అనే తారతమ్యం లేదు నిరసనలో.

నాగరికత పెరిగిన కొలదీ మానవుడు దిగజారుతున్నాడు. మనసులో కల్గిన అభిప్రాయానికి నిలకడ లేదు. మాటల్లో పొందిక లేదు. ప్రవర్తనలో ఋజుమార్గంలేదు. మంచి చెడు నిర్ణయం మంట కలసింది. కాలం చరచరా సాగిపోతున్నది. ఈ మానవుడు ముందుకు పోతున్నాడు. ముందుకు పోతున్నాడంటే ఎదుటి వ్యక్తిని ఎలా హతమార్చాలనే సన్నాగం సన్నుతున్నాడు. చర్చలు, మొదలు పెడతాడు. చివరకు దానికి పరిష్కారం లేకుండానే ముగింపు చేస్తాడు. ఈ లోకం నిత్యం కుటిలత్వానికి గుర్రైపోయింది. ఎక్కడ చూచిన ఈర్ష్య అసూయలు ప్రత్యక్షమవుతున్నాయి. మనుష్యుడు మనుష్యుణ్ణి గుర్తించలేకపోతున్నాడు. ప్రపంచమే ప్రళయహోమానికి నడుం కట్టినప్పుడు పౌరుడు మాత్రం ఏమి చేయగలడు? నిరంతరం ఉదరపోషణార్థం మానవుడు కష్టిస్తూనే ఉన్నాడు. అయినా తనకు తగిన ప్రాప్తి లేదు. దానికి కారణం రాజకీయాలది. ఆ రాజకీయాలను సృష్టించిన నాయకులది. ఆ నాయకులను కన్న ప్రపంచానిది. ఇట్టి దారుణ పరిస్థితిని చూచి ఎవరు సహింపగలరు?

వల్లారిన శ్మశానంలా ఉంది.
దట్టంగా పొగ్రక్రమ్మిన రాజకీయం
ఎని వికృత రూపాలు ధరిస్తుంది.
మనిషికి మానవుడు కన్పించుటలేదు
ఎన్నోయుగాలు వెలిగించిన సంస్కృతి
ఇప్పుడు వెలిగిస్తూంది శ్మశానాన్ని
ఇది ఈనాటి ప్రపంచ చిత్రం.

(యుగసంకేతం—మాదిరాజు రంగారావు)

పొగ్రక్రమ్మిన రాజకీయాల్లో మన నాయకులు దెబ్బలాడుకొంటున్నారు. తిన్న యింటికే వాసాలు లెక్కపెడుతున్నారు. అంధకారం వైపుకు ప్రజలను మరలిస్తున్నారు. పార్టీల కుంచెలు గీస్తున్న పగటి కలల బొమ్మల్ని చూసి ప్రజల హృదయాలు ఏడ్వలేక నవ్వుకుంటున్నాయి అంటూ నారాయణరెడ్డి చిన్న మందహాసం చేశారు. నేటి పాలకవర్గాన్ని వీరు ఘాటుగానే విమర్శించారు. పాలకుల చేతుల్లో పాలితులు హతమయ్యే స్థితి వచ్చింది గనుకనే పాలకవర్గంతో పరిమళిస్తున్న కుళ్ళు బియ్యంలో వియ్యమందే పురుగులాళ్ళు, పాలతో తాదాత్మ్యం చెందే పంపునీళ్ళు, పట్టపగలే గుచ్చుకుంటూన్న చీకటి ముళ్ళుగా ఊపడించారు.

ఆర్థికము :—బ్రిటిష్‌వారి కాలంలో మానవుని నాటు జీవితాని కేమాత్రం లోపం లేకుండా జరిగిపోయింది. వ్యయానికి తగిన ఆదాయం, ఆదాయానికి తగిన వ్యయం సమంగానే ఉండేది. ఆ రోజుల్లో మానవుడు నేటి మానవుని కంటే ఆర్థిక విషయంలో హాయిగానే ఉన్నాడు. స్వపరిపాలన వచ్చింది. సామ్యవాదం భారతదేశానికి తెచ్చారు. మొదట చెప్పిన మాటలు బాగానే ఉన్నాయి. కాని ఆ మాటల ఆచరణ సాధ్యం కాలేదు. సామాన్యుని జీవితం దుర్భరంగా తయారయింది. కార్మికుడు నిరంతరం శ్రమించే సంపాదన పొట్టగడపటానికే తప్ప మరేం మిగలటం లేదు. అదేమంటే—దేశంలో జనాభా పెరిగిందని కుంటిసాకులు చెబుతున్నారు. ప్రణాళిక లేర్పరచినా దేశంలో ఆర్థిక స్థితి మెరుగు కావడంలేదు. చదువుకొన్నవారిసంఖ్య పెరిగిన కొలది నిరుద్యోగ సమస్య అధికమయింది. పేదవాడు నిరుపేద అవుతున్నాడు. ధనవంతుడు కుబేరుడవుతున్నాడు. అభ్యుదయ కవులు ఈ పరిస్థితిని చూశారు. కార్మిక శ్రేయస్సే దేశాని కాధారం అని నీతిబోధ చేయటం ప్రారంభించారు.

దేశంలో భారీపరిశ్రమలు స్థాపించారు. అయినా సమస్యకు పరిష్కారమార్గం కానరావటం లేదు. రూపాయి విలువ తగ్గించారు. దానివలన ప్రయోజనాల కంటె అప్రయోజనాలే సిద్ధించాయి. రోజుకొక సిద్ధాంతం ప్రతిపాదిస్తున్నారు. ఎన్ని ప్రతిపాదించినా లోటు లోటుగానే ఉంటున్నది. ఈ అన్యాయాన్ని ఈ విధంగా పరిహసించారు—

భారీ వ్యాపారంలో మేరలేని ఆదాయం
లెక్కల్లో కెక్కందని దిక్కులేనకీభక్తుడు
తరుణోపాయమ్ము కొరకు తిరువామం తీర్చినాడు
పాలపాడుం కోటాలో పలురకాల పర్మిటులు
వేటలోన ఇతగానికి వేనవేలుముట్టాయట.

ప్రతివస్తువు ధర పెరిగింది. సంపాదించినవాడు సంపాదించినా బురలో వెనుతిరిగి చూచుకొంటూనే ఉన్నాడు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని కవి—

ధరలు చుక్కల జేరినాయని
పరిహసించుట వెకిలితనమోయి
దేశ సౌభాగ్యాభివృద్ధిని
తెలుసుకొను మాత్రమ్మదేనోయ్

అని చమత్కారంగా నిరసించాడు. ధరలు పెరగటమే దేశసౌభాగ్యానికి చిహ్నమట. అయితే ధరలు పెరిగాయని పరిహసిస్తే వెకిలితనంగా ఉంటుందట. అవును.— ఈ లోకంలో అంతకన్న మిగిలిందేమిటి? ఈ ఆర్థికరంగాన్ని చూచి కవులు నిరసించారనటానికి యింతకంటే ఏం కావాలి?

మతము :— భారతదేశంలో ఉద్భవించినన్ని మతాలు మరే దేశంలో పుట్టలేదంటే అతిశయోక్తిగాదు. ప్రాచీనకాలం నుంచి నేటి వరకు మతానికీ మానవునకు మధ్య విడదీయరాని సంబంధం పెనవేసికొని పోయింది. మతంతో ఆచారాలు వ్యవహారాలు వచ్చాయి. మానవునకు మతం ప్రధానం. మతానికి ధర్మం అవసరం. ధర్మసాధనకు నిరంతరం మతాచార్యులు అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు. మానవునిలో మతదృష్టి వికసించటంతో మనసు క్షీణించటం మొదలిడింది. భగవంతుని సృష్టిలో అందరూ సమానమైనా మానవులే తమ మధ్య అంతరా లేర్పరచుకొన్నారు. ఒకరినొకరు తీవ్రంగా ద్వేషించుకొని దూషించుకోవటం వరకు వచ్చింది. తాను కల్పించిన మతమే తనపై అధికారం వహించింది.

భారతదేశంలో ఆంగ్లభాషా ప్రాముఖ్యంతో క్రైస్తవ మిషనులు వచ్చాయి. ప్రజలా మతాన్ని గూర్చి విన్నారు స్వీకరించారు. ఆ మతానికి ప్రోత్సాహం లభించింది. క్రైస్తవ మత ప్రవేశంతో హిందూమతాని కాటంకా లేర్పడ్డాయి. వంగదేశంలో రాజా రామమోహనరాయలు హిందూమతంలోని దురా

వారాలకు వ్యతిరేకంగా బ్రహ్మసమాజ మతం స్థాపించాడు. హిందువులకు ప్రధానమైన విగ్రహారాధననే ఈ మతం నిరసించింది. ఆంధ్రదేశంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి వారు ఆదరించి ప్రచారం చేశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి వారు కవితలే వ్రాశారు. అభ్యుదయ కవులకు భగవంతునిపై భక్తి లేదు. మతదృష్టి లేనివారు భగవంతుని నమ్మలేరుకదా. ఇంకెవరు లేనట్లుగా తమ స్వాములనే భక్తిపురస్సరంగా కీర్తించుకొన్నారు. ప్రాచీన కవులకు ఆధునిక కవులకు మతదృక్పథంలో కనుగొనలేని అంతరమున్నది. భావకవుల్లో అభ్యుదయం కొంచెం కన్పించి కనుమరుగయింది.

సన్మార్గుడైన రాజు మరణించినపుడు కవులు సృష్టికర్తను నిందించారు. ఆనందంలో పొంగిన కవి నిందించటం చిత్రంగానే ఉంటుంది. ఇబ్రహీమను పేరుగల మల్కిభరాముడు పరలోకయాత్ర చేసినపుడు ఒక కవి బ్రహ్మను దూషించాడు. వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు మరణించిన విషయం కవి చౌడప్ప గ్రహించి 'నలువ ఫీఫీ నిసుంతలప న్యాయము గాదనియు, తలకొట్ట మారితనము చేసెననియు, ఇట్టి వ్యక్తిని సృజించుట పాధ్యముగాదని' నాయుడుగారి మీద అభిమానం కొలదీ బ్రహ్మను దూషించాడు.

గోగులపాటి కూర్మనాథ కవి సింహాద్రి నారసింహ శతకమువందు అధిక్షేప మధికంగా కానవచ్చును. మహ్మదీయుల దండయాత్ర సందర్భమున కవి నరసింహుని ఉద్దేశించి 'నీ ప్రజ్ఞ పనికిరాదు, తెమ్మికను మానమేషము లెక్కయిడక' అని అన్నాడు. భగవంతునినే ఆక్షేపించుటానికి పూనుకొన్నవారు ఎవ్వరినీ లెక్క చేయకుండ ప్రవర్తించారు.

కృష్ణశాస్త్రి విగ్రహారాధనను హేళన చేశారు. దానిని వ్యంగ్యంగా విమర్శించారు.

> చిత్ర చిత్రపు పూలు చైత్రమాసపు పూలు
> ఊరూర ఇంటింట ఊరికే పూచాయి
> శిథిలాలయమ్ములో శిలకెదురుగా కుసుకు
> పూజారికొకటేని పూవులేదోయి

పురిపండ అప్పలస్వామి మొదట భావకవి అయినా తరువాత అభ్యుదయ కవిగా మారిపోయారు. అనూచానంగా వస్తున్న సంప్రదాయంపై తిరుగుబాటు చేశారు. అంధానుప్రాయమైన విశ్వాసాలను విమర్శించారు. అందులో పరిహాసం కానవస్తుంది. వారు వ్రాసిన దైవం అనే గేయం దేవాలయాలు, ప్రభువులను ఎదుర్కొన్నది. మానవ శవాలపై మంటపాలు నిర్మింపబడ్డాయి. ఆ మంటపాలపై పతాకా లెగురుతున్నాయి. అట్టి ఈ భూమిలో రాతి విగ్రహం రక్షిస్తుందా, పూజామంత్రం బువ్వెడుదుందా?—అని పురిపండ ప్రశ్నిస్తున్నారు. హిందువులకు రాతివిగ్రహం పూజామంత్రం ఈ రెండూ ముఖ్యమైనవి. వానినే అధిక్షేపించారు. అభ్యుదయ కవుల మార్గం మత దృక్పథాలకు చాల భిన్నమైంది.

సాహిత్యము:— ఆంగ్లభాషా ప్రవేశంతో సాహిత్యంలో భావ విప్లవం బయలుదేరింది. రకరకాల కవితలు ప్రాదుర్భవించాయి. ప్రాత కవితలు క్రొత్త కవితలకు రూపం ప్రసాదించాయి. కవితకు నిండుదనం వచ్చింది. వినూత్న ప్రక్రియలు తెలుగులోకి సరఫరా అయాయి. ఆంగ్లభాషా వ్యామోహంతో కొందరు స్వభాషకు తీరని ద్రోహం చేసారు. నాటి పండితులు సహితం ఆంగ్ల భాషను విధిగా అధ్యయనం చేశారు. కొందరు ఆంగ్ల గ్రంథాలను తెలుగున కనువదించిరి. వీరేశలింగం పంతులుగారు తెలుగులో అన్ని రకముల సాహితీ ప్రక్రియలకు శ్రీకారం చుట్టారు.

యువకులు ఆంగ్లభాషపై అధికమైన అభిమానాన్ని ప్రదర్శించారు. ఆంగ్ల సాహితీలోకం కవులకు విశాలమైన భావ ప్రపంచాన్ని చేతికందించింది. దేవులపల్లి, నండూరి, బసవరాజు, నాయని, వేదుల మొదలగువారు భావకవిత్వం వ్రాయటానికి పూనుకొన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రణయ స్వరూపిణిని కావ్యంలో చిత్రించుకొన్నారు. ఈ కవితను కొంతమంది బావ కవిత్వమని హేళన చేశారు. అభావ కవిత్వమని అధిక్షేపించారు, అపస్మారక కవితయని విరసించారు. కవిత భావకవులకు ప్రణయ పరమార్థాన్ని మనోహరంగా ప్రసాదించింది.

ప్రపంచంలో మార్పులు త్వరితగతిని వచ్చాయి. ఎర్రబావుటా వినాదం బంగుమన్నది. దేశాన్ని ముందుకు నడిపిస్తామని వాగ్దానం చేశారు, అభ్యుదయ వాదులు. భావకవులపై తిరుగుబాటుకు అడుగు ముందుకు వేశారు. వారి కవితలో విచ్ఛిన్నమైన ధోరణులు బయలుదేరి గతాన్ని నిరసించటం కర్తవ్యంగా పెట్టుకున్నారు. సంప్రదాయాన్ని రూపుమాపుతామని ప్రతిజ్ఞ చేశారు. కాలగర్భంలో కలిసిపోయిన వారిపైన కూడ కత్తి జళిపించారు. కొందరు దిగంబరులై దేశానికి వచ్చారు. అందరిని దూషించారు. వీరి మాటలే జుగుప్సాకరంగా తయారయాయి. భావ తీవ్రతను నిరాటంకంగా సాగిపోనిస్తూ మానవుని— రాజ్యం పాలించే రాజును— పదవులను పెట్టుకొని ప్రాకులాడే మహానుభావులను, చెప్పరాని విధంగా పరిహసించారు.

తెలుగులో గ్రాంథికం, వ్యావహారికం అనే వాదాలు వచ్చాయి. ఒకరినొకరు ద్వేషించుకొన్నారు. వీరేశలింగం పంతులుగారు తమ ప్రహసనాల్లో కొక్కొండవారిని హేళన చేసారు. వేదం వారు పంతులుగారిని అపహాస్యం చేశారు. భాషారీత్యా పరస్పరం అధిక్షేపించుకున్నారు. పాముగంటివారు సాక్షిని హేళన చేయుటకే ఆయుధంగా గ్రహించారు. నాటివారు ఆంగ్లభాషపై వ్యామోహం చేత స్వభాషను కూడ మరచిపోయే స్థితికి వచ్చారు. అట్టివారిని ఉరకపోనీయక స్వభాషలో ఉపన్యసింపలేని వాఢసమర్థుడని హేళన చేయుచూ, ప్రాచీన కావ్యములు చదవని విద్యావంతులను నానావిధాలుగా ఆక్షేపించారు.

వేలూరి శివరామశాస్త్రిగారు తెలుగు చదవలేవట్టి తెలుగువారిని మనోహరంగా ఇలా అన్నారు:

> తెలివికి సంస్కృతమున్ మరి
> కలిమికి నాంగ్లేయమో యిక దూరకంబో
> విలువయిడి వేర్చి యానీ
> తెలుగెవ్వరి పాలుచేసి తిరిగెద వాంధ్రా!

అనంతపంతుల రామలింగేశ్వరస్వామిగారు భావకవులను వారి కవితలను హేళన చేశారు. అందులో ముఖ్యంగా కృష్ణశాస్త్రిగారిని విమర్శించారు. కృష్ణశాస్త్రిగారు కృష్ణపక్షము వ్రాస్తే అనంతపంతులవారు శుక్లపక్షాన్ని వ్రాశారు. అందులోనే ఉన్నది తెలుగు కవుల తిరుతెన్నుల విధానం. వికటకవి అను శీర్షికలో రామలింగేశ్వరస్వామి కవుల బిరుదులను నవ్వులపాలు చేశారు. కవిసింహము, కవినాగము, కవిశార్దూలము అంటూ చెప్పుచూ చివరకు 'కవిమృగముల నిర్వచింత కవి! నా తరమా!' అని అన్నారు. ఇది పరిహాసపు పరిధిని మించిపోయింది.

అభ్యుదయ కవులు భావకవిత్వానికి ఎదురు తిరిగారు. శ్రీశ్రీ లాంటి వారు ముందు భావకవులైనా తరువాత మాత్రం అభ్యుదయ కవులుగా ముద్ర వేయించుకొన్నారు. వీరితోపాటు నారాయణబాబు ఆ కవితను ధిక్కొన్నాడు. అందులో ఉండే ప్రణయ పరమార్థం, రసమాధుర్యం, శైలిని నిరసించాడు. అంతేగాకుండా భావకవుల కవితా వస్తువులైన కమ్మని కోకిల గానాలు, శరచ్చంద్రికల విలాసాల పోహళింపు, అనంతాంబరపు నీలినీడలు, కన్నెగాలి కౌగిళ్ళు మొదలగునవి పనికి వచ్చే కాలం కాదంటూ వారిపై దాడి చేశారు. భావకవులను నిరసించిన వారే తమ కవితా వస్తువులుగా సంతబయలు, కుక్క— గాడిద, కుళ్ళు కాలువ, ఫేక్టరీ కూత, పురఫిరంగి, మందుగుండు మొదలైనవన్నీ అభ్యుదయ కవులు స్వీకరించారు. భావకవుల కవితా వస్తువు వీరి కవితా వస్తువు కంటె వేయిరెట్లు భిన్నమైంది.

పఠాభి ప్రాచీన కవిత్వాన్ని తిరస్కరించారు. దేశంలో నాగరికతనే ఎత్తిపాడాడు. తాను భావ కవిని కాదనియు అహంభావ కవిననియు చెప్పుకొన్నాడు. అహంభావత్వాన్ని నిరూపించుకొనుటకు వ్యాకరణ ఛందస్సులపై ప్రతీకారం తీర్చుకొన్నాడు. నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రలతో పద్యాల నడుములు విరగదంతాను, చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని చాల దండిస్తాను అన్నాడు.

లను రచన అయిన ఫిడేలు రాగాల డజన్ నేటి పరిస్థితులను తూర్పారం పెట్టుటకు సాధనంగా వినియోగించాడు. అయితే అభ్యుదయ కవులను అభ్యుదయ కవులే ఎదుర్కొన్నారు. శ్రీ శ్రీ తాజమహలు నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీ లెవ్వరు? అన్నారు. దానిపై హేళనగా పిసపాటి వెంకటేశ్వరరావు కూలీ జనుల నెత్తుటి సరసిలో, తేలిన కమలం తాజమహలు అన్నారు. ఇది కేవలం వారి కవితను నిరసించుటకే ఈ విధంగా వర్ణించారు రంధి సోమరాజు శ్రీశ్రీని తీవ్రంగా విమర్శించారు. వారు వ్రాసిన 'ఎదగండి' అనే కావ్య సంపుటిలో ఆ మధ్య విశాఖపట్నంలో జరిగిన సన్మానాన్ని దృష్టిలో ఉంచుకొని యెవడబ్బసొమ్మని పి కింత సన్మానమో సెప్పు అన్నారు. అది వాలక—

సే—సీ
మీా చదువు సంతకెళ్ల
మీా తెలివైనోలంతా సత్తె తప్ప
మా బోటోలికి బతుకుల్లేవు
డబ్బున్నోడు, తెలివైనోడు,
బలమైనోడు
అంతా ఒక్కటే
అలకెప్పుడూ దేనిమీాదో నో దాని మీాద
సవారి సేదామనే వుంటాది.

అంటూ వెచ్చని చురకలు పెట్టారు.

సాహిత్యంలో సెటైరు, ప్యారడీ, ప్రత్యేక స్థానం పొందాయి. ఈ రెండింటికి భేదం వున్నది. అధిక్షేపానికి క్రోధం, అసూయ, వైముఖ్యం ప్రధానం. ఈ కవిత ఎదుటి వ్యక్తికి బాధ కలిగిస్తుంది. అయితే సూటిగా గాక వ్యంగ్యంగా దూషించటం కన్పిస్తుంది. ప్యారడీకి క్రోధం, ద్వేషం అసూయ ఉండవు. కాని యిందులో నిశితమైన హాస్యం, చమత్కారం సమ్మిళితంగా ఉంటాయి. ప్యారడీకి ఆంగ్ల నిఘంటువునందీ విధంగా నిర్వచన మీాయబడింది :

'A Literary or musical work in which the style of an author or work is closely imitated for comic effect or in ridicule.' ఈ రచనా ప్రక్రియను స్వర్గీయ జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రిగారు ప్రారంభించారు. వీరిమార్గాన మాచిరాజు దేవీప్రసాద్ పయనించారు. నండూరి ఎంకిపాటలు సాహిత్యంలో సంచలనం సృష్టించాయి. శాస్త్రిగారు నండూరిగీతాన్ని చమత్కరించారీ విధంగా గుండు గొంతుకలోన కొట్లాడుతాది, గుటకేయనీదురా కూసిన్ని గూడ అని సోడాబుడ్డికి అన్వయించారు. వీరీ విధంగా భావకవుల కవితలకు చక్కని ప్యారడీలు వ్రాశారు. తెలుగు కవితలో వారి ప్యారడీలు శాశ్వత స్థానం సంపాదించాయి.

మాచిరాజు దేవీ ప్రసాదు శ్రీ శ్రీ దేశ చరిత్రలకు ప్యారడీ చెప్పారు. ఏ దేశ చరిత్ర చూచినా ఏ మున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అని శ్రీ శ్రీ అంటే, ఏ రోడ్డు చరిత్రచూచినా ఏమున్నది గర్వకారణం, రహదార్ల చరిత్ర సమస్తం ధూళిధూసర పరిస్నానం అని మాచిరాజువారు అన్నారు. వీరి ప్యారడీ కవితలు కూడ సాహితీ లోకంలో ప్రచారానికి వచ్చాయి.

సామాన్యంగా ప్యారడీ కవితలు ఆయా పరిస్థితులను తదనుగుణంగా వివరించటానికి పూనుకొన్నారు. ప్రాచీన కావ్యాల్లో కూడ అచ్చటచ్చట ప్యారడీ ఉన్నట్లు స్పష్టంగా అవగత మవుతుంది.

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారు నవ్య సాహిత్యానికి ప్యారడీని అలంకారప్రాయం చేశారు. ప్యారడీ వ్రాయమంటే సులభంగా వ్రాయవచ్చు ననిపిస్తుంది కాని వ్రాయటం మాత్రం అంత సులభ మేమీకాదు. అభ్యుదయమన్న పేరిట నేటి కవులు ప్రాచీన కవుల కవితలకు ప్యారడీలు చెపుతున్నారు. వీరు చెప్పేవి ప్యారడీలే అయినా అది ఒక వెంపలిచెట్టు లాగున కన్పిస్తున్నది.

సెటైరు కవితలు ఇతర ద్రావిడభాషలైన తమిళ కర్నాట మలయాళ భాషల్లో కూడగలవు. ఈ కవితలు పాశ్చాత్యభాషా సంపర్కంలో నూతన రూపు దాల్చినవి. అయితే ఇది ప్రత్యేక ప్రక్రియగా అవతరించ లేదు. కాని అవసర మైనపుడు కవితలో దాని కనువైన స్థానం కవులు లభింప చేశారు.

కాలం మారింది. ధర్మాధర్మాలు మానవ మస్తిష్కాలపై నర్తిస్తున్నాయి. రోజుకొక ఆపద ఆవరించి మార్గాన్ని పాడు చేస్తున్నది. చైతన్యవంతమైన ఈ జగత్తు ముందు కడుగు వేస్తున్నది కదా అని ముభావంగా ఉంటే సర్వం నాశనమైపోయే స్థితి ఏర్పడుతుంది. అప్పుడే ఏ కవి అయినా మాసూరుకోలేడు. నేడు వచ్చే అభ్యుదయ కవితా నినాదంతో నిండిపోయి వీలిసిజాయితీలను నెట్టి వేస్తున్నది. దేశంలో జరిగే ప్రతి పనిని పరిశీలనలో చూచినప్పుడే కవి తన సమావేశాన్ని ప్రకటింప గలడు. ఆ భావావేశమే కవిత. దానికి రూపం ఇచ్చినప్పుడే పాఠకునిని ఆలోచనా ప్రపంచానికి తీసికొని వెళ్ళుట కవకాశం కలుగుతుంది.

దిగంబర కవిత్వంలో దేశంలోకి దిగుమతి అయింది. అలముకొన్న అసంతృప్తిని కవులు కవితలో సాక్షాత్కరింప జేశారు. రాజులు, మహారాజులు, మంత్రులు, మహామంత్రులు, సామాన్యుడు అసామాన్యుడు అనే తారతమ్యం లేకుండా అందరినీ పరిహసించారు. ఆ పరిహాసంలో చెప్పరాని జుగుప్స కలసిపోయింది. దరిదాపు వారి కవిత అధిక్షేపమే. తిట్లు బూతులు లేకుండా చమత్కారాన్ని చేసియుంటే కవిత కొక స్థానం లభించి యుండేది. ఈ దిగంబరులు చూపిన మార్గంలోనుంచే పైగంబరులు వచ్చారు. కాలగమనంలో ఇట్టి కవితల రాక అనివార్యం.

జీవితంలో మంచి చెడులను చూడటంచేత అభ్యుదయవాది సిద్ధాంత ప్రతిపాదన చేయుటకు పూనుకొంటాడు. అందుకనే మన కవులు జరిగిన అన్యాయాన్ని ఖండించి న్యాయం కోసం నిలబడి రామన్న సమాజం కొరకు ఎదురు చూస్తున్నారు. అధిక్షేపరూపంలో ఉన్న కవితలు క్రొత్తలోకాన్ని చూపించి మానవులను ముందుకు నడిపించాలనే సంకల్పబలంతో సాహిత్యరంగస్థలంపై నర్తనలు సల్పుతున్నాయి.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thumbu Chetty Street, Madras-1. Editor: S. Sambhu Prasad.

శ్రీరస్తు - శ్రీ త్రిపురసుందరీ పరశివాభ్యాం నమః

శ్రీ విరోధకృత్సంవత్సర పూర్ణశాస్త్రీయ (ఆంధ్రపత్రికా) పంచాంగమ్

బ్రహ్మశ్రీ శ్రీమత్పిడపర్తి చినపూర్ణార్యసిద్ధాన్తినః ద్వితీయ పుత్రేణ సుబ్రహ్మణ్యశాస్త్రిణా ప్రణీతమ్

సహరవయితారౌ, తత్తనయౌ చినకృష్ణమూర్తిశాస్త్రీ, సుబ్రహ్మణ్యశాస్త్రీచ

విఘ్నేశ విధిమార్తండ చంద్రేంద్రోపేంద్ర వందిత నమో గణపతే తుభ్యం బ్రహ్మణాం బ్రహ్మణస్పతే.

వేదమయీం నాదమయీం పరపదోద్య బిందుమయీం

మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం.

గమనిక

ఈ సంవత్సరమున రాజ శని, మంత్రి బుధుడు సర్వసస్యసమృద్ధిదాయమగు ౧౬ వీసములలో ౮ వీసముల పంట ఫలించును. బలరాముడు పశుపాలకుడు. దొడ్డిపెట్టువాడు యముడు. దొడ్డినుంచి బయటకు తోలువాడు యముడు. పశువులకు మధ్యే మధ్యే అనారోగ్యము కలుగుచుండును. మూడు అధిపత్యములలో రెండు ఆధిపత్యములు యమునకు వచ్చుట వలన వర్షములు పుష్కలముగా పడును. ఒక కుంభమువర్షము పగటియందు ఆర్ద్రా కార్తె ప్రవేశము శ్రావణ శుద్ధ ౧౫ మనాడు. మరియు మాఘ శు ౧౫ మనాడు చంద్రగ్రహణము సంభవించును. పరీధావి సంవత్సర వైశాఖ మాసము అధికమాసము పుష్య బహుళ ౬ గురువారము (6-1-72) పుష్కరిణీ నదీ పుష్కర ప్రవేశము.



మౌఢ్యములు

మార్గశిర శు ౯ శుక్రవారము 26—11—1971 లగాయతు పౌష శు ౫ బుధవారము 22—12—1971 కు గురుమౌఢ్యము. శ్రావణ శు ౯ ఆదివారము 1—7—1971 లగాయతు ఆశ్వయుజ శు ౧౦ గురువారము 30—9—71 కు శుక్ర మౌఢ్యము.

కల్యాద్యబ్దాః	౫౦౭౩
శాలివాహనశకః	౧౮౯3
ఫసలీసన్	౧౩౮౦-౮౧
హిజరీసన్	౧౩౯౦-౯౧
క్రీస్తుశకము	1971—72
భారత స్వాతంత్ర్యశకము	24—25

ఆంధ్రపత్రికా కార్యాలయము, మద్రాసు-1.

పంచాంగ పద్ధతి వివరణము

ఇందు కాలమానము యథాప్రకారముగ విజయవాడ, గుంటూరు, ఏలూరు మొదలగు ఆంధ్రదేశ మధ్యభాగమునకు చూపబడినది. తిథి, నక్షత్రములు ఘటికలలోను, గంటలలోను కూడ చూపబడినవి. శుభ ముహూర్తములు—దుర్ముహూర్తములు—వర్జ్యములు—మహాపాతలు గంటలలో మాత్రం చూపబడినవి. యోగకరణ, అమృత, గ్రహ ప్రవేశములు ఘటికలలో మాత్రం చూపబడినవి. భారత ప్రభుత్వముచే నియమింపబడిన కాలెండరు రిఫార్ము కమిటీవారి నిర్ణయము ననుసరించి ప్రకటింపబడిన ఇండియన్ ఎఫెమెరీసు అండ్ నాటికల్ అల్మనాక్కునకు సరిపడునట్లు చూపబడినవి. నూతన వేధశాలల ద్వారా కనుగొనబడిన భూకేంద్రమునకు సరిపడు వాస్తవిక రవి చంద్రులచే సాధింపబడిన తిథ్యాధికము, గ్రహసంచారము ఇందు ప్రాధాన్యముగ చూపబడినవి. ఈ తిథ్యాధి గ్రహ సంచారముచే పంచాంగమున వ్రాసినట్లు ఆకసమున సరిపడుచున్నవి. న్యాయమును లోకము తెలిసికొనుటకొరకు భేదమును గుర్తింపగలందులకు పూర్వపద్ధతి పంచాంగముకూడ ఇందు సంగ్రహముగ చూపబడినది. ఇందు చూపబడిన పూర్ణశాస్త్రీయ పద్ధతియే శాస్త్రీయమని గ్రహింపనగునని మా నిశ్చితాభిప్రాయము. ఇందు తిథ్యాది, ఘటికలు, ఉదయాస్తమయములు, శుభముహూర్తములు, చూపబడినవి. లగ్నాంతకాలములు, నిరయణ గ్రహస్ఫుటములును విజయవాడ, గుంటూరు, ఏలూరు ప్రాంతములకు చూపబడినవి. దేశాంతర చక్రములును చూపబడినవి. ఇందు వేదాంగ జ్యోతిషమున సూచింపబడిన అశ్విన్యాదిని గ్రహించి ఈ పంచాంగ రచన చేసియున్నాము—గావున వైదికమును సనాతనముగూడ యగుచున్నది. 10 అక్షాంశ లగాయతు 30 అక్షాంశ వరకు లగ్న ప్రమాణములు యివ్వబడినవి. శాస్త్రమునకు ప్రత్యక్షమునకు సమంచితమై యొప్పు ఈ పంచాంగమును గ్రహించి శ్రౌత స్మార్త కర్మల నాచరింప గోరుచున్నాము.

తిథ్యాదికములందు దేశాంతర చక్రము

	చైత్ర మేష	వైశాఖ వృషభ	జ్యేష్ఠ మిథున	ఆషాఢ కర్కాట	శ్రావణ సింహ	భాద్ర కన్యా	ఆశ్వీజ తులా	కార్తీక వృశ్చిక	అగ్రహా ధను	పుష్య మకర	మాఘ కుంభ	ఫాల్గుణ మీన
మంగళూరు	—౩౯	—౪౯	—౫౬	—౫౯	—౫౬	—౪౯	—౩౯	—౩౦	—౨౩	—౨౦	—౨౩	—౩౦
బెంగుళూరు	—౩౦	—౩౭	—౪౪	—౪౭	—౪౪	—౩౭	—౩౦	—౨౨	—౧౬	—౧౪	—౧౬	—౨౨
అనంతపురం	—౩౦	—౩౪	—౩౭	—౩౯	—౩౭	—౩౪	—౩౦	—౨౬	—౨౩	—౨౧	—౨౩	—౨౬
బళ్ళారి	—౩౭	—౪౦	—౪౩	—౪౪	—౪౩	—౪౦	—౩౭	—౩౪	—౩౨	—౩౧	—౩౨	—౩౪
కర్నూలు	—౨౬	—౨౭	—౨౮	—౨౯	—౨౮	—౨౭	౨౬	—౨౪	—౨౩	—౨౨	—౨౩	—౨౪
హైదరాబాదు	—౨౧	—౨౦	—౧౮	—౧౮	—౧౮	—౨౦	౨౧	—౨౩	—౨౫	—౨౫	—౨౫	—౨౩
వరంగలు	—౧౦	— ౭	— ౪	— ౩	— ౪	— ౭	—౧౦	—౧౩	—౧౬	—౧౭	—౧౬	—౧౩
తిరుపతి	—౧౩	—౧౯	—౨౪	—౨౭	—౨౪	—౧౯	—౧౩	— ౭	— ౨	+ ౦	— ౨	— ౭
నెల్లూరు	— ౬	—౧౧	—౧౪	—౧౬	—౧౪	—౧౧	— ౬	— ౨	+ ౨	+ ౪	+ ౨	— ౨
కుంభకోణం	—౧౨	—౨౪	—౩౪	—౩౭	—౩౪	—౨౪	—౧౨	— ౦	+ ౯	+౧౩	+ ౯	— ౦
కాంచీపురం	— ౯	—౧౭	—౨౪	—౨౬	—౨౪	—౧౭	— ౯	— ౧	+ ౬	+ [illegible]	+ ౬	— ౧
మద్రాసు	— ౪	—౧౧	—౧౭	—౨౦	—౧౭	—౧౧	— ౪	+ ౪	+౧౦	+౧౨	+౧౦	+ ౪
భద్రాచలం	+ ౩	+ ౫	+ ౭	+ ౭	+ ౭	+ ౫	+ ౩	+ ౦	— ౨	— ౩	— ౨	+ ౦
బందరు	+ ౫	+ ౫	+ ౪	+ ౪	+ ౪	+ ౫	+ ౫	+ ౬	+ ౭	+ ౭	+ ౭	+ ౬
రాజమండ్రి	+౧౧	+౧౩	+౧౩	+౧౪	+౧౩	+౧౩	+౧౧	+౧౦	+ ౯	+ ౯	+ ౯	+౧౦
విజయనగరం	+౨౭	+౩౨	+౩౪	+౩౬	+౩౪	+౩౨	+౨౭	+౨౪	+౨౧	+౨౦	+౨౧	+౨౪
బరహాంపురం	+౪౨	+౪౭	+౫౩	+౫౫	+౫౩	+౪౭	+౪౨	+౩౬	+౩౧	+౨౯	+౩౧	+౩౬

సూచన

విజయవాడనుండి భారత ప్రభుత్వము వారిచే నిర్ణయింపబడిన చైత్రాది మాసారంభము (అనగా మేషాది సౌరమాస మాసారంభము) లందు కలుగు దేశాంతర విఘటికలు యీ పై చక్రమునందు చూపబడినవి. స్వగ్రామమునకు సమీపమందున్న పట్టణమునకు అభీష్ట మాసాదియందు గల విఘటికలను యీ చక్రమును ననుసరించి విజయవాడకు పశ్చిమ దేశములయందుండువారు యీ పంచాంగమందలి తిథ్యాదులలో తీసివేయగాను. ప్రాగ్దేశములవారు కలుపగాను స్వస్థానమునకు సూర్యోదయాది తిథ్యాదికాలము లగుచున్నవి. యీ విజయవాడ రేఖాంశోత్తర రేఖకు సమీపముండుగల పశ్చిమోత్తర దేశములవారు ఇందు ఉదాహరణములలో చూపిన +, — ధనర్ణ చిహ్నములను గురించి సంస్కరించుకొన వలయును. ఇందు చూపిన విఘటికలు మాసాదియందు చూపబడినవి. మాసమధ్యయందు త్రైరాశికముచే దేశాంతరమును గ్రహించి సంస్కరించినచో సూర్యోదయాది స్ఫుటతిథ్యాది కాలములగును. ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలు పై ప్రకారము దేశాంతర విఘటికల కగు నిముషములను ఈ విజయవాడ కగు సూర్యోదయ గంటలలో ధనర్ణ చిహ్నములకు వ్యత్యస్తముగా (అనగా విజయవాడకు పశ్చిమదేశము నుండువారు కలుపగను, ప్రాగ్దేశవాసులు తీసివేయగను) సంస్కరించినచో స్టాండర్డ్ టైము ననుసరించి ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలగును; ఈ ప్రకారము సూర్యాస్తమయ కాలమును చేయవలెను.

లగ్నాంత కాలములయందు దేశాంతర చక్రము

	మీన	మేష	వృష	మిథు	కర్క	సింహ	కన్య	తుల	వృశ్చి	ధను	మక	కుంభ
మంగళూరు	+19	+22	+24	+23	+20	+17	+13	+10	+8	+9	+11	+15
బెంగుళూరు	+14	+17	+19	+18	+16	+13	+10	+7	+5	+6	+8	+11
అనంతపురం	+13	+15	+15	+12	+14	+12	+11	+9	+9	+9	+10	+11
బళ్ళారి	+16	+17	+17	+17	+16	+15	+14	+13	+12	+13	+13	+15
కర్నూలు	+11	+11	+12	+11	+11	+10	+10	+9	+9	+9	+10	+10
హైదరాబాదు	+8	+7	+7	+7	+8	+6	+9	+10	+10	+10	+9	+9
వరంగలు	+3	+2	+1	+1	+2	+4	+5	+6	+7	+6	+5	+4
తిరుపతి	+7	+9	+11	+10	+8	+6	+3	+1	—0	+0	+2	+5
నెల్లూరు	+4	+5	+6	+6	+5	+3	+1	—1	—1	—1	+0	+2
మద్రాసు	+4	+6	+8	+7	+5	+3	—1	—4	—5	—4	—2	+1
కుంభకోణం	+9	+13	+15	+14	+11	+6	+1	—3	—5	—4	—1	+4
కాంచీపురం	+6	+9	+10	+10	+7	+4	+1	—3	—3	—3	—0	+3
భద్రాచలం	—2	—3	—3	—3	—2	—1	—0	+1	+1	+1	+0	—1
బందరు	—2	—2	—2	—2	—2	—2	—2	—3	—3	—3	—3	—2
రాజమండ్రి	—5	—5	—5	—5	—5	—5	—4	—4	—4	—4	—4	—4
విజయనగరం	—12	—14	—14	—14	—13	—12	—10	—9	—8	—6	—9	—11
బరహాంపురం	—19	—21	—22	—23	—20	—17	—15	—13	—11	—12	—14	—16

ఇందు చూపబడిన లగ్నాంతకాలములు స్టాండర్డు టైము ననుసరించి విజయవాడకు లగ్నాంతకాలము లగుచున్నవి. ఇతర దేశములవారు, పై చూపబడిన దేశాంతర చక్రము ననుసరించి, ఆయా లగ్నాంత కాలములకు చూపబడిన నిముషములను, విజయవాడకు పశ్చిమదేశమున నుండు వారలు ఆయా కాలములలో కలుపగాను, ప్రాగ్దేశములయందుండువారు తీసివేయగను, స్టాండర్డు టైము ననుసరించి ఇష్టము వచ్చు నగరములకు లగ్నాంత కాలము లగును. తిథులలో ప్రతిమాసము దినవను ప్రతిరోజున లగ్నాంత కాలములు చూపబడినవి.

భారతదేశమున ఆ యా అక్షాంశ ప్రదేశములకు మేషాది నిరయణ రాశి ప్రమాణములు — ఘటికలు-విఘటికలు-పరలు.

అక్షాంశ	మేషము	వృషభము	మిథునము	కర్కాటకము	సింహము	కన్య	తుల	వృశ్చికం	ధనుస్సు	మకరం	కుంభం	మీనం
	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.
10	౪-౩౫-౧౬	౫- ౮-౧౦	౫-౨౮-౧౧	౫-౨౦- ౧	౫- ౨-౧౯	౪-౫౭-౫౧	౫-౧౧-౧౩	౫-౨౭-౨౧	౫-౨౦-౫౧	౪-౫౦-౧౬	౪-౨౨-౧౨	౪-౧౬-౧౪
11	౪-౩౩-౨౬	౫- ౭-౧౦	౫-౨౮-౩౫	౫-౨౧-౩౨	౫- ౪-౨౨	౪-౫౯-౫౯	౫-౧౩- ౪	౫-౨౮-౨౦	౫-౨౦-౨౮	౪-౪౮-౪౪	౪-౨౦-౧౪	౪-౧౪- ౬
12	౪-౩౧-౩౪	౫- ౬-౧౧	౫-౨౮-౫౭	౫-౨౩- ౫	౫- ౬-౨౬	౫- ౨- ౮	౫-౧౪-౫౫	౫-౨౯-౨౦	౫-౨౦- ౫	౪-౪౭-౧౨	౪-౧౮-౧౦	౪-౧౧-౫౨
13	౪-౨౯-౪౧	౫- ౫-౧౧	౫-౨౯-౨౦	౫-౨౪-౩౮	౫- ౮-౩౧	౫- ౪-౧౮	౫-౧౬-౪౭	౫-౩౦-౨౧	౫-౧౯-౪౨	౪-౪౫-౩౮	౪-౧౬- ౫	౪- ౯-౪౮
14	౪-౨౭-౪౮	౫- ౪- ౯	౫-౨౯-౪౪	౫-౨౬-౧౨	౫-౧౦-౩౮	౫- ౬-౨౮	౫-౧౮-౪౧	౫-౩౧-౨౧	౫-౧౯-౧౯	౪-౪౪- ౪	౪-౧౩-౫౯	౪- ౭-౩౭
15	౪-౨౫-౫౩	౫- ౩- ౯	౫-౩౦- ౭	౫-౨౭-౪౭	౫-౧౨-౪౫	౫- ౮-౩౯	౫-౨౦-౩౬	౫-౩౨-౨౩	౫-౧౮-౫౫	౪-౪౨-౨౯	౪-౧౧-౫౨	౪- ౫-౨౫
16	౪-౨౩-౫౮	౫- ౨- ౭	౫-౩౦-౩౦	౫-౨౯-౨౩	౫-౧౪-౫౩	౫-౧౦-౫౩	౫-౨౨-౩౧	౫-౩౩-౨౫	౫-౧౮-౩౧	౪-౪౦-౫౩	౪- ౯-౪౩	౪- ౩-౧౩
17	౪-౨౨- ౧	౫- ౧- ౩	౫-౩౦-౫౫	౫-౩౧- ౧	౫-౧౭- ౨	౫-౧౩- ౮	౫-౨౪-౨౮	౫-౩౪-౨౮	౫-౧౮- ౭	౪-౩౯-౧౬	౪- ౭-౩౪	౪- ౦-౫౨
18	౪-౨౦- ౩	౪-౫౯-౫౯	౫-౩౧-౨౦	౫-౩౨-౩౯	౫-౧౯-౧౩	౫-౧౫-౨౪	౫-౨౬-౨౭	౫-౩౫-౩౨	౫-౧౭-౪౨	౪-౩౭-౩౭	౪- ౫-౨౩	౩-౫౮-౪౧
19	౪-౧౮- ౩	౪-౫౮-౫౪	౫-౩౧-౪౫	౫-౩౪-౧౯	౫-౨౧-౨౬	౫-౧౭-౪౧	౫-౨౮-౨౭	౫-౩౬-౩౭	౫-౧౭-౧౭	౪-౩౫-౫౮	౪- ౩- ౯	౩-౫౬-౨౪
20	౪-౧౬- ౧	౪-౫౭-౪౮	౫-౩౨-౧౦	౫-౩౬- ౦	౫-౨౩-౪౧	౫-౨౦- ౧	౫-౩౦-౨౮	౫-౩౭-౪౨	౫-౧౬-౫౩	౪-౩౪-౧౬	౪- ౦-౫౪	౩-౫౪- ౫
21	౪-౧౩-౫౮	౪-౫౬-౪౧	౫-౩౨-౩౬	౫-౩౭-౪౩	౫-౨౫-౫౭	౫-౨౨-౨౨	౫-౩౨-౩౧	౫-౩౮-౪౯	౫-౧౬-౨౭	౪-౩౨-౩౩	౩-౫౮-౩౯	౩-౫౧-౪౪
22	౪-౧౧-౫౨	౪-౫౫-౩౪	౫-౩౩- ౨	౫-౩౯-౨౭	౫-౨౮-౧౫	౫-౨౪-౪౫	౫-౩౪-౩౬	౫-౩౯-౫౭	౫-౧౬- ౧	౪-౩౦-౪౯	౩-౫౬-౨౧	౩-౪౯-౨౧
23	౪- ౯-౪౫	౪-౫౪-౨౫	౫-౩౩-౨౮	౫-౪౧-౧౪	౫-౩౦-౩౫	౫-౨౭-౧౦	౫-౩౬-౪౩	౫-౪౧- ౭	౫-౧౫-౩౩	౪-౨౯- ౩	౩-౫౪- ౧	౩-౪౬-౫౬
24	౪- ౭-౩౭	౪-౫౩-౧౪	౫-౩౩-౫౫	౫-౪౩- ౨	౫-౩౨-౫౮	౫-౨౯-౩౭	౫-౩౮-౫౩	౫-౪౨-౧౭	౫-౧౫- ౬	౪-౨౭-౧౫	౩-౫౧-౩౯	౩-౪౪-౨౮
25	౪- ౫-౨౫	౪-౫౨- ౨	౫-౩౪-౨౩	౫-౪౪-౫౨	౫-౩౫-౨౨	౫-౩౨- ౬	౫-౪౧- ౩	౫-౪౩-౨౯	౫-౧౪-౩౯	౪-౨౫-౨౫	౩-౪౯-౧౪	౩-౪౧-౫౯
26	౪- ౩-౧౧	౪-౫౦-౪౮	౫-౩౪-౫౨	౫-౪౬-౪౪	౫-౩౭-౫౦	౫-౩౪-౩౮	౫-౪౩-౧౭	౫-౪౪-౪౩	౫-౧౪-౧౧	౪-౨౩-౩౨	౩-౪౬-౪౭	౩-౩౯-౨౭
27	౪- ౦-౫౪	౪-౪౯-౩౪	౫-౩౫-౨౦	౫-౪౮-౩౯	౫-౪౦-౧౯	౫-౩౭-౧౩	౫-౪౫-౩౪	౫-౪౫-౫౮	౫-౧౩-౪౧	౪-౨౧-౩౮	౩-౪౪-౧౭	౩-౩౬-౫౩
28	౩-౫౮-౩౫	౪-౪౮-౧౭	౫-౩౫-౫౧	౫-౫౦-౩౫	౫-౪౨-౫౨	౫-౩౯-౫౦	౫-౪౭-౫౩	౫-౪౭-౧౪	౫-౧౩-౧౨	౪-౧౯-౪౧	౩-౪౧-౪౪	౩-౩౪-౧౫
29	౩-౫౬-౧౪	౪-౪౬-౫౮	౫-౩౬-౨౧	౫-౫౨-౩౫	౫-౪౫-౨౭	౫-౪౨-౩౧	౫-౫౦-౧౫	౫-౪౮-౩౩	౫-౧౨-౪౧	౪-౧౭-౪౧	౩-౩౯- ౯	౩-౩౧-౩౪
30	౩-౫౩-౪౮	౪-౪౫-౩౮	౫-౩౬-౫౨	౫-౫౪-౩౮	౫-౪౮- ౬	౫-౪౫-౧౪	౫-౫౨-౪౦	౫-౪౯-౫౪	౫-౧౨-౧౦	౪-౧౫-౩౯	౩-౩౬-౨౯	౩-౨౮-౫౧

N. B. పది అక్షాంశ ప్రదేశమున గల పూర్వ ప్రాంతములు మొదలు ముప్పది అక్షాంశ ప్రదేశమున గల [illegible]

విజయవాడ ప్రాంతములకు
మేషాది నిరయణ లగ్న ప్రమాణములు—పుష్కరలు

లగ్న ప్రమాణములు			పుష్కర ప్రమాణములు		
మేషము	౪-౨౩	గం 1-45	మేషము	౩- ౪	గం 1-14
వృషభము	౫- ౨	గం 2- 1	వృషభము	౨-౨౦	గం 0-56
మిథునము	౫-౩౦	గం 2-12	మిథునము	౪-౨౪	గం 1-46
కర్కాటకము	౫-౩౧	గం 2-12	కర్కాటకము	౧-౧౭	గం 0-31
సింహము	౫-౧౬	గం 2- 6	సింహము	౩-౪౦	గం 1-28
కన్య	౫-౧౨	గం 2- 5	కన్య	౨-౨౬	గం 0-58
తుల	౫-౨౪	గం 2-10	తుల	౪-౧౯	గం 1-44
వృశ్చికం	౫-౩౪	గం 2-14	వృశ్చికం	౧-౧౮	గం 0-31
ధనుస్సు	౫-౧౮	గం 2- 7	ధనుస్సు	౩-౪౩	గం 1-29
మకరం	౪-౪౦	గం 1-52	మకరము	౨-౧౧	గం 0-52
కుంభము	౪- ౮	గం 1-39	కుంభము	౩-౧౮	గం 1-19
మీనము	౪- ౨	గం 1-37	మీనము	౦-౫౬	గం 0-22

N.B గత లగ్నాంతకాలములో ముహూర్తలగ్న సంబంధమైన పుష్కర గంటలను కలిపిన శుద్ధ ముహూర్త లగ్నమందు పుష్కర సమయము వచ్చును.

రాజమండ్రి ప్రాంతములకు
మేషాది నిరయణ రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౨	తులాయాః	౫-౨౪
వృషభస్య	౫- ౧	వృశ్చికస్య	౫-౩౫
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౮
కర్కాటకస్య	౫-౩౧	మకరస్య	౪-౩౯
సింహస్య	౫-౧౭	కుంభస్య	౪- ౮
కన్యాయాః	౫-౧౩	మీనస్య	౪- ౧

విజయనగర ప్రాంతములకు
మేషాది నిరయణ రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౦	తులాయాః	౫-౨౭
వృషభస్య	౫- ౦	వృశ్చికస్య	౫-౩౬
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౭
కర్కాటకస్య	౫-౩౩	మకరస్య	౪-౩౮
సింహస్య	౫-౧౯	కుంభస్య	౪- ౫
కన్యాయాః	౫-౧౬	మీనస్య	౩-౫౮

అయనాంశలు { నూతన సంస్కార సంస్కృత చైత్ర పక్షీయనాంశలు
సంవత్సరాదికి 23°-26'-34" వార్షికాయనగతి 50'-26

మి	వృ	మే	మీ
		శ	ర చం బు
శ	వర్ష లగ్న కుండలి		శు
			రా
		గు	ల కు

మి	వృ	మే	మీ
		ర బు ల శ	
శ	జగల్లగ్న కుండలి		శు
			రా
		ర గు	కు

జగల్లగ్నమున పంచమాధిపతియగు రవి కుజ, రాజ్యలాభాధిపతియగు శనికి నీచ. తృతీయ షష్ఠాధిపతియగు బుధునకు ఉచ్ఛ నీచ గ్రహములతో లగ్నమున సంబంధము. లగ్నాధిపతియగు కుజునకు భాగ్య స్థితి. వాహన భాగ్య వ్యయాధిపతులగు గురు చంద్రులకు అష్టమమున సంబంధము. ధనాధిపతియగు శుక్రుడు లాభస్థితి. వర్ష లగ్నమున పంచమ వ్యయాధిపతియగు కుజుడు లగ్న స్థితి. లగ్న వాహనాధిపతియగు గురుడు వ్యయమందుండెను. భాగ్యాధిపతియగు రవికి నీచన్యైవ సప్తమ రాజ్యాధిపతియగు బుధునితోను అష్టమాధిపతియగు చంద్రునితోను వాహనమున సంబంధము ఏర్పడి లగ్నాధిపతియగు గురు వీక్షణము పక్షెను. ధన తృతీయాధిపతియగు శనికి పంచమమున నీచస్థితి. షష్ఠ లాభాధిపతియగు శుక్రునకు తృతీయ స్థితి. ద్వితీయాష్టమములయందు రాహు కేతువులస్థితి. భారత ప్రభుత్వమునందు కొన్ని మార్పులు తప్పవు. అధికారములో వారి శాసనములను ఎంత ప్రయత్నము చేసినను వ్యతిరేకులు కాదన లేరు. అర్థికరంగమున సంతృప్తికరమగు ఫలితములను పొందగలరు. భారత ప్రభుత్వమునకు ఖండాంతర ములయందు హెచ్చు స్థాయిలో గౌరవమును, అన్యోన్యానురాగము ఉండును. సరిహద్దు వివాదములు కొన్ని మధ్య మధ్య తలయెత్తినను ముందుకు రాకుండగ భారత ప్రభుత్వము కాపాడుకొనగలదు. రాష్ట్ర ప్రభుత్వమునందు కొన్ని అభివృద్ధి పథకములు ఫలవంతములగును. వ్యతిరేక శక్తులతో హోరాహోరీగా జరుగు పోటీలో జయ పతాక ప్రభుత్వమునదె. విశేషమేమనగా ప్రజలు ప్రభుత్వము అన్యోన్యానురాగములో ప్రవర్తిల్లుదురు.

కార్తులు - ఫలములు

జ్యేష్ఠ శు ౧ మంగళ	మే 25	రోహిణి కార్తె	అప్పుడప్పుడు సువృష్టి.
